# భారతీయ సనాతన ధర్మం

రచన

**డా. అద్దంకి శ్రీనివాస్**

ప్రకాశకులు

చల్లా సాంబిరెడ్డి

B.A., LL.B.

అధ్యక్షులు

శ్రీపావని సేవాసమితి

హైదరాబాదు

# భారతీయ సనాతన ధర్మం


**రచన** : **డా. అద్దంకి శ్రీనివాస్**

**ఇమెయిల్** : draddanki@gmail.com

**ప్రథమ ముద్రణ** : 2021

**ప్రతులు** : 1000



**హక్కులు** : ప్రకాశకులవి



**ప్రకాశకులు**

**చల్లా సాంబిరెడ్డి**
**అధ్యక్షులు, శ్రీపావని సేవా సమితి**
ఇం.నెం. : 3-6-499ఎ,
రోడ్ నెం.7, హిమాయత్‌నగర్
హైదరాబాదు - 500 029.
sripavanisevasamithi@gmail.com

**ముద్రణ :**

**వై.వి. రెడ్డి ప్రింటర్స్ & బైండర్స్,**
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 036.
సెల్ : 9391015317
yvr.postpresssolutions@gmail.com

**వెల** : అమూల్యం

# మనవి

భారతదేశం కర్మభూమి. ఆ కర్మకు మూలం ధర్మం. భారతీయ తాత్త్వికచింతనను నడిపించేదీ, నిలబెట్టేదీ ధర్మమే! ఒక్క భారతీయులకే కాదు ప్రపంచంలోని విభిన్న జాతులవారికీ ఆచరించదగినదీ అనుసరించదగినదీ భారతీయ ధర్మమే.

ఇది ఈనాడు ఎవరో కూర్చొని అనాలోచితంగా ఏకకాల ఏకదేశాలకు వర్తించేలా రూపొందించినది కాదు. విశ్వజనీనంగా, సార్వకాలికంగా వర్తించేలా దార్శనికులైన మన ఋషులు ఏర్పరచినది.

మారేకాలంతో పాటు అనుసరించడానికి వీలుగా అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలోనే ధర్మం మారుతూ వచ్చింది. కాబట్టి ఇది ఒకనాటిది కాదు. సనాతనం. అధునాతన కాలానికీ ఇది దిశానిర్దేశం చేస్తుంది. మానవుడి జీవన విధానంలో సర్వోత్కృష్టంగా ఆచరించవలసిన వాటిని సోపపత్తికంగా సప్రమాణంగా నిర్వచించడమే సనాతన ధర్మ ప్రాథమిక లక్షణం.

విభిన్న భావజాలాలూ సంస్కృతుల నేపథ్యంలో సనాతన ధర్మాన్ని అర్థం చేసుకొనే శక్తి కొంతవరకూ సన్నగిల్లిన మాట వాస్తవమే అయినా మహర్షులు దీర్ఘదృష్టితో నిర్మించి, ఆచరించి చూపిన సనాతన ధర్మం నేటికీ అవిచ్ఛిన్నంగా తన దివ్య ప్రభావాన్ని సమాజంపై చూపిస్తూనే ఉంది. వేదపురాణేతిహాసాలు, ఉపనిషత్తులు, ధర్మశాస్త్ర గ్రంథాలు సనాతన ధర్మానికి కుదుళ్ళు. వాటినుండి విస్తరించిన అపారవాఙ్మయం మహావృక్షమయ్యింది. దానికి శాఖోపశాఖలు బయలుదేరాయి. అవి విభిన్న భాషలలో విభిన్న ప్రక్రియల్లో సనాతన ధర్మాన్ని నిరూపిస్తూనే ఉంటాయి.

భారతీయుల నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఈ ధర్మాచరణ ప్రతి ఒక్క రచనలోనూ ప్రతిఫలిస్తుంది.

ఒకసారి స్థిరీకరించిన తరువాత అంతకన్న సమర్థంగా సార్వజనీనంగా చెప్పడానికి వీలుకానిదే సనాతన ధర్మం.

భారతీయుడిగా పుట్టిన వాళ్ళే కాదు బుద్ధి జీవులందరూ ఆచరించి తీరవలసినది. అలాంటి సనాతన ధర్మ వైశిష్ట్యాన్నీ విస్తృతినీ లోకానికి అందించాలని కంకణ బద్ధులయ్యారు శ్రీ పావని సేవా సమితి అధ్యక్షులు శ్రీ చల్లా సాంబిరెడ్డిగారు. వీరు శ్రీరామచంద్రుడిచేత ఒక రామకార్యకర్తగా ఎంచుకోబడ్డ మహానుభావులు. అంతా రాముడి దయ, ఆయనే అన్నీ చేయిస్తాడంటూ కర్మాచరణ భగవంతుడి ఆదేశంగా భావిస్తూ కర్తృత్వాన్ని చెప్పుకోకుండా ఫలాన్ని ఆశించకుండా భవిష్యత్తరాలకు మహాఫలాలను అందిస్తున్న కారణజన్ములు. అలాంటి వ్యక్తి నాతో భారత, భాగవత, రామాయణాలను, భగవద్గీతను రాయించడం నా సుకృతం. ఇప్పుడు 'సనాతన ధర్మం' అనే గ్రంథాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో రచించమని నన్ను కోరారు. వారు కోరడమేమిటి? అది రాముడి ఆదేశం. శిరసా వహించాను. ఇదుగో ఈ ప్రయత్నంతో మీ ముందుకు వస్తున్నాను. ఈ గ్రంథం మీకు ఏ కొంచెం ఉపయోగపడినా ఆ ఫలం తాలూకూ ఆనందం నాది మాత్రమే కాదు. శ్రీమాన్ సాంబిరెడ్డి గారిది. మరెందుకు ఆలస్యం? రండి! శ్రద్ధగా మన సనాతన ధర్మంలోనికి నిష్ఠగా అడుగులు వేద్దాం.

ధన్యవాదాలతో...

ప్లవనామ సంవత్సరం
శ్రీరామ నవమి

**డా. అద్దంకి శ్రీనివాస్**
98488 81838
addankidr@gmail.com

# మున్నుడి

మానవ జీవితానికి సార్థకత కలగాలంటే ధర్మాన్ని ఆచరించాలి. ఆ ధర్మం ఎంతో విస్తృతమైనది. పెద్దలు ఆచరించి చూపినది. భారతీయ వాఙ్మయమంతా మానవుణ్ణి ధర్మమార్గంలో నడిపించడానికే ఆవిర్భవించింది. అలాంటి ఉత్తమ గ్రంథాలను చదివి జీవిత పరమార్థాన్ని తెలుసుకోవాలి. అందుకు ఉపయోగపడే ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను చల్లా సాంబిరెడ్డిగారి మార్గదర్శకత్వంలో నడుస్తున్న శ్రీ పావని సేవాసమితి ప్రచురించింది.

సుమారుగా 22 సం॥ల క్రితం (1998) స్థాపించబడిన శ్రీ పావని సేవాసమితి ప్రజలకు మానసిక వికాసం - ధర్మావగాహన కలిగించాలని సంకల్పించింది. ముఖ్యంగా యువతకు, విద్యార్థి లోకానికి అధ్యయనాభిలాష కలిగించటం ముఖ్యావసరంగా గుర్తించి, శతక సాహిత్య ప్రచురణ మరియు ప్రచారానికి సన్నద్ధమైంది. ఇందులో భాగంగా శ్రీకృష్ణ, దాశరథి, సర్వేశ్వర, శ్రీనృసింహ, నారాయణ, శ్రీకాళహస్తీశ్వర, ఒంటిమిట్ట కోదండరామ, శ్రీపతి మొదలైన భక్తిశతకాలను; భాస్కర, వేమన, సుమతి, భర్తృహరి నీతిశతకాలను అనుభవజ్ఞులైన పండితుల వ్యాఖ్యానాలతో ముద్రించింది.

దశాబ్దం క్రితం **"తెలుగు పద్యం-అందచందాలు"** అనే కార్యక్రమాన్ని దూరదర్శన్ ద్వారా ప్రేక్షకులకు అందించి, 2010-11 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని విద్యార్థినీ విద్యార్థులకు ఈ శతకాలను పరిచయం చేయ సంకల్పించగా కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందించారు. తద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం వారి హిందూ ధర్మ ప్రచార పరిషత్తు మరియు శ్రీ పావని సేవా సమితి సంయుక్తంగా ఈ శతక పద్యధారణ పోటీలను నిర్వహిస్తున్నాయి. 2010-11 విద్యాసంవత్సరంలో విద్యార్థులు-శ్రీకృష్ణ, సుమతి శతకపద్యధారణ పోటీల్లో పాల్గొనగా 2011-12 విద్యా సంవత్సరంలో సుమారుగా 5 లక్షలమంది విద్యార్థులు వేమన, దాశరథి శతక పద్యధారణ పోటీల్లో పాల్గొన్నారు. 2012-13 విద్యాసంవత్సరంలో భర్తృహరి నీతి శతక మరియు భాగవత పద్యధారణ పోటీలు

నిర్వహించగా సుమారు 12 లక్షలమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇవేకాక ఇంకా మరిన్ని వినూత్న కార్యక్రమాల నిర్వహణకు పావని సేవాసమితి సిద్ధపడుతోంది.

శ్రీ పావని సేవాసమితికి విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు కళ్లు. ఉపాధ్యాయులకు కూడా ప్రముఖ గ్రంథాలైన రామాయణ, భారత, భాగవత, భగవద్గీతలపై పరిచయం, అవగాహన ఎంతో అవసరం. అందుకనే ఈ నాలుగు సద్గ్రంథాలను సరళభాషలో, అందరికీ అర్థమయ్యే రీతిలో శ్రీ పావని సేవాసమితి ప్రచురించి లోకానికి అందించింది. గజేంద్రమోక్షం, గీతార్థసంగ్రహం, విజ్ఞానేశ్వరము, చారుచర్య, రుక్మిణీకల్యాణం, అష్టాదశపురాణాలు మొదలైన గ్రంథాలను అందంగా ముద్రించి లోకానికి సమర్పించింది. ఇప్పుడు ఈ 'భారతీయ సనాతన ధర్మం' అనే గ్రంథం.

పాశ్చాత్య నాగరికత వ్యామోహంలో పడి భారతీయ మూలాలనూ, సంస్కృతి సంప్రదాయాలను విస్మరిస్తున్న కాలమిది. ఏ కాలం వారికైనా ఏ ప్రాంతం వారికైనా ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తూ ఉత్తమ జీవన మార్గాన్ని అందించేదే భారతీయ సనాతనధర్మం. అటువంటి సనాతనధర్మంలో మానవుడు పాటించవలసిన ధర్మాలను ఎంతో శ్రమకోర్చి, అందమైన రీతిలో అద్భుతంగా అందించారు డా. అద్దంకి శ్రీనివాస్‌గారు. అందుకే ఈ సనాతనధర్మం అనే గ్రంథాన్ని దశదిశలా వ్యాప్తం చెయ్యాలని కూడా సంకల్పించింది.

అంతేకాదు ఎంతో విలువైన ఈ గ్రంథాలను ఆంగ్లంలో కూడా అనువదించి ముద్రించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే రామాయణ, భగవద్గీత గ్రంథాలు ఇప్పటికే అనువాదం పూర్తయ్యి ముద్రణలో ఉన్నాయి. ప్రతి ఇంటిలోనూ ఈ వాఙ్మయాన్ని వెలలేని విలువైన సంపదగా నెలకొల్పాలన్నదే శ్రీ పావని సేవాసమితి ఆశయం.

**చల్లా సాంబిరెడ్డి**
అధ్యక్షులు

**సి. హెచ్. రామారావు**
ఉపాధ్యక్షులు

**ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు**
ప్రధాన కార్యదర్శి
**శ్రీ పావని సేవాసమితి**

# విజయోஉస్తు

శ్రీమాన్ చల్లా సాంబిరెడ్డి గారు వృత్తిరీత్యా లాయర్ అయినా ప్రవృత్తి రీత్యా సాహిత్యాభిలాషి. సాహిత్యం లోకహితాన్ని కలిగిస్తుందన్న మాట మనసా వాచా కర్మణా నమ్మిన వ్యక్తి. నమ్మడమే కాక ఆ సాహిత్యం ద్వారా లోకాన్ని మార్చాలని మాటలు చెప్పకుండా చేతల్లోకి దిగి నిర్విరామంగా కృషి చేస్తున్న మహానుభావులు.

తెలుగు జాతికి తరగని నిధుల్లాంటి గ్రంథాలను తన సొంత వ్యయాన్ని వెచ్చించి, సులభసుందరంగా ప్రచురించి, లాభాపేక్ష లేకుండా ఉచితంగా అందిస్తున్నారు. అందులో భాగంగా రామాయణ భారత భాగవతాది గ్రంథాలను, శతక వాఙ్మయాన్ని అందంగా అచ్చువేసి, లోకానికి అందిచారు కూడా. ఇంత చేసినా తనను తాను నిమిత్తమాత్రుడిగా చెప్పుకొనే సౌజన్యం సాంబిరెడ్డి గారిది.

ఇలా వీరి ఉదాత్త సుందరాలైన గుణగణాల గురించి ఎంత చెప్పినా తరగదు కాబట్టి – ఇక ప్రస్తుతానికి వస్తే – ఇప్పుడు వీరు ముద్రించి లోకానికి అందిస్తున్న ‘ భారతీయ సనాతన ధర్మం’ అనే గ్రంథం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరం.

భారతీయ సనాతన ధర్మాన్ని అందరికీ అందించాలన్నదే సాంబిరెడ్డిగారి తపన. వారి తపనకు అక్షరాకృతిని ఇచ్చారు డా. అద్దంకి శ్రీనివాస్ గారు. వీరు ఇప్పటికే సాంబిరెడ్డిగారి అభ్యర్థన మేరకు రామాయణ భారత భాగవతాది గ్రంథాలను సులభశైలిలో తెలుగులో అందించారు. శతక వాఙ్మయాన్ని కూడా సవ్యాఖ్యానంగా మూడు సంపుటాలలో ముద్రించబోతున్నారు. ఇంతటి కృషి చేస్తున్న శ్రీనివాస్‌గారికి, చేయిస్తున్న సాంబిరెడ్డి గారికీ, వీరికి సహకరిస్తున్న శ్రీ పావని సేవా సమితి సభ్యులందరికీ, ముఖ్యంగా ఆదరిస్తున్న పాఠక మహాశయులందరికీ నా ధన్యవాదాలు.

పుస్తక పఠనం పూర్తిగా కనుమరుగైపోతున్న తరుణంలో సాహిత్యగ్రంథాల ప్రసక్తి తీసుకురావడం కూడా పెద్ద సాహసమే. ఇటువంటి దురదృష్టకర పరిస్థితుల్లో పుస్తకాన్ని అందంగా ముద్రించి, ఉచితంగా అందించే ఉద్యమాన్ని తలకెత్తుకొని నిరాఘాటంగా నిర్వహిస్తున్న శ్రీమాన్ సాంబిరెడ్డి గారికి ఆ రామకృష్ణులు పరిపూర్ణమైన ఆయురారోగ్యాల్ని ప్రసాదించాలని అభిలషిస్తూ...

సెలవ్

ఆషాఢ పూర్ణిమ, ప్లవ మీ

విశాఖపట్నం **బేతవోలు రామబ్రహ్మం**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ధర్మ స్వరూపం | 11 |
| 2. | వేద విజ్ఞానం - ప్రాశస్త్యం | 17 |
| 3. | వేదాంగాలు | 23 |
| 4. | వేదసూక్తాలు | 24 |
| 5. | పురాణాలు | 26 |
| 6. | సృష్టిధర్మాలు | 28 |
| 7. | యుగధర్మాలు | 30 |
| 8. | శిష్టాచారాలు | 31 |
| 9. | వర్ణధర్మాలు | 32 |
| 10. | సామాన్య ధర్మాలు | 34 |
| 11. | తల్లి-తండ్రి-గురువు-అతిథి | 41 |
| 12. | స్త్రీ ప్రాశస్త్యం | 47 |
| 13. | ఆదర్శదాంపత్య ధర్మాలు | 50 |
| 14. | భార్యాభర్తల ధర్మాలు | 51 |
| 15. | పతివ్రతా ధర్మాలు | 52 |
| 16. | భర్తల ధర్మాలు - లక్షణాలు | 53 |
| 17. | స్త్రీ భద్రత | 55 |
| 18. | గోసంరక్షణా ధర్మాలు | 58 |
| 19. | వర్ణాశ్రమ ధర్మాలు | 63 |
| 20. | యతి ధర్మాలు | 70 |
| 21. | వ్యక్తి ధర్మాలు | 72 |
| 22. | సంస్కారాలు | 116 |
| 23. | ఆత్మగుణాలు | 121 |
| 24. | చతుర్విధ పురుషార్థాలు | 134 |
| 25. | త్రిగుణాలు | 135 |
| 26. | అరిషడ్వర్గాలు | 137 |
| 27. | పరమాత్మని చేరుకునే మార్గాలు | 143 |
| 28. | నవవిధ భక్తి మార్గాలు | 145 |
| 29. | జ్ఞానయోగం | 147 |
| 30. | యోగమార్గం | 149 |
| 31. | ధ్యానం | 154 |

| | | |
|---|---|---|
| 32. | ప్రాణాయామం | 156 |
| 33. | కర్మయోగం | 157 |
| 34. | ఆత్మ | 162 |
| 35. | పరమాత్మ | 165 |
| 36. | జగత్తు | 170 |
| 37. | భగవంతుడి గుణాలు | 172 |
| 38. | భగవంతుడికి ఇష్టమైన గుణాలు | 177 |
| 39. | తారకబ్రహ్మం | 178 |
| 40. | ప్రపత్తి–శరణాగతి | 181 |
| 41. | ఓంకారోపాసన | 183 |
| 42. | మూడు తత్త్వాలు | 185 |
| 43. | పితృదేవతలు | 188 |
| 44. | పాపాలు ఫలితాలు | 190 |
| 45. | పాలకుల ధర్మానుకూల ప్రవర్తన | 198 |
| 46. | రాజ్యరక్షా సాధనాలు | 201 |
| 47. | రాజధర్మం - ఆశ్రమధర్మాలు | 207 |
| 48. | రాష్ట్ర ప్రజల కర్తవ్యం | 209 |
| 49. | రాజు - విశేష కర్తవ్యాలు | 211 |
| 50. | రాజ్య పాలన | 218 |
| 51. | సచివుల లక్షణాలు | 220 |
| 52. | అమాత్య విభాగం | 222 |
| 53. | సైనిక నీతి | 224 |
| 54. | గణతంత్ర రాజనీతి | 227 |
| 55. | రాజసహాయకుల గుణాలు | 229 |
| 56. | ఆపదలో రాజకర్తవ్యం | 230 |
| 57. | సత్యమహిమ | 231 |
| 58. | ఆచారకాండం | 232 |
| 59. | ప్రాయశ్చిత్తకాండం | 254 |
| 60. | వ్యవహారకాండ | 268 |
| 61. | ఆరోగ్య నియమాలు | 281 |
| 62. | ఉపసంహారం | 290 |

✦ ✦ ✦

# ధర్మ స్వరూపం

ధర్మం అంటే మనందరికీ తెలుసు. కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలపైనా త్రేతాయుగంలో మూడు పాదాలపైనా, ద్వాపరయుగంలో రెండు పాదాలపైనా కలియుగంలో ఒక్క పాదంపైనా నడుస్తుందని ఆర్యోక్తి. దీనిని బట్టి చూస్తే ధర్మం గురించి తెలుసుకోవలసిన అవసరం అన్నియుగాలకంటే కలియుగానికే ఎక్కువగా ఉందని తెలుస్తోంది. పూర్వం రాజులు ధర్మ స్వరూపులుగా ఉండేవారు. వారి కుటుంబం, వారి సంతానం కూడా అదే మార్గంలో నడిచేవి. దశరథ మహారాజు మూర్తీభవించిన ధర్మానికి ప్రతినిధి. ఆయన ఒక గోవు అయితే ఆ ధర్మధేనువుకు రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురూ నాలుగు పాదాలుగా చెప్పాడు వాల్మీకి మహర్షి. దీనినిబట్టి ధర్మాన్ని ఆచరించవలసిన బాధ్యత, ముందుతరాలకు అందించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మనకు అర్థమవుతుంది. మరి ఈనాటి అత్యాధునిక సమాజంలో భిన్న భిన్న ప్రభావాలు భారతీయ యువతపైనా, జీవనవిధానంపైనా తీవ్రమైన దాడి చేస్తున్న నేపథ్యంలో భారతీయ సమాజం భావసంఘర్షణకు లోనై, వైదేశిక వ్యామోహాలకు అలవాటుపడి మన మూలాలను మర్చిపోయే స్థితి రాకుండా ఉండాలంటే భారతీయ సనాతన ధర్మంలోని గొప్పతనం అందరికీ తెలియాలి.

కాళిదాస మహాకవి ధర్మాన్ని ఒక చేతికర్రతో పోల్చి చెప్పాడు. చేతికర్ర మనల్ని ఎప్పుడు రక్షిస్తుంది? దాన్ని మనం వినియోగించినప్పుడు మాత్రమే! అలాగే ధర్మమూ మనల్ని రక్షిస్తుంది. ఎప్పుడు? అంటే మనం దాన్ని ఆచరించినప్పుడు మాత్రమే.

తనను ఎవరు ఆచరిస్తారో వాళ్ళే ధర్మాన్ని రక్షించినట్లు లెక్క. కాబట్టే **'ధర్మో రక్షతి రక్షితః'** అంటోంది వేదం. ధర్మాన్ని నువ్వు రక్షిస్తే అది నిన్ను రక్షిస్తుంది. ఆ ధర్మాన్ని నేను రక్షించను, ఊరుకుంటాను అని కూర్చుంటే ధర్మం చూస్తూ ఊరుకోదు. నువ్వు ధర్మాన్ని ఆచరించకపోతే అది నిన్ను శిక్షిస్తుంది. ఈ వాక్యమూ వేదమే చెప్పింది.

కాబట్టి ధర్మాన్ని ఆచరించడం ఎంత ముఖ్యమో, ధర్మాచరణ పట్ల ఉదాసీన వైఖరితో ఉండకుండా ఉండటమూ అంతే ముఖ్యం. అలా ఉన్నవారికి హితబోధ చెయ్యడం వారిచేత ఆచరింపజేయడమూ అంతే ముఖ్యం. ఇది జరగని ప్రతి సందర్భంలోనూ పరమాత్మ ఉద్భవిస్తూనే ఉన్నాడు. ఉద్భవిస్తూనే ఉంటాడు.

**'సారపు ధర్మమున్ విమల సత్యము బాపముచేత బొంకుచే**
**పారము పొందలేక చెడబారినదైన యవస్థ దక్షులై**
**వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుగాని ధర్మ ని**
**స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవముండెడిన్'**

అని మహాభారతం చెప్పకనే చెప్పింది. కాబట్టి ముందు ధర్మం అంటే ఏమిటో తెలుసుకోవాలి?

## ధర్మం అంటే...!

'ధృ' అనే ధాతువునుండి ధర్మం అనే పదం ఏర్పడింది. 'ధృ' అంటే ధరించడం, భరించడం, రక్షించడం అని అర్థం. అంటే లోకులందరిచేతా ఆచరణ రూపంలో ధరింపబడేదీ, రక్షింపబడేదీ అనీ భావించవచ్చు. ఇంకా కొంచెం ముందుకు వెళ్ళి దర్శనాల్లో చెప్పిన విధంగా చెప్పాలంటే –

ఈ లోకంలో సౌఖ్యాలను కలిగించడమే కాకుండా, పరలోకశ్రేయస్సును కూడా కలిగించేదే ధర్మం (వైశేషిక దర్శనం 1-1-2). అలాంటి ఈ ధర్మానికి ప్రమాణం ఏమిటి? దేని ఆధారంగా ధర్మాన్ని ఆచరించాలి? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. దానికి సమాధానం మనుస్మృతి చెప్తోంది. **ధర్మజిజ్ఞాసమానానాం ప్రమాణం పరమం శ్రుతిః** (మను. 2-13) అని. అంటే ధర్మ స్వరూపాన్ని తెలియజెప్పేది వేదమే. ఆ వేదాన్ని ఆధారంగా చేసుకొని ఉత్తములు తమ జీవనయాత్ర సాగించారు. కాబట్టి మహాత్ములైన సాధుపురుషుల ఉత్తమ ఆచరణ కూడా ధర్మాచరణే! (మహాభారతం – అనుశాసనిక పర్వం), వీటన్నింటి సారాంశాన్ని క్రోడీకరిస్తే **లోకంలో ఉన్న జనులందరికీ శ్రేయస్సును కలిగించేదే ధర్మం** అని అర్థమవుతుంది. ఆ రకంగా లోకాన్ని ఉద్ధరించడం కోసం దాన్ని ధరిస్తోంది కాబట్టి దానికి 'ధర్మం' అని పేరు.

**ధారణాత్ ధర్మ ఇత్యాహుః ధర్మోధారయతే ప్రజాః,**
**యత్ స్యాత్ ధారణ సంయుక్తం సధర్మ ఇతి నిశ్చయః.** (మహాభారతమ్)

లోకాన్ని ధరించేదాన్ని ధర్మం అనవచ్చు. ఆ ధర్మమే ప్రజల్ని రక్షిస్తుంది. ఆ రకంగా రక్షణ కలిగిస్తుంది కాబట్టి ధర్మం అంటే రక్షణ అని కూడా. ఈ మాట చెప్పిన వ్యాసుడే మరో గొప్ప సూచన చేశాడు. వేదశాస్త్రేతిహాసాలు చదవనివాడికి కూడా ధర్మమంటే ఏమిటో దాన్ని ఎలా తెలుసుకొని నడుచుకోవాలో చెప్పాడు.

**ఒరులేయవి యొనరించిన**
**నరవర! యప్రియము తన మనంబున కగు తా**
**నొరులకు నవి సేయకునికి**
**పరాయణము పరమధర్మపథముల కెల్లన్.**

దీనినే సంస్కృత భారతం -

**న తత్ పరస్య సందధ్యాత్ ప్రతికూలం యదాత్మనః,**
**సంగ్రహేణైష ధర్మః స్యాత్ కామాదన్యః ప్రవర్తతే.** (5-71)

ఇతరులు ఏం చేస్తే మన మనసుకు బాధకలుగుతుందో, తాను ఇతరులకు అది చేయకుండా ఉండడమే గొప్ప ధర్మం. ఇంతకుమించి సులభమైన మార్గం ఏముంటుంది? అది కూడా లేనివాడు ధర్మాచరణ విషయంలో ఏవైనా సందేహాలు ఏర్పడితే విచారణ సమర్థులు, ధర్మాచరణ పరాయణులు అయిన ఉత్తముల్ని చూసి ఆచరించమంటోంది తైత్తిరీయోపనిషత్తు.

ఈ మాటలు ఒక జాతికి గానీ, మతానికి గానీ చెందినవికావు. ఒక వర్గాన్ని మాత్రమే ఉద్ధరించేవి కావు. ఆచరించిన వారందరికీ రక్షణ కవచమే ధర్మం అంటే. ఇటువంటి విశ్వశ్రేయోదాయకమైన ధర్మాన్ని ఒక ప్రాంతానికి పరిమితం చేసి 'హిందూధర్మం' అనడం, ధర్మానికి మతం రంగు పులిమి హిందూమతం అనడం అనుచితం. కాబట్టి భారతదేశంలో మహర్షుల మేధస్సునుండి పుట్టింది కాబట్టి ఇది **ఆర్ష ధర్మం.** దానికి మూలం వేదమే కాబట్టి **వైదిక ధర్మం.**

## సనాతనధర్మం

**'సనాతనస్య ధర్మః సనాతన ధర్మః'.** సనాతనుని ధర్మమే సనాతన ధర్మం. సనాతనుడు అంటే సాక్షాత్తు పరమాత్మ. పరమాత్మ ఎలా శాశ్వతమైనవాడో, ఆద్యంతాలు లేనివాడో సనాతన ధర్మమూ అంతే! **'సనా సదా భవః'** ఎప్పుడూ ఉండేది. నిరంతరమైనది. ఇది ఇప్పటిది కాదు కాబట్టి, ఎప్పుడు ప్రారంభం అయ్యిందో తెలియదు కాబట్టి ప్రాచీనమైనది. అయితే ఆధునిక కాలంలో 'సనాతనం' అంటే ప్రాచీనమనీ, 'అధునాతనం' అంటే ఆధునికం అనీ వ్యవహారంలో ఉంది. కానీ సనాతనం - అధునాతనం కూడా. నేటి అధునాతనం రేపటికి సనాతనమే అవుతుంది. కాబట్టి ఈ రెండు పదాలు పరస్పర వ్యతిరేకాలు కావు. ఈ రెండింటిలో సనాతనం - అర్థ విస్తృతి కలిగిన శబ్దం.

ధర్మానికి విశేషణంగా సనాతన శబ్దాన్ని వాడడం వల్ల ధర్మం సనాతనమైనది అని అర్థం చేసుకోవచ్చు. అంటే ఎప్పటికీ నిలిచి ఉండే ధర్మం అని. అలా కాక ధర్మానికి ఆధారం వేదం కాబట్టి ఆ వేదంలో ప్రతిపాదించబడినవాడు పరమాత్మ కాబట్టి, ఆయనకు సంబంధించిన ధర్మం – అంటే సనాతనుడైన పరమాత్మ గురించి చెప్పే ధర్మమే సనాతన ధర్మం అని. నిజానికి సనాతనుడు, ధర్మము అని వేరువేరుగా చెప్పుకొంటున్నా సనాతనుడైన పరమాత్మయే ధర్మస్వరూపుడు కూడా. ఆ పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకొని ఆయన్ని మనం ధరిస్తే అతడు మనల్ని రక్షిస్తాడు. విస్మరిస్తే శిక్షిస్తాడు. యుగయుగాలుగా నిరూపితమైన అంశమే ఇది. కాబట్టి ధర్మం గురించి తెలుసుకోవడం అంటే పరమాత్మ గురించి తెలుసుకోవడమే. యుగయుగాలుగా తానే వివిధ అవతారాల రూపంలో ఆచరించి లోకానికి ధర్మాన్ని తెలియజేస్తున్నాడు. ధర్మాన్ని ఉత్తములు ఆచరించినప్పుడు చూసి తెలుసుకోవాలని పురాణాలు చెప్తున్నాయి. అలా పురాణాలు చెప్పిన ఉత్తముడు కూడా ఆ పరమాత్మే.

నిజానికి జీవాత్మ పరమాత్మ వేరు కాదు. అలాగే సనాతన ధర్మస్వరూపుడైన పరమాత్మ చెప్పిన ధర్మాలను ఆచరించిన ప్రతి ఒక్కడూ పరబ్రహ్మకి చెందినవాడే అవుతాడు కాబట్టి ఎవరు ఆచరిస్తారో వారే సనాతనులు. సనాతనుడైన భగవంతుడికి చెంది, ఉత్తమ ఆచరణ కలిగి ఆచరించే సజ్జనులే సనాతనులు, కాబట్టి వాళ్ళు ఆచరించే ధర్మం సనాతన ధర్మం. కాబట్టి **'సనాతనస్య ధర్మః సనాతన ధర్మః'** అన్న నిర్వచనం సరిపోతుంది. ఇక్కడ సనాతనుడు అంటే భగవంతుడు అనీ భగవంతుణ్ణి అనుసరించేవాడనీను. మానవుణ్ణి మాధవుణ్ణి చేసి సనాతనుణ్ణి చేస్తుంది కాబట్టి **'సనాతన యతి ఇతి సనాతనః'** సనాతన ధర్మం అయ్యింది.

## ధర్మశాస్త్రం

ఇది ప్రాచీనమైనదీ, ఆచరించదగినదీ, శాశ్వతమైనదీ కాబట్టి **'సనాతనశ్చాసౌ ధర్మశ్చ ఇతి సనాతన ధర్మః'.** సనాతనమైన ధర్మం. సనాతనుడి సంకల్పమైనా సనాతనులైన సజ్జనుల లక్ష్యమైనా విశ్వహితమే.

అంతేకాదు ప్రపంచాన్ని నిలబెట్టేది కూడా ధర్మమే! ప్రపంచమంటే ప్రాణులే కాబట్టి, అందులో మానవుడు తప్ప ఇతర ప్రాణులకు ప్రకృతికి వ్యతిరేకంగా ప్రవర్తించే తత్త్వం ఉండదు కాబట్టి మానవుడికే ధర్మాచరణ ఆవశ్యకం అయ్యింది. దానిని గమనించిన మహర్షులు ధర్మాన్ని బోధించడం మొదలుపెట్టారు. మానవుడు పాటించవలసిన

ఆచారాల్నీ, సంప్రదాయాల్నీ వేదకాలం నాటి ఋషులు మొట్టమొదట తెలియజేశారు. ఆ తరువాత మనువు, పరాశరుడు, యాజ్ఞవల్క్యుడు, ఆపస్తంభుడు, గౌతముడు, వ్యాసుడు, వాల్మీకి మొదలైన ఎందరో మహర్షులు సనాతనధర్మం గురించి శాస్త్రీయంగా బోధించారు. అలా ధర్మం – ఆచరణ, ప్రబోధం స్థాయిలను దాటి భవిష్యత్ తరాలవారికి అందించే దిశగా శాస్త్రంగా పరిణమించింది. అదే 'ధర్మశాస్త్రం' అయ్యింది.

**'శాసనేన త్రాయత ఇతి శాస్త్రం'.** ఇలా ఉండాలి, ఇలా చెయ్యాలి అని శాసించడం ద్వారా రక్షించేది కాబట్టి దాన్ని శాస్త్రం అన్నారు. ధర్మశాస్త్రం అంటే ప్రజలకు కర్తవ్యాలను తెలియజెప్పి వాళ్ళచేత ఆచరింపజేసి తద్వారా రక్షించేది అని. ఈ విధంగా ధర్మశాస్త్రం మన మహర్షులు అందించిన సంస్కార విజ్ఞానసాగరమై జీవుల్ని తరింపజేస్తోంది.

## ధర్మసూత్రాలు

ధర్మం – శాస్త్రంగా రూపుదాల్చే క్రమంలో ఏర్పడ్డవే ధర్మసూత్రాలు. విస్తృతమైన శాస్త్రాన్ని సంగ్రహంగానూ సమగ్రంగానూ చెప్పాలంటే దానికి సూత్రరూపమే శరణ్యం. తక్కువ అక్షరాలతో ఎక్కువ అర్థం ఇమిడి ఉండేలా చెప్పడం సూత్ర లక్షణం. దీనికి లాఘవమే ప్రాణం. అంతకు మించి ఒకరినుండి ఒకరికి అనూచానంగా సంక్రమించ వలసినవి కావడం వల్ల ధారణ చెయ్యడానికి యోగ్యంగా ఉండడం అవసరం. అందుకే మానవుడి జీవితంలోని వివిధ దశలలో అంటే బాల్య, కౌమార, యౌవన, వార్ధకాది దశలలో పాటించవలసిన ధర్మాలను సదాచారాలనూ సూత్రరూపంగానూ, శ్లోక రూపంగానూ ధర్మశాస్త్రాలు అందిస్తున్నాయి. వాటికి ఆలంబనగా పురాణ సంప్రదాయాన్ని అనుసరించి సత్పురుషుల చరిత్రలను ఆధారంగా చేసుకొని ధర్మ ప్రతిపాదనం చేయడం కూడా ధర్మశాస్త్ర గ్రంథాలకు పరమావధిగా మారింది. మొట్టమొదట వేదాలు, ఉపనిషత్తులు ధర్మాన్ని శాస్త్రస్థాయిలో బోధించాయి. ఆ తరువాత వచ్చిన పురాణాలు, భారత భాగవతాదులు కూడా ధర్మశాస్త్ర స్థాయిని పొందాయి. అందుకే మహాభారతాన్ని **'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని'** కొనియాడుతారన్నాడు ఆదికవి నన్నయ.

## సనాతన ధర్మం – లక్షణాలు

సనాతన ధర్మానికి ప్రధానమైనభూమిక వేదం. మనుస్మృతి –

**వేదస్మృతిః సదాచారః స్వస్య చ ప్రియమాత్మనః,**
**ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణమ్.** (11–12)

వేదాలు, స్మృతి గ్రంథాలు, సజ్జనులు – అంటే సనాతనులైన వాళ్ళు తాము ఆచరించి చూపిన సదాచారాలు, సంప్రదాయాలు, లోకానికి హితాన్ని చేకూర్చే సత్కర్మలూ అనే నాలుగు లక్షణాలతో సనాతన ధర్మం విలసిల్లుతుంది. తద్వారా మానవ జీవితానికి అంతిమ లక్ష్యమైన పరమపద ప్రాప్తిని కలిగిస్తుంది. అందుకు ప్రధానమైన కొన్ని లక్షణాలు ఉండాలి (మను.4–92). అవి –

1. ధైర్యం, 2. సహనం, 3. దమం, 4. అచౌర్యం, 5. శుచి, 6. ఇంద్రియ నిగ్రహం, 7. బుద్ధి, 8. విద్య, 9. సత్యం, 10. అక్రోధం.

ఇవి ఉన్నవాడే సనాతన ధర్మపరాయణుడు. ధర్మానికి మరికొన్ని సాధారణ లక్షణాలనూ గుర్తించవచ్చు.

## సాధారణ లక్షణాలు

1. ధర్మం ఎప్పుడూ ఒకేలా ఉండదు. దేశ, కాల, వ్యక్తి, వస్తు నిర్దేశాలను బట్టీ విధించిన ధర్మాన్నే విధిగా ఆచరించాలి.
2. విశ్వజనహితాన్ని స్థిరంగా కాంక్షిస్తుంది.
3. ఆచరించిన వారిని పూర్తిగా రక్షించే బాధ్యతను తానే వహిస్తుంది.
4. నిర్లక్ష్యం చేసినవారిని నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తుంది.
5. పరమగుహ్యంగా ఉంటూనే సులభగ్రాహ్యంగానూ ఉంటుంది.
6. శాస్త్రజ్ఞులకు మాత్రమే బోధపడేలా సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటుంది.
7. స్థూలస్వరూపంతో అందరికీ వర్తించేలా ఉంటూనే మళ్ళీ వ్యక్తి వ్యక్తికీ సూక్ష్మంగా వర్తిస్తుంది.
8. శాశ్వత ప్రయోజనమే లక్ష్యంగా ప్రవర్తిస్తుంది.
9. తరతమ భేదాలకు తావులేని ప్రవర్తనతో ఉంటుంది.
10. సనాతనుడైన పరమాత్మ స్వరూపానికి అణుమాత్రం కూడా వ్యతిరేకం కాదు. లోకోద్ధరణే ధర్మానికి పరమ ప్రయోజనం.

✦ ✦ ✦

# వేద విజ్ఞానం - ప్రాశస్త్యం

వేదాలకు **'శ్రుతులు'** అని పేరు. అంటే ఒకరి నుండి ఒకరికి 'వినికిడి' ద్వారా వ్యాపించినవనీ, వినవలసినవనీ అర్థం. వేదానికే **'అపౌరుషేయాలు'** అని కూడా వ్యవహారం. పురుషులు ఎవ్వరూ దీనిని రచించలేదు కాబట్టి అపౌరుషేయాలు అన్నారు. సాక్షాత్తు బ్రహ్మముఖం నుండి ఆవిర్భవించాయి కాబట్టి. అంతేకాదు వేదం గురుముఖతః సంక్రమించాలి. అంటే పరంపరగా ఎలా వస్తోందో అలాగే నేర్చుకోవాలి కానీ మధ్య ఏ పురుషుడూ వాటిని మార్చకూడదు. కాబట్టి అపౌరుషేయాలు. 'వేదం' అంటే తెలుసుకోదగినవి. విద్-జ్ఞానే. దేని గురించి తెలుసుకోవాలి? అంటే పరమాత్మ గురించి. కాబట్టి ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని తెలియజెప్పేవే వేదాలు. దీనినే 'తత్త్వం' అన్నారు. తత్ అంటే పరబ్రహ్మం. దాని స్వరూపం గురించి చెప్పేదే తత్త్వం. ఈ తాత్త్విక భూమిక కలవారినే వేదర్షులు అంటారు. వాళ్ళనే 'ద్రష్టలు' అని కూడా అంటారు. వాళ్ళు వేదాన్ని తెలుసుకొని, పరమాత్మనుంచి సూక్తాలను విన్నారు. విని వాటిని తిరిగి గానం చేశారు. కాబట్టి వీటికి శ్రుతులు అని పేరు వచ్చింది. వీటితో పాటు త్రయీ, ఆమ్నాయం, నిగమం, స్వాధ్యాయం, అనుశ్రవం, సంహిత అని వేదానికి పర్యాయపదాలు ఉన్నాయి.

వేదం ఒక్కటే. అది రాశీభూతంగా ఉండేది. అందులోని మంత్రాల స్వరూప స్వభావాలను బట్టి వేదవ్యాస మహర్షి నాలుగు భాగాలు విభజించాడు. అవి:

1. ఋక్ సంహిత, 2. యజుస్సంహిత, 3. సామసంహిత, 4. అథర్వసంహిత.

ఇలా విభజించిన వేదాలను వేదవ్యాసుడు తన శిష్యులైన పైలుడు, వైశంపాయనుడు, జైమిని, సుమంతుడు అనే నలుగురికీ వరుసగా ఉపదేశించాడు.

ప్రతి వేదానికీ కొన్ని శాఖలు ఉంటాయి. ప్రతి శాఖకీ 1. సంహిత, 2. బ్రాహ్మణం, 3. ఆరణ్యకం, 4. ఉపనిషత్తు, 5. ప్రాతిశాఖ్యలు, 6. శ్రౌతసూత్రాలు, 7. గృహ్యసూత్రాలు అనుబంధంగా ఉంటాయి.

యజ్ఞానికి మూలం వేదమే. యజ్ఞంలో హోత ఋగ్వేదం, అధ్వర్యువు యజుర్వేదం, ఉద్గాత సామవేదం, బ్రహ్మ అథర్వవేదం పఠిస్తారు.

## వేదప్రాశస్త్యం

వేదం పరమాత్మ నిశ్వాసం నుండి ఉద్భవించింది (బృహదారణ్యకోపనిషత్తు). పరమాత్మ నుండి ఆదిపురుషుడైన విరాట్ పురుషుడు ఆవిర్భవిస్తే అతడినుండే నాలుగు వేదాలు ఉద్భవించాయి (తైత్తిరీయం). ఆ విరాట్ పురుషుడే యజ్ఞపురుషుడు.

వేదాన్ని ఒక పురుషుడిగా భావిస్తే – ఆ వేదపురుషుడికి 1. శిక్ష, 2. వ్యాకరణం, 3. చంధస్సు, 4. నిరుక్తం, 5. జ్యోతిషం, 6. కల్పం అనే వేదాంగాలు శరీర భాగాలు. వేదంలో ఉన్న మంత్రాలకు అర్థాన్ని సాధించడంలో ఇవి సహకరిస్తాయి.

వేదాలలో మానవ జన్మాంతర విషయాలు, పుణ్యపాపకర్మలు, ఊర్ధ్వ–అధోలోకాలు, ఉత్తమ–అధమజన్మలు, మానవధర్మాలు, ఆశ్రమధర్మాలు మొదలైనవెన్నో ఉంటాయి. వీటన్నింటిలో వర్ణాశ్రమ ధర్మాలు అత్యంత ప్రధానమైనవి. వర్ణాశ్రమ ధర్మరూపంగా ఉన్న వేద శాసనాన్ని అందరూ ఆచరించేలా చూడడం రాజుధర్మం. అలాంటి రాజుకు భరతుడు అని పేరు. 'భ' అంటే జ్ఞానం. దానిపై ఆసక్తి ఉన్నవాడు భరతుడు. ఆ ధర్మాన్ని ఆచరించే ప్రజలు నివసించే ప్రాంతానికే భారతవర్షం అని పేరు. కాబట్టి సనాతన ధర్మానికి మూలస్థానం ఈ విధంగానూ భారతదేశమే అయ్యింది.

వేదంలో చెప్పినదే ధర్మం. పరమార్థం. ప్రమాణం. వేదానికి విరుద్ధమైనదేదీ ఆచరణీయం కాదు. అంటోంది బ్రహ్మవిద్యోపనిషత్ **(శ్రుత్యా యదుక్తం పరమార్థమేవ–32).**

అలాంటి వేదాన్ని శ్రుతి అంటే ఆ వేదాన్ని అనుసరించే ధర్మశాస్త్ర గ్రంథాలను స్మృతులు అంటారు. వేదం తర్వాత స్మృతికే అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు.

వేదాలకు అంగభూతాలు బ్రాహ్మణాలు. వేదసంహితలో మంత్రాలు ఉంటే బ్రాహ్మణాలలో గద్య ఉంటుంది. బ్రహ్మం గురించి వివరించేవి బ్రాహ్మణాలు. ఇక్కడ బ్రహ్మం అంటే యజ్ఞం.

యజ్ఞ విధులకి సంబంధించిన మంత్రాల అర్థాలను బ్రాహ్మణాలు వివరిస్తాయి. బ్రాహ్మణాలలో 1. విధి, 2. అర్థవాదం, 3. ఉపనిషత్తు అని మూడు భాగాలు ఉంటాయి. విధి యజ్ఞ విధుల్ని తెలియజేస్తే అర్థవాదం విధివాక్యాలను సోదాహరణంగా వివరిస్తుంది. ఉపనిషత్తు తత్త్వవిచారం చేస్తుంది.

ఋగ్వేదానికి ఐతరేయబ్రాహ్మణం, శుక్లయజుర్వేదానికి శతపథ బ్రాహ్మణం, కృష్ణయజుర్వేదానికి తైత్తిరీయబ్రాహ్మణం, సామవేదానికి తాండ్యం, ఛాందోగ్యం, అథర్వవేదానికి గోపథ బ్రాహ్మణాలు ఉన్నాయి.

యజ్ఞం చేస్తే ఎలాంటి ప్రయోజనాలు మానవాళికి చేకూరతాయో కూడా బ్రాహ్మణాలు వివరిస్తాయి. నిత్యాగ్నిహోత్రం, దీర్ఘసత్త్రయాగం వంటి అనేక యాగాల ద్వారా విశ్వమానవ కల్యాణం సాధ్యమవుతుందని బ్రాహ్మణాలు బోధిస్తుంటాయి.

యజ్ఞభాగాలను దేవతలు హవిస్సుద్వారా స్వీకరిస్తారు. దేవతలకు అధిపతి ఇంద్రుడు. విష్ణువే యజ్ఞస్వరూపుడు.

మానవుడు దేవ, ఋషి, పితృ ఋణాలు తీర్చుకోవడం కోసం వివాహం చేసుకోవాలి. భార్యలేకపోతే భర్తకు యజ్ఞాలు చేసే అర్హత ఉండదు. పుత్రులు లేనివారికి సద్గతులు ఉండవు. అన్ని ధర్మాలలోకెల్లా సత్యమే ఉత్తమ ధర్మం. స్త్రీలను బాధించకూడదు (**న వై స్త్రియం ఘ్నంతి** – శతపథం) మొదలైన ఎన్నో ధార్మిక అంశాలను బ్రాహ్మణాలు బోధిస్తాయి.

వానప్రస్థాశ్రమం స్వీకరించిన తరువాత అక్కడ ఏఏ యాగాలు చెయ్యాలో వివరించేవే ఆరణ్యకాలు. అరణ్యాలలో జీవన విధానాన్ని చెప్తాయి కాబట్టి ఆరణ్యకాలు.

**అరణ్య ఏవ పాఠయిత్వాదారణ్యక మితీర్యతే,**
**అరణ్యాధ్యయనాది తత్ ఆరణ్యక మితీర్యతే.**

ఒక్కో వేదానికి ఒక్కోరకమైన ఆరణ్యకాలు ఉంటాయి. ఋగ్వేదానికి ఐతరేయ ఆరణ్యకం, యజుర్వేదానికి తైత్తిరీయారణ్యకం (కృష్ణయజుర్వేదం) బృహదారణ్యకం (శుక్ల యజుర్వేదం) ప్రముఖమైనవి. ఇందులో సన్యాసాశ్రమం స్వీకరించిన వాళ్ళూ పాటించవలసిన విధులు ఉన్నాయి. యజ్ఞ విధులు, తాత్త్విక మీమాంస, కాలప్రభావం, ఋతువుల స్వభావాలు, పుణ్య సంపాదన, పాపపరిహారం, పంచమహాయజ్ఞాలు, వర్ణాశ్రమ ధర్మాలు, ప్రాణవిద్య, క్షేత్ర ప్రశంస, మహర్షుల గొప్పతనాలు, అగ్ని విద్య, స్వాధ్యాయం, పంచమహాయజ్ఞాలు, అభిచార హోమాలు మొదలైన వాటి వివరాలు ఉంటాయి. ఆరణ్యకాలలో కొన్ని సామాజికాంశాలు కూడా కన్పించడం విశేషం. ఋతు ధర్మాల్ని చెప్తూ వర్ష ఋతువులో రోగాలు ప్రకోపిస్తాయి కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలని ఆరణ్యకం హెచ్చరిస్తోంది. పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కన్పిస్తుందని, భార్య భర్తతో సహగమనం చేయకూడదనీ ఆరణ్యకాలు బోధిస్తున్నాయి.

**ఉపనిషత్తులు:** వేదాలలో కర్మకాండ, బ్రాహ్మణాలలో ఉపాసన విధానం ప్రధానం. ఉపనిషత్తులలో 'జ్ఞానబోధ' ప్రధానం. ఉపనిషత్తులు వేదాలకు చివరి అంగాలు కాబట్టి వేద+అంత = వేదాంతాలు అంటారు. ఆత్మజ్ఞానాన్ని బోధించేవి ఇవే.

**'ఉప-నిషద్'.** అంటే సమీపంలో కూర్చొని వినవలసినది. అంటే గురువు ద్వారా పొందవలసిన జ్ఞానం అని. మొత్తం 223 ఉపనిషత్తులు ఉన్నాయని 'వాక్యకోశం' చెప్తుంటే ముక్తికోపనిషత్తు 108 అంటోంది. అయితే వీటిలో 10 ఉపనిషత్తులు మాత్రం బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. అవి -

**'ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండుక్య తైత్తిరిః,**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం దశ'.**

**1. ఈశావాస్యోపనిషత్తు:** శుక్లయజుర్వేదానికి సంబంధించిన మాధ్యందిన సంహితలో ఈ ఉపనిషత్తు ఉంది. 'ఈశావాస్యం' అని ప్రారంభం అవుతుంది. ఇందులో 18 మంత్రాలు ఉంటాయి. జ్ఞానదృష్టితో కర్మల్ని ఆచరించాలనీ, ఆత్మజ్ఞానాన్ని పొందడమే నిజమైన విద్య అనీ, ఈ ప్రపంచం మొత్తం పరబ్రహ్మ స్వరూపమేననీ అన్ని ప్రాణులలోనూ వ్యాపించి ఉండి, నియామకం చేస్తాడు కాబట్టి ఆయనకు 'ఈశ్వర' శబ్దం సార్థకమనీ ఈ ఉపనిషత్తు బోధిస్తుంది.

**2. కేనోపనిషత్తు:** ఇది సామవేదానికి చెందిన ఉపనిషత్తు. దీనికే 'బ్రహ్మోపనిషత్' అని పేరు. 'కేనోషితం' అని ప్రారంభం కావడాన్ని బట్టీ దీనికి ఈ పేరు వచ్చింది. ఇందులోని నాలుగు ఖండాలలో పరబ్రహ్మతత్త్వ వివరణ ఉంటుంది. ఉపాసన భేదాలు (సగుణ-నిర్గుణ) కూడా ఉన్నాయి. పరబ్రహ్మం సర్వశక్తి సంపన్నమైనదనీ, అందుకే పరబ్రహ్మోపాసన ద్వారా మోక్షాన్ని పొందవచ్చుననీ ఈ ఉపనిషత్తు బోధిస్తుంది.

**3. కఠోపనిషత్తు:** కృష్ణయజుర్వేద శాఖకు చెందిన ఈ ఉపనిషత్తులో ప్రధానమైనది నచికేతూపాఖ్యానం. బ్రహ్మచారి అయిన నచికేతుడు తండ్రిచేత నిరాదరింపబడి యమలోకానికి చేరుకుంటాడు. తన భక్తి ప్రపత్తులలో యముణ్ణి మెప్పించి, యముడి నుండి బ్రహ్మవిద్యను తెలుసుకుంటాడు. ఈ కథ ఆధారంగా పరబ్రహ్మ గురించి ఈ ఉపనిషత్తు బోధిస్తుంది.

**4. ప్రశ్నోపనిషత్తు:** అథర్వవేదానికి చెందిన పిప్పలాది శాఖలో ఈ ఉపనిషత్ ఉంటుంది. అక్షర పరబ్రహ్మం, ప్రజావిర్భావం, దేవతల వివరాలు, శరీరంలో ప్రాణోత్పత్తి, జాగ్రత్-స్వప్న-సుషుప్తి అవస్థలు, వీటి ప్రయోజనాలు, ఓంకారోపాసన, ప్రయోజనాలు, షోడశ కళాపురుషుడి తత్త్వం మొదలైన అనేకాంశాలను ఈ ఉపనిషత్తు తెలుపుతుంది.

**5. ముండకోపనిషత్తు:** అథర్వవేదానికి చెందిన శౌనకశాఖలో ఉన్న ఈ ఉపనిషత్తులో మూడు మండలాలు ఉంటాయి. ముఖ్యంగా ఇందులో యతిధర్మాలు ఉన్నాయి. వేదాంత

పదాన్ని వాడిన మొదటి ఉపనిషత్తు ఇదే. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు పరమాత్మలో విలీనమవుతాడంటోంది ఈ ఉపనిషత్తు.

**6. మాండుక్యోపనిషత్తు:** ఇది కూడా అథర్వవేదానికి సంబంధించిన శౌనకశాఖలో ఒక భాగమే. ఇందులో 12 వాక్యాలు ఉంటాయి. గౌడపాదాచార్యులు వీటికి వ్యాఖ్యానం రాశారు. వీటిని ఆధారంగా చేసుకొని శంకరాచార్యులు అద్వైతపరంగా సమన్వయించారు.

**7. తైత్తిరీయోపనిషత్తు:** ఇది కృష్ణయజుర్వేద – తైత్తిరీయ బ్రాహ్మణంలోని చివరి భాగం. ఇందులో 10 ప్రపాఠకాలు ఉంటాయి. అందులో 7, 8, 9 ప్రపాఠకాలకు 'తైత్తిరీయోపనిషత్' అని పేరు. ఇందులో శిక్షావల్లి, ఆనందవల్లి, భృగువల్లి అని మూడు కాండలు ఉన్నాయి. 'ఓంకార స్వరూపం', మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ' వంటి సనాతనధర్మాలు ఇందులో అనేకం ఉన్నాయి.

**8. ఐతరేయోపనిషత్తు:** ఋగ్వేదానికి చెందిన ఐతరేయ బ్రాహ్మణంలోని చివరి భాగమైన ఆరణ్యకంలో 5 భాగాలు ఉన్నాయి. అందులోని రెండో భాగంలోని 4, 5, 6 అధ్యాయాలకు ఐతరేయోపనిషత్తు అని వ్యవహారం. ఇది ప్రధానంగా సృష్టిస్వరూపాన్ని నిరూపిస్తుంది. గురువు అనుగ్రహముంటేనే 'బ్రహ్మసాక్షాత్కారం' లభిస్తుందని వక్కాణిస్తుంది. ప్రకృష్టమైన జ్ఞానం కలిగి ఉండడమే ప్రజ్ఞానమనీ, ఆ ప్రజ్ఞానమే పరబ్రహ్మ స్వరూపమనీ నిరూపిస్తుంది.

**9. ఛాందోగ్యోపనిషత్తు:** సామవేదానికి చెందిన బ్రాహ్మణంలో చివరి మూడు భాగాలకూ 'ఛాందోగ్యోపనిషత్తు' అని పేరు. ఇది అత్యంత ప్రాచీనమైన ఉపనిషత్తు. ఇది బ్రహ్మజ్ఞానాన్ని బోధిస్తుంది. ఓంకార తత్త్వం, ఉద్గీథ విద్య, మధు విద్య, ఆధ్యాత్మశిక్ష, సూర్యుడి ఆవిర్భావం మొదలైన అంశాలు ఇందులో ఉన్నాయి. రైక్వ, సత్యకామ, జాబాలి శ్వేతకేతువు వృత్తాంతాలు ఇందులోనివే. ఈ ప్రపంచం మొత్తం బ్రహ్మం నుండే ఉద్భవించి, చివరికి బ్రహ్మంలోనే లీనమైపోతుందని, ఈ ఉపనిషత్తు తెలియజేస్తుంది.

**10. బృహదారణ్య కోపనిషత్తు:** శుక్ల యజుర్వేదానికి చెందిన వాజసనేయ–కణ్వ అనే రెండు సంహితల్లోని చివరి భాగాలకు బృహదారణ్యకం అని పేరు. ఇందులో యాజ్ఞవల్క్యుడు జనకుడి ఆస్థానంలో గార్గి మొదలైనవారితో వాదించిన వృత్తాంతం ఉంటుంది. ముఖ్యంగా ఈ ఉపనిషత్తు పంచాగ్ని విద్యను విశేషించి వివరిస్తుంది.

**స్మృతులు:** వీటికి నీతిశాస్త్రాలని కూడా పేరు. వేదంతో సమానమైన ప్రతిపత్తి కలిగి సనాతన ధర్మాన్ని బోధించే స్మృతిగ్రంథాలు వేదధర్మాన్ని అనుసరించి ఉంటాయి. వీటి ద్రష్టలు మహర్షులు కాబట్టి ఆయా మహర్షుల పేర్లపై వీటికి వ్యవహారం.

ధర్మాన్ని తెలుసుకోవడానికి మొదటిది వేదం అయితే రెండవది ధర్మశాస్త్రమే (స్మృతి). మూడోది లోక వ్యవహార రీతి. అంటే పెద్దలు ఆచరించిన తీరు. ఎంత గొప్పవాడైనా వేదవేదాంగాలను చదివినా స్మృతిజ్ఞానం లేకపోతే చంద్రుడు లేని శరద్రాత్రిలా శోభించరు.

**"అధీత్య చతురోవేదాన్ సాంగోపాంగ పదక్రమాన్,**
**స్మృతిహీనాః న శోభన్తే చంద్రహీనేన శర్వరీ'.**

వైదిక కర్మల్ని వివరించేవి శ్రౌతసూత్రాలు. గృహస్థాశ్రమం స్వీకరించిన వారి కర్మల్ని తెలిపేవి గృహ్యసూత్రాలు. తరువాతివి ఆశ్రమధర్మాలను వివరించే ధర్మసూత్రాలు. గృహ్యసూత్రాలు షోడశ సంస్కారాల గురించి చెప్తుంటే, ధర్మసూత్రాలు ఆ సంస్కారాల ఆవశ్యకతను వివరిస్తున్నాయి. ఇవి ప్రధానంగా 18.

1. మను, 2. అత్రి, 3. విష్ణు, 4. హారి, 5. యాజ్ఞవల్క్య, 6. అశన, 7. అంగిర, 8. యమ. 9. ఆపస్తంబ, 10. కాత్యాయన, 11. బృహస్పతి, 12. పరాశర, 13. శంఖ, 14. లిఖిత, 15. దక్ష, 16. గౌతమ, 17. శాతాతప, 18. వసిష్ఠ స్మృతులు.

వీటికి మళ్ళీ 28 ఉపస్మృతులు కూడా ఉన్నాయి. ఇలా అసంఖ్యాకంగా ఉన్న స్మృతులన్నింటిలో ఆదిస్మృతి మనుస్మృతి. తరువాతిది పారశర్యస్మృతి.

**కృతే తు మానవాః ప్రోక్తాః త్రేతాయాం గౌతమాః స్మృతాః,**
**ద్వాపరే శంఖ లిఖితే కలౌ పారశరీ స్మృతిః.**

కృతయుగంలో మనుస్మృతి, త్రేతాయుగంలో గౌతమస్మృతి, ద్వాపరంలో శంఖ లిఖిత స్మృతులు, కలియుగంలో పరాశరస్మృతి చెప్పినట్లుగా మానవులు నడుచుకోవాలి.

ధర్మశాస్త్ర గ్రంథాలలో ప్రధానమైనవి గౌతమధర్మ సూత్రాలు, ఆపస్తంభ సూత్రాలు, ఆశ్వలాయన గృహ్యసూత్రాలు ప్రముఖమైనవి. సనాతన ధర్మాన్ని బోధించడంలో శ్రుతి స్మృతుల తరువాత ప్రాధాన్యం వీటిదే! ఆధునిక కాలానికి చెందిన 'ధర్మసింధువు' 'నిర్ణయసింధువు' మొదలైన ధర్మశాస్త్ర గ్రంథాలు కూడా కలియుగంలో ఆచరించదగినవేనంటారు ఆర్యులు.

✦ ✦ ✦

# వేదాంగాలు

వేదాల అర్థాలను తెలుసుకోవడానికి ఉపయోగపడేవి వేదాంగాలు.

**1. శిక్ష:** వేదాన్ని ఎలా ఉచ్చరించాలో ఇది తెలియజేస్తుంది (Phonetics and Phonology). పాణిని మహర్షి దీనికి ద్రష్ట. వేదాలలో ఉండే మంత్రాల స్వరోచ్చారణ గురించి తెలుసుకోవాలంటే పాణినీయ శిక్ష ఎంతగానో ఉపకరిస్తుంది.

**2. వ్యాకరణం:** దీని కర్త కూడా పాణిని మహర్షే. ఇతడు రచించిన అష్టాధ్యాయి ప్రపంచ ప్రసిద్ధిని పొందింది. సూత్రరూపంలో ఉన్న ఈ గ్రంథం దోషాలు లేని, పద ప్రయోగాల గురించి, భాషగురించీ తెలియజేస్తుంది. **'వ్యాక్రియంతే శబ్దాః అనేన ఇతి వ్యాకరణమ్'.** వేదాలలోని శబ్దాలను వ్యాకరించి, సాధు-అసాధు ప్రయోగాలను తెలియజేసే శాస్త్రం.

**3. ఛందస్సు:** పింగళుడు అనే మహర్షి 8 అధ్యాయాల గ్రంథాన్ని రచించాడు. వేదమంత్రాలకు సంబంధించిన ఛందాలే కాక లౌకిక ఛందాలు కూడా ఇందులో ప్రస్తావించాడు.

**4. నిరుక్తం:** ఈ శాస్త్రానికి కర్త యాస్కుడు. వేదమంత్రాలలో ఉన్న పదాలకు సంబంధించి పుట్టుపూర్వోత్తరాలు, వ్యుత్పత్తులు తెలిపే శాస్త్రం ఇది. పదాలన్నింటికీ ధాతు, ప్రత్యయ విభాగంచేసి అర్థాలు తెలుసుకొనే పద్ధతికి ఆద్యుడు యాస్కుడే!

**5. జ్యోతిషం:** వేదాలలో చెప్పిన యజ్ఞాలు చేయడానికి కాలనిర్ణయం అత్యంత ఆవశ్యకమైనది. వాటిని వివరించే శాస్త్రం ఇది. లగధుడు, గర్గుడు మొదలైన వాళ్ళు ఈ శాస్త్ర నిర్మాతలు.

**6. కల్పం:** యజ్ఞయాగాదుల విధివిధానాలను తెలిపే శాస్త్రం ఇది. వాటిలో ఉన్న భేదాలు మొదలైన అంశాలను కల్పం వివరిస్తుంది. అశ్వలాయనుడు మొదలైన వాళ్ళు కల్పసూత్రాలు రచించారు.

వేదాలలో ఉన్న అంశాలను విపులంగా అందించడానికి వేదాంగాలు ఎంతగానో దోహదపడతాయి.

✦ ✦ ✦

# వేదసూక్తాలు

వేదవాఙ్మయంలో ప్రధానమైవి సూక్తాలు. ఇవి మానవుణ్ణి శ్రద్ధాళువుగా మేధ కలవాడిగా, సత్సంకల్పధారిగా తయారుచేస్తాయి.

**1. శ్రద్ధాసూక్తం:** ఋగ్వేదంలోని 10వ మండలంలో ఉన్న ఈ సూక్తం పరమాత్మ గురించి తెలియజేస్తుంది. కర్మాచరణలో శ్రద్ధకు ఉన్న ప్రాధాన్యాన్ని ఈ సూక్తం వివరిస్తుంది. **'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'.** శ్రద్ధ గలవాడికే జ్ఞానం లభిస్తుంది. హోతకు శ్రద్ధ ఉంటేనే యాగాగ్ని ప్రజ్జ్వరిల్లుతుంది. అతడి శ్రద్ధతోనే ఆహుతులు సమర్పించ-బడతాయి **(ఓం శ్రద్ధయాగ్నిః సమిధ్యతే, శ్రద్ధయా హూయతే హవిః).** భగవంతుడి శిరస్సులో ఉన్న శ్రద్ధను మంత్రాలతో మనం ఇలా ఆరాధిస్తాం. ఓ శ్రద్ధా! యజ్ఞాన్ని చేయించే యజమాని కోరికలను నెరవేర్చు. నిన్ను త్రికాలాలలోనూ ఆరాధిస్తాం. దయచేసి మాకు శ్రద్ధను ప్రసాదించు' అని.

**2. మేధాసూక్తం:** కృష్ణయజుర్వేదానికి చెందిన తైత్తిరీయ ఆరణ్యకంలోని ఈ సూక్తం బుద్ధి వికాసానికి ఉపకరిస్తుంది. మంగళప్రదమై అంతటా వ్యాపించి ఉండే మేధాదేవిని అంటే బుద్ధి స్వరూపిణిని - అమ్మా! నువ్వు వచ్చేవరకూ మేం వ్యర్థ ప్రసంగాలతో కాలం గడుపుతున్నాం. నీ రాక వల్ల నీ దయతో మేం బుద్ధివికాసాన్ని పొందుతాం. నీ దయ పొందినవాడు ఋషి అవుతాడు. బ్రహ్మజ్ఞాని, వాక్చాతుర్యం కలవాడు కూడా అవుతాడు. కాబట్టి మాకు ఐశ్వర్యాన్ని ప్రసాదించు తల్లీ! అని వేడుకోవడం కన్పిస్తుంది ఈ సూక్తంలో. మేధాదేవి అయిన సరస్వతినీ, అశ్వినీదేవతల్ని బుద్ధికి అధిదేవతలుగా ఆరాధించడమే కాక పరమాత్మను మేధాస్వరూపుడిగా భావించి - **'ఓం హంస హంసాయ విద్మహే మహా హంసాయ ధీమహి తన్నో హంసః ప్రచోదయాత్'**

అని ఉపాసించడం ఈ సూక్తంలోని ప్రధానాంశం. సనాతన ధర్మాన్ని ఆచరించాలంటే శ్రద్ధతో పాటు మేధ కూడా ఉండాలి. కాబట్టి ఆ మేధను ప్రసాదించే దేవతలలో సరస్వతి - దక్షిణామూర్తి - హయగ్రీవుడు ప్రముఖులు. వారిని ఆరాధించి మేధను పొంది ధర్మాన్ని చక్కగా ఆచరించాలి.

**సంకల్ప సూక్తం:** శుక్లయజుర్వేదం వాజసనేయ సంహితలో ఉన్న ఈ సూక్తం సంకల్ప ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తుంది. ఏ పనైనా సాధించాలంటే సంకల్పం శుద్ధంగా ఉండాలి.

అప్పుడే ఆ సంకల్పం సిద్ధిస్తుంది. మనసుకు సత్సంకల్పాలు చేసేలా ప్రేరణ లభించాలనీ ఆ శక్తిని ప్రసాదించమని పరమాత్మను వేడుకోవాలని ఈ సూక్తం తెలియజేస్తుంది.

**శక్తి సూక్తం:** శుక్ల యజుర్వేదంలోని సూక్తం ఇది. **'శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్'** శరీరం ఉంటేనే ధర్మాన్ని సాధించడం కుదురుతుంది. అందువల్ల ఆ శక్తిని సంపాదించే మార్గం అందరూ తెలుసుకోవాలి. ఇక్కడ శక్తి 1. శారీరక, 2. మానసిక భేదాలతో రెండు రకాలు. ఈ రెండూ మనిషికి అవసరమైనవే. ఆత్మ, వీర్య, బల, ఓజః ధృతి, సహన శక్తులు ప్రసాదించమని భగవంతుణ్ణి ఈ సూక్తం ద్వారా వేడుకోవాలి.

**సంవసన సూక్తం:** ఋగ్వేద దశమ మండలంలో ఉన్న సూక్తం ఇది. 'సంవసనం' అంటే అందరికీ సంబంధించిన సంకల్పం. సామాజిక శ్రేయస్సును ఆకాంక్షించి చేసే సంకల్పం అన్నమాట. **'ఓం సంసమిద్యువసే వృషన్నగ్నే....'** అని ప్రారంభమయ్యే ఈ సూక్తం – 'అగ్నిదేవా! ఈ సృష్టిలో ఉన్న సకలప్రాణులకూ ఐకమత్యం, తరగని సంపదలు అనుగ్రహించు' అని వేడుకొంటుంది.

**అక్షీభ్యాంతే సూక్తం:** ఋగ్వేదంలోని 10వ మండలంలో ఉన్న ఈ సూక్తం మానవుల ఆరోగ్యాన్ని వృద్ధిపొందించేందుకు ఉద్దేశించిన సూక్తం. వ్యాధిగ్రస్తులైన వారుగానీ, వారి పక్షాన మరొకరుగానీ ఈ సూక్తాన్ని పఠిస్తే ఆ రోగం నయమైపోతుంది.

'నేను నా సంకల్పంతో నీ శరీరంలో ఉన్న సర్వావయవాలలోని రోగాలన్నింటినీ సమూలంగా నాశనం చేస్తాను' అన్నట్లు సాగే ఈ సూక్తం ఎంతో గొప్పది. నిష్కల్మషమైన మనస్సుతో, పరోపకారబుద్ధితో శ్రద్ధగా ఈ సూక్తం చదివితే సత్వరఫలితాలు ఉంటాయి.

**శాంతి సూక్తం:** అథర్వవేదంలోని ఈ సూక్తం బహిరంగ, అంతరంగ శాంతుల్ని ప్రసాదించమని కోరుకున్నట్లు సాగుతుంది. ప్రపంచంలో అంతటా శాంతి నెలకొనాలనీ, జీవితం ప్రశాంతంగా గడచిపోవాలనీ, అనర్థాలు తొలగిపోవాలనీ పంచభూతాలూ ప్రశాంతంగా ఉండాలనీ ఈ సూక్తం ఆకాంక్షిస్తుంది.

**సౌమనస్య సూక్తం:** అథర్వవేదంలోని ఈ సూక్తం – మానవులు పరస్పరం ప్రేమానురాగాలతో వర్ధిల్లాలని ప్రబోధిస్తుంది. మానవులంతా సహృదయులు, ద్వేషరహితులు, మంచి మనస్సుతోనూ, ఒకే మనస్సుతోనూ ఉండాలనీ ఐకమత్యంతో మెలిగినప్పుడే సద్ధర్మాచరణ సాధ్యమవుతుందనీ ఈ సూక్తం తెలియజేస్తుంది.

✦ ✦ ✦

# పురాణాలు

వేదాలను ప్రభుసమ్మితాలు అనీ, పురాణాలను మిత్రసమ్మితాలు అనీ, కావ్యాలను కాంతాసమ్మితాలు అనీ వ్యవహరిస్తారు. వేదాలు రాజు ఆజ్ఞలు జారీచేసినట్లు జారీచేస్తాయి. కానీ పురాణాలు మిత్రుడిలా హితవు పలుకుతాయి. వేదస్మృతులు బోధించిన సనాతన ధర్మాన్నీ, సనాతనుడైన భగవంతుడి వివిధ రూపాలను, అవతారాలనూ, పంచస్వరూపాలనూ మంచిమంచి కథల రూపంలో చెప్తుంటాయి పురాణాలు. అంటే మానవుడు అనుసరించవలసిన ధర్మాన్ని ఎంతో సరళంగా బోధిస్తాయి. వేదంలో ఉన్న విషయాన్నే పెంచిపోషించడం వల్ల వీటికి **వేదోపబృంహణాలు** అనిపేరు. ఇవి 18.

**మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయం,**
**అనాపలింగ కూస్కాని పురాణాని పృథక్ పృథక్.**

మద్వయం = మత్స్య, మార్కండేయ, భద్వయం = భవిష్య, భాగవత, బ్రత్రయం = బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, వచతుష్టయం = వాయు, వామన, విష్ణు, వరాహ, అ = అగ్ని, నా = నారద, ప = పద్మ, లిం = లింగ, గ = గరుడ, కూ = కూర్మ, స్కా = స్కాంద పురాణాలు. ఇందులో సాత్త్విక, రాజస, తామస పురాణాలని భేదం కూడా ఉంది. ఇవేకాక మరో 18 ఉపపురాణాలు కూడా ఉన్నాయి. వీటిని రచించిన వాడు వేదవ్యాస మహర్షి. విష్ణుపురాణకర్త మాత్రం పరాశర మహర్షి. పురాణాలు పాతకాలానికి చెందినవైనా నేటికీ కొత్తగా భాసిస్తాయి.

**ఇతిహాసాలు:** శ్రుతి–స్మృతి గ్రంథాలలో చెప్పిన ధర్మాన్ని, సదాచారాన్ని చారిత్రక కథ రూపంలో చెప్తే దానికి 'ఇతిహాసం' అని పేరు. ఇతిహాసం అంటే 'ఇలా జరిగింది' అని అర్థం. మహాభారతం, రామాయణం రెండూ ఇతిహాస గ్రంథాలు. **'రామో విగ్రహవాన్ ధర్మః'** రాముడు మూర్తీభవించిన ధర్మం, మానవ, దానవ, వానర సంస్కృతులకూ, ధర్మాలకూ నిలయమై ఈ నాటికీ భారతీయ సనాతన ధర్మాచరణకు తార్కాణంగా నిలుస్తుంది శ్రీమద్రామాయణం. దీనికర్త వాల్మీకి మహర్షి పాత్రల మనోభావాలను ఆకళింపు చేసుకొని వారిని ఆదర్శవంతులుగా తీర్చిదిద్దాడు.

**'వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే,**
**వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా'.**

సాక్షాత్తూ వేదమే శ్రీమద్రామాయణంగా అవతరించిందంటే అంతకంటే రామాయణ ప్రాశస్త్యం ఇంకేం చెప్పగలం?

ఇక వేదవ్యాస మహర్షి రచించిన **'మహాభారతమ్'** పంచమ వేదంగా ప్రసిద్ధి పొందింది. 'జయ సంహిత' పేరుతో ఆవిర్భవించిన ఈ గ్రంథం, ఆఖ్యానోపాఖ్యానాల విస్తృతితో మహాభారతం అయ్యింది. భారతాన్ని ఎవరికి వారు ఇది మా గ్రంథం అని చెప్పుకోవడాన్ని బట్టి దాని ప్రాశస్త్యం మనకు తెలుస్తోంది. 18 పర్వాలు కల మహాభారతంలో ధర్మార్థకామమోక్షాలకు సంబంధించిన ప్రతి అంశమూ ఉంటుంది. దానినే –

**'యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్'** అని చెప్తారు. 'భారతంలో లేనిది వేరెక్కడా లేదు. లోకంలో ఉన్నదంతా భారతంలో ఉంది. ఇందులో లేనిది మరెక్కడా కన్పించదు' అని దీని అర్థం.

వేదవ్యాసుడు ఆయా పాత్రల ద్వారా చెప్పిన ధర్మాలు విశ్వజనీనమైనవి. శ్రీకృష్ణుడు, భీష్ముడు, విదురుడు చెప్పిన ధర్మాచారాలు ఎంతో విలువైనవి. నేటికీ అందరూ ఆచరించదగినవి కూడా.

✦ ✦ ✦

# సృష్టిధర్మాలు

సనాతనధర్మానికి మూలస్కంధమైన వేదవాఙ్మయం గురించి తెలుసుకున్నాం కదా! సమస్త ధర్మాలకు ఆధారభూతమైన వేదవాఙ్మయమే సృష్టి ప్రారంభం గురించీ, యుగాల గురించీ, ఆయా యుగధర్మాల గురించీ తెలియజేసింది. మొట్టమొదట సృష్టిక్రమం గురించి బ్రహ్మ మానస పుత్రుడైన మనువు మహర్షులకు చెప్పాడు.

పూర్వం ప్రళయం సంభవించిన తర్వాత ఈ ప్రపంచం మొత్తం అంధకారంతో నిండిపోయింది. అప్పుడు పంచభూతాలను సృష్టించాలనుకున్నాడు పరమాత్మ. అందుకని ముందుగా తన శరీరం నుండి జలాన్ని సృష్టించాడు. ఆ తరువాత మహత్తు మొదలైనవాటిని సృష్టించడం కోసం తన బీజాన్ని ఉంచాడు. అదే నీటిలో బ్రహ్మాండంగా మారింది. దానినుండి చతుర్ముఖ బ్రహ్మ ఉద్భవించాడు.

నీటికి 'నారములు' అని పేరు. ఈ నీళ్ళు 'నరుడు' అని ప్రసిద్ధి చెందిన పరమాత్మ వల్ల సృష్టించబడ్డాయి కాబట్టి అవి ఆయనకు సంతానం. నీటికి నిలయంగా కలవాడు కాబట్టి నారాయణు డయ్యాడు పరమాత్మ. ఆ పరమాత్మే ఈ చరాచర సృష్టి గావించాడు.

బ్రహ్మదేవుడు బ్రహ్మాండంలో ఒక సంవత్సరకాలం ఉన్నాడు. చివరికి తన ధ్యాన శక్తితో ఆ అండాన్ని రెండు ముక్కలు చేశాడు. అందులోని పైభాగం స్వర్గం, కింది భాగం భూమి అయ్యింది. ఈ రెండు భాగాల మధ్య ప్రదేశంలో ఆకాశాన్ని, అష్టదిక్కుల్ని, సముద్రాన్ని సృష్టించాడు. ఆ తరువాత అహంకారాన్నీ, ఆ తరువాత మనస్సునూ సృష్టించాడు. ఆ తరువాత చరాచరసృష్టి చేసి, సకల జీవుల్నీ సృష్టించి వాటికి తగిన పేర్లు పెట్టి వృద్ధిచెందేలా చేశాడు.

తరువాత పరమాత్మ లోకవృద్ధికోసం తన ముఖం నుండి బ్రాహ్మణులను బాహువులనుండి క్షత్రియులను, తొడలనుండి వైశ్యులను, పాదాలనుండి శూద్రులను సృష్టించాడు.

ఈ విధంగా బ్రహ్మదేవుడు సమస్త ప్రపంచాన్ని సృష్టించాక, కొంతకాలం గడిచాక, దాన్ని నశింపచేసి తాను కూడా నశించిపోతాడు. బ్రహ్మ మెలకువగా ఉన్నప్పుడు ఈ

ప్రపంచం జీవించి ఉంటుంది. ఆయన నిద్రపోయినప్పుడు లయమై పోతుంది. దీన్నే ప్రళయం అంటారు.

భూలోకంలో నాలుగు వర్ణాల జనులు ఆచరించవలసిన ధర్మాలను మొట్టమొదట మనువు ఉపదేశించాడు. అలాంటి మనువులు 14 మంది. ప్రస్తుతం వైవస్వత మన్వంతరం నడుస్తోంది.

ఇక కాలమానం విషయానికి వస్తే – కృతయుగం నాలుగు వేల, త్రేతాయుగం మూడువేల, ద్వాపరయుగం రెండువేల, కలియుగం ఒక వెయ్యి దివ్యయుగాల పరిధితో ఉంటాయి.

ఈ యుగాలకు ఆరంభంలోనూ, అంతంలోనూ సంధికాలాలు కూడా 4, 3, 2, 1 వందల దివ్యవర్షాలుగా నాలుగు యుగాలకూ ఉంటాయి. ఇవి మొత్తం కలిపితే నాలుగు యుగాల కాలపరిమాణం.

4800 + 3600 + 2400 + 1200 = 12 వేల దివ్య సంవత్సరాలు.

మానవుల నాలుగు యుగాలు కలిపితే దేవతలకి ఒక యుగం. వెయ్యి దేవతాయుగాలు గడిస్తే బ్రహ్మకు ఒక పగలు. మరో వెయ్యి గడిస్తే ఒక రాత్రి. ఇది తెలిసినవాణ్ణి మాత్రమే 'అహోరాత్ర విదుడు' అంటారు.

భూలోకంలో పన్నెండువేల దివ్య సంవత్సరాలతో కూడిన 71 యుగాలు గడిస్తే అది ఒక మన్వంతరం. ఇలాంటి మన్వంతరాలు ఎన్నో ఉన్నాయి.

✦ ✦ ✦

# యుగధర్మాలు

కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలపై నడుస్తుంది. ఆ కాలంలో ప్రజలు నీతిమంతులు, ధర్మాచరణ పరాయణులుగా ఉంటారు. తరువాత యుగాలలో ఒక్కోపాదం తగ్గుతూ వస్తుంది. మానవుల ఆయువు కూడా అంతే. కృతయుగంలో 400, త్రేతాయుగంలో 300, ద్వాపరయుగంలో 200, కలియుగంలో 100 సంవత్సరాల ఆయుఃపరిమాణం ఉంటుంది. కృతయుగంలో **'తపస్సు'**, త్రేతాయుగంలో **'జ్ఞానం'**, ద్వాపరంలో **'యజ్ఞం'**, కలియుగంలో **'దానం'** పరమ ధర్మాలు.

### కలియుగ లక్షణాలు

**జితోధర్మ హ్యధర్మేణ సత్యం చైవానృతేన చ,**
**జితాశ్చారైశ్చ రాజానః స్త్రీభిశ్చ పురుషాజితా.**

కలియుగంలో ధర్మం కన్నా అధర్మం, సత్యం కన్నా అసత్యం ప్రబలి ఉంటాయి. రాజుల్ని గూఢచారులు జయిస్తారు. పురుషుల కన్నా స్త్రీలు మానసికంగా బలవంతులై ఉంటారు.

**సీదన్తి చాగ్నిహోత్రాణి గురుపూజా ప్రణశ్యతి,**
**కుమార్యశ్చ ప్రసూయంతే తస్మిన్ కలియుగే సదా.** (పరాశర స్మృతి)

అగ్నిహోత్రాది కర్మలూ క్షీణిస్తాయి. అంటే యజ్ఞ యాగాదులపై ఆసక్తి తగ్గిపోతుంది. ప్రజలు అలసత్వంతో, మందబుద్ధితో, అల్పాయుష్కులై ఉంటారు. పెద్దలపట్ల గౌరవం తగ్గిపోతుంది. కౌమారంలో ఉన్న స్త్రీలు అంటే బాలికలు గర్భాన్ని ధరిస్తారు. పిల్లల్ని కంటారు.

కృతయుగంలో మనుషుల ప్రాణాలు ఎముకల్లోనూ, త్రేతాయుగంలో మాంసం లోనూ, ద్వాపరయుగంలో నెత్తురులోనూ ఉంటే కలియుగంలో అన్నపానాదుల్లో ఉంటాయి. అంటే కలియుగంలో అందరూ అన్నంపైనే ఆధారపడి జీవిస్తారని.

ఏ యుగంలో చెప్పిన ధర్మాలను ఆ యుగాన్ని అనుసరించి అందరూ ఆచరించాలి.

✦ ✦ ✦

# శిష్టాచారాలు

శిష్టులు ఆచరించే వాటిని శిష్టాచారాలు అంటారు. **'శిష్టులు'** అంటే కూడి ఉండినవాళ్ళు అని అర్థం. అంటే సర్వకాల సర్వావస్థలలోనూ ధర్మం తప్పకుండా పెద్దల నుండి సంక్రమించిన ధర్మాలను ఆచరించే ఆదర్శపురుషులు.

శిష్టులు ఆచరించే వాటిని సామాన్యులు అర్థం చేసుకోవడం చాలా కష్టం. అసలు ధర్మమే పరమగహనమైనది. సూక్ష్మమైనది కూడా. దేశకాల పరిస్థితులకు అనుగుణంగా శిష్టులు ఆచరించి చూపించిన వాటిని జాగ్రత్తగా పరిశీలిస్తే తప్ప ధర్మ సూక్ష్మాలు అర్థం కావు (ఆపస్తంభ. 1-4-8). కొన్ని కొన్ని జాతుల్లో కులాల్లో రకరకాల ఆచారాలు ఉంటాయి. అయితే అవి కూడా వేదానికి విరుద్ధమైనవైతే ఆచరించకూడదు. (గౌతమ. 11-20)

బ్రాహ్మణుడు ఎంతగొప్ప వేదపండితుడైనా ఆచారాల్ని సక్రమంగా పాటించకపోతే తేజస్సునూ, గౌరవాన్నీ కోల్పోతాడు. వేదాధ్యయనం చేసిన ఫలితాన్ని పూర్తిగా పొందలేడు.

బ్రాహ్మణుడికి ఉద్దేశించిన ధర్మాలలో ఆచరణయోగ్యమైన వాటిని సదాచార సంపన్నుల సూచనమేరకు అన్ని వర్ణాలవారూ ఆచరించవచ్చు. శూద్రులు కూడా పంచమహాయజ్ఞాలను ఆచరించవచ్చు. ఆచరణ లేకుండా కేవలం ఉపదేశాలుగా ఉంటే దానివల్ల ప్రయోజనం లేదు. **ఆచార సంభవో ధర్మో వేదాః ప్రతిష్ఠితాః, వేదైర్యజ్ఞాః సముత్పన్నా యజ్ఞైః దేవాః ప్రతిష్ఠితాః.** (మహాభారతం-వనపర్వం)

ధర్మం పరిఢవిల్లేది పవిత్రమైన ఆచారం వల్లనే! ఈ ధర్మంలోనే వేదాలు సుప్రతిష్ఠితాలు అవుతున్నాయి. ఆ వేదాలనుండి యజ్ఞాలు ప్రకటించబడుతున్నాయి. యజ్ఞం లేకపోతే దేవతల స్థితి ఉండదు. దీనినిబట్టి ధర్మం, వేదం, యజ్ఞం, దేవతలకు ఆధారం. అవి శిష్టుల నిష్ఠపై వ్యవస్థితమై ఉంటాయి.

శిష్టాచారం వల్ల కీర్తి, సంస్కారం, పరిశుద్ధత, ఔజ్జ్వల్యం, నిర్వికారత్వం మొదలైనవి లభిస్తాయి. ఇహపర సాధకం శిష్టాచారమే!

దీర్ఘాయువు, వ్యక్తిశ్రేయస్సు, లోకశ్రేయస్సు ఆకాంక్షించే వారందరూ ధర్మాన్ని ఆచరించి జీవించాలని శిష్టులు తాము ఆచరించి లోకానికి దారి చూపుతున్నారు.

ఇటువంటి శిష్టాచారాలు వివిధ దశలలో మానవుడు ఎలా ఆచరించాలో మన ఆర్ష వాఙ్మయం తెలియజేస్తోంది. వాటిని తెలుసుకొని సనాతనధర్మ పరిరక్షణకు నడుంకట్టడమే మనందరి కర్తవ్యం!

✦ ✦ ✦

# వర్ణధర్మాలు

**బ్రాహ్మణోఽ స్య ముఖమాసీత్ । బాహూ రాజన్యః కృతః,**
**ఊరూతదస్య యద్వైశ్యః । పద్భ్యాగ్ం శూద్రో అజాయత.** (ఋగ్వేదం 10-90)

విరాట్ పురుషుడైన పరమాత్మ ముఖం నుండి బ్రాహ్మణులు, బాహువుల నుంచి క్షత్రియులు, ఊరువుల (తొడలు) నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు పుట్టారు.

**బ్రాహ్మణ ధర్మాలు –** వేదాధ్యయనం చేయటం, శిష్యులతో చేయించటం, నిత్యం పంచమహాయజ్ఞాలు చేయటం, యజ్ఞయాగాది క్రతువులు చేయించటం, ఇతరుల నుంచి దానాల్ని స్వీకరించటం, ఇతరులకి స్వయంగా దానాలు చేయటం.

**క్షత్రియ ధర్మాలు –** తన పాలనలో ఉన్న ప్రజల్ని రక్షించటం, స్వయంగా దానాలు చేయటం, యజ్ఞయాగాది క్రతువుల్ని ప్రజాక్షేమం కోసం చేయటం, చేయించటం, వేదశాస్త్ర అధ్యయనం చేయటం, చెడ్డ విషయాలమీద వ్యామోహాన్ని పెంచుకోకుండా ఉండటం.

**వైశ్య ధర్మాలు –** పశుపోషణ చేయటం, వ్యవసాయం చేయటం, దానాలు చేయటం, యజ్ఞాలు చేయించటం, చేయటం, వేదశాస్త్రాధ్యయనం చేయటం, వడ్డీవ్యాపారాన్ని చేయటం అనే ధర్మాల్ని ఆచరించాలి.

**శూద్ర ధర్మాలు –** అసూయ లేకుండా బ్రాహ్మణ క్షత్రియ వైశ్యవర్ణాల వారికి సేవచేయటం.

భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ – **"చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణ కర్మ విభాగశః"** (గీత. 4-13). "బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణాల వారినీ వారు చేసే కర్మల్నీ, వారికున్న గుణాల్ని అనుసరించి నేనే సృష్టించాను" అని చెప్పాడు.

చేసే వృత్తులను అనుసరించి మాత్రమే వర్ణ విభజన జరిగింది. విప్రులు శారీరక కాయకష్టం చేయలేరు. కాబట్టి వేదశాస్త్రాల ద్వారా అధ్యయనం చేసి, సనాతన ఋషిధర్మాన్ని లోకంలో ప్రచారం చేస్తారు కాబట్టి వారికి ముఖస్థానం జన్మస్థలం. ఇక క్షత్రియులు తమ భుజబలాన్ని ప్రదర్శించి దేశాన్నీ ప్రజల్నీ కాపాడతారు కాబట్టి భుజాలు, వైశ్యులు వివిధరకాల వ్యాపారాలు నిర్వహిస్తారు కాబట్టి ఊరువులు, శూద్రులు పైనాలుగు వర్ణాల వారికీ తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తూ, తమతో పాటూ మూడువర్ణాల వారికీ ఆధారంగా ఉంటారు కనుక పాదాలు జన్మస్థానాలు అయ్యాయి.

వర్ణాలు, జాతులు, కులాలు అనేవి శరీరానికేగానీ ఆత్మకు కాదు. సర్వాంతర్యామి అయిన ఈశ్వరుడు సకల జీవుల హృదయాలలో ఉండి, తన మహిమతో వాళ్ళందర్నీ కీలుబొమ్మలలాగా నడిపిస్తూ ఉంటాడు (భగవద్గీత).

పుట్టుకతో ప్రతివ్యక్తీ శూద్రుడే కానీ వీళ్ళలో ఎవరైతే వేదాధ్యయనం చేస్తాడో వాడే విప్రుడవుతాడు! బ్రహ్మ జ్ఞానాన్ని పొందటం ద్వారా బ్రాహ్మణుడవుతాడు. బ్రహ్మజ్ఞానం అంటే అన్నిటా పరమాత్మని (పరబ్రహ్మని) దర్శించ గలగటం. **'సర్వం ఖల్విదంబ్రహ్మ'** అన్న వేదవాక్యాన్ని ఆచరణాత్మకంగా చూపించటం. కేవలం బ్రాహ్మణుడై జన్మించినంత మాత్రాన, బ్రహ్మజ్ఞానం పొందలేకపోతే అతడు ఎప్పటికీ నిజమైన బ్రాహ్మణుడు కాలేడు.

బ్రాహ్మణత్వం ప్రాప్తించటానికి కేవలం జన్మసంస్కారం, శాస్త్రజ్ఞానం, సంతతి ఇవి మాత్రమే కారణం కాదు. సదాచారం మాత్రమే బ్రాహ్మణత్వానికి కారణం.

దీన్నిబట్టి వర్ణ విభాగం అనేది పుట్టుకని బట్టికాదు గుణకర్మల్ని అనుసరించే చేయబడిందని స్పష్టంగా తెలుస్తోంది.

✦ ✦ ✦

# సామాన్య ధర్మాలు

సమాజంలో ఉన్న నాలుగు వర్ణాలవారు ఆచరించాల్సిన ధర్మాలివి.

**శ్లో॥ అహింసా సత్యమస్తేయం శౌచమింద్రియ నిగ్రహః,**
**ఏతం సామాసికం ధర్మం చాతుర్వర్ణ్యేఽబ్రవీన్ మనుః.** (మనుస్మృతి)

అహింస, సత్యం, అస్తేయం (దొంగతనం చేయకపోవటం) శౌచం, ఇంద్రియ నిగ్రహం అనే ధర్మాలు నాలుగువర్ణాల వారూ ఆచరించాల్సిన సామాన్యధర్మాలు.

అహింస, అస్తేయం, కామం లేకపోవటం, కోపం లేకపోవటం, లోభం లేకపోవడం అన్ని ప్రాణుల మీదా ప్రీతి (మానవులు, పశుపక్ష్యాదులు) అంటే అన్ని భూతాలకి హితం చేయాలనే కోరిక ఇవి మానవులందరూ ఆచరించాల్సిన ధర్మాలు అని భాగవతం చెబుతుంది.

కోపం లేకపోవటం, సత్యాన్నే మాట్లాడటం, తన భార్యతోనే కాపురం చేయటం, పవిత్రంగా ఉండటం, ఎవరికీ ద్రోహం చేయకపోవటం అనే ధర్మాలు అన్ని వర్ణాలవారూ ఆచరించాల్సినవే అని మహాభారతం చెబుతుంది.

బ్రాహ్మణులు జ్ఞానవంతులైతే, క్షత్రియులు భుజబలం ఉంటే గొప్పవారౌతారు. వైశ్యులు ధనధాన్యాది సంపదలు ఉంటే గొప్పవారవుతారు. శూద్రులు మాత్రం ఇవేవీ లేకపోయినా జన్మతోనే గొప్పవారు. ఎందుకంటే శూద్రుల కృషి (వ్యవసాయం) తోనే పై మూడు వర్ణాలవారి అభివృద్ధి ఆధారపడి ఉంటుంది కాబట్టి. (మనుస్మృతి 2-155)

**శ్లో॥ కర్మభిః శుచిభిర్దేవి శుద్ధాత్మా విజితేంద్రియః,**
**శూద్రోఽపి ద్విజవత్ సేవ్య ఇతి బ్రహ్మాబ్రవీత్ స్వయం.**

శూద్రుడైనప్పటికీ జితేంద్రియుడై పవిత్రమైన కర్మల్ని (దానం, తపస్సు) ఆచరిస్తూ తన మనస్సుని పవిత్రం చేసుకుంటే, అతడు కూడా ఉత్తమ బ్రహ్మజ్ఞాని (బ్రాహ్మణుడు) లాగా పూజనీయుడవుతాడు. ఇది సాక్షాత్తు బ్రహ్మదేవుడి మాట. శూద్రుడి స్వభావం

ఉత్తమంగా ఉంటే అతడు ద్విజాతి వారికన్నా (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు) ఎంతో గొప్పగా గౌరవించదగినవాడవుతాడని అంటోంది మహాభారతం.

మనుస్మృతి నాలుగు వర్ణాల వారు పాటించాల్సిన సాధారణ ధర్మాలు తెలియజేసింది.

తినే ఆహారాన్ని పూజించాలి. అసహ్యపడకుండా తినాలి. ఆహారాన్ని అందించినవాడిని అభినందించాలి ఎంగిలి ఆహారాన్ని ఎవరికీ పెట్టకూడదు. తినకూడదు. అధికంగా ఆహారం తినకూడదు. అది ఆరోగ్యానికి భంగం కలిగిస్తుంది. నడుస్తూ తినకూడదు.

విద్యారంభంలో, విద్య పూర్తయిన తరువాత (ప్రతిరోజూ) శిష్యుడు గురువుగారి పాదాలకి నమస్కరించాలి. గురువు కుడిపాదాన్ని కుడిచేత్తో, ఎడమపాదాన్ని ఎడమచేత్తో తాకి నమస్కరించాలి.

బుద్ధిమంతుడైన వాడు తనకి విషయాలు తెలిసినప్పటికీ అడగకుండా ఎవ్వరికీ చెప్పకూడదు. (ఉచిత సలహాలు ఇవ్వకూడదు. విద్యను యోగ్యమైనవాడికే చెప్పాలి గానీ, అయోగ్యుడికి చెప్పకూడదు. ధనం, బంధుత్వం, కార్యాచరణ, చదువు అనేవి ఒకదానికన్నా ఒకటి గొప్పవి. విద్యార్థి గురువుకన్నా ముందే నిద్రలేవాలి. గురువు గారు పడుకున్న తరువాతే తాను పడుకోవాలి. గురువుని, తల్లిని, తండ్రిని, అన్నని ఎంత కష్టసమయంలో కూడా అవమానించకూడదు. మంచిని బోధించే విద్యని చిన్నవాడి నుంచైనా గ్రహించాలి.

బండి మీద (వాహనం) వెళ్ళే వాళ్ళకి, వృద్ధులకి, రోగులకి, బరువులు మోసేవాళ్ళకి, స్త్రీలకి, రాజుకి, స్నాతకవ్రతం చేసి వచ్చేవాడికి, వివాహం కోసం వెళ్ళే వాళ్ళకి తప్పుకుని దారినివ్వాలి.

పితరుల్ని, వసువులని, పితామహుల్ని, రుద్రులని, ప్రపితామహుల్ని (తాతల్ని) ఆదిత్యులుగా భావించాలని వేదం చెబుతుంది.

సూర్యుణ్ణి ఉదయిస్తున్నప్పుడు, అస్తమిస్తున్నప్పుడు, గ్రహణం పట్టినప్పుడు, ఆకాశం మధ్యలో ఉన్నప్పుడు చూడకూడదు. వర్షం కురుస్తున్నప్పుడు పరుగెత్తకూడదు. తన నీడని (ప్రతిబింబాన్ని) నీళ్ళలో చూడకూడదు.

ఋతిమతి అయిన స్త్రీతో సంభోగించకూడదు. తేజస్సు, ప్రజ్ఞ, బలం, చూపు, ఆరోగ్యం, ఆయుష్షు నశిస్తాయి. తుమ్ముతున్నప్పుడు, ఆవులిస్తున్నప్పుడు, విశ్రాంతిగా యథేచ్ఛగా కూర్చున్నప్పుడు స్త్రీని చూడకూడదు. కాటుక పెట్టుకుంటున్నప్పుడు, అభ్యంగన స్నానం చేస్తున్నప్పుడు, వస్త్రాలు లేనప్పుడు, ప్రసవిస్తున్నప్పుడు స్త్రీని చూడకూడదు.

ఏకవస్త్రంతో భోజనం చేయకూడదు. భుజం మీద ఒక తుండైనా ఉండాలి. వస్త్రం లేకుండా పూర్తి దిగంబరంగా స్నానం చేయకూడదు.

నలుగురూ నడిచేదారిలో మూత్రవిసర్జన చేయకూడదు. భస్మంలో, ఆవుల మందలో, పంటపొలాల్లో, చెరువులు, బావుల్లో, పర్వతాల మీద, శిథిల దేవాలయాల్లో, పుట్టల మీద, నదీతీరాల్లో, నడుస్తూ నిలబడి మూత్రవిసర్జన చేయకూడదు. పగటి కాలంలో ఉత్తరాభిముఖంగా, రాత్రికాలంలో దక్షిణాభిముఖంగా మలమూత్ర విసర్జన చేయాలి. అగ్నికి, సూర్యుడికి, చంద్రుడికి, నీటికి, ఆవులకి, గాలికి, ఎదురుగా కూర్చుని మలమూత్ర విసర్జన చేయకూడదు. అలా చేస్తే ప్రజ్ఞ నశిస్తుంది.

నోటితో ఊది అగ్నిని ఆర్పకూడదు. అగ్నిలో అశుచి పదార్థాలని వేయకూడదు. నిప్పుతో కాళ్ళు కాచుకోకూడదు.

సంధ్యా కాలంలో భోజనం, ప్రయాణం, నిద్ర పనికిరావు. భూమిని కాలితో గీకకూడదు. అశుచి పదార్థాలనూ, రక్తాన్నీ, విషాన్నీ నీటిలో కలపకూడదు. పాడుబడ్డ ఇళ్ళలో ఒంటరిగా నిద్రపోకూడదు. తనకన్నా పెద్దవారు నిద్రపోతుంటే మేల్కొల్పకూడదు. వరణం ఇవ్వకుండా యజ్ఞానికి ఋత్విక్కుగా వెళ్ళకూడదు. మేత మేస్తున్న ఆవుని బయటకి తోలకూడదు.

ఇంద్రధనుస్సుని తాను చూడవచ్చు తప్ప ఇతరులకి చూపకూడదు. అనవసరంగా కాళ్ళు చేతులు కదపకూడదు. భక్ష్యాలను (పిండివంటలు) తొడపై పెట్టుకుని తినకూడదు.

ఇతరులు ఉపయోగించిన వస్త్రాలు, పాదరక్షలు, యజ్ఞోపవీతం, పూలదండలు, కమండలం, ఆసనం ఉపయోగించుకోకూడదు. వెంట్రుకల్ని, గోళ్ళని కొరకకూడదు. నోటితో గోళ్ళని తీయకూడదు.

ఎలాంటి ప్రయోజనం లేకుండా మట్టిని తవ్వేవాడు, గడ్డిని కోసేవాడు, గోళ్ళని నమిలేవాడు అపవిత్రుడు.

సూర్యాస్తమయం అయిన తరువాత నూనెతో చేసిన పదార్థాలను తినకూడదు. దిగంబరంగా నిద్రపోకూడదు. అపవిత్రంగా ఎక్కడికీ వెళ్ళకూడదు.

భోజనం చేసేముందు కాళ్ళు రెండూ కడుక్కోవాలి. దీనివల్ల దీర్ఘాయువు.

అమావాస్య, చతుర్దశి, అష్టమి, పౌర్ణమి తిథులలో వేదాధ్యయనం చేయకూడదు.

• అంగవైకల్యంతో ఉన్నవాళ్ళని, ఎక్కువ అవయవాలు ఉన్నవాళ్ళని, చదువు లేనివాళ్ళని వృద్ధుల్ని, డబ్బు లేనివాళ్ళని అస్సలు అవమానించకూడదు.

1.వేట, 2. జూదం, 3. పగటినిద్ర, 4. పరనింద, 5.స్త్రీ వ్యసనం, 6.మదం (అహంకారం), 7. నృత్య గీతాల మీద అమితమైన ఆసక్తి, 8. అనవసరంగా సంచారం చేయటం. ఈ ఎనిమిదీ కామం వల్ల కలిగే వ్యసనాలు. 1. లోభం, 2.సాహసం, 3.ద్రోహం, 4. ఈర్ష్య, 5. అసూయ, 6. పరుల ధనాన్ని అపహరించటం, 7.కఠినంగా మాట్లాడటం, 8.దండపారుష్యం (పౌరుషంతో దండించటం) ఈ ఎనిమిదీ క్రోధం వల్ల కలిగే వ్యసనాలు. **సన్మార్గులు వీటిని విడిచిపెట్టాలి.**

గుణం లేకపోయినప్పటికీ స్వధర్మమే గొప్పది. గుణాలతో ఉన్నప్పటికీ పరులధర్మం ఆచరించతగినది కాదు. పరధర్మాన్ని ఆచరించినవాడు పతితుడవుతాడు.

ప్రాణానికి ఆపద కలిగినప్పుడు ఎక్కడైనా, ఎలాంటి ఆహారాన్నైనా తినవచ్చు.

బ్రాహ్మణ క్షత్రియులు వడ్డీవ్యాపారం చేయకూడదు. దైవధనాన్ని, బ్రాహ్మణుల ధనాన్ని లోభంతో అపహరించినవాడు, పరలోకంలో గ్రద్ద తినగా మిగిలిన దాన్ని తిని బ్రతుకుతాడు. నిత్యం కర్మానుష్ఠానం చేసేవాడు, శిష్యుల్ని పుత్రుల్ని కలిగి ఉన్నవాడు, ప్రాయశ్చిత్తాది ధర్మాల్ని చెప్పేవాడు అయిన సద్బ్రాహ్మణుణ్ణి నిందించకూడదు.

అల్పమైన దక్షిణలు ఇచ్చి యజ్ఞయాగాలు చేయకూడదు. ఇలా చేసిన యజ్ఞం సంపదల్ని, కీర్తిని, స్వర్గాన్ని, ఆయువుని, ప్రజల్ని, పశువుల్ని నశింప చేస్తుంది. దక్షిణ లేకుండా చేసిన యజ్ఞం యజమానిని నశింపచేస్తుంది.

పశ్చాత్తాపం చెందితే ఆ పాపం తొలగిపోతుంది. తెలిసీ తెలియక పాపాలు చేసినవాళ్ళు తిరిగి ఆ పాపాల్ని చేయకుండా ఉంటే పాపవిముక్తి పొందుతారు.

అయోగ్యుడి నుంచి దానం స్వీకరిస్తే నరకానికి వెళతారు. పాపం పోవాలంటే, మూడువేల సార్లు గాయత్రీమంత్రాన్ని జపించాలి.

వేదపండితుడు ఒక్కడు చెప్పినా అది ధర్మమే అవుతుంది. వేదం తెలియనివాళ్ళు (అజ్ఞానులు) పదివేల మంది చెప్పినా అది ధర్మంకాదు.

నీళ్ళు త్రాగుతున్న ఆవుని, పాలు త్రాగుతున్న దూడని నివారించకూడదు. మంచం క్రింద అగ్నిని పెట్టుకోకూడదు. నిప్పు పైనుంచి దాటకూడదు. నేలమీద కాలితో రాయకూడదు.

పూర్తిగా కడుపునిండా భోజనం చేయకూడదు. సగం కడుపుని పదార్థాలతో, పావుభాగం నీళ్ళతో నింపి, మిగిలిన పావుభాగాన్ని గాలి కోసం విడిచిపెట్టాలి. పగటి పూట కడుపునిండా అన్నం తిన్నవాడు రాత్రి తినకూడదు.

కంచుపాత్రలో కాళ్ళు కడుక్కోకూడదు. పగిలిన కుండలో విరిగిన పాత్రల్లో ఏ పదార్థాలు తినకూడదు. లేత ఎండని, శ్మశానం నుంచి వచ్చే పొగని, విరిగిపోయిన ఆసనాన్ని విడిచిపెట్టాలి.

అనవసరమైన మాటలు మాట్లాడకూడదు. బయటికి కనిపించేలా పూలదండలు ధరించకూడదు. గోవుల వీపుమీద కూర్చోకూడదు. రాత్రిపూట చెట్ల క్రింద పడుకోకూడదు. తన చెప్పుల్ని చేత్తో పట్టుకుని వెళ్ళకూడదు.

మంచం మీద కూర్చొని తినకూడదు. చేతిలో అన్నంముద్ద పెట్టుకుని కొద్దికొద్దిగా తినకూడదు. సూర్యాస్తమయం అయిన తరువాత నువ్వులతో చేసిన పదార్థాలు తినకూడదు. కాళ్ళు కడుక్కుని ఆ తడిసిన పాదాలతోనే భోజనం చేయాలి. అలా చేసినవాడు దీర్ఘాయుషుని పొందుతాడు.

తడికాళ్ళతో నిద్రపోకూడదు. ఈతకొడుతూ నదిని దాటకూడదు. వెంట్రుకలు, బూడిద, ఎముకలు, చిల్లపెంకులు, దూది, పుర్రె వీటిమీద నిలబడకూడదు. ఆయువు క్షీణిస్తుంది.

భోజనం చేస్తూ తలను ముట్టుకోకూడదు. ఎలాంటి అనారోగ్యం లేకపోతే ప్రతిరోజూ తలమీద నీళ్ళు పోసుకుని స్నానం చేయాలి. ఎంత కోపం వచ్చినా జుట్టు పట్టుకుని తలమీద కొట్టకూడదు.

జంతువుల్ని చంపి బ్రతికే కసాయివాడి దగ్గర, గానుగ ద్వారా నూనె తయారు చేసేవాడి దగ్గర, మద్యం విక్రయించేవాడి దగ్గర, వేశ్య దగ్గర దానం తీసుకోకూడదు.

వాడిన నలుగుపిండిని, ఇతరులు స్నానం చేసిన నీళ్ళని తిరిగి వాడకూడదు. మలమూత్రాలని, రక్తాన్ని, వాంతిని, శ్లేష్మాన్ని, ఉమ్మిని బుద్ధిపూర్వకంగా తొక్కకూడదు.

పాపకార్యాలు చేసి "వాటిని పోగొట్టుకోవటం కోసం చేస్తున్నాను" అనే సంకల్పంతో ధర్మకార్యాలు చేయకూడదు.

ఇతరులు త్రవ్వించిన చెఱువులో స్నానం చేసేవాడు, ఆ చెఱువులో నుంచి కనీసం ఐదు దోసిళ్ళ మట్టిని బయటపడేసి ఆ తరువాతే స్నానం చేయాలి.

ఆవు వాసనచూసి వదలి పెట్టిన అన్నాన్ని, వేశ్యలు వడ్డించే అన్నాన్ని, చద్ది అన్నాన్ని, సూతకంతో వండిన అన్నాన్ని, మర్యాద లేకుండా వడ్డించిన అన్నాన్ని, కృతఘ్నుడు పెట్టే అన్నాన్ని, మద్యాన్ని అమ్మేవాడు పెట్టే అన్నాన్ని తినకూడదు.

ప్రతి ఒక్కరూ 1. ఇష్టిని (హోమకుండంలో చేసే యాగాలు), 2. పూర్తాన్ని (తోటలు పెంచటం, చెఱువులు త్రవ్వించటం) శ్రద్ధగా ఆచరించాలి.

కట్టెలు, నీళ్ళు, ఫలాలు లాంటివి అయాచితంగా వస్తే తీసుకోవచ్చు. శయ్య (మంచం), గృహం, దర్భలు, సుగంధ ద్రవ్యాలు, నీళ్ళు, పుష్పాలు, మణులు, పెరుగు, మరమరాలు, పాలు లాంటివి అయాచితంగా ఇస్తే కాదనకుండా స్వీకరించాలి.

వెల్లుల్లి, నీరుల్లి, గోంగూర, పుట్టగొడుగులు బ్రాహ్మణులు తినకూడదు.

అతిథి పూజ చేస్తే ధనం, కీర్తి, ఆయుష్షు పెరుగుతాయి భోజనం కోసం (భోజన సమయానికి) వచ్చిన అతిథిని కులగోత్రాలు అడగకూడదు. సువాసినులు, బాలికలు, రోగులు, గర్భిణీ స్త్రీలు వుంటే వాళ్ళకి అతిథులకన్నా ముందే భోజనం పెట్టాలి. జ్ఞాననిష్ఠతో ఉన్న బ్రాహ్మణులనే శ్రాద్ధాది పితృకర్మల్లో నియమించుకోవాలి. శ్రాద్ధంలో మిత్రుల్ని భోక్తలుగా పిలువకూడదు.

దేవకార్యాలలో, పితృకార్యాలలో స్నేహితుల్ని భోక్తలుగా పిలుచుకుంటే వాళ్ళకి శ్రాద్ధ, పూజాఫలితం రాదు. శ్రాద్ధంలో వేదాధ్యయనం చేయనివాణ్ణి భోక్తగా పెట్టుకుంటే ఆ శ్రాద్ధం వ్యర్థమవుతుంది. గుణవంతుడు భోక్తగా దొరకని పక్షంలో మాత్రమే, మంచి స్నేహితుణ్ణి భోక్తగా నియమించుకోవచ్చు. బ్రాహ్మణులకి దేవకార్యం కన్నా పితృకార్యం చాలా ముఖ్యమైంది. పితృతర్పణాన్ని పవిత్రమైన నదీతీరాల్లో గానీ, అరణ్యాల్లో గానీ, ఏకాంత ప్రదేశాల్లోగానీ చేస్తే పితృదేవతలు సంతోషిస్తారు.

సరైన వయస్సులో తగిన వరుణ్ణితెచ్చి తండ్రి వివాహం చేయకపోతే, ఆ స్త్రీ తనకు యోగ్యుడైనవాణ్ణి పెళ్ళి చేసుకోవచ్చు. "పెద్దవాళ్ళని ధిక్కరించి పెళ్ళి చేసుకుంది" అన్న పాపం ఆ స్త్రీకి రాదు. అయితే స్వతంత్రించి వివాహం చేసుకున్న స్త్రీకి, తల్లి, తండ్రి, సోదరులకి చెందిన ఆభరణాలు, ఆస్తులు పొందటానికి అర్హత ఉండదు.

జ్యేష్ఠపుత్రుడు తన తరువాత పుట్టిన సోదరులందర్నీ తండ్రిలాగా చూసుకోవాలి. జ్యేష్ఠపుత్రుడు, ధర్మవంతుడైతే అతడి వంశం మొత్తం అభివృద్ధి చెందుతుంది. తన తల్లిదండ్రులు, పరివారం తిండికి లేక బాధలు పడుతుంటే పట్టించుకోకుండా దానాలు చేస్తే, అలాంటి దాతకి పాపం అంటుకుంటుంది.

✦ ✦ ✦

# తల్లి - తండ్రి - గురువు - అతిథి

తైత్తిరీయోపనిషత్తు - విద్యను పూర్తిచేసుకొని గృహస్థాశ్రమంలోనికి ప్రవేశిస్తున్న వారికి ఇలా హితబోధ చేస్తోంది.

**మాతృదేవోభవ :-** నువ్వు తల్లిని దేవతగా భావించేవాడివి కావాలి.

**పితృదేవోభవ :-** నువ్వు తండ్రిని దైవంగా భావించేవాడివి కావాలి.

**ఆచార్యదేవోభవ :-** నువ్వు గురువును దైవంగా భావించేవాడివి కావాలి.

తల్లి భూదేవి. తండ్రి ప్రజాపతి. గురువు పరబ్రహ్మ స్వరూపుడు. అన్ని వర్ణాల వారికీ ఇది వర్తిస్తుంది. వీళ్ళు ముగ్గురూ మూడు లోకాలు. గార్హస్థ్య, వానప్రస్థ, సంన్యాసాశ్రమాలూ వీరే! మూడు వేదాలూ వీరే! మూడు అగ్నులూ వీరే! వీరిలో తల్లి దక్షిణాగ్ని. తండ్రి గార్హపత్యాగ్ని. ఆచార్యుడు ఆహవనీయాగ్ని.

మాతృభక్తి ఉంటే భూలోకం, తండ్రిభక్తి ఉంటే అంతరిక్షం, గురుభక్తి ఉంటే బ్రహ్మలోకం ప్రాప్తిస్తాయి. ముగ్గుర్నీ సమానంగా గౌరవించిన వారు అన్ని ధర్మాల్నీ నిర్వర్తించిన వాళ్ళతో సమానం. వీళ్ళను అవమానిస్తే ఎన్ని ధర్మకార్యాలు చేసినా నిష్ప్రయోజనమైనవే. అందుకే వారికి జీవితాంతమూ ఋణపడి ఉండాలి. ఎంతకష్టమైనా సేవించాలి. అదే ప్రధాన ధర్మం. మిగిలినవన్నీ అప్రధానాలే!

**ఉపాధ్యాయాన్ దశాచార్యః ఆచార్యాణాం శతం పితా,**
**సహస్రం తు పితౄన్ మాతా గౌరవే ణాతిరిచ్యతే.** (మను. 2-145)

పదిమంది ఉపాధ్యాయులకన్నా ఒక ఆచార్యుడు, వందమంది ఆచార్యులకన్నా జన్మనిచ్చిన తండ్రి, వందమంది తండ్రులకన్నా జన్మనిచ్చిన తల్లి ఎంతో గొప్పది. అలాగే ఉపనయనం చేసి బ్రహ్మోపదేశాన్ని చేసే ఆచార్యుడు తండ్రికన్నా గొప్పవాడు.

తపస్సు, యాగం, తీర్థయాత్రలు, వ్రతాలు, నోములు చేయటం కన్నా గొప్పది తల్లిదండ్రుల సేవ. ఉత్తమగతులు దీనివల్లనే లభిస్తాయంటోంది పద్మపురాణం. తల్లిదండ్రుల సేవతోనే సమస్త తీర్థాలను, క్షేత్రాలను సేవించినఫలం లభిస్తుంది. దేవతానుగ్రహం లభిస్తుంది. తల్లిదండ్రులతో ప్రేమగా మాట్లాడిన వారి ఇంటిలో సిరి

నాట్యం చేస్తుంది. రోగగ్రస్తులైన తల్లిదండ్రులకు సేవచేస్తే శ్రీహరి కరుణించి వరాలు అనుగ్రహిస్తాడు. యోగులకు అందని వైకుంఠాన్ని ఇస్తాడు.

**యత్రయత్ర త్రయోలోకాః పవిత్రం తత్సమం భువి,**
**నాన్యదస్తి శుభాపాంగే తేనేద మభిరాద్యతే.**

వనవాసానికి వెళ్ళబోతూ శ్రీరాముడు సీతాదేవితో ఇలా అంటాడు – **తల్లి, దండ్రి, గురువు ప్రత్యక్ష దైవాలు. వీళ్ళను వదిలి కంటికి కన్పించని దేవతల్ని ఎందరిని సేవించినా ఫలితం ఉండదు. ఎవరిని పూజిస్తే ధర్మార్థకామాలు మూడూ లభిస్తాయో ముల్లోకాలనూ పూజించినంత ఫలం లభిస్తుందో అలాంటి తల్లి, తండ్రి, గురువులను మించిన దేవతలు ఈ భూమిపై వేరే లేరు.** కాబట్టి తల్లిదండ్రుల ఆజ్ఞల్ని పాటించడం కుమారుడి ధర్మం. ఈ ముగ్గురిలో తల్లికే అగ్రతాంబూలం.

**'న గాయత్ర్యాః పరో మంత్రః న మాతుః పరదైవతమ్'**

గాయత్రీ మంత్రాన్ని మించిన మంత్రమూ లేదు. తల్లిని మించిన దైవమూ లేదు. ఎందుకంటే కొడుకు ఎలాంటివాడైనా తల్లి ఒకేలా ప్రేమిస్తుంది. తల్లి లేని లోటు పూడ్చలేనిది. తల్లి ఉన్నంతవరకే ధైర్యం. మాతృవియోగం కలిగితే ధైర్యం కోల్పోయినట్లే. తల్లి ఉన్న సౌఖ్యం దేనితోనూ వెలకట్టలేనిది.

తల్లి జీవనాన్ని ప్రసాదిస్తే అందుకు బీజప్రదాత తండ్రి. **'ఆత్మావై పుత్ర నామాసి'** అంటారు. తండ్రి తనను తాను మళ్ళీ పుత్రుడిలో చూసుకొంటాడు. ధర్మాచరణలో వంశపారంపర్యంగా వస్తున్న సదాచారాల్ని తెలియజెప్పడమే కాదు సంఘంలో బ్రతకడానికి ఒక భరోసాను ధైర్యాన్నీ కలిగించే వాడే తండ్రి. అందుకే తండ్రి మాటకు అత్యంత ప్రాధాన్యాన్నిస్తూ, పితృవాక్య పాలనకోసం సర్వస్వాన్నీ త్యజించినా తప్పులేదని శ్రీరాముడు మొదలైన మహాపురుషులు నిరూపించారు.

పితృవాక్య పరిపాలనకు రాముడే ఆదర్శం అందరికీ. తండ్రి స్వయంగా తనకు చెప్పకపోయినా తండ్రి ఎప్పుడో ఇచ్చిన మాటను నిలబెట్టడం కోసమే రాజ్యాన్ని త్యజించాడు. అడవులకు బయలుదేరాడు. పరశురాముడు తనను నానా మాటలు అంటున్నా శ్రీరాముడు పెదవి విప్పలేదు. ఎందుకు? ప్రక్కనే తన తండ్రి దశరథమహారాజు

ఉన్నాడు. ఆయన ఆజ్ఞలేనిదే రాముడు నోరు విప్పడు. తండ్రి అంగీకరించి చేసిన వివాహం కాబట్టే శ్రీరాముడికి సీత అంటే ఎంతో ఇష్టం. ధర్మమంటే తండ్రి ఆజ్ఞను పాటించడమేనని నిరూపించాడు.

తల్లిదండ్రుల తర్వాత అందరికీ గురువే దైవం.

వేదాల్ని అధ్యయనం చేసినవాడూ, భక్తుడు, అసూయలేనివాడూ, యోగి, శుచిమంతుడు, గురుభక్తియుతుడు, బ్రహ్మజ్ఞాని అయినవాడే **'గురువు'** అనిపించు కుంటాడు.

**గు శబ్దస్త్వంధకార స్స్యాత్ రు శబ్దస్తన్నిరోధకః,**
**అంధకార నిరోధిత్వాత్ గురు రిత్యభిధీయతే.**

'గు' అంటే చీకటి. 'రు' అంటే నాశనం చేసేది. అజ్ఞానం అనే చీకటిని నాశనం చేస్తాడు కాబట్టి గురువు.

**గురురేవ పరం బ్రహ్మ గురు రేవ పరాగతిః,**
**గురు రేవ పరా విద్యా గురు రేవ పరాయణమ్.**

గురువే పరబ్రహ్మ స్వరూపం. గురువే మనకు పరమ దిక్కు. ఆయనే పరా విద్య. అందరికీ ఆశ్రయించదగినవాడు గురువే!

**దుర్లభో విషయత్యాగో దుర్లభం తత్త్వదర్శనం,**
**దుర్లభా సహజావస్థా సద్గురోః కరుణా వినా.** (మహోపనిషత్తు)

అటువంటి గురువు కరుణ ఉంటే కోరికల్ని జయించడం తృణప్రాయం. లేకపోతే అసాధ్యం. అందువల్ల శిష్యుడి ప్రథమ కర్తవ్యం గురువు అనుగ్రహాన్ని పొందడమే!

గురువే దైవం. దైవం అందరికీ అందుబాటులో ఉండడుకాబట్టి గురువు అందుబాటులో ఉండే దైవం. అందువల్ల దైవంతో సమానంగా గురువును అర్చించాలంటోంది యోగశిఖోపనిషత్తు. గురు శబ్దానికి 'పెద్ద' అనే అర్థం ఉంది. మన జీవనగమనంలో మన బంధువుల్లో కొందరు దిశానిర్దేశం చేసేవాళ్ళు ఉంటారు. అలాంటి పెద్దల్ని కూడా గురువును సేవించినట్లు సేవించమంటోంది శాస్త్రం.

లోకంలో గురువులు 1. చోదకుడు, 2. బోధకుడు, 3. మోక్షదుడు అని మూడు రకాలుగా ఉంటారు. మార్గాన్ని చూపి నడిపించేవాడు **చోదకుడు.** తగిన విద్యను బోధించేవాడు **బోధకుడు.** మోక్షాన్ని సాధించే మార్గాన్ని చూపేవాడు **మోక్షదుడు.**

గురువు వచ్చినప్పుడు లేచి నిలబడి పాదాభివందనం చెయ్యాలి. వారు కూర్చున్నప్పుడు సమానమైన ఆసనాలపై కూర్చోకూడదు. క్రిందనే కూర్చోవాలి. గురువుల ముందు పై ఉత్తరీయాన్ని నడుముకు చుట్టుకొని కింకరభావాన్ని వహించాలి. దగ్గరగా వెళ్ళి మాట్లాడవలసి వచ్చినప్పుడు మన నోటికి వస్త్రాన్ని కానీ, చెయ్యిని గాని అడ్డుపెట్టుకొని మాట్లాడాలి. మన నోటి తుంపర వారిపై పడకూడదు. ఇటువంటి సంప్రదాయాల్ని పాటిస్తూ గురువును గౌరవించే వారికి యశస్సు, ఆయువు, బలం, విద్య వృద్ధి చెందుతాయి.

శిష్యుడికి గురువుపై విశ్వాసం ఉండాలి. చేసే పని మీద, చదివే శాస్త్రం మీద, చెప్పే గురువు మీద విశ్వాసం లేనివాడికి ఎన్ని జన్మలు ఎత్తినా మోక్షం కలగదు. గురువు ప్రాధాన్యం ఎంతటిదంటే – వేదాభ్యాసం, తపస్సు, జ్ఞానం, ఇంద్రియనిగ్రహం, అహింస మొదలైన సదాచారాలతో పాటు గురుసేవను కూడా చేర్చారు.

**గురు శుశ్రూషయా విద్యా పుష్కలేన ధనేన వా,**
**అథ వా విద్యయా విద్యా చతుర్థం నోపలభ్యతే.**

గురువుకు సేవ చేస్తేనే విద్య లభిస్తుంది. ఇదే అన్నింటికంటే ఉత్తమం. లేదా పుష్కలమైన ధనాన్ని ఇచ్చిగానీ, తనకు తెలిసిన విద్యను గురువుకు చెప్పిగానీ విద్యను సంపాదించవచ్చు.

స్కాందపురాణంలోని ఉత్తరఖండంలోని **'గురుగీత'** ఇలా చెప్తోంది. భగవంతుడు కోపించినా ఆ కోపం నుండి రక్షించగలవాడు గురువే! అలాంటిది ఆ గురువే కోపిస్తే భగవంతుడు కూడా రక్షించలేడు.

గురువును దర్శిస్తే ఆత్మశాంతి కలుగుతుంది. ధైర్యమూ కరతలామలకం అవుతుంది. బ్రహ్మవిష్ణు శివాత్మకుడైన గురువును ఆశ్రయిస్తే మోక్షమే లభిస్తుందంటే ఇక ఇతర ప్రయోజనాల గురించి చెప్పడం ఎందుకు? సహనం, సత్యం, దయ, శుచి, గురుభక్తి ఉంటే ఆయువు వృద్ధి చెందుతుంది.

తల్లి, తండ్రి, గురువు తర్వాత మనం ఆదరించి గౌరవించవలసిన వ్యక్తి అతిథి. అందుకే **'అతిథి దేవోభవ'** అన్నారు. అతిథి అంటే –

**ఏకరాత్రం తు నివసన్నతిథిః బ్రాహ్మణః స్మృతః,**
**అనిత్యం హి స్థితో యస్మాత్ తస్మా దతిథి రుచ్యతే.** (మను. 3–102)

గృహస్థుల ఇళ్ళలో ఒక్కరోజు మాత్రమే ఉండేవాడిని అతిథి అంటారు. తిథి లేకుండా వచ్చేవాడు అతిథి. అంటే ఈ రోజు రావచ్చు ఈ రోజు రాకూడదు అనే నియమాలు లేనివాడని అర్థం. అంటే ఒకే చోట స్థిరంగా ఉండనివాడు. ఒక్క తిథి ఉన్నంత కాలమే ఒకచోట ఉండేవాడని. అలా అని ప్రతిరోజు భోజనం వేళకి వచ్చేవాడు అతిథి కాడు. కావాలని అతిథిగా అందరి ఇళ్ళకూ వెళ్ళి సేవల్ని పొందే అతిథి తరువాత జన్మల్లో, తాను ఆతిథ్యం పొందిన గృహస్థు ఇంట్లో పశువుగా పుడతాడట. అందువల్ల అవసరం ఉన్నప్పుడే అతిథిగా గృహస్థుణ్ణి ఆశ్రయించాలి.

అలాంటి అతిథిని గృహస్థు **'అభ్యాగతః స్వయం విష్ణుః'** ఆ వచ్చినవాడు సాక్షాత్తూ విష్ణుమూర్తిగా భావించి గౌరవించాలి. అర్ఘ్యపాద్యాదులు సమర్పించి సత్కరించాలి. అతిథిని సత్కరించనివాడు ఎంత నిష్ఠగా జీవించినా ఘోరమైన తపస్సులు చేసినా పుణ్యాన్ని ఏమాత్రం పొందలేడు.

సూర్యాస్తమయం తరువాత ఇంటికి వచ్చిన అతిథిని ఎట్టిపరిస్థితుల్లోనూ తిరస్కరించకూడదు. అలాగే భోజనంవేళకి వచ్చినా, వేళకాని వేళలో వచ్చినా సాదరంగా ఆహ్వానించాలి. శ్రద్ధగా ఉన్నంతలో తక్కువ చేయకుండా ఆదరించాలి. అతిథిని ఆకలితో ఉంచి తాను భుజించకూడదు. అలాగే అతిథికంటే ముందు కూడా గృహస్థు తినకూడదు.

అతిథిని ఆదరిస్తే స్వరసౌఖ్యాలూ కలుగుతాయి. తిరస్కరించినా నిరాదరించినా దుష్ఫలితాలు కలుగుతాయని 'పరాశరస్మృతి' చెబుతోంది. ఇంటికి వచ్చిన అతిథి నిరాశగా తిరిగి వెళ్ళినట్లయితే అలాంటి గృహస్థు ఇంట్లో పితృదేవతలు పదిహేను సంవత్సరాల పాట శ్రాద్ధభోజనం స్వీకరించరు. ఆ గృహస్థు చేసిన యాగమూ నిష్ఫలమే అవుతుంది.

సాధారణంగా అతిథి కొత్తచోటు, కొత్త మనుషులు, కొత్త వాతావరణం మధ్య కొంత ఇబ్బందిగా, మొహమాటంగా ఉంటాడు. కాబట్టి అతని మానసిక పరిస్థితిని గమనించి ఏ లోటూ కలుగకుండా చూసుకోవడం గృహస్థు బాధ్యత. చక్కగా ఆదరించి

అన్నంపెట్టి అతిథిని సంతృప్తి పరచాలి. అతిథి **'తృప్తోఽహమ్'** అంటే పై నుండి సకల దేవతలూ ఆ గృహస్థును అనుగ్రహిస్తారు. గ్రహాలు అనుకూలంగా వర్తిస్తాయి. ఏ అరిష్టాలూ లేకుండా సుఖశాంతులతో జీవించేలా పరమాత్మ వరాలను కురిపిస్తాడు. ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించి పరమ పదాన్ని కూడా అనుగ్రహిస్తాడు.

ఆధునిక కాలంలో అతిథిని సదాచార పూర్వకంగా ఆదరించడంగానీ సపర్యలు చేయడంగానీ జరగడం లేదు. అతిథులు వస్తున్నారని తెలిసినా ఇంట్లో వాళ్ళు ముందుగానే భోంచేసి వాళ్ళకు తర్వాత వడ్డించడం కూడా చేస్తుంటారు. 'అతిథి' మన ఇంటికి వస్తున్నాడంటే అతడికి దిక్కు లేక కాదు. మనమూ ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరి ఇంటికి అతిథిగా వెళ్లవచ్చు. అలా వెళ్ళినప్పుడు వాళ్ళు ఏం చేస్తే ఆనందిస్తామో దానిని ఆచరించాలి. ఏం చేస్తే మనం బాధపడ్డామో వాటిని మనం మన అతిథుల పట్ల చేయకుండా ఉండాలి.

**'ఉదార చరితానాం తు వసుధైక కుటుంబకమ్'** అన్నది భారతీయ సనాతనధర్మం. విశాల హృదయం కలవారికి ఈ లోకమే ఒక కుటుంబం. మన ఇంటికివచ్చిన అతిథిని మన కుటుంబ సభ్యులకంటే ఎక్కువగా భావించి, మరింత జాగ్రత్తగా సేవించడమే మన ధర్మం. ఇంత ఉత్కృష్టమైన ధర్మం ద్వారా మనుషుల మధ్య భావసమైక్యత సాధ్యమవుతుంది. తద్వారా విశ్వమానవ కల్యాణం సాకారమవుతుంది.

✦ ✦ ✦

# స్త్రీ ప్రాశస్త్యం

ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు ఆనందిస్తారు అంటోంది మన సంప్రదాయం.

కలకంఠి కంట కన్నీ రొలికిన సిరి ఇంట నుండు నొల్లదు సుమతీ! అంటోంది మన శతక వాఙ్మయం.

మన సనాతనధర్మంలో స్త్రీకి అత్యున్నతమైన స్థానం ఉంది. వేదాలు స్త్రీని గౌరవించమని చెప్పాయి. అంతకు మించిన కర్తవ్యం వేరే లేదనీ చెప్పాయి. **'మాతృదేవోభవ'** అన్న మంత్రంలో అగ్రపూజ మహిళామూర్తికే!

భార్య వచ్చిన తర్వాతే యజ్ఞంచేసే అర్హత గృహస్థుకు లభిస్తుంది. **'అయజ్ఞో వా ఏషః యోఽ పత్నీకః'.** భార్యలేనివాడికి యజ్ఞంచేసే అర్హతలేదు (తైత్తిరీయ బ్రాహ్మణం).

స్త్రీ లక్ష్మీ స్వరూపం. అందుకే **'న గృహం గృహ మిత్యాహుః' 'గృహిణీ గృహ ముచ్యతే'.** ఇల్లు ఇల్లుకాదు. ఇల్లాలే ఇల్లు. అంటే ఇంటికీ ఇల్లాలికీ విడదీయరాని సంబంధం ఉంది. స్త్రీలు ఇంటికి గొప్ప అలంకారాలు. అంతేకాదు ఇల్లు వృద్ధిచెందడానికి కారణమైన సంతానోత్పత్తికి ఆధారభూతమైన వాళ్ళు.

**శోచంతి జాయయో యత్ర వినశ్యత్యాశు తత్కులం,**
**న శోచంతి తు యత్రైతా వర్ధతే తద్ధి సర్వదా.** (మను. 3-55)

గుణవతీ, ఉత్తమురాలు అయిన స్త్రీ సాక్షాత్తూ లక్ష్మీ స్వరూపమే. అలాంటి స్త్రీవల్ల వంశం ప్రసిద్ధిలోనికి వస్తుంది. స్త్రీలు దుఃఖించిన వంశం నామరూపాలు లేకుండా పోతుంది. **'స్త్రీ చిత్తమే పురుషుడి భాగ్యం'** అన్నారు. స్త్రీ నిత్యం ఆనందంగా ఉంటే ఆ కుటుంబం కళకళలాడుతుంది.

**యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః,**
**యత్రైతాసు న పూజ్యంతే సర్వాస్తత్రా ఫలాః క్రియాః.** (మనుస్మృతి)

ఏ ఇంట్లో స్త్రీ పూజింపబడుతుందో, గౌరవింపబడుతుందో ఆ ఇంట్లో దేవతలు ఆనందంగా సంచరిస్తారు. ఏ ఇంట్లో స్త్రీలు అవమానించబడతారో ఆ ఇంట్లో తలపెట్టిన ఏ పనీ సత్ఫలితాన్ని ఇవ్వదు. ఆ వంశం సర్వనాశనం అయిపోతుంది. అందుకే స్త్రీని రక్షించుకోవాలి. కంటికి రెప్పలా చూసుకోవాలి.

**పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే,**

**రక్షంతి వార్ధకే పుత్రాః నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి.** (మను. 9-3)

స్త్రీలను కౌమారదశ వరకూ తండ్రీ, వివాహం అయిన తర్వాత నుండి వృద్ధాప్యం వచ్చేదాకా భర్త, వృద్ధాప్యంలో కొడుకులూ రక్షించాలి. అన్ని విధాలుగా పురుషుడికోసం, కుటుంబంకోసం, సమాజంకోసం తన సర్వస్వాన్నీ అర్పించిన స్త్రీని పరిరక్షించుకోవలసిన బాధ్యతను మనధర్మశాస్త్రం గుర్తుచేస్తోంది. అంతేకాదు ప్రకృతి సహజంగా బలం అధికంగా ఉన్న పురుషుడు బలం తక్కువగా ఉన్న స్త్రీని శిక్షించకుండా రక్షించాలనే సూచన కూడా కన్పిస్తుంది.

కుటుంబంలోని వారందరూ స్త్రీని గౌరవించాలి. తమ క్షేమం కోసమైనా స్త్రీని గౌరవించాలి. అభివృద్ధి కావాలనుకుంటే స్త్రీని ఆనందంగా ఉంచేలా నడుచుకోవాలి. వాళ్ళకు నచ్చిన బహుమతులు ఇచ్చి ప్రసన్నం చేసుకోవాలి. ఆమె వస్తువుల్నిగానీ ఆస్తుల్నిగానీ ఎట్టి పరిస్థితుల్లోనూ కబళించకూడదు.

తండ్రికి కొడుకు ఎంతో కూతురూ అంతే! పుత్రుడితో సమానంగా అన్ని హక్కులూ పుత్రికకు ఉంటాయి. పుత్రుడు లేని పక్షంలో ఆస్తులన్నీ పుత్రికకే సంక్రమిస్తాయి. పుత్రుడు లేకపోతే పుత్రికలే సింహాసనాన్ని అధిష్ఠించి వారసురాళ్ళై పరిపాలించిన సందర్భాలు మన చరిత్రలో కోకొల్లలు. ఆ తరువాత కూడా ఆ పుత్రిక సంతానానికే వారసత్వంగా ఆస్తి సంక్రమిస్తుంది.

కాలకూట విషానికైనా విరుగుడు ఉంటుందేమో! భగభగమండే దావాగ్నిలో చిక్కుకొని కూడా బయట పడవచ్చునేమోగానీ స్త్రీ శాపానికి గురైన వాణ్ణి కాపాడడం ఎవరి తరమూ కాదు.

స్త్రీలకు తన తోడబుట్టిన వారివల్ల తగిన గౌరవాలూ మర్యాదలూ జరగనప్పుడు, ఆమెకు బాధకలిగేలా నడుచుకున్నప్పుడు, ఆ స్త్రీ వాళ్ళని శపించిందో అంతే! ఆ శాపానికి తిరుగుండదు. వాళ్ళ పాపానికి నిష్కృతి ఉండదు. వాళ్ళ శోకానికి అంతూ ఉండదు. అందువల్ల తోడబుట్టినవాళ్ళను అవమానించకూడదు. వాళ్ళ ధనం కోసం అస్సలు ఆశపడకూడదు.

స్త్రీ బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలివి ఆవిడ సొంతం. సహనం ఆమె చిరునామా. ధైర్యం ఆమెకు సహజ గుణం. శక్తి ఆమెకు నిరంతర వృద్ధికరం. ఏకాగ్రత, కార్యదీక్ష,

శ్రమ, పట్టుదల పురుషుల కంటే స్త్రీలలో అధికంగా ఉంటాయి. వీటన్నింటినీ మించి కరుణ, సుకుమారత్వం, వాత్సల్యం, ప్రేమ మూర్తీభవించిన వాళ్ళు స్త్రీలు. స్త్రీ లేకుండా పురుషుడు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. అతడి జీవితం పరిపూర్ణం కాదు, ప్రారంభమే కాదు.

**కార్యేషు దాసీ కరణేషు మంత్రీ రూపేచ లక్ష్మీ క్షమయా ధరిత్రీ,**
**స్నేహే చ మాతా శయనే చ రంభా షట్కర్మ యుక్తా కులధర్మపత్నీ.** (మను. 5)

స్త్రీ మూర్తి – గృహకార్యాలలో దాసి. పనుల గురించి ఆలోచించడంలో మంత్రి (కరణం = ఉపకరణం). రూపంలో లక్ష్మి. ఓర్పులో భూమి. స్నేహంలో తల్లి. ఇక్కడ 'భోజ్యేషు మాతా' అని పాఠాంతరం ఉంది. ఆకలి తెలుసుకొని అన్నం పెట్టడంలో తల్లిలాంటిది అని. శృంగారసుఖాన్ని పంచడంలో రంభ. ఇలా కులధర్మపత్ని ఆరు కర్మలను నిర్వహిస్తుంది అని. అంతే కాదు –

**విశీలః కామ వృత్తో వా గుణైర్వా పరివర్జితః,**
**ఉపచర్యః స్త్రియాసాధ్వ్యా సతతం దేవవత్పతిః.** (మను. 5–156)

భర్త ఎంత దుర్మార్గుడైనా, కామాతురుడైనా పతివ్రత అయిన స్త్రీ తన భర్తనే దైవంగా భావించి అతడికి సేవలు చెయ్యాలి. నెమ్మదిగా ప్రియోక్తులతో అతణ్ణి మార్చే ప్రయత్నం చెయ్యాలి. స్త్రీలకు పతి సేవ తప్ప వేరే యజ్ఞాలూ అక్కర్లేదు. ఉపవాసాలూ, వ్రతాలూ చెయ్యనక్కర్లేదు. భర్తను త్రికరణశుద్ధిగా అర్చించిన స్త్రీ స్వర్గంలోనూ గౌరవాన్ని పొందుతుంది. భర్త వెళ్ళే లోకాలకు తానూ వెళ్ళాలనుకొనే సాధ్వి ఎన్నటికీ భర్తకు విరుద్ధంగా ప్రవర్తించకూడదు.

✦ ✦ ✦

# ఆదర్శదాంపత్య ధర్మాలు

భార్యతోడుగా లేకపోతే ఆ మగవాడికి ధర్మార్థకామాలు అనే త్రివర్గంలో ఏ ఒక్కటీ నెరవేరదు. సార్థకం కానే కాదు. అలాగే పతిని దూరంగాపెట్టినా విడిచిపెట్టినా ఇల్లాలికి ధర్మం లేదు. అర్థమూ లేదు. కామమూ లేదు. కాబట్టి దంపతులు జీవితాంతమూ ఒకరికొకరు వశమై, అన్యోన్యంగా ఉండాలి. అలా ఉండడంవల్ల ఒకరివల్ల మరొకరికి ఆనందసౌఖ్యాలు లభిస్తాయి. ఇదే ఉత్తమోత్తం. అదే తగిన పని. ఒప్పయిన దాంపత్యం అంటోంది మార్కండేయపురాణం (2-325).

భార్యలేకుండా జరుపుకొనే ఏ పండుగైనా దండుగే. కులకాంత తప్ప వేరెవ్వరు పెట్టిన ఆహారమైనా విషతుల్యమే. ధర్మపత్నితో పలికిన పలుకులే కలకండలాంటి తియ్యనైన పలుకులు. మరెవరితో పలికినా, అవి బాణం ములుకులే. గృహిణితో కాకుండా చేసే శృంగారం శృంగారం కాదు. అది దుఃఖహేతువు. ఇల్లాలితో ఆడితేనే అవి సరసాలు. లేకపోతే అవి విరసాలు. ప్రాణేశ్వరికోసం చేసే శ్రమ సుఖప్రదం. ఇతరకాంతల కోసం చేసే ప్రయత్నాలు అనర్థదాయకాలు. చేటుతెస్తాయి. అన్యస్త్రీలు చేసే ప్రియాలు నిజానికి భయంకరాలు. ధర్మపత్నిలేని ఇల్లు - సంసారం నిస్సారమైన ఎడారి. కులకాంత ముద్దులొలికే మాటలు వినడానికి నోచుకోని చెవులవి ఎందుకు? అవి చెవులు కావు. పర్వతగుహలు. భార్యతోనే సంపద, ఆనందం, భార్యలేని వాడికి ఎంత ఐశ్వర్యం ఉన్నా బూడిదలో పోసిన పన్నీరే. (పంచతంత్రం 4-73).

పరనారీ సంగమాన్ని, పరధనాన్ని ఆశించడం మహాపాపం. వీటివల్ల ధన, మాన, వివేకాదులు నశిస్తాయి. ఉచితానుచిత జ్ఞానం పోతుంది. బంధుమిత్రులు దూరమవుతారు. ప్రాణాలకు చేటు కలుగుతుంది. పూర్వం చేసిన పుణ్యాలన్నీ నశించిపోతాయి. సంపద, ఆయుర్దాయం అంతరించిపోతాయి. నరకం తలుపులు తెరుచుకుంటాయి. యశస్సు అనే మహాసముద్రం ఇంకిపోతుంది. సన్మానాలూ, సత్కారాలకు బదులుగా చీవాట్లు, ఛీత్కారాలు ఎదురవుతాయి.

సోదరి-కోడలు-కూతురు-సోదరుడి ఇల్లాలు ఈ నలుగురూ మానవులకు తల్లితో సమానమైనవారు. అలాగే రాజుగారి భార్య, గురువు భార్య కూడా తల్లితో సమానం. అంతెందుకు - **'మాతృవత్ పర దారేషు యః పశ్యతి స పండితః'.** ఇతర స్త్రీలను తల్లిలా చూసేవాడే నిజమైన పండితుడు. అందువల్ల ఏకపత్నీ వ్రతం పురుషులకు అత్యంత శ్రేష్ఠమయినది.

✦ ✦ ✦

# భార్యాభర్తల ధర్మాలు

భర్తను భార్య మాత్రమే ఉద్ధరించగలదు. భార్య ఉద్ధరించినట్లుగా శాస్త్రార్థాలూ, గురుమంత్రాలూ ఇవేవీ ఉద్ధరించలేవు. భర్తకు కులస్త్రీయే అన్నీ. స్నేహితుడు, సోదరుడు, సహృదయుడు, భృత్యుడు, గురువు, ధనం, సుఖం, శాస్త్రం, గృహం, సమస్తమూ భార్యే!

కాబట్టి ధర్మపత్ని లోకానికి ఆదర్శం. పూజనీయురాలు కూడా. ఇలాంటి వారిని పూజిస్తే ఇహపరసౌఖ్యాలు లభిస్తాయి. అటువంటి భార్యను నొప్పించకుండా కంటతడి పెట్టించకుండా చూసుకోవడం పురుషుడి బాధ్యత.

స్త్రీలు సుకుమారులు. భావోద్వేగాలు అధికం. అందువల్ల వాళ్ళతో మాట, చేత చాలా జాగ్రత్తగా ఉండాలి. మనసు నొప్పించకుండా నడుచుకోవాలి.

స్త్రీలు శారీరకంగా ఎంతటి సుకుమారులో మానసికంగా అంతదృఢంగా ఉంటారు. దేన్నైనా సాధించాలన్న పట్టుదల ఎక్కువ. కచ్చితమైన అభిప్రాయాలతో కుటుంబక్షేమానికి నిరంతరం శ్రమిస్తారు. అలాంటి వారి కష్టాన్ని గుర్తించడం, గౌరవించడం, ఓదార్పు నందించడం భర్త విధి.

ఇంట్లో నడయాడే ఇల్లాలే లక్ష్మీ స్వరూపం. ఆవిడ క్రీగంటి చూపులోనే పురుషుడి అభివృద్ధి పతనాలు ఆధారపడి ఉంటాయి. పురుషుడు స్త్రీతో ప్రవర్తించే తీరుపైనే అతడి అభివృద్ధి పతనాలు ఆధారపడి ఉంటాయి.

ఇంటికి యజమాని భర్తే అయినప్పటికీ పిల్లల వివాహాది విషయాల్లో స్త్రీలకు ఉన్నంత పరిజ్ఞానం పురుషులకు ఉండదు. అందుకే కాళిదాస మహాకవి –

**'ప్రాయేణ గృహిణీనేత్రాః కన్యార్థేషు కుటుంబినః'** అంటాడు పార్వతీ పరిణయ సందర్భంలో. అంటే పిల్లల వివాహాది విషయాలలో భార్యల చూపులే భర్తల కార్యాచరణలు కావాలి. ఇంటిని చక్కదిద్దడం వండి వడ్డించడం, పిల్లల ఆలనాపాలనా చూసుకోవడం, పెద్దలకు సేవచేయడం, ఇంటికి వచ్చిన వారిని ఆదరించడం, ఇల్లు ఎప్పుడూ కళకళలాడేలా ఉంచడం, పెద్దలు చెప్పిన ధర్మాల్ని పాటించడం, సూర్యోదయానికి ముందే నిద్రలేవడం, భగవదారాధనతో గృహాన్ని పవిత్రంగా ఉంచడంలాంటి విధుల్ని కులపత్ని పాటించడం ద్వారా గృహాన్ని ఆనందమయం చేస్తుంది. భూలోకంలోనే స్వర్గసీమను దర్శింపజేస్తుంది. అలాంటి స్త్రీని మాత్రమే కులస్త్రీ అనీ, ధర్మపత్నీ అని వ్యవహరిస్తారు. కులాన్ని అంటే వంశాన్ని సన్మార్గంలో నడిపించే శక్తి దక్షత ఉండడంవల్లనే ఆమెకు ఆ హోదాను సమాజం ఇచ్చి గౌరవించింది. ఆమె మహిమను తెలుసుకొని నడిచిన పురుషుడే చతుర్విధ పురుషార్థాలను సాధించగలుగుతాడు.

✦ ✦ ✦

# పతివ్రతా ధర్మాలు

భార్య ఎలా నడుచుకోవాలో, భవిష్య పురాణం ఇలా తెలియజేస్తుంది.

1. భర్త మనసు తెలుసుకొని నడుచుకోవడం.
2. భర్తనేకాక అతడి తల్లిదండ్రులను, బంధుమిత్రులను, గురువులనూ గౌరవించడం, ఆదరించడం.
3. భర్తే దైవంగా త్రికరణ శుద్ధిగా నమ్మి ప్రవర్తించడం.
4. భర్తచేసే ధార్మిక కార్యక్రమాల్లో తానూ ఇష్టంగా పాల్గొనడం.
5. భర్తకు అనుకూలంగా ఉండడం, శీలవతి కావడం.
6. సాధుస్వభావం, గృహకార్య దక్షత, పతిసేవా దీక్ష కలిగి ఉండడం మొదలైనవి.

భార్య ఎప్పుడూ భర్త సుఖాన్నే కోరుకోవాలి. భర్తనే అనుసరించాలి. స్త్రీలకు ఇహలోకంలోనే కాదు పరలోకంలోనూ ఆశ్రమమిచ్చేవాడు భర్త ఒక్కడే. స్త్రీకి ఆమె తల్లి, తండ్రి, కుమారులు, స్నేహితులు (చివరికి ఆమె శరీరం కూడా) ఆమెకు సంపూర్ణ సహాయకులు కారు. భోగాలను అనుభవించడం కన్నా స్త్రీకి భర్త సేవలో ఉండడమే విశేష ధర్మం. భర్తే భార్యకు ప్రభువు, భగవంతుడు కూడా. భర్తకు సహధర్మ చారిణిగా ఉండడమే భార్యకు పెద్ద పదవి. దానివల్లనే గౌరవం, కీర్తి, సంపద లభిస్తాయని సీతాదేవికి అనసూయ బోధించింది.

**'అహంకారం విహాయాఽహం కామక్రోధౌ చ సర్వదా,**
**సదాచారాన్ పాండవాన్ నిత్యం ప్రయతోపచర్యామహమ్'.**

నేను అహంకారాన్ని, కామక్రోధాధుల్ని విడిచిపెట్టి పతివ్రతా ధర్మాన్ని ఆచరిస్తున్నానంటూ ద్రౌపది – స్త్రీలకి భర్తతో సమానమైన దైవం వేరే లేదు. దేవతలతో కూడిన లోకాలు కూడా భర్తతో సమానం కావు. భర్త అనుగ్రహం ఉంటే భార్య కోర్కెలన్నీ పూర్తిగా నెరవేరుతాయి. భర్తకి ఆగ్రహం కలిగితే అవన్నీ నశించిపోతాయి. కాబట్టి త్రికరణశుద్ధిగా భర్తను భార్య సేవించాలి అని హితబోధ చేస్తుంది.

✦ ✦ ✦

# భర్తల ధర్మాలు - లక్షణాలు

పురుషుడు వేదోక్త కర్మల్ని ఆచరించాలంటే అతడికి భార్యాయోగం ఉండాలి. వివాహం కాని వాడు యజ్ఞానికి పనికిరాడు.

పురుషుడు దైవానుగ్రహం వల్లనే భార్యను పొందుతాడు కాబట్టి ఆ దేవతల్ని సంతోషపరచడానికైనా భార్యను జాగ్రత్తగా చూసుకోవాలి. భర్తా భార్యా ఎన్నటికీ వేరు కాదు. వివాహబంధమే వారి అన్యోన్యతకు పునాది. (మను. 9-95)

భార్యకు పాతివ్రత్యం ఎంత ముఖ్యమో భర్తకు ఏకపత్నీవ్రతం అంతే ముఖ్యం. మర్యాదాపురుషోత్తముడైన శ్రీరాముడు ఈ ధర్మాన్ని ఆచరించి, మనందరికీ మార్గదర్శకుడయ్యాడు.

పతివ్రత అయిన భార్యను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టకూడదు. అలా విడిచి పెడితే వాడికి ఘోరమైన ప్రాయశ్చిత్తాలు చెయ్యాలంటోంది ఆపస్తంభ స్మృతి. (1-28-18).

కారణం లేకుండా భార్యను విడిచిపెట్టిన భర్త - గాడిద చర్మాన్ని వెంట్రుకలు పైకి కన్పించేలా కప్పుకొని **"అయ్యా! నేను భార్యను వదిలివేసిన వాణ్ణి నాకు భిక్ష ఇవ్వండి"** అని అరుస్తూ రోజుకు ఏడేసి ఇళ్ళ చొప్పున ఆరునెలలు బిచ్చం ఎత్తుకోవాలి.

భార్యాభర్తలు సంతోంగా ఉన్న ఇల్లు సర్వమంగళాలకూ నిలయం. నిత్యకల్యాణం పచ్చతోరణం. (మను. 3-60)

కామందకుడి నీతిశాస్త్రం భర్త ఎలా ఉండాలో చెబుతోంది.

**కార్యేషు యోగీ కరణేషు దక్షః రూపే చ కృష్ణః క్షమయా చ రామః,**
**భోజ్యేషు తృప్తః సుఖదుఃఖమిత్రం షట్కర్మయుక్తః ఖలు ధర్మనాథః.**

1. యోగిలా ఏ ఫలితమూ ఆశించకుండా కార్యాలను ఆచరించాలి.
2. కార్యాలను చెయ్యడంలో నైపుణ్యం కలిగి ఉండాలి.
3. రూపంలో శ్రీకృష్ణుడిలా ఉండాలి.
4. ఓర్పులో రాముడిలా ఉండాలి.

5. భోజనం చెయ్యడంలో తృప్తిని చెందుతూ ఉండాలి.

6. సుఖదుఃఖాలలో భార్యకు మిత్రుడిలా ఉండాలి.

ఈ ఆరు క్రియలూ చేసేవాడే ఉత్తమ పురుషుడు. ఉత్తమభర్త. అంతేకాదు – భార్యను దూషించకూడదు. తల్లిలా భావించాలి. గౌరవించాలి. పోషించాలి. తాను ఎన్నికష్టాలు పడుతున్నా భార్యని మాత్రం కోపగించుకోకూడదు. తన భార్యను కాకుండా అన్య స్త్రీలను గురించి అన్యధా భావించకూడదు. మానసికంగానైనా పరస్త్రీని తాకినట్లు భావించకూడదు. (అలా భావిస్తే అతడు నరకానికి పోతాడు). ధనం, మంచి మంచి వస్త్రాలు, ఆభరణాలు, కానుకలూ ఇచ్చి ప్రేమగా మాట్లాడుతూ ప్రతి భర్తా తన భార్యను సంతోషంగా చూసుకోవాలి. భార్యను కష్టపెట్టే పనులు చెయ్యకూడదు.

ఇలా చేస్తే –

**'యస్మిన్ నరే మహేశాని తుష్టా భార్యా పతివ్రతా,**
**సర్వోధర్మః కృతస్తేన భవతీ ప్రియ ఏవ సః'.** (మహానిర్వాణ తంత్రం. 43)

ప్రతి ఇల్లాలూ పతివ్రతే అవుతుంది. తన భర్తనే దైవంగా కొలుస్తుంది. భార్య ప్రేమను పొందితే సమస్త ధర్మాలను ఆచరించినట్లే. సకల సద్గుణాలనూ పొందినట్లే.

అందుకే భారతీయ సనాతన వాఙ్మయం స్త్రీని కంటతడి పెట్టకుండా చూసుకోమంది. స్త్రీ ఔన్నత్యం ఎంతటిదో నొక్కి వక్కాణించింది.

# స్త్రీ భద్రత

నీ పుట్టుక వల్ల లోకాలు పవిత్రా లయ్యాయి. లోకాలకు నువ్వే శరణ్యం. నువ్వే ఏలుగడ. అయినా నువ్వు అనాథవు. లోకులు నీ పట్ల కాకులు. ఇందుకేనా నీ పుట్టుక? అన్నాడు భవభూతి మహాకవి. **(త్వయా జగంతి పుణ్యాని ... విపత్న్యసే)** ఆ మాటలు – నేటికీ సమాజం స్త్రీ పట్ల చూపిస్తున్న వివక్షకు నిలువుటద్దాలు.

స్త్రీ – పురుషార్థాలకు ఉపకరణం. విద్యకూ నీతులకూ పుట్టిల్లు. మంచి నడవడికకు దారిచూపుతుంది. వంశ స్థితికి మూలం, సద్గతికి ఊతం, గౌరవానికి ఏకైక కారణం, గుణాలకు నెలవు. సంతోషానికి పుట్టుక (నన్నయ – ఆది. 4–84).

**సతియు గల్గిన గల్గు సకల సంపదలు, సకల పుణ్యములు, సత్పుత్రచయము, సద్గతిత్రోవ** (గౌరన). సకల విషయాలనూ బోధించే గ్రంథాలు, మనోవ్యాధిని మాన్పే మూలికలు, విచారం అనే సముద్రాన్ని దాటించే నౌకలు– అంగనలు. సర్వదుఃఖాలకీ స్త్రీ ఒక దివ్యమైన ఔషధం. కానీ ఎక్కడ చూసినా అమెకు మిగిలేది గుండెలు పట్టని దుఃఖమే.

లింగవివక్ష అనేది నిజానికి అంతర్జాతీయ సమస్య. విదేశాలలో మరీ ఎక్కువ. మనదేశంలో పూర్వం తక్కువగా ఉండేది. నేడు విపరీతం కావడం దురదృష్టకరం (గణాంకాలు చూస్తే ఒళ్ళు గరుర్పొడుస్తుంది). అందుకే పూర్వం మన దేశంలో స్త్రీలకు ఒక రక్షణకవచం ఉండేది. ఆనాడు ఆడవాళ్ళు బయటకు వచ్చేవారు కారు కాబట్టి దాడులు పరిమితంగా ఉండేవి.

స్త్రీ యథేచ్ఛగా బయటకు వస్తున్న తొలితరం ఇదే. అందుకే ఈనాడు దారుణాలు ఎక్కువగా చూస్తున్నాం.

ప్రాచీన భారతీయ సమాజం స్త్రీకి ఎంతో గొప్పస్థానాన్ని ఇచ్చింది. **మాతృమాన్ పితృమాన్ ఆచార్యవాన్ పురుషో వేద** (ఉపనిషద్వాక్యం) అని వేదాలు ఉపనిషత్తులు స్త్రీకి మొట్టమొదట గౌరవాన్ని ఇచ్చాయి. స్త్రీ జీవాత్మ. పరమాత్మ పురుషుడు **(స్త్రీరూపమితరం జగత్).** చైత్రం నుంచి భాద్రపదం వరకూ కాలం పురుషరూపాత్మకం. ఆశ్వయుజం నుంచి ఫాల్గుణం వరకూ స్త్రీరూపాత్మకం. స్త్రీ అనే పదంలో–సకారం సత్త్వం గుణం. తకారం తమస్సు. రకారం రజస్సు. త్రిగుణాల సమాహారమే స్త్రీ. అదే ప్రకృతి.

వేదకాలంనాటి స్త్రీలు విద్యావేత్తలే కాదు మంత్రద్రష్టలూ న్యాయనిర్ణేతలూ కూడా. గార్గి, మైత్రేయి, ఆత్రేయి మొదలైనవాళ్ళు శాస్త్రచర్చల్లో పాల్గొనేవారట . గార్గి, మైత్రేయి, రోమశ, అపాల, లోపాముద్ర మొదలైనవారు వేదమంత్రాలను దర్శించినవాళ్ళు.

బ్రహ్మవిద్య స్త్రీలకు బ్రహ్మవిద్యేం కాదు. స్త్రీలకు యజ్ఞోపవీతధారణ, గాయత్రీ జపం, సంధ్యావందన విధులు, ఉపనయనం, వేదాభ్యాసం ఇలా అన్నీ పురుషులతో సమానంగా ఉన్నాయి.

**సంధ్యాకాలమానాః శ్యామా ధ్రువ మేష్యతి జానకీ,**
**నదీం చేమాం శుభజలాం సంధ్యార్థే వరవర్ణినీ.** (సుం. 14-49)

సీతాదేవి సంధ్యావందనం చేసింది. శ్రీమండనమిశ్రులవారి సతీమణి 'ఉభయభారతి' న్యాయనిర్ణేత. అలంకారశాస్త్రంలోనూ స్త్రీల ప్రమేయం ఉంది. రాజశేఖరుని వంటివారు సిద్ధాంతీకరణలో తమ సతీమణుల అభిప్రాయాలు స్వీకరించేవారట.

ఇక కవిత్వం చెప్పటంలో స్త్రీలు సాక్షాత్తు సరస్వతులే. బుద్ధిసాహసాలలో స్త్రీలు అసామాన్యలు. భరతుడి నాట్యశాస్త్రంలో కొన్ని వృత్తుల్ని ప్రదర్శించాలంటే స్త్రీ ఉండాలి. లేకపోతే అసాధ్యం. ఉదా. కైశికీవృత్తి. నాట్యశాస్త్రం ఇలా స్త్రీ ప్రాధాన్యం గుర్తించింది. కాబట్టే స్త్రీ అవమానానికి గురి కానివిధంగా కొన్ని నియమాలను చేసింది. కానీ నేటి దృశ్యమాధ్యమాలు అందుకు పూర్తిగా భిన్నంగా ఉండడం విచారకరం.

## నారి లేని ఇల్లు – నారి లేని విల్లు

**'గృహిణీ సచివః సఖీ మిథః ప్రియశిష్యా లలితే కళావిధౌ'** అంటాడు కాళిదాసు. పురుషుడికి ఇల్లాలే అన్నీ. నేను నీ కంటే ముందు నడచి దర్భల్ని మెత్తబడేలా చేసి నీకు దారి ఏర్పరుస్తానంటుంది రాముడితో సీతమ్మ. అడవికి రావద్దంటే ఊరుకోలేదు. నువ్వు పురుషరూపంలో ఉన్న స్త్రీవి **(స్త్రియం పురుషవిగ్రహమ్)** అని సాహసించి ఆయన అవతారమార్గాన్ని సుగమం చేసిన ఇల్లాలు. తీగ లేకుండా వీణ మోగదనీ, చక్రం లేకుండా రథం నడవదనీ భార్యాభర్తల సంబంధాన్ని ఆలోచనాత్మకంగా చెబుతుంది.

ధార్మిక క్రియలకీ స్త్రీయే ఆలంబన అంటున్నాయి తైత్తిరీయ, శతపథ బ్రాహ్మణాలు. మెరుపు ఉన్న మేఘం చల్లగా వర్షిస్తుంది. అలాగే సతులతో కలసి ఉంటేనే సత్పురుషులు వరాలను కురిపిస్తారట.

సమాజశ్రేయస్సులో కూడా స్త్రీల పాత్ర గణనీయమైనది. ఋగ్వేదంలోని వివాహ సూక్తం – **సౌభాగ్యంకోసం నిన్ను స్వీకరిస్తున్నాను. నువ్వు దేవదత్తవు. లోకకళ్యాణం నీ వల్లనే సాధ్యం** అని భర్తచేత చెప్పించే మంత్రాలు ఉన్నాయి. ఇవన్నీ స్త్రీ పక్కన ఉంటేనే పురుషుడు నిర్వహించ గలుగుతాడు. **(గృహ్ణామి తే ... గార్హపత్యాయ దేవాః).** స్త్రీని లైంగిక వస్తువుగా చూడటం తప్పు. సకలరంగాల్లో తమ శక్తియుక్తుల్ని చాటుతున్న ఆడపిల్లలకు– వ్యక్తిగా, వ్యష్టిగా, సామాజికంగా, పాలన పరంగా అందుతున్న భద్రత ఏ పాటిది? అభివృద్ధి క్రమంలో స్త్రీలకు భాగస్వామ్యం, న్యాయం, భద్రత, ఆరోగ్యం అనేవి చాలా కీలకమైనవి. మనదేశంలో వాటికి ఇచ్చే ప్రాధాన్యం ఎంత అంటే – మహిళకు సహకరించడంలో 167 దేశాల్లో 133వ స్థానంలో ఉంది నేడు మన దేశం.

భద్రతలో ప్రభుత్వాల వైఫల్యాలు – న్యాయస్థానాల నత్తనడక– రక్షణవ్యవస్థలోని అలసత్వం సమాజంలోని అమర్యాద వాతావరణం కచ్చితంగా మారాలి. సంస్కార బీజాల్ని పిల్లల మనసుల్లో నాటేలా పాఠ్యాంశాల కూర్పు జరగాలి. విలువలతో విద్య మనందరి నినాదం కావాలి.

వ్యాపారధోరణి, ఉపాధికాంక్ష – విద్యావ్యవస్థలో విలువల్ని కాలరాస్తుండడం, మంచి కంటే చెడునే ఘాటుగా ప్రచారం చేయడంలో టీవీలు సినిమాలు చూపించే చిత్తశుద్ధి, ఆధ్యాత్మికత లేని జీవితాలు, మహిళలలో మితిమీరిన స్వేచ్ఛా ప్రవృత్తి, సనాతన సంస్కృతి, సంప్రదాయాలపై విముఖత, కుటుంబ విలువలు నేర్పించకపోవడం లాంటి అనారోగ్యకరపరిస్థితులు మారాలి.

మార్గం లేదా అంటే ఉంది. ప్రపంచంలో ఏ సమస్యకైనా పరిష్కారం అయితే రాముడిదగ్గరే దొరుకుతుంది. శ్రీరాముడికి సత్యవాక్పాలన, ఏకపత్నీవ్రతం రెండూ రెండు కళ్ళు. తాను ఏకపత్నీత్వాన్ని కఠోరమైనవ్రతంగా ఎందుకు ఆచరించి చూపాడు పరస్త్రీలను స్వీకరించిన వారిని ఎవ్వరినీ ఎందుకు ఉపేక్షించలేదు అంటే ఇదుగో ఇలాంటి దారుణాలు జరగకూడదని. ఏకపత్నీవ్రతాన్ని శ్రీరాముడు శాసనం చేశాడు. కుశుడు దానిని చట్టబద్ధం చేశాడు.

**అయోధ్యాకాండలో కైకేయి న రామః పరదారాం శ్చ చక్షు ర్భ్యామపి పశ్యతి–** శ్రీరాముడు ఇతరస్త్రీలను కన్నెత్తైనా చూడడు. అంటుంది. అందరూ రాముణ్ణి ఆదర్శంగా తీసుకుంటే నేడు ఇన్నిన్ని దారుణాలు జరుగుతాయా!

✦ ✦ ✦

# గోసంరక్షణా ధర్మాలు

**'మధు వాతా ఋతాయతే మధు క్షరంతి సింధవః ... మాధ్వీః గావో భవంతు నః'** అంటోంది ఋగ్వేదం. గోవులు మధువును కురిపిస్తాయని దాని అర్థం.

**గావో మే అగ్రత స్సంతు గావో మే సంతు పృష్ఠతః,**
**గావో మే హృదయే సంతు గవాం మధ్యే వసా మ్యహమ్.**

నాకు ముందూ వెనుకా గోవులు ఉండాలి. నేను గోవులమధ్యనే ఉంటాను. అన్న శ్రీసూక్తిని బట్టి గోవు ప్రాధాన్యం తెలుస్తుంది. గోవును మాత్రమే మాతగానూ సకల దేవతా స్వరూపంగానూ భావించి పూజించడం మన వైదిక ధర్మం.

దక్ష ప్రజాపతి ప్రాణి సృష్టి చేసిన తరువాత కొంచెం అమృతం త్రాగాడు. అప్పుడు అతడి శ్వాసలోని సుగంధం నుండి ఒక గోవు జన్మించింది (శతపథబ్రాహ్మణం). అందువల్ల దానికి 'సురభి'అని పేరు.

ఋగ్వేదంలోని గోసూక్తం (4- 12) గోమాహాత్మ్యం ప్రకటిస్తోంది.

క్షీరసముద్రాన్ని మథించినప్పుడు సురభి ఆవిర్భవించిందంటున్నాయి పురాణాలు. ఆ సురభి రోమకూపాల నుంచి కొన్ని లక్షల సంఖ్యలో గోవులు పుట్టాయి.

క్షీర సాగరమథనంలోనే - నంది, శుభద, సురభి, సుశీల, బహుళ అనే అయిదు గోవులు పుట్టాయి (భవిష్యపురాణం). వీటినే కామధేనువులు అంటారు. **"ధేనూనా మస్మి కామధుక్"** అన్నాడు గీతలో శ్రీకృష్ణుడు. అంటే ధేనువులలో నేను కామధేనువుని అని.

**'గావః విశ్వస్య మాతరః గవా మంగేషు తిష్ఠంతి భువనాని చతుర్దశ'** గోవు విశ్వజీవులకు తల్లి. గోవులో చతుర్దశ భువనాలున్నాయి. అవి దట్టమైన నీలి, నలుపు, ధూమ్ర, బభ్రు, శ్యామ, అరుణ, పింగళ (చిత్ర) వర్ణాలలో ఉన్నాయట (స్కాందం).

ఇంతటి మహిమ కలిగినవి కాబట్టే ఏ దోషమైనా గోవుకు పూజగానీ, సేవగానీ చేస్తే తొలగిపోతుంది. గోవును, గో పదార్థాలను ఇతరులకు దానంగా ఇవ్వడం కూడా గోపూజతో సమానమే.

గోసేవయే పరమాత్మ సేవ. గోవు లేనినాడు సనాతన ధర్మం లేదు. సనాతనధర్మం అగ్ని మీద ఆధారపడుతుంది. అగ్నిముఖంగా దేవతలకు హవిస్సు ఇస్తారు. గోవు లేనిదే హోమమే లేదు.

పూర్వం దేవతలకు ఆకలి వేసి బ్రహ్మదేవుడి వద్దకు వెళ్తే ఆయన అమృతం ఇచ్చాడట. దేవతలు ఆ అమృతం సేవించినప్పుడు ఆ అమృతపు సువాసనల నుండి కామధేనువు ఉద్భవించింది. కామధేనువు నుండి మరి కొన్ని ఆవులు జన్మించాయి. ఆ ఆవులన్నీ హిమాలయాల మీద విహరిస్తున్నాయి. ఆ సమయంలో ఒక లేగదూడ తన తల్లిదగ్గర పాలు తాగుతుంది. ఆ పాల నురగు గాలికి ఎగిరి అక్కడే తపస్సు చేసుకుంటున్న పరమశివుడి తల మీద పడింది. పరమశివుడికి కోపం వచ్చింది. మూడో కన్ను తెరచాడు. అంతే ఆ ఆవులన్నీ ఆ వేడికి ఎర్రగా మారి తలోదిక్కుకు పారిపోయాయి. అలా మారినవే కపిలగోవులు. అప్పుడు బ్రహ్మదేవుడు – మహేశా ! నీ తల మీద ఉన్న చంద్రుడు నిరంతరం నీ మీద అమృతం కురిపిస్తుంటాడు కదా ! లేగ దూడల నోటి నుండి వచ్చే నురగు కూడా అమృతతుల్యమే కదా ! అది ఎంగిలి ఎలా ఔతుంది ? దీనికి ఆగ్రహిస్తే ఎలా ! వాటిని కరుణించు అని ఒక మంచి ఎద్దును శివుడికి కానుకగా ఇచ్చాడు.

ఇక్ష్వాకువంశంలో సౌదాసుడికి వారి పురోహితుడైన వసిష్ఠమహర్షి- ఆవు పవిత్రమైనది. ఆవు హవిస్సుకు పుట్టినిల్లు. అన్ని జీవులకు గోవే ఆధారం. గోవులు ఉన్న చోట లక్ష్మి నివసిస్తుంది. గోవు ఈ సంసార సాగరాన్ని దాటడానికి పనికి వచ్చే పడవ. స్వర్గానికి నిచ్చెన. మానవులు తమకున్న గోసంపదలో పదింట ఒక దానిని దానంగా ఇవ్వాలి. గోవును ఉదయం స్మరించి, నమస్కరిస్తే ఎంతో పుణ్యం. మానవులకు పీడ కలల వలన వచ్చే పీడ గోవును స్మరిస్తే పోతుంది అని చెప్పాడు.

శుకమహర్షి- గోవుకు సమానమైనది ఈ లోకంలో మరేదీ లేదన్నాడు. గోవును చూస్తే చాలు పాపాలు పోతాయి. పూజిస్తే స్వర్గసౌఖ్యాలు కలుగుతాయి. గోవు ఔషధులకు నిలయం. గో పంచితం, క్షీరం, నెయ్యి, పేడ సకలరోగాలను హరించివేస్తాయి.

అగ్నిలో ఏం వేసినా కార్బన్-డై-ఆక్సయిడ్, ఇతర విషవాయువులే వస్తాయి. కానీ ఆవు నెయ్యిని అగ్నికి ఆహుతిస్తే ప్రాణవాయువు వస్తుంది. (10 గ్రాముల ఆవునెయ్యికి 1 టన్ను ఆక్సిజన్).

హవిస్సుగా వేసిన ఆవునెయ్యి వాసన వ్యాపించినంతవరకూ గాలిలో సూక్ష్మక్రిములు నశిస్తాయి. హవిస్సుగా గేదె నెయ్యి వేస్తే, అది భూమి నుంచి 300 మీటర్ల నుంచి 1000 మీటర్ల పై వరకు మాత్రమే వెళ్ళగలదు. కానీ ఆవునెయ్యి అణురూపంలో భూ ఉపరితలం నుంచి 8 కిలోమీటర్ల పైకి వెళ్ళి, 10 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో వ్యాపిస్తుంది. అక్కడ ఏవైనా నీటి అణువులు ఉంటే, వాటిని దగ్గరకు చేర్చి, వర్షం కురిపిస్తుంది. ఈ క్రమంలో తమ చుట్టు ఉన్న కాలుష్యాన్ని శుద్ధి కూడా చేస్తాయి. అంటే యజ్ఞం వల్లనే స్వచ్ఛమైన నీరు లభిస్తుంది. రసాయనాలు చల్లితే కురిసేది కలుషితమైన నీరే.

ఆవు ఒకవేళ విష పదార్థాలను తిన్నా విషపూరితం కాదు. మరే జంతువుకూ లేని విశిష్టగుణం ఇది.

- ప్రాణవాయువును పీల్చుకుని ప్రాణవాయువే వదిలే ఏకైక ప్రాణి గోవు.
- విషాన్ని హరించే గుణం ఆవు పాలకుంది.
- వైద్యశాస్త్రానికే అర్థంకాని రోగాలను సైతం గోమూత్రం నయం చేస్తుంది.
- ఆవునెయ్యి, బియ్యం రెండూ కలిపి వేడిచేస్తే ఇథలిన్ ఆక్సైడ్, ప్రోపలీన్ ఆక్సైడ్ విడుదలవుతాయి. కృత్రిమ వర్షానికి ఈ ప్రోపలీన్ ఆక్సైడే శ్రేష్టం.
- గో పంచకం ప్రపంచంలోనే సర్వోత్తమైన కీటకనాశిని.
- ఇళ్ళను, వాకిళ్ళను ఆవుపేడతో అలికితే రేడియోధార్మిక కిరణాలనుండి మనల్ని కాపాడుకోవచ్చు.
- ఆవుపేడలో కలరా వ్యాధిని వ్యాపింపజేసే క్రిములను నాశనం చేసే శక్తి ఉంది.
- గోమూత్రం గంగాజలమంత పవిత్రమైనది.

కపిల గోవులకు చెవులు, ముక్కు, కళ్ళు, కొమ్ములు కపిల వర్ణంలో ఉంటాయి. అలాకాక ఏ ఒక్క చోట ఎర్రగా ఉన్నా చాలు. అది కపిల గోవే.

కొన్ని కొన్ని ప్రాణుల ధూళి మీద పడకూడదు. అపమృత్యు దోషం. అదే గోవుల గిట్టలవల్ల లేచిన ధూళి–గోధూళి పరమ పవిత్రం.

యజమానిలో ఏ రోగం ఉందో గమనించి దాని నివారణకు కావలసిన యాంటీబాడీస్ ను తన శరీరంలో తయారు చేసుకుంటుది గోవు. అందుకే గోవుకు

సమీపంలో ఉండాలి. ఎవరికి ఆరోగ్యసమస్యలు ఉంటే వాళ్ళే గోవుకు సేవ చేయాలి. సంతానోత్పత్తి సమస్య ఉండడంవల్ల దిలీపుడు– సుదక్షిణ నందినీ ధేనువుకు సేవచేశారు. అందువల్ల వారిలోని లోపాలు తొలగిపోయాయి. సంతానం కలిగింది.

గోదానమహిమ గురించి అశ్వమేధపర్వంలో భీష్ముడు ధర్మరాజుకు వివరిస్తాడు. ఒక పుణ్యదినాన బ్రాహ్మణుల అనుమతితో ఆ రోజంతా ఉపవాసం ఉండి ఒకరోజు గోశాలలో ఉండి, మరునాడు ఉదయం తాను దానం ఇవ్వదలచిన గోవును పేరు పెట్టి పిలిచి – " ఈ గోవు నా తల్లి, ఈ ఎద్దు నా తండ్రి, ఈ గోవు గర్భం స్వర్గం, ఈ గోవు నిలిచిన ప్రదేశం పుణ్యలోకం. ఇచ్చిన వ్యక్తికి శాశ్వత సుఖసంతోషాలు లభిస్తాయి అంటూ దానం చెయ్యాలి. ఇక దానం పుచ్చుకునే వాడు –విద్యార్థికానీ, వ్రతనిష్ఠ ఉన్న వాడు కానీ అయి ఉండాలి. మంచి గుణాలు కలిగి ఉండాలి.

గోవును హింసించడం, ఎంతో పాపం. గోవును సంరక్షిస్తే సిరుల వాన కురుస్తుంది. గోమాంసం ఎగుమతితో ఆర్థిక వ్యవస్థ బలపడుతుందనుకోవడం అవివేకం. నిజానికి ఒక గోవును పెంచుకుంటే ఎంత లాభమో ఆలోచిస్తే కళ్ళు తిరిగిపోతాయి. (గోవధనిషేధచట్టం కేసులో వాదించిన న్యాయవాది శ్రీరాజీవ్ భాయ్ చెప్పిన ఆనాటి లెక్కల ప్రకారం) ఒక ఆరోగ్యంగా ఉన్న గోవును వధించడం వల్ల వచ్చే ఆదాయం రూ.7000/– మాత్రమే. అదే ఒక గోవును సంరక్షిస్తే– ఒక ఆరోగ్యమైన గోవు రోజుకి 10కిలోల గోమయం,( ఆవుపేడ ), 3 లీటర్ల గోమూత్రం ఇస్తుంది.

ఒక కిలో గోమయం తో 33 కిలోల ఎరువు తయారవుతుంది. శాస్త్రవేత్తలు గోమయంతో చేసిన ఎరువు భూమికి కావల్సిన 18 సూక్ష్మపోషకాలు అందించే అత్యుత్తమ సేంద్రియ ఎరువుగా ప్రకటించారు. ఒక కిలో సేంద్రియ ఎరువు అంతర్జాతీయ విపణిలో 6 రూపాయలు (ఇది అతి తక్కువ ధర), అనుకుంటే, ఒక రోజుకు గోమాత రూ.1,800/– నుండి రూ.2,000/– దాకా ఆదాయం తెచ్చి పెడుతుంది.

(33 కిలోల ఆవు పేడ నుండి 330 కిలోల సేంద్రియ ఎరువు తయారు అవుతుంది కదా! 330 = రూ. 6/–). పైగా ఈ గోవుల కు ఆదివారం సెలవులు కానీ లేవు కదా! ఈ లెక్కన గోమాత వలన ఒక సంవత్సరంలో అంటే 365 రోజులలో వచ్చే ఆదాయం 1800 × 365 = రూ. 6,57,000/–. ఇదంతా గోమయము వలన

అంటే "ఆవు పేడ" వలన వచ్చే ఆదాయం. రమారమి 20 సంవత్సరాలు జీవించే గోమాత వలన వచ్చే ఆదాయం దాదాపు 1 కోటి 31 లక్షల 40వేలు రూపాయలు పైనే. గోమయంలో "లక్ష్మి" నివసిస్తుందంటే ఇదే.

"ఒక గోవు రోజుకి 2 లేక 2.25 లీటర్ల గోమూత్రం ఇస్తుంది. ఇది 48 రకాలైన రోగాలను సమూలంగా నిర్మూలించగలదు. ఒక లీటరు గోమూత్రం భారతీయ విపణిలో రూ. 500/– అంతర్జాతీయ విపణిలో ఇంకా ఎక్కువ. అమెరికాలో గోమూత్రం "పేటెంటు" కూడా చెయ్యబడింది. గోమూత్రానికి 3 పేటెంట్లు ఉన్నాయి. అమెరికా ప్రభుత్వం గోమూత్రాన్ని భారతదేశం నుండి దిగుమతి చేసుకుని, కాన్సర్ కు, మధుమేహానికి మందులు తయారు చేస్తోంది. అమెరికాకు ఎగుమతి చేసే గోమూత్రం ధర ఒక లీటరు రూ. 1,200/– నుండి రూ. 1,300 అనుకుంటే ఆ లెక్కన గోమూత్రం వలన ఆదాయం రోజుకు రూ. 3,000/– , వార్షిక ఆదాయం రూ. 3000×365 =రూ. 10,95,000/–.

ఒక గోవు తన జీవిత కాలమైన 20 సంవత్సరాలలో కేవలం గోమూత్రం మీద ఇచ్చే ఆదాయం 3000×365×20 = 2,19,00,00 (అక్షరాల 2 కోట్ల 19 లక్షల రూపాయలు). ఇదే గోమయం "మిథైన్" అనే వాయువు ఉత్పత్తి చేస్తుంది. దీనిని మనం వంటకీ వాహనాలకు ఇంధనంగానూ పనికివస్తుంది. కిలో మీటరుకు 50నుండి 60 పైసల కంటే ఎక్కువ ఖర్చు కాదు. శబ్ద, వాయు కాలుష్యాలు అసలే ఉండవు.

గోవధను ఏ మతగ్రంథాలూ చెప్పలేదు. **"ఇస్లాం పాలకులూ ఎవరూ గోవధను సమర్థించలేదు. బాబర్, హుమాయున్, ఔరంగజేబు గోవధని వ్యతిరేకిస్తూ చట్టం చేసినవాళ్లే.** గోసంరక్షణ మన రాజ్యాంగ విధి. గోవు కొవ్వుతో తయారు చేసిన తుపాకీగుండును నోటిలో పెట్టుకోవడం ఇష్టం లేక ఒక బ్రిటీషు అధికారిని కాల్చి చంపాడు శ్రీ మంగళ్ పాండే. ఈ ఘటనే మన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి దారి తీసింది. కాబట్టి గో సంరక్షణ ప్రతి భారతీయుని కర్తవ్యం. అది రాజ్యాంగబద్ధమైనది.

✦ ✦ ✦

# వర్ణాశ్రమ ధర్మాలు

మానవుడు పుట్టిన దగ్గర నుండి మరణించేవరకూ ఆదర్శవంతమైన జీవనాన్ని సాగించడానికి మన సనాతన ధర్మం కొన్ని ఆశ్రమాలను నియమించింది. ఆ యా ఆశ్రమాలలో పాటించవలసిన ధర్మాలనూ నిర్దేశించింది. వీటినే **'ఆశ్రమ ధర్మాలు'** అంటారు. **'ఆశ్రమస్య ధర్మః ఆశ్రమాయ ధర్మః, ఆశ్రమిణాం బ్రహ్మచర్యాదీనాం ఆచరణీయం ధర్మమ్'.**

బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్యాసి మొదలైనవాళ్ళు ఆచరించడం కోసం విధించిన ధర్మాలు. ఆశ్రమం అంటే – **'ఆశ్రయంతి తపసా ఆత్మానం అత్ర ధర్మచారిణః'** ధర్మాన్ని ఆచరించే స్థానం అని దీని అర్థం. ఇవి 4.

**1. బ్రహ్మచర్యాశ్రమం:** బ్రహ్మం గురించి చరిస్తూ జీవించే ఆశ్రమం ఇది. **బ్రహ్మ భావే మనశ్చారం బ్రహ్మచర్యం పరం తప** (జాబాలోపనిషత్ 1–14) మనస్సును బ్రహ్మం మీదే ఉంచడం.

**సామాన్య ధర్మాలు:** అన్ని వర్ణాల వారికీ వర్తించే ధర్మాలు సామాన్య ధర్మాలు. వీటిలో ప్రత్యేకంగా కొందరికి మాత్రమే విధించేవి విశేష ధర్మాలు.

1. ఏ వర్ణంవారైనా ఇంద్రియ నిగ్రహంతో ఉండడం, మనస్సును అర్థమార్గంలో వెళ్ళనివ్వకుండా పరమార్థం కోసం చింతించేలా చూసుకోవడం ముఖ్యం. భోగాలపై ఆసక్తిని విడిచిపెట్టాలి. బ్రహ్మచర్యాశ్రమంలో అందరూ తమ శ్రద్ధనంతా విద్యాభ్యాసంపైనే ఉంచాలి.
2. విద్యనేర్పిన గురువును సేవించాలి. శుశ్రూష చెయ్యాలి.
3. గురువుతో పాటు తక్కిన పెద్దలు ఉన్నా ముందు గురువుకే నమస్కరించాలి.
4. గురువు ఎదురైతే లేచి నమస్కరించాలి. గురువు ఆజ్ఞాపిస్తేనే కూర్చోవాలి.

**'సర్వం బ్రహ్మేతి యో వేద బ్రహ్మచారీ స ఉచ్యతే'**

అంతటా పరబ్రహ్మనే దర్శించేవాడు బ్రహ్మచారి. సర్వకాల సర్వావస్థలలోనూ స్త్రీ సంగమాన్ని కోరుకోనివాడు బ్రహ్మచారి.

**కర్మణా మనసా వాచా సర్వావస్థాసు సర్వదా,**
**సర్వత్ర మైథున త్యాగో బ్రహ్మచర్యం ప్రచక్షతే.**

అతడు పాటించేదే బ్రహ్మచర్యం. ఈ వ్రతంలో 12 సంవత్సరాలు నిష్ఠగా ఉంటూ విప్రుడు వేదాన్ని అధ్యయనం చెయ్యాలి. తను ఏ వంశపరంపరకు చెందితే ఆ వేదాన్ని చదవాలి. దీనినే 'స్వాధ్యాయం' అంటారు. క్షత్రియ, వైశ్య శూద్రాదులు పురాణాన్నీ ఇతిహాసాన్నీ పఠించాలి. లేదా కులవృత్తులను నేర్చుకోవాలి.

## బ్రహ్మచారి విధులు

బ్రహ్మచారి శారీరక మానసిక సాధనలు రెండూ చెయ్యాలి. వాక్కునూ, చేష్టలను, ఆహార స్వీకరణనూ నియంత్రించుకోవాలి. భిక్ష ద్వారా తెచ్చిన ఆహారాన్ని గురువు అనుమతితో భుజించాలి. సత్త్వగుణాన్ని పెంపొందింపజేసే ఆహారాన్నే అంటే శాకాహారాన్నే స్వీకరించాలి. ఉప్పు, పులుపు, కారం వంటి రజోగుణ పదార్థాలు, మాదకద్రవ్యాలు, మాంసాహారం నిషేధం (ఆపస్తంభ సూత్రం). పుష్పాలు, సుగంధద్రవ్యాలు, తైలంతో అభ్యంజన స్నానం, వాహన వినియోగం, పాదరక్షలు ధరించడం, వేడినీళ్ళ స్నానం, కళాసక్తి కూడా నిషిద్ధాలే. కామక్రోధాదులకు దూరంగా ఉండడం, వీర్యాన్ని సంరక్షించుకోవడం బ్రహ్మచర్య వ్రతానికి ప్రధానమైనవి.

జూదం, వాదోపవాదాలు, పరనింద, అసత్యం, కామసంభాషణలు, కౌగిలింతలు, అపకారపు తలంపులు పనికిరావు. ఎప్పుడూ ఒంటరిగానే నిద్రపోవాలి. సంధ్యావందనాది వైదిక కర్మలు నియమం తప్పకుండా పాటించాలి.

భోజనం చేసేటప్పుడు కాళ్ళు, చేతులు శుభ్రంగా కడుక్కొని ఆచమనంచేసి కూర్చొని మౌనంగా భోజనం చెయ్యాలి. విద్యార్థికి స్పర్ధ ఉండవచ్చు కానీ అసూయ పనికిరాదు. అతిగా మాట్లాడడం, తనను తాను పొగడుకోవడం, తొందరపాటు పనులు చేయడం విద్యార్థులకు శత్రువులు. (మహాభారతం 8-3)

**ఆలస్యం మదమోహౌ చ చాపలం గోష్ఠిరేవచ,**
**స్తబ్ధతా చాతిమానిత్వం తథాత్యాగిత్వమేవచ,**
**ఏతేవై సప్తదోషాః స్యుః సదా విద్యార్థినాం మతాః.**

1. సోమరితనం, 2. మదం, 3. చపలత్వం, 4. గుంపులు కట్టడం, 5. జడత్వం, 6. స్వీయాభిమానం, 7. త్యాగం లేకపోవడం అనే ఏడు విద్యార్థుల్లో సాధారణంగా ఉండే లక్షణాలు. వీటిని పరిత్యజించాలి.

**'కాక చేష్టా బక దృష్టిః శ్వాన నిద్రా తథైవ చ**
**అల్పాహారీ దేహత్యాగం పంచవిద్యార్థి లక్షణమ్'**

ఉత్తముడైన విద్యార్థికి 1. కాకిలాంటి చేష్ట, 2. కొంగలాంటి చూపు, 3. కుక్క లాంటి నిద్ర, 4. తక్కువ తినడం, 5. తాను ఉన్న ప్రదేశాన్ని విడిచిపెట్టడం అనే లక్షణాలు ఉంటాయి. వీటిని పాటించాలి.

విద్య రావాలంటే సుఖాన్ని విడిచిపెట్టాలి. సుఖం కావాలనుకుంటే విద్యను విడిచిపెట్టాలి. ఇలాంటి ఉత్తమ లక్షణాలను పాటించే విద్యార్థి విద్యాభ్యాసం పూర్తి చేసుకొన్నాక తనకు సంపూర్ణమైన వైరాగ్యం కలిగితే బ్రహ్మచర్య దశనుండే సన్యాసాశ్రమాన్ని స్వీకరించవచ్చు. లేదా నైష్ఠిక బ్రహ్మచర్యాన్ని పాటించగలిగితే పాటించవచ్చు. లేదా వివాహం చేసుకొని గృహస్థాశ్రమ ధర్మాన్ని అనుసరించవచ్చు. అలా చెయ్యాలనుకొనే శిష్యుడికి గురువు విద్యాభ్యాసం పూర్తయిన తరువాత స్నాతకోత్సవ రూపంలో చెప్పిన తైత్తిరీయోపనిషద్వాక్యాలు సర్వదా అనుసరణీయాలు.

## గృహస్థాశ్రమం

అన్ని ఆశ్రమాల్లోకెల్లా ఉత్తమమైనదీ చతుర్విధ పురుషార్థాలను సాధించిపెట్టేదీ ఈ ఆశ్రమమే! మిగిలిన ఆశ్రమాలకూ ఈ ఆశ్రమమే మూలాధారం.

బ్రహ్మచారి ఈ ఆశ్రమంలోనికి వస్తే గృహస్థు అవుతాడు. పెద్దల సమ్మతంతో తల్లి తరుపున ఎనిమిది తరాలు, తండ్రి తరపున ఎనిమిది తరాలు బంధు వర్గంలో చేరని కన్యను వివాహం చేసుకోవాలి. ఈ ఆశ్రమంలో తన ఆయుర్దాయంలో సగం అంటే 50 సంవత్సరాలు మాత్రమే ఉండాలంటోంది మనుస్మృతి (2-169).

గృహస్థు 1. బ్రహ్మ, 2. పితృ, 3. దేవ, 4. భూత, 5. అతిథి (మనుష్య) యజ్ఞాలనే పంచమహాయజ్ఞాలను విధిగా నిర్వర్తించాలి.

1. వేదాధ్యయనం, అధ్యాపనం - బ్రహ్మయజ్ఞం.
2. పితృతర్పణాలు, శ్రాద్ధకర్మలు - పితృయజ్ఞం.
3. దేవతారాధన విధి - దేవయజ్ఞం.
4. తనపై ఆధారపడి ఉన్న సకల ప్రాణులను ముఖ్యంగా జంతువులు, క్రిమి కీటాదులకూ ఆహారాన్ని అందివ్వడం - భూతయజ్ఞం.
5. అతిథిని ఆదరించడం - అతిథి యజ్ఞం.

ఇవికాకుండా 1. అహుతం, 2. హుతం, 3. ప్రహుతం, 4. బ్రహ్మహుతం, 5.ప్రాశితం అనే పంచయజ్ఞాలు కూడా చెయ్యాలి.

అహుతం అంటే జపం, హుతం అంటే హోమం. ప్రహుతం అంటే చిన్న చిన్న ప్రాణులకి ఆహారాన్ని పెట్టడం. బ్రహ్మహుతం అంటే బ్రాహ్మణుల్ని అతిథుల్నీ సేవించడం. ప్రాశితం అంటే తర్పణాలు వదలడం. అంటే శ్రాద్ధకర్మలు.

సకలదేవతలూ, మహర్షులూ, సర్వజీవులూ, అతిథులూ అందరూ గృహస్థుపైనే ఆధారపడి ఉన్నారు. ఒక్కరోజు గృహస్థు తన విధుల్నించి తప్పుకున్నా వీళ్ళంతా క్షోభిస్తారు. అందువల్ల గృహస్థు గృహకార్యాలపట్ల ఆసక్తి, శ్రద్ధకలవాడై ఉండాలి. ఎవరితోనూ వివాదాలు పెట్టుకోకూడదు. ఇంటికి వచ్చిన వారిని ఆదరించినట్లయితే సమస్త పుణ్యలోకాలూ గృహస్థుకు లభిస్తాయి.

గృహస్థు ఎప్పుడూ సత్యాన్నే పలకాలి. ఇతరుల ద్రవ్యాలను అపహరించడం, మోసం చెయ్యడం, తల్లిదండ్రులతోగానీ, అతిథులతోగానీ పరుషంగా మాట్లాడకూడదు. పెద్దలను అపహాస్యం చెయ్యకూడదు. వాళ్ల ముందు తాను కూర్చోకూడదు. తనపై ఆధారపడిన వాళ్ళు భోజనం చేసిన తర్వాత మాత్రమే తాను భోజనం చెయ్యాలి.

ఆచారమే గృహస్థుడికి బలం, కీర్తి, ఔన్నత్యమూను. ఆచారహీనుడైన గృహస్థు అపకీర్తి పాలవుతాడు. ఇహపరాలలో భ్రష్టుడవుతాడు.

తల్లిదండ్రుల్ని సేవించడం, బ్రాహ్మీముహూర్తంలోనే తన విధుల్ని ప్రారంభించడం, సంధ్యావందనాదులు క్రమం తప్పకుండా చెయ్యడం, అధర్మకృత్యాలకు దూరంగా ఉండడం, వివాదాలకు వెళ్ళకుండా ఉండడం, పితృదేవతల్ని, దేవతల్ని, ఋషుల్ని, అతిథుల్ని అర్చించిన తర్వాతే తాను భోజనం చెయ్యడం, అన్నాన్ని దూషించకుండా ఉండడం, ఎంగిలి భుజించకుండా ఉండడం గృహస్థుకు విధులు.

ప్రాతఃకాల విధులు పాటించాలి. తలదువ్వుకోవడం, అద్దాన్ని చూడడం తర్పణాలు వదలడం పూర్వాహ్నంలోనే చెయ్యాలి. బహిరంగ ప్రదేశాలలో మూత్ర, మల విసర్జన చేయకూడదు. విరిగిన వస్తువుల్ని వాడకూడదు.

పెద్దలు వచ్చినప్పుడు గౌరవించాలి. వారికి ఆసనాన్ని చూపాక, వారి అనుమతితోనే తాను కూర్చోవాలి. వారు తిరిగివెళ్ళేటప్పుడు నదీతీరం దాకా వెళ్ళి సాగనంపిరావాలి. బ్రాహ్మణుల్ని, గోవుని, అగ్నిహోత్రాన్ని ఎప్పుడూ అవమానించకూడదు.

అనధ్యయనం రోజుల్లో వేదాధ్యయనం చేయకూడదు. గురువు మనసు నొప్పించకూడదు. దేవాలయంగానీ, పుణ్యప్రదమైన వృక్షంగానీ కనిపిస్తే ప్రదక్షిణ చేసి నమస్కరించాలి.

గ్రహణం సమయంలో యథావిధిగా ఆచారాలు పాటించాలి. మడిని పాటించాలి. ఋతుదినాలలో స్త్రీని కలవకూడదు. ఆరో రోజు మాత్రమే సంగమించాలి. సరి రాత్రులలో సంగమిస్తే పుత్రులు, బేసి రాత్రులలో సంగమిస్తే పుత్రికలు జన్మిస్తారు. పర్వదినాల్లోనూ, సంధ్యా సమయాల్లోనూ సంగమించకూడదు. నియమిత సమయాల్లోనే క్షురకర్మ చేయించుకోవాలి. ఆ తరువాత స్నానం తప్పనిసరిగా చెయ్యాలి.

గురువులు, దేవతలు, తల్లిదండ్రులవైపు కాళ్ళు చూపి కూర్చోకూడదు. వైద్యుడు, ఏరు, విప్రుడు లేని ఊరిలో నివసించకూడదు. బలవంతుడు, ధార్మికుడు అయిన రాజు పరిపాలించే రాజ్యంలోనే నివసించాలి.

ఇంకా పెద్దల ద్వారా విన్నవీ వంశపారంపర్యంగా వస్తున్నవీ అయిన ఆయా విధుల్ని గృహస్థు తప్పనిసరిగా ఆచరించాలి అని బ్రహ్మపురాణం తెలియజేస్తోంది.

## వానప్రస్థాశ్రమ ధర్మాలు

మానవుడు గృహస్థుగా తన కర్తవ్యాలన్నింటినీ నిర్వహించిన తర్వాత, బాధ్యతలన్నీ తీరిపోయాక, వారందరికీ ఒక ఉపాధి చూపించాక, తాను ఒక అడవికి వెళ్ళి భార్యతో సహా అక్కడే జీవించడాన్ని వానప్రస్థాశ్రమం అంటారు. (మనుస్మృతి 6-2).

మహాభారతంలో కుంతీదేవి, విదురుడు, ధృతరాష్ట్రుడు, గాంధారీ ఈ ఆశ్రమం స్వీకరించారు. పూర్వం ఎందరో రాజవంశాలవారు తమ బాధ్యతలు నెరవేర్చాక ఇలాగే అడవుల్లో జీవించేవారు. ప్రస్తుతం ఆ అవకాశం లేకపోవడంవల్ల కనీసం ప్రాపంచిక బంధనాలను విడిచిపెట్టి ఏకాంతంగా పుణ్యక్షేత్రాలలో జీవనం సాగించవచ్చు. వానప్రస్థాశ్రమ స్వీకారం చేసినవాళ్ళు ఇంద్రియనిగ్రహంతో, జిహ్వాచాపల్యం విడిచిపెట్టి, కందమూల ఫలాదులు స్వీకరిస్తూ, నిత్యం ధ్యానంలోగానీ, తపస్సులోగానీ కాలం గడపాలి. ఎప్పుడూ వైరాగ్యాన్ని విడిచిపెట్టకూడదు.

ఈ ఆశ్రమంలోనూ దేవ, పితృ, మనుష్య, భూత, అతిథి సేవల్ని విడిచిపెట్టకూడదు. యథాశక్తి ఆచరించాలంటోంది గౌతమ ధర్మ సూత్రం (4-29).

నిత్యం వేదాంతం చదువుతూ, అందరితో స్నేహభావంతో మెలుగుతూ ఎవరి నుండీ ఏదీ ఆశించకుండా, ఉన్నదాంట్లోనే భిక్ష ఇస్తూ, సకలప్రాణులపై భూతదయతో ఉండాలి.

వానప్రస్థుడు ఈ నియమాలతో పాటు ధర్మశాస్త్రాలలో చెప్పిన విధులన్నీ పాటించాలి. ఈ ఆశ్రమం సన్యాసాశ్రమానికి మానవుణ్ణి సిద్ధం చేస్తుంది. ముఖ్యంగా –

**పుత్ర కళత్ర ద్రవ్య**
**క్షేత్రా రామముల నాసచెడి యెచ్చోటన్**
**మైత్రియొనర్చక బ్రహ్మ**
**క్షత్రియ వైశ్యక్రియలు విసర్జించి ధృతిన్.** (విష్ణుపురాణం 4–162)

సంతానం, ఇల్లాలు, సంపదల పట్ల, ఆస్తులపట్ల మమకారాన్ని పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలి. వానప్రస్థంలో మానసిక పరిపక్వతతో తామరాకుపై నీటిబొట్టులా ఉండగలగాలి. వానప్రస్థంలో కులధర్మాల నిర్వహణ కొంతే ఉంటుంది. ఆయా వర్ణాలవారు వారివారి కులధర్మాలను పాటించాలి. అలా ఉన్నవాడే సన్యాసాశ్రమ స్వీకారానికి అర్హుడు.

## సన్యాసాశ్రమ ధర్మాలు

ఈ ఆశ్రమ స్థాయికి చేరుకోగలిగిన వ్యక్తికి సకల ప్రాణులపట్ల దయ ఉండాలి. అందుకే ఎవరు వచ్చినా వారిపట్ల ఆదరంగా మాట్లాడుతూ హితబోధ చేస్తూ ఉండాలి. ఒక భిక్షకుడిలా జీవనాన్ని సాగించాలి. (విష్ణు పురాణం 4–163).

ఈ ఆశ్రమానికి చెందిన భిక్షుడు తన సంచారంలో అది గ్రామం అయితే ఒకరోజు, పట్టణమైతే అయిదురోజులు నివసించడం ధర్మం. ఆయా వర్ణాలవారు తమ వర్ణాల వారి నుండి భిక్షను స్వీకరించవచ్చు. అది ఎంత తక్కువైనా మహాప్రసాదంగా భావించి స్వీకరించాలి. అరిషడ్వర్గ ప్రలోభాలకు లోనుకాకూడదు. ఆత్మస్వరూపుడై, ఆత్మధ్యాన తత్పరుడై, ఆత్మారాముడై సన్యాసి మెలగాలి.

సన్యాసి తాను రుచులకోసంకాక, జీవించడానికి మాత్రమే తగిన సాత్త్వికాహారాన్ని స్వీకరించాలి. శరీరంలో ఉండే జఠరాగ్నిని హోమాగ్నిగా భావించి అందులో రోజుకు ఒక్కసారి మాత్రమే ఆహారాన్ని హవిస్సుగావేసి హోమం చెయ్యాలి. అలాంటి సన్యాసి సాక్షాత్తూ పరమేశ్వరుడే అంటోంది విష్ణుపురాణం (4–168).

మిగిలిన ఆశ్రమాలలో అన్ని ఋణాలు తీరిన తర్వాతే సన్యాసాశ్రమం స్వీకరించాలి. అటువంటి సన్యాసిలో 1. కుటీచకుడు, 2. బహూదకుడు, 3. హంసుడు, 4. పరమహంస అనే నాలుగు భేదాలు ఉన్నాయి.

1. **కుటీచకుడు** అంటే కుటీరాన్ని నిర్మించుకొని, తన ఇంటినుండిగానీ, గృహస్థుల ఇంటి నుండి కానీ లేక బంధువుల ఇంటినుండి కానీ భిక్ష స్వీకరించేవాడని అర్థం. (సూతసంహిత 7-39).
2. **బహూదకుడు.** ఈ సన్యాసి ఆశ్రమంలో ఉండాలి. ప్రతిరోజూ ఒకే ఇంటినుండి భిక్ష స్వీకరించకూడదు. రోజూ ఏడు గృహాలనుండి భిక్ష స్వీకరించాలి.
3. **హంసుడు** అంటే ఎప్పుడూ ఒకే చోట నివసించని వాడని అర్థం. రోజుకో గ్రామం చొప్పున సంచరిస్తూ తేనెటీగలాగా తిరుగుతూ భిక్ష స్వీకరించాలి. సన్యాసులందరిలో పరమహంస శ్రేష్ఠుడు. ఏకాంత ప్రదేశంలో సాధ్యమైనంత వరకూ తపస్సమాధిలో గడపాలి. బ్రహ్మచర్యాశ్రమంలోనూ, గృహస్థాశ్రమం లోనూ ఉన్నవాళ్ళు వైరాగ్య సంపన్నులైతే నేరుగా సన్యాసాశ్రమాన్ని స్వీకరించవచ్చు.

సన్యాసి పాటించవలసిన విధుల్ని మనుస్మృతి మొదలైన గ్రంథాలు తెలియజేస్తున్నాయి. బ్రహ్మనిష్ఠుడైన సన్యాసి క్రిమికీటకాదులకు కూడా హాని తలపెట్టకూడదు. ప్రపంచ విషయాలపై ఆసక్తి ఉండకూడదు. ఇంద్రియనిగ్రహం ఉండాలి. పూర్వాశ్రమంలో తనకు సంబంధం ఉన్న వ్యక్తుల శుభాశుభాలకు స్పందించకూడదు.

1. అహింస, 2. సత్యవ్రతం, 3. అస్తేయం (దొంగతనం లేకుండా ఉండడం), 4. బ్రహ్మచర్యం, 5. అపరిగ్రహం, 6 గర్వం విడిచిపెట్టడం, 7. దీనత్వం లేకపోవడం, 8. ఇంద్రియశుద్ధి, 9. మానసిక ధైర్యం, 10. ఆర్జవం (ఋజుత్వం), 11. స్నేహాలు లేకుండా ఉండడం, 12 గురుశుశ్రూష, 13. శ్రద్ధ, 14. సహనం, 15. దమం (బాహ్యేంద్రియ నిగ్రహం), 16. శమం (అంతరింద్రియ నిగ్రహం), 17. ఉదాసీన వైఖరి, 18. ధైర్యం, 19. మధురవాక్కు, 20. ఓర్పు, 21. కరుణ, 22. సిగ్గు, 23. శాస్త్ర జ్ఞానం, 24. విజ్ఞానం, 25. యోగం, 26. మితభోజనం, 27. ధృతి అనే ధర్మాల్ని పాటించాలి.

అందుకే ఈ ఆశ్రమం ఉత్తమమైనది. ఈ ఆశ్రమాన్ని స్వీకరించినవాడు నియమాల్ని పాటించలేక మళ్ళీ గృహస్థుడు అయితే వాడికి పాపం చుట్టుకుంటుంది. ఈ ఆశ్రమాన్ని స్వీకరించడానికి అన్ని వర్ణాలవారూ అర్హులే!

✦ ✦ ✦

# యతి ధర్మాలు

మహాభారతంలోని అశ్వమేధపర్వం యతిధర్మాలను విపులంగా వివరిస్తోంది.

యతీశ్వరుడికి సర్వప్రాణుల పట్లా భూతదయ ఉండాలి. దేని మీదా ఆసక్తి ఉండకూడదు. ఒక్క పరమాత్మపైనే దృష్టి నిలపాలి. చేతికందిన ఆహారాన్నే దైవప్రసాదంగా స్వీకరిస్తూ జీవించాలి.

తాబేలు తన అవయవాలను లోనికి ముడుచుకున్నట్లుగా యతీశ్వరుడు తన ఇంద్రియాలను లోపలికి తీసుకోవాలి. ఆ రోజు అవసరం తీరిన తరువాత ఎవరు ఎంత బ్రతిమాలినా అన్న వస్త్రాదులు స్వీకరించకూడదు. రోజుకు ఒక్కసారే మితంగా భుజించాలి. భగవంతుడికి తప్ప నమస్కరించకూడదు. స్తుతించకూడదు. వ్యక్తులతో స్నేహం చేయకూడదు.

**అనసూయ నక్రోధం**
**బును దమమును బ్రహ్మచర్యమును ఋజుభావం**
**బును సత్యంబు నపైశున**
**ము నహింసయుంజూవె యతికి ముఖ్య వ్రతముల్.**

(భార.అశ్వ 2-170)

1. అసూయలేకపోవడం, 2. అక్రోధం, 3. దమం, 4. బ్రహ్మచర్యం, 5.ఋజు ప్రవర్తన, 6. సత్యవ్రతం, 7. లోభవర్జనం, 8. అహింస అనే ఎనిమిది యతి పాటించవలసిన వ్రతాలు.

వస్తువ్యామోహం ఉండకూడదు. ఏకాంతంగా జీవించాలి. నిరాడంబరంగా సర్వసంగముక్తుడుగా ఉండాలి. ఆర్భాటాలు పనికిరావు.

శాంతస్వభావుడు, నిత్యశుద్ధుడు, అల్పాహారి కావాలి. నేలపైనే పడుకోవాలి. సన్యాసాశ్రమంలో అగ్నిహోత్రంతో పనిలేదు. కాబట్టి యతీశ్వరుడు తపస్సు చేసుకోవాలి. అన్నింటినీ విడిచిపెట్టడం, తన వద్ద ధన వస్తు వాహనాదులు ఏవీ ఉంచుకోకపోవడం, ఏమీ లేనివాడిగా ఉండడం, ప్రవాస జీవితాన్ని గడపడం, ప్రశాంత చిత్తంతో ఉండడం, నిష్ఠ, కృప, దైవచింతన పాటిస్తూ వేదం చెప్పిన యతిధర్మాలను ఆచరించినవాడే నిజమైన యతీశ్వరుడు.

బద్ధకం అస్సలు ఉండకూడదు. విధిగా ప్రాణాయామాదులు చెయ్యాలి. చిత్త చాంచల్యం, అమితాహారం, లోభగుణం, కామం, భయం, లౌల్యం ఇవన్నీ యోగసాధనకు బద్ధ శత్రువులు. వీటిని విడిచిపెట్టాలి.

అతినిద్ర, నిద్రలేమి, అమితాహారం, అనాహారం, గొడ్డు ఉపవాసాలు యతికి తగనివి. సన్మానాలపైనా పొగడ్తలపైనా ఆసక్తి, తిరస్కారానికీ అవమానానికీ క్రుంగిపోవడం ఉండకూడదు. ప్రీతిగా పలికే ఏ మాట అయినా అది సత్యమే అయి ఉండాలి. స్వీయానుభావాలూ, లోకాచారాలూ చెప్పడం కాకుండా శాస్త్ర సమ్మతమైన విషయాలనే ఎంత నిష్ఠురంగా ఉన్నా చెప్పాలి.

యజ్ఞయాగాదులలో అగ్రపూజలనూ, ఆతిథ్య పూజలనూ అంగీకరించకూడదు. (మార్కండేయ పురాణం 3–338). జనసమ్మర్దాలలో యతీశ్వరుడు సంచరించకూడదు. ఉత్సవాలకూ, పండుగలకూ, పబ్బాలకూ, పెళ్ళిళ్ళకూ యతులు వెళ్ళకూడదు.

తనను గౌరవించడానికిగానీ, అవమానించడానికిగానీ వీలుకాని రీతిలో సాదా సీదాగా యతి వేషం ఉండాలి.

అందరి ఇళ్ళలో భోజనాలు అయ్యాక భిక్షాటన ప్రారంభించాలి. ఆబ్దికాదులు జరిగే ఇళ్ళకు వెళ్ళకూడదు. వంట ఇంకా జరుగుతున్నా, అగ్నికార్యం జరుగుతున్నా ఆ ఇంటికి వెళ్ళకూడదు. శుభ్రం చెయ్యని ఇంటికి వెళ్ళకూడదు.

నాలుగు వేదాలూ అభ్యసించిన బ్రాహ్మణుల గృహాలనుండి భిక్షగా స్వీకరించిన ఆహారాన్ని యోగి – ప్రాణరూపంగా జఠరంలో ఉన్న అగ్నిహోత్రానికి పంచాహుతులు (ప్రాణ–అపాన–వ్యాన–ఉదాన–సమానాలు) సాంగంగా సమర్పించి ఆపై భుజించాలి.

నిరంతరం ఓంకారాన్ని ఉపాసించాలి. బాహ్యంగా ఏ పనిచేస్తున్నా అంతరంగంలో ఈ ప్రణవోపాసన నిరాటంకంగా సాగాలి.

✦ ✦ ✦

# వ్యక్తి ధర్మాలు

జాతి వర్ణ, ప్రాంత వర్గాలకు అతీతంగా విశ్వంలో ఉన్న ప్రతి ఒక్క వ్యక్తీ ఆచరించవలసిన ఉత్తమ ధర్మాలను సనాతన ధర్మం బోధిస్తోంది. అవి: 1.యజ్ఞం, 2.సత్యం, 3. ధృతి, 4. శమం, 5.దమం, 6. బుద్ధి, 7. విద్య, 8.వాక్కు, 9. శీలం, 10.శ్రద్ధ, 11. త్యాగం, 12. వైరాగ్యం , 13.తపస్సు, 14. అహింస, 15. మైత్రి, 16.ఆత్మజ్ఞానం, 17. తృష్ణ, 18. దానం , 19. పరోపకారం, 20. సత్సంగం, 21.సమదృష్టి, 22. స్థితప్రజ్ఞత్వం , 23. సంతోషం, 24. జీవన్ముక్తి.

## 1. యజ్ఞం

వేదాలు ప్రబోధించిన మొట్టమొదటి ధర్మం యజ్ఞం. ఆదికాలంలో ఎంతోమంది ఋషులు యజ్ఞాలు చేసి ప్రపంచంలో ఎన్నో పదార్థాల్ని సృష్టించారు. **"యజ్ఞేన యజ్ఞ మయజంత దేవాః । తాని ధర్మాణి ప్రథమాన్యాసన్"**. యజ్ఞమే ధర్మాలలో మొదటిది. ప్రాణ–ఇంద్రియ స్వరూపులైన ఋషులు, దేవతలు, తామంతా ఆశ్రయించిన ఆ ప్రజాపతి శరీరం నుంచి చేతన అచేతన పదార్థాల్ని సృష్టించారు. ఇదే వారు చేసిన సృష్టి యజ్ఞం.

యజ్ఞం అంటే దేవతలకి చేసే పూజ అనికూడా చెప్పుకోవచ్చు. 1.యజ్ఞం, 2.సవనం, 3. అధ్వరము, 4. యాగము, 5.సప్తతంతువు, 6.క్రతువు అని యజ్ఞానికి పర్యాయపదాలు.

యజ్ఞం అంటే ఆత్మపరిత్యాగం. ఆయా దేవతల్ని (తన ఇష్ట) ఉద్దేశించి హోమకుండంలో వివిధ పదార్థాల్ని ఆహుతులు (ఆహారం) గా సమర్పించటమే యజ్ఞం. వసువులు 8 మంది, రుద్రులు 11 మంది, ఆదిత్యులు 12 మంది, ప్రజాపతి 1, వషట్కారుడు 1, మొత్తం కలిపి 33 మంది ప్రధాన దేవతలు. వీరితో పాటు మరికొంతమంది దేవతలు కూడా ఉన్నారు.

యజ్ఞం పరమాత్మ స్వరూపం. యజ్ఞంలో సమర్పించిన హవిస్సుల్ని స్వీకరించిన దేవతలు ఆనందించి సకాలంలో సరిపడేంత వర్షాల్ని కురిపించి భూమిని సస్యశ్యామలం చేస్తారు. సకలజీవులకీ తద్వారా ఆహారాన్నందిస్తారు. అందుకే యజ్ఞయాగాది క్రతువులు మూడు యుగాల్లో విరివిగా జరిగాయి.

దశరథుడు పుత్రకామేష్ఠి చేసి పాయసాన్ని హోమకుండం నుంచి పొందాడు. ద్రుపదుడు యాగం చేసి హోమకుండం నుంచి ద్రౌపదిని కుమార్తెగా పొందాడు.

యజ్ఞం కోసం చేసే కర్మలన్నీ (పనులన్నీ) పవిత్రమైనవి. ఈ కర్మల్ని ప్రతి ఒక్కరూ చేయాలి. ఇవి కాకుండా సంసార సుఖం కోసం చేసే ఇతర కర్మలన్నీ బంధకాలే! (భగవద్గీత 3-9).

సృష్టికర్త ప్రజలతో పాటూ యజ్ఞాలని కూడా సృష్టించి – 'మీరంతా యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించండి. ఈ యజ్ఞాల ద్వారా మీరు దేవతల్ని సంతృప్తిపరిస్తే, వారు సంతోషించి మిమ్మల్ని అనుగ్రహిస్తారు. ఇలా నిస్వార్థంగా మీరు పరస్పరం సంతృప్తి పరుచుకుంటూ ఉంటే, పరమ శ్రేయస్సుని పొందుతారు. (భగవద్గీత 3-11) అని చెప్పారు. యజ్ఞాల ద్వారా సంతోషించిన దేవతలు మానవులు కోరకుండానే ఎన్నో భోగాల్ని ఆహార పదార్థాల్ని వారికి అనుగ్రహిస్తారు. ఇలా లభించిన ఆహారాన్ని ఆ దేవతలకి నివేదించకుండా తినేవాళ్ళు నిజంగా దొంగలే (3-12). యజ్ఞ శిష్టాన్నాన్ని తినే మానవులు అన్ని పాపాలనుంచి విముక్తులవుతారు. అలా కాకుండా కేవలం తమ శరీరం కోసమే అన్నాన్ని వండుకునే వాళ్ళు పాపాన్నే తిన్న వారవుతారు (3-13).

**అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః,**
**యజ్ఞాద్భవతి పర్జన్యోయజ్ఞః కర్మ సముద్భవః.** (భగవద్గీత 3-14)

లోకంలో ఉన్న ప్రాణులన్నీ అన్నం నుంచే జన్మిస్తాయి. ఈ అన్నం వర్షం ద్వారా మనకి లభిస్తుంది. వర్షాలు అనేవి యజ్ఞాలు చేయటం వల్ల కురుస్తాయి. మానవులు చేసే విహిత (మంచి) కర్మలు యజ్ఞానికి మూలం. అలాగే ఈ విహితకర్మలకి మూలం వేదాలు. ఈ వేదాలు పరమాత్మ నుంచే ఆవిర్భవించాయి. సర్వవ్యాపకుడైన ఆ పరమాత్మ ఎప్పుడూ యజ్ఞాల్లోనే ఉంటాడు. కాబట్టి విధిగా పరమాత్మ ప్రీతి కోసం అందరూ యజ్ఞాలు చేయాలి (3-15).

**బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్,**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా.** (భగవద్గీత 4-24)

యజ్ఞకార్యం ఎంతో పవిత్రమైనది. ఈ కార్యంలో ఉపయోగించే స్రుక్-స్రువాది సాధనాలు పరమాత్మ స్వరూపాలే! హోమం చేసే ద్రవ్యం బ్రహ్మం. హోమకుండంలో

ఉండే అగ్ని బ్రహ్మం. యజ్ఞాన్ని చేసే కర్త బ్రహ్మం. హవనక్రియ కూడా బ్రహ్మమే! ఇలాంటి బ్రహ్మరూప (యజ్ఞ) కర్మలో స్థితుడై ఉన్న యోగి పొందే ఫలం కూడా బ్రహ్మమే. సర్వార్పణ భావంలో యజ్ఞకర్మల్ని ఆచరించాలి. యజ్ఞం ద్వారా పవిత్రమైన శేషాన్ని అనగా ప్రసాదాన్ని స్వీకరించి, ఆనందాన్ని అనుభవించే యోగులకి సనాతనుడైన పరమాత్మ అనుగ్రహం ప్రాప్తిస్తుంది. అసలు యజ్ఞం చేయనివాడికి ఈ మానవలోకంలో ఎలాంటి సుఖాలూ లభించవు. ఇక పరలోకం గురించి చెప్పేదేముంది? (భగవద్గీత 4-31).

## 2. సత్యం

సనాతనధర్మం ప్రబోధించే ఉత్తమగుణం సత్యవాక్పరిపాలన. అంటే ఎల్లప్పుడూ సత్యాన్నే చెప్పాలి. **"వేదమనూచ్యాచార్యో౽న్తేవాసిన మనుశాస్తి. సత్యం వద । ధర్మం చర ।** (తైత్తిరీయోపనిషత్ 9-1). సత్యాన్ని మించిన ధర్మం మరొకటి లేదు. సత్యం ఎంత గొప్పదంటే! "ఎప్పుడూ అసత్యం చెప్పనివాడికి వాక్శుద్ధి, వాక్సిద్ధి కలుగుతాయట. సత్యవంతుడు ఏమాట అంటే అది జరిగే తీరుతుందట. సత్యవాక్పాలకుడికి అతడి వాక్కే గొప్ప క్రియాసిద్ధినిస్తుంది **"సత్య ప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వం"** (పతంజలి యోగసూత్రాలు 2-36). **"సత్యమేవ జయతే నానృతమ్"** (ముండకోపనిషత్ 3-1-6). సత్యం మాత్రమే ఎప్పటికైనా జయిస్తుంది. అసత్యం కాదు. అని వేదం చెబుతుంది.

లోకంలో సత్యాన్ని మించిన ధర్మంలేదు. సత్యం మాత్రమే జ్ఞానప్రదమైనది. అదే అనంతమైన బ్రహ్మస్వరూపం, ఈ సత్యం అనే ధర్మంవల్లనే వాయువు వీస్తోంది. సత్యం వల్లనే సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఆ సత్యంవల్లనే వాక్కు (మాట) శాశ్వతమవుతోంది. ఈ సత్యంలోనే ప్రపంచమంతా ప్రతిష్ఠితమై ఉంది. సత్యధర్మాన్ని పాటించటం వల్లనే స్వర్గలోకం చేరిన మానవులు తిరిగి భూమిమీద పడటం లేదు. సత్యమే శాశ్వతమైనది. అందువల్లనే మహాత్ములంతా సత్యం మీద ప్రీతిని కలిగి ఉన్నారు.

సత్యం-ధర్మం అనేవి. వేరువేరు కాదు. ఈ రెండూ విడదీయరాని బాంధవ్యాన్ని కలిగి ఉంటాయి. **"యో వై ధర్మః సత్యం వై తత్"** అని బృహదారణ్యకోపనిషత్తు చెబుతుంది. సత్యాన్ని విడిచి ధర్మం, ధర్మాన్ని విడిచి సత్యం ఎప్పుడూ ఉండవు. ధర్మంతో కూడిన సత్యమే నిజమైన సత్యం అవుతుంది.

వేదం ప్రకారం సత్యం అంటే చూసింది చూసినట్టుగా, విన్నది విన్నట్టుగా చెప్పటం. ఏదైనా ఒక వివాదం జరిగినప్పుడు సాక్షిగా ఉన్నవాడు తాను చూసింది చూసినట్టుగా, విన్నది విన్నట్టుగా చెప్పేవాడని, దాన్ని ఆనాటి ప్రజలు విశ్వసించేవాళ్ళని ఐతరేయ బ్రాహ్మణం చెబుతుంది.

**"ఋతే నైవ, స్వర్గం లోకం గమయతి"** (18-2.9). సత్యాన్ని పలికేవాడు స్వర్గాన్ని పొందుతాడని తాండ్య బ్రాహ్మణం చెబుతుంది. ఇక్కడ ఋతం సత్యం అని రెండు చెప్పబడ్డాయి. వీటిలో ఋతం అంటే మానసిక సత్యం, 'సత్యం' అంటే వాచికసత్యం. అందుకే **"ఋతమితి సత్యం"** (6-7-3-11) ఋతం సత్యం ఒక్కటే అని శతపథ బ్రాహ్మణం చెబుతుంది.

ఈ లోకంలో ధర్మం ఎంతో గొప్పది. సత్యం అనే గుణం ధర్మంలోనే ప్రతిష్ఠితమై ఉంది. **"సత్యాన్న ప్రమదితవ్యం"** 'సత్యం నుంచి విడివడకు. సత్యాన్ని ఎప్పుడూ పాటించు' అని తైత్తిరీయోపనిషత్తు ప్రబోధిస్తుంది.

సత్యమే ఎప్పటికీ జయిస్తుంది. అసత్యం ఎప్పటికీ జయించలేదు. సత్యానికి నిలయాలు, ఆశలేనివారు అయిన మహర్షులు, సత్యమార్గం ద్వారా మోక్షధామాన్ని చేరుకుంటున్నారు!, ఆ మార్గమే సత్యానికి స్థానం. అంటే మోక్షాన్ని పొందే మార్గం సత్యమే! (ముండకోపనిషత్).

సత్యాన్నే చెప్పాలి. దాన్ని ఇతరులకి ప్రీతి కలిగేలా మృదువుగా చెప్పాలి. ప్రియంగా చెప్పమన్నారు కదా! అని జరిగిన సత్యాన్ని అసత్యంగా చెప్పకూడదు. (మనుస్మృతి).

జీవులకి పరమగతి కూడా సత్యమే. ధర్మం, తపస్సు, యోగం, యజ్ఞం, సనాతన బ్రహ్మస్వరూపం ఇవన్నీ సత్యస్వరూపాలే. ఇంత గొప్ప సత్యంలోనే సర్వమూ ప్రతిష్ఠితమై ఉంది.

ఈ సత్యం పదమూడు గుణాల సమాహారం. 1. సమత్వదృష్టి, 2. దమము, 3. మాత్సర్యం లేకపోవటం, 4. క్షమించే గుణం, 5. సిగ్గు, 6. సహనం, 7. అసూయ లేకపోవటం, 8.త్యాగం, 9. ధ్యానం, 10. సాధుశీలం, 11. ధైర్యం, 12.దయ, 13.అహింస. ఈ పదమూడూ సత్యానికున్న ప్రధాన లక్షణాలు. పరమాత్మనే చేరుకోవటానికి ఇవి ప్రధానమార్గాలు. ఈ ధర్మాలని ఏ మానవుడు ఆచరిస్తాడో వాడే నిజమైన సత్యశీలుడు.

ఏదో ఒకటి మాట్లాడటం కన్నా మౌనంగా ఉండటం మంచిది. ఒకవేళ మాట్లాడాల్సి వస్తే సత్యాన్ని మాట్లాడాలి. అది మామూలుగా మాట్లాడటం కన్నా రెట్టింపు పుణ్యాన్నిస్తుంది. అదే సత్యాన్ని ప్రియంగా చెబితే మూడురెట్లు పుణ్యం, అదే సత్యం ప్రియంతో పాటు ధర్మాన్ని కూడా కలిగి ఉంటే నాలుగురెట్లు అధికంగా పుణ్యాన్నిస్తుందని విదురుడు ధృతరాష్ట్రుడితో చెబుతాడు.

తన విషయంలోగానీ, ఇతరుల విషయంలోగానీ, చివరికి కన్నకొడుకు విషయంలోగానీ, ఎలాంటి కఠిన పరిస్థితుల్లోగానీ ఎవడు అసత్యం మాట్లాడకుండా ఉంటాడో అలాంటివాడు స్వర్గానికి వెళతాడు (మహాభారతం-ఉద్యోగ 4-12).

సత్యాన్ని పలకటం అన్ని ధర్మాలకన్నా గొప్పది. అసత్యం అనేది మహాపాపాన్ని కలిగిస్తుంది. అయితే ఇందులో ఒక ధర్మసూక్ష్మం ఉన్నది. ఇతరుల ధన, మాన, ప్రాణాల్ని అపహరించాలనుకునే పాపాత్ములతో అసత్యం చెప్పినా పాపంరాదు. ఇలాంటి వాళ్ళతో సత్యం చెబితేనే పాపం వస్తుంది. ఒక్కటని చెప్పటం ఎందుకు? జీవులకి మేలుచేసేవి అసత్యాలైనా అవి ధర్మబద్ధాలే అవుతాయి. జీవులకి బాధ కలిగించేవి సత్యాలైనప్పటికీ అవి అధర్మాలే అవుతాయి. ఈ విధంగా సత్యాన్ని పలికేటప్పుడు యుక్తాయుక్త విచక్షణ ఉపయోగించి పలకాలి (మహాభారతం 3 -145).

సత్యమే పరబ్రహ్మ స్వరూపం, సత్యమే తపస్సు, ఈ సత్యమే ప్రజల్ని సృష్టిస్తుంది. ఈ సత్యం వల్లనే లోకాలన్నీ స్థిరంగా ఉంటున్నాయి. అయితే ఇంత గొప్పదైన సత్యం కూడా ఒక్కోసారి అసత్యం వల్ల మరుగునపడుతుంది. లోకంలో ధర్మం, వెలుగు, జ్ఞానం, స్వర్గం, సుఖం అనేవి సత్యస్వరూపాలైతే, అధర్మం, చీకటి, అజ్ఞానం, నరకం, దుఃఖం అనేవి అసత్య స్వరూపాలు. కాబట్టి హితాన్ని కోరుకునేవాడు సత్యాన్నే పలకాలి.

"ధర్మానికి సత్యానికీ ఎలాంటి చేటూ కలగదు. ఎందుకంటే దైవం ధర్మాన్ని ఉద్ధరించి, సత్యానికి శుభాన్ని కలిగించి తీరుతుంది". (మహాభారతం ఉద్యోగ.9-273)

## 3. ధృతి (ధైర్యం)

'ధృతి' అనగా ధైర్యం. లోకంలో **'ధైర్యే సాహసే లక్ష్మీ'** అన్న నానుడి మనందరికీ తెలుసు. ధైర్యంగా, సాహసంతో పనుల్ని మొదలుపెట్టిన వాడికి అన్నిటా విజయమే లభిస్తుంది.

"లోకంలో **శ్రేయస్సు-ప్రేయస్సు** అని రెండు విషయాలు ఉన్నాయి. (శ్రేయస్సు అంటే మోక్షాన్ని కలిగించేది, ప్రేయస్సు అంటే సుఖభోగాల్ని కలిగించేది) తెలివైనవాడు ఈ రెండిటినీ బాగా పరీక్షించి, దానిలో శ్రేయస్సుని మాత్రమే కోరుకుంటాడు (కఠోపనిషత్ 2-2).

కేవలం జ్ఞానం (ఆత్మజ్ఞానం) వల్లనే సంసారం అనే మాయ లేక బంధం తొలగిపోతుంది కానీ, మరో మార్గం ద్వారా కాదు అన్న విజ్ఞానమే 'ధృతి'. నేను ఆత్మస్వరూపాన్ని. మరొకణ్ణి కాను అనే దృఢమైన భావాన్ని కలిగి ఉండటం కూడా 'ధృతి'. (దర్శనోపనిషత్).

బాధల్లోకానీ, ఆర్థిక సంబంధమైన కష్టాల్లోకానీ, ప్రాణాపాయ స్థితిలోకానీ ధైర్యం కలిగినవాడు తన వివేకాన్ని ఏమాత్రం కోల్పోడు. తన తెలివితేటల్ని చక్కగా ఉపయోగించి సమస్యని పరిష్కరిస్తాడు.

"ధైర్యం, ముందుచూపు, సమయస్ఫూర్తి, ఏ పనైనా చేయగల సామర్థ్యం ఈ నాలుగు లక్షణాలూ ఉన్నవాడు ఎలాంటి పని మొదలుపెట్టినా కచ్చితంగా విజయం సాధిస్తాడు". (కిష్కింధాకాండ).

సత్యాన్ని పలకటం, దానాలు చేయటం, ఆలస్యం (అలసత్వం) లేకపోవటం, అసూయ లేకపోవటం, క్షమ, ధైర్యం అనే ఆరు గుణాలని మనిషి ఎప్పుడూ వదలకూడదు. ఇంద్రియాలనీ, మనస్సునీ జయించిన వాడు, అపరాధం చేసినవాళ్ళని తగిన విధంగా దండించేవాడు, ఏ పనైనా జాగ్రత్తగా ఆలోచించి చేసేవాడు ధీరుడు. ఇలాంటి ధీరుడికే లక్ష్మీదేవి సంపదల్ని ప్రసాదిస్తుంది.

ధైర్యం, మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం, పవిత్రత (శుచి), దయ, మృదువైన వాక్కు, మిత్రద్రోహం చెయ్యకపోవటం, ఈ ఏడుగుణాలూ మనిషిని ధనవంతుణ్ణి చేస్తాయి. ఏ మనిషైనా ఉన్నతుడిగా అభివృద్ధి చెందాలంటే ప్రయత్నం, సంయమనం, కార్యదక్షత, జాగ్రత్త, ఆలోచించి పనులు చేయటం, ఈ లక్షణాలతో పాటూ ధైర్యం అనేది కూడా ముఖ్యంగా వుండాలి.

సుఖం కలిగినా, దుఃఖం కలిగినా మనస్సులో ఎలాంటి వికారం లేకుండా వుండటమే 'ధృతి'. ఉన్నత స్థానాన్ని కోరుకునేవాడు ఎప్పుడూ ఈ ధృతిని (ధైర్యాన్ని) విడిచిపెట్టకూడదు.

పూర్వజన్మలో చేసిన కర్మఫలితాలు పండితుణ్ణి కూడా విడిచిపెట్టవు. ఈ కర్మఫలితాలని (కష్టాలని బాధల్ని) తొలగించగలిగే మందు 'ధైర్యం' మాత్రమే.

ధైర్యంగా తీసుకునే నిర్ణయం ఏదైనా మంచిఫలితాన్నే ఇస్తుంది. అంతేకాదు ఈ ధైర్యం మనిషికి మంచి ఆరోగ్యాన్నిస్తుంది. కీర్తి ప్రతిష్ఠల్ని పెంచుతుంది. ఐశ్వర్యాన్ని అందిస్తుంది. కాలగతిని గురించి జ్ఞానం ఎవడికైతే ఉంటుందో! అలాంటివాడికే ఈ ధైర్యం కలుగుతుంది (శాంతిపర్వం).

అధములైనవాళ్ళు 'విఘ్నాలు వస్తాయేమో!' అని సందేహిస్తూ ఏ పనీ ప్రారంభించరు. మధ్యములైన వాళ్ళు ప్రారంభించి, మధ్యలో ఏదైనా ఆవాంతరం వస్తే భయపడి మధ్యలోనే వదిలేస్తారు. ఇక ధీరులైనవాళ్ళు తాము ప్రారంభించిన పనిని, ఎన్ని విఘ్నాలు వచ్చినా లెక్కచెయ్యకుండా పూర్తిచేస్తారు.

అమృతం కోసం క్షీరసముద్రాన్ని మథిస్తున్న దేవతలు, అందులోంచి వచ్చిన రత్నాల్ని చూసి సంతోషించక, అందులోంచి పుట్టిన కాలకూట విషానికి భయపడక, అమృతం లభించేంత వరకూ కృషిచేసి చివరికి దాన్ని సాధించారు. ఇదేవిధంగా ధీరులైన వాళ్ళు తాము చేయదలచిన పని ఫలవంతమయ్యే వరకూ ప్రయత్నాన్ని విడిచిపెట్టరు. (భర్తృహరి). అందుకే ధైర్యమే మన సంపద!

## 4. శమము (మనోనిగ్రహం)

ఇంద్రియాలతో వివిధరకాల పనుల్ని (కళ్ళతో చూడటం, నోటితో చదవటం, చెవులతో వినటం, నాలుకతో రుచి చూడటం లాంటివి) చేయాలా? వద్దా? అనే సందేహంతో ఉండే అంతఃకరణాన్ని మనస్సు అంటారు. చేయాల్సిన పనిని గురించి పూర్తిగా ఆలోచించి ఇది ఇలా చేసి తీరాలి అని నిశ్చయించుకునే అంతఃకరణాన్ని బుద్ధి అంటారు.

అంతఃకరణం 1.మనస్సు, 2. బుద్ధి, 3.చిత్తం, 4. అహంకారం అని నాలుగువిధాలు. సంకల్ప వికల్పాలతో స్థిరంగాలేనిది 'మనస్సు'. ఒక పదార్థాన్ని నిశ్చయించే శక్తి కలది 'బుద్ధి'. నేను నేను అని అహంకరించే స్వభావం ఉంటే అది 'అహంకారం', తనకి ఇష్టమైన వస్తువు లేదా వ్యక్తిని గురించి ఆలోచిస్తే అది 'చిత్తం'. (వివేకచూడామణి 95, 96). మానవుడు తన మనస్సుని ఏకాగ్రంగా ఒక లక్ష్యం మీద స్థిరంగా నిలపితే దానినే శమము అంటారు.

మనస్సు 'శుద్ధం' అని 'అశుద్ధం' అని రెండువిధాలు. కోరికలతో ఉన్న మనస్సుని అశుద్ధమని, కోరికలు లేని మనస్సుని శుద్ధమని అంటారు. మానవుల బంధ, మోక్షాలకి కారణం మనస్సే. విషయాల మీద (అనగా సంసార సంబంధమైన కోరికలు మొదలైన వాటిమీద) ఆసక్తితో ఉన్న మనస్సు బంధాన్ని కలిగిస్తుంది. ఎలాంటి కోరికలూలేని మనస్సు మోక్షాన్ని పొందుతుంది (అమృత బిందూపనిషత్తు).

"ఈ కనిపించే ప్రపంచమంతా మనస్సే. మనస్సే మనిషికి మహాశత్రువు. ఇదే మనిషికి సంసారం, ఈ మనస్సే మహాదుఃఖానికి కారణం. ఈ మనస్సే వార్ధక్యాలకి కారణం, జాగ్రత్ స్వప్న సుషుప్త్యాది అవస్థలన్నీ మనస్సుకి సంబంధించినవే. కాబట్టి మనస్సు మీద అదుపుని మనిషి సంపాదించాలి. లేకపోతే అది అతడికి ఎన్నో కష్టాల్ని తీసుకొస్తుంది" అని తేజోబిందూపనిషత్ ప్రబోధిస్తుంది.

ఒక పనిమీద తదేక నిష్ఠతో ఉన్న మనిషి మనస్సు, ఎన్ని ఆటంకాలు వచ్చినా తన నిష్ఠని కోల్పోదు. మేరు పర్వతంలాగా స్థిరంగా ఉంటుంది. కాబట్టి మన మనస్సుని ధీరుడిలా పరమాత్మ మీదే నిలపాలి. మంచి సంకల్పాల మీదే నిలపాలి. (యోగవాసిష్ఠం).

లోకంలో మనస్సు చలించకుండా ఉన్నవాడినే నిజమైన ధ్యానిగా చెప్తారు. అలాంటి ధ్యాని చేసే ధ్యానం మాత్రమే పరమాత్మని ప్రకాశింపచేస్తుంది. కనుక పరమాత్మ దర్శనప్రాప్తికి మనోనిశ్చలం కావాలి.

వేడిగా ఉండటం అనేది అగ్నిధర్మం. అలాగే చంచలంగా ఉండటం అనేది మనస్సు ధర్మం. వేడి లేకుండా అగ్ని ఉండదు. చంచలం కాకుండా మనస్సు ఉండదు. ఈ చంచలత్వాన్నే 'అవిద్య' (అజ్ఞానం) అంటారు. ఇలాంటి అవిద్యని ఆత్మవిచారణ ద్వారా పోగొట్టుకోవాలి. చిత్తచాంచల్యం కలగని స్థితి ఏర్పడినప్పుడే బ్రహ్మానందం లభిస్తుంది.

మనశ్శాంతి అనేది అన్నిటికన్నా గొప్పసంపద. శాంతచిత్తుడు సుఖదుఃఖాలకీ అతీతమైన స్థితిలో ఉంటాడు. గొప్పగొప్ప తపస్వులు, ఎన్నో విషయాలు తెలిసినవాళ్ళు, యజ్ఞాలు చేసేవాళ్ళు. మహారాజులు, బలవంతులు, గుణవంతులు వీళ్ళందరిలో శమం అనే గుణంతో ఉన్నవాడే శ్రేష్ఠుడు.

సంసార సుఖాల మీదా భోగాల మీదా ఆసక్తి ఉండే మనస్సు బంధాన్ని కలిగిస్తే పరమాత్మ మీద లగ్నమైన మనస్సు మనిషికి మోక్షాన్ని కలిగిస్తుంది. నాది, నేను, అనే

దురభిమానం వల్ల మనస్సులో కామం క్రోధం పుడతాయి. ఎప్పుడైతే మనిషి మనస్సు నుంచి ఇవి రెండూ తొలగిపోతాయో అప్పుడతడి మనస్సులో సుఖానికి పొంగిపోవటం, బాధలకి క్రుంగిపోవటం అనే లక్షణాలు వుండవు. అదే అతడికి మనశ్శాంతి నిస్తుంది. (శ్రీమద్భాగవతం. కపిల-దేవహూతి సంవాదం).

సహజంగానే మనస్సు ఎప్పుడూ నిలకడగా వుండదు. ఎప్పుడూ ప్రాపంచిక విషయాల మీద పరిభ్రమిస్తూ ఉంటుంది. అలాంటి మనస్సుని ప్రయత్నపూర్వకంగా సుఖాల మీద నుంచి మళ్ళించి, పరమాత్మ మీదే స్థిరంగా ఉండేలా మానవుడు ప్రయత్నించాలి. ప్రశాంతమైన మనస్సుతో ఉన్నవాడు, విషయసుఖాల మీద వ్యామోహం లేనివాడు, పరమాత్మతో ఏకీభావం పొందిన యోగి. అలాంటి యోగి మాత్రమే బ్రహ్మానందాన్ని పొందుతాడని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి ఉపదేశించాడు

## 5. దమము (ఇంద్రియ నిగ్రహం)

చెవి, ముక్కు కన్ను, చర్మం, నాలుక ఈ ఐదూ విషయజ్ఞానాన్ని మనిషికి కలిగిస్తాయి. అందుకని వీటిని జ్ఞానేంద్రియాలు అంటారు. మాట-చేయి-కాలు-గుదం (మలద్వారం) ఉపస్థ (మూత్రద్వారం) ఈ ఐదూ కర్మల్ని చేస్తాయి కాబట్టి వీటిని కర్మేంద్రియాలు అంటారు.

ఈ ఇంద్రియాలే మనిషిని నడిపిస్తాయి. ఇవి శరీరం అనే రథాన్ని నడిపే గుర్రాలాంటివి. వీటి పగ్గాల్ని జాగ్రత్తగా బంధించి (అంటే ఇంద్రియాల్ని అదుపులో ఉంచి) ఉంచితేనే మనిషి అనే రథం ఉన్నతమార్గంలో ప్రయాణిస్తుంది. లేకపోతే అధోగతే.

**ఆత్మానం రథినం విద్ధి శరీరం రథ మేవ తు,**
**బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహ మేవ చ.**

మనిషి శరీరం రథం అయితే ఆత్మ ఆ రథానికి యజమాని, బుద్ధి ఆ రథాన్ని నడిపే సారథి, మనస్సు గుర్రాల్ని పట్టి ఉంచే కళ్ళెం. ఈ మనిషి అనే రథాన్ని నడిపే గుర్రాలే ఇంద్రియాలు. ఆ ఇంద్రయాలకి కనిపించే విషయాలే (కోరికలే) మార్గం. ఇలా శరీరం, ఇంద్రియాలు, మనస్సు అనే వాటితో కలిసి ఉన్న ఆత్మనే భోక్త (అనుభవించేవాడు) అని పండితులు చెబుతారు.

జ్ఞానం లేనివాడు, చంచలమైన మనస్సుతో ఉన్నవాడు అయిన మనిషి ఇంద్రియాలు, అతడికి వశంలో ఉండకుండా చెడ్డ గుర్రాలలాగా పరుగులు తీస్తాయి.

మంచి స్థిరమైన మనస్సుతో ఉన్నవాడి ఇంద్రియాలనే గుర్రాలు ఎటూ పరుగులు తీయకుండా అతడి వశంలోనే ఉంటాయని 'కఠోపనిషత్' చెబుతుంది.

సాధకుడైనవాడు ఇంద్రియాలను విషయాల మీద, అనగా కోరికల మీద ప్రసరింపచేస్తే, తప్పకుండా కష్టాల పాలవుతాడు. పాపాల్ని మూటకట్టుకుంటాడు. అదే ఇంద్రియాలని ప్రయత్నపూర్వకంగా నిగ్రహిస్తే, తప్పకుండా మోక్షాన్ని పొందుతాడని నారద పరివ్రాజకోపనిషత్ ప్రబోధిస్తుంది.

ఇంద్రియాలని, మనస్సుని, బుద్ధిని, కామక్రోధాల్ని జయించిన వాడు అన్నిటినీ జయించిన వాడవుతాడు. అలాంటి జితేంద్రియుడికి దేనివల్లా బాధలు కలగవు. (యోగశిఖోపనిషత్తు).

ఒక కుండకు ఏమాత్రం చిన్నచిల్లు ఉన్నా ఆ కుండలో నీళ్ళన్నీ ఖాళీ అయిపోయినట్టు, ఐదు ఇంద్రియాలలో ఏ ఒక్క ఇంద్రియం కోరికల మీద తీవ్రమైన ఆసక్తితో ఉన్నా, ఆ ఒక్క ఇంద్రియమే వివేకాన్ని నశింపచేసి మనిషిని పతనం చేస్తుంది (మనుస్మృతి).

ఇంద్రియాలని అదుపులో పెట్టుకున్నవాణ్ణి, మనస్సుని నిగ్రహించుకున్నవాణ్ణి, చెడ్డపనుల్ని చేసేవాళ్ళని దండించేవాణ్ణి, బాగా ఆలోచించి పనులు చేసేవాణ్ణి, క్లిష్ట పరిస్థితులకు చలించనివాణ్ణి లక్ష్మీదేవి వదిలిపెట్టదు. ధర్మార్థాల్ని విడిచిపెట్టి, ఇంద్రియ సుఖాలకి వశమై పోయినవాడు, అతిత్వరగా ధనాన్ని, ప్రాణాన్ని, భార్యని కోల్పోతాడు. ఎంత గొప్ప ధనవంతుడైనా ఇంద్రియాల మీద అదుపు లేకపోతే తన ఐశ్వర్యాన్నంతా అచిరకాలంలోనే పోగొట్టుకుంటాడు.

అయితే ఇంద్రియాలని జయించటం, మృత్యువుని జయించటం కన్నా గొప్పవిషయం. ఇవి ఎంతో ప్రమాదకరమైనవి. వీటిని వాటి ఇష్టం వచ్చినట్టు వదిలేయకూడదు. ఇవి దేవతలకి కూడా వినాశనం చేకూరుస్తాయి.

ధర్మార్థకామ మోక్షాలనే నాలుగు రకాల పురుషార్థాలనీ సాధించాలనుకునేవాడికి ఇంద్రియాలు ప్రథమ శత్రువులు వీటిని నిగ్రహించుకోవటమే 'ప్రజ్ఞ'. (భగవద్గీత).

ఈ ఇంద్రియాలు ఎంతో జ్ఞానం కలిగినవాడిని, మంచి ప్రయత్నాలు చేసేవాడిని సైతం బలవంతంగా తన ఊబిలోకి లాగేస్తాయి.

సాధకుడైనవాడు ఇంద్రియాలన్నిటినీ తన వశంలో ఉంచుకుని ధ్యానంలో కూర్చోవాలి. ఎందుకంటే ఇంద్రియాలు వశంలో ఉన్నవాడికి బుద్ధి స్థిరంగా ఉంటుంది. స్థిరమైన బుద్ధితో పరమాత్మని ధ్యానించినవాడు పరమపదాన్ని పొందుతాడు.

ఇంద్రియాలని, మనస్సుని, శరీరాన్ని (శరీర భ్రాంతిని) జయించిన మానవుడు తనకు తానే మిత్రుడు. లేకపోతే తనకు తానే శత్రువు.

ఇంద్రియాలని గెల్చినవాడి హృదయం శాంతినీ, సుఖాన్ని పొందుతుంది. ఇంద్రియ నిగ్రహంతో ఎలాంటి వికారాలూలేని మనిషి పొందే గౌరవనీయమైన స్థితిని దేవతలు కూడా పొందలేరు (మహాభారతం).

## 6. బుద్ధి

బుద్ధి అంటే వివేకం. ఏ పని చేయాలి? ఏ పని చేయకూడదు అన్న విచక్షణ **"మనోవిమర్శ రూపం స్యాద్బుద్ధిః"** అంటే ఏదైనా ఒక పనిని గురించి బాగా ఆలోచించి, దీన్ని ఇలా చేయాలి అని నిశ్చయించుకునే అంతఃకరణాన్నే బుద్ధి అంటారు.

మానవుల శరీరంలో, సమస్తప్రాణుల్లో ఆత్మ అనేది నిగూఢంగా ఉన్న కారణంగా, అది అందరికీ కనిపించదు. అయితే సూక్ష్మబుద్ధి (వివేకం) కలిగిన వాళ్ళకి మాత్రమే ఈ ఆత్మ కనిపిస్తుంది. బుద్ధిమంతులైన వాళ్ళు తమలో ఉన్న, సకలజీవుల్లో ఉన్న ఆత్మ – పరమాత్మే అని గ్రహిస్తారు. మన బుద్ధి ఎప్పుడూ నిశ్చలంగా మంచి విషయాల మీదే ఉండాలి. మంచిపనుల్ని చేసేలా ఉండాలి (కఠోపనిషత్తు).

**ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే,**
**బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధిః సా పార్థ సాత్త్వికీ.** (భగవద్గీత 18-30)

ప్రవృతిమార్గం (గృహస్థాశ్రమంలో ఉంటూ ఎలాంటి ఫలాసక్తులు లేకుండా జీవించటం), నివృత్తిమార్గం (శరీరం మీద అభిమానాన్ని విడిచిపెట్టి, ఎలాంటి సంసారం లేకుండా పరమాత్మతో ఏకీభావస్థితిలో ఉండటం), కర్తవ్యం, అకర్తవ్యం (ఏది చేయాలి ఏది చేయకూడదు), భయం-అభయం, అలాగే బంధం (సంసార బంధం), మోక్షం అనే విషయాలన్నీ తెలిస్తే అది – సాత్త్వికబుద్ధి. మానవుడి శరీరమనే రథాన్ని సాత్త్వికబుద్ధి అనే సారథితో నడిపించాలి. అప్పుడే అది పరబ్రహ్మ మార్గంలో ప్రయాణం చేసి మోక్ష భవనాన్ని చేరుకుంటుంది.

మానవుడి శరీరం కన్నా అందులో ఉన్న ఇంద్రియాలు గొప్పవి. సూక్ష్మమైనవి. బలమైనవి. అయితే ఈ ఇంద్రియాల కన్నా మనస్సు, దానికన్నా బుద్ధి బలమైనవి. ఈ బుద్ధికన్నా ఆత్మ ఇంకా బలమైనది. కాబట్టి బుద్ధిని స్థిరంగా ఉంచుకుంటే ఆత్మజ్ఞానాన్ని పొందవచ్చు.

విద్య, శూరత్వం, దక్షత్వం, బలం, ధైర్యం అనే అయిదు గుణాలూ మానవుడికి స్వతస్సిద్ధంగా మిత్రులు. బుద్ధిమంతుడైనవాడు (తన బుద్ధిని ఉపయోగించి) ఈ అయిదు గుణాల ద్వారా అన్ని పనులూ చేస్తున్నాడు.

అసలైన బుద్ధిమంతుడు సుఖాన్నిగానీ, దుఃఖాన్నిగానీ, ప్రియాన్నిగానీ, అప్రియాన్నిగానీ, ఏది లభించినా, దాన్ని మనసారా స్వాగతిస్తాడు.

బుద్ధితో చేసే పనులు (బాగా ఆలోచించి) శ్రేష్ఠమైనవి. భుజబలంతో చేసే పనులు మధ్యమాలు. పిక్కలతో కాళ్ళతో చేసేవి అధమాలు. బరువులు మోస్తూ చేసే పనులు అధమాధమాలు. కాబట్టి మనమందరం మన జ్ఞానాన్ని పెంచుకుని బుద్ధితోనే పనులు చేద్దాం. పండిత బుద్ధి కలిగిన మానవులు – కోరకూడని వస్తువుల్ని ఎప్పుడూ కోరరు. పోయినదాన్ని గురించి బాధపడరు. ఆపదల్లో చిక్కుకుంటే కంగారుపడరు. జాగ్రత్తగా ఆలోచించి బయటపడతారు. కనుక మనం కూడా పండిత బుద్ధిని కలిగి ఉందాం.

## 7. విద్య

**“విద్య లేనివాడు వింతపశువు”** అని సామెత. ఈ విద్య వృత్తివిద్య కావచ్చు. మరే విద్య అయినా కావచ్చు. సమాజంలో ఉన్న నాలుగు వర్ణాల వారికీ, వారివారి వర్ణాలకి తగిన వృతుల్ని (విద్యలని) సనాతనధర్మం ప్రబోధించింది.

ప్రాచీనకాలంలో విద్యలు పద్నాలుగు రకాలు. 1. ఋగ్వేదం, 2. యజుర్వేదం, 3.సామవేదం, 4. అథర్వణవేదం (వేదాంగాలు ఆరు), 5. శిక్ష, 6.వ్యాకరణం, 7.ఛందస్సు, 8.నిరుక్తం, 9. జ్యోతిషం, 10.కల్పం, 11. పురాణాలు, 12. న్యాయశాస్త్రం, 13.మీమాంసా శాస్త్రం, 14. ధర్మశాస్త్రం అని.

ఈ పద్నాలుగు విద్యలూ ఆర్షధర్మాన్ని ప్రబోధించేవి. వీటిని అభ్యసించటం ద్వారా సనాతన భారతీయ ధర్మం సంపూర్ణంగా అవగతం అవుతుంది.

మంచి తెలివితేటలు, ఉత్తమకులం, మంచి విద్య, ఇంద్రియనిగ్రహం, పరాక్రమం, తక్కువగా మాట్లాడటం, దానం చెయ్యటం, కృతజ్ఞతతో ఉండటం. ఈ ఎనిమిది రకాల గుణాలూ ఏ మనిషిలో వుంటాయో! ఆ మనిషి గొప్పవాడు (విదురనీతి).

అవిద్యని ఉపాసించేవారు ఘోరమైన చీకటిలో ప్రవేశిస్తారు. విద్యని ఉపాసించేవాళ్ళు అమృతత్వాన్ని అనగా మోక్షాన్ని పొందుతారు (ఈశావాస్యోపనిషత్తు). ఇక్కడ విద్య అంటే ఆత్మజ్ఞానాన్ని కలిగించే ఆధ్యాత్మిక విద్య అని, అవిద్య అంటే ఇంద్రియ సుఖాలకి లోబడి ధర్మవ్యతిరేకంగా, నాస్తికులుగా అజ్ఞానంతో కూడి ఉండటం అని గ్రహించాలి.

**విద్యానామ నరస్యరూప మధికం ప్రచ్ఛన్న గుప్తం ధనం**
**విద్యా భోగకరీ యశ స్సుఖకరీ విద్యా గురూణాం గురుః,**
**విద్యా బంధుజనో విదేశగమనే విద్యా పరాదేవతా**
**విద్యారాజసు పూజ్యతే న హి ధనం విద్యా విహీనః పశుః.**

పురుషుడికి విద్యే రూపం, విద్యే రహస్యంగా దాచిపెట్టిన ధనం, ఆ విద్యే అతడికి సకల సుఖభోగాలనీ, కీర్తి ప్రతిష్ఠలనీ కలగ చేస్తుంది, విద్యే గురువులాగా అన్నీ ప్రబోధిస్తుంది. ఇతర దేశాల్లో బంధువులాగా సహాయపడుతుంది. ఈ విద్యే పరమాత్మ స్వరూపం. ధనం ఇలాంటిది కాదు అంటే ఇంత గొప్పదికాదు. ఇలాంటి విద్య లేనివాడు పశువుతో సమానుడు.

విద్య అనే ధనాన్ని దొంగలు దోచుకోలేరు. అది ఎప్పుడూ సుఖాన్నే కలుగజేస్తుంది. ఈ విద్యని ఎంతగా వినియోగిస్తే (ఇతరులకి బోధిస్తే) అంతగా వృద్ధి చెందుతుంది. ప్రళయకాలంలో కూడా ఇది నశించదు. ఇంత గొప్ప విద్యాధనం కలిగిన పండితుల మీద మహారాజులు కూడా గర్వాన్ని ప్రదర్శించకూడదు. వాళ్ళని గౌరవించాలి.

**విద్యాదదాతి వినయం వినయాత్ యాతి పాత్రతాం,**
**పాత్రత్వాత్ ధనమాప్నోతి ధనాత్ ధర్మం తతః సుఖమ్.**

మనిషికి విద్య వినయాన్ని కలిగిస్తుంది. ఆ వినయం వల్ల మనిషికి సమాజంలో మంచివాడు అన్న పాత్రత కలుగుతుంది. ఆ పాత్రత వల్ల అతడికి సంపదలు చేకూరతాయి. ఆ తరువాత అతడు దానాలు, పుణ్యకార్యాలు చేయటం ద్వారా ధర్మాన్ని ఆచరిస్తాడు. ఇలా ధర్మాచరణ చేయటంవల్ల మనశ్శాంతిని పొందుతాడు.

ఏ విద్యని అభ్యసించినా శ్రద్ధతో అభ్యసించాలి. తాను నేర్చుకున్న విద్య మీద ప్రేమ నమ్మకం ఉంచాలి. అప్పుడే ఆ విద్య అతడికి అన్నిరకాలుగా తోడ్పడుతుంది. అయితే ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే నీతిని మాత్రం మర్చిపోకూడదు. విద్యవల్ల అహంకారాన్ని ప్రదర్శించకూడదు. ఏమీ తెలియని అజ్ఞానుల్ని హీనంగా చూడకూడదు. తనకున్న జ్ఞానంతో వాళ్ళని కూడా విద్యావంతుల్ని చేసే ప్రయత్నం చెయ్యాలి.

జీవితాన్ని కొనసాగిచటం కోసం లౌకికవిద్యలు (డిగ్రీలు) అభ్యసించినప్పటికీ, సంసార బాధ్యతలు తీరాకైనా ఆధ్యాత్మిక విద్యమీద దృష్టిపెట్టాలి.

విద్యకి నాలుగు లక్షణాలు. **1.అధీతి, 2.బోధ, 3.ఆచరణ, 4. ప్రచారం.** 'అధీతి' అంటే విద్యని తాను పరిపూర్ణంగా నేర్చుకోవటం, 'బోధ' అంటే తాను నేర్చుకున్న విద్యని ఇతరులకి అర్థమయ్యేలాగా బోధించటం, 'ఆచరణ' అంటే తాను నేర్చిన విద్యలో ఉన్న ధర్మాన్ని స్వయంగా ఆచరించటం, 'ప్రచారం' అంటే తాను అనుసరిస్తున్న ధర్మాన్ని విరివిగా ప్రచారం చేసి ఇతరుల చేత కూడా ధర్మాన్ని ఆచరించేలా చేయటం. నిజమైన విద్యావంతుడు ఈ నాలుగు లక్షణాలని కలిగి ఉండాలని సనాతనధర్మం చెబుతుంది.

## 8. వాక్కు (మాట)

వాక్కు సరస్వతీ స్వరూపం. అందుకే మనం ఏది మాట్లాడినా ఆచి తూచి మాట్లాడాలి. లేకపోతే ఎన్నో అనర్థాలు సంభవిస్తాయి.

**పారుష్య మనృతంచైవ పైశున్యం చాపి సర్వశః,**
**అసంబద్ధ ప్రలాపశ్చ వాఙ్మయం స్యాచ్చతుర్విధమ్.** (మనుస్మృతి 12-6)

మనిషి తన వాక్కు ద్వారా నాలుగురకాల చెడ్డ కర్మలు చేస్తాడు. 1.కఠోరంగా మాట్లాడటం, 2. అబద్ధాలు చెప్పటం, 3. చాడీలు చెప్పటం, 4. అనవసరమైన విషయాలు మాట్లాడటం. మనిషి మంచివాడుగా ప్రఖ్యాతి చెందాలంటే ఈ నాలుగురకాల చెడ్డపనులని చేయకూడదు. నోటిని జాగ్రత్తగా అదుపులో ఉంచుకోవాలని మనుస్మృతి చెబుతుంది.

త్రికరణశుద్ధి అంటే 'మనసు, మాట, చేత'. ఈ మూడూ ఏ పని చేసినా శుద్ధంగా ఉంచుకుని చేయాలని సనాతనధర్మం చెబుతుంది. మనం మాట్లాడితే సత్యమే మాట్లాడాలి.

యుక్తి యుక్తమైనది, సమంజసంగా ఉన్నది అయిన మాటని చిన్న పిల్లవాడు చెప్పినా వినాలి. యుక్తియుక్తం కానిది అనగా అధర్మ పరమైనది, అసమంజసమైనది అయిన మాటని బ్రహ్మదేవుడు చెప్పినా వినకూడదు.

ఆగకుండా ప్రవాహవేగంతో చక్కగా మాట్లాడేవాడు, ప్రచారంలో ఉన్న కథల్ని బాగా తెలిసినవాడు, సమయస్ఫూర్తితో మాట్లాడేవాడు, అప్పటికప్పుడు ఏ గ్రంథం గురించి అడిగినా చెప్పగలిగేవాడు పండితుడు. ఏమాత్రం కఠినంగా మాట్లాడకపోవటం, చెడ్డవాళ్ళతో సాహవాసం చేయకపోవటం, ఈ రెండు పనులూ చేసేవాడు లోకంలో గొప్పవాడిగా ప్రసిద్ధి చెందుతాడు.

అందరికీ శాంతిని కలిగించాలనే ఆసక్తితో, నిత్యం సత్యాన్నే పలుకుతూ, మంచి స్వభావంతో, పెద్దల్ని గౌరవిస్తూ పవిత్రమైన ఆశయాలతో జీవించేవాడు, తన సాటివారిలో 'జాతిరత్నం' లాగా ప్రకాశిస్తాడు.

ఎవరికైనా మాటను అదుపు చేసుకోవటం చాలాకష్టం. అయినా దాన్ని అదుపు చేసుకోవాలి. అర్థవంతంగా చమత్కారభరితంగా మాట్లాడటం అందరికీ సాధ్యం కాదు. అందంగా హృద్యంగా మాట్లాడే మాట అన్నిరకాలుగా శుభాల్నే కలిగిస్తుంది. అదే మాటని చెడుగా, కఠినంగా పలికితే అనర్థాల్ని కలిగిస్తుంది. గొడ్డలితో, బాణాలతో నరికిన చెట్టు మళ్ళీ మొలకెత్తుతుందేమోగానీ, పరుషమైన మాటలతో మనిషికి అయిన గాయం మాత్రం ఎప్పటికీ మానదు.

కర్ణి, నాళిక, నాచారం, బాణం అనే వాటిని శరీరం నుంచి బయటకి లాగవచ్చుకానీ, కఠోరమైన మాట అనే బాణాన్ని బయటకి లాగడం కుదరదు. గుచ్చుకున్నవాడు బాధతో రాత్రీపగలూ కుమిలిపోతాడు. కనుక పండితుడైనవాడు ఎప్పుడూ చెడ్డమాటలతో ఇతరుల్ని బాధ పెట్టకూడదు.

చెడ్డగా మాట్లాడటం కన్నా మౌనంగా ఉండటం మంచిది. ఒకవేళ మాట్లాడితే సత్యమే మాట్లాడాలి. ఆ సత్యమైన మాటల్ని కూడా ప్రియంగా మాట్లాడాలి. ఇది మూడురెట్లు మంచిని కలిగిస్తుంది. ఈ సత్యమైన ప్రియమైన మాటలు కూడా ధర్మయుక్తంగా ఉంటే అది నాలుగురెట్లు ఎక్కువ ఫలాన్నిస్తుంది. కాబట్టి మనం ఎప్పుడు మాట్లాడినా సత్యంగా, ప్రియంగా, ధర్మంగా మాట్లాడాలి.

ఎదుటివాళ్ళకి ఎలాంటి ఉద్వేగాన్ని (బాధని) కలిగించనివీ, ప్రియంగా ఉండేవీ, మంచిని కలిగించేవీ, సత్యమైనవీ అయిన మాటలు, వాక్కుకి సంబంధించిన తపస్సులు.

**కేయూరాణి న భూషయన్తి పురుషం హారా న చంద్రోజ్జ్వలా**
**న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజా,**
**వాణ్యేకా సమలం కరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే**
**క్షీయంతే ఖలు భూషణాని సతతం వాగ్భూషణమ్ భూషణమ్.**

"భుజకీర్తులు, సూర్యచంద్ర హారాలు లాంటి బంగారు ఆభరణాలు, సుగంధజలాలతో స్నానం చేయటం, చందనం రాసుకోవటం, పూలు ధరించటం, వెంట్రుకలు దువ్వుకోవటం, ఇలాంటివేవీ పురుషుడికి అలంకారాలు కావు. కేవలం అతడు పలికే సంస్కారవంతమైన వాక్కు అనగా మాటలే అతణ్ణి భూషితుడిగా చేస్తాయి. మిగిలిన అన్ని భూషణాలూ నశించిపోయేవే, ఒక్క 'వాక్కు' అనే భూషణం తప్ప" (భర్తృహరి).

**"మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం"** మహాత్ములైన వాళ్ళ మనస్సు, మాట, పని ఒకేవిధంగా ఉంటాయి. కాబట్టి మనం కూడా పలికే మాటల్ని త్రికరణశుద్ధిగా పలుకుదాం.

## 9. శీలం (సత్ప్రవర్తన)

**"శీలేన శోభతే విద్యా"** అని ఆర్యోక్తి. అంటే మంచిప్రవర్తన ఉంటేనే మనిషి నేర్చుకున్న విద్యకి శోభ కలుగుతుంది. ఉత్తమ గురువులు తమ శిష్యులకి తాము నేర్చిన విద్యనంతా ధారపోస్తారు. కాబట్టి ఉత్తమశిష్యులు కూడా గురువుల మీద పూజ్యభావాన్ని కలిగి, త్రికరణశుద్ధిగా సేవించాలి. ఇదే సత్ప్రవర్తన.

మానవుడికి సుఖం, లాభం, కీర్తి ప్రతిష్ఠలు, శాంతి, జ్ఞానం, త్యాగం, వైరాగ్యం, దేవతానుగ్రహం ఇవన్నీ సత్రవర్తన (శీలం) వల్ల లభిస్తాయి. సచ్ఛీలం (సత్ప్రవర్తన) మనిషిని అన్ని విధాలుగా రక్షిస్తుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. సచ్ఛీలం లేని మనిషి మనిషేకాడు. అలాంటివాడు రాక్షసుడే.

శీలం (సత్ప్రవర్తన) లేనివాడినీ, పాపాత్ముణ్ణీ చేతిలో ఉన్న విషంలాగా వెంటనే వదిలించుకోవాలి. అలా వదిలించుకున్నవాడే సుఖపడతాడు.

ఉత్తమ శీలవంతుడు శ్రీరామచంద్రుడు. అందుకే శ్రీరాముడు మనందరికీ ఆదర్శ పురుషుడయ్యాడు. పితృవాక్య పరిపాలన, ఏకపత్నీవ్రతం, ఆశ్రిత ధర్మ పరిరక్షణ, మిత్రధర్మంలాంటి ఉత్తమగుణాలతో శ్రీరామచంద్రుడు, భ్రాతృసేవ అనే సుగుణాన్ని

పాటిస్తూ లక్ష్మణ, శత్రుఘ్న, భరతులు, మహాపతివ్రతా ధర్మాన్ని పాటిస్తూ సీతాదేవి, సేవాభక్తికి నిదర్శనంగా ఆంజనేయుడు తమతమ ఉత్తమ శీలాలతో (గుణాలతో) మనందరికీ ఆదర్శప్రాయులు.

రామాయణంలో శ్రీరాముడితో పాటు, భారత ఇతిహాసంలో శ్రీకృష్ణుడు, భీష్ముడు, ధర్మరాజు, ద్రౌపది, విదురుడు లాంటి వాళ్ళు కూడా ధర్మకోవిదులుగా, ధర్మాచార పరాయణులుగా ప్రసిద్ధిచెందారు. తమతమ (శీల) స్వభావాలతో ఉత్తములుగా, సత్పురుషులుగా, ఆదర్శప్రాయులుగా నిలిచారు.

మంచిశీలం (సత్ప్రవర్తన) లేనివాడికి వాడి కులం (వంశం) గౌరవాన్నివ్వదు. ఏ కులంలో పుట్టిన వాళ్ళకైనా గౌరవం అనేది వాళ్ళ సత్ప్రవర్తన వల్లనే లభిస్తుంది. లోకంలో ప్రతిమనిషికీ సత్ప్రవర్తన చాలా ముఖ్యం. ఈ గుణం లేకపోతే ఎంత ధనం ఉన్నా, బంధుమిత్రులు ఉన్నా ఎలాంటి ప్రయోజనం ఉండదు. మంచివస్త్రాలు ధరించినవాడు సభలో అందరినీ ఆకర్షించి జయిస్తాడు. పశు (గో) సంపద ఉన్నవాడు తిండిమీద ఆశని జయిస్తాడు. మంచి వాహనం ఉన్నవాడు రహదారిని జయిస్తాడు. అయితే గొప్పశీలం ఉన్నవాడు సర్వాన్నీ జయిస్తాడు.

తపస్సు, ఇంద్రియనిగ్రహం, వేదజ్ఞానం, యజ్ఞాలు చేయటం, వివాహాది పుణ్యకర్మలని ఆచరించటం, నిత్యం అన్నదానాలు చేయటం, మంచి నడవడికతో (శీలం) ఉండటం అనే ఈ ఏడురకాల గుణాలు ఉన్నవాళ్ళే ఉత్తమకులంలో పుట్టిన వాళ్ళవుతారు. శీలం లేనివారి వంశాలు వంశాలుగా పరిగణించబడవు. కాబట్టి వంశమర్యాదకి కారణం ఆ వంశంలో వారి గుణశీలాలే.

**ధర్మః సత్యం తథా వృత్తం బలం చైవ తథాప్యహమ్,**
**శీలమూలా మహాప్రాజ్ఞ సదా నాస్త్యత్ర సంశయః.** (శాంతిపర్వం)

ధర్మం, సత్యం, బలం, సదాచారం, సంపద ఇవన్నీ శీలం (సత్ప్రవర్తన) మీదే ఆధారపడి ఉంటాయి.

ఎన్ని విద్యలు ఉన్నా, ఎంత ధనం ఉన్నా, ఎంత మేధావైనా శీలం లేకపోతే వారి సంపదలు ఏవీ అక్కరకురావు. కనుక ప్రతిఒక్కరూ శీల సంపదని వృద్ధి చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి.

## 10. శ్రద్ధ

ధర్మం పట్లా, ఆ ధర్మాన్ని బోధించే ఆచార్యుల పట్లా, విద్య పట్లా అచంచలమైన నమ్మకాన్ని కలిగి ఉండడమే 'శ్రద్ధ'. ఇలాంటి శ్రద్ధ మోక్షాన్ని అందిస్తుంది.

### 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'

ఇంద్రియనిగ్రహం కలిగినవాడు, శ్రద్ధ కలిగినవాడు (విశ్వాసం), అయిన మానవుడికి పరమాత్మ సంబంధమైన జ్ఞానం (ఆత్మజ్ఞానం) కలుగుతుంది. ఈ జ్ఞానం కలిగిన వెంటనే అతడికి పరమశాంతి లభిస్తుంది. కాబట్టి మనకి పరమశాంతి, ఆత్మజ్ఞానం కలగాలంటే ముఖ్యంగా పరమాత్మ మీద శ్రద్ధ (విశ్వాసం) ఉండాలి. అప్పుడే ఆయన అనుగ్రహం మనకి లభిస్తుంది (భగవద్గీత 4-39,40).

మానవుల స్వభావాన్ని అనుసరించి ఆయా వ్యక్తులలో ఉండే శ్రద్ధ. 1.సాత్త్వికశ్రద్ధ, 2. రాజసిక శ్రద్ధ, 3.తామసిక శ్రద్ధ అని మూడువిధాలు. లోకంలో ప్రతి మనిషికీ వారివారి అంతఃకరణాలకి తగినట్టుగా శ్రద్ధ ఉంటుంది. వాడి జీవితమంతా వాడి శ్రద్ధకి అనుగుణంగా నడుస్తుంది. వాడుచేసే పనుల్ని బట్టి వాడెంత శ్రద్ధ కలిగినవాడో ఎలాంటి శ్రద్ధ కలిగినవాడో తెలుస్తుంది.

మానవుల్లో సాత్త్వికశ్రద్ధ కలిగినవారు దేవతలని, రాజసశ్రద్ధ కలిగినవారు యక్షుల్ని రాక్షసుల్ని, తామసశ్రద్ధ కలిగినవారు భూతప్రేతగణాలని పూజిస్తూ ఉంటారు. మానవుడు ఎప్పుడూ సాత్త్వికశ్రద్ధనే కలిగి ఉండాలి. అదే అతడికి శ్రేయస్సునిస్తుంది.

శ్రద్ధ అంటే విశ్వాసం లేకుండా మానవుడు చేసే హోమాలు, దానాలు, జపతపాలు, ఇంకా వివిధరకాల పూజలు, వ్రతాలు ఇలాంటి వాటిని 'అసత్' అంటారు. వీటివల్ల మనిషికి ఇహంలో పరంలో ఎలాంటి ప్రయోజనం వుండదు. కనుక చేసే ప్రతి పనినీ శ్రద్ధతో చేయాలి.

శ్రద్ధ అనేది కార్యసాధకుడి లక్షణం. ఎంత శ్రద్ధ ఉంటే అంత త్వరగా ఫలితం లభిస్తుంది. మన పురాణ ఇతిహాసాల్లో ఎంతోమంది మహర్షులు, మహాత్ములు, మహారాజులు శ్రద్ధాభక్తులతో పరమాత్మని ఆరాధించి, కఠోరమైన తపస్సులు చేసి, ఐహికాముష్మిక ఫలాలను పొందారు.

## 11. త్యాగం

పరమాత్మ మీదే దృష్టిని ఉంచి, ఈ ప్రపంచాన్నంతా మిథ్య అని వదిలి పెట్టడాన్నే 'త్యాగం' అంటారు. ఇలాంటి త్యాగం తక్షణమే మోక్షాన్ని ప్రసాదిస్తుందని తేజో బిందూపనిషత్తు చెబుతుంది.

తాను నిండా కరుగుతున్నప్పటికీ ఇతరులకి కాంతినిస్తున్న కొవ్వొత్తి మనకు త్యాగాన్ని బోధిస్తుంది. తాము ఎండకి మలమలా మాడిపోతున్నప్పటికీ ఇతరులకి నీడనిస్తున్న చెట్టుదీ త్యాగమే. తనను తొలచి శిథిలం చేస్తున్నా ఏమాత్రం బాధపడకుండా స్థిరంగా ఉన్న భూదేవి కూడా త్యాగానికి ప్రతీక. ఇక జన్మనిచ్చిన తల్లితండ్రులు తమ సుఖాల్ని బిడ్డల సుఖాలకోసం త్యాగం చేసి, ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు. అలాగే దేశరక్షణ కోసం ప్రాణత్యాగాలు చేస్తూ మనందరికీ త్యాగం గొప్పదనాన్ని తెలియ చేసున్నారు సైనికులు.

పితృవాక్య పాలన కోసం రాజ్యాన్ని త్యాగం చేసిన ధర్మపురుషుడు శ్రీరాముడు. అలాగే శ్రీరాముడి సేవకే అంకితమైన లక్ష్మణుడు కూడా త్యాగధనుడే. ఇక దేవతల కోసం దధీచి మహర్షి తన ప్రాణాన్ని త్యాగంచేసి వెన్నెముకని ఇంద్రుడికి సమర్పించాడు. ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా శ్రీరాముడి సేవకోసం జీవితాన్ని త్యాగం చేసిన మహాభక్తుడు హనుమంతుడు. వీరంతా మనందరికీ ఆదర్శప్రాయులు.

యజ్ఞం, దానం, తపస్సులాంటి పుణ్యాన్నిచ్చే కర్మలని (పనులని), అలాగే విధిగా మానవుడు నిర్వర్తించాల్సిన కర్తవ్యాలనీ సక్రమంగా శ్రద్ధతో నిర్వహించాలి. అయితే వాటి ఫలితాలు మీద ఆసక్తిని వదిలిపెట్టాలి (త్యాగం చెయ్యాలి). ఇదే ఉత్తమమైన ధర్మం. వీటిని త్యాగం చెయ్యకూడదు.

ధర్మశాస్త్ర గ్రంథాలలో చెప్పిన పనుల్ని విడిచిపెట్టకూడదు. శాస్త్రాలలో చెప్పిన కర్మల్ని మానవుడు తన కర్తవ్యంగా భావించి, వాటి ఫలితాల్ని వదిలిపెట్టి నిర్వహించాలి. దీన్నే సాత్త్విక త్యాగం అంటారు. నైపుణ్యంలేని పనుల్ని ద్వేషించనివాడు, నైపుణ్యం కలిగిన పనుల్ని ప్రేమించనివాడు అనగా చెడ్డపనుల్ని ద్వేషించి, మంచిపనుల మీద ఆసక్తిని పెంచుకొనేవాడు, శుద్ధ సత్త్వగుణంతో ఉండేవాడు, ఎలాంటి సందేహాలూ లేనివాడు, బుద్ధికుశలుడు అయినవాడే నిజమైన 'త్యాగి'.

భూమ్మీద పుట్టిన ప్రతిమనిషీ కర్మల్ని పూర్తిగా వదిలిపెట్టటం (అనగా త్యాగం చెయ్యటం) సాధ్యం కాదు. కాబట్టి కర్మల్ని చేస్తూ ఆ కర్మల ద్వారా వచ్చే ఫలితాన్ని త్యాగం చెయ్యాలి. అలా చేసినవాడే అసలైన త్యాగి.

కోరికల్ని వదిలి పెట్టటమే నిజమైన త్యాగం. రాగద్వేషాలు లేకపోవటంతో త్యాగం సిద్ధిస్తుంది. లేకపోతే త్యాగానికి పరమార్థం ఉండదని వ్యాసమహర్షి భారతంలో ప్రబోధిస్తాడు.

త్యాగ గుణం ఉన్నవారికే పరమాత్మతత్త్వం సులభంగా అర్థమవుతుంది.

రఘువంశ రాజులు "త్యాగం చెయ్యటం కోసమే ధనాన్ని సంపాదిస్తారట! నిజమైన త్యాగధనులంటే వాళ్ళే!

## 12. వైరాగ్యం

**'ఇహాముత్రార్థ ఫలభోగ విరాగం'.** అంటే ఈ ప్రపంచంలో కనిపించేదంతా నశించి పోయేదేననీ, భార్యాబిడ్డలూ, స్నేహితులూ, బంధువులూ, బంధాలూ అన్నీ క్షణికాలేనని గ్రహించి, వీటన్నిటి మీదా ఏహ్యాభావాన్ని కలిగి ఉండటమే 'వైరాగ్యం' అని ఉత్తరమీమాంసా దర్శనం చెబుతుంది.

నిజమైన వైరాగ్యంతో ఉంటే పరమాత్మ ప్రాప్తి కలుగుతుంది అని ముండకోపనిషత్ చెబుతుంది.

వైరాగ్యభావం మానవుడి మనస్సులో ఎప్పుడు తీవ్రంగా కలిగితే అప్పుడే అతడు సన్న్యసించాలి. అనగా సంసార విషయాల్ని వదిలిపెట్టి మోక్షకాముడై సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించాలి. అలా చేయకపోతే తిరిగి వ్యామోహంలో పడి పతితుడైపోతాడు. కొందరికి వివాహం కాకుండానే ప్రాపంచిక విషయాల మీద విరక్తి కలుగుతుంది. అలా విరక్తి కలిగినవాళ్ళు కూడా సన్న్యాసం స్వీకరించవచ్చు (నారద పరివ్రాజకోపనిషత్తు).

ప్రాపంచిక విషయాల మీద ఎలాంటి ఆసక్తి లేనివాడు, సుఖదుఃఖాల విషయంలో ఎలాంటి స్పృహ లేనివాడు (వైరాగ్యభావంతో ఉన్నవాడు) మనస్సుని జయించినవాడు అయిన మానవుడు సాంఖ్యయోగం ద్వారా (సన్న్యాసయోగం) ఎంతో గొప్పదైన నైష్కర్మ్య సిద్ధిని పొందుతాడు. జ్ఞానయోగానికి – పరాకాష్ఠ స్థితే ఈ నైష్కర్మ్యస్థితి. దీన్ని ఎవరు పొందగలరంటే –

పరిశుద్ధమైన బుద్ధి కలిగినవాడు, సాత్త్విక ఆహారాన్ని స్వీకరించేవాడు, మితాహారి, శబ్దాది విషయాలని (ఇంద్రియాల) విడిచిపెట్టి ఏకాంతంగా నివసిస్తున్నవాడు, సాత్త్వికమైన ధారణాశక్తితో అంతఃకరణాన్ని (మనస్సుని) ఇంద్రియాలనీ అదుపులో పెట్టుకున్నవాడు, మనసుని, మాటని, శరీరాన్ని స్వాధీనంలో ఉంచుకున్నవాడు, "రాగద్వేషాల్ని వదిలిపెట్టి దృఢమైన వైరాగ్యభావంతో ఉన్నవాడు, అహంకారాన్ని, బలాన్ని, కామక్రోధాల్ని, దర్పాన్ని, పరిగ్రహాన్ని వదిలిపెట్టినవాడు, నిరంతరం ధ్యానయోగంలో ఉన్నవాడు, మమకారం లేనివాడు, శాంతిపరుడు అయిన మానవుడు మాత్రమే పరబ్రహ్మతో (పరమాత్మ) ఐక్యమవటానికి సమర్థుడు" (భగవద్గీత).

**అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్,**
**అభ్యాసేనతు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే.** (భగవద్గీత. 6-35,42)

మనస్సు నిస్సందేహంగా చంచలమైనదే. అది ఒకచోట స్థిరంగా వుండదు. దాన్ని వశం చేసుకోవటం చాలా కష్టం. అయితే దానికో మార్గం వుంది. అభ్యాసం, వైరాగ్యం అనే ఈ రెండు పనుల్నీ శ్రద్ధతో చేయటం ద్వారా మనస్సుని వశపరుచుకోవచ్చు. వైరాగ్యభావంతో యోగిగా మారి సాధన చేస్తున్న మానవుడు తన సాధన పూర్తికాకుండా మరణించినట్లైతే (యోగభ్రష్టుడైతే) అలాంటివాడు పుణ్యాత్ములు వెళ్ళే స్వర్గాదిలోకాలలో సుఖాలు అనుభవించి, తిరిగి భూలోకంలో ధనవంతుల ఇళ్ళలో జన్మిస్తాడు. లేదా! ఊర్ధ్వలోకానికి వెళ్ళకుండానే జ్ఞానులు, యోగులైన కుటుంబంలో జన్మించి, తిరిగి తన సాధన కొనసాగిస్తాడు. అయితే ఇలాంటి జన్మ లభించటం చాలా కష్టం.

అసలు ఈ వైరాగ్యం అనేది మానవుడికి మూడు రకాల సందర్భాలలో కలుగుతుంది. 1.రకరకాల ఈతిబాధల వల్ల కలిగే వైరాగ్యం, 2.భయంతో కలిగే వైరాగ్యం, 3. వివేకంతో కలిగే వైరాగ్యం.

వివేకంతో కలిగే వైరాగ్యమే నిజమైన వైరాగ్యం. "ఏది సత్యం, ఏది నిత్యం, దేన్ని ఉపాసించాలి? ఏది మంచి, ఏది చెడు, అనే విషయాల్ని చక్కగా తెలుసుకుని, మనిషిని పతనం చేసే ఇంద్రియ సుఖాలమీద వైరాగ్యభావాన్ని పెంచుకుని, ఆత్మజ్ఞానంతో పరబ్రహ్మని ఉపాసిస్తూ మోక్షం కోసం ప్రయత్నం చేయటమే నిజమైన వైరాగ్యం.

## 13. తపస్సు

తపస్సు చేయటం వల్ల మనిషికి సత్త్వగుణం కలుగుతుంది. ఈ సత్త్వగుణం వల్ల మనస్సు పరిశుద్ధమవుతుంది. అలాంటి పరిశుద్ధ మనస్సు ద్వారా మనిషికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఈ ఆత్మజ్ఞానం వల్ల తిరిగి జన్మించని కైవల్యం మనిషికి లభిస్తుంది (మైత్రాయణ్యుపనిషత్తు).

నిశ్చలంగా నిలిచి ఉండే మనస్సుని అమృతం అంటారు. అమృతం అంటే తపస్సు. అంటే మనిషి తన సాధన ద్వారా మనస్సుని చంచలం కానీకుండా స్థిరంగా నిలిపి ఉంచటమే తపస్సు.

బ్రహ్మచర్యాన్ని పాటించటం, నిత్యం మంత్రజపం చేసుకోవటం, సమయానికి తగ్గట్టుగా శుచికరమైన, ఆహారాన్ని స్వీకరించటం, రాగం, ద్వేషం, లోభం అనే దుర్గుణాలు లేకపోవటం ఇవే తపస్సు.

ఈ శరీరం క్షణంలో నశించిపోయేది. ఇలాంటి శరీరాన్ని పొంది కూడా ఎవడైతే తపస్సుని ఆచరించడో అలాంటివాడు మరణించాక తన పాపాల ద్వారా పొందే నరకాల్ని చూసి, ఎంతో పశ్చాత్తాపపడతాడు. కాబట్టి మనం జీవించి ఉండగానే పాపపరిహారం కోసం తపస్సుని చేయాలి. ఇదే వాల్మీకి ఇచ్చే సందేశం.

పండితుల దృష్టిలో త్యాగం-వినయం ఈ రెండే ఉత్తమ తపస్సులు. వీటిని పాటించేవాడు, నిత్యం ఉపవాసం చేసేవాడు, ఎప్పుడూ బ్రహ్మచారిగా ఉండగలుగుతాడు.

తపస్సు చేయటానికి అన్ని వర్ణాల వారికీ అధికారం ఉంది. తపస్సు మానవుణ్ణి స్వర్గలోకానికి తీసుకు వెళుతుంది (మహాభారతం).

గీత ప్రకారం తపస్సులు మూడు విధాలు. 1.శారీరక తపస్సులు, 2.మాటతో చేసే తనస్సులు. 3.మనసుతో చేసే తపస్సులు.

దేవతలని, బ్రాహ్మణుల్నీ, గురువుల్నీ, పండితుల్నీ శ్రద్ధగా సేవించటం, శుచిగా ఉండటం, నిరాడంబరంగా జీవించటం, బ్రహ్మచర్యాన్ని పాటించటం, అహింసని పాటించటం ఇవన్నీ శారీరకంగా చేసే తపస్సులు. ఉద్వేగాన్ని కలిగించకుండా ప్రేమగా ఇతరులకి మేలు కలిగేలా యథార్థంగా మాట్లాడే మాటలు, అలాగే వేదశాస్త్రాల్ని పఠించటం, పరమాత్మ నామాన్ని శ్రద్ధగా జపించటం, ఇలాంటివన్నీ వాక్కుతో చేసే తపస్సులు. ప్రశాంతమైన మనస్సునీ, శాంత స్వభావాన్నీ కలిగి ఉండటం, నిత్యం

భగవంతుడి గురించి ఆలోచించటం, మనస్సుని నిగ్రహంగా ఉంచుకోవటం, మౌనంగా ఉండడం ఈ గుణాలన్నీ మానసిక తపస్సులు.

ఈ తపస్సులను ఫలాపేక్షా లేకుండా ఆచరించే వాళ్ళని సాత్త్విక తపోధనులు అంటారు.

అహంకారం, స్వార్థంతో ఉన్నవాళ్ళు, కోరికల మీద ఆసక్తితో ఉన్నవాళ్ళు, బలం ఉందని గర్వపడేవాళ్ళు శాస్త్రానికి విరుద్ధంగా, తమ మనస్సుకి తోచినట్టుగా కఠోరమైన తపస్సులు చేస్తుంటారు. అలా వాళ్ళు తమ శరీరంలో ఉన్న పంచభూతాలని, అలాగే అంతర్యామిగా వాళ్ళ లోపలే ఉన్న భగవంతుణ్ణి కృశింప చేస్తున్నారు. ఇలా చేసేవాళ్ళు అజ్ఞానులు, రాక్షస స్వభావం కలిగినవాళ్ళు.

యుగధర్మాన్ని బట్టి మనం నడుచుకోవాలి. పూర్వకాలంలో ఋషులు, మునులు తపస్సు చేసి ఎన్నెన్నో వరాలు పొందారు కదా! అని మనం కూడా అలాంటి తపస్సులకి పూనుకోకూడదు. ఎందుకంటే ఆనాటి మనుషులు శరీరాలు, వాళ్ళ శక్తి సామర్థ్యాలు వేరు. కలియుగంలో అందరూ అన్నగత ప్రాణులే. అన్నం లేకపోతే శరీరం నిలబడదు. అనారోగ్యం పాలవుతుంది. కనుక ఉపవాసాలు ఉండి శరీరాన్ని కష్టపెట్టకూడదు. తద్వారా శరీరంలో వైశ్వానరాగ్ని రూపంతో వున్న పరమాత్మకి, ఆహారం లేకుండా చేసిన వాళ్ళమవుతాం.

ఇలా గీతలో కృష్ణుడు చెప్పినట్టుగా దైవీగుణాల్ని పెంపొందించుకుని అనన్య చింతతో ఆయన్ని సేవిస్తే చాలు అందరికీ సులభంగా మోక్షం లభిస్తుంది.

## 14. అహింస

**"అహింసో పరమో ధర్మః"** అని స్మృతులు చెబుతాయి.

**అహింసా ప్రథమం పుష్పం పుష్ప మింద్రియ నిగ్రహః,**
**సర్వభూత దయాపుష్పం క్షమాపుష్పం విశేషతః.**

**శాంతిపుష్పం తపః పుష్పం ధ్యానపుష్పం తథైవ చ,**
**సత్యమష్ట విధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్.**

1. అహింస, 2. ఇంద్రియనిగ్రహం, 3. సర్వభూతదయ, 4. క్షమ (ఓర్పు), 5.శాంతి, 6.తపస్సు, 7.ధ్యానం, 8.సత్యం. ఈ ఎనిమిది భగవంతుడి పుష్పాలలో మొదటిస్థానం అహింసదే. అహింసాగుణాన్ని కలిగి ఉండటమే గొప్పజ్ఞానం.

దానం చేయటం, ఇతరులకి ప్రియాన్ని కలిగించటం, సత్యాన్ని పలకటం, అహింసా గుణాన్ని కలిగి ఉండటం. ఈ నాలుగు ధర్మాలూ సమానమైనవే అయినా వీటిలో అహింసా ధర్మమే గొప్పది. అయితే ఎవరికి వాళ్ళు తమకు తెలిసి ఏ ప్రాణినీ, మనిషినీ హింసించకుండా ప్రవర్తించాలి. ఇదే క్రమక్రమంగా అహింసగా ప్రకాశిస్తుంది.

"అహింస, దానం, సత్యం, కోపాల్ని విడిచిపెట్టటం అనేవి ఉత్తమధర్మాలు. వీటిని మించిన ధర్మాలులేవు (మహాభారతం).

మనసుతో, మాటతో గాయం చేయటం, మాంసం తినటం అనేవి హింసలు.

లోకంలో ఎవరైతే ధర్మం, సత్యం, కీర్తి, దయ, విష్ణుభక్తి, సత్కర్మాచరణ వీటితో పాటు అహింసా వ్రతాన్ని అవలంబిస్తారో వారే పుణ్యాత్ములు. ఈ గుణాల్ని పాటించకుండా గర్వంతో విర్రవీగే రాజుల్ని చూసి భూమాత నవ్వుకుంటుంది.

ప్రాణుల్ని హింసించకుండా ఎవరికీ మాంసం లభించదు. అలా మాంసం కోసం దయ లేకుండా ప్రాణుల్ని చంపటం నరక హేతువు. కనుక మాంసాహారాన్ని విడిచిపెట్టాలి.

మనసా వాచా కర్మణా ఏ జీవినీ భయపెట్టనివాడు, ఏ జీవికీ భయపడనివాడు, బ్రహ్మభావంతో ఉంటాడు. తపస్సు, యజ్ఞం, దానం, సత్యవాక్పాలన వీటివల్ల వచ్చే ఫలితాలన్నీ ఒక్క అహింసా పాలనతోనే పొందవచ్చు.

మానవుడు ఆచరించే ఏధర్మమైనా అహింసతో, శ్రద్ధతో కూడి ఉండాలి. సకల ప్రాణులకీ హితాన్ని కలిగించేదై ఉండాలి. హింసతో కూడిన ధర్మాన్ని ఎప్పుడూ ఆచరించకూడదు.

**"ఆత్మవత్ సర్వభూతాని"** అని శ్రీకృష్ణుడు చెప్పిన గీతావాక్యాన్ని త్రికరణశుద్ధిగా నమ్మినవాడు. ఇక ఎవరికి హింసని కలిగిస్తాడు? ఎవరిమీద దయ లేకుండా ఉంటాడు?

ఉద్దేశపూర్వకంగా ఏ జీవినీ హింసించకూడదు. తెలిసి ఎవరినీ ఏ జీవినీ బాధపెట్టకూడదు.

అడవిలో సంచరించే అన్నిరకాల జంతువుల పాదముద్రలు ఏనుగు పాదముద్రలో ఇమిడిపోయినట్టే, అన్నిధర్మాలూ 'అహింస' అనే పరమధర్మంలో ఇమిడిపోతాయి. కర్మలన్నీ విడిచిపెట్టి సన్యాసం తీసుకున్న యతీశ్వరుడికైనా భూతదయ ఉండాల్సిందే (మహాభారతం).

## 15. మైత్రి (స్నేహం)

**'సఖ్యం సాప్తపదీనాం'** అని ఆర్యోక్తి. అంటే ఏడు అడుగులు కలిసి నడిస్తే స్నేహం లభిస్తుంది అని అర్థం. తల్లితో, భార్యతో, సంతానంతో పంచుకోలేని విషయాలన్నీ మనిషి తన స్నేహితుడితోనే పంచుకుంటాడు. అయితే "స్నేహం చేసేముందు ఒకటికి వందసార్లు ఆలోచించు. కానీ, ఒకసారి స్నేహం చేసాక దాన్ని వదిలిపెట్టకు. ఇదే నిజమైన మిత్రధర్మం.

నిజమైన స్నేహానికి ధనం, దరిద్రం, గుణం, దోషం, కష్టం, సుఖం ఇలాంటివేవీ ప్రతిబంధకాలు కాకూడదు.

నిస్వార్థంగా ఒకరికోసం ఒకరు తన ధన మాన ప్రాణాల్ని సమర్పించటానికి సిద్ధంగా ఉండటమే మంచి స్నేహానికి నిర్వచనం.

కిష్కింధకాండలో సుగ్రీవుడు, శ్రీరాముడు అగ్నిసాక్షిగా మైత్రిని పొందిన తరువాత సుగ్రీవుడు ఇలా అంటాడు "శ్రీరామా! నేటినుంచీ నువ్వు నా హృదయానికి ప్రియమైన స్నేహితుడివి. ఇక నుంచీ మనిద్దరి సుఖదుఃఖాలు ఒక్కటే" అని.

లోకంలో ఎవరితోనైనా అతిస్నేహాన్ని, ఏవస్తువు మీదైనా అధిక ఆసక్తిని కలిగి ఉండకూడదు.

తనకున్న కోపంతో ఇతరుల్ని భయపెట్టేవాడు మిత్రుడు కాడు. అలాగే అనుమానంతో సేవలు చేసేవాడు కూడా మిత్రుడు కాడు. నిజమైన మిత్రుడు కన్నతండ్రిలా నమ్మదగినవాడు. ఎలాంటి బంధుత్వం లేనప్పటికీ నిజమైన స్నేహభావంతో ప్రవర్తించేవాడు ఆత్మబంధువు లాంటివాడు. అలాంటివాడే అసలైన స్నేహితుడు. వాడే చేరదగినవాడు. నమ్మకమైనవాడు.

చపలచిత్తం కలిగి, పెద్దల్ని గౌరవించని వారితో చేసే స్నేహం శాశ్వతంగా నిలవదు. ధనం ఉన్నా లేకపోయినా స్నేహితుణ్ణి తోటి స్నేహితుడు ఆదరించాలి.

ఇద్దరు స్నేహితులకి–మనస్సుతో మనస్సు, రహస్యంతో రహస్యం, తెలివితో తెలివి చక్కగా కలిస్తే వాళ్ళిద్దరి స్నేహం ఎప్పటికీ క్షీణించదు. స్నేహితుడు దుర్మార్గుడైతే గడ్డితో కప్పిన బావిలాగా వెంటనే విడిచిపెట్టాలి. పండితుడైనవాడు – గర్విష్టితో, మూర్ఖుడితో, కోపిష్టితో, తొందరపాటు కలిగినవాడితో, అధర్మపరుడితో స్నేహం ఎప్పుడూ చేయకూడదు.

స్నేహితుడన్నవాడు ఎప్పుడూ కృతజ్ఞుడై వుండాలి. ధర్మపరుడూ, సత్యశీలీ కావాలి. నీచమైన గుణాలు ఉండకూడదు. ఇంద్రియ నిగ్రహంతో ఉండాలి. పరమాత్మ మీద అచంచలమైన భక్తిశ్రద్ధలు ఉండాలి. ఆపదల్లో విడిచిపెట్టకుండా ఉండాలి. (విదురనీతి).

మంచి సాహవాసం (స్నేహం) అనేది బుద్ధిమాంధ్యాన్ని పోగొడుతుంది, సత్యాన్నే మాట్లాడేలా చేస్తుంది. గౌరవాన్ని కలిగిస్తుంది. పాపాల్ని పోగొడుతుంది, మనస్సుని బాగు చేస్తుంది (మనశ్శాంతిని కలిగిస్తుంది) నాలుగుదిక్కులా కీర్తిని వ్యాపింప చేస్తుంది. వెయ్యి మాటలెందుకు? మంచి స్నేహం చేయని పనేలేదు. కాబట్టి మంచి మిత్రులతో సహవాసం చెయ్యాలి. మంచి మిత్రులు కావాలి.

## 16. ఆత్మతత్త్వం (జ్ఞానం)

ఆత్మ అనేది అణువు కన్నా సూక్ష్మమైనది. మహత్తరమైన దానికన్నా ఎంతో పెద్దది. అది సమస్త ప్రాణుల హృదయాలలో ఉన్నది. ఎలాంటి కోరికలూ లేనివాడు, దుఃఖరహితుడు, ఇంద్రియశుద్ధి, వాక్శుద్ధి ఉన్నవాడు ఆత్మ గొప్పతనాన్ని తెలుసుకోగలడు.

ఆత్మజ్ఞానాన్ని పొందే దారి పదునైన కత్తి అంచులాంటిది.

ఈ ఆత్మకి శబ్ద, రూప, రస, గంధాలు అనేవేవీ ఉండవు. ఇది అవ్యయమైనది, నిత్యమైనది, అనాదిగా ఉన్నది, అనంతమైనది, నిశ్చలంగా ఉండేది, ఇలాంటి ఆత్మని గురించి తెలుసుకున్నవాడు మృత్యువు నుంచి విడుదల పొందుతాడు. అంటే ఆత్మజ్ఞానికి ప్రాణభయం ఉండదు.

ప్రతిమనిషి శరీరంలో బొటన వ్రేలంత పరిమాణంలో ఒక పురుషుడు ఉన్నాడు. ఈ పురుషుడే అతడి ఆత్మ. భూతకాల భవిష్యత్కాలాలకీ ఈ పురుషుడే అధిపతి.

**'ఆత్మె వేద మగ్ర ఆసీ దేకఏవ'** (బృహదారణ్యకోపనిషత్). ఈ సృష్టికి పూర్వం కేవలం ఆత్మ ఒక్కటే ఉన్నది. **"అథయోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యో అహమస్మీతి న స వేద యథా పశు"** (బృహదారణ్య కోపనిషత్తు). తన ఆత్మకన్నా వేరైన దేవత ఉన్నాడని, ఆత్మవేరు, దేవతవేరు అని భావిస్తూ అన్యదేవతోపాసన చేసినవాణ్ణి అజ్ఞాని అంటారు. జ్ఞాని అయినవాడు తాను పూజించే దైవం తాను వేరుకాదు ఇద్దరూ ఒకటేనని భావిస్తాడు.

నువ్వుల్లో నూనెలాగా, పెరుగులో వెన్నలాగా, ప్రవాహంలో జలంలాగా, కర్రలో అగ్నిలాగా, ఆత్మ అనేది మనిషి అంతఃకరణంలో నిగూఢంగా ఉంది. దాన్ని సాక్షాత్కరింప చేసుకోవాలంటే మానవుడు సత్యం, తపస్సు, ధ్యానం, అభ్యాసం అనే సుగుణాలని ఆచరించాలని బ్రహ్మోపనిషత్తు చెబుతుంది.

మోక్షం పొందాలంటే దానికి ఏకైక సాధనం ఆత్మజ్ఞానమే. ఇది అన్నిధర్మాల కన్నా గొప్పది. ఆత్మజ్ఞానం కన్నా గొప్పధర్మం లోకంలో మరొకటి లేదు. వేదాల తాత్పర్యం ఆత్మజ్ఞానమే. అందుకే ఇది వేదాలలాగా మహత్తరమైనదిగా ప్రసిద్ధి చెందినది.

ఆత్మ అనేది ముక్తం (విడువబడింది) కాదు, బద్ధం (బంధించబడింది) కాదు. ఆత్మ మోక్షాన్ని కోరదు. ఈ సత్యాన్ని తెలుసుకున్నవాడే గొప్ప జ్ఞాని.

ఆత్మకి చావు పుట్టుకలు లేవు. దీనికి పెరగటం, తరగటం, నశించటం లాంటి భావపరిణామాలు ఏవీ వుండవు. దీనికి జన్మలేదు. ఇది నిత్యమైనది, శాశ్వతమైనది, ఎంతో పురాతనమైనది కూడా.

మనిషి శరీరం చంపబడ్డా లోపలున్న ఆత్మ చావదు. మానవుడు పాడైపోయిన వస్త్రాల్ని విడిచిపెట్టి కొత్త వస్త్రాలు ధరించినట్లు, జీవాత్మ కూడా జీర్ణమైన శరీరాన్ని వదిలిపెట్టి కొత్త శరీరాల్ని పొందుతుంది. ఇంత గొప్పదైన ఆత్మని ఎలాంటి శస్త్రాలు ఛేదించలేవు, అగ్ని దహించలేదు, నీరు తడపలేదు, వాయువు ఆరిపోయేలా చేయలేదు. ఆత్మకి ఒక ప్రత్యేకమైన రూపంలేదు. అది ఇంద్రియాలకి కనిపించదు.

సూర్యుడు ఒక్కడే అయినప్పటికీ వేర్వేరు జలపాత్రలో ఎంతోమంది సూర్యులు ఉన్నట్టు ఎలా కనిపిస్తాడో! ఆత్మ కూడా ఒక్కటే అయినప్పటికీ అది వేర్వేరు శరీరాలలో ప్రవేశించి పలురకాలుగా ఉన్నట్టు అనిపిస్తుంది.

వేదవేత్తల్లో, అధముల్లో, దొంగల్లో, బ్రాహ్మణ భక్తుల్లో, సూర్యుడిలో, నిప్పురవ్వలో, శాంతచిత్తుల్లో, క్రూరాత్ముల్లో ఒకే ఆత్మని సమానంగా చూసేవాడే పండితుడు.

## 17. తృష్ణ (ఆశ)

**ఆధ్యాత్మరతి రాసీనో నిరపేక్షో నిరాశిషః,**

**ఆత్మనైవ సహాయేన సుఖార్థీ విహరే దిహ.** (నారద పరివ్రాజకోపనిషత్తు 3-44)

పరబ్రహ్మ మీద ఆసక్తితో ఉండేవాడిని, దేన్నీ ఆశించనివాడిని ఆశ (తృష్ణ) లేనివాడిని, ఆత్మ సహాయంతో ఉన్నవాడిని, ఆధ్యాత్మిక సుఖాన్ని కోరుకుంటూ ప్రపంచంలో సంచరించేవాడిని 'సన్న్యాసి' అంటారు.

కోరికలు అనే తాళ్ళతో ఈ లోకమంతా (మానవులు) కట్టబడి, జననమరణ చక్రంలోపడి తిరుగుతోంది. ఈ ఆశ అనేది మానవులకి దుఃఖాన్ని కలిగిస్తుంది. దాన్ని ఛేదిస్తే (తొలగించుకుంటే) సుఖం కలుగుతుంది. ఎంత ధైర్యవంతుడినైనా, గొప్ప శాస్త్రపండితుడినైనా, గొప్ప వంశంలో పుట్టినవాడినైనా, అద్భుతమైన మహిమలు కలిగినవాడినైనా, సింహం సంకెళ్ళతో బంధించినట్టుగా, 'ఆశ' బంధిస్తుంది.

మానవుడు అహంకారం అనే పుత్రుణ్ణి, ధనం అనే సోదరుణ్ణి, మోహం అనే గృహాన్ని, ఆశ అనే భార్యని విడిచిపెట్టినప్పుడే, నిస్సందేహంగా మోక్షాన్ని పొందుతాడని మైత్రేయోపనిషత్తు చెబుతుంది. ఆశ, సిగ్గు, భయం, దుఃఖం, విషాదం, హర్షం లాంటి దోషాల నుంచి విముక్తుడయినవాడు సాక్షాత్తు పరమాత్మే (యోగతత్త్వోపనిషత్తు).

స్వర్గసుఖాల కన్నా 'ఆశ'ని వదిలితే మనిషి పొందే సుఖం ఎంతో గొప్పది. ఆశ అనే అగ్ని నీళ్ళతో చల్లారదు. అది కట్టెలు వేస్తుంటే పెరిగే అగ్నిలాగా, కోరికలు తీరుతున్న కొద్దీ ఆశ పెరుగుతూనే ఉంటుంది.

ఆవు పెరుగుతున్నకొద్దీ దాని కొమ్ములు కూడా పెరుగుతున్నట్టు, మనిషికి ధనం పెరిగినకొద్దీ దానితో పాటు ఆశ కూడా పెరుగుతుంది.

**జీర్యంతి జీర్యతః కేశాదన్తా జీర్యన్తి జీర్యతః,**

**చక్షుః శ్రోత్రే చ జీర్యతే తృష్ణైకా న తు జీర్యతే.**

(మ.భా., అనుశాసనికపర్వం)

వార్ధక్యం వల్ల మనుషుల వెంట్రుకలు రాలిపోతున్నాయి. పళ్ళు ఊడిపోతున్నాయి. అలాగే కళ్ళు, చెవులు కూడా శిథిలమైపోతున్నాయి. అయినా మనిషిలో ఉన్న ఆశ మాత్రం శిథిలం కావటం లేదు. అది ఇంకా ఇంకా పెరిగిపోతోంది.

లోకంలో తృష్ణ (ఆశ) అనేది చాలా బలమైన దుర్గుణం. అది ఎంత గొప్పవాడినైనా వశం చేసుకుంటుంది. మేరుపర్వతం లాంటి ఉన్నతుణ్ణైనా, మహత్తరమైన జ్ఞానవంతుడినైనా, పరాక్రమం కలిగిన శూరుడినైనా ఒక్క నిమిషంలో తృణీకరిస్తుంది. (గడ్డిపోచలా తీసేస్తుంది). వారిపై అధికారాన్ని చెలాయించుకుంటుంది. అంత చెడ్డది ఈ తృష్ణ. అసలు లోకంలో దరిద్రానికి కారణం ధనం లేకపోవటం కాదు. ఆశ (దురాశ) మితిమీరిపోవటమే.

**స తు భవతు దరిద్రో యస్య తృష్ణా విశాలా,**
**మనసి చ పరితుష్టే కోఽర్థవాన్ కో దరిద్రః.** (భర్తృహరి నీతిశతకం)

లోకంలో అత్యంత దురాశని (తృష్ణ) కలిగిన వాడే నిజమైన దరిద్రుడు. మనస్సు తృప్తి చెంది సంతోషంగా ఉంటే ఇక దరిద్రుడు, ధనవంతుడు అనే భేదం ఎక్కడుంటుంది? కనుక ఉన్న దానితో తృప్తిపడటం అలవాటు చేసుకుంటే ఈ తృష్ణ (ఆశ) అనే దుర్గుణం క్రమక్రమంగా నశించిపోతుంది.

మనిషి దురాశని పొందకుండా, తనకి సంపదలు లేవని బాధపడకుండా దొరికింది కొంచమే అయినా అదే పదివేలనుకుని తృప్తిపడాలి. ఇలా తృప్తి చెందలేనివాడు సప్తద్వీపాలు లభించినా ఇంకా ఏదో కావాలన్న ఆశతో మనశ్శాంతిగా జీవించలేడు. ఈ ఆశాపాశం అనేది చాలా పొడవైనది. దానికి అంతమన్నదే లేదు. పూర్వం పృథుచక్రవర్తి, గయుడు లాంటి మహారాజులు సమస్త భూమండలాన్నీ సంపాదించి కూడా ఎలాంటి తృప్తీ పొందలేదు. అలాగే ధనం మీద కామం మీద ఆశని ఏమాత్రం వదులుకోలేదు.

అసలు ఈ ఆశకి అడ్డేముంది? మనిషికి సంతోషం సంతృప్తి ముఖ్యం. సంతృప్తి ఉన్నవాడు సంతోషపడతాడు. సంతోషంగా ఉండేవాడికే మనశ్శాంతి ఉంటుంది. ఈ మనశ్శాంతి ఉన్నవాడే పరమాత్మ మీద దృష్టి నిలుపగలుగుతాడు.

## 18. దానం

ఇవ్వగలిగిన స్థాయిలో ఉన్నవాడు అవసరమైనవాడికి ప్రేమపూర్వకంగా అందించేదే దానం. అది వాగ్దానం కావచ్చు, వస్తుదానం కావచ్చు, అన్నదానం కావచ్చు, గోదానం కావచ్చు. అయితే ఏ దానం చేసినా దాన్ని త్రికరణశుద్ధిగా చేయాలని చెబుతుంది మన సనాతనధర్మం.

మానవులారా! వంద చేతుల్తో సంపాదించండి. వేయి చేతుల్తో ఆ సంపాదనని దానాలకి సత్కార్యాలకి వినియోగించండి అని అథర్వణవేదం చెబుతోంది. కనుక సమాజంలో ప్రతి ఒక్కరూ సంపాదించటమే కాక, ఆ సంపాదనని సత్కార్యాల కోసం ఖర్చు చేయటం కూడా అలవాటు చేసుకోవాలి.

ఎవరైనా తనని యాచిస్తే ఎలాంటి అసూయా లేకుండా అడిగినవాడికి తన శక్తికొద్దీ దానం చెయ్యాలి. అలా దానాలు చేస్తున్నప్పుడు యోగ్యుడైనవాడు కూడా దానం తీసుకోవచ్చు. అలాంటి యోగ్యుడికి దానం ఇవ్వటం వల్ల, ఇచ్చిన దాతకి పుణ్యలోకాలు కలుగుతాయి.

నీళ్ళని దానం చేస్తే చేసిన దాతకి ఎంతో తృప్తి కలుగుతుంది. అన్నం దానంచేస్తే అంతులేని సుఖం లభిస్తుంది. ఆవుల్ని దానంచేస్తే కోరిన సంతానం కలుగుతుంది. దీపదానం చేస్తే మంచి దృష్టి లభిస్తుంది. భూదానం చేసినవాడికి భూలాభం కలుగుతుంది. బంగారాన్ని దానం చేస్తే దీర్ఘాయువు లభిస్తుంది. ఇళ్ళని దానం చేసినవాడికి గొప్ప గొప్ప భవనాలు లభిస్తాయి. వెండి దానం చేసినవాడు మంచిరూపాన్ని పొందుతాడు.

వస్త్రాలు దానం చేసినవాడికి చంద్రలోకం ప్రాప్తిస్తుంది. గుర్రాల్ని దానం చేసినవాడు అశ్వినీదేవతల లోకాన్ని చేరుకుంటాడు. ఎద్దుల్ని దానం చేసినవాడు అంతులేని సంపదలకి అధిపతి అవుతాడు. ఆవుల్ని దానం చేసినవాడు సూర్యలోకానికి చేరుకుంటాడు. వాహనాలను, మంచాలను దానం చేసినవాడికి చక్కటి భార్య లభిస్తుంది. కష్టాల్లో ఉన్నవాళ్ళకి అభయాన్ని ఇచ్చేవాడు గొప్ప ఐశ్వర్యాన్ని పొందుతాడు. ధాన్యాన్ని దానం చేసినవాడు శాశ్వతమైన సుఖాల్ని పొందుతాడు. వేదశాస్త్రాల్ని ప్రబోధించినవాడు (ఉచితంగా) బ్రహ్మతో సమానమైనవాడవుతాడు.

అన్నం, నీరు, గోవు, భూమి, వస్త్రాలు, నువ్వులు, బంగారం, నెయ్యి లాంటివి దానం చేయటం కన్నా వేదాన్ని దానం చెయ్యటం (ఉచితంగా బోధించటం) గొప్పదానం. (అనగా వేదపాఠశాలలు స్థాపించి, గురువుల్ని నియమించి వారి ద్వారా విద్యార్థులకి వేదాలు చెప్పించటం వేద విద్యాదానం అవుతుంది). దానం చేసేటప్పుడు దాత ఏ కోరికతో దానం చేస్తాడో అతడు మరోజన్మలో ఆ కోరికని తీర్చుకుంటాడు.

దానం చేసేవాడు, దానం తీసుకునే వ్యక్తిని గౌరవంగా పూజించి, శాస్త్రయుక్తంగా దానం ఇవ్వాలి. అలా చేయటంవల్ల దానం ఇచ్చినవాడు, దానం పుచ్చుకున్నవాడు ఇద్దరూ స్వర్గానికి వెళతారు. మర్యాద లేకుండా చేసిన దానం నరకాన్ని చేరుస్తుంది.

ఎవరైనాసరే తాము చేసిన తపస్సుకి, చేసిన దానధర్మాలకి ఆశ్చర్యపోకూడదు (అనగా తమని తాము గొప్పగా భావించుకోకూడదు) యాగాలు చేసి అబద్ధాలు చెప్పకూడదు. యజమాని తాను బాధపడ్డప్పటికీ బ్రాహ్మణుల్ని నిందించకూడదు. అలాగే ఎవరూ కూడా తాము చేసిన దానాల గురించి ఇతరులకి చెప్పుకోకూడదు. (ప్రచారం చేసుకోకూడదు).

అబద్ధాలు చెప్పేవాళ్ళు చేసిన యాగఫలం నశించిపోతుంది. తాము చేసిన తపస్సు గొప్పదని భావించేవారి దానమూ నశించిపోతుంది. బ్రాహ్మణుల్ని అకారణంగా దూషించిన వాళ్ళకి ఆయువు క్షీణిస్తుంది. చేసిన దానం నలుగురికీ చెప్పుకుంటే దానఫలం నశించిపోతుంది. కనుక దానం చేసేవాళ్ళు చాలా జాగ్రత్తగా నియమపూరితంగా దానాలు చేయాలి.

కృతయుగంలో తపస్సు చేయటం, త్రేతాయుగంలో జ్ఞానాన్ని సంపాదించటం, ద్వాపరయుగంలో యజ్ఞాలు చేయటం, కలియుగంలో దానాలు చేయటం అనేవి ప్రధాన ధర్మాలుగా పరాశరస్మృతి పేర్కొంటుంది.

స్వంతమైన ఆవు, బంగారం, ధాన్యం, ధనం, భూమి లాంటి వాటిని ఎటువంటి మూల్యం తీసుకోకుండా శాస్త్రోక్తంగా తనకున్న హక్కును మరొకడికి స్వాధీనం చేయటమే దానం.

దానాన్ని కూడా పాత్రతని ఎరిగి ఇవ్వాలి. అనర్హులైన వారికి దానాలు చేస్తే దానివల్ల దాతకి పుణ్యం కలగకపోగా పాపం కలుగుతుంది.

మంచి సారవంతమైన భూమిలో నాటిన విత్తనం నశించిపోకుండా, కాలక్రమంలో పుష్పఫలాలని అందించినట్లు యోగ్యుడైన వాడికి ఇచ్చిన ధనం, ధాన్యం కూడా వృథా కాకుండా దాతకి పుణ్యఫలితాన్నిస్తుంది.

ఎవరికీ చెప్పకుండా రహస్యంగా యోగ్యుడైన విప్రుడి ఇంటికి వెళ్ళి తాను ఇవ్వాలనుకున్న వస్తువుని దానంగా ఇచ్చి వచ్చేయాలి. దీనివల్ల దాతకి ఇస్తున్నానన్న అహంకారం, స్వీకర్తకి తీసుకుంటున్నానన్న హీనభావం రెండూ ఉండవు.

బ్రాహ్మణుణ్ణి తన ఇంటికి పిలిపించుకుని దానం ఇవ్వటం మధ్యమ రకానికి చెందింది. ఇందులో దాత అహంకారం కనిపిస్తుంది. ఇక యాచించిన బ్రాహ్మణుడికి దానంచేస్తే అది అధమ విభాగానికి వస్తుంది. ఎందుకంటే వేదవేదాంగాలు చదివిన

ఉత్తమ విప్రుడు దారిద్ర్యంలో తనంతట తాను యాచనచేసే పరిస్థితిని దాతలు ఎప్పుడూ కల్పించకూడదు.

## అపాత్రదానం

సన్న్యాసికి బంగారాన్ని, బ్రహ్మచారికి తాంబూలాన్ని, దొంగలకి అభయదానాన్ని ఇచ్చేదాత తప్పకుండా నరకానికి పోతాడు. ఎందుకంటే సర్వసంగ పరిత్యాగి అయిన సన్న్యాసికి బంగారాన్నిస్తే దాని సంరక్షణ కోసం తిరిగి అతడు మోహంలో పడిపోయి, ఆచార భ్రష్టుడవుతాడు. అలాగే బ్రహ్మచారికి సుగంధభరిత తాంబూలం సేవిస్తే, దానివల్ల అతడిలో కామపరమైన కోరికలు విజృంభించి, బ్రహ్మచర్యాన్ని భ్రష్టు పట్టిస్తాయి. ఇక దొంగతనాలు చేసి ప్రజల్ని బాధించేవాడికి అభయాన్నిస్తే వాడివల్ల ఎంతోమంది కష్టాలు పడతారు.

దానాలు మూడువిధాలు. 1. సాత్త్వికదానం, 2. రాజసికదానం, 3. తామసికదానం అని. ఈ మూడిటిలో సాత్త్వికదానం చాలా గొప్పది. "చక్కగా విద్యలని అభ్యసించినవాడు, సద్గుణశీలి, ప్రత్యుపకారం చేసేవాడు అయిన వ్యక్తికి పుణ్యతీర్థాలతో, పుణ్య తిథుల్లో దానం చేయాలి. అది సాత్త్వికదానం.

దానాలలో ఎన్నోరకాల దానాలున్నాయి. 1. భూదానం, 2. గోదానం, 3. సువర్ణదానం, 4. గృహదానం, 5. వస్త్రదానం, 6. విద్యాదానం, 7. శ్రమదానం, 8. అన్నదానం. ఈ దానాలలో అన్నదానం, గోదానం, భూదానం అనేవి ఉత్తమదానాలు.

పరమాత్మకి నివేదించకుండా ఆర్తులకి, స్నేహితులకి పెట్టకుండా, తానొక్కడే స్వార్థంతో తినేవాడు పాపాత్ముడే అవుతాడని ఋగ్వేదంలోని భిక్షుసూక్తం ప్రబోధిస్తుంది. కాబట్టి దానం చేయగలిగినవాడు తప్పనిసరిగా ఆకలితో ఉన్నవాళ్ళకి అన్నదానం చెయ్యాలి.

అన్నదానం అనేది పెట్టే దాతకి భుజించే భోక్తకి ఇద్దరికీ ప్రత్యక్షంగా ఆనందాన్ని సంతృప్తిని కలిగిస్తుంది. మిగిలిన అన్నిరకాల దానాలలో ఫలం పరోక్షంగానే ఉంటుంది.

**సర్వేషామేవ దానానామన్నం శ్రేష్ఠ ముదాహృతమ్,**
**పూర్వమన్న ప్రదాతవ్యం ఋజునా ధర్మమిచ్ఛతి.** (మహాభారతం)

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది. కనుక ధర్మకార్యాల మీద ఆసక్తి ఉన్నవాడు మొదటగా మృదుస్వభావంతో అన్నదానాన్ని చేయాలి.

అన్నదానం ప్రాణదానంతో సమానం కాబట్టి అన్నదానం చేసినవాడు కూడా సకలదానాలనీ చేసిన ఫలితం పొందుతాడు. పరిశుద్ధమైన మనసుతో అన్నదానం చేసినవాడు తన పదివేల తరాలవారితో కలిసి బ్రహ్మలోకానికి చేరుకుంటారు.

జలదానం వెంటనే తృప్తిని కలిగిస్తుంది. జలదానం చేసినవాడు మహాపాతకాలు, ఉపపాతకాలు చేసినప్పటికీ వాటి నుంచి విముక్తి పొందుతాడు.

అన్నదానం జలదానం రెండూ ఎంతో ప్రాధాన్యత కలిగినవే. వీటిలో ఏదానం చేసినా అనంతమైన పుణ్యం లభిస్తుంది. అన్నదాత వంశంలో జన్మించిన వారు వేయి తరాలవరకూ నరకాన్ని చూడరు.

నిత్యం-నైమిత్తికం-కామ్యం-ప్రాయికం అని దానాలు నాలుగు విధాలుగా ఉంటాయి.

**1. నిత్యదానం:** సూర్యోదయ కాలంలో చేసే దానం సకల పాపాలనీ హరిస్తుంది. ఎందుకంటే సూర్యోదయ కాలంలో ఘోరమైన అంధకారం నశిస్తుంది. ఆకాశంలో సూర్యభగవానుడు దివ్యతేజస్సుతో ప్రకాశిస్తుంటాడు. ఆయన దివ్య తేజస్సుతో దహించబడి పాపాలన్నీ భస్మమైపోతాయి.

దానం చేసినవాడు ఆ దానప్రభావం వల్ల మహాజ్ఞానాన్ని ఎన్నో పనుల్ని చేసే సామర్థ్యాన్ని పొంది, ధనవంతుడిగా, గుణవంతుడిగా, పండితుడిగా, వివేకవంతుడిగా మారతాడు. ఒకరోజు, ఒకమాసం, ఒకపక్షం భోజనాన్ని ఎవరికీ దానం చేయనివాడికి అన్ని భోగాల్ని తొలగించి, భోజనం తినలేని వాడిగా చేస్తానని సాక్షాత్తు శ్రీకృష్ణుడే ప్రబోధించాడు.

**2. <u>నైమిత్తిక కాలదానం:</u>** అమావాస్య, పూర్ణిమ, సంక్రమణాలు ఏర్పడిన రోజులు. వ్యతీపాత దినాలు, వైధృతయోగాలు, ఏకాదశులు మహామాఘీ (మాఘపూర్ణిమ) ఆషాఢ పూర్ణిమ, శ్రావణ పూర్ణిమ, వైశాఖపూర్ణిమ, కార్తిక పూర్ణిమ, సోమవారం అమావాస్య కలిపి వచ్చిన రోజు (సోమవతీ అమావాస్య), మన్వంతరాల రోజులు, ఉగాదులు పితృపక్షాలలోని క్షయతిథులు వీటన్నిటినీ నిమిత్తకాలాలంటారు. ఈ నైమిత్తకాలాలలో దానధర్మాలు చేస్తే అవి అనంతమైన పుణ్యఫలాలనిస్తాయి.

**3. కామ్యకాల దానం:** ఏదైనా కోరికల్ని తీర్చుకోవాలని ఉద్దేశించి చేసే దానాలను కామ్య దానాలంటారు. వ్రతాలు, పూజలు, నోములు, కామ్యహోమాలు, అభిషేకాలు వీటిని తమ తమ కోరికలకి అనుగుణంగా నిర్వహించి, ఆ సందర్భంగా చేసే దానాలు, దక్షిణలు అన్నదానాలు, భూగోదానాలు ఇవన్నీ కామ్యదానాల క్రిందే వస్తాయి.

**4. ప్రాయిక (అభ్యుదయకాల) దానం:** మానవులు తమకి, తమ కుటుంబాలవారికి అభివృద్ధి కలగాలని నిర్వహించే కర్మలనే అభ్యుదయ లేక ప్రాయిక కర్మలు అంటారు. ఇవి శుభకార్యాలు. వివాహం, పుత్రుడికి చేసే ఉపనయనం, భవననిర్మాణ సందర్భంగా చేసే శంకుస్థాపన, ధ్వజప్రతిష్ఠ, దేవాలయ ప్రతిష్ఠ, వాపీ, కూప తటాకాల ప్రతిష్ఠ, ఆరామ ప్రతిష్ఠ, గృహ ప్రవేశకార్యక్రమం ఇవన్నీ దానం చేయటానికి అనువైన పుణ్యకాలాలు.

**5. అంత్యకాల దానం:** మృత్యు సమయం ఆసన్నమైందని తెలిసిన మానవుడు, సుఖంగా యమమార్గంలో ప్రయాణించటానికి దానం చేయాలి. ఆ సమయంలో చేసిన దానం ఆ మానవుడికి శుభమైన ఫలితాలనిస్తుంది.

ఆయా నదుల్లో పుణ్యకాలాలలో స్నానం చేసి, తీర్థవిధులు నిర్వర్తించి దానధర్మాలు ఆచరించాలి. దీనినే తీర్థదానం అంటారు. ఇది అక్షయమైన పుణ్యఫలితాన్ని కలిగిస్తుంది. ఒకవేళ స్నానం చేసే తీర్థం పేరు తెలియకపోతే దాన్ని "విష్ణుతీర్థంగా" పేర్కొనాలి.

భూమండలంలో ప్రవహించే నదులే కాదు మానససరోవరం, పుష్కరసరోవరం లాంటి దివ్యమైన సరస్సులు, వసుధారా, పంచధారా, సహస్రధారావంటి జలపాతాలు, సముద్రాలు, వీటితోపాటు భూమండలం మీద ఉన్న హిమాలయ, వింధ్య, మేరు, సహ్యాద్రి, నీలగిరి లాంటి పర్వతాలు కూడా తీర్థసమానాలే.

యజ్ఞభూమి, యజ్ఞం, అగ్నిహోత్రం, శ్రాద్ధభూమి, దేవాలయం, యాగశాల అలాగే వేదాధ్యయనశాల, గోశాల – ఇవి కూడా ఉత్తమ తీర్థాలే. ఇక సోమయాగం చేసినవాడు ఎక్కడుంటే ఆ ప్రదేశం తీర్థస్థలం అవుతుంది. వీటితోపాటు ఆరామాలు, రావిచెట్టు ఉన్న ప్రదేశం, మేడిచెట్టు, మర్రిచెట్టు ఇంకా పవిత్రమైన వృక్షాలున్న ప్రతి ప్రాంతం తీర్థమే.

తల్లి తండ్రి ఉన్న ప్రదేశం, పురాణాలు శ్రద్ధగా చదివేచోటు, గురువు నివసించే ప్రదేశం, ఉత్తమురాలైన భార్య, ఉత్తముడైన పుత్రుడు, ఉత్తమమైన రాజభవనాలున్న చోటు–ఇవన్నీ పుణ్య తీర్థాలే. ఈ తీర్థాలున్న ప్రదేశాలన్నీ దాన యోగ్యాలే. ఇక్కడ చేసిన దానం కూడా అఖండమైన ఫలితాలనిస్తుంది.

దానాన్ని సరైన వారికే చేయాలి. అంతేకాని అపాత్రదానం అనగా అయోగ్యులైన వారికి చేయకూడదు. బ్రాహ్మణుడై, మంచికులంలో పుట్టి ఉండాలి. అలాంటి ఉత్తమ విప్రుడు, వేదాధ్యయనం చేసినవాడు, ఇంద్రియ నిగ్రహం కలిగినవాడు, త్రికరణశుద్ధి గలవాడు, న్యాయంగా సంపాదించిన ధనాన్నే ఉపయోగించేవాడు, ప్రజ్ఞావంతుడు, జ్ఞానవంతుడు, దైవారాధన చేసేవాడు, సత్యవాక్పరిపాలకుడు, పుణ్య కర్మల్ని ఆచరించేవాడు, శ్రీహరి భక్తుడు, పండితుడు, ధర్మం తెలిసినవాడు, దురాశ లేనివాడు, దుష్టులకి దూరంగా ఉండేవాడు - ఇలాంటి వాడిని ఉత్తముడని, ఉత్తమ పాత్రత కలిగినవాడని అంటారు. కనుక ఇలాంటివారికే దానం చేయాలి.

ఇష్టం–పూర్తం అని దానం రెండువిధాలుగా ఉంటుంది. దానధర్మాల్ని ఆచరించేవాడు అనుకున్నవన్నీ పొందగలడు. దిగుడు బావులు, బావులు, చెరువులు, దేవాలయాలు, అన్నదాన సత్రాలు, ఉద్యానవనాలు వీటిని నిర్మించటం, స్థాపించటం అనే క్రియలకి 'పూర్తం' అని పేరు. ఇవి ముక్తిని ప్రసాదించే దానాలు.

అగ్నిహోత్రం, సత్యభాషణం, స్వాధ్యాయం అతిథి సత్కారం. బలి వైశ్వదేవం వీటికి 'ఇష్ట' అని పేరు. ఇవి ఆచరిస్తే స్వర్గ ప్రాప్తి కలుగుతుంది.

దానం ఇచ్చే దాత తూర్పుముఖంగా నిలబడి దానం ఇవ్వాలి. దానాన్ని గ్రహించేవాడు ఉత్తరం వైపు ముఖం ఉంచి దానం స్వీకరించాలి. ఇలా దానం చేసేవాడి ఆయుర్దాయం వృద్ధి చెందుతుంది. దానం చేసేవాడు తన పేరుని, తీసుకునేవాడి పేరుని చెప్పి దానం ఇవ్వాలి.

1.బంగారం 2.గుర్రాలు 3.నువ్వులు 4. ఏనుగులు 5.దాసీజనం 6.రథాలు 7. భూమి 8.గృహాలు 9.కన్య 10. కపిల గోవులు వీటిని దశ దానాలంటారు. విద్య, పరాక్రమం, తపస్సు, కన్య, యజమాని, శిష్యులు వల్ల లభించింది దానం కాదు. దాన్ని శుల్కం అంటారు.

1.తులాపురుషదానం 2. హిరణ్యగర్భదానం 3. బ్రహ్మాండదానం 4. కల్ప వృక్షదానం 5.సహస్రగోదానం 6. స్వర్ణకామధేను దానం 7. స్వర్ణనిర్మిత ఆశ్వదానం

8. బంగారంతో చేసిన గుర్రాలతో కూడిన రథదానం 9.బంగారంతో చేసిన ఏనుగుదానం 10.హలపంచక (ఐదునాగళ్ళ) దానం 11.భూదానం 12.విశ్వచక్ర దానం 13.కల్పలతాదానం 14. సప్తసముద్ర దానం 15.రత్నాలతో నిర్మించిన ధేనుదానం 16.నీటితో నింపిన పూర్ణ కుంభదానం అనే వాటిని షోడశ మహా దానాలంటారు. ఒక శుభముహూర్తంలో ఒక మండలాకారంలో ఒక మండపాన్ని ఏర్పరిచి అందులో ఇష్టదేవతా పూజచేసి ఈ పదహారురకాల దానాలని యోగ్యుడైన విప్రుడికి ఇవ్వాలి. ఈ దానం అన్నిదానాల కన్నా ఎంతో ప్రశస్తమైనది.

## గోదానమహిమ

పది ఆవులున్నవాడు ఒక ఆవుని, వంద ఆవులున్నవాడు పది ఆవుల్ని, వెయ్యి ఆవులున్నవాడు వంద ఆవుల్ని దానం చేస్తే వచ్చే ఫలితం అందరికీ సమానంగానే ఉంటుంది. సహస్ర (వెయ్యి) గోవుల్ని దానం చేసినవాడు కుబేరుడి రాజధాని అలకాపురికి వెళ్ళి అక్కడ అప్సరసలతో బంగారు భవనాలలో సుఖభోగాలనుభవిస్తాడు. వంద గోవుల్ని దానం చేసిన వాడు నరకం నుంచి విముక్తి పొందుతాడు.

దూడతో సహా గోవుని దానం చేసినవాడు స్వర్గంలో దేవతల చేత పూజించ బడతాడు. గోదానం చేయటం వల్ల దీర్ఘాయువు, ఆరోగ్యం ఐశ్వర్యం లభిస్తుంది. స్వర్గం ప్రాప్తిస్తుంది.

గోదానంలాగానే మహిషీదానం కూడా ఎంతో పవిత్రమనది. మహిషీదానం చేయటం వల్ల సకల సౌభాగ్యాలు లభిస్తాయి. ఈ క్రింది మంత్రాన్ని చదువుతూ మహిషీ దానాన్ని చేయాలి.

**ఇంద్రాదిలోక పాలానాం యా రాజమహిషీ శుభా,**
**మహిషీదాన మాహాత్మ్యా దస్తు మే సర్వకామదా.**

"ఇంద్రాది లోకపాలకులందరికీ మంగళమయమైనది ఈ రాజమహిషీ దేవి. ఈ మహిషీ దానం చేయటం వల్ల నాకు పుణ్యం లభించి, తద్వారా నా మనోభీష్టాలన్నీ నెరవేరుగాక! ఏ మహిషీ పుత్రుడు యమధర్మరాజుకి సహాయకుడుగా నియమించబడ్డాడో, ఏ మహిషి, మహిషాసురుడికి తల్లిగా ఉన్నదో ఆ దేవి నాకు వరాల్ని ప్రసాదించుగాక!" అని చెప్పి మహిషీ దానం చేసినవాడు స్వర్గాన్ని పొందుతాడు.

## అష్టవిధ దానాలు

మానవుడు తన ప్రాణం కోల్పోయే ముందు చేసే దానాలు విశేష ఫలితాన్నిస్తాయనీ, ఆ సమయంలో తిలదానం మొదలైన మహాదానాలు చేయాలనీ శ్రీమన్నారాయణుడు గరుత్మంతుడికి ఈ విధంగా వివరిస్తాడు.

**తిలలోహం హిరణ్యం చ కార్పాసో లవణం తథా,**
**సప్తధాన్యం క్షితిర్గావ ఏకైకం పాపసంస్మృతం.** (గరుడపురాణం)

1. నువ్వులు 2. ఇనుము 3.బంగారం 4.పత్తి 5. ఉప్పు 6.ఏడురకాల ధాన్యాలు (గోధుమలు - కందులు - పెసలు - శనగలు - మినుములు - ఉలవలు-బొబ్బర్లు అనేవి) 7. భూమి 8.ఆవు. వీటిని అష్టదానాలు అంటారు. ఈ ఎనిమిదీ చేస్తే చాలా మంచిది. లేకపోతే వీటిలో ఏ ఒక్కటి చేసినా అది మానవుడికి పుణ్యాన్ని కలిగిస్తుంది.

కరువు కాలంలో అన్నదానం చేసేవాడికి, పంటలు పండి సుభిక్షంగా ఉన్న రోజుల్లో ధనాన్ని దానం చేసేవాడికి, యుద్ధంలో వెన్నుచూపని వాడికి, అప్పు లేనివాడికి నమస్కారం చెయ్యాలి.

మనిషి దానం చేయకపోవటం వల్ల వచ్చే జన్మలో దరిద్రుడుగా జన్మిస్తాడు. తన దారిద్ర్యం వల్ల ఎన్నో పాపాలు చేస్తాడు. ఈ పాపాల ఫలితంగా నరకానికి వెళతాడు. తిరిగి దరిద్రుడిగా పుట్టి మళ్ళీ పాపాలు చేస్తాడు. కనుక ప్రతిమనిషీ తనకున్నంతలో దానాలు చేయాలి.

1. అప్పుల పాలైపోవటం, 2.యాచన చేయటం, 3.ముసలితనం రావటం, 4.జారుడు (వ్యభిచారి) గా మారటం, 5. దొంగతనాలు చేయటం, 6. దరిద్రుడై పోవటం, 7. రోగాల పాలవ్వటం, 8.ఎంగిలికూడు తినడం. వీటిని అష్టకష్టాలు అంటారు. 1.దాసీలు, 2. సేవకులు, 3. పుత్రుడు, 4. బంధువులు, 5.వివిధరకాల వస్తువులు, 6. వాహనాలు, 7. అంతులేని సంపద, 8. ధాన్యసమృద్ధి. వీటన్నిటినీ అష్టభోగాలు అంటారు. దానధర్మాలు విరివిగా చేసేవాళ్ళకి ఈ అష్టభోగాలు లభిస్తాయి. ఇవి చేయనివాళ్ళకి మరుజన్మలో అష్టకష్టాలు ప్రాప్తిస్తాయి.

## 19. పరోపకారం

ఎదుటివారి నుంచి ఏమీ ఆశించకుండా వారికి చేసే ఉపకారమే పరోపకారం. మన కంటికి కనిపించే ప్రకృతి ఈ పరోపకార గుణాన్ని మనకి నేర్పుతోంది.

**శ్లో॥ పరోపకారాయ ఫలంతి వృక్షాః పరోపకారాయ వహంతి నద్యః,**
**పరోపకారాయ దుహంతి గావః పరోపకారార్థ మిదం శరీరమ్.**

పరోపకారం కోసమే వృక్షాలు ఫలాలనిస్తున్నాయి. పరోపకారం కోసమే నదులు ప్రవహిస్తున్నాయి. పరోపకారం కోసమే ఆవులు పాలనిస్తున్నాయి. ఈ శరీరమే పరోపకారం కోసం ఏర్పడింది. కనుక మనిషిగా పుట్టిన ప్రతివాడూ ప్రకృతిని, జంతువులని చూసి తాను కూడా ఇతరులకి సహాయాలు చేస్తూ జీవించాలి.

పరోపకారం చేయటమే పుణ్యం, పరుల్ని పీడించటమే పాపం.

ప్రాణాల్ని విడిచిపెట్టైనా, ధనాన్ని ఖర్చుపెట్టైనా పరోపకారం చేయాలి. దీనివల్ల వందలాది యజ్ఞాలు చేసిన పుణ్యఫలం కన్నా గొప్ప పుణ్యం లభిస్తుంది. మానవుడు తన సుఖాన్ని వదులుకునైనా ఎప్పుడూ పరోపకారం చెయ్యాలి. ప్రజలకి మేలు కలిగించే సత్కార్యాలని ఆచరించాలి. దీనుల్ని, అనాథల్ని, ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా రక్షించాలి. స్వార్థచింతన వదిలేసి, తోటి మనుషులకి, జంతువులకి ఉపకారం చేస్తూ జీవించాలి. అయితే ఈ పరోపకారాన్ని ఏదో మొక్కుబడిగా, పుణ్యం వస్తుందని చేయకూడదు. అలా చేస్తే ఎలాంటి ఫలితమూ వుండదు. పరోపకారాన్ని చాలా సంతోషంగా, మనస్ఫూర్తిగా చేయాలి.

వృక్షాలు ఫలాన్ని అందించే సమయంలో ఎంతో వినయంగా వంగి వుంటాయి. మేఘాలు వానని కురిపించేటప్పుడు క్రిందకి వేలాడుతూ వర్షిస్తాయి. అలాగే సత్పురుషులు కూడా సంపదలు వచ్చినప్పుడు గర్వం లేకుండా వినయంతోనే ఉంటారు. ఇది పరోపకార పరాయణుల స్వభావం. సత్పురుషుల శరీరానికి పరోపకారం చేయటమే అలంకారం గానీ చందనం పూసుకోవటం కాదు.

సూర్యుడు తనని ప్రార్థించకుండానే పద్మాల్ని వికసింపచేస్తున్నాడు. చంద్రుడు కూడా తనని ప్రార్థించకుండానే కలువల్ని వికసింపచేస్తున్నాడు. మేఘం కూడా తనని ఎవరూ యాచించకుండానే వర్షాన్ని కురిపిస్తోంది. ఇలా సత్పురుషులు ఎప్పుడూ పరోపకారం చేయటాన్నే ఇష్టపడతారు.

**ప. ఉపకారికి నుపకారము విపరీతము గాదుసేయ వివరింపంగా,**
**నపకారికి నుపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ.**

లోకంలో తనకి ఉపకారం చేసినవాడికి తిరిగి ప్రత్యుపకారం చేయటం గొప్ప పనికాదు. తనకి అపకారం చేసినవాడికి కూడా ఏమీ ఆశించకుండా, తిరిగి ఉపకారం చేసేవాడే నేర్పరి (గొప్పవాడు).

## 20. సత్సంగం

సత్సంగం అంటే సత్పురుషులతో సన్నిహితంగా ఉండటం. నిత్యం సాధువులతో (సజ్జనులతో) సాంగత్యం చేయటం వల్ల జ్ఞానదృష్టి లభిస్తుంది.

దేవతల్ని, శాస్త్రం తెలిసిన బ్రాహ్మణుల్ని, గురువుల్ని, జ్ఞానుల్ని (పండితుల్ని) పూజించటం, పవిత్రంగా ఋజుత్వంతో (మనసు, మాట, చేత సౌమ్యంగా ఉండటం) ఉండటం, బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించటం, అహింసతో ఉండటం అనేవి శరీరంతో చేసే తపస్సులు (భగవద్గీత).

సత్పురుషులతో సాంగత్యం చేయటం వల్ల మంచిగాథల్ని వినే అవకాశం మానవులకి కలుగుతుంది. వినేవాళ్ళ మనస్సుకి, చెవులకి ఆనందాన్నిచ్చే గాథలు, మంచి మంచి సందేశాల్ని ఇస్తాయి. వీటిని వినటం వల్ల మోక్షం మీద శ్రద్ధ, భక్తి, ప్రేమ ఉదయిస్తాయి (శ్రీమద్భాగవతం).

మనకి స్వతహాగా శాస్త్రం గురించి తెలుసుండాలి. లేకపోతే సత్పురుషులైన పెద్దల నుంచైనా తెలుసుకోవాలి. ఈ రెండూ లేకుండా బృహస్పతి లాంటివారు కూడా ధర్మార్థాల గురించి తెలుసుకోలేరు. సజ్జనులు చాలా గొప్పవారు, వాళ్ళ సాంగత్యం కూడా చాలా గొప్పది. అందుకే సజ్జనులు చేయమన్న పనిని ఆలస్యం లేకుండా వెంటనే ఆచరించాలి. అలా చేసినవాళ్ళకి అంతులేని కీర్తిప్రతిష్ఠలు వస్తాయి. సజ్జనుల అనుగ్రహం ఎప్పుడూ సుఖాన్నే ఇస్తుంది (విదురనీతి).

**సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం,**
**నిర్మోహత్వే నిశ్చల తత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః.** (భజగోవిందం)

సత్పురుషులు ఎప్పుడూ రాగద్వేష రహితులుగా, సమదృష్టితో, ఇంద్రియ నిగ్రహపరులై వుంటారు. మోక్షాపేక్షులై జీవిస్తారు. మనం ఇలాంటి మహాపురుషులతో సమావేశమైతే, వైరాగ్యం ఏర్పడుతుంది. మోహం తొలగిపోతుంది. వెంటనే నిశ్చలమైన భగవత్తత్త్వం అవగతమవుతుంది. ఈ నిశ్చలతత్త్వం స్థిరంగా ఉంటే మనకి జీవన్ముక్తి కలుగుతుంది.

సత్పురుషులు ఎంతో గొప్పవాళ్ళు. వాళ్ళతో సాంగత్యం దొరకటం చాలా కష్టం. ఒకవేళ దొరికితే అది అమోఘమే అవుతుంది. అదికూడా వాళ్ళ అనుగ్రహం మన మీద ఉంటేనే. కనుక బాగా ప్రయత్నంచేసి సత్పురుషుల్ని సేవించి, వారి అనుభవాన్ని అనుగ్రహాన్ని పొందాలి (నారదమహర్షి తన భక్తిసూత్రాలు).

**చందనం శీతలం లోకే చందనాదపి చంద్రమాః,**
**చంద్రచందన యోర్మధ్యే శీతలా సాధుసంగతిః.**

చందనం చల్లగా వుంటుంది. చంద్రుడు అందించే వెన్నెల ఇంకా చల్లగా ఉంటుంది. అయితే గొప్పవారు, పండితులు, సజ్జనులు అయిన మహాత్ముల సాంగత్యం ఈ రెండింటి కన్నా ఎక్కువ చల్లదనాన్ని అందిస్తుంది.

## 21. సమ (దర్శనం) దృష్టి

ఈ సృష్టిలో ఉన్న సకల భూతాలనూ తన ఆత్మలో, అలాగే సకల భూతాలలో తన ఆత్మని దర్శించేవాడికి, ఈ లోకంలో ఏ వస్తువూ ఏ జీవీ అసహ్యాన్ని కలిగించదు. దేన్నీ అతడు నిందించడు. సర్వభూతాలలో, తనలో ఉన్నది ఆ పరమాత్మేనని, తాను ఆ పరమాత్మ ఒకటేనని అందరినీ ఒకటిగా సమభావంతో చూడటంవల్ల 'శోకం, మోహం' అనేవి మానవుడికి కలగవు.

అందరి మీద సమదృష్టితో ఉన్నవాడికి బాహ్యామైన సకల సంపదలు, మంచిగుణాలు కలుగుతాయి. సమత్వం అనే తీగ సకలభూతాలతో (ప్రాణులతో) మైత్రి (స్నేహం) అనే ఫలాన్ని ప్రసాదిస్తుంది. సమదర్శనం అనే సుగుణం వల్ల, సకల ప్రాణులకీ మేలుచేయాలనే కోరిక కలుగుతుంది. ఈ విధంగా సమదృష్టితో అందరినీ ఆదరించినవాడికి, 'సకల జగత్తు అనే లక్ష్మీదేవి' దాస్యం చేస్తుంది. ఈ సమదృష్టి వల్ల కలిగే సుఖం, ఆనందం, గొప్ప రాజ్యాన్ని పొందినా లభించవు (యోగవాశిష్ఠం).

జ్ఞానులైన వాళ్ళు **'విద్య, వినయం'** అనే సంపదలతో ఉన్న బ్రాహ్మణుడి మీద, ఆవు, కుక్క, ఏనుగులాంటి జంతువుల మీద సమానదృష్టినే కలిగి ఉంటారు. మంచి మనసున్న వాళ్ళమీద, మిత్రులమీద, శత్రువులమీద, ఉదాసీనంగా ఉన్న వాళ్ళమీద, మధ్యస్థంగా ఉన్నవాళ్ళ మీద, ద్వేషించతగిన వాళ్ళమీద, బంధువులమీద, ధర్మాత్ములమీద, పాపాత్ముల మీద సమదృష్టి (బుద్ధి) కలిగి ఉన్నవాడే శ్రేష్ఠుడు. లోకంలో సకల ప్రాణుల్నీ

తనతో సమానంగా చూసేవాడు, సుఖదుఃఖాలనీ సమానంగా భావించేవాడు నిజమైన యోగి. అలాంటి యోగే చాలా గొప్పవాడు (భగవద్గీత).

## 22. స్థిత ప్రజ్ఞ

సంఘంలో జీవించే ప్రతి మానవుడూ కష్టాలకి చలించకుండా స్థితప్రజ్ఞుడిగా ఉండాలి. జీవితతత్త్వం తెలుసుకుంటే ప్రతి ఒక్కరూ స్థితప్రజ్ఞులు కావచ్చు.

మనస్సులో ఉన్న కోరికలన్నిటినీ వదిలిపెట్టి, ఆత్మ ద్వారా, ఆత్మలో ఆనందాన్ని పొందుతూ పరమాత్మతో సంయోగం చెంది, ఆత్మానందాన్ని అనుభవించేవాడే స్థితప్రజ్ఞుడు. కష్టాలు వస్తే క్రుంగిపోనివాడు, సుఖాలు వస్తే పొంగిపోనివాడు, భయాన్ని క్రోధాన్ని విడిచి పెట్టినవాడు, మునితో సమానుడు. ఇలాంటి మునినే స్థితప్రజ్ఞుడు అంటారు.

మనిషి ప్రతి వస్తువుమీదా విశేషమైన మమకారాన్ని పెంచుకోకూడదు. అది వస్తువులమీదే కాదు. మనుషులు (భార్య, బిడ్డలు, బంధువులు, స్నేహితులు) మీదకూడా అతిగా మమకారాన్ని పెంచుకుంటే చివరికి తాను మమకారం పెంచుకున్నవాళ్ళు దూరమైతే తీవ్రమైన వేదన అనుభవించాల్సి వస్తుంది.

కోరికల్ని వీలైనంతగా తగ్గించుకుని ఆ పరమాత్మ మీద దృష్టిని పెట్టాలి. ముఖ్యంగా దేనికీ భయపడకూడదు. కోపంలాంటి దుర్గుణాల్ని వెంటనే విడిచిపెట్టాలి.

## 23. సంతోషం (ఆనందం)

లోకంలో ప్రతి ఒక్కరూ తాత్కాలిక సుఖాన్నిచ్చే ఆనందాన్నే కోరుకుంటారు. వీళ్ళకి నిజమైన ఆనందమంటే ఏమిటో తెలియదు. అన్ని ఆనందాలకన్నా గొప్ప ఆనందం ఒకటున్నదని, అదే బ్రహ్మానందమని, ఈ ఆనందమే పొందతగినదని ఉపనిషత్తులు ఇలా చెబుతున్నాయి.

1. యౌవనం, 2.సాధుగుణం, 3.వేదాధ్యయనం, 4.పరిజనం, 5. శారీరక, మానసిక దృఢత్వం, 6.ధైర్యం, 7.బలం, 8.భూమండలాన్ని పాలించ గలిగినంత శక్తి, 9. కావలసినంత ధనం. ఇవన్నీ కలిగిన ఒక మనిషి పొందే ఆనందాన్ని **'ఒక మనుష్యానందం'** అంటారు. ఇదే ఆనందం వేదార్థం తెలిసిన పండితుడు, కామక్రోధరహితుడు అయిన బ్రహ్మజ్ఞానికి కూడా కలుగుతుంది.

ఈ ఒక మనుష్యానందం కన్నా వందరెట్లు అధికమైంది **'మనుష్య గంధర్వానందం'.** దీనికన్నా వందరెట్లు అధికమైంది **'దేవ గంధర్వానందం'.** దీనికన్నా వందరెట్లు అధికమైనది **పితృదేవతల ఆనందం.** ఈ పితృదేవతల ఆనందంకన్నా వందరెట్లు అధికమైంది **అజానజదేవతల ఆనందం.**

ఈ అజానజన దేవతల ఆనందంకన్నా **కర్మదేవతల ఆనందం,** దానికన్నా **దేవానందం,** దానికన్నా **ఇంద్రానందం,** దానికన్నా **బృహస్పతి ఆనందం,** దానికన్నా **ప్రజాపతి ఆనందం,** దానికన్నా **బ్రహ్మానందం** వందరెట్లు చొప్పున ఒకదానికన్నా ఒకటి గొప్పవి.

'బ్రహ్మానందం' మానవుల హృదయంలో ఉంటుంది. మానవుడిలో ఉన్న ఈ ఆనందరూపమైన బ్రహ్మం, సూర్యుడిలో ఉన్న బ్రహ్మం రెండూ ఒక్కటే. అందుకే **'ఆనందో బ్రహ్మ'** అని అంటారు.

మనిషి ఎప్పుడూ సంతోషంగా ఆనందంగా ఉండాలంటే తన మనసులోకి శోకాన్ని, విషాదాన్ని రానీకూడదు. ఈ విషయాన్నే శ్రీమద్రామాయణం ఇలా చెబుతుంది.

**శోకో నాశయతే ధైర్యం శోకో నాశయతే శ్రుతమ్,**
**శోకో నాశయతే సర్వం నాస్తి శోక సమో రిపుః.** (రామా. అయోధ్య-62,15)

శోకం వల్ల మనిషిలో ధైర్యం సన్నగిల్లిపోతుంది. నేర్చుకున్న విద్య నశించిపోతుంది. శోకం వల్ల అన్నీ చెడిపోతాయి. దీన్ని మించిన శత్రువు మనిషికి మరొకటిలేదు.

సంతోషం అనేది మనిషికి శ్రేయస్సుని కలిగిస్తుంది. ఈ సంతోషాన్నే సుఖం అనికూడా అంటారు. ఈ సంతోషం అనే గుణంతో నిండినవాడు ఆనందాన్ని కలిగించే పరమసుఖాన్ని పొందుతాడు. సంతోషం అనే అమృతాన్ని సేవించి తృప్తిపడిన మనిషికి, అనంతమైన భోగాలు, సంపదలు విషంలాగా అనిపిస్తాయి. అసలు నిజమైన సంతోషం అంటే ఏమిటంటే - కోరుకున్న వస్తువు లభించినప్పుడు కలిగే ఆనందం, అది లభించనప్పుడు కలిగే బాధ, ఈ రెండూ లేకుండా సమభావంతో ఉండటం. ఇలా ఉన్నవాడే సంతుష్టుడు.

మానవుడికి సంతోషాన్ని మించింది మరేదీలేదు. ఎవడు కోపాన్ని హర్షాన్ని (ఆనందాన్ని) జయిస్తాడో అలాంటివాడి హృదయంలోనే వైరాగ్య రూపమైన సంతోషం కలుగుతుంది. ఇలాంటివాడికే ఉత్తమగతి ప్రాప్తిస్తుందని మహాభారతం చెబుతుంది.

ప్రశాంతమైన మనస్సుతో ఉన్నవాడు, పుణ్యాత్ముడు, ప్రపంచ విషయాల మీద ఆసక్తి లేనివాడు, సచ్చిదానంద పరబ్రహ్మతో ఏకీభావ స్థితిని పొందినవాడు అయిన యోగి బ్రహ్మానందాన్ని పొందుతాడు.

నేటికాలంలో మనిషి సుఖాల కోసం చింతిస్తూ చింతిస్తూ తన సంతోషాన్ని కోల్పోతున్నాడు. అందుకే మన ధర్మశాస్త్ర గ్రంథాలు వర్ణాశ్రమ ధర్మాల్ని విధించాయి. వీటిని సక్రమంగా పాటిస్తే, ప్రతి ఒక్కరూ సంతోషంగా తమ జీవితాల్ని గడిపి మోక్షం పొందవచ్చు.

## 24. జీవన్ముక్తుడు

సంతోషం, అసహనం, భయం, క్రోధం, కామం, లోభం లాంటి గుణాల వల్ల ఎలాంటి వికారాలూ పొందనివాడు, ఇష్టం-అనిష్టం భావాలు లేనివాడు, దేనికీ చలించకుండా ఉండేవాడు, ఎలాంటి భేదం లేకుండా అన్ని రుచుల్నీ ఒకేలా భావిస్తూ భుజించేవాడు, లౌకిక విషయాలను పట్టించుకున్నప్పటికీ, ఆ విషయాల ఫలితాల మీద ఎలాంటి ప్రత్యేక దృష్టి లేకుండా నిర్వికారంగా ఉండేవాడు జీవన్ముక్తుడని మహోపనిషత్తు చెబుతుంది.

తన నిత్యకృత్యాల్ని సక్రమంగా నిర్వహిస్తున్నప్పటికీ, ఈ సమస్త ప్రపంచాన్ని, బంధుమిత్రుల్ని ఆకాశంలాగా శూన్యంగా (అనగా వైరాగ్యభావంతో) చూసేవాడు జీవన్ముక్తుడు. లోకంలో ఎవడి ముఖం సంతోషం కలిగినప్పుడు వికసించదో, దుఃఖం కలిగినప్పుడు వాడిపోదో మంచి-చెడూ రెండు సందర్భాలనీ ఒకేలా ఎవడు భావిస్తాడో అన్ని సమయాలలో ఒకేరకమైన మానసిక స్థితిని కలిగి ఉంటాడో అలాంటివాడు జీవన్ముక్తుడు.

ఎవడు కర్మలు చేస్తున్నప్పటికీ, చేయనప్పటికీ కర్తవ్యాన్నిగానీ, అకర్తవ్యాన్నిగానీ తన మనసుకి అంటకుండా సంచరిస్తూ ఉంటాడో తన ఇంద్రియ వ్యాపారాలకు కేవలం సాక్షీభూతుడుగా ఉంటాడో ఎలాంటి అహంకారాన్ని ప్రదర్శించడో అలాంటివాడే జీవన్ముక్తుడు.

ఎవడు ఈ ప్రపంచంలో సంసారిగా ఉంటూ దైనందిన కార్యకలాపాలని ఆచరిస్తూ, దేనిమీదా ప్రత్యేకమైన ఆసక్తిని పొందకుండా, ప్రశాంత తరంగంలా నిశ్చితంగా ఉంటాడో అలాంటివాడే జీవన్ముక్తుడు.

జీవన్ముక్తుడిగా ఉన్న మానవుడు కాలం తీరాక విదేహముక్తుడు అనగా శరీరంలేని స్థితిలో మోక్షాన్ని పొందుతాడు. కదలికలేని నిశ్చలమైన వాయుస్థితిలో ఉంటాడు. అతడికి నామరూపాలు ఉండవు. అతడు శూన్యంగా ఉండడు. అలాగని ఆకారంతోనూ ఉండడు. కంటికి కనిపించేవాడూ, కనిపించకుండా ఉండేవాడూ కాడు. పంచభూత పదార్థం అసలే కాదు. కేవలం అతడు సత్ (పరబ్రహ్మ) స్వరూపుడుగా మారిపోతాడు.

కర్మల్ని ఆచరిస్తున్నా, ఆచరించకపోయినా, నేను కర్తను అనే భావంకానీ, తాను చేసిన కర్మఫలం మీద కోరికగానీ లేని వాడిని జీవన్ముక్తుడు అంటారు.

✦ ✦ ✦

# సంస్కారాలు

మానవుడు శుక్ర శోణితాల కలయికతో శరీరాన్ని పొందుతాడు. స్త్రీ పురుష సంగమం వల్ల పుట్టిన జీవికి ఒకానొక పాపం అనేది సంక్రమిస్తుంది. ఆ పాపాన్ని పోగొట్టి ఆ జీవి శరీరాన్ని పవిత్రం చేయటం కోసం, పవిత్ర కార్యాలలో వినియోగించటం కోసం మన మహర్షులు పదహారు సంస్కారాలని నిర్దేశించారు. వీటినే షోడశ సంస్కారాలు అంటారు.

అవి 1.గర్భాదానం. 2. పుంసవనం. 3. సీమంతం, 4.జాతకర్మ, 5.నిష్క్రమణం. 7. అన్నప్రాశన, 8.కర్ణవేధ, 9. చూడాకరణం, 10. అక్షరాభ్యాసం, 11. ఉపనయనం 12.కేశాంతం, 13. ఉపాకర్మ, 14. స్నాతకం, 15. వివాహం, 16. అంత్యేష్టి.

**గర్భాదానం: "గర్భః సంధార్యతే యేన కర్మణా తద్గర్భాదానం మిత్యనుగతార్థం కర్మ నామధేయం"** (పూర్వ మీమాంస). స్త్రీ తన భర్త ద్వారా వీర్యాన్ని ధరించడాన్ని గర్భధారణ లేక గర్భావలంబనం అంటారు. సత్సంతానం కలగటం కోసం ఈ పవిత్ర సంస్కారాన్ని చేస్తారు.

**పుంసవనం:** స్త్రీ గర్భం ధరించిన తరువాత గర్భంలో ఉన్న శిశువు కోసం ఈ సంస్కారాన్ని చేస్తారు. **"పుమాన్ ప్రసూయతే యేనకర్మణా తత్ పుంసవన మీరితమ్"** పుత్రప్రాప్తి కోసం చేసే సంస్కారాన్నే పుంసవనం అంటారు.

**సీమంతం:** స్త్రీ గర్భానికి చేసే మూడో సంస్కారాన్నే సీమంతం లేదా సీమంతోన్నయనం అంటారు. **"సీమంత ఉన్నయతే యస్మిన్ కర్మణి తత్ సీమంతోన్నయనమితి కర్మ నామధేయమ్"** (వీరమిత్రోదయం). **"సీమతః కథ్యతే స్త్రీణాం కేశ మధ్యేతు పద్ధతిః"** గర్భిణి కేశాలని ఎత్తి కట్టటం, లేక తలమీద చక్కగా పాపటిని ఏర్పర్చటం. తల్లికి ఐశ్వర్యాన్ని, ఆనందాన్ని కలిగించటం కోసం, లోపలున్న శిశువుకి దీర్ఘాయువు లభించటం కోసం ఈ సంస్కారాన్ని నిర్వహిస్తారు. ఈ సీమంతం జరిగినప్పటి నుంచీ భార్య కోరిన కోరికలన్నీ భర్త విధిగా తీర్చాలి. ఆమెతో ఎంతో ప్రేమగా మసలుకోవాలి. ఆమె ఎప్పుడూ సంతోషంగా ఉండేలా చూసుకోవాలి.

**జాతకర్మ:** స్త్రీ గర్భం నుంచి పుత్రుడు జన్మించాక జరిపే సంస్కారం ఇది. గర్భం నుంచి బయటికివచ్చిన శిశువు బొడ్డుత్రాడు కోయకముందూ తరువాత ఈ సంస్కారాన్ని జరిపిస్తారు. మేధకోసం, బలం కోసం, నెయ్యి, తేనెల్ని ఒక సన్నటి బంగారుపుల్లతో శిశువు నోటికి అందిస్తారు. పిల్లవాడు జన్మించిన తరువాత బొడ్డుత్రాడు కోశాక, నెయ్యిని నోట్లో వేయాలి. తరువాత తల్లి ఆ పిల్లవాడికి స్తన్యాన్ని (పాలని) ఇవ్వాలి అని బృహదారణ్యకోపనిషత్తు చెబుతుంది. బ్రాహ్మణవర్ణం వారు శాస్త్రాలలో చెప్పిన విధంగా వైశ్వానరేష్టి, శోష్యంతీ హోమం లాంటివి కూడా నిర్వహిస్తారు.

**నిష్క్రమణం:** నిష్క్రమణం అంటే పుట్టిన శిశువుని విధివిధానంగా బయటకి తీసుకురావటం. ఈ సంస్కారాన్ని శిశువు జన్మించిన పన్నెండోరోజు నుంచి నాలుగో నెలలోపు చేయవచ్చు. కొంతమంది పండితులు మూడోనెలలో శిశువుకి సూర్యదర్శనాన్ని, నాలుగోనెలలో చంద్రదర్శనాన్ని చేయించాలని చెబుతారు. ఈ సంస్కారాన్ని తల్లిదండ్రులు లేక మేనమామ చేయించవచ్చు.

## నామకరణం

**ఆయుర్వచోభిః వృద్ధిశ్చ సిద్ధిర్వ్యవహృతే స్తథా,**
**నామకర్మ ఫలం తే తత్ సముద్దిష్టం మనీషిభిః.**

పుట్టిన బిడ్డకి ఆయుష్షు, వర్చస్సు, వ్యవహారసిద్ధి కలగటం కోసం ఈ నామకరణ సంస్కారాన్ని జరిపిస్తారు. **"తస్మాత్పుత్రస్య నామకుర్యాత్ పాప్మానమేవాప్య తదపహన్తి"** పుత్రుడు జన్మించిన తరువాత తండ్రి తన పుత్రుడికి నామకరణం చేస్తే, ఆ పుత్రుణ్ణి ఆవహించిన పాపాలన్నీ తొలగిపోతాయని శతపథ బ్రాహ్మణం చెబుతుంది. పారాశర్య గృహ్యసూత్రాన్ని అనుసరించి పిల్లవాడి పేరు రెండు లేక నాలుగు అక్షరాలతో ఉండాలి. ఆడపిల్లల పేర్లు మనోహరంగా మంగళకరమైనవిగా ఉండాలి.

**అన్నప్రాశన:** శిశువుకి మొదటిసారిగా ఘనాహారాన్ని తినిపించటమే అన్నప్రాశన. **"షణ్మాసశ్చైవ మన్నం ప్రాశయే లఘు హితశ్చ"** శిశువు జన్మించిన ఆరోనెలలో ఆ పిల్లవాడికి తల్లిపాలు మాన్పించి ఘనాహారాన్ని (అన్నాన్ని) తినిపించాలి అని సుశ్రుతుడు శరీర స్థానగ్రంథంలో చెబుతాడు. సాధారణంగా నేయితో కలిపిన అన్నాన్నిగానీ, పెరుగు, తేనె, నేయితో కూడిన అన్నాన్నిగాన్నీ, తెనె, నెయ్యి కలిపిన పాయసాన్ని గానీ శిశువుకి తినిపించాలి.

**కర్ణవేధ:** శిశువుకి చెవులు కుట్టించటం. పుట్టిన పిల్లవాడికి మూడు లేక అయిదు సంవత్సరాలలో ఈ సంస్కారాన్ని చెయ్యాలి. కర్ణవేధ పూర్తయిన తరువాత ఆ చెవులకి బంగారం లేదా వెండితో ఆభరణాల్ని చేయించి ధరింపచేయాలి.

**చూడాకరణం:** పుట్టు వెంట్రుకల్ని కత్తిరించటం. చూడ అంటే 'శిఖ' (పిలక) దీన్ని ఉంచి మిగిలిన వెంట్రుకలన్నీ వపనం చేయటం. దీన్నే చూడాకరణం అంటారు. **"బలాయుర్వర్చో వృద్ధిశ్చ చూడాకర్మ ఫలం స్మృతం"** శిశువుకి బలం, ఆయుష్షు, తేజస్సు, వృద్ధి చెందటం కోసం ఈ చూడాకర్మ సంస్కారాన్ని నిర్వహించాలి. ఈ సంస్కారాన్ని పిల్లవాడు పుట్టిన మొదటి, రెండు, మూడు సంవత్సరాలలోపు చేయాలని కొన్ని స్మృతులు చెబుతుంటే ఐదు లేక ఏడో సంవత్సరంలో చేయవచ్చని మరికొన్ని ధర్మశాస్త్ర గ్రంథాలు చెబుతున్నాయి.

**అక్షరాభ్యాసం:** దీన్నే విద్యారంభం, అక్షరారంభం, అక్షరలేఖనం అనికూడా అంటారు. ఈ సంస్కారాన్ని అయిదో సంవత్సరంలోగానీ, ఆరో సంవత్సరంలోగానీ చేస్తారు. మార్గశిర, జ్యేష్ఠమాసాలు దీనికి శ్రేష్ఠమైనవని వీరమిత్రోదయ ధర్మగ్రంథం చెబుతుంది. కొంతమంది పండితులు, చూడాకర్మ అయిన వెంటనే ఈ సంస్కారం చేయాలని చెబుతారు.

**ఉపనయనం:** బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలవారికి ఇది ముఖ్యమైన సంస్కారం. ముఖ్యంగా వేదాధ్యయనం చేసే బ్రాహ్మణులకి ఈ సంస్కారం చాలా ఆవశ్యకమైంది. పుట్టుకతో అందరూ శూద్రులే. ఉపనయన కర్మతోనే బ్రాహ్మణులకి ద్విజత్వం (వేదాధ్యయనాధికారం) వస్తుందని స్మృతులు చెబుతాయి. పరమ పవిత్రమైన గాయత్రీ మంత్రాన్ని తండ్రి గురువుగా మారి, తన బిడ్డకి బ్రహ్మోపదేశం చేయటం ఈ సంస్కారంలో ప్రత్యేకత.

ఉపనయనం జరిగిన నాటినుంచీ పిల్లవాడు సంధ్యావందన క్రియ ఆచరించటానికి, గురుకులంలో చేరి వేదవిద్యని అభ్యసించటానికి అర్హుడవుతాడు. బ్రాహ్మణుడికి 8 సంవత్సరాలు, క్షత్రియుడికి 11 సంవత్సరాలు, వైశ్యుడికి 12 సంవత్సరాలలోపు ఈ సంస్కారాన్ని నిర్వహించాలి. ఈ క్రియలో యజ్ఞోపవీత ధారణ జరుగుతుంది. ఇది పరమ పవిత్రమైనది. దైవకర్మలు, పితృకర్మలకి ఇది ఆధారం.

**కేశాంతం:** బ్రహ్మచారిగా ఉన్న బాలకుడికి యుక్తవయస్సు వచ్చాక మొదటిసారిగా మంగలి చేత గడ్డం, మీసాలు తీయించటం కేశాంతం అని అంటారు. ఈ కేశాంత సంస్కారాన్ని బ్రాహ్మణులకి 16వ ఏట, క్షత్రియులకి 22వ ఏట, వైశ్యులకి 24వ ఏటా జరిపించాలని మనుస్మృతి చెబుతుంది.

ఈ సందర్భంగా గురువుల వద్ద విద్యాభ్యాసం చేస్తున్నవారు కేశాంత సంస్కారం పూర్తయిన తరువాత గురువుగారికి గోదానం చేస్తారు. అందుకే ఈ సంస్కారాన్ని 'గోదానం' అని కొన్ని స్మృతులు పేర్కొంటున్నాయి. అయితే ప్రస్తుతకాలంలో ఈ సంస్కారాన్ని ఎవరూ మంత్రపూర్వకంగా ఎక్కువశాతం ఆచరించటం లేదు.

**వేదవతం లేక ఉపాకర్మ:** బ్రాహ్మణుల్లో ఎవరి శాఖకు చెందిన వేదాన్ని వాళ్ళు గురుముఖతః అధ్యయనం చేయటమే వేదవతమని అంటారు.

స్వశాఖకు చెందిన వేదాన్ని అభ్యసించిన వాళ్ళు ఎప్పటికీ పతితులవ్వరని వసిష్ఠస్మృతి చెబుతుంది. వేదాధ్యయనం చేయిదలుచుకున్న విద్యార్థి గురువుగారి ఆశ్రమానికి (ఇంటికి) వెళ్ళి, అక్కడ ఆయన ఆదేశంతో కొన్ని హోమాలుచేసి, తరువాత దక్షిణ తాంబూలాలు సమర్పించి, వేదాధ్యయనం ప్రారంభించాలి. ఈ వేదాధ్యయనానికే ఉపాకర్మ అని పేరు. ఉపాకర్మ అంటే ఆరంభం అని అర్థం. ఉపనయనం పూర్తయిన తరువాత, ఒక శుభదినంలో ఈ ఉపాకర్మలో భాగంగా కొన్ని సంస్కారాలు చేసి, వేదాధ్యయనాన్ని ప్రారంభిస్తారు.

**స్నాతకం:** దీన్నే సమావర్తనం అనికూడా అంటారు. బ్రహ్మచర్యవ్రతం పూర్తయిన తరువాత ఈ సంస్కారాన్ని చేస్తారు. ఇది ఒక రకంగా విద్యార్థి జీవితానికి ముగింపుని సూచిస్తుంది. **"తత్ర సమావర్తనం నామ వేదాధ్యయనానంతరం గురుకులాత్ స్వగృహాగమనం"** (వీరమిత్రోదయ ధర్మశాస్త్రం) అంటే ఆశ్రమంలో (గురుకులంలో) వేదవిద్య పూర్తి చేసుకున్నాక శిష్యుడు తిరిగి తన స్వగృహానికి చేరుకోవటం. వేదవిద్యార్థి తన గురువుకి యథాశక్తి గురుదక్షిణ సమర్పించి, ఆ తరువాత ఆయన అనుమతితో వివాహ సంస్కారాన్ని ఆచరించాలి, దానికి ముందుగా కొన్ని ప్రాయశ్చిత్త హోమాలుచేసి, ఈ స్నాతకవ్రతాన్ని పూర్తిచేయాలి.

**వివాహం:** షోడశ సంస్కారాలలో ఇది అత్యంత ప్రధానమైనది. మానవుడు బ్రహ్మచర్యాశ్రమాన్ని ముగించుకుని, తగిన విద్యని సంపాదించి, గృహస్థాశ్రమంలోకి

ప్రవేశించే ఉత్తమ సంస్కారం వివాహం. మూడు ఋణాలలో ఒకటైన పితృఋణం తీర్చుకోవటానికి (వంశాభివృద్ధి కోసం) వివాహం చేసుకోవాలి. తన నక్షత్రానికి, రాశికి అనుకూలమైన స్త్రీని, తన గోత్రంకాని స్త్రీని, శుభలక్షణాలు ఉన్న స్త్రీని పెళ్ళి చేసుకోవాలి. వర్ణాంతర వివాహాలు పనికిరావని స్మృతి గ్రంథాలు చెబుతున్నాయి. కనుక ఎవరికి వాళ్ళు తమ వర్ణాలకు చెందిన కన్యలతోనే ఈ వివాహ సంస్కారం జరిపించుకోవటం ఉత్తమం.

**అంత్యేష్టి:** మానవుడు మరణించిన తరువాత అతడికి ఉత్తమగతులు కలగటం కోసం పుత్రులు చేసే సంస్కారాన్ని అంత్యేష్ఠి అంటారు. నాలుగు వర్ణాలవారూ తమకి విధించిన ధర్మం ప్రకారం మరణించిన జీవికి అగ్ని సంస్కారం, కర్మకాండలు, మాసిక శ్రాద్ధాలు శాస్త్రోక్తంగా నిర్వహించాలి. ఇవి ఎందుకు చేయాలి అంటే **"జాత సంస్కారేణ ఇమంలోకమభిజయతి । మృత సంస్కారేణ అయంలోకమ్"** మనిషి పుట్టిన తరువాత చేసే జాతకర్మ సంస్కారం వల్ల ఇహలోకాన్ని, మరణించాక చేసే అంత్యేష్టి సంస్కారం వల్ల పరలోకాన్ని జయిస్తున్నాడని బోధాయన పితృసూత్రాలు చెబుతున్నాయి. మరణించిన తమ వారికి ఉత్తమగతులు కలగటం కోసం ప్రతిఒక్కరూ అంత్యేష్టి సంస్కారాన్ని విధిగా నిర్వహించాలి. ఈ సంస్కారాలన్నింటినీ మొదటి మూడు వర్ణాల వారికీ సమంత్రకంగా నాలుగో వర్ణం వారికి మంత్రరహితంగా నిర్వహించవచ్చు. ఈ పదహారు సంస్కారాలేకాక మొత్తం 40 వరకూ సంస్కారాలు ఉన్నాయని ధర్మశాస్త్ర గ్రంథాలు చెప్తున్నాయి

✦ ✦ ✦

# ఆత్మగుణాలు

ఎన్ని సంస్కారాలు చేసినా ఆత్మగుణాలు లేకపోతే అలాంటివాడికి బ్రహ్మ సాయుజ్యంగానీ, బ్రహ్మ సాలోక్యంగానీ లభించవు. ఆ ఎనిమిదిరకాల ఆత్మగుణాలు ఇవే!

**దయ:** త్రికరణ శుద్ధిగా సకలజీవుల మీదా ప్రేమని లేదా కరుణని కలిగి ఉండటాన్నే 'దయ' అంటారు.

**పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ,**

**కార్యం కరుణమార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి.** (రామా. యుద్ధ. 116-45)

"పాత్ముడైనా, పుణ్యాత్ముడైనా, చంపతగ్గ దుర్మార్గుడైనా ఇలాంటి వాళ్ళందరి మీద దయని కలిగి ఉండాలి. ఎందుకంటే లోకంలో అపరాధాలు (తప్పులు) చేయని మనుషులే ఉండరు" అని సీతాదేవి హనుమంతుడికి 'దయ' గొప్పతనం గురించి ప్రబోధించింది.

"సాధకుడు తనకు ఏది లభిస్తే దానితో సంతృప్తి చెందాలి. మితంగా ఆహారం తీసుకోవాలి. ఏకాంతంలో ఆత్మవిచారం చేసుకుంటూ నివసించాలి. రాగద్వేషాల్ని వదిలిపెట్టి అందరితో స్నేహాన్ని పాటిస్తూ, అందరి మీద దయని చూపిస్తూ ధైర్యంతో ఉండాలి" (భాగవతం).

"మనిషికి బంగారు ఆభరణాలు భూషణాలు కావు. 'దయ' అనే సుగుణమే నిజమైన ఆభరణం. దయ లేనివాడు అసలు మానవుడే కాదు" అని నీతిశాస్త్ర గ్రంథాలు చెప్తున్నాయి.

సృష్టిలో వున్న అన్ని జీవులమీదా మృదుత్వం (జాలి లేదా దయ) కలిగి వుండటం, అసూయ లేకపోవటం, సహనం, ధైర్యంతో ఉండటం, స్నేహితుణ్ణి అవమానించకపోవటం ఈ అయిదు రకాల సుగుణాలూ మనిషి ఆయువుని వృద్ధి చేస్తాయి (విదురనీతి).

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కడికీ తన ప్రాణం కన్నా గొప్పదైన వస్తువు మరొకటి ఉండదు. కాబట్టి మనిషి తనమీద తాను దయ కలిగి ఉన్నట్టుగా ఇతర జీవులమీద కూడా అంతే దయని కలిగి వుండాలి.

లోకంలో దయకు మించిన ధర్మమే లేదు. కనుక ప్రతి మానవుడూ దయని కలిగి ఉండాలి. అలాంటి సద్గుణవంతుణ్ణి కలిపురుషుడు కూడా ఏమీ చేయలేడు.

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ,**
**నిర్మమో నిరహంకారః సమ దుఖః సుఖః క్షమీ.** (భగవద్గీత. 12-13)

సృష్టిలో వున్న ఏ ప్రాణి మీదా ద్వేషభావం లేనివాడు, సకల ప్రాణులమీద కరుణ (దయని) కలిగినవాడు, మమత, అహంకారాలు లేనివాడు సుఖం వచ్చినా, కష్టం వచ్చినా సమానంగా భావించేవాడు నాకు ఎంతో ఇష్టుడు అని గీతలో కృష్ణపరమాత్మ 'దయ' గొప్పతనం గురించి అర్జునుడికి ప్రబోధిస్తాడు.

**క్షమ:** వేడివల్ల, చలివల్ల కలిగే దుఃఖాలని, కళ్ళతో చూడటం, చెవులతో వినటం, లాంటి వాటిద్వారా కలిగే దుఃఖాలని, ఆధ్యాత్మికాల (అంటే సింహం, పులిలాంటి క్రూరజంతువుల) ద్వారా కలిగే దుఃఖాలని, ఆధిభౌతికాలు అంటే (వానలు, వరదలు, భూకంపాలలాంటి) ప్రకృతి వైపరీత్యాల ద్వారా కలిగే దుఃఖాలని, ఆధిదైవికాలు అంటే ప్రారబ్ధకర్మ దోషాలవల్ల కలిగే దుఃఖాలు వీటిని, ఎలాంటి బాధా లేకుండా సహించి ఉండటాన్నే 'తితిక్షా' అంటారు. సుఖం వచ్చినప్పుడు పొంగిపోకుండా, దుఃఖం వచ్చినప్పుడు క్రుంగిపోకుండా వుండటమే తితిక్ష.

మానవుడు ఎలాంటి కష్టాలు వచ్చినా సహించగలిగే గుణాన్ని క్షాంతి లేక క్షమ (ఓర్పు) అంటారు. దీన్నే సహనం అని, తితిక్షా అనికూడా వ్యవహరిస్తారు.

**"సత్యపి సామర్థ్యే అపర సహనం క్షమా"** అంటే ఎవరైనా కావాలని తనని అవమానించిన లేక వంచించినా ఆ ఎదుటివ్యక్తికి తిరిగి అపకారం చేయగల సామర్థ్యం ఉన్నప్పటికీ, ఎలాంటి అపకారం చేయకుండా సహనంతో వుండటమే 'క్షమ'.

**'న తితీక్షా సమమస్తి సాధనం'** సహనాన్ని మించిన సాధనం మరొకటిలేదు అని ఆర్యోక్తి.

ధర్మస్వరూపుడైన శ్రీరామచంద్రుడు తల్లి కోరిక ప్రకారం అరణ్యాలకిపోయి ఎన్నో కష్టాలు అనుభవించాడు. సీతాదేవిని రావణాసురుడు అపహరిస్తే ఎంతో సహనంతో ఉండి తగిన సమయం వచ్చాక అతడిపై దండెత్తి, వధించి సీతని తెచ్చుకున్నాడు. అలాగే లక్ష్మణుడు ఎంతో సహనంతో అన్నగారికి వదినగారికి సేవలు చేసి ఉత్తమ సోదరుడుగా కీర్తి పొందాడు.

**క్షమా దానం క్షమా యజ్ఞః క్షమా సత్యం హి పుత్రికాః,**

**క్షమా యశః క్షమా ధర్మః క్షమయా నిష్ఠితం జగత్.** (బాల. 33-8)

సహనమే గొప్పదానం, గొప్ప యజ్ఞం, గొప్ప సత్యం, సహనమే కీర్తి. ఈ సహనగుణం మీదనే ప్రపంచమంతా నిలిచి ఉంది.

ధర్మరాజు సాక్షాత్తు సహనానికి ప్రతిరూపం. దుర్యోధనుడు ఎన్నిరకాలుగా కష్టాలు పెట్టినా, అన్నీ ఓపికగా ఓర్చుకుని సహనాన్ని పాటించాడు. ఎక్కడా ఎప్పుడూ సంయమనాన్ని కోల్పోలేదు.

నలమహారాజు ఎన్నికష్టాలు వచ్చినా తట్టుకుని చివరకి దమయంతిని చేరుకోవటం, సావిత్రి సహనంతో, పాతివ్రత్యంతో యముణ్ణి మెప్పించి తన భర్త ప్రాణాల్ని తిరిగి పొందటం, శకుంతల తనను దుష్యంతుడు నిరాదరించినా, సహనాన్ని కోల్పోకుండా భరతుడికి జన్మనివ్వటం లాంటి కథనాలు - కష్టాలు అనేవి సామాన్యులకే కాదు, మహాత్ములకీ వస్తాయని, వాటిని సహనంతో ఎదుర్కోవటమే ధర్మమని మనకి తెలియచేస్తాయి.

**కం. జనములు దను నవమానిం**
**చిన, నిందించినను మాఱుసేయక, సైరిం**
**చిన శాంతాత్ముడు, వారల**
**మును చేసినయట్టి సకృతముల నాచికొనున్.** (శాంతిపర్వం 5-547)

ఎవరైనా తనని అవమానించినా, దానికి ప్రతీకారం చేయాలని భావించకుండా శాంతంగా ఉండాలి. అలా ఉన్నవాడికి, ఎవరైతే అవమానించి నిందించారో, వాళ్ళు చేసిన పుణ్యఫలాలన్నీ చేరతాయి. శాంతచిత్తుడు చేసిన పాపాలేమైనా ఉంటే అవి తిరిగి వెళ్ళి ఆ నిందించినవాడిని చుట్టుకుంటాయి.

ఒకరాజు శత్రురాజుతో ప్రాణనష్టాన్ని కలిగించే యుద్ధాన్ని చేయకుండా ఓర్పుతో ఉండటం మంచిదే. అయితే తన శత్రువు గర్వంతో తన రాజ్యంమీదకి దాడిచేస్తే అతడితో యుద్ధం చేసి తీరాలి. అది క్షత్రియధర్మం. అయితే యుద్ధంలో ఓడిపోయిన శత్రుసైన్యాన్ని హింసించకుండా వారికి క్షమాభిక్ష పెట్టటం ఉత్తమధర్మం.

ఇతరుల్ని క్షమించేవాళ్ళని చూసి లోకం చేతకాని వాళ్ళంటుంది. అలా ఎవరేమనుకున్నా క్షమాగుణం అనేది గొప్పగా ప్రకాశించే ఆభరణం. ఉత్తమమైన రూపాన్ని కోరుకునేవాళ్ళు ఈ క్షమాగుణం అనే ఆభరణాన్ని ధరిస్తారు.

ఓర్పు (క్షమ) అనేది వశీకరణ మంత్రంలాంటిది. ఓర్పు కలిగినవాడు దేన్నైనా సాధిస్తాడు. తన చేతిలో ఓర్పు (శాంతి) అనే ఖడ్గం ఉన్నవాణ్ణి ఎలాంటి దుష్టుడూ ఏమీ చేయలేడు. ఓర్పు (క్షమా) గుణం మాత్రమే మనశ్శాంతినిస్తుంది.

"లోకంలో అసమర్థుడైనవాడు అన్ని విషయాల్లో సహనంతో ఉండాలి. సమర్థుడు కూడా ధర్మంకోసం ఓర్పు పట్టాలి. ఎవడైతే లాభనష్టాల్ని సమానంగా చూస్తాడో అలాంటివాడికి సహనం గొప్పవరంగా ఉంటుంది. తాపసులకి తపస్సు బలమైతే, బ్రహ్మజ్ఞానులకి వేదం, పాపాత్ములకి హింస, గుణవంతులకి అహింస అనేవి బలాలు. సమర్థుడైన వ్యక్తికి అన్నిచోట్లా అన్నివేళల్లో సహనం కన్నా గొప్ప సంపద మరొకటిలేదు.

ఈ క్షమాగుణానికి ప్రతీక భూదేవి. మనిషికి ఆభరణం రూపమైతే, ఆ రూపానికి ఆభరణం గుణం, ఆ గుణానికి ఆభరణం జ్ఞానం, ఆ జ్ఞానానికి ఆభరణ 'క్షమ'.

మనిషిలో సహనం అనేది అతడి పనుల్లో, మాటల్లో ప్రత్యక్షంగా కనిపించాలి. అప్పుడు అతడు సహనశీలిగా లోకంలో గుర్తించబడతాడు. ఎంత కష్టపడైనాసరే సహనాన్ని పాటించాలి.

కోరికలు, ఇంద్రియాలు ఈ రెండింటి సంయోగం వల్ల మానవులకి శీతోష్ణాలు, సుఖదుఃఖాలు కలుగుతున్నాయి. అవి ఉత్పత్తి వినాశనాన్ని కలిగించేవి కాబట్టి వాటిని సహనంతో భరించాలి. ఎందుకంటే నిజంగా ధీరుడైనవాడు మాత్రమే సుఖదుఃఖాల్ని, వేడిని, చలిని సమానంగా భావిస్తాడు. అలా సహనంతో ఉన్నవాణ్ణి 'కోరికలు' ఏమాత్రం చలింప చేయలేవు. అలాంటివాడే మోక్షానికి అర్హుడు.

సహనంతో ఉండటమే తాపసుల ధర్మం. ఇది అన్ని ధర్మతత్త్వాలకీ మూలమైన గుణం. ఈ సహనం అనే గుణం ఉండటం వల్లనే పరమాత్మ అనుగ్రహిస్తాడు. క్షమాగుణం ఉంటే చాలు అలాంటివాడికి సకల సంపదలు కలుగుతాయి, మంచివిద్య లభిస్తుంది, సకల సుఖాలు ప్రాప్తిస్తాయి.

**అనసూయ (మాత్సర్యం లేకపోవటం):** ఇతరులు సాధించిన అభివృద్ధిని, సంపదని, ఆస్తుల్ని, భవనాల్ని, విద్యని చూసి వారిమీద ద్వేషభావాన్ని పెంచుకుని, తనలో తాను మథనపడటం అసూయ. అలా మథనపడకుండా వుండటం 'అనసూయ'.

అసూయ ఉన్నవాడికి సరైన నిద్ర ఉండదు. మనఃశాంతి అసలే ఉండదు. వాడి మనసు ఎప్పుడూ పగ, ప్రతీకారాలతో రగిలిపోతూ ఉంటుంది. అదే అసూయ లేనివాడి మనసు ఎప్పుడూ స్వచ్ఛంగా, ప్రశాంతంగా వుంటుంది.

ఇతరుల్ని చూసి బాగా ఈర్ష్య పడేవాడు, దీనుడు, సంతోషం లేనివాడు, కోపగ్రస్తుడు, ఎప్పుడూ అనుమానించేవాడు, ఇతరుల ధనం మీద ఆధారపడి బ్రతికేవాడు. ఈ ఆరుగురూ ఎప్పుడూ బాధలుపడుతూ వుంటారు.

ముసలితనం అందాన్ని హరిస్తే-ఆశ ధైర్యాన్ని, మృత్యువు ప్రాణాల్ని, 'అసూయ' ధర్మాచరణని నశింప చేస్తుంది. అసూయ లేనివాడు, జ్ఞానవంతుడు, ఎప్పుడూ మంచిపనులు చేసేవాడు అందరిచేతా కీర్తించబడి సుఖాలు పొందుతాడు.

మంచి ప్రవర్తన లేనివాడికి, తెలివితేటలు లేనివాడికి, అసూయతో ఉన్నవాడికి, ధర్మమార్గంలో నడవనివాడికి, చెడ్డ నోరు ఉన్నవాడికి (మంచిమాటలు మాట్లాడనివాడికి), కోపంతో ఉండేవాడికి త్వరగా కష్టాలు వస్తాయి. అసూయ అనే దుర్గుణం ఒక్క అంగలో మీదకొచ్చే మృత్యువులాంటిది.

ఇతరుల సంపదని, విద్యని, తేజస్సుని, బలాన్ని చూసి, తన మనస్సులో తీవ్రంగా అసహ్యపడే మనిషి ఎలాంటి రోగం లేకపోయినా బాధపడతాడు (విదురనీతి).

'అసూయ' అనేది మనిషిని కాల్చివేసేంత దుర్గుణమనీ, దాన్ని ప్రయత్న పూర్వకంగా తొలగించుకుని అనసూయా గుణాన్ని పెంపొందించుకోవటమే ఉత్తమ పురుషుల లక్షణమని గ్రహించాలి.

తనకి అపకారం చేయాలనుకునేవాళ్ళని ఎదుర్కొనే సామర్థ్యం లేనివాళ్ళలో తీవ్రమైన 'అసూయ' కలుగుతుంది. అయితే 'దయ' అనే సుగుణాన్ని అలవర్చుకుంటే ఈ అసూయ నశిస్తుంది.

తన మనస్సులో కోరికలు కలగటం వల్ల, ఇతరుల ఐశ్వర్యాన్ని, ఆనందాన్ని చూడటంవల్ల మనుషుల్లో ఈర్ష్య (అసూయ) లేదా మాత్సర్యం పుడుతుంది. దాన్ని పోగొట్టుకోవాలంటే మంచి జ్ఞానాన్ని సంపాదించాలి.

**శౌచం:** లోకంలో ప్రతిమనిషికీ శుచి, శుభ్రత అవసరం. జంతువుల నుంచి మనిషిని వేరుచేసేది ఈ శౌచగుణమే. ఈ శౌచం అంతర్గతశౌచం-బాహ్యశౌచం అని రెండు రకాలు. **'ఓం ఆపోహిషా మయోభువస్తాన ఊర్జ దధాతన । మహేరణాయ చక్షసే"** (ఋగ్వేదం 10-9). మనస్సుని శరీరాన్ని పవిత్రం చేయమని జలాధిపతులైన దేవతల్ని ప్రార్థిస్తూ "ఓ జలదేవతలారా! మా ఉన్నతమైన సుఖానికి, ఆనందానికి మీరే కారకులు. అలాంటి మీరు ఎంతో మహిమాన్వితమైనది, గొప్పది అయిన అంతర్దృష్టిని, శక్తిని మాకు అనుగ్రహించండి".

శారీరక మానసిక శౌచాన్ని ప్రసాదించమని దేవతల్ని కోరుతూ ఆనాటి ఋషులు దర్శించిన ఈ మంత్రాలని మార్జనమంత్రాలు అంటారు. దేవతా విగ్రహాల్ని ఈ అభిషేకించే సందర్భంలో ఈ మంత్రాన్ని వాడతారు. అలాగే బ్రాహ్మణులు చేసే సంధ్యావందనం మంత్రాలలో ముందుగా 'బాహ్య, అంతర' శుచి కలగటం కోసం **"అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాన్ గతోఽపివా । యః స్మరేత్ పుండరీకాక్షం సబాహ్యాభ్యంతరశ్శుచిః"** అనే మంత్రాన్ని పఠిస్తారు.

కేవలం మట్టితో, నీళ్ళతో శరీరాన్ని శుభ్రం చేసుకునే శౌచాన్ని లౌకికశౌచం అంటారు. అయితే 'నేను' – 'నాది' అనే అజ్ఞానాన్ని తొలగించుకుని విశాలభావంతో ఉండటమే శుద్ధమైన శౌచం. లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన అనే మూడు దుర్గంధాలనీ పోగొట్టుకోవటం కూడా శుద్ధశౌచం అవుతుంది. దీనివల్ల మనిషి మనసు పవిత్రమవుతుంది. ప్రతి మానవుడు జ్ఞానం అనే మట్టితో, వైరాగ్యం అనే నీళ్ళతో, తన శరీరాన్ని మనస్సుని కడగటమే శుద్ధశౌచం. మనస్సులో ఉన్న అపవిత్ర భావాల్ని తొలగించుకోవటమే స్నానం, ఇంద్రియనిగ్రహమే శౌచం అని మైత్రేయోపనిషత్తు చెబుతుంది.

లోకంలో ఏపని చేసినా త్రికరణశుద్ధిగా చేయాలని అంటారు. మనసు, మాట, శరీరం (చేతలు) ఈ మూడూ పవిత్రంగా ఉంచుకుని చేసిన పని తప్పకుండా శుభ ఫలితాలనిస్తుంది.

మనస్సు పవిత్రంగా (శుచిగా) ఉన్నవాడికి, మాటలతో వర్ణించటానికి వీల్లేని పరబ్రహ్మను గురించిన జ్ఞానం, బ్రహ్మానుభూతి రెండూ కలుగుతాయని తేజోబిందూపనిషత్తు ప్రబోధిస్తోంది.

**"సత్త్వశుద్ధి సౌమన స్యైకాగ్ర్యేంద్రియజయాత్మ దర్శనయోగ్యత్వాని చ"** (పతంజలి యోగసూత్రాలు 2–41). "మానవుడి అంతరగం శుచిగా, స్థిరంగా ఉండటం వల్ల సత్త్వశుద్ధి, ప్రసన్నత, ఏకాగ్రత, ఇంద్రియ జయం, ఆత్మసాక్షాత్కార యోగ్యత లభిస్తాయి". **"మైత్రీ కరుణాముదితోపేక్షాణాం సుఖదుఃఖ పుణ్యాపుణ్య విషయాణాం భావనా శ్చిత్త ప్రసాదనమ్"** (పతంజలి యోగసూత్రాలు 1–33). "స్నేహం, కరుణ, స్త్రీలని ఉపేక్షించటం (కామాన్ని త్యజించటం), సుఖదుఃఖాలు సమానంగా భావించటం, పాపాత్ముల మీద దయని కలిగి వుండటం, పుణ్యాత్ముల మీద ప్రేమని చూపించటం అనే గుణాలవల్ల మానవుడి మనస్సు పవిత్రమవుతుంది".

సామాన్యంగా 'శౌచం' అయిదు రకాలు.

**మనస్సౌచం:** దురభిమానం, కోపం, ద్వేషం, కామం, హింస, అహంకారం, అతిమమకారం, అసూయ, లోభం, మదం, ఇలాంటి దుర్గుణాలతో మనిషి మనస్సు అపవిత్రమై ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కడూ అభ్యాసం ద్వారా, సత్సంగం ద్వారా, తమ మనసులో వున్న ఈ అపవిత్ర గుణాలని తొలగించుకుని మనస్సుని శుచిగా ఉంచుకోవాలి.

**కర్మశౌచం:** మనిషిలో ఉన్న కామం, క్రోధం లాంటి దుర్గుణాల వల్ల అతడు ధర్మవిరుద్ధమైన పనులు చేయటానికి పూనుకుంటాడు. ఏది మంచి? ఏది చెడు? అన్న విచక్షణ కోల్పోయి పశువులా ప్రవరిస్తాడు. నీతిబాహ్యమైన, ధర్మవిరుద్ధమైన పనులు చేస్తాడు. ఇలాంటి వాళ్ళు తాముచేసే పనులవల్ల కలిగే అనర్థాన్ని, పాపాన్ని గుర్తించి, సమాజానికి మేలు కలిగే పుణ్యకర్మల్ని ఆచరించాలి. ఇలా ఆచరించటాన్నే 'కర్మశౌచం' (పవిత్రమైన పనులు) అంటారు.

**కులశౌచం:** కులధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించటం, ఇతర కులధర్మాల్ని ఆచరించటం, వంశప్రతిష్ఠకి మచ్చ కలిగే పనులు చేయటం, వ్యభిచరించటం, ఇలాంటి వాటి వల్ల అతడి వంశం అపవిత్రమవుతుంది. యోగ్యుడైనవాడు సనాతన ధర్మాన్ని పాటిస్తూ, వంశ మర్యాదని రక్షించాలి. ఇలా రక్షించటాన్నే 'కులశౌచం' అంటారు.

**శరీరశౌచం:** తాకకూడని వస్తువుల్ని, పదార్థాల్ని తాకటం, తినకూడని పదార్థాలని తినటం, జాతాశౌచాన్ని మృతాశౌచాన్ని (మైలలు) పాటించకపోవటం, మలమూత్రాలను కాలానుగుణంగా విసర్జించకపోవటం, ఇలాంటి వాటివల్ల శరీరం అపవిత్రంగా మారిపోతుంది. అలాంటప్పుడు చక్కగా మట్టి పూసుకుని, మంచినీళ్ళతో స్నానం చెయ్యాలి. పుణ్యకార్యాలలో తప్పనిసరిగా ఆచమనం చెయ్యాలి. ఇలా చేయటాన్నే 'శారీరకశౌచం' అంటారు.

**వాక్ శౌచం:** ఎప్పుడూ అబద్ధాలు చెప్పటం, ఇతరుల్ని నిందించటం, కోపంగా మాట్లాడటం, దూషించటం, వ్యర్థసంభాషణ చేయటం. ఇలాంటి పనుల వల్ల మనిషి మాటకి అపవిత్రత కలుగుతుంది. కనుక ప్రతి ఒక్కరూ ఇతరులకి ప్రియం కలిగేలా, శాంతంగా, మృదువుగా మాట్లాడాలి. ఇలా మాట్లాడటాన్నే 'వాక్ శౌచం' అంటారు.

## ఆహార శుద్ధి

శారీరక శౌచంతో పాటు మానవుడు తినే ఆహారం కూడా శుచిగా ఉండాలి (ఛాందోగ్యోపనిషత్తు). **"ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః । సత్త్వశుద్ధౌ ధ్రువాస్మృతిః ।** (7–26–2).

మానవుడు తినే ఆహారం శుద్ధిగా (శుచి) ఉండాలి. అలా శుద్ధిగా ఉన్న ఆహారాన్ని తిన్న మానవుడి అంతఃకరణం శుద్ధి అవుతుంది. దానివల్ల అతడికి స్మరణశక్తి కలుగుతుంది. ఈ స్మరణశక్తి వల్ల అజ్ఞాన గ్రంథులన్నీ ఛిన్నాభిన్నమైపోతాయి. తద్వారా అతడి దోషాలన్నీ తొలగిపోతాయి.

మానవులందరికీ జ్ఞానం, తపస్సు, అగ్ని, ఆహారం, మట్టి, మనస్సు, నీళ్ళు, శరీరానికి పూతపూయటం, సూర్యుడు, కర్మ, కాలం అనేవి పరిశుద్ధిని (శౌచాన్ని) కలిగిస్తాయి. అన్నిరకాల శౌచాల కన్నా ద్రవ్యశౌచం అనగా ద్రవ్యశుద్ధి చాలా గొప్పది (దానధర్మాలలో వినియోగించే ధనం పవిత్రంగా సంపాదించినదై ఉండాలి) మట్టితో నీళ్ళతో శుచిత్వం పొందినవాడు అర్ధశుచివంతుడే అవుతాడు. పదార్థ శౌచం కలిగినవాడు మాత్రమే పవిత్రుడు.

పండితులు–ఓర్పుతో, చెడ్డపనులు చేసేవాళ్ళు–దానాలు చేయటంతో, రహస్యంగా పాపాలు చేసినవాళ్ళు–మంత్రజపాలు చేయటంతో, వేదవేత్తలు–తపస్సుతో పరిశుద్ధు లౌతారు. వంటపాత్రలు (లోహాలతో చేసినవి) మట్టితో, నీళ్ళతో పవిత్రమవుతాయి. వేగంగా ప్రవహించటం వల్ల నదులు, బహిష్టు అవటం వల్ల స్త్రీలు, సన్న్యాసాన్ని స్వీకరించటం వల్ల బ్రాహ్మణుడు పవిత్రులవుతారు.

చెమట పట్టటం ద్వారా అశౌచంగా ఉన్న శరీరం స్నానం చేయటం ద్వారా శుద్ధమవుతుంది. చెడ్డమనస్సు సత్యాన్ని పలకటం ద్వారా శుద్ధమవుతుంది. మనిషి శరీరంలో సూక్ష్మరూపంలో ఉన్న జీవాత్మ, ఆ మనిషి తెలుసుకున్న బ్రహ్మవిద్య ద్వారా చేసిన తపస్సు ద్వారా పరిశుద్ధమవుతుంది. ఇక మనిషి బుద్ధి అతడు పొందిన జ్ఞానం ద్వారా శుద్ధమవుతుంది.

శరీరంలో బొడ్డు పైభాగంలో ఉన్న ఇంద్రియాలు (కళ్ళు, ముక్కు చెవులు, నాలుక, చేతులు) అన్నీ పరిశుద్ధమైనవి. బొడ్డు క్రిందిభాగంలో వున్న ఇంద్రియాలు అపరిశుద్ధమైనవి (కాళ్ళు, మర్మావయవాలు). దేహం నుంచి వచ్చే చెమట, మల, మూత్రాలు కూడా అపరిశుద్ధమైనవి. కనుక వీటిని తాకితే వెంటనే నీళ్ళతో చేతుల్ని శుభ్రం చేసుకోవాలని మనుస్మృతి ప్రబోధిస్తుంది.

## ఆచమనవిధి

భోజనం చేసేటప్పుడు, నిద్రపోయి లేచిన తరువాత, స్త్రీలని చుంబించినప్పుడు, వస్త్రాలు ధరించినప్పుడు, మూత్రం, రేతస్సు, పురీషం విడిచినప్పుడు, నాలుగు దారుల కూడలిలో నడిచినప్పుడు, స్మశానాన్ని చేరినప్పుడు, ఉభయసంధ్యా సమయాలలో ఆచమనం చేయాలి.

మూర్ఖులతో, మ్లేచ్ఛులతో మాట్లాడినప్పుడు, స్త్రీలతో, ఎంగిలి ముఖం ఉన్న వారితో మాట్లాడినప్పుడు, ఎంగిలి అన్నాన్ని తాకినప్పుడు, కన్నీరు, రక్తం స్రవించినప్పుడు ఆచమనం చేయాలి. అగ్నిని, ఆవుని, తాకినప్పుడు, బాగా శ్రమచేస్తున్నవాడిని, స్త్రీని తాకినప్పుడు, తనను తాను అనవసరమైన ప్రదేశాల్లో తాకినప్పుడు, కటి వస్త్రం ధరించినప్పుడు, తన జుట్టుని తాకినప్పుడు, ఉతకని వస్త్రాలు తాకినప్పుడు, నీళ్ళని గానీ, గడ్డిని కానీ, భూమిని కానీ తాకాలి.

అచమనం మనిషిని పవిత్రం చేస్తుంది. ఆ ఆచమన జలం హృదయం దాకా చేరగానే బ్రాహ్మణుడు పవిత్రుడవుతాడు. కంఠందాకా ఆ ఆచమన జలం చేరితే చాలు క్షత్రియుడు పవిత్రుడవుతాడు. ఆచమన జలం నోట్లో పడగానే వైశ్యుడు, చేతితో తాకితే చాలు స్త్రీలు, శూద్రులు పవిత్రులవుతారు. కనుక ఈ ఆచమనాన్ని శ్రద్ధగా విధిగా అందరూ చేయాలి (కూర్మ. 13-15).

## స్నానవిధి

ప్రతి ఒక్కరూ బ్రాహ్మీముహూర్తంలోనే నిద్రలేచి శౌచాది కార్యక్రమాలు ముగించుకుని ప్రాతఃకాల స్నానాన్ని చేయాలి. దీనివల్ల పాపాలు నశిస్తాయి. ఋషిత్వం సిద్ధిస్తుంది. నిద్రపోయి లేచిన వాడి నోటినుంచి, చొంగ కారుతుంది. అలా ఉండగా నిత్య కర్మలు ఆచరించకూడదు, కనుక ప్రాతఃకాల స్నానాన్ని ఆచరించాలి, ప్రాతః కాలస్నానం వల్ల దారిద్ర్యం, కాంతిహీనత, దుఃస్వప్నాలు తొలగిపోతాయి. మానవులకి స్నానం లేకుండా జపం, తపం, హోమం ఎలాంటి ఫలితాల్ని ఇవ్వవు. ఒకవేళ పూర్తిగా స్నానం చేయటానికి (శిరఃస్నానం) అనారోగ్యరీత్యా వీలులేనివారు కంఠస్నానమైనా ఆచరించాలి. దానికి కూడా తగిన శక్తిలేకపోతే తడిగుడ్డతో వళ్ళంతా శుభ్రంగా తుడుచుకోవాలి. దీన్ని కపిల స్నానం అంటారు.

**1. బ్రహ్మ స్నానం:** మంత్రాలు చెబుతూ దర్భలతో నీళ్ళని చల్లుకోవటం.

**2. ఆగ్నేయ స్నానం:** పాదాల నుంచి తలదాకా భస్మాన్ని రాసుకోవటం.

**3. వాయవ్య స్నానం:** గోధూళితో శరీరాన్ని అలుముకోవటం.

**4. దివ్య స్నానం:** ఎండలో, వానలో తడవటం.

**5. వారుణ స్నానం:** నదుల్లో, సముద్రాల్లో చెరువుల్లో చేసే స్నానం.

**6. యౌగిక స్నానం:** ఆత్మ తత్వాన్ని ధ్యానించటం, బ్రహ్మజ్ఞానులైనవారు ఎక్కువగా యోగస్నానాన్నే ఆచరిస్తారు. ఈ స్నానాన్ని ఆత్మతీర్థం అంటారు. ఇది మానవుల్ని పవిత్రం చేస్తుంది.

## అనాయాసం

మనిషి చేసే ఏపనినైనా బాగా కష్టపడి ప్రయాసతో చేయకూడదు. సులభంగా శరీరానికి, మనసుకి కష్టం కలగకుండా ఆచరించాలి. దీన్నే అనాయాసగుణం అంటారు.

**యథారంభో భవేత్పీడా నిత్యమత్యంత మాత్మానః,**
**తద్వర్జయేద్ధర్మ్యమపి అనాయాస స్స ఉచ్యతే.** (గౌతమ ధర్మసూత్రం)

మానవ శరీరం పరమాత్మ నివాసస్థానం. ఆత్మజ్యోతిగా ఆయన మనందరి శరీరాల్లో ఉన్నాడు. మనం మన శరీరాన్ని తీవ్రంగా కష్టపెట్టకూడదు, శక్తికి మించి ఆయాసంతో ఏపనీ చేయకూడదు. ఏ వ్రతాలు, ఏ యజ్ఞాలు, ఏ పూజలు, ఏ ఉత్సవాలూ ప్రయాసపడి చేయకూడదు. పదిమందినీ కలుపుకుని పనుల్ని చేస్తే ఏపనైనా అనాయాసంగా జరిగిపోతుంది. అది ఆత్మసంతృప్తిని కలిగిస్తుంది.

"బుద్ధిహీనులైన కొందరు అహంకారంతో కఠోరమైన ఉపవాస నియమాల్ని పాటిస్తూ తమ శరీరంలో ఉన్న నన్ను కృశింపచేస్తున్నారు (భగవద్గీత 17-6). ఇలాంటి వాళ్ళు ఆసుర (రాక్షస) ప్రవృత్తి కలిగినవాళ్ళు" అని భగవద్గీతలో కృష్ణపరమాత్మ కూడా చెప్పాడు. కాబట్టి అతిగా ఏదీ చేయకుండా, విధ్యుక్త ధర్మాలను ఆచరించాలి.

**మంగళం:** మంగళం అంటే ఎప్పుడూ శుభప్రదమైన కార్యక్రమాల్ని ఆచరించటం. .

**ప్రశస్తా చరణం నిత్య మప్రశస్త వివర్జనం,**
**ఏతద్ధి మంగళం ప్రోక్తం మునిభిస్తత్వ దర్శిభిః.** (గౌతమ ధర్మసూత్రం)

నిత్యం, అప్రశస్తమైన (అశుభ) కార్యక్రమాలని విడిచిపెట్టి ప్రశస్తమైన (శుభప్రదమైన) కార్యక్రమాలని చేయటమే మంగళం అని మునులు, తత్త్వదర్శులు చెబుతారు.

మనం ప్రతిరోజూ మంగళకరమైన మాటల్నే వినాలి, మంగళకరమైన పనుల్నే చేయాలి, అంటే ధర్మబద్ధమైన పనుల్నే చేయాలి, శుభప్రదమైన పనులు చేయటంలో ఆత్మసంతృప్తి వుంటుంది. పదిమందీ మనకి తోడు వస్తారు. అందరూ మనం చేసే మంచిపనుల్ని ప్రశంసిస్తారు. అసలు శుభప్రదమైన పనులు ఏమిటి? అని ప్రశ్నించుకుంటే నిద్రలేవగానే కాలకృత్యాలు తీర్చుకుని భగవంతుణ్ణి అష్టోత్తరంతోగానీ, సహస్రనామాలతో గానీ ప్రార్థించటం. వీలైతే సమీపంలో ఉన్న ఆలయాన్ని సందర్శించటం. ఇంటికి ఎవరైనా వచ్చినా, దారిలో ఎవరైనా ఎదురైనా "బాగున్నారా! మీ ఇంట్లో అందరూ కుశలమేనా!" అని అడగాలి. ఈ మంచిమాటల ద్వారా ఎదుటివారికి మనమీద సదభిప్రాయం ఏర్పడుతుంది.

**అకార్పణ్యం:** అకార్పణ్యం అంటే ఎలాంటి కష్టాలు వచ్చినా ఎలాంటి నష్టాలు వచ్చినా దీనస్థితిని పొందకపోవటం.

**ఆపద్యపి చ కష్టేషు భవేద్దీనో న కస్యచిత్,**
**సంవిభాగ రుచిశ్చస్యా దకార్పణ్యం తదుచ్యతే.** (గౌతమ ధర్మసూత్రం)

సాధారణంగా సమాజంలో ప్రతి ఒక్కరికీ ఏవో రకాల కష్టాలు, నష్టాలు, భయాలూ కలుగుతూ వుంటాయి. అయితే వీటిని చూసి మనిషి వెంటనే ధైర్యాన్ని కోల్పోకూడదు. ప్రతి సమస్యకీ ఏదో ఒక పరిష్కారం తప్పకుండా ఉంటుంది. ఆ పరిష్కారం గురించి ఆలోచించకుండా సమస్య గురించే ఆలోచిస్తూ దీనంగా ఉంటే, ఇక ఎప్పటికీ అది పరిష్కారం కాదు. బండి చక్రంలో ఆకుల్లాగా సుఖదుఃఖాలు, కష్టనష్టాలూ పైకీ కిందకీ తిరుగుతూ ఉంటాయి.

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః,**
**వీతరాగ భయక్రోధః స్థిత ధీ ర్మునిరుచ్యతే.** (భగవద్గీత 2-56)

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే,**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్,** (భగవద్గీత 9-22)

దుఃఖాలకి (కష్టాలకి) క్రుంగిపోనివాడు, సుఖాలకి పొంగిపోనివాడు ఆసక్తిని, భయాన్ని, కోపాన్ని విడిచిపెట్టినవాడు స్థితప్రజ్ఞుడు. నిజమే కదా! మనం కూడా నిజజీవితంలో కష్టాలు వచ్చాయి కదా! అని నీరసించిపోవటం సుఖాలు వచ్చినప్పుడు విర్రవీగటం చేయకూడదు. దేనిగురించీ, ఎవరి గురించి భయపడకూడదు. మనం తప్పు చేయలేదు. అధర్మం చేయలేదు అన్న నమ్మకం ఉంటే ఎవరికి? ఎందుకు? భయపడాలి? అకార్పణ్య గుణాన్ని అలవర్చుకుంటే, మనకి ఎలాంటి దైన్యం రాదు. కష్టాలు వచ్చినప్పుడు ఎవర్నీ ఆశ్రయించకుండా త్రికరణశుద్ధితో, అనన్యభక్తితో నన్ను ఆశ్రయిస్తే (పూజిస్తే), వాళ్ళ యోగక్షేమాలన్నీ చూస్తానని కృష్ణ పరమాత్మ ఎలాగూ హామీ ఇచ్చాడు.

## అస్పృహ (అపరిగ్రహం)

**వివర్జయే దసంతోషం విషయేషు సదా నరః,**
**పరద్రవ్యాభిలాషం చ సాఽస్పృహా కథ్యతే బుధైః.** (గౌతమ ధర్మసూత్రం)

అస్పృహ అంటే ఇతరుల ద్రవ్యాలకి (సంపదలకి, వస్తువులకి) ఆశపడకుండా లేక ఆశించకుండా ఉండటం. లోకంలో మానవుడికి ఎన్నోరకాల కోరికలుంటాయి. మాయలో చిక్కుకున్న ప్రతి ఒక్కడూ ఎన్నోరకాల వస్తువులు కావాలని ఆరాటపడతాడు. అందుకోసం ఎంతో శ్రమిస్తాడు. ఒక్కోసారి అక్రమమార్గాల్ని కూడా అనుసరిస్తాడు. తద్వారా అంతులేని పాపాన్ని మూటకట్టుకుంటాడు.

తనకున్న దాంతోనే ప్రతి ఒక్కరూ సంతృప్తిపడటం అలవాటు చేసుకోవాలి. ఒకవేళ ఎవరైనా తమంత తాముగా తమ దగ్గరున్న ధనాన్ని గానీ, వస్తువుల్ని గానీ ఇస్తామన్నా వాటిని తీసుకోకుండా ఉండటం అస్పృహకి పరమావధి. దీన్నే అపరిగ్రహం అనికూడా అంటారు. ఇలా తీసుకోవటం వల్ల దానం చేసినవాడి పాపఫలితాలు తీసుకున్నవాడికి సంక్రమిస్తాయని తైత్తిరీయ ఆరణ్యకం (2-15) చెబుతుంది.

ఈ సమస్త ప్రపంచంలో ఈశ్వరుడి శక్తి ఆవరించి వుంది. ఇదంతా ఆయనతోనే నడుపబడుతోంది. ఈ సృష్టిలోని సర్వానికి అధిపతి ఆ పరమాత్మ. ఈ విషయాన్ని తెలుసుకుని ఇతరుల ధనాన్ని అపహరించకుండా ఉండాలి. ఎవడైతే పరుల సొత్తుని దొంగతనం చేయడో అలాంటివాడు ఇహపరాలలో సుఖాన్ని పొందుతాడని యజుర్వేదం చెబుతోంది.

ఈ అస్పృహ గుణాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలి. తద్వారా ధనవంతుడి దృష్టిలో, ధనం లేనివాడు ఎప్పుడూ న్యూనతాభావాన్ని పొందదు. అలాగే సమాజంలో ఎవరి నుంచీ ఏమీ ఆశించకుండా సంతృప్తితో జీవించేవాడికి ఎంతో గౌరవం కూడా లభిస్తుంది. ఒకరి వస్తువుల్ని మనం ఆశించటమంటే అది ఎంతో నీచమైన పని. ఇలా ఆశించటం ఒకసారితో ఆగదు. క్రమక్రమంగా పెరుగుతూ ఉంటుంది.

ఈ ఎనిమిది ఆత్మగుణాలు కలవారికి ఈ ఫలితాలు లభిస్తాయి.

1. క్షమ–భూప్రాప్తి, 2. దయ – సుఖసంతోషాలు, 3. అనసూయ – స్వర్గప్రాప్తి, 4. శౌచం – ఆత్మజ్ఞానం, 5. మంగళం – ఇహపర సౌఖ్యం, 6. అనాయాసం – దివ్యత్వం, 7. అకార్పణ్యం – ప్రకృతిలయం, 8. అస్పృహ – సౌఖ్యం.

✦ ✦ ✦

# చతుర్విధ పురుషార్థాలు

## మోక్ష లక్షణం

**అభేద దర్శనం మోక్షస్సంసారో భేదదర్శనమ్,**
**ఇతి నిస్సంశయ జ్ఞానాన్ముక్తిర్వేదాంత డిండిమః.**

ఆ పరమాత్మ వేరు, తాను వేరు అనే భేదభావంతో ఉండటాన్ని సంసారం అంటారు. తాను, పరమాత్మ వేరుకాదు ఇద్దరం ఒక్కటే అనే భావాన్ని కలిగి ఉంటే దాన్ని మోక్షం అంటారు. ఈ జ్ఞానాన్ని సందేహం లేకుండా ఎవరు తెలుసుకుంటారో వారికి ముక్తి లభిస్తుందని వేదాంతులు చెబుతారు.

"తెలివి కలిగినవాడు ఒక మంచి గురువు దగ్గరకి వెళ్ళి, అన్నిరకాల విద్యల్నీ అభ్యసించి, అన్నిరకాల ఇహలోక సుఖాల గురించి, పరలోక సుఖాల గురించి తెలుసుకొని, ఏషణాత్రయాన్ని (1.ధనేషణ, 2. పుత్రేషణ, 3. దారేషణ) వాసనాత్రయాన్ని (1. లోకవాసన, 2.దేహవాసన, 3. శాస్త్రవాసన) మమత్వం, అహంకారం లాంటి దుర్గుణాలని, వాంతి చేసుకున్న అన్నంలా భావించి, విడిచిపెట్టాలి. కేవలం మోక్షాన్ని మాత్రమే పొందాలి అనే ఏకైక లక్ష్యంతో సాధన చేయాలి" అని పరమహంస పరివ్రాజకోపనిషత్తు మోక్షం గురించి చెబుతుంది.

"దృశ్యంతో కూడి ఉంటే దాన్ని బంధ(సంసార)మని, దృశ్యరాహిత్యంగా ఉంటే మోక్షమని అంటారు. ఈ మోక్షం అనేది ఆకాశంలో లేదు, పాతాళంలో లేదు. భూమ్మీద కూడా లేదు. మనిషి ఆశలన్నీ నశించిపోయాక అతడి చిత్తం (మనస్సు) క్షయించిపోతుంది. అలా క్షయించిపోవటాన్నే మోక్షం అంటారు" అని అన్నపూర్ణోపనిషత్ ప్రబోధిస్తుంది.

సాధకుడు తన హృదయంలో కలిగే సంకల్పాల(కోరికలు)న్నీ పూర్తిగా నశించిపోయే వరకూ తన మనస్సుని నిగ్రహించుకోవాలి. ఇలా సంపూర్ణంగా మనోనిగ్రహాన్ని కలిగి ఉండటాన్నే జ్ఞానం అంటారు. ఈ జ్ఞానమే మోక్షం అని మైత్రాయణ్యుపనిషత్ చెబుతుంది. దీనినిబట్టి మోక్షం అంటే ఎక్కడో లేదు. మనోనిగ్రహంతోనే అది లభిస్తుంది అని తెలుస్తోంది.

✦ ✦ ✦

# త్రిగుణాలు

1.సత్త్వగుణం, 2.రజోగుణం, 3.తమోగుణం. వీటినే త్రిగుణాలు అంటారు. సృష్టిలో వున్న ప్రతిజీవీ ఈ మూడు గుణాలతో వుంటుంది. 'సత్త్వరజస్తమో గుణాలు మూడూ ప్రకృతి నుంచి ఆవిర్భవించాయి. నాశనంలేని ఈ గుణాలు శరీరంలో ఉన్న జీవాత్మని బంధిస్తున్నాయి.

ఈ మూడు గుణాలలో సత్త్వగుణం పవిత్రమైనది. ప్రకాశవంతమైనది. ఎలాంటి వికారాలూ లేనిది. అయితే అది సుఖసాంగత్యం (కలయిక) వల్ల, జ్ఞానం మీద అభిమానం వల్ల మానవుణ్ణి బంధిస్తుంది.

రజోగుణం అనేది 'రాగం' (ప్రేమ) తో కూడుకున్నది. ఇది 'కామం' నుంచి 'ఆసక్తి' నుంచి పుడుతుంది. తమోగుణం శరీరం మీద అభిమానం వున్న ప్రతి ఒక్కరినీ మోహంలో పడేస్తుంది. అజ్ఞానం వల్ల ఈ తమోగుణం పుడుతుంది. ఇది జీవాత్మని ప్రమోదం, ఆలస్యం, నిద్ర అనే లక్షణాలతో బంధిస్తుంది.

ఎప్పుడైతే శరీరంలో, ఇంద్రియాలలో, అంతఃకరణంలో, చైతన్యం, వివేకశక్తి అనే గుణాలు పుట్టాయో! అప్పుడు ఆ మనిషిలో సత్త్వగుణం వృద్ధి చెందిందని గ్రహించాలి (శ్లో॥ 14-11) ఎప్పుడైతే మనిషిలో లోభం, ప్రపంచ విషయాలమీద ఆసక్తి, స్వార్థంతో కర్మలని (పనుల్ని) ఆచరించటం, అశాంతి, సుఖభోగాల మీద అనురాగం అనేవి ఏర్పడతాయో అప్పుడు మనిషిలో రజోగుణం వృద్ధి చెందిందని గ్రహించాలి (శ్లో॥ 14-12) ఎప్పుడైతే అంతఃకరణంలో, ఇంద్రియాలలో చీకటి (అజ్ఞానం) వ్యాపిస్తుందో, చేయాల్సిన పనుల మీద విముఖత కలుగుతుందో! అలాగే అనవసరమైన చేష్టలు, నిద్రలాంటివి కలుగుతున్నాయో! అప్పుడు ఆ మనిషిలో తమోగుణం వృద్ధి చెందిందని గ్రహించాలి (శ్లో॥ 14-13)

శ్రేష్ఠమైన పుణ్యకర్మల్ని ఆచరించటం వల్ల మనిషికి సాత్త్వికఫలాలు అనగా సుఖం, జ్ఞానం, వైరాగ్యం లాంటివి లభిస్తాయి. రాజసకర్మలు ఆచరించే వాళ్ళకి ఎన్నో బాధలు, తామసకర్మలు ఆచరించే వాళ్ళకి అజ్ఞానం లాంటివి కలుగుతాయి (శ్లో॥ 14-16) సత్త్వగుణం వల్ల జ్ఞానం, రజోగుణం వల్ల లోభం, తమోగుణం వల్ల మోహం, ప్రమాదం, అజ్ఞానం కలుగుతాయి (శ్లో॥ 14-17)

నిజమైన దార్శనికుడు (జ్ఞాని) మాత్రమే ఈ త్రిగుణాలే త్రిగుణాలలో తిరుగుతున్నాయని, ఈ త్రిగుణాలు తప్ప మరెవరూ కర్తలేరని తెలుసుకుని, ఈ త్రిగుణాలకి

అతీతంగా ఉన్న పరమాత్మని తత్త్వాన్ని సంపూర్ణంగా గ్రహిస్తాడు. జన్మ, మృత్యు, వార్ధక్య దుఃఖాల నుంచి విముక్తి పొంది పరమానందాన్ని అనుభవిస్తాడు. మట్టి, రాయి, బంగారం. ఈ మూడింటినీ ఒక్కటిగానే భావిస్తాడు. ప్రియాన్ని, అప్రియాన్ని, నిందలని, స్తుతుల్ని సమానంగా స్వీకరిస్తాడు (శ్లో॥ 14-24) త్రిగుణాతీతుడైనవాడు- మానావమానాలలో, మిత్రులతో, శత్రువులతో సమభావంతో ప్రవరిస్తాడు. తన విధ్యుక్త కర్మల్ని ఆచరిస్తున్నప్పటికీ తాను ఆచరించే కర్మల మీద ఎలాంటి కర్తృత్వాభిమానాన్ని పొందదు అని భగవద్గీత బోధిస్తోంది.

## త్రిగుణ వృత్తులు

శమం (మనోనిగ్రహం), దమం (ఇంద్రియ నిగ్రహం), తితిక్ష (సహనం), ఈక్ష (వివేకం), తపస్సు, సత్యం, దయ, స్మృతి, ఆనందం, త్యాగం, వైరాగ్యం, శ్రద్ధ, సిగ్గుపడటం (చెడ్డపనులు చేయటానికి) దయా, ఆత్మరతి (ఆత్మధ్యాన పరాయణుడై వుండటం) అనే సుగుణాలని సత్త్వగుణవృత్తులు అంటారు.

కామం, మదం, ప్రయత్నం, ఆశ, గర్వం, ధనం కోసం దేవతల్ని ఆరాధించటం, భేద బుద్ధి, సుఖం, మదంతో ఉత్సాహపడటం, కీర్తిప్రతిష్ఠల మీద కోరిక, పరాక్రమం, హాస్యం, బలం అనే దుర్గుణాలని రజోగుణ లక్షణాలు అంటారు.

క్రోధం, లోభం, అసత్యం చెప్పటం, హింస చేయటం, యాచించటం, దంభం (పొగరు), శ్రమ, కలహం, శోకం, ఆర్తి, నిద్ర, ఆశ, భయం, జాడ్యం (ఏపనీ చేయకపోవటం) ఇవన్నీ తమోగుణ లక్షణాలు అంటారు.

సత్త్వం, రజస్సు, తమస్సు అనే ఈ మూడూ మానవుడి మానసికగుణాలే. ఈ మూడుగుణాల కారణంగానే మానవుడు శరీరం మీద, అది కోరే సుఖాలమీద వ్యామోహాన్ని పెంచుకుని సంసార బద్ధుడవుతున్నాడు.

ద్రవ్యం, దేశం, ఫలం, కాలం, జ్ఞానం, కర్మ, కర్త, శ్రద్ధ, అవస్థ, ఆకృతి, నిష్ఠ ఇలాంటి భావాలన్నీ త్రిగుణాత్మకాలే. అలాగే మనచేత చూడబడ్డవి, వినబడ్డవి, ఆలోచించబడ్డవి, ప్రకృతి పురుషాధిష్ఠితమైన భావాలు కూడా త్రిగుణాత్మకాలే అని గ్రహించాలి. మానవుడికి ఈ త్రిగుణాల వల్ల సంసారభావాలు (సుఖభోగాలు) కలుగుతాయి. మనస్సు నుండి పుట్టిన ఈ త్రిగుణాలని భక్తియోగం ద్వారా జయించవచ్చు. అలా భక్తియోగంతో పరమాత్మపై అచంచలమైన విశ్వాసం కలిగినవాడు మోక్షాన్ని పొందుతాడు (భగవద్గీత-ఉద్ధవగీత).

# అరిషడ్వర్గాలు

మానవుణ్ణి పతనం చేసేవి ఆరు చెడ్డగుణాలు. అవి 1.కామం, 2. క్రోధం, 3.లోభం, 4.మోహం, 5.మదం, 6. మాత్సర్యం (అసూయ). వీటినే అరిషడ్వర్గాలు అంటారు.

**కామం: న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి,**

**హవిషా కృష్ణ వర్త్మేవ భూయ ఏవాభివర్ధతే.**

(నారద పరివ్రాజకోపనిషత్ 3-17)

కామాన్ని అనుభవిస్తూ ఉంటే ఎప్పటికీ అది శమించదు. నెయ్యి పోస్తే అగ్ని ప్రజ్వరిల్లినట్టు కామం అనేది అనుభవిస్తున్న కొద్దీ తిరిగి వృద్ధి చెందుతూ ఉంటుంది.

కామం వల్ల నాలుగురకాల ఉపద్రవాలు మనిషికి కలుగుతాయి. అవి 1.మద్యపానం, 2 జూదం, 3. స్త్రీ వ్యసనం, 4. వేట. కనుక ఈ కామాన్ని విడిచిపెట్టాలి అని మనుస్మృతి ప్రబోధిస్తుంది.

కామక్రోధాల వల్ల మనిషికున్న ఐశ్వర్యమంతా నశించిపోతుంది. అంతేకాదు అతడి వంశమంతా సమూలంగా నశించిపోయేంత అనర్థం కూడా కలుగుతుందని కుబేరుడు రావణాసురుడితో అంటాడు.

కామం (అనగా కోరికలు) వెంట పరుగెత్తేవాడు, ఆ కోరికలతో పాటే నాశనమైపోతున్నాడు. కేవలం జ్ఞానవంతుడు మాత్రమే కోరికల్ని అనగా కామాన్ని విడిచిపెట్టి జననమరణ రూపమైన దుఃఖాన్ని పోగొట్టుకుంటున్నాడు. ఈ కామం తమో (చీకటి) మయం, అజ్ఞానరూపం. అంతేకాదు అది నరకంలాగా దుఃఖాన్ని కూడా కలిగిస్తుంది.

సంకల్పాలు చేయటం వల్ల కామం పుడుతుంది. మనిషి ఆ సంకల్పాలని నెరవేర్చుకోవాలని భావించటంతో ఆ కామం వృద్ధి చెందుతుంది. ఎప్పుడైతే మనిషి జ్ఞానవంతుడై వైరాగ్యభావాన్ని పొందుతాడో అప్పుడు కామం కూడా నశించిపోతుంది.

నిప్పుని పొగ ఆవరించినట్టు, అద్దాన్ని దుమ్ము కమ్మేసినట్టు, గర్భంలో ఉన్న పిండాన్ని మావి మూసేసినట్టు 'కామం' అనే దుర్గుణంతో ఆత్మజ్ఞానం మూసివేయబడింది. ఎంత అనుభవించినా తృప్తి చెందనిది, జ్ఞానవంతుడికి నిత్యం శత్రువు. కామానికి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఆశ్రయస్థానాలు.

బుద్ధి కన్నా ఆత్మ గొప్పదని, బలమైనదని, తెలుసుకుని ఆ బుద్ధి ద్వారా మనస్సుని వశం చేసుకుని గొప్ప శత్రువైన కామాన్ని నిర్మూలించాలి (భగవద్గీత).

**క్రోధం:** మనిషిని పాపాత్ముడిగా మార్చే మరో దుర్గుణం క్రోధం. దీన్నే కోపం అనికూడా అంటారు. **'తన కోపమె తన శత్రువు తన శాంతమె తనకు రక్ష'.** క్రోధం అనే దుర్గుణం వల్ల కూడా మనిషికి మూడురకాల ఉపద్రవాలు కలుగుతాయి. అవి 1.అన్యాయంగా క్రూరమైన శిక్షలు విధించటం, (ఇతరుల్ని అకారణంగా బాధలు పెట్టటం), 2. పరుషంగా మాట్లాడటం, 3. అర్థాన్ని (అనగా ధనాన్ని సంపదల్ని) దూషించటం. వివేకవంతుడైనవాడు తన శ్రేయస్సు కోసం ఈ క్రోధగుణాన్ని విడిచిపెట్టాలి.

కోపం అనేది మనిషి ప్రాణాన్ని హరించే శత్రువులాంటిది. పైకి మిత్రుడిలా కనిపించే శత్రువు. ఇది చాలా పదునైన ఖడ్గంలాంటిది.

మానవుడు చేసిన తపస్సులు, యజ్ఞాలు, దానాలు, ధర్మాలు వీటివల్ల కలిగే పుణ్యమంతా కోపం అనే దుర్గుణం వల్ల నాశనమైపోతోంది.

ఎప్పుడైతే తన కోరికలు తీరలేదో వెంటనే అతడిలో క్రోధం అనే దుర్గుణం పుడుతుంది. ఈ క్రోధం చాలా చెడ్డది. దీనివల్ల వ్యామోహం కలుగుతుంది. ఆ వ్యామోహం ప్రభావంతో మనిషి జ్ఞాపకశక్తి ఛిన్నాభిన్నమైపోతుంది. బుద్ధి (జ్ఞానం) క్రమక్రమంగా నశించిపోతుంది. అప్పుడా మానవుడు తానున్న స్థితి నుంచి పతనమైపోతాడు.

సత్త్వరజస్తమో గుణాలలో రెండోదైన రజోగుణం నుంచి 'కామం' అనే దుర్గుణం పుడుతుంది. ఇదే క్రోధంగా మారుతుంది. ఈ కామం అత్యంత వినాశకరమైనది. ఎన్నిసార్లు అనుభవించినా ఇది (కామం) చల్లారదు. అంతులేని పాపాల్ని ఇది మనుషులచేత చేయిస్తుంది. కనుక ఈ కామాన్ని పరమశత్రువుగా ప్రతి ఒక్కరూ భావించాలి.

ఎలాంటి రోగం లేకుండా పుట్టేది, ఘాటుగా, చేదుగా ఉండేది, తలనొప్పిని కలిగించేది, పాపాల పరంపరని పుట్టించేది, కఠినంగా, వేడిగా ఉండేది, దుర్జనులు మ్రింగలేనిది సజ్జనులు మాత్రమే మ్రింగ గలిగేది క్రోధం అనే దుర్గుణం. అనర్థాన్ని కలిగించే ఈ కోపాన్ని మింగితే ప్రశాంతత లభిసుంది. కోపాన్ని, ఆనందాన్ని చక్కగా అదుపు చేసుకునేవాడే సంపదలు పొందుతాడు (విదురనీతి).

మనకి ఎదుటివాడి మీద ఎంత కోపం వచ్చినా దాన్ని పైకి ఏమాత్రం కనపడనీయకుండా చిరునవ్వుతో మాట్లాడాలి. కోపంతో ఎవరినీ అవమానించకూడదు.

**లోభం:** ఇతరులకున్న ధనాన్ని, వస్తువుల్ని, భూమిని, భవనాల్ని చూసి, వాటిని తన సొంతం చేసుకుని అనుభవించాలనే కోరికనే లోభం అంటారు.

కామం, క్రోధం అనే రెండు దుర్గుణాలకీ మూలం 'లోభం' అని పండితులు చెబుతున్నారు. ఈ రెండు దుర్గుణాలూ లోభం నుంచే పుడుతున్నాయి. కనుక లోభ గుణాన్ని తప్పక విడిచిపెట్టాలి.

ఆత్మ అనేది ఒక నది లాంటిది. పుణ్యం అనేది రేవు లాంటిది. సత్యం ఆ నదిలో పారే నీరు. ధైర్యం దాని ఒడ్డు, దయాగుణం ఆ నదిలో కెరటం (అల). ఇలాంటి నదిలో స్నానం చేసినవాడే పవిత్రుడవుతాడు. ఇక పుణ్యంతో కూడిన ఆత్మ అంటే ఎప్పుడూ లోభం అనే దుర్గుణం లేకపోవటమే అని మహాభారతంలో ధృతరాష్ట్రుడికి విదురుడు హితబోధ చేస్తాడు.

నియమంగా చేసే తపస్సు ఇంద్రియనిగ్రహం, మంచి విద్యని సంపాదించటం అనేవి మనశ్శాంతిని కలిగిస్తాయి. అయితే వీటన్నిటికన్నా లోభాన్ని వదలటమే గొప్పశాంతికి మూలకారణమవుతుంది.

వేయి రూపాయల ఆదాయం ఉన్నవాడూ జీవిస్తున్నాడు. వందరూపాయల ఆదాయం ఉన్నవాడూ జీవిస్తున్నాడు. కనుక ఎక్కువ సంపాదించాలి అనే లోభాన్ని విడిచిపెట్టాలి (విదురనీతి).

లోభం అనే దుర్గుణం వల్ల కామం అనే దుర్గుణం పుడుతుంది. ఈ లోభం వల్లనే కామప్రవృత్తి కలుగుతోంది. లోభం వల్లనే మాయ, మోహం, దురభిమానం, గర్వం, పరాధీనత అనే దోషాలు మానవుడిలో ప్రవేశిస్తున్నాయి. ప్రతి మానవుడు తన మనస్సుని, ఇంద్రియాలని నిగ్రహించి, మోహంతో కూడిన ఈ లోభాన్ని జయించాలి.

అహంకారం, ద్రోహం, నిందించటం, చాడీలు చెప్పటం, అసూయతో ఉండటం అనే దోషాలన్నీ ఇంద్రియ నిగ్రహంలేని లోభులలోనే వుంటాయి. కోపం నుంచి పుట్టిన లోభం, ఇతరుల దోషాల్ని చూడటంతో మరింత వృద్ధి చెందుతుంది. క్షమాగుణాన్ని పెంపొందించుకుంటే అది క్రమక్రమంగా నశించిపోతుంది. క్రోధం, లోభం లాంటి దుర్గుణాల వల్ల మనిషికి ఇతరుల్ని హింసించాలన్న కోరిక కలుగుతుంది. సమస్త ప్రాణుల మీద దయని కలిగి ఉండటం, వైరాగ్యభావాన్ని కలిగి ఉండటం అనే గుణాలని నింపుకుంటే మనలో ఉన్న ఆ రెండు దుర్గుణాలూ (క్రోధ, లోభాలు) నశించిపోతాయి.

ఎప్పుడూ లోభుల్ని చూస్తూ వారితో సంభాషించటం ద్వారా మనలో కూడా మనిషికి లోభ బుద్ధి పడుతుంది. ఇది పోవాలంటే ధర్మాత్ములలోని ఉదార స్వభావాన్ని గ్రహించాలి.

**మోహం:** మోహంలో చిక్కుకుని ఎందరెందరో మహారాజులు, మహర్షులు, సామాన్యులు ఎన్నో కష్టాలు పడ్డారు.

**తామోహమయీ మాతా జాతో బోధమయస్సుతః,**
**సూతకద్వయ సంప్రాప్తౌ కథం సంధ్యాముపాస్మహే.**

(మైత్రేయోపనిషత్ 2-13)

మోహం అనే తల్లి మరణించింది. వెంటనే జ్ఞానం అనే కుమారుడు జన్మించాడు. ఇలా ఒకేసారి జాతాశౌచం, మృతాశౌచం రెండూ ఏర్పడ్డాయి. ఇప్పుడు సంధ్యావందనం ఎలా చేయాలి? అని మైత్రేయోపనిషత్ చెబుతుంది. దీని భావమేమిటంటే "జ్ఞానం ఉదయించాలంటే మోహం అస్తమించాలి" అని.

ఎవడైతే శరీరం మీద అభిమానాన్ని అనగా మోహాన్ని పొందకుండా ఆత్మచింతన చేస్తాడో అలాంటివాడు సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడు (నారద పరివ్రాజకోపనిషత్తు).

బుద్ధిమంతుడైనవాడు మదాన్ని, అభిమానాన్ని, మాత్సర్యాన్ని, లోభాన్ని, అతివ్యామోహాన్ని, పాము తన కుబుసం విడిచినట్టుగా విడిచిపెట్టాలి.

మోహం అనే ఊబి నుంచి పూర్తిగా బయటపడితేనే ఇహలోక, పరలోక సంబంధమైన సమస్త భోగాల నుంచీ నీకు పూర్తి వైరాగ్యం కలుగుతుంది.

"ఈ శరీరంలో ఉన్న జీవాత్మకి కౌమారం, యౌవనం, వార్ధక్యం లాంటి స్థితులు ఉన్నట్టే, మరొక శరీరప్రాప్తి కూడా కలుగుతుంది. ధీరుడైనవాడు ఈ విషయం గ్రహించి శరీరం మీద మోహాన్ని పెంచుకోడు".

ఈ మోహం అనే దుర్గుణం అజ్ఞానం వల్ల కలుగుతోంది. ఈ అజ్ఞానం కారణంగా మనిషి పాపాల మీద పాపాలు చేస్తూ వుంటాడు. దాంతో మోహం కూడా మరింతగా అతడిలో పెరిగిపోతుంది. కనుక మానవుడు జ్ఞానులైన సత్పురుషులతో సహవాసం చేస్తూ వారిమీద, వారు బోధించే తత్త్వంమీద ప్రేమని పెంచుకుంటే మోహం

నశించిపోతుంది. 'మృత్యువు-అమృతం' అనే రెండూ మానవుడి శరీరంలో ఉంటాయి. మోహం వల్ల మృత్యువు, సత్యం వల్ల అమృతం (అనగా మోక్షం) మనిషికి లభిస్తాయి.

**మదం (అహంకారం):** అరిషడ్వర్గాలలో 'మదం' అనే దుర్గుణం చాలా చెడ్డది. ప్రస్తుత ప్రపంచంలోనే కాదు ఆనాటి ప్రాచీనకాలంలో కూడా ఈ మదం అనే దుర్గుణంతో ఎంతోమంది నశించారు. మదం అంటే గర్వం, అహంకారం అని అర్థాలున్నాయి. అహంకారం మనిషికి ధనంవల్ల, విద్యవల్ల, కీర్తి ప్రతిష్ఠలవల్ల కలుగుతుంది. దీన్ని తలకెక్కించుకుంటే మనిషి సమాజానికి దూరమైపోతాడు. ఎంత ఎక్కువ సంపదలుంటే అంతగా ఒదిగి ఉండటం సజ్జనుల లక్షణం.

నియమితమైన ఆహారాన్ని స్వీకరిస్తూ, కోపాన్ని జయించి, సమాజం నుంచి దూరంగా ఏకాంతంగా ఉంటూ, సుఖదుఃఖాల్ని సమానంగా చూస్తూ, అహంకారాన్ని, ఆశని విడిచిపెట్టి, ఇతరుల నుంచి ఏమీ ఆశించకుండా ఉంటూ ఆ పరబ్రహ్మని తెలుసుకోవాలి. ఇక్కడ పరబ్రహ్మతత్త్వం తెలుసుకోవాలంటే అహంకారాన్ని (మదం) కూడా వదిలిపెట్టాలి.

**"యేతు మోహోద్ఘనాతీర్ణా స్తే ప్రాప్తాః పరమం పదం"** మనిషిలో అహంకారం అనే ముడి తెగిపోవటమే జ్ఞానం. ఇలాంటి జ్ఞానం ఉంటేనే (అనగా అహంకార రహితంగా జీవించటం), అతడికి ముక్తి కలుగుతుంది. కనుక ముక్తి కోరుకునేవాడు అహంకారాన్ని ఎప్పటికీ దరిచేర్చుకోకూడదు.

యమధర్మరాజు ఆజ్ఞతోనే క్రోధం, లోభం అనే రూపంలో మృత్యువు మనుషుల వినాశనానికి కారణమవుతోంది. అహంకారానికి (మదం) వశుడై విపరీతమార్గంలో (అధర్మంగా) ప్రవర్తించేవాడు, ఎప్పటికీ పరమాత్మని చేరుకోలేడు. లోకంలో మానవులంతా క్రోధం, లోభం, అహంకారాలకి వశులై పడుతూ చస్తూ తిరిగి పుడుతూ తిరిగి చస్తూ, ఇలా జననమరణ చక్రంలో పడి తిరుగుతుంటారు. కనుక ఈ దుర్గుణాలకి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలి.

లోకంలో సాధారణంగా ఎవరికైనా మద్యం తాగితే మత్తు కలుగుతుంది. అయితే అది త్వరలోనే వదిలిపోతుంది. కానీ ఐశ్వర్యం అనే మదం (మద్యం) చాలా చెడ్డది. ఇది కలిగినవాడు ఆ మత్తులోంచి బయటకి రాలేక భ్రష్టుడైపోతాడు. కనుక ధనమదం అస్సలు కూడదు.

తాను జన్మించిన గొప్పకులం, తాను ఆర్జించిన గొప్ప జ్ఞానం, తనకున్న సంపద వీటిమీద అభిమానంతో మనిషిలో మదం (అహంకారం) కలుగుతోంది. అయితే ఇవన్నీ నశించిపోయేవే అన్న యథార్థజ్ఞానం ఎప్పుడైతే కలుగుతుందో అప్పుడు మనిషిలో ఉన్న ఈ మదం పూర్తిగా నశిస్తుంది (మహాభారతం).

**మాత్సర్యం:** అరిషడ్వర్గాలలో చివరిది మాత్సర్యం. దీనినే అసూయ అనికూడా అంటారు. ఇది చాలా చెడ్డగుణం. మనిషిని సమూలంగా నశింపచేసే లక్షణం దీనికి ఉంది. ఈ గుణంతో నిండినవాడు అపకీర్తితో మరణిస్తాడు. కాబట్టి ఎవరిమీదా మాత్సర్యాన్ని కలిగి ఉండకూడదు.

మత్సరం యొక్క భావమే మాత్సర్యం. ఇది నివురుగప్పిన నిప్పులా జీవి మనస్సులో గూఢంగా ఉంటుంది. ఎదుటివారిని చూసి ఏ విధంగానూ సహించ లేకపోవడం ఈ దుర్గుణ లక్షణం.

అసూయాగ్రస్తుడికి సుఖశాంతులు ఉండవు. తక్కిన అన్ని గుణాలూ ఒక్కొక్కటిగా మనసులోనికి ప్రవేశిస్తాయి. **'వేరు విత్తుజేరి వృక్షంబు చెరచును'** అన్నట్లు మనసులో అసూయ అనే బీజం రగులుతుంటే అది క్రమక్రమంగా ఆ ప్రాణినే కాదు, ఆ ప్రాణిని ఆశ్రయించిన ప్రాణులన్నింటినీ సమూలంగా నాశనం చేస్తుంది. కాబట్టి అసూయను ప్రయత్నపూర్వకంగా దూరం చేసుకోవాలి!

✦ ✦ ✦

# పరమాత్మని చేరుకునే మార్గాలు

అనాదిగా లోకంలో భగవంతుడు అంటే ఎవరు? ఆయన్ని చేరుకొనే మార్గాలు ఏవి? అని దార్శనికులైన ఋషులు ఎంతో అన్వేషించారు. అందరికీ యోగ్యమైన మార్గాలను తాము ఆచరించి లోకానికి అందించారు. వాటిలో ముఖ్యమైన మార్గాలు ఏవో తెలుసుకుందాం.

మనసు, మాట, శరీరం ఈ మూడింటినీ త్రికరణాలంటారు. వీటి ద్వారా ఏర్పడే భక్తి మూడు విధాలు. **మానసిక భక్తి:** ఇది మానసికంగా భగవంతుడి ఎడల భక్తి ప్రపత్తుల్ని కలిగి ఉండే విధానం. **వాచిక భక్తి:** వేదమంత్రాలతో, దేవతల్ని పూజించటం. **కాయిక భక్తి:** వ్రతాలు, ఉపవాసాలు, నియమాలు ఆచరించటం ద్వారా ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకోవటం. వీటికే మరో మూడు పేర్లు ఉన్నాయి. అవి: **1.లౌకిక భక్తి, 2. వైదిక భక్తి, 3. ఆధ్యాత్మిక భక్తి.**

పరబ్రహ్మ (పరమాత్మ) మీద, అనగా పరబ్రహ్మతత్త్వం మీద అంతులేని ప్రేమని కలిగి ఉండటమే భక్తి. అలాంటి భక్తి అమృతం లాంటిది. అనగా ఎప్పటికీ నశించనిది. మధురమైనది కూడా. ఇలాంటి పరమభక్తిని పొందిన మానవుడే సిద్ధుడవుతాడు. అంటే మోక్షాన్ని పొందుతాడు. జననమరణ రహితుడై ఎంతో తృప్తిని పొందుతాడు. ఈ భక్తిని సంపూర్ణంగా పొందిన మనిషికి ఇక ఎలాంటి కోరికలూ వుండవు. అతడికి ఎలాంటి దుఃఖమూ వుండదు. ఏ ప్రాణినీ ద్వేషించడు, విషయ సుఖాలమీద ఎలాంటి వ్యామోహాన్ని పొందడు.

కేవలం పరమాత్మని (తన ఇష్టదైవం) తప్ప మరెవ్వరినీ ఆశ్రయించకుండా ఉండటాన్నే **'అనన్యభక్తి'** అంటారు.

**సూ॥ పూజాది ష్వనురాగ ఇతి పారాశర్యః (16) కథాదిష్వితి గర్గః (17) ఆత్మరత్య విరోధేనేతి శాండిల్యః (18) నారదస్తు తదర్పితాఖిలాచారతా తద్విస్మరణే పరమ వ్యాకులతేతి (19) అస్త్యేవమేవం(20) యథావ్రజ గోపికానాం (21)** (నా.భ సూత్రాలు)

భక్తి అంటే పూజ మొదలైన వాటిపై ఇష్టం ఉండడం. భగవంతుడి కథలపట్ల ఆసక్తి కలిగి ఉండడం. భగవంతుడికి సేవ చేయకపోతే ఉండలేకపోవడం. లోకంలో భక్తిస్థితి ఇలాగే ఉంటుంది. బృందావన ధామంలో ఉండే గోపికలకి, శ్రీకృష్ణుడి మీద ఇలాంటి అనన్య భక్తే వుంది. అసలు నిజమైనభక్తి అంటే ఇదే.

ప్రేమ స్వరూపం. అది అనిర్వచనీయమైంది. ఒక మూగవాడు మధురమైన పదార్థాన్ని తిని, దాని మాధుర్యాన్ని అనుభవించగలడే గానీ, నోటితో చెప్పలేడు కదా! అలాగే ప్రేమతత్త్వం కూడా అనుభవించటమే గానీ, ఏ రకంగానూ వ్యక్తపరచలేరు. ఇలాంటి ప్రేమతత్త్వం వేలమందిలో ఏ ఒక్కడిలో మాత్రమే ప్రకాశిస్తుంది.

ఈ భక్తి సత్త్వరజస్తమో గుణాలకి అతీతంగా ఉంటుంది. ప్రతిక్షణం వృద్ధి చెందుతుంది. అవిచ్ఛిన్నంగా, సూక్ష్మతరంగా ఉంటుంది. కేవలం అనుభవంతో మాత్రమే ఎవరికివారు దీన్ని తెలుసుకోగలరు. ఇలాంటి ప్రేమాత్మిక భక్తిని పొందినవాడు పరమాత్మని నిత్యం దర్శిస్తాడు. ఆయన గురించే వింటాడు, ఆయన గురించే మాట్లాడతాడు. ఆయన గురించి నిరంతరం ఆలోచిస్తాడు.

ఇతరులని హింసించి, తనకు తానే గొప్ప ధర్మాత్ముడనని, భక్తుడనని, అహంకారంతో విర్రవీగేవాడు, ఇతరుల గొప్పతనాన్ని చూడలేనివాడు. భక్తిని కలిగి ఉంటే అలాంటివాణ్ణి **తామసభక్తుడు** అంటారు.

కొందరు పరమాత్మకి తనకి భేదం ఉందని, ఆయన, తాను వేరని భావిస్తూ సుఖభోగాలు, కీర్తిప్రతిష్ఠలు పొందాలనే కోరికతో, విగ్రహరూపంలో ఉన్న పరమాత్మని ఆరాధిస్తుంటారు. ఇలాంటి వాళ్ళని **రాజసభక్తులు** అంటారు.

తన పాపాల్ని క్షయం చేసుకోవటం కోసం, తానుచేసే ప్రతి కర్మనీ పరమాత్మకే సమర్పించేవాడు, శాస్త్రం విధించిన కర్మలని నిష్కామంగా ఆచరించేవాడు **సాత్త్వికభక్తుడు.**

పరమాత్మ సంపూర్ణ అనుగ్రహాన్ని పొందాలనుకునేవాడు సాటి మనుషుల్లో, జంతువుల్లో, పరమాత్మని దర్శించి వాళ్ళని కూడా పరమాత్మ స్వరూపాల్లాగానే భావించి వారిమీద తన భక్తిప్రపత్తులు చూపించాలి. ఆకలితో ఉన్న యాచకుణ్ణి తిరస్కరించి గుళ్ళో ఉన్న దేవుడికి నైవేద్యం పెడితే ఎలాంటి ఫలితం ఉండదని సాక్షాత్తు కపిలముని అవతారం ధరించిన శ్రీమహావిష్ణువు ప్రబోధించాడు.

మానవులు ఏ మార్గాన్ని అనుసరించినా ఆ మార్గాలన్నీ మెల్లమెల్లగా వారిని పరమేశ్వరుడివైపు నడిపించాలి.

భగవంతుణ్ణి పూజించడానికి రెండు విధానాలు ఉన్నాయి. 1. సగుణారాధన 2. నిర్గుణారాధన. ఈ రెండూ వేరు వేరుగా అన్పిస్తున్నా ఒకరకంగా చెప్పాలంటే ఈ రెండూ పరస్పరం పూరకాలే. ఏ మార్గాన్ననుసరించినా భగవంతుడిపై ఏకాగ్రత ముఖ్యం.

✦ ✦ ✦

# నవవిధ భక్తి మార్గాలు

అలా పరమాత్మను చేరుకోవాలని సంకల్పించిన వారికి తొమ్మిది రకాలైన మార్గాలను భాగవతం చూపిస్తోంది.

**శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం, పాదసేవనమ్,**
**అర్చనం వందనం దాస్యం సఖ్యం ఆత్మనివేదనమ్.**

**శ్రవణం:** పరమాత్మకి (తన ఇష్టదైవం) చెందిన విషయాలని ఎవరైనా ప్రవచనం చేస్తుంటే వినటం, అలాగే పరమాత్మ గుణగణాలని స్తుతిస్తూ ఎవరైనా మధురంగా గానం చేస్తుంటే, ఆ గీతాలని శ్రద్ధగా ఆలకించటం శ్రవణభక్తి.

**కీర్తనం:** భగవంతుడి లీలావిలాసాలని, గుణగణాలనీ శ్రవణ పేయంగా భక్తిభావంతో కీర్తించటం అనగా పాడటం.

**స్మరణం:** పరమాత్మ నామాన్ని, రూపాన్ని, గుణగణాల్ని, లీలావిలాసాల్ని గ్రంథాల ద్వారా, మహాత్ముల ప్రసంగాల ద్వారా తెలుసుకుని, వాటిని పదేపదే స్మరించడం. దీన్నే స్మరణభక్తి అంటారు.

**పాదసేవనం:** పరమాత్మ దివ్యపాదాలని త్రికరణశుద్ధిగా భక్తిభావంతో అర్చించటం.

**అర్చనం:** భగవంతుణ్ణి వివిధరకాలుగా పూజించడం.

**వందనం:** నమస్కారం చేయటం. ప్రతిరోజూ నియమంగా తన ఇష్టదైవానికి భక్తితో నమస్కారం చేయాలి. ఆలయాలలోనైతే స్వామి ముందర సాష్టాంగ నమస్కారం చేసి **"అన్యధాశరణం నాస్తి త్వమేవ శరణం మమ"** – స్వామీ నేను ఎవర్నీ శరణు వేడుకోలేను. నాకు నువ్వే శరణం అని వేడుకోవాలి. దీన్నే నమస్కార భక్తి అంటారు.

**దాస్యం:** పరమాత్మకి దాసుడిగా సేవకుడిగా మారిపోవటం. రామాయణంలో శ్రీరాముడికి హనుమంతుడు సేవ చేసినట్టుగా, తాను పూజించే ఇష్టదైవాన్ని ప్రతి ఒక్కరిలో చూస్తూ, వారికి తాను చేయగలిగిన సేవల్ని ఆ పరమాత్మకే చేస్తున్నానని భావిస్తూ చేయాలి.

**సఖ్యం:** పరమాత్మతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉండటమే సఖ్యభక్తి.

**ఆత్మనివేదనం:** ఇది తొమ్మిదిరకాల భక్తిమార్గాలలో ఎంతో గొప్పది. తనను తాను పరమాత్మసేవకి అర్పించుకోవటం, నాది ఏదీ లేదు. అంతానీవే, అన్నీ నీవే, నీవుతప్ప

మరేదీ ఈ లోకంలో లేదు అనే అనన్యభావన కలిగి ఉండటం ఆత్మనివేదన. పరమాత్మ అనుగ్రహాన్ని పొందాలనుకునేవాళ్ళు ఈ తొమ్మిదిరకాల భక్తిమార్గాల్లో దేన్నైనా అనుసరించవచ్చు.

**మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,**
**మామే వైష్యసి యుక్త్వైనమ్ ఆత్మానం మత్పరాయణః.** (భగవద్గీత 9-34)

అర్జునా! నువ్వుకూడా నామీదే నీ మనస్సుని లగ్నం చెయ్యి, నా భక్తుడివికా! నన్నే పూజించు, నాకు నమస్కరించు. ఈ విధంగా నీ ఆత్మని నాలోని ఉంచి మత్పరాయణుడివైతేనే, నన్ను చేరుకుంటావు (మోక్షాన్ని పొందగలవు).

దివ్యమైన నా చతుర్భుజ రూపాన్ని ప్రత్యక్షంగా చూడటానికి, తత్త్వజ్ఞానాన్ని పొందటానికి, వాటితో ఏకీభావ స్థితిని పొందటానికి కేవలం అనన్యభక్తి మాత్రమే సాధనం. తాను చేసే కర్తవ్యకర్మల్ని అన్నిటినీ నాకే సమర్పించినవాడు, మత్పరాయణుడు, నామీద భక్తిప్రపత్తులు కలిగినవాడు, ప్రాపంచిక విషయాల మీద ఏమాత్రం ఆసక్తి లేనివాడు, ఏ ప్రాణి మీదా వైరభావం లేనివాడు అయిన అనన్యభక్తుడు మాత్రమే నన్ను పొందగలడు (11-55). పరమాత్మనైన నామీదే ఏకాగ్రచిత్తంతో ఉంటూ, నా భజన, ధ్యానాలలో నిమగ్నులైనవారు, గొప్ప శ్రద్ధాభక్తులతో సగుణరూపంలో (సాకారంగా) నన్ను ఆరాధించే వారు నిజమైన భక్తులు. ఈ భక్తులే శ్రేష్ఠమైన యోగులు (12-2).

పరమాత్మ మీద ఏకాగ్రమైన మనస్సు నిలిపి, ప్రసన్నుడైన యోగి, దేనికోసం బాధపడడు. దేన్నీ కావాలని కోరుకోడు. సమస్త ప్రాణుల్నీ సమభావంతో చూస్తాడు. అలాంటి యోగి మాత్రమే నా పరాభక్తిని పొందుతాడు.

నాకు ఇష్టం కలిగే పుణ్యకర్మల్ని ఆచరిస్తూ ఉండే వాడికన్నా మించిన భక్తుడు ఎవరూ ఉండరు. అనన్యభక్తితో నన్ను సేవించేవాడి కన్నా ప్రియమైనవాడు, నాకు భూమండలంలో ఎవడూలేడు. భవిష్యత్తులో ఉండబోడు అని శ్రీకృష్ణుడి హితబోధ.

✦ ✦ ✦

# జ్ఞానయోగం

అన్నిరకాల పదార్థాలలో చైతన్యరూపంగా ఉన్న ఆ పరబ్రహ్మమే తాననీ, పరబ్రహ్మ కన్నా వేరైన (తనతో సహా) వస్తువు మరేదీలోకంలో లేదని ప్రత్యక్షంగా అనుభవించటమే (భావించటమే) **'జ్ఞానం'.**

సకలజీవుల్లో చైతన్యంగా ఆ పరబ్రహ్మ కొలువై ఉన్నాడు. అలాంటి పరమాత్మని – దేవతలు, జంతువులు, పక్షులు, మానవులు, స్థావరాలు, జంగమాలు, స్త్రీలు, పురుషులు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అని వేరువేరుగా భావిస్తూ, తాము వేరు పరమాత్మ వేరు అనుకుంటూ, బంధమోక్షాలకి కారణమైన ఆ పరమాత్మ, వివిధ రూపాల్లోని ఉన్నాడని భ్రమపడటమే అజ్ఞానం, సర్వత్రా నిండి ఉన్న పరమాత్మ ఒక్కడే అనుకోవటం జ్ఞానం.

ఇలాంటి జ్ఞాని పొందిన భావనే సాత్త్వికజ్ఞానం. సమస్త ప్రాణుల్లో వివిధ రకాలైన భావాలని దేనికదే వేరు అని భావించే జ్ఞానాన్ని **రాజసికజ్ఞానం** అంటారు (18–21). ఎవడు ప్రకృతి కార్యరూపమైన తన శరీరమే సమస్తమని, శరీర సుఖమే ముఖ్యమని, ఇది శాశ్వతమని, అర్థరహితంగా, అహేతుకంగా భావించడాన్ని **తామసజ్ఞానం** అంటారు (18–22). ఈ మూడురకాల జ్ఞానాలలో **సాత్త్వికజ్ఞానం** గొప్పది.

వివిధరకాల ద్రవ్యాలతో (వస్తువులతో) చేసే యజ్ఞం కన్నా జ్ఞానయజ్ఞం ఎంతో గొప్పది. అన్నిరకాల కర్మలూ జ్ఞానంతోనే పరిసమాప్తమవుతాయి. తత్త్వం దర్శించిన జ్ఞానుల దగ్గరకి(గురువులు)వెళ్ళి, వాళ్ళకి నమస్కారాలు, సేవలు చేసి భక్తిశ్రద్ధల్ని ప్రదర్శిస్తే, ఆ జ్ఞానులు సంతోషించి, పరమాత్మ తత్త్వజ్ఞానాన్ని ఉపదేశిస్తారు (4–34). పరమాత్మ తత్త్వజ్ఞానాన్ని తెలుసుకుంటే – ఎవరూ వ్యామోహంలో చిక్కుకోరు. జ్ఞాన ప్రభావంతో సమస్త ప్రాణుల్ని తనలోనే చూడగలుగుతారు. తరువాత ఆ ప్రాణులందర్ని పరమాత్మలో చూడగలుగుతారు (4–35).

ఎంతటి మహాపాపాలు చేసినవాడైనా 'జ్ఞానం' (పరమాత్మ) అనే నౌక సాయంతో, పాపాలనే సముద్రాన్ని దాటగలడు (4–36) బాగా ప్రజ్వరిల్లే అగ్ని కట్టెల్ని భస్మం చేసినట్టుగా, జ్ఞానం అనే అగ్ని కర్మలన్నిటినీ భస్మం చేస్తుంది (4–37) ఈ ప్రపంచంలో జ్ఞానంతో సమానంగా పవిత్రమైనది మరొకటిలేదు. పరిశుద్ధమైన అంతఃకరణం కలిగిన

మానవుడు ఎలాంటి ఫలాసక్తి లేకుండా కర్మల్ని చాలాకాలం ఆచరిస్తే, చివరికి ఆత్మలో జ్ఞానాన్ని తనంతట తానే పొందగలుగుతాడు (4-38).

"తానే అందరికన్నా గొప్పవాడిననే భావం లేకపోవటం, డాంబికం లేకపోవటం, అహింస, క్షమ లాంటి మంచిగుణాలు ఉండటం, మనస్సు, మాట మృదువుగా వుండటం, శ్రద్ధాభక్తులతో గురువుల్నీ పెద్దల్నీ సేవించటం, శుచిగా ఉండటం, మనోనిగ్రహాన్ని శరీర, ఇంద్రియ నిగ్రహాల్నీ కలిగి ఉండటం, ఇంద్రియ భోగాల మీద వైరాగ్యభావంతో ఉండటం, అహంకారం లేకపోవటం, జన్మ, మృత్యువు, వార్ధకం, అనారోగ్యం వీటివల్ల కలిగే దుఃఖాల గురించి ఆలోచించటం. భార్య, బిడ్డలు, బంధువులు స్నేహితులు, ఇళ్ళు, సంపదలు, వీటిమీద మమకారం, ఆసక్తి లేకపోవటం, ఇష్టమైన వస్తువు లభిస్తే ఆనందాన్ని, లభించకపోతే బాధని పొందకుండా సమభావంతో ఉండటం (13-9). పరమేశ్వరుడి (పరమాత్మ) మీద అనన్యమైన భక్తిని కలిగి ఉండటం, పవిత్రమైన ఏకాంత ప్రదేశంలో నివసించాలనే కోరికతో ఉండటం, సుఖభోగాల్లో మునిగితేలే మనుషుల మీద వైరాగ్య భావంతో ఉండటం (13-10) జ్ఞానం పొందటానికి సాధనాలు. వీటికి వ్యతిరేకంగా ఉన్నది అజ్ఞానం.

✦ ✦ ✦

# యోగమార్గం

**'దృశ్యతే అనేన ఇతి దర్శనమ్'** అంటే పదార్థాల యథార్థ తత్త్వాన్ని ప్రమాణపూర్వకంగా చెప్పే శాస్త్రాన్ని **'దర్శనమ్'** అంటారు. దర్శనాలు రెండు రకాలు. 1.ఆస్తిక దర్శనాలు (ఇవి వేదప్రమాణాన్ని అంగీకరిస్తాయి), 2. నాస్తిక దర్శనాలు (ఇవి వేదప్రమాణాన్ని అంగీకరించవు).

1. గౌతముడు రచించిన న్యాయదర్శనం, 2.కణాదమహర్షి రచించిన వైశేషిక దర్శనం, 3. కపిలముని రచించిన సాంఖ్యదర్శనం, 4. పతంజలి మహర్షి ప్రబోధించిన యోగదర్శనం, 5. జైమినిముని చెప్పిన పూరమీమాంస, 6. వ్యాసమహర్షి బోధించిన ఉత్తరమీమాంస. ఈ ఆరూ ఆస్తికదర్శనాలు.

1. చార్వాకం, 2. జైనం, 3. సౌతాంత్రికం, 4. యోగాచారం, 5. మాధ్యమికం, 6. వైభాషికం. ఈ ఆరూ నాస్తికదర్శనాలు.

ఈ అరుదర్శనాలలో యోగదర్శనానికి ఒక ప్రత్యేకస్థానం ఉంది. యోగం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యమేకాక, ఆత్మజ్ఞానం కూడా కలుగుతుంది. అందుకే యోగశాస్త్రం గొప్పతనాన్ని వర్ణిస్తూ యోగశిఖోపనిషత్, యోగచూడామణ్యుపనిషత్, యోగతత్త్వోపనిషత్, యోగకుండల్యుపనిషత్, ధ్యాన బందూపనిషత్, నాదబిందూపనిషత్ లాంటివి ఆవిర్భవించాయి. భగవద్గీత మోక్షాన్ని పొందటానికి యోగాన్ని కూడా ఒక మార్గంగా ప్రబోధిస్తుంది..

జీవాత్మ పరమాత్మని చేరటమే మోక్షం, మానవుడు తన మనస్సుని ఏకాగ్రం చేసి పరమాత్మ మీద కేంద్రీకరించి, ధ్యానం, సమాధి, స్థితుల ద్వారా పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందవచ్చుని యోగదర్శనం ప్రబోధిస్తుంది.

యోగదర్శనంలో మొత్తం నాలుగు పాదాలు వుంటాయి.

**1.** **సమాధిపాదం –** ఇందులో సమాధి లక్ష్యం ఏమిటి? దాని లక్షణాలు ఎలా ఉంటాయి? అనే విషయాలు ఉంటాయి.

**2.** **సాధనాపాదం –** ఇది సమాధిస్థితి పొందటానికి ఎలాంటి సాధనలు చేయాలో చెప్తుంది.

3. **విభూతిపాదం –** ఇది ఏ రకమైన యోగప్రక్రియలు సాధనచేస్తే ఎలాంటి స్థితులు లభిస్తాయో వివరిస్తుంది.

4. **కైవల్యపాదం –** ఇందులో మోక్షం అంటే ఏమిటి? దాన్ని ఎలా పొందాలి? అన్న విషయాలు ఉంటాయి. ఈ యోగశాస్త్రం మొత్తం సూత్రాల రూపంలో ఉంటుంది.

**"యోగశ్చిత్త వృత్తి నిరోధః"** (1-2) మనస్సులో కలిగే రకరకాల ఆలోచనల్ని నిరోధించటాన్నే యోగం అంటారు. మానవుడు తన ఆలోచనా తరంగాలని, మూలస్థానమైన ప్రకృతిలో లయం చేయటాన్ని కూడా యోగమనే అంటారు. ఇది ఎనిమిది అంగాలతో ఉండటం వల్ల **'అష్టాంగయోగం'** అంటారు. దీనినే **'రాజయోగం'** అని కూడా అంటారు. యోగాన్ని చేయాలనుకునేవాళ్ళు ఆహారం, నిద్ర, ప్రవర్తన, మాట, చేష్ట, ఆలోచన లాంటి విషయాలలో కొన్ని నియమాలని పాటించాలి. యోగం – ఇది క్రమక్రమంగా మనిషి చిత్తవృత్తిని (మనసులో కోరికలని) నిరోధించి, ఏకాగ్రతని పెంచి నిర్వికల్ప సమాధిస్థితిని పొందేందుకు, తద్వారా మోక్షాన్ని పొందేందుకు సహాయపడుతుంది. ఈ అష్టాంగయోగంలో ఎనిమిది విభాగాలుంటాయి (ప.యో.సూ. 2-30).

**యమం:** ఇందులో కొన్ని అంగాలు ఉన్నాయి. అవి –

**అహింస:** యోగసాధన చేసేవాడు. మనసా వాచా కర్మణా ఎవర్నీ బాధపెట్టకూడదు. అలాగే ఎవర్నీ ద్వేషించకూడదు. ఆహారం కోసం జీవుల్ని చంపి తద్వారా జీవహింస చేయకూడదు. తన ఆత్మసంరక్షణ కోసమైనా ఇతరుల్ని చంపకూడదు.

**సత్యం:** అన్ని విషయాలలో అన్ని సందర్భాలలో సత్యాన్నే మాట్లాడాలి.

**అస్తేయం:** అంటే ఇతరుల వస్తువుల్ని, ధనాన్ని దొంగిలించటం. సమాజంలో జీవించే ప్రతి ఒక్కరూ ఇతరుల సొమ్ము గురించి ఆశపడకూడదు.

**బ్రహ్మచర్యం:** అంటే సంభోగసుఖాలని అనుభవించాలనే కోరిక లేకపోవటం, దానికోసం ప్రయత్నం చెయ్యకపోవటం. సాధారణంగా విద్యాభ్యాసకాలంలో వివాహానికి ముందు ప్రతి మనిషీ ఈ బ్రహ్మచర్య వ్రతాన్ని అవలంబించాలి. దానివల్ల తాను చదివే చదువు సంపూర్ణంగా అతడికి వంటబడుతుంది.

**అపరిగ్రహం:** అంటే ఇతరుల నుంచి ఏదీ స్వీకరించకుండా ఉండటం.

**నియమం:** ఇవి అయిదు.

**శౌచం:** యోగసాధకుడు శరీరమేకాదు మనస్సుని కూడా మంచి ఆలోచనలతో పవిత్రంగా చేసుకోవాలి.

**సంతోషం:** అంటే సంతృప్తి చెందటం. దొరికిన దానికి సంతోషించేవాడు ఎప్పుడూ సుఖపడతాడు.

**తపస్సు:** శరీరాన్ని బాగా కష్టపెట్టి ఉపవాసాలు చేయటం తపస్సు కాదు. అనవసర సంభాషణలు చేయకుండా నిత్యం మౌనం, జపం, ధ్యానం చేయాలి. ఇదే తపస్సు.

**స్వాధ్యాయం:** యోగాభ్యాసి సమాధిస్థితి పొందటానికి అవసరమయ్యే శాస్త్రాలని అధ్యయనం చేయటం.

**ఈశ్వరారాధన:** తనకు ఇష్టమైన దైవాన్ని ప్రతిరోజూ శ్రద్ధగా పూజించాలి. సంపూర్ణంగా భగవంతుడితో శరణాగతిని పొంది, తానుచేసే కర్మలన్నిటినీ భగవదర్పణం చేయాలి.

## ఆసనం

యోగాభ్యాసం చేసేవాడికి ఆసనశుద్ధి ఉండాలి. ఆసనం అంటే తాను కూర్చునే భంగిమ స్థిరంగా, సుఖంగా వుండాలి. శరీరం నిటారుగా నిలిపి ఉంచే పద్మాసనం, సిద్ధాసనం, వజ్రాసనం లాంటివి అభ్యాసనం చేస్తే, క్రమక్రమంగా సాధకుడికి ఆసనసిద్ధి లభిస్తుంది. ఆసనసిద్ధి ఉంటేనే సాధనకు ఏకాగ్రత, మనోనిశ్చలత కలుగుతాయి. ఆసనసిద్ధి అంటే 3 గంటలు ఒకే ఆసనంలో కూర్చోగలగటం.

**ప్రాణాయామం: తస్మిన్‌సతి శ్వాసప్రశ్వాసయో ర్గతివిచ్ఛేదః ప్రాణాయామః** (ప.యో.సూ. 2-49). ప్రాణవాయువు సంచారాన్ని నియంత్రించటమే ప్రాణాయామం. ఈ ప్రాణాయామంలో ప్రధానంగా మూడు విభాగాలుంటాయి. 1.పూరకం. అంటే గాలిని పీల్చటం. 2.కుంభకం. అంటే పీల్చిన గాలిని లోపలే ఉంచటం. 3. రేచకం. అంటే కుంభించిన గాలిని నెమ్మదిగా విడిచిపెట్టటం. ప్రాణాయామంలో ఎన్నోరకాల బేధాలు కూడా ఉన్నాయి. వాటిని సరైన గురువుద్వారా మాత్రమే అభ్యసించాలి. ప్రాణాయామాన్ని అభ్యసించటం వల్ల మనిషి శరీరంలో ఉన్న 72000 నాడులన్నీ శుభ్రపడతాయి. దీనివల్ల మనస్సు స్థిరంగా ఉంటుంది. తద్వారా ఏకాగ్రత కుదురుతుంది. ముఖ్యంగా నాడులు శుద్ధి అవటంవల్ల ఆసనసిద్ధి కూడా సాధకుడికి లభిస్తుంది.

**ప్రత్యాహారం: "స్వవిషయా సంప్రయోగే చిత్త స్వరూపానుకార ఇవ ఇంద్రియాణాం ప్రత్యాహారః"** (ప.యో.సూ. 2–54). ఇంద్రియాలను వాటి విషయాల నుంచి వెనక్కిలాగి అంతర్ముఖం చేయటమే ప్రత్యాహారం. ప్రాణాయామం ద్వారా చిత్తచాంచల్యాన్ని అరికట్టగలిగిన సాధకుడు, ఇంద్రియ సుఖాలవైపు తన మనస్సుని పోనీక, అవలీలగా దాన్ని అంతర్ముఖం చేసి లోపలున్న పరంజ్యోతిని దర్శించగలుగుతాడు.

**ధారణ: "దేశబంధః చిత్తస్య ధారణా** (ప.యో.సూ. 3–1). సాధకుడు ఏదైనా ఒక వస్తువుమీద గానీ, ఒక ధ్యేయం మీదగానీ, మనస్సును స్థిరంగా నిలపటాన్నే ధారణ అంటారు. యోగాభ్యాసి తాను ధ్యానం చేసేటప్పుడు తన మనస్సుని భృకుటి మధ్యలోగానీ, హృదయం మీదగానీ, నాభిస్థానంలోగానీ లేదా తనలో నుంచి వినిపించే అనాహతనాదం మీదగానీ స్థిరంగా ఉంచే ప్రయత్నం చేయాలి. ఇలా ధారణ చేయగలిగినవాడు యోగసిద్ధిని అచిరకాలంలోనే పొందుతాడు.

**ధ్యానం: తత్ర ప్రత్యైక తానతా ధ్యానమ్** (ప.యో. 3–2). సాధకుడు ధ్యేయమైన వస్తువు మీద తన మనస్సుని కొంత సేపు ఏకధాటిగా కేంద్రీకరించటమే ధ్యానం. ఈ ధ్యానస్థితిలో ఉన్నప్పుడు సాధకుడి మనోతరంగాలు ధ్యేయమైన వస్తువు మీద (పరమాత్మ) ప్రవహిస్తాయి. ఆ సమయంలో అతడి మనస్సు ఎంతో ప్రశాంతంగా ఆలోచనారహితంగా మారిపోతుంది. అదే పరమసుఖం. ఈ ధ్యానం మంత్రసహితంగా, మంత్రరహితంగా కూడా ఉంటుంది. కొందరు ఏదో ఒక మంత్రాన్ని మనస్సులో ధ్యానం చేస్తుంటారు. మరికొందరు ఏ మంత్రాన్నీ అనుకోకుండా, కేవలం కనిపించే దాన్ని చూస్తూ (కళ్ళు మూసుకుని) నిర్వికారంగా ధ్యానం చేస్తారు.

**సమాధి: తదేవారమాత్రా నిర్భాసం స్వరూప శూన్యమివ సమాధి** (ప.యో.సూ. 3–3). అష్టాంగయోగంలో చివరిది సమాధి, ఈ స్థితి యోగాభ్యాసికి చాలా గొప్పది. సాధకుడు తన మనస్సుని ధ్యేయంతో (పరమాత్మతో) తాదాత్మ్యం చేయించటాన్నే సమాధి అంటారు. ఈ సమాధిస్థితిలో అతడి మనస్సులో కేవలం పరమాత్మ మాత్రమే ప్రకాశిస్తూ ఉంటాడు. ధ్యానం చేసేవాడు, ధ్యానం, ధ్యేయం (పరమాత్మ) ఈ మూడు ఒక్కటిగా ఏర్పడిన స్థితే సమాధి. ఇలాంటి స్థితిలో సాధకుడికి భగవంతుడి సాక్షాత్కారం కలుగుతుంది. దాన్నే మోక్షం లేక ముక్తి అంటారు.

**సలిలే సైన్ధవం యద్వత్సామ్యం భవతి యోగతః,**
**తథాఽఽత్మ మనసోరైక్యం సమాధి రితి కథ్యతే.**

నీళ్ళలో ఉప్పు కలిసిపోయినట్టుగా ఆత్మ-మనస్సు ఈ రెండూ కలిసిపోవటాన్నే 'సమాధి' అంటారు. ఈ యమనియమాలను కేవలం యోగాభ్యాసపరులే కాదు, సనాతనధర్మాన్ని పాటించాలని భావించే ప్రతిఒక్కరూ ఆచరించాలి.

## యోగి నియమాలు

సాధకుడు యోగం ద్వారా తనకు కలిగిన సిద్ధుల్ని ఎవరికీ తెలియచేయకుండా రహస్యంగా ఉంచుకోవాలి. అందుకోసం అవసరమైతే మూర్ఖుడిలా, చెవిటివాడిలా ప్రవర్తించాలి. నిరంతరం అభ్యాసం లేకపోవటంవల్ల, అనవసరమైన విషయాల గురించి ఇతరులతో మాట్లాడటంవల్ల, యోగం ఎప్పటికీ సిద్ధించదు. కనుక యోగి కావాలనుకునేవాడు ఎలాగైనా ప్రయత్నంచేసి క్రమం తప్పకుండా యోగాభ్యాసం చేయాలి. యోగసాధకుడికి కూడా పూర్వజన్మ పాపాలు బాధిస్తుంటాయి. ఆ పాపాల్ని పోగొట్టుకోవాలంటే, ప్రతిరోజూ ఓంకారాన్ని జపించాలి అని యోగతత్త్వోపనిషత్ చెబుతుంది.

ధ్యానయోగాన్ని అభ్యసించే సాధకుడు "ఊర్ధ్వరేతుడు (కామరహితుడు) విరూపాక్షుడు, విశ్వరూపుడు, యోగీశ్వరులకి ఈశ్వరుడు అయిన పరమాత్మే తానని, తాను అతడు వేరుకాదని" భావిస్తూ ధ్యానంచేయాలి.

యోగసాధకుడు ధ్యానానికి అనుకూలమైన పద్మాసనం, స్వస్తికాసనం, భద్రకాసనం లాంటి ఆసనాలలో తనకు వీలైన ఆసనాన్ని వేసుకుని ఉత్తరదిక్కుగా ముఖాన్ని ఉంచి ధ్యానాన్ని చేయాలి. బ్రహ్మస్వరూపం ఏకాక్షరం అయిన 'ఓం'కారం పఠిస్తూ (మనసులో) బ్రహ్మధ్యాన పూర్వకంగా రేచకాన్ని చేయాలి. ఇలా ప్రతిరోజూ వీలైనన్ని సార్లు రేచకాలు (పూరకాలు కూడా) చేస్తూ ఉంటే మనసులో ఉన్న మలినాలన్నీ తొలగిపోతాయి. ఈ విధంగా సాధకుడు ప్రాణాయామంతో పాటు, ఓంకార జపాన్ని ధ్యానాన్ని చేయాలి. ధ్యానం చేసే యోగి భయాన్ని, కోపాన్ని, సోమరితనాన్ని, అతినిద్రని, అతిజాగారాన్ని, అధికాహారాన్ని, అల్పాహారాన్ని వదిలిపెట్టాలి. తన దృష్టిని అడ్డంగా, నిలువుగా, అటుఇటూ ప్రసరించకుండా ఉంచి నిశ్చలంగా శరీరాన్ని నిలిపి, స్థైర్యంతో నిత్యం యోగాభ్యాసాన్ని చేయాలి.

✦ ✦ ✦

# ధ్యానం

ధ్యానానికే 'ఆత్మసంయమనం' అనీ వ్యవహారం. ఆత్మయందే దృష్టి నిలిపి, ఆత్మసుఖాన్ని పొందడం ధ్యానం. శ్రీకృష్ణుడు ధ్యానం అంటే ఏమిటో చాలా విపులంగా చెప్పాడు భగవద్గీతలో.

యోగి అయినవాడు ఒక రహస్య ప్రదేశంలో ఒంటరిగా ఉండాలి. మనస్సునూ శరీరాన్నీ తన వశంలో ఉంచుకోవాలి. కోరికలూ, ధనమూ లేనివాడై ఉండాలి. అంతఃకరణం ఏకాగ్రతతో ఉండేలా చూసుకోవాలి (6–10). పవిత్రమైన ప్రదేశంలో ఎక్కువ ఎత్తుగా గానీ పల్లంగా కానీ లేని స్థిరమైన ఆసనాన్ని ఏర్పాటు చేసుకోవాలి. దానిపై జింకచర్మమూ, వస్త్రమూ ఒకదానిపై ఒకటి పరచి ఉంచాలి. ఆ ఆసనంపై కూర్చొని ఇంద్రియాల వ్యాపారాన్ని నియంత్రించి, మనస్సును ఏకాగ్రంగా పెట్టి, ఆత్మశుద్ధికోసం యోగాభ్యాసం చేయాలి. శరీరమూ, మెడా, శిరస్సూ నిటారుగా ఉంచి, ముక్కుచివర దృష్టి నిలిపి, దిక్కులు చూడకుండా, ప్రశాంతమైన చిత్తంతో బ్రహ్మచారి పాటించే నియమాల్ని పాటిస్తూ, మనస్సును నియంత్రించి, చిత్తాన్ని నాపైనే ఉంచి, నన్నే అత్యుత్తమ లక్ష్యంగా భావించి ధ్యానం చెయ్యాలి.

**నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాన్తమనశ్నతః,**
**న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున.** (6–16)

అతిగా తినేవాడికీ, అస్సలు తినని వాడికీ, అలాగే అతిగా నిద్రించేవాడికీ అసలు నిద్రపోనివాడికీ యోగం కుదరదు. తగినంత తిండీ, నిద్రా కలవాడికి యోగం చిక్కుతుంది.

చిత్తం ఆత్మపైనే స్థిరంగా ఉంటే ఏ కోరికా ఉండదు. ఈ స్థితికి చేరినవాడినే 'యుక్తుడు' అంటారు. ఈ యోగి – గాలి లేని ప్రదేశంలో నిశ్చలంగా ఉన్న దీపం లాంటివాడు. ఇతడు ఆచరించేదే యోగం. సమస్త దుఃఖాలతో సంబంధాన్ని పూర్తిగా విడిచిపెట్టి, ఈ యోగాన్ని దృఢంగా అనుష్ఠించాలి.

సంకల్పంవల్ల పుట్టిన కోరికలను పూర్తిగా విడిచిపెట్టి, ఇంద్రియాల్నీ మనస్సునూ అన్నివైపులా కట్టడి చేసి, ధైర్యంతో బుద్ధిని నిలబెట్టి, మెల్ల మెల్లగా విషయాలనుండి మరలిపోవాలి. మనస్సును ఆత్మపైనే నిలపాలి. ఏ వస్తువు గురించీ ఆలోచించకూడదు.

అంతటా ఒకేలా ఉన్న బ్రహ్మను సమదృష్టితో దర్శించాలి. అప్పుడు తానే సకల భూతాలలో ఉన్నాననీ, సకల భూతాలూ తనలోనే ఉన్నాయనీ దృష్టి కలుగుతుంది.

అలా అంతటా నన్నే చూస్తూ, సమస్తమూ నాలోనే దర్శించేవాడికి నేను ఎన్నడూ దూరం కాను. అతడు నాకు దూరం కాడు. అతడూ నాలోనే ఉంటాడు.

**ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున,**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః.** (6-32)

అన్యప్రాణుల సుఖదుఃఖాల్ని తన సుఖదుఃఖాల్లాంటివే అని భావించే యోగి మహాత్ముడు. ఈ స్థితికి రావాలంటే చంచలమైన మనస్సును నిగ్రహించాలి. అది చాలా కష్టంతో కూడుకొన్న పని. అయినా అభ్యాసవైరాగ్యాల చేత నిగ్రహించవచ్చు. ముందు అంతఃకరణాన్ని నిగ్రహించుకోవాలి. అది చెయ్యనివాడు యోగాన్ని సాధించలేడు. శ్రద్ధ ఉంటే సరిపోదు. ప్రయత్నమూ ఉండాలి.

శ్రద్ధ ఉండీ, ప్రయత్నం లేక యోగం మీద ఏకాగ్రతను కోల్పోయినవాడు మళ్ళీ జన్మిస్తాడు. అయితే పవిత్రులైన శ్రీమంతుల ఇంట్లోగానీ, యోగుల కులంలో గానీ పుడతాడు. పుట్టి, పూర్వజన్మ జ్ఞానంతో మళ్ళీ యోగాభ్యాసం చేస్తాడు. అతడికి ఇష్టం ఉన్నా లేకపోయినా పూర్వజన్మ సంస్కారం అటువైపు లాగుతుంది.

కాబట్టి యోగాన్ని తెలుసుకోవాలన్న అభిలాష ఉంటే చాలు. యోగమార్గంలో సాధనచేసే యోగికి పాపాలు అవే తొలగిపోతాయి. అనేక జన్మలలో కలిగిన యోగసంసిద్ధితో చివరికి ఉత్తమగతిని పొందుతాడు.

# ప్రాణాయామం

**స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్ చక్షుశ్చైవాంతరే భ్రువోః,**
**ప్రాణాపానౌ సమౌకృత్వా నాసాభ్యంతర చారిణౌ.**

**యతేంద్రియ మనోబుద్ధిః మునిర్మోక్ష పరాయణః,**
**విగతేచ్ఛా భయ క్రోధో యః సదా ముక్త ఏవ సః.**

(భగవద్గీత. 5-27,28)

మానవుడు బాహ్యవిషయ సుఖాలు, భోగాలు గురించి ఆలోచించకుండా వుండాలి. కళ్ళు మూసుకుని తన దృష్టిని రెండు కనుబొమల మధ్యా స్థిరంగా వుంచాలి. ముక్కు రంధ్రాల్లో ప్రవహిస్తున్న ప్రాణ-అపాన వాయువుల్ని సమస్థితిలో నడపాలి (అంటే సరళంగా శ్వాసని పీల్చటం వదలటం చేయాలి). ఇలాంటి యోగప్రక్రియని ఆచరించటం వల్ల సాధకుడి మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు అతడి వశమవుతాయి. ఇలాంటి సాధన వల్ల ఆ యోగి ఇచ్ఛా భయ క్రోధాల్ని విడిచిపెట్టి మోక్షాన్ని పొందుతాడు.

లోకంలో కొందరు యోగులు ప్రాణవాయువులో అపానవాయువుని, మరికొందరు అపాన వాయువులో ప్రాణవాయువుని హవనం చేస్తారు. ఇంకొందరు నియమపూరిత సాత్త్విక ఆహారాన్ని తీసుకుంటూ ప్రాణయామాన్ని చేస్తారు. అలాగే ప్రాణ అపాన గమనాన్ని నిలిపివేసి (కుంభకం చేసి) ప్రాణాన్ని ప్రాణంలోనే హవనం చేస్తారు. ఈ విధంగా ప్రాణాయామం అనే యజ్ఞాన్ని ఆచరించి తమలో ఉన్న పాపాల్ని పోగొట్టుకుంటారు.

✦ ✦ ✦

# కర్మయోగం

జీవాత్మ – పరమాత్మ – శరీరం ఈ మూడింటిని పరిశీలిస్తే జీవాత్మతో ఒకవైపూ పరమాత్మతో మరోవైపు శరీరం సంబంధం కలిగి ఉన్నట్లు అర్థమవుతుంది.

పరమాత్మ – ప్రతి జీవునిలోనూ నివసిస్తూ ఆత్మను ప్రకాశమానం చేస్తాడు. అలాగే ఆ ఆత్మ ఆశ్రయించి ఉన్న దేహాన్ని కూడా ప్రకాశింప జేస్తాడు.

ఆత్మ మన కంటికి కన్పించదు. కానీ కంటికి కన్పించే అనేకరకాలయిన రూపాలను అది స్వీకరిస్తుంది.

ఆత్మ ఆశ్రయించడం వల్లనే మానవుడనీ, పశువనీ, వృక్షమనీ ఇలా వివిధ ఆకారాల్ని మనం గుర్తించగలుగుతున్నాం. అంటే జీవాత్మ శరీరాన్ని ఆశ్రయిస్తూ వివిధ రూపాలను పొందుతోంది.

అదేవిధంగా పరమాత్మ ఒకేసారి అసంఖ్యాకమైన ఆత్మలుగా ఏర్పడుతుంది. విశ్వాత్మకమైన ఈ పరమాత్మకు ప్రతి జీవాత్మ ఒక అంగం. కానీ జీవాత్మలన్నీ ఒక్కటే. దీనివల్ల ఆత్మ సమగ్రతకూ సంపూర్ణత్వానికీ ఏ మాత్రం భంగం కలగదు.

జీవాత్మకీ పరమాత్మకీ ఉన్న సంబంధం గురించి ఎవరి అభిప్రాయాలు వారికి ఉన్నాయి కానీ కర్మ సిద్ధాంతాన్ని అందరూ అంగీకరించారు. ఈ కర్మమే జీవాత్మను నడిపిస్తుంది. బంధాలను కలిగిస్తుంది.

ప్రతి కర్మకూ ఒక ఫలం ఉంటుంది. ఆ కర్మఫలాన్ని ఒక జన్మలో కాకపోతే మరో జన్మలో అనుభవించాలి. అందుకోసం మళ్ళీ జన్మ ఎత్తక తప్పదు. మరి ఈ బంధం పోవాలంటే – మనం చేసే కర్మఫలం మనకు రాకుండా ఉండాలి. దానికి శ్రీకృష్ణ పరమాత్మ చూపిన దివ్యమైన మార్గమే కర్మయోగం.

భగవంతుని సనాతనమైన అంశమే లోకంలో జీవుడిగా ఉంది. ఆ జీవాత్మ తమ తమ స్థానాలలో ఉన్న ఇంద్రియాలనూ మనస్సునూ తనవైపు లాక్కుంటుంది.

శరీరం మొదలైన వాటికి జీవుడే ప్రభువు. ఆ జీవుడు ఒక శరీరాన్ని విడిచి వేరొక శరీరంలోనికి వెళ్తుంటాడు. అలా వెళ్ళేటప్పుడు పుష్పపరిమళాన్ని మోసుకుపోయే వాయువు లాగా మనస్సునూ ఇంద్రియాలనూ తీసుకొని వెళ్ళిపోతాడు. ఈ జీవుడే పంచేంద్రియాలతోనూ ఆరవదైన మనస్సుతోనూ విషయాలను అనుభవిస్తాడు (15–8, 9).

జీవాత్మ ఆశ్రయించిన శరీరాన్నే క్షేత్రం అంటారు. ఈ క్షేత్రం గురించి తెలిసినవాడు క్షేత్రజ్ఞుడు. అన్ని క్షేత్రాలలోనూ నేనే క్షేత్రజ్ఞుణ్ణి. ఈ రెండింటి గురించిన జ్ఞానం అంటే నా గురించిన జ్ఞానమే. పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, అవ్యక్తం, పది ఇంద్రియాలు, మనస్సు, ఇంద్రియాలు గ్రహించే శబ్దాదులైన ఐదు విషయాలూ, అలాగే ఇచ్ఛ, ద్వేషం, సుఖం, దుఃఖం, దేహేంద్రియాల సముదాయం, జ్ఞానం, ధైర్యం మొదలైన వాటితో కూడిన దాన్నే క్షేత్రం అంటారు.

ప్రకృతికీ పురుషుడికీ ఆది అనేది లేదు. బుద్ధి, దేహం, ఇంద్రియాలనే వికారాలు, సుఖదుఃఖ మోహాదులుగా మారిన త్రిగుణాలుకూడా ప్రకృతి నుండే ఏర్పడ్డాయి. ప్రకృతే శరీరాన్నీ ఇంద్రియాల్నీ పుట్టించడానికి హేతువైతే, ఈ పురుషుడే సుఖదుఃఖాలను అనుభవించడానికి హేతువౌతున్నాడు (13-19,20).

పురుషుడు ప్రకృతిలోనే ఉంటాడు. ప్రకృతే పరమాత్మ అని అనుకొంటాడు. ప్రకృతి వల్ల పుట్టిన గుణాలను అనుభవిస్తూ ఉంటాడు. ఈ గుణాలతో ఏర్పరచుకొన్న సంబంధమే పురుషుడు పొందే జన్మలకు కారణం అవుతుంది. అంటే పురుషుడు ఉత్తమ - అధమజన్మలను పొందడానికి ఈ గుణసంసర్గమే హేతువు (13-21).

ప్రతి మనిషికీ వర్ణాశ్రమ ధర్మాలను అనుసరించి శాస్త్రం విధించిన కర్తవ్యాల్నే మనం కర్మలుగా భావించవచ్చు. ఈ కర్మలన్నీ జీవుడికి బంధాన్ని కలిగిస్తాయి. ఫలితంపై వ్యామోహం లేకుండా కర్మల్ని ఆచరించాలి. ఇదే నిష్కామకర్మ. దీనివల్ల చిత్తశుద్ధి, జ్ఞానం లభిస్తాయి. తద్ద్వారా జన్మరాహిత్యం కలుగుతుంది. ఇలా కాని పక్షంలో - అజ్ఞానం. దానివల్ల పునర్జన్మ.

అందుకని కర్మలనుండి దూరంగా ఉండమని కర్మయోగం చెప్పదు. సంసారంలో ఉంటూనే ప్రతిఫలంపై దృష్టి లేకుండా కర్మల్ని ఆచరించమని బోధిస్తుంది. అంటే ఈ పనిని 'నేనే చేస్తున్నాను' అన్న భావన పోవాలి. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చెయ్యాలి. ఫలం సిద్ధించినా సిద్ధించకపోయినా ఒకేలా ఉండాలి.

కొందరు విపరీతమైన కోరికలతో స్వర్గమే లక్ష్యంగా కర్మల్ని ఆచరించమని చెప్తారు. దాని వల్ల మళ్ళీ మళ్ళీ జన్మలు తప్పవు. ఆ మాటలు వింటే మనస్సుకు భోగాలపైనా, ఐశ్వర్యంపైనా ఆసక్తి కలుగుతుంది.

**కర్మణ్యేవాధిఽ_కారస్తే మా ఫలేషు కదాచన,**
**మా కర్మఫలహేతుర్భూ ర్మా తే సంగోఽ_స్త్వకర్మణి.** (2-47)

కర్మను ఆచరించడానికి మాత్రమే నీకు అధికారం ఉంది. ఫలంపై లేదు. కర్మఫలాలైన పాపపుణ్యాలకు నీవు కారణం కాకూడదు. అలా అని కర్మను త్యజించనూ కూడదు.

అమితమైన ఆసక్తిని విడిచి ఫలం సిద్ధించినా, సిద్ధించకపోయినా ఒకే విధంగా ఉంటూ నేర్పుగా కర్మల్ని ఆచరించడమే కర్మయోగం.

ఒక్క క్షణం కూడా ఎవ్వడూ ఏ పనీ చేయకుండా ఉండలేడు. ప్రకృతి నుండి పుట్టిన సత్త్వ -రజస్-తమో గుణాలు జీవుల్ని బలవంతంగానైనా ఏదో ఒక పనిని చేసేలా చేస్తాయి. మనస్సుతో ఇంద్రియాలను నిగ్రహించి, ఏ కోరికా లేకుండా కర్మేంద్రియాలతో కర్మయోగం చేసేవాడే గొప్పవాడు (3-8).

కాబట్టి శాస్త్రం చెప్పిన కర్మను ఆచరించాలి. కర్మను చేయకుండా ఉండడం కంటే చేయడమే మేలు. ఈశ్వరార్పణబుద్ధి లేని కర్మలన్నీ మానవుడికి బంధాలను కలిగించేవే! అందువల్ల - ఆసక్తి లేకుండా నిత్యమూ ఎవరి పని వారు చెయ్యాలి. అప్పుడే మోక్షప్రాప్తి. జనకుడు మొదలైన వాళ్ళు కర్మవల్లనే మోక్షం పొందారు. కాబట్టి లోకోపకారం కోసమే కర్మ చెయ్యాలి!

**యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః,**
**స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే.** (3-21)

శ్రేష్ఠుడు దేనిని ఆచరించి, చూపిస్తాడో దానినే ఇతరులు ఆచరిస్తారు. ఆతడి ప్రమాణమే లోకప్రమాణం కూడా. పరమాత్మకు ఏ కర్తవ్యమూ లేదు. అయినా కర్మ చేస్తూనే ఉన్నాడు. తాను చెయ్యకపోతే లోకులు కూడా కర్మలు మానేస్తారు. కర్మలు చేయకపోతే ఈ మానవులంతా నశించిపోతారు.

విద్వాంసులైనా సరే! కర్మల్ని ఆచరించాలి. అయితే లోకహితం కోసం ఆచరించాలి. అజ్ఞానులు ఆసక్తితో ఆచరిస్తారు. విద్వాంసులు సంగం లేకుండా ఆచరించాలి. ఇతరులచేతకూడా చేయించాలి.

ప్రకృతి నుండి పుట్టిన దేహాదులు అన్ని రకాలైన కర్మల్నీ ఆచరిస్తుంటే మానవుడు అహంకారంతో అవన్నీ నేనే చేస్తున్నా ననుకుంటాడు (3-27). అలా కాక వివేకబుద్ధితో అన్ని కర్మలూ భగవంతుడికే సమర్పించి, మమకారాన్ని విడిచిపెట్టాలి!

మానవలోకంలో కర్మల వల్ల త్వరగా సిద్ధి లభిస్తుంది. మానవులు కర్మఫలంపై ఆసక్తితో ఆయా దేవతల్ని ఆరాధిస్తూ ఉంటారు. (4-12) అలాకాక కర్మలో అకర్మనూ, అకర్మలో కర్మనూ చూసేవాడే బుద్ధిమంతుడు. అతడే యోగసంపన్నుడు. అతడే అన్ని కర్మలూ చేసినవాడు (4-18).

'ఇది నేను చెయ్యాలి. ఇది నేను చేస్తున్నాను' అనే ఆలోచన లేకుండా కర్మల్ని ఆచరించేవాడి కర్మలన్నీ జ్ఞానమనే అగ్నిలో దగ్ధమవుతాయి. అతడే నిజమైన పండితుడు.

నిత్యమూ సంతృప్తితో, ఏ ఆశ్రయమూ లేనివాడై, కర్మఫలం మీద ఆసక్తి లేనివాడైన వ్యక్తి - కర్మను ఆచరించినా ఆచరించనట్లే. ఏ కోరికా లేకుండా, మనస్సునూ దేహేంద్రియాలనూ అదుపులో ఉంచుకొని, అన్నీ విడిచి జీవనయాత్రకు అవసరమైన కర్మల్ని మాత్రమే ఆచరించేవాడికి ఏ పాపమూ అంటదు.

దేవుడు ఇచ్చిన దానితోనే సంతృప్తి చెందుతూ సుఖదుఃఖాలకు అతీతుడై మాత్సర్యం లేకుండా జయాపజయాల పట్ల సమబుద్ధితో ఉండేవాడు ఎన్ని కర్మలు చేసినా ఏ కర్మా వాడికి అంటుకోదు (4-22).

నిత్యకర్మను త్యజించడం తగినది కాదు. మోహం వల్ల దానిని త్యజించడం తామసత్యాగం (18-7). కాబట్టి నిత్యకర్మను తప్పక చేయాలి అనే నిశ్చయంతో సంగాన్నీ, ఫలాన్నీ, విడిచివేసే త్యాగం సాత్త్వికత్యాగం అవుతుంది (18-9).

దేహధారియైనవాడు అన్ని కర్మల్నీ త్యజించడం అశక్యం. కర్మఫలాన్ని త్యాగం చేసేవాడే నిజమైన త్యాగి (18-11).

**జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా,**
**కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః.** (18-18)

కర్మచోదనం (కర్మల్లో ప్రవర్తింపజేసేది) మూడు విధాలుగా ఉంటుంది. అవి 1.జ్ఞానం 2. జ్ఞేయం (తెలుసుకోదగినది), జ్ఞాత (తెలుసుకొనేవాడు). కరణం (సాధనం), కర్మ, కర్త ఈ మూడూ కర్మతో ప్రత్యక్షంగా సంబంధించినవి.

అన్ని భూతాలలోనూ ఒకే ఆత్మ ఉంటుందని జ్ఞానం ద్వారా తెలుసుకొంటూ, రాగద్వేషాలు, ఆసక్తి, ఫలం మొదలైనవాటిపై ఆలోచన లేకుండా చేసే నిత్యకర్మ – సాత్త్వికకర్మ (18–20,23). అహంకారంతో, కోరికతో చేస్తే అది రాజసకర్మ. కష్టనష్టాలను చూడకుండా, హింసాత్మకంగా, శక్తిసామర్థ్యాలను పట్టించుకోకుండా చేసే కర్మ తామసకర్మ (18,23–25).

వర్ణాలను బట్టి కూడా కర్మలుంటాయి. మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం, తపస్సు, శౌచం, సహనం, ఋజువర్తన, ఆస్తిక్యబుద్ధి, శాస్త్రజ్ఞానం, విజ్ఞానం (శాస్త్రవిషయాలలో అనుభవరూప జ్ఞానం) బ్రాహ్మణులకు కర్మలు (18–42). శౌర్యం, తేజస్సు, చిత్తస్థైర్యం, నైపుణ్యం, యుద్ధంలో పలాయనం చిత్తగించకుండా ఉండడం, దానం, ఇతరుల్ని నిగ్రహించగలిగిన శక్తి – ఇవి క్షత్రియుల కర్మలు. వ్యవసాయం, గోరక్షణం, వర్తకం వైశ్యుల కర్మలు. శూద్రుల కర్మ – సేవచేయడం.

స్వభావతః ఏర్పడ్డ కర్మలో ఏవైనా దోషాలు ఉన్నట్లయితే అంతమాత్రానికే దానిని విడిచి పెట్టకూడదు. ధూమం అగ్నిని కప్పి ఉంచినట్లు సకలకర్మలను దోషం కప్పి ఉంటుంది. కర్మయోగాన్ని చెపూ్త శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన మాటలు అందరూ ఆచరించదగ్గవి.

నాపైనే చిత్తాన్ని నిలుపుకో. నా అనుగ్రహంవల్ల నువ్వు అన్ని కష్టాల్నీ దాటుతావు. అలాకాక అహంకారంతో నా మాట వినకపోయావో నువ్వే నశిస్తావు. ఎందుకంటే సహజంగా నీకు సంక్రమించిన కర్మ నిన్ను ఇప్పటికే బంధించివేసింది.

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,**
**మా మే వైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే.**
**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః.** (18–65,66)

నాపైనే మనసు నిల్పి, నాకు భక్తుడివికా. నన్నే పూజిస్తూ, నాకు నమస్కరిస్తూ ఉండు. నన్ను నువ్వు తప్పక పొందుతావు. ప్రతిజ్ఞ చేసి మరీ చెప్తున్నా. నువ్వు నాకు ప్రియుడివి కదా! అన్ని ధర్మాలనూ పక్కనపెట్టి నన్నే శరణు వేడుకో ! నేను నిన్ను అన్ని పాపాల నుండీ విముక్తుణ్ణి చేస్తాను. దుఃఖించకు.

✦ ✦ ✦

# ఆత్మ

లోకంలో మనం ఏన్నో ప్రాణుల్ని చూస్తూ ఉంటాం. అవన్నీ జీవించడానికి కావలసిన చైతన్యమేదో వాటిలో ఉంది. దానినే ఆత్మ అనీ, బ్రహ్మం అనీ అంటారు. నిజానికి ఈ చైతన్యం కంటికి కన్పిస్తుందా అంటే కన్పించదు. పోనీ కంటికి కన్పించే శరీరం శాశ్వతమా? అంటే అదీ కాదు. కంటికి కన్పించకుండా నిత్యమూ చైతన్యవంతంగా పనిచేస్తూ దేహాన్ని నడిపిస్తుంది. ఆ దేహాన్ని ఆశ్రయించి ఉంటూ దేహానికి కావలసిన జీవాన్ని కల్గిస్తుంది. కాబట్టి దీనిని జీవాత్మ అంటారు.

జీవాత్మ అనాదియైన అవిద్యతో పుణ్యపాపరూపమైన కర్మపరంపరను పొందుతుంటుంది. దీనివల్ల బ్రహ్మాది దేవతలు, నదులు, పశుపక్ష్యాదులు, పర్వతాలు మొదలైన దేహాలలోనికి జీవాత్మ ప్రవేశిస్తుంది. దాని కారణంగా ఆయా దేహాలే ఆత్మలు అనే అభిమానం కలుగుతుంది. తద్వారా సంసార భయం కలుగుతుంది.

సంసారభయం పోవాలంటే దేహం కంటే జీవాత్మ వేరైనది అని తెలియాలి. పరమాత్మను ఉపాసించాలి. ఆ ఉపాసన ద్వారా బ్రహ్మానుభవాన్ని పొందాలి. ఈ విధానాన్నే 'తత్త్వమసి' మొదలైన వేదాంత వాక్యాలు వివరిస్తున్నాయి.

జీవాత్మ అవిద్యతో కూడి ఉంటుంది. అవిద్య అంటే – ఆత్మకాని దానిని ఆత్మగా భావించడం. ఇది తొలగిపోతే ఆత్మస్వరూపావిర్భావం కలుగుతుంది. ఇది భగవంతుణ్ణి ఉపాసించినప్పుడే కలుగుతుంది. ఆత్మ – పరమాత్మకు పరతంత్రమన్న భావన వస్తుంది.

పరమాత్మను ఉపాసించడం వల్ల కలిగే ఫలమే ఆత్మస్వరూపావిష్కారం.

జీవాత్మకు ప్రకృతితో ఏర్పడ్డ సంసర్గం వల్ల దేహాలు ఏర్పడతాయి. కానీ స్వరూపాన్ని బట్టి దీనికి ఏ పరిణామమూ లేదు. స్త్రీ, పురుష, దేవ, నర, పశు, వృక్షాది భేదాలూ ఆకారాలూ శరీరానికి సంబంధించినవే. ఆత్మకు చెందినవి కాదు. ఇదంతా కర్మవల్ల, ప్రకృతిసంబంధంవల్ల ఏర్పడిన పరిణామం. ఈ సంబంధంవల్ల నేను, నావి అనే ప్రకృతి సంబంధమైన ధర్మాలుకూడా ఏర్పడతాయి. ఈ పరిణామాలకు అతీతమైనది జీవాత్మ.

పురుషుడనీ, స్త్రీ అనీ, జంతువనీ వృక్షమనీ వ్యవహరించడం లోకవ్యవహారం కోసమే. ఈ భేదాలేవీ ఆత్మకు లేవు. నిజానికి జీవుడు పైవాటిలో ఏదీ కాదు. కాబట్టి

ప్రకృతి సంబంధం వల్ల ఏర్పడే వివిధ దేహాలేవీ లేనిదే ఆత్మ. జ్ఞానమూ, ఆనందమూ ఆత్మకు గుణాలు. అజ్ఞానాది గుణాలు ప్రకృతి సంబంధం వల్లనే ఆత్మకు ఏర్పడుతున్నాయి.

ఆత్మ - కర్మవల్ల కలిగిన వివిధ దేహాలలోనికి ప్రవేశిస్తుంది. మనుష్యాది దేహభేదాలను పొందుతుంది. ఈ భేదాలు లేనిదే ఆత్మ. ఆత్మ-జ్ఞానస్వరూపం. ఆత్మలలోనూ పరస్పరభేదం ఉన్నప్పటికీ జ్ఞానస్వరూపాన్ని బట్టి ఆత్మలన్నీ ఒకటే. సమానమే.

మానవుడికి ఈ శరీరంతోనే కౌమార, యౌవన, వార్ధక దశలు వస్తుంటాయి. అలాగే మరో దేహం వస్తుంది. కాబట్టి బుద్ధిమంతుడు ఈ విషయంలో మోహాన్ని పొందడు (2-11, 12, 13)

అంతటా వ్యాపించి ఉన్న ఆత్మకు నాశనం లేదు. ఈ విషయాన్ని నువ్వు తెలుసుకో. ఆత్మకు ఎప్పుడూ ఏ మార్పూ రాదు. ఎవడూ దీన్ని నాశనం చెయ్యలేడు. ఆత్మ ఎప్పుడూ పుట్టదు. మరణించదు. కొంతకాలం ఉండడం, కాలాంతరంలో లేకపోవడమూ లేదు. ఇది నిత్యం. శాశ్వతం. అత్యంత ప్రాచీనం. దీనికి ఆది అంటూ ఉండదు. శరీరం మరణిస్తుంది. ఆత్మ కాదు (2-20).

**వాసాంసి జీర్ణాని యథా విహాయ**
**నవాని గృహ్ణాతి నరో஽పరాణి,**
**తథా శరీరాణి విహాయ జీర్ణా**
**న్యన్యాని సంయాతి నవాని దేహీ.** (2-22)

మానవుడు చిరిగిన వస్త్రాలను విడిచిపెట్టి, కొత్త వస్త్రాలను ధరించినట్లుగా దేహాన్ని ధరించిన జీవాత్మ - జీర్ణమైన శరీరాలను విడిచి, క్రొత్త శరీరాల్ని ధరిస్తూనే ఉంటుంది.

**నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః,**
**న చైనం క్లేదయన్త్యాపః న శోషయతి మారుతః.** (2-23)

ఆత్మను ఏ ఆయుధాలూ ఛేదించలేవు. అగ్ని కాల్చలేదు. నీళ్ళు తడపలేవు. గాలి ఎండిపోయేలా చేయలేదు. ఇది నిత్యమైనది. అంతటా వ్యాపించి ఉన్నది. స్థిరమైనది. కదలికలేనిది. ప్రాచీనమైనది.

ఈ ఆత్మ అవ్యక్తమైనది. ఇంద్రియాల ద్వారా దీన్ని తెలుసుకోలేం. అది జరగనిపని. మనస్సుచేత ఊహించలేం. ఈ యథార్థం తెలిస్తే దుఃఖం ఉండదు (2-25). ఈ ఆత్మ పదేపదే పుడుతూ, మరణిస్తూ ఉంటుందనీ అనుకొన్నా సరే! దుఃఖించకూడదు.

**జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ,**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి.** (2-27)

పుట్టిన ప్రతివాడికీ మరణం తప్పదు. మరణించినవాడికి మళ్ళీ పుట్టుక తప్పదు. తప్పని సరియైన దీనికోసం నువ్వు దుఃఖించడం మానుకో!

ఒకడు ఈ ఆత్మను ఆశ్చర్యకరమైన వస్తువును చూసినట్లు చూస్తాడు. మరొకడు దీనిని గురించే ఆశ్చర్యంగా చెప్తాడు. మరొకడు అంతే ఆశ్చర్యంగా వింటాడు. కానీ వీరెవ్వరికీ ఆత్మస్వరూపం అర్థమైనట్టు కాదు (2-29).

ఆత్మ నుండే ప్రాణులు పుడుతున్నాయనీ, పెరుగుతున్నాయనీ తెలుసుకొన్నప్పుడే బ్రహ్మత్వం సిద్ధిస్తుంది.

అంతా వ్యాపించి ఉన్నప్పటికీ ఆకాశం అత్యంత సూక్ష్మమైనది కావడంవల్ల అది లిప్తం కాదు. అలాగే అన్ని దేహాలలో ఉన్న ఆత్మ కూడా లిప్తం కాదు (13-32).

ఒకే సూర్యుడు ఈ లోకాన్నంతటినీ ఏవిధంగా ప్రకాశింపజేస్తాడో అదే విధంగా పరమాత్మ అన్ని దేహాలను ప్రకాశింపజేస్తుంది. ఈ విషయాన్ని తెలుసుకున్నవాడే పరమాత్మను పొందుతాడు.

✦ ✦ ✦

# పరమాత్మ

పరమాత్మ అంటే శ్రేష్ఠమైన ఆత్మ. చేతనాచేతనాత్మకమైన ప్రపంచం ఆవిర్భావానికీ, స్థితికీ, లయకూ, సంసారనివృత్తికీ కారణమైనవాడు. అనంతమైన కల్యాణగుణాలు కలవాడు. సమస్త జీవజడ ప్రపంచం కంటే విలక్షణమైన స్వరూపం పరమాత్మది. సర్వాత్మ, పరబ్రహ్మ, పరంజ్యోతి, పరతత్వం, సత్ మొదలైన శబ్దాలు పరమాత్మనే సూచిస్తాయి.

సమస్త ప్రపంచాన్నీ నియమించేవాడు పరమాత్మే. అవిద్య అనే కర్మ సంబంధంవల్ల జీవులకు ప్రకృతితో సంబంధం కలుగుతుంది. దానివల్ల జనన–మరణ–సుఖ–దుఃఖాలతో కూడిన సంసారం తగులుకుంటుంది. ఈ సంసారాన్ని పరమాత్మే నశింపజేస్తాడు.

పరమాత్మను తెలుసుకోవడం ఎలా?

మాటల ద్వారా గానీ, బుద్ధి ద్వారా గానీ, శాస్త్ర జ్ఞానం ద్వారా గానీ తెలుసుకోలేము. అన్ని ఉపాయాలనూ విడిచి, పరమాత్మనే ఉపాయంగా భావించి ఆరాధించేవాడికే ఆ పరమాత్మ స్వరూపం అవగతమవుతుంది.

పరమాత్మనే అనన్య భావంతో శరణువేడిన వారికి తనను పొందడానికి కావలసిన బుద్ధియోగాన్ని అనుగ్రహించేదీ పరమాత్మే. అలా ఉపాసించిన వారి అజ్ఞాన తిమిరాన్ని జ్ఞానదీపం ద్వారా నశింపజేసేదీ పరమాత్మే.

ప్రపంచమంతటా వ్యాపించి ఉన్నవాడు పరమాత్మ. బ్రహ్మము అంటే 'స్వరూపం చేతా, గుణాలచేతా అనవధికమైన అతిశయం కల వస్తువు' అని అర్థం. అలాగే శరీరభూతమైన సమస్త ప్రపంచంలో అంతర్యామిగా ప్రవేశించి, అతిశయింప జేసేవాడని మరో అర్థం.

పరమాత్మనే పరంజ్యోతి అంటాం. అంటే సర్వోత్కృష్టమైన జ్యోతిస్సు అని అర్థం. పరిమితి లేని ప్రకాశమే పరంజ్యోతి. పరమాత్మకే పరతత్త్వం అనీ వ్యవహారం. అంటే పరమప్రాప్యమైన తత్త్వం అని. తత్త్వం అంటే యథార్థమైన వస్తువు. దేశ – కాల స్వరూపాల ద్వారా అపరిచ్ఛిన్నమైన వ్యాప్తి కలదీ, తన కంటే గొప్పది వేరొకటి లేనిదీ

పరమాత్మ. సమస్త భూతాలకూ భగవానుడే ఆత్మ. ఆ భగవానుడికి వేరొక ఆత్మ లేదు. అందుకే పరమాత్మ.

**మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ!**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ.** (7-7)

దారంలో మణులు ఎలా గుచ్చబడి ఉంటాయో అలాగే ఇదంతా పరమాత్మలో ఉంటుంది. తాను తప్ప దీనికంతటికీ కారణం వేరొకటి లేదు.

## అంతర్యామి

ఈ తత్త్వాన్ని శ్రీకృష్ణుడు ఇలా చెప్తున్నాడు - నీటిలో ఉన్న రసం నేనే. చంద్రసూర్యులలో ఉన్న కాంతినీ నేనే. సమస్త వేదాలలోనూ ఓంకారాన్ని నేనే. ఆకాశంలో శబ్దాన్ని నేను. పురుషులలో ఉండే పౌరుషాన్నీ, (పురుషత్వాన్ని నేను) పృథివిలో ఉండే గంధాన్నీ, సూర్యుడిలోని తేజస్సునూ, సకల ప్రాణులూ జీవించడానికి కావలసిన అన్నాన్నీ, తపస్వులలోని తపస్సూ నేనే !

అన్ని ప్రాణులకూ ప్రాచీనమైన బీజాన్ని నేనే. బుద్ధిమంతులలోని బుద్ధీ, తేజస్వంతులలోని తేజస్సూ నేనే. బలవంతులలోపలి కామరాగ వివర్జితమైన బలమూ నేనే. ప్రాణులలో ఉన్న - ధర్మానికి అవిరుద్ధమైన కామాన్నీ నేనే.

సత్త్వ - రజస్ - తమో గుణాల వల్ల పుట్టే పదార్థాలన్నీ నానుండే పుడుతున్నాయి. నేను వాటిలో లేను కానీ అవన్నీ నాలో ఉన్నాయి. అయితే త్రిగుణాత్మకమైన పదార్థాలతో వ్యాపించి ఉన్న ఈ జగత్తు నన్ను గుర్తించలేక పోతోంది. నేను వీటన్నింటికీ అతీతుణ్ణనీ, మార్పు లేని వాణ్ణి అనీ మోహవశాత్తూ తెలుసుకోలేకపోతోంది. ఇదంతా నా మాయ. మూడు గుణాలతో కూడి ఉన్న నా మాయను దాటడం అసంభవం. అయితే తమకు ఆత్మనైన నన్నే శరణుపొందిన వాళ్ళు మాత్రం దీనిని ఇట్టే దాటగలరు (7-8-14).

పాపాత్ములూ మూఢులూ అయిన నరాధములు నన్ను ఆత్మభావంతో పొందలేకపోతున్నారు. మాయ వాళ్ళ జ్ఞానాన్ని మటుమాయం చేస్తుంది.

## భక్తరక్షణ

**చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున!**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ!** (7-16)

అర్జునా! కష్టాలలో ఉన్నవాడు (ఆర్తుడు), జిజ్ఞాసువూ, ధనం కోరుకొనేవాడూ, జ్ఞాని అనే ఈ నలుగురు పుణ్యాత్ములు మాత్రం నన్ను భజిస్తూ ఉంటారు. వాళ్ళలో పరమాత్మ మీదే భక్తిగల జ్ఞాని ఆత్మ పట్ల నిత్యమూ ఏకాగ్రతతో ఉంటాడు. అందువల్ల అతడు విశిష్టుడు. అతడంటే నాకు ఇష్టం. నేనంటే అతనికి ఇష్టం.

వీళ్ళంతా గొప్పవాళ్ళే. అయితే జ్ఞాని నా ఆత్మ. ఎందుకంటే జ్ఞాని నన్నే ఉత్తమగతిగా భావించి అర్చిస్తాడు. ఎన్నో జన్మల తర్వాతైనా చివరకు జ్ఞానపరిపాకాన్ని పొంది, నన్నే సర్వస్వంగా భావించి, నన్ను పొందుతాడు. అటువంటి మహాత్ముడు అరుదు. ఎవరు ఏ రూపాన్ని కోరి సేవిస్తారో వారికి ఆ రూపంలోనే ఆరాధించే శ్రద్ధ నిలిచి ఉండే విధంగా నేనే చేస్తాను. ఎవరు ఏ రూపాన్ని ఆరాధన చేసినా ఆ అన్ని రూపాలు నేనే. అందరి కోర్కెలు తీర్చేదీ నేనే.

**అన్తవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్,**
**దేవాన్ దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి.** (7-23)

అల్పబుద్ధులకు లభించే ఫలం అంతమైపోతుంది. దేవతల్ని పూజించేవాళ్ళు ఆయా దేవతల్ని పొందుతారు. నా భక్తులైతే నన్నే పొందుతారు. ఎంతో ఉత్తమమైన నా స్వరూపం ఏ మార్పుకూ లోనుకాదు. అల్పబుద్ధులకు ఈ విషయం అందదు. అంతకు ముందు వ్యక్తం కాని నేను కాలాంతరంలో వ్యక్తుణ్ణయ్యానని అనుకొంటుంటారు.

నన్ను యోగమాయ కప్పి ఉంటుంది. అందుకే అందరికీ నేను స్పష్టంగా కనబడను. ఈ లోకం మూఢమైనది. నేను ఏ మార్పూ పొందననీ, పుట్టుకన్నదే నాకు లేదనీ గుర్తించదు.

సమస్త భూతాలూ కూడా సృష్టి సమయంలో ఇచ్ఛ, ద్వేషం అనే రెండింటి వల్ల కలిగే మోహంతో తెలివితప్పి ఉంటాయి. (7-27). ప్రకృతి నుండి పుట్టిన దేహాదులే అన్ని రకాలైన కర్మల్ని చేస్తుంటే అహంకారంవల్ల మూఢాత్ముడైన మానవుడు అవన్నీ నేనే చేస్తున్నా ననుకుంటాడు. దీనికి కారణం అరకొర జ్ఞానమే.

విషయాన్ని అసంపూర్ణంగా తెలుసుకొన్నవాళ్ళు ప్రకృతి గుణాలవల్ల మూఢులై ఆ గుణాలవల్ల జరిగే కర్మలపట్ల ఆసక్తిని పెంచుకొంటూ ఉంటారు. అటువంటి బుద్ధిహీనుల్ని సంపూర్ణ విషయజ్ఞానంకలవాడు పట్టించుకోకూడదు. వాళ్ళ దారిన వాళ్ళను పోనివ్వాలి.

నా స్వరూపం ఇంద్రియాలకు గోచరించదు. అయినా నేను ఈ జగత్తు అంతటా వ్యాపించి ఉన్నాను. సమస్త భూతాలూ నాలోనే ఉన్నాయి. కానీ నేను మాత్రం వాటిలో లేను (9-4). నేను సంగం లేనివాడను కాబట్టి నిజానికి భూతాలుకూడా నాలో లేవు.

నేనే ఈశ్వరుణ్ణి - అంటే అంతటినీ నియమించే శక్తి కలవాణ్ణి. సమస్త భూతాలనూ పుట్టించి వాటిని భరించే నేను ఆ భూతాలలో ఉన్నా అసంగుణ్ణి అగుటచే ఆ భూతాలలో లేనట్లే.

ఆకాశంలో వాయువులాగా నాలో సమస్త భూతాలూ ఉన్నాయి. కల్పాంతంలో అవి నా ప్రకృతిలో లీనమైపోతాయి. నేనే మళ్ళీ కల్పారంభంలో సృష్టిస్తూ ఉంటాను. (9-7).

ఈ భూతాలన్నీ ఎవరి అధీనంలో ఉంటాయో తెలుసా? స్వభావానికి అధీనంలో. అందువల్ల భూతాలకు స్వాతంత్ర్యం లేదు.

నేను నా ప్రకృతిని ఆధారంగా చేసుకొనే మాటిమాటికీ సృష్టిస్తూ ఉంటాను. (9-8). నాదెప్పుడూ ఉదాసీనవైఖరే! దేనితోనూ నాకు సంబంధం ఉండదు. ఏ కర్మపైనా నాకు ఆసక్తి ఉండదు. అందుకే ఆ కర్మలు నన్ను బంధించవు. నేను ఒక అధిపతిగా, సాక్షిగా మాత్రమే ఉంటాను. ప్రకృతే ఈ జంగమ - స్థావరరూపాత్మకమైన జగత్తును సృష్టిస్తుంది. ఈ కారణంచేతనే జగత్తు నడుస్తుంది.

నేనే క్రతువు, నేనే యజ్ఞం, నేనే స్వధ (పితృకార్యం), నేనే ఔషధం, నేనే మంత్రం, నేనే ఆజ్యం, నేనే అగ్ని, నేనే హోమద్రవ్యం. నేనే ఈ జగత్తుకు తండ్రి. నేనే తల్లి. నేనే కర్మఫలం ఇచ్చేవాణ్ణి. నేనే పితామహుణ్ణి. అందరూ తెలుసుకోవలసింది నన్నే. నేనే పుణ్యకర్మ. నేనే ఓంకారాన్ని. నేనే ఋగ్వేదాన్ని. సామవేదాన్ని, యజుర్వేదాన్ని కూడా. నేనే గతిని, నేనే పోషకుణ్ణి. ప్రభువును. సాక్షిని. నివాసాన్ని. రక్షకుణ్ణి. మిత్రుణ్ణి, ఉత్పత్తి స్థానాన్ని. ప్రళయాన్ని, ఆధారాన్ని, నిధిని. బీజాన్ని.

ఆదిత్యుణ్ణయి నేనే తపింపజేస్తాను. వర్షాన్ని ఆపుతాను, విడుస్తాను. మానవులకు మృత్యువునూ, దేవతలకు అమృతమూ నేనే. కార్యమూ, కారణమూ నేనే. (9;16-19)

ఈ భగవానుని వాక్యాలే పరమాత్మ స్వరూపాన్ని విశదం చేస్తాయి.

ఆ పురుషుడే మూడులోకాలలో ప్రవేశించి, వాటిని నిలబెడుతూ ఉంటాడు. ఆ పరమాత్మ సమున్నతుడు. అందుకే లోకంలోనూ, వేదాలలోనూ పురుషోత్తముడిగా కీర్తిస్తారు.

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్,**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే.** (10-10)

ఎవరైతే ఆసక్తితో ప్రీతిపూర్వకంగా సేవిస్తారో వాళ్ళకు బుద్ధియోగాన్ని అనుగ్రహిస్తూ వాళ్ళ అంతఃకరణంలోనే ఉంటూ, వాళ్ళ అజ్ఞానాన్ని తొలగిస్తాడు.

✦ ✦ ✦

# జగత్తు

మానవుడు పుట్టడానికీ, జీవించడానికీ, కర్మలను ఆచరించడానికీ, కర్మఫలాన్ని అనుభవించడానికీ, మోక్షాన్ని పొందడానికీ అవకాశం కల్పించేది జగత్తు. అసలు ఈ జగత్తు ఉందా? లేదా? ఉంటే ఎలా ఉంటుంది? లేకపోతే సృష్టిలోని జీవజాలమంతా ఎక్కడ ఉన్నట్లు? ఇవన్నీ ప్రశ్నలు. వాస్తవంగా చెప్పాలంటే కళ్ళకు కన్పించేదే జగత్తు.

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం, అనే ఎనిమిదింటి కలయికే ప్రకృతి. దీనినే జగత్తు అన్నారు. ఇది భగవంతుడి ప్రకృతి. అంటే మాయాశక్తి. దీనికంటే వేరైన ప్రకృతి కూడా ఉంది. అదే పరాప్రకృతి. (భగవంతుడి మాయాశక్తి అపరాప్రకృతి. అపరప్రకృతి కంటే వేరైనదీ, జీవాత్మకమైనదీ పరప్రకృతి. దీనివల్లనే జగత్తు నిలిచి ఉంటుంది).

సమస్త ప్రాణులూ ఈ రెండు ప్రకృతులనుండే జన్మిస్తున్నాయి. సత్త్వ-రజస్-తమోగుణాలవల్ల పుట్టిన పదార్థాలన్నీ ఈ జగత్తులో ఉంటాయి. జగత్తు మోహంతో, వీటికన్నింటికీ అతీతమైన పరమాత్మను గుర్తించలేకపోతున్నది. ఎటువంటి మార్పునూ పొందని ఇంద్రియాలకు గోచరించని పరమాత్మ ఈ జగత్తులో అంతటా వ్యాపించి ఉన్నాడు. అన్ని ప్రాణులూ తనలోనే ఉన్నాయి కానీ తాను మాత్రం వాటిలో లేడు (9-4). కేవలం అధ్యక్షుడిగా, సాక్షిగా మాత్రమే ఉంటాడు. దాన్నే విశ్వరూపం ద్వారా అర్జునుడికి చూపించాడు శ్రీకృష్ణుడు.

అప్పుడు అర్జునుడు ఆ దేవదేవుడి శరీరంలోనికి చూశాడు. ఒకేచోట అనేక విధాలుగా భిన్న భిన్న ఆకారాలలో విభక్తమై ఉన్న జగత్తు స్పష్టంగా గోచరించింది. ఆశ్చర్యం కలిగింది. శరీరం పులకించింది. శిరస్సు వంచి నమస్కరించి -

'దేవా ! సకల జగత్తుకూ ఆధారభూతుడైనవాడా! నీ ఆద్యంతాలేవీ నాకు కన్పించడం లేదు. అదుగో ! నీ ముఖం అగ్నిలా ప్రజ్వలిస్తోంది. ఆ ముఖంతో ఈ జగత్తునంతటినీ తపింపజేస్తున్నావు. అంతా నువ్వే, అన్నింటా నువ్వే. సమస్తమూ నీలోనే ఉంది.

విష్ణుదేవా! అవిగో! జ్వలిస్తున్న నీ నోళ్ళు. వాటితో జనులందర్నీ మ్రింగుతూ పదేపదే నాలుకలతో నాకుతున్నావు. ఉగ్రమైన నీ కాంతికి సమస్త లోకాలూ తపించిపోతున్నాయి. అంతా నీకు నమస్కరిస్తున్నారు. 'హృషీకేశా! నీ కీర్తి వల్ల జగత్తు సంతోషిస్తోంది.'

'దేవా! స్థావర జంగమాత్మకమైన ఈ జగత్తు మొత్తానికీ నువ్వే తండ్రివి. పూజించదగినవాడివీ, గొప్ప గురువ్వీ నువ్వే ! నీ ప్రభావం సాటిలేనిది. ముల్లోకాల్లో నీతో సమానుడుగానీ నీకంటె గొప్పవాడుగానీ లేడు (11-43) ఎలా ఉంటాడు?' అన్నాడు వినమ్రంగా.

✦ ✦ ✦

# భగవంతుడి గుణాలు

**అశేషచిదచిద్వస్తుశేషిణే శేషశాయినే,**

**నిర్మలానంతకల్యాణనిధయే విష్ణవే నమః.**

భగవంతుడు జీవ – జడరూపంలో ఉండే సమస్తమైన వస్తు సమూహానికి 'శేషి'. అతడు క్షీరసముద్రంపై శేషతల్పంపై శయనించి ఉంటాడు. నిర్మలమైనవీ, అనంతమైనవీ, శుభాల్ని చేకూర్చేవి అయిన గుణాలకు అతడు నిధి.

స్థూలంగా చూస్తే ఈ సృష్టిలో ఉండేవి 1. ఉపేయం 2. ఉపాయం. ఈ రెండే. ఉపేయం అంటే పొందదగినది. ఉపాయం అంటే ఉపేయాన్ని పొందడానికి ఉపకరించే సాధనం. సకలజీవులూ పొందదగినది పరబ్రహ్మమే. ఆ పరబ్రహ్మం ఉపేయం. మరి ఈ ఉపేయాన్ని పొందడానికి సాధనం నమస్కారం మాత్రమే.

ఆ పరమాత్మను విష్ణువు అని వ్యవహరిస్తాం. విష్ణువు అంటే అంతటా వ్యాపించి ఉన్నవాడని అని అర్థం. 'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః' మొదలైన వేదవాక్యాలే ఇందుకు ప్రమాణం. అంతటా అంటే లోపలా బయటా వ్యాపించి ఉండడం.

సమస్త జగత్తుకూ సృష్టి – స్థితి – లయాలకు హేతువుకావడం, అందరికీ పొందదగిన స్థితిలో (పరమప్రాప్యత్వం) ఉండడం, పరమాత్మ గుణాలు. అలాగే నిర్మలమూ, అనంతమూ అయిన కల్యాణగుణాలకు నిధి ఈ పరబ్రహ్మం. అంటే ఏ దోషమూ లేని, సాటిలేని శుభాలకు నిధి అని.

అనంతగుణాలు కల పరబ్రహ్మానికి దేశ–కాల–వస్తు విభాగం ఉండదు. 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అన్నట్లు మాధుర్యం, సౌశీల్యం, సౌలభ్యం, వాత్సల్యం మొదలైన గుణాలే కల్యాణగుణాలు. అలాంటి పరమాత్మను పొందాలంటే త్రికరణశుద్ధిగా అనన్యభక్తితో ధ్యానం చేయడమే మార్గం.

## అవతార రహస్యం

ఎప్పుడెప్పుడు ఈ లోకంలో ధర్మానికి హాని కలుగతుందో అధర్మం విజృంభిస్తుందో అప్పుడప్పుడు భగవంతుడు అవతరిస్తాడు.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం,**

**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.** (4–8)

సాధుజనులకు రక్షణ కల్పించటం కోసం, దుర్జనుల్ని శిక్షించడం కోసం, ధర్మాన్ని స్థాపించడం కోసం ప్రతియుగంలోనూ ఆవిర్భవించడమే, నా అవతార రహస్యం.

ఎవరు ఏ విధంగా సేవిస్తారో వారిని పరమాత్మ అదేవిధంగా అనుగ్రహిస్తాడు. ఎవరు ఏ మార్గంలో నన్ను ఆశ్రయించినా వాళ్ళు అనుసరించేది పరమాత్మ మార్గమే. అయితే సాధారణంగా మానవలోకంలో జనులందరికీ కర్మలపై ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. సత్వరమే సిద్ధి లభించడమే అందుకు కారణం.

**న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా,**
**ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే.** (4–14)

పరమాత్మకు ఏ కర్మలూ అంటవు. కర్మఫలాలపై ఆసక్తిలేదు. అని ఈ సత్యాన్ని గ్రహించిన వాణ్ణి – అతడి కర్మలు కూడా బంధించవు. ఇది తెలుసుకొన్న కొందరు పూర్వులు మోక్షం కోసం ఈ విధంగానే కర్మల్ని ఆచరించారు.

భగవద్గీతలో కృష్ణుడు – నేను అధిభూతాత్మకుణ్ణి, అధిదైవాన్ని, అధియజ్ఞాన్ని. నన్ను చేరుకోవాలంటే అభ్యాసం ఉండాలి అని చెప్పాడు. ఇంకా –

అభ్యాసం అనే యోగంతో పనిచేస్తూ ఇతర విషయాల వైపు వెళ్ళకుండా అలాంటి స్థిరచిత్తంతో ఉండే దివ్యాత్మకుడే పరమపురుషుణ్ణి చేరగలడు. అలాంటి వారికి మాత్రమే నేను లభిస్తాను (8–7,8) నేను సర్వభూతాలకూ నియంతను.

**అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాస్థితమ్,**
**పరం భావ మజానన్తో మమ భూతమహేశ్వరమ్.** (9–11)

అన్ని భూతాలకు నేనే ఈశ్వరుణ్ణి. నేనే నడిపిస్తూ ఉంటాను. అటువంటి నన్ను మూఢజనులు తెలుసుకోలేరు. నేను మానవ శరీరాన్ని ధరించి ఉన్నాననుకొని నన్ను నిరాదరణ చేస్తుంటారు. కొందరైతే నా తత్త్వాన్ని అర్థం చేసుకొని జ్ఞానయజ్ఞం ద్వారా నన్ను అర్చిస్తారు.

ఎవరికి తోచిన మార్గంలో వారు నన్ను అర్చిస్తారు. కొందరు నాకు రూపం ఉందనుకుంటారు. కొందరు లేదనుకొంటారు. ఇంకొందరు నేను ఒకే రూపంలో ఉన్నట్లు భావిస్తే – మరికొందరు నాకు అనేక రూపాలున్నాయని భావిస్తారు. మరికొందరైతే నాకు అన్ని వైపులా ముఖాలు ఉన్నాయని భావిస్తారు.

ఇలా ఎవరు ఏ రూపంలో నన్ను భావించినా, అర్చించినా వారిని ఆయా రూపాలలోనే నేను అనుగ్రహిస్తాను. ఇది నా లక్షణం.

కొందరు యజ్ఞముఖంగా నన్ను ఆరాధన చేస్తారు. నేనే ఆ యజ్ఞస్వరూపుణ్ణి. యజ్ఞంలోని ప్రతీదీ నేనే. లోకంలో ఉన్న ప్రాణులందరికీ వాళ్ళ వాళ్ళ కర్మల్ని బట్టి ఫలాన్ని అనుగ్రహించేదీ నేనే. కాబట్టి ఈ జగత్తుకు తల్లీ తండ్రీ నేనే! (9–16).

సమస్తమూ నేనే. సమస్తమూ కల్పించేదీ నేనే. పాలించేదీ నేనే. లయం చేసేదీ నేనే. ప్రతి కర్మకూ సాక్షీభూతుణ్ణి కూడా నేనే. నేనే నాశనం లేని బీజాన్ని. అన్నింటికీ ఆధారస్థానాన్నీ, నిధినీ కూడా.

**అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే,**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్.** (9–22)

నన్ను పొందాలంటే అనన్యమైన శరణాగతి చెయ్యాలి. నాపైనే నిల్చిన అనన్యమైన చిత్తంతో ఎవరైతే నన్ను గురించి ధ్యానం చేస్తారో, నా స్వరూపాన్నే భావిస్తారో – ఉపాసిస్తారో వాళ్ళు నిత్యాభియుక్తులు – నిత్యమూ ప్రయత్నించే శీలం కలవాళ్ళు. అలాంటివాళ్ళ యోగక్షేమాల్ని నేను చూసుకుంటాను. వాళ్ళకు ఏ చింతా ఉండదు.

ఎవరు ఎవరిని ఎలా సేవించినా అనన్యమైన భక్తి ముఖ్యం. ఏ దేవతను ఉపాసించినా ఆ ఉపాసనను జ్ఞానపూర్వకంగా చేస్తే – నేనే వారి కర్మలకు ఫలితాన్ని అందించి, వాళ్ళను ఉద్ధరిస్తాను. భక్తిపూర్వకంగా నాకు ఏది ఇచ్చినా సరే! నేను దానినే స్వీకరించి సంతృప్తిని పొందుతాను. స్వచ్ఛమైన మనస్సుతో ఇస్తే చాలు. అది పత్రమైనా, పుష్పమైనా, ఫలమైనా తోయమైనా సరే! నాకు ఆనందాన్నే కలిగిస్తుంది.

నాకు ఒక ప్రాణి అంటే ఇష్టం కానీ, మరో ప్రాణి అంటే ద్వేషం కానీ లేవు. నాకు ఎవరు ఇష్టమో, నా ప్రియభక్తులెవరో చెప్పనా? ఎవరు నన్నే భక్తితో భజిస్తారో వాళ్ళంటేనే నాకు ఇష్టం. వాళ్ళే నా ప్రియభక్తులు. నాలో వాళ్ళు నిరంతరం ఉంటారు. నేను ఎల్లప్పుడూ వాళ్ళలోనే ఉంటాను.

ఈ సర్వజగత్తు అంతటా నేను నా ఒకే ఒక్క అంశతో వ్యాపించి ఉన్నాను. అంటే ఈ జగత్తు నాలోని ఒక అంశం.

## సంసారవృక్షం

**ఊర్ధ్వమూల మధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహు రవ్యయమ్,**
**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్.** (15- 1)

సంసారం ఒక అశ్వత్థవృక్షం (రావి చెట్టు) లాంటిది. దీనికి నాశనం లేదు. సాధారణంగా చెట్టుకు మూలం - మొదలు కిందిభాగంలోనే ఉంటుంది. కానీ సంసారం అనే అశ్వత్థవృక్షం మొదలు పైభాగంలో ఉంటుంది. కొమ్మలు కిందివైపుకు వ్యాపించి ఉన్నాయి. వేదాలే ఆకులుగా ఉన్నాయి. ఇది తెలుసుకున్నవాడే వేదార్థం ఎరిగినవాడు.

విషయసుఖాలే చిగుళ్ళుగా గల ఈ సంసారవృక్షం కొమ్మలు- గుణాలవల్ల పెంపొందుతూ క్రిందకీ మీదకీ విస్తరిస్తుంది. ధర్మాధర్మ కర్మబంధాలవల్ల దాని వేళ్ళు దట్టంగా అల్లుకొని మానవలోకంలో అంతటా వ్యాపిస్తాయి.

ఈ సంసారవృక్షం స్వరూపంకానీ, ఆదిమధ్యాంతాలుకానీ ఈ లోకంలో ఎవరికీ తెలియవు. లోతుగా నాటుకున్న వేళ్ళతో విలసిల్లుతున్న ఈ అశ్వత్థ వృక్షాన్ని ముందు వైరాగ్యమనే ఖడ్గంతో ఖండించివేయాలి. ఆ తరువాత, పునర్జన్మ లేకుండా చేసే పరమపదాన్ని అన్వేషించాలి.

ఈ సంసారవృక్షం విస్తరించడానికి కారకుడైన ఆదిపురుషుణ్ణి - పరమాత్మను శరణువేడాలి. అహంకారమోహాలను తొలగించుకొని, అనురాగదోషాల్ని జయించి, కోరికలన్నిటినీ విడిచిపెట్టి, ఆత్మజ్ఞానతత్పరులై, వివేకవంతులై, సుఖదుఃఖాది ద్వంద్వాలకు అతీతులైన జ్ఞానులు - శాశ్వతమైన నా పదాన్ని పొందుతారు.

ఒకసారి ఆ పరమపదాన్ని పొందితే మళ్ళీ తిరిగి జన్మించవలసిన అవసరం ఉండదు. అలాంటి నా పరంధామాన్ని సూర్యచంద్రులుగానీ, అగ్నిగానీ ప్రకాశింప చేయలేరు. నాలోని సనాతనమైన ఒక అంశమే జీవలోకంలో జీవాత్మ. అది ప్రకృతిలోని జ్ఞానేంద్రియాలనూ, మనస్సునూ ఆకర్షిస్తోంది.

వాయువు పువ్వులనుంచి వాసనలను తీసుకుపోయేటట్లు జీవుడు- శరీరాన్ని ధరించేటప్పుడూ, విడిచిపెట్టేటప్పుడూ ఇంద్రియాలనూ, మనస్సునూ వెంటబెట్టుకు పోతాడు. ఈ జీవుడు- చెవి, కన్ను, చర్మం, నాలుక, ముక్కు అనే ఐదు జ్ఞానేంద్రియాలనూ, మనస్సునూ ఆశ్రయించి శబ్దాది విషయాలను అనుభవిస్తాడు. మరో శరీరాన్ని

పొందుతున్నప్పుడూ, శరీరంలో వున్నప్పుడూ, విషయాలను అనుభవిస్తున్నప్పుడూ, గుణాలతోకూడి ఉన్నప్పుడూ కూడా ఈ జీవాత్మను మూఢులు చూడలేరు. జ్ఞానదృష్టి కలిగినవాళ్ళు మాత్రమే చూడగలుగుతారు.

## అంతటా నేనే

సూర్యుడిలో ఉంటూ జగత్తు నంతటినీ ప్రకాశింపచేసే తేజస్సూ, అలాగే చంద్రుడిలోనూ, అగ్నిలోనూ ఉండే తేజస్సూ నాదే అని తెలుసుకో.

నేను ఈ భూమిలోనికి ప్రవేశించి సర్వభూతాలనూ నా ఓజస్సుతో ధరిస్తున్నాను. రసస్వరూపుడైన చంద్రుడిగా నేనే సమస్త సస్యాలనూ పోషిస్తున్నాను.

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః,**
**ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.** (15- 14)

సకలప్రాణుల శరీరాలలోనూ "వైశ్వానరుడు" అనే జఠరాగ్నిరూపంతో ఉండి ప్రాణ –అపానవాయువులతో కలసి, భక్ష్య – భోజ్య – చోష్య – లేహ్యాలనే నాలుగు రకాల ఆహారాలను జీర్ణం చేస్తున్నాను.

ఈ లోకంలో క్షరుడనీ, అక్షరుడనీ ఇద్దరు పురుషులున్నారు. నశించే సమస్తప్రాణుల సముదాయాన్ని క్షరుడు అని వ్యవహరిస్తారు. ఏ మార్పూ లేని జీవుణ్ణి అక్షరుడు అంటారు.

ఈ క్షర–అక్షరులకంటే వేరైన ఉత్తముడు ఇంకొకడు ఉన్నాడు. అతడే నాశనంలేని పరమాత్మ. ఆ పరమాత్మ మూడు లోకాలలోనూ వ్యాపించి ఉంటాడు, వాటిని పాలిస్తూ ఉంటాడు.

**యస్మాత్ క్షరమతీతోఽహ మక్షరాదపి చోత్తమః,**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః.** (15- 18)

నేనే ఆ క్షరుణ్ణి మించినవాణ్ణి, అక్షరుడికంటే కూడా ఉత్తముణ్ణి. అందువల్ల నేను పురుషోత్తముణ్ణి. ఈ నామంతోనే లోకాలలోనూ, వేదాలలోనూ ప్రసిద్ధిని పొందాను.

శ్రీకృష్ణుడు చెప్పిన అతిరహస్యమైన ఈ శాస్త్రాన్ని బాగా తెలుసుకున్నవాడు బుద్ధిమంతుడూ, కృతార్థుడూ అవుతాడు.

# భగవంతుడికి ఇష్టమైన గుణాలు

**శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ,**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖ స్సుఖః క్షమీ.**

**శ్లో॥ సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః,**
**మయ్యర్పిత మనోబుద్ధిః యో మద్భక్త స్సమే ప్రియః.**

సృష్టిలో ఉన్న ఏ ప్రాణిమీదా ద్వేషం లేనివాడు, సకలజీవుల మీదా అవ్యాజమైన ప్రేమభావం కలిగినవాడు, అహంకారం, మమత లేనివాడు, సుఖం వచ్చినా దుఃఖం వచ్చినా చలించకుండా సమస్థితిలో వుండేవాడు, క్షమాగుణం కలిగినవాడు, అన్ని సమయాలలో సంతోషంతో వుండేవాడు, యోగాభ్యాసం చేసేవాడు, శరీరాన్ని ఇంద్రియాలని తన స్వాధీనంలో ఉంచుకున్నవాడు, పరమాత్మ మీద దృఢమైన నమ్మకం కలిగినవాడు, లోకంలో ఎవరికీ ఎలాంటి ఉద్వేగాన్ని (క్షోభని) కలిగించనివాడు, అలాగే తనని ఎవరు క్షోభపెట్టినా క్షోభపడకుండా స్థిరంగా వుండేవాడు, ఆనందం, అసూయ, భయం, ఉద్వేగం లాంటి మనోవికారాలు లేనివాడు. అనవసరమైన వస్తువుల మీద ఎలాంటి కోరికా లేనివాడు, శరీరం, ఇంద్రియాలు, మనస్సు ఎప్పుడూ శుచిగా ఉంచుకునేవాడు, కార్యనిపుణుడు, పక్షపాతం చూపించనివాడు, ఎంత బాధ కలిగినా చలించనివాడు, తాను చేసే కర్మలమీద కర్తృత్వాభిమానం లేనివాడు. శత్రువులతో, మిత్రులతో సమానంగా ప్రవర్తించేవాడు, మానాన్ని అవమానాన్ని శీతోష్ణాలని, సుఖదుఃఖాలని సమానంగా స్వీకరించేవాడు నాకు అత్యంత ఇష్టుడు అని చెప్పాడు భగవంతుడు.

**శ్లో॥ దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా,**
**మాశుచః సంపదం దైవీమ్ అభిజాతోఽసి పాండవ.** (గీత. 16-5)

అహింస, సత్యం, అక్రోధం, త్యాగం, శాంతి, అపైశునం, దయ, అలోలుపత్వం, హ్రీ (సిగ్గు), అచాపలత్వం, శౌచం, అమానిత్వం, అద్రోహం మొదలైన దైవీసంపద లక్షణాలు వున్నవాడు ముక్తిని పొందుతాడు. ఆసురీ లక్షణాలతో జీవించేవాడు సంసారబంధంలో చిక్కుకుని బాధలు పడుతూనే వుంటాడు.

✦ ✦ ✦

# తారకబ్రహ్మం

క్షరము అంటే నశించేది. నాశనం లేనిది అక్షరం. అదే పరబ్రహ్మం.

సమస్తమూ నశించినా పరబ్రహ్మస్థానం మాత్రం నిశ్చలంగా ఉంటుంది. అక్కడికి చేరుకుంటే తిరిగి వెళ్ళడం అనేది ఉండదు. అనన్యభక్తి చేతనే ఆ దివ్యపదాన్ని భక్తులు చేరుకోగలుగుతారు. అంత్యకాలంలో భగవంతుణ్ణి ధ్యానిస్తూ దేహాన్ని త్యజించేవాడు పరబ్రహ్మను చేరుకొంటాడు. ఓంకారాన్ని ఉచ్చరిస్తూ దేహాన్ని విడిచేవాడు పరమపదాన్ని పొందుతాడు.

అన్యచింతన లేకుండా నిశ్చలమైన మనస్సుతో ఎల్లప్పుడూ భగవన్నామస్మరణ చేసేవారికిమాత్రమే ఇది సాధ్యం. అలా భగవంతుణ్ణి పొందినవాడికి పునర్జన్మ అంటూ లేదు.

బ్రహ్మదేవుడికి మనలాగే పగలూ, రాత్రీ ఉంటాయి. అయితే వాటి కాలపరిమితి వేరు. పగలు రాగానే బ్రహ్మ సృష్టి ప్రారంభిస్తాడు. అలా పగటిపూట చేసిన సృష్టి బ్రహ్మకు రాత్రి కాగానే లయిస్తుంది.

పరబ్రహ్మను ఉపాసన చేసేవారు బ్రహ్మగురించీ, అధ్యాత్మగురించీ, కర్మగురించీ, అధిభూతంగురించీ సరిగ్గా తెలుసుకుంటారు. ప్రయాణకాలంలో (మరణ కాలంలో) భగవంతుణ్ణి గుర్తించగలుగుతారు. ఇది నిష్కామ ఉపాసన.

తను ఉపాసించే వస్తువు వేరు, నేను వేరు అనే భావన (భేదబుద్ధి)తో చేసేవే ఈ ఉపాసనలన్నీ. ఆ భేదబుద్ధి పోవాలంటే అభ్యాసం అవసరం. భేదబుద్ధి లేనివాడే జీవన్ముక్తుడు. అతడికి ఏ ఉపాసనతోనూ పని లేదు. ఇంకా భేదబుద్ధిని పూర్తిగా కోల్పోకుండా, ఉన్నవారికి అక్షరబ్రహ్మతత్త్వాన్ని బోధించాడు శ్రీకృష్ణపరమాత్మ.

అందులో భాగంగా బ్రహ్మలోకం వరకూ వ్యాపించి ఉన్న వివిధ లోకాలగురించీ, బ్రహ్మకాల పరిమితిగురించీ, సృష్టిగురించీ, ప్రళయంగురించీ, వీటన్నింటికీ అతీతంగా ఉన్న తత్త్వంగురించీ చెప్పాడు.

వీటన్నింటినీ తెలుసుకోవడం అంటే అక్షరమైన పరబ్రహ్మను తెలుసుకోవడం.

ఈ యోగం మనిషిని తరింపజేస్తుంది కాబట్టి ఇది తారక బ్రహ్మయోగం.

'పురుషోత్తమా! బ్రహ్మము, అధ్యాత్మము, కర్మ, అధిభూతము, అధిదైవము మొదలైనవాటిగురించి తెలుసుకోవాలని ఉంది. అసలు అధియజ్ఞుడు అంటే ఎవరు? ఈ శరీరంలో ఎలా ఉంటాడు? మనోనిగ్రహం కలవాళ్ళు మరణసమయంలో నిన్ను ఏవిధంగా తెలుసుకోగలుగుతారు?' అని అడిగాడు అర్జునుడు.

దానికి శ్రీకృష్ణపరమాత్మ ఇలా ఉద్బోధిస్తున్నాడు -

అర్జునా! శాశ్వతమైనదీ, నాశనం లేనిదీ అయిన పరమాత్మ తత్త్వాన్ని బ్రహ్మం అంటారు. దేహంలో జీవరూపంలో ఉన్న పరబ్రహ్మమే అధ్యాత్మం. సమస్త జీవుల ఉత్పత్తికీ, ఉనికికీ కారణమైనదీ, యజ్ఞరూపమైనదీ అయిన కార్యమే కర్మ.

నశించే స్వభావం కలిగిన వస్తువును అధిభూతం అంటారు.

అధిదైవం అంటే పురుషుడే. ఈ దేహంలో అంతర్యామి రూపంలో ఉండే అధియజ్ఞాన్ని నేనే.

**అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేబరమ్,**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః.** (8-5)

మరణసమయంలో నన్నే స్మరిస్తూ శరీరాన్ని విడిచిపెట్టినవాడు నా స్వరూపాన్నే పొందుతాడు. ఇందులో సందేహమేమీ లేదు. ఎందుకో తెలుసా? అవసానదశలో ఎవడు ఏ భావాలతో శరీరాన్ని విడిచిపెడతాడో, ఆ భావాలకు తగిన స్థితినే పొందుతాడు.

అటువంటి పరమేశ్వరుణ్ణి మరణకాలంలో ధ్యానించాలి. మనస్సును నిశ్చలంగా ఉంచుకొని, భక్తిభావంతో, యోగబలంతో, కనుబొమల మధ్య ప్రాణవాయువును నిలిపి ధ్యానించాలి. అలా ధ్యానించేవాడు ఆ దివ్యపురుషుణ్ణి పొందుతాడు. అలా పొందడాన్నే పరమపదప్రాప్తి అంటారు.

## పరమపదం

ఇంద్రియాలన్నిటినీ నిగ్రహించి, మనస్సును హృదయంలో నిరోధించి, ప్రాణవాయువును శిరస్సులో ఉంచి, యోగాన్ని అభ్యసిస్తూ, నిశ్చలమైన స్థితిని పొంది, ఓంకారమనే అక్షరరూపంలో ఉన్న బ్రహ్మను ఉచ్చరిస్తూ, నన్నే స్మరిస్తూ, శరీరాన్ని విడిచిపెట్టేవాడు మోక్షం పొందుతాడు. (8-12,13)

బ్రహ్మలోకంవరకూ ఉండే అన్నిలోకాలూ పునర్జన్మ కలుగజేస్తాయి. నన్ను పొందినవాళ్ళకు మాత్రం మరోజన్మ అంటూ లేనే లేదు. వేయి యుగాలు గడిస్తే అది బ్రహ్మదేవుడికి ఒక పగలు, ఇంకో వేయి యుగాలు ఆ బ్రహ్మదేవుడికి ఒక రాత్రి. ఇది తెలుసుకున్నవాళ్ళే రాత్రింబవళ్ళ తత్త్వాన్ని గ్రహిస్తారు (8-17). బ్రహ్మదేవుడికి పగలుకాగానే చరాచర వస్తువులన్నీ అవ్యక్త ప్రకృతి నుంచి బయటకువస్తాయి. మళ్ళీ రాత్రికాగానే అవ్యక్తం అనబడే ఆ ప్రకృతి లోనే కలసిపోతాయి (8-18).

పార్థా! ఈ జీవకోటికి ఏవిధమైన స్వాతంత్ర్యమూ లేదు. పగలు రాగానే పుడుతుంది. రాత్రి రాగానే ప్రకృతిలో లీనమవుతుంది. ఈ విధంగా మాటిమాటికీ పుట్టీ పుట్టీ నశిస్తుంది.

పరబ్రహ్మం మాత్రం సమస్తభూతాలూ నశించినా నశించదు. సమస్తభూతాలనూ తనలో ఇముడ్చుకుని, సకలలోకాలలో వ్యాపించి ఉన్న పరమాత్మను తెలుసుకోవాలంటే అచంచలమైన భక్తి కావాలి. ఆ భక్తివల్లనే పరమాత్మను పొందవచ్చు.

అగ్ని, జ్యోతిస్సు, పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణం అనే ఆరుమాసాలు - ఈ మార్గంలో బ్రహ్మోపాసకులు మరణిస్తే వాళ్ళకు బ్రహ్మప్రాప్తి కలుగుతుంది. బ్రహ్మదేవుడి లోకానికి వెళ్తారు.

ధూమం, రాత్రి, కృష్ణపక్షం, దక్షిణాయనం ఆరుమాసాలు - ఈ మార్గంలో గతించిన యోగి చంద్రజ్యోతిని పొంది, మళ్ళీ మానవలోకంలోకి వస్తాడు.

ఈ రెంటినీ 1. శుక్లగతి, 2. కృష్ణగతి అని అంటారు.

ఈ రెండూ జగత్తుకు - మానవులకు సర్వదా లభించే రెండు గతులు. వీటిలో మొదటిదైన శుక్లగతిని అనుసరించి ఆ మార్గంలో పయనించినవాడు బ్రహ్మలోకానికి వెళ్తాడు. అక్కడ మోక్షం పొందుతాడు. అందువల్ల మళ్ళీ తిరిగిరాడు. అదే జన్మరాహిత్యం.

కృష్ణగతిని అనుసరించి ఆ మార్గంలో వెళ్ళినవాడు తిరిగివస్తాడు. అంటే పునర్జన్మను పొందుతాడు.

దీనినంతా గ్రహించిన యోగి - వేదాలలోనూ, యజ్ఞాలలోనూ, తపస్సులలోనూ, దానాలలోనూ చెప్పిన పుణ్యఫలాలను సమస్తమూ అతిక్రమిస్తాడు. అనాది అయిన పరమపదాన్ని పొందుతాడు.

✦ ✦ ✦

# ప్రపత్తి - శరణాగతి

విశ్వాత్మకుడైన భగవంతుడే ఈ జగత్తుకు ఆధారభూతుడని త్రికరణ శుద్ధిగా నమ్మి అన్ని మార్గాలనూ ప్రయత్నాలనూ విడిచిపెట్టి, ఆ పరమాత్మనే అనన్యమైన భక్తితో ఆరాధించడమే శరణాగతి.

అపార దయా సముద్రుడైన పరమాత్మ జీవులందరినీ సృష్టించి, పరిపాలించి, నాశనం చేస్తాడు.

'అంతా ఈశ్వరాధీనమే!' అని విశ్వసిస్తూ మనం మన కర్తవ్యాలను అనుసరించి కర్మల్ని ఆచరించాలి. ఆచరించే ప్రతి కర్మనూ ఈశ్వరార్పణ బుద్ధితో చేయాలి.

భగవంతుడి కరుణ ఒక్కటే జీవుల్ని సర్వవిధాల రక్షిస్తుంది. శక్తి నిస్తుంది. ఆత్మస్థైర్యాన్ని, జ్ఞానాన్ని, శాంతిని ప్రసాదిస్తుంది. అన్ని రకాలైన ఇంద్రియ విషయాలనుండి నిగ్రహించుకోగల ధైర్యాన్ని ఇస్తుంది. బలహీనతలనూ, సందేహాలనూ రూపుమాపి నివృత్తి మార్గాన్ని చూపిస్తుంది.

ఇదే అందరికీ అన్ని కాలాలలోనూ, అన్ని విధాలా శ్రేయోదాయకమైన మార్గం. నిస్స్వార్థంగా, నిరపేక్షగా నిరాసక్తంగా కర్మల్ని ఆచరించాలి.

దీనిని బట్టి చూస్తే సమస్త జీవకోటికీ రెండు సాధనాలు గోచరిస్తాయి.

1. కర్మల్ని ఫలాపేక్ష లేకుండా ఆచరించడం.

2. భగవంతుడి కృపను పొందేలా నడుచుకోవడం.

ఈ రెండే భగవంతుణ్ణి పొందడానికి దివ్యమైన మార్గాలు. ఆ మార్గాల్ని సులభంగా అందించేదే శరణాగతి.

శ్రీకృష్ణపరమాత్మ ఇలా చెబుతున్నాడు –

**పరమాత్మ గురించీ, పరమార్థతత్త్వం గురించీ తెలిసినవాళ్ళు అంటే నాపైనే స్థిరమైన బుద్ధి కలవాళ్ళు నేనే ఈ జగత్తుకు కారణమనీ, ఇదంతా నా నుండే పుడుతోందనీ తెలుసుకొని నన్ను సేవిస్తూ ఉంటారు.**

ఇలాంటి వాళ్ళకు నేను బుద్ధి యోగాన్ని ప్రసాదిస్తాను. దానితో వీళ్ళు నన్ను చేరుకుంటారు. అలాంటి వాళ్ళ అంతఃకరణలో నేనే ఉంటాను. అలా ఉంటూ వాళ్ళను అనుగ్రహించడం కోసమే వాళ్ళలో అజ్ఞానంవల్ల పుట్టిన తమస్సును జ్ఞానదీపంతో తొలగిస్తాను.

మానవులు అవ్యక్తరూపమైన గతిని చేరుకోవడం అంటే మాటలు కాదు. చాలా కష్టం. దీనికి కారణం - మానవులకు దేహంపై కల అభిమానమే. (12-5)

**యే తు సర్వాణి కర్మాణి మయి సంన్యస్య మత్పరాః,**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే,** (12-6)

ఎవరు - సమస్త కర్మల్నీ నాపట్ల సన్యసించి (నాకే అర్పించి), అనన్యమైన యోగంతో నన్ను ఉపాసిస్తారో అటువంటి వాళ్ళ చిత్తం నాపైనే స్థిరంగా ఉంటుంది.

అలాంటి స్థిరచిత్తులైన వాళ్ళను అచిరకాలంలోనే మృత్యువులాంటి సంసారసాగరం నుండి ఉద్ధరిస్తాను.

స్థిరమైన భక్తియోగంతో నన్ను ధ్యానించినవాడు - సేవించినవాడు మూడు గుణాలనూ అతిక్రమించి బ్రహ్మత్వానికి సర్వసమర్థుడవుతాడు.

**తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత !**
**తత్ప్రసాదాత్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్.** 18-62)

నా యందే మనస్సు నిలుపు. నా భక్తుడివి కా! నన్నే పూజించు. నాకు నమస్కరించు. నన్ను తప్పక పొందుతావు. నేను ప్రతిజ్ఞ చేసి మరీ చెబుతున్నాను.

సర్వధర్మాలనూ, అధర్మాలనూ కూడా విడిచిపెట్టి, నన్నే శరణు వేడుకో ! నేనే నిన్ను అన్ని పాపాల నుండీ విముక్తుణ్ణి చేస్తాను.

**య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి,**
**భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్య త్యసంశయః.** (18-68)

నన్నే సేవిస్తూ నామీద అమితమైన భక్తి కలవారికి, ఈ రహస్యమైన జ్ఞానాన్ని చెప్పాలి. ఇలా చెప్పడం కూడా భగవత్ సేవయే. ఈ విధంగా భగవంతుడికి సేవ చేస్తున్నాననే భావనతో చెప్పాలి. అలా చెప్పినవాడు నన్ను చేరుకుంటాడు. ఇందులో ఎంతమాత్రమూ సంశయం లేదు.

✢ ✢ ✢

# ఓంకారోపాసన

ఓంకారోపాసన వల్ల పరబ్రహ్మతత్త్వం సంపూర్ణంగా అవగతమవుతుందని ఉపనిషత్తులు చెబితే, ఓంకారోపాసన వల్ల శరీరశుద్ధి ఏర్పడుతుంది. శరీరశుద్ధి, మానసిక వికాసం కలుగుతాయి.

**"యస్మాదుచ్చార్యమాణ ఏవ ప్రాణానూర్ధ్వముత్క్రామయతి తస్మాదుచ్యతే ఓంకారః"** (అథర్వ శిరోపనిషత్ 4-1) ఒక్కసారి ఉచ్చరిస్తే చాలు ప్రాణాల్ని పైకి లేవదీస్తుంది కాబట్టి ఇది 'ఓం'కారం.

ఒక్కసారి ఉచ్చరించగానే అలా ఉచ్చరించినవాడికి ఋగ్యజుస్సామ అథర్వణ వేదాలను, షడంగాలను, జపయజ్ఞ ఫలరూపమైన బ్రహ్మాన్ని పొందింప చేస్తుంది కనుక ఈ ఓంకారాన్ని ప్రణవం అంటారు. ఒక్కసారి ఉచ్చరించగానే గర్భ, జన్మ, జరామరణ రూపమైన సంసార భయం నుంచి మానవుణ్ణి తరింపచేస్తుంది కనుక ఓంకారాన్ని తారకం అనికూడా అంటారు. ఒక్కసారి ఉచ్చరించగానే ఆత్మజ్ఞానాన్ని వృద్ధి చేస్తుంది కనుక ఈ ఓంకారాన్ని పరంబ్రహ్మ అనికూడా వ్యవహరిస్తారు.

'ఓం' అనే ఏకాక్షరమే పరబ్రహ్మ స్వరూపం. కనుక ముక్తిని కోరుకునే వారంతా ఈ ఓంకారాన్ని ధ్యానించాలి. ఓంకారాన్ని హ్రస్వ, దీర్ఘ, అర్ధమాత్రలుగా ఉచ్చరించవచ్చు. వీటిలో హ్రస్వమైన ఓంకారం పాపాల్ని భస్మం చేస్తే, దీర్ఘమైన ఓంకారం సంపదల్ని అనుగ్రహిస్తుంది. అర్ధమాత్రలో ఉన్న ఓంకారం మోక్షాన్ని అందిస్తుంది. మానవుడు తన హృదయపద్మం అగ్రభాగంలో నిశ్చలమైన దీపంలా ప్రకాశించేవాడు, బొటనవేలు ప్రమాణంలో ఉన్నవాడు, నిశ్చలమైనవాడు, ఓంకార స్వరూపుడు అయిన పరమేశ్వరుణ్ణి ధ్యానించాలి. అలాంటి వాళ్ళు మోక్షాన్ని పొందుతారు.

లోకంలో మానవుడిని ఎన్నిరకాల పాపాలు చుట్టుముట్టినా పన్నెండువేల సార్లు ఓంకార మంత్రాన్ని జపిస్తే చాలు. ఆ పాపాలన్నీ నశించిపోతాయి. ఎవరైతే క్రమం తప్పకుండా ప్రతిరోజూ పన్నెండువేల సార్లు ఓంకారాన్ని శ్రద్ధగా జపిస్తాడో అలాంటివాడికి పన్నెండు నెలల్లో పరబ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుంది.

కనిపించే ఈ సకలసృష్టినీ ఓంకారం ప్రకాశింపచేస్తోంది. ఇది పరబ్రహ్మతో సమానమైనది. గురువు ద్వారా ఉపదేశం పొంది, శ్రద్ధగా జపిస్తే ఫలం త్వరగా లభిస్తుంది.

"ఓంకారం అన్ని మంత్రాలకన్నా ఉత్తమమైనది. ఈ ఓంకారం అనే నావ సహాయంతోనే మానవుడు సంసారమనే సముద్రాన్ని దాటగలుగుతాడు" అని సూతసంహిత ఓంకారం గొప్పతనాన్ని వర్ణిస్తుంది.

**శ్లో॥ ఓమిత్యే కాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మా మనుస్మరన్,**
**యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాం గతిమ్.**

(భగవద్గీత 8-13)

ఇంద్రియాలని నిగ్రహించి, మనస్సుని హృదయంలో స్థిరంగా నిలిపి, వశమైన మనస్సు ద్వారా ప్రాణాల్ని సహస్రారంలో స్థిరంగా ఉంచి, అక్షరబ్రహ్మ స్వరూపమైన ఓంకారాన్ని ఉచ్చరిస్తూ, పరమాత్మనే ధ్యానిస్తూ శరీరాన్ని వదిలేసిన వాడి(యోగి)కి పరమగతి అనగా మోక్షం లభిస్తుంది.

✦ ✦ ✦

# మూడు తత్వాలు

మానవుడు పరమాత్మని లేక పరంధామాన్ని చేరుకోవటానికి, మూడురకాల దారుల్ని చూపించారు. ముగ్గురు మహాత్ములు.

## అద్వైత సిద్ధాంతం

ఆత్మ, పరమాత్మ రెండూ వేరు కావు. ఒకటే అని చెప్పే సిద్ధాంతం అద్వైతం. జగద్గురు ఆదిశంకరులు అద్వైత సిద్ధాంతాన్ని ప్రబోధించారు. ఈ సిద్ధాంతం ప్రకారం **"బ్రహ్మసత్యం జగన్మిథ్య జీవో బ్రహ్మైవ నా పరః"** అంటే పరబ్రహ్మ లేక పరమాత్మ మాత్రమే సత్యమైనవాడు. కనిపించే ఈ ప్రపంచం అంతా మిథ్య. (అనగా లేనిది ఉన్నట్టుగా కనిపిస్తుంది)

'జీవాత్మ-పరమాత్మ' రెండూ వేరుకాదు (న-ద్వైతం -అద్వైతం) ఇద్దరూ ఒక్కటే అని తేల్చి చెప్పేదే అద్వైతమతం లేక మార్గం.

శంకరుల సిద్ధాంతం ప్రకారం పరబ్రహ్మ లేక పరమాత్మ నిర్గుణుడు, నిష్క్రియుడు (ఎలాంటి క్రియలు చేయనివాడు) నిరవయవుడు (ఎలాంటి అవయవాలు లేనివాడు) నిర్విశేషుడు (ఎలాంటి విశేషాలూ లేనివాడు) సచ్చిదానంద స్వరూపుడు, శుద్ధచైతన్యంతో నిండినవాడు. ఇలాంటి పరమ్మాత - జీవుడిలో ఉన్న జీవాత్మ ఇద్దరూ ఒక్కటే. అయితే ఈ జీవాత్మ మాయా (అజ్ఞానం) ప్రభావానికిలోనై శరీరం ఇంద్రియాలు, మనస్సులతో తాదాత్మ్యం చెందటంవల్ల అనేకరకాల బాధల్ని అనుభవిస్తోంది. ఎప్పుడైతే జీవాత్మ బ్రహ్మజ్ఞానాన్ని పొందుతుందో అప్పుడు అది పరమాత్మలో ఐక్యమైపోతుంది. మానవుడికి జ్ఞానోదయం కానంతవరకూ 'మాయ' వదలదని శంకరులు చెబుతారు.

శంకరాచార్యులు ప్రబోధించిన ఈ అద్వైత సిద్ధాంతం ఆనాటి నుంచీ నేటివరకూ ఎంతోమందిని ఆకర్షించింది. తన అద్వైత సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకునే వారు పది ఉపనిషత్తులకి, బ్రహ్మసూత్రాలకి, భగవద్గీతకి వ్యాఖ్యానాలు వ్రాసారు. వీటినే ప్రస్థానత్రయం అంటారు.

## విశిష్టాద్వైత సిద్ధాంతం

ఈ సిద్ధాంతంలో ఆత్మ, పరమాత్మ, ప్రకృతి అనే మూడింటికి ప్రాధాన్యం ఉంటుంది. పరమాత్మ ఒక్కడే. ఆయనలోనే ఆత్మ, పరమాత్మ విశిష్టమై ఉంటాయి.

విశిష్టము అంటే కూడి ఉండడం. ప్రకృతి, జీవాత్మ రెండింటితో కూడిన పరమాత్మ ఒక్కటే అని నిరూపించే సిద్ధాంతం ఇది. విశిష్టాద్వైత మార్గాన్ని ప్రచారం చేసినవారు ముగ్గురు. 1.శ్రీనాథముని, 2. యమునాచార్యులవారు, 3. శ్రీరామానుజాచార్యులవారు. వీరిలో శ్రీరామానుజాచార్యులవారు సుప్రసిద్ధులు. ఆయన విశిష్టాద్వైత సిద్ధాంతం ఆధారంగా బ్రహ్మసూత్రాలకి శ్రీభాష్యం అనే పేరుతో ఒక వ్యాఖ్యానాన్ని రచించారు. అలాగే భగవద్గీతను కూడా విశిష్టాద్వైత పరంగా వ్యాఖ్యానించారు. వీటితో పాటు 1. వేదాంత సారం, 2.వేదాంత సంగ్రహం, 3.వేదాంత దీపం అనే మూడు గ్రంథాల్ని కూడా లోకానికి అందించారు.

విశిష్టాద్వైత సిద్ధాంతం ప్రకారం కూడా పరమాత్మ ఒక్కడే (రెండవవాడు లేడు అద్వైత సిద్ధాంతంలాగా) అయితే ఈ పరమాత్మకి ఎన్నో విశేషాలున్నాయి. ఎన్నో రూపాలున్నాయి, ఎన్నో గుణాలున్నాయి, ఎన్నో నామాలున్నాయి. ఆయన అనంత కల్యాణ గుణసంపన్నుడు.

శంకరుల ప్రకారం భగవంతుడికి ఎలాంటి గుణాలు, రూపాలు, అవయవాలు లేవు. అయితే రామానుజుల వారి సిద్ధాంతం ప్రకారం భగవంతుడికి అన్నీ ఉన్నాయి. ఇవన్నీ సత్యమైనవి, శాశ్వతమైనవి కూడా. విశిష్టాద్వైతం ద్వంద్వాన్ని అంగీకరిస్తుంది. జీవుల్లో వుండే ఆత్మ, పరమాత్మ ఒక్కటికాదు. ఈ జీవాత్మ భగవంతుడితో (పరమాత్మతో) సమానం ఎప్పటికీ కాదు. ఈ జీవాత్మ పరమాత్మ నుంచి ఆవిర్భవిస్తుంది. ఇది ఎప్పుడూ పరమాత్మలో అంతర్భాగమై వుంటుంది. ఈ విశ్వమంతా పరమాత్మ శరీరం. దీన్ని నియంత్రిస్తున్న పరమాత్మ జీవాత్మని, అనగా జీవజాలాన్ని కార్యోన్ముఖుల్ని చేస్తుంటాడు.

మోక్షం పొందటం అంటే జీవాత్మ సంసార బాధల నుంచి విముక్తి పొంది, శ్రీమన్నారాయణుడి వైకుంఠ ధామానికి చేరటం. అలా చేరిన ఆత్మకి పరమాత్మ స్వరూప స్వభావాలు లభిస్తాయి కానీ, పరమాత్మతో అది ఎప్పుడూ సమానం కాలేదు. విశిష్టాద్వైత సిద్ధాంతం జీవన్ముక్తిని అంగీకరించదు. జీవాత్మ శరీరాన్ని వదిలాకే ముక్తిని పొందుతుంది.

శంకరాచార్యులవారు మోక్షాన్ని పొందటానికి జ్ఞాన (బ్రహ్మజ్ఞాన/ఆత్మజ్ఞాన) మార్గాన్ని ప్రబోధిస్తే, రామానుజాచార్యులవారు భక్తి మార్గానికి ప్రాధాన్యతనిచ్చారు. భక్తి, ప్రపత్తులు ద్వారానే మోక్షాన్ని పొందవచ్చని కర్మమార్గం, జ్ఞానమార్గం అనేవి భక్తి మార్గానికి సాధనాలు మాత్రమే అని రామానుజచార్యుల వారు తెలియచేస్తారు. వీరి దృష్టిలో పరమాత్మ అంటే వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణుడే.

## ద్వైత సిద్ధాంతం

ద్వైతమత సిద్ధాంతాన్ని లేదా మార్గాన్ని ప్రబోధించినవారు శ్రీమధ్వాచార్యులు. ఆయన తన ద్వైత సిద్ధాంతం ఆధారంగా ఉపనిషత్తులు, బ్రహసూత్రాలు, భగవద్గీత అనే ప్రస్థాన త్రయానికి భాష్యం రాశారు. వీరు రాసిన బ్రహ్మసూత్ర భాష్యాన్ని 'అణుభాష్యం' అంటారు. మధ్వాచార్యుల సిద్ధాంతం ప్రకారం జీవాత్మ-పరమాత్మ ఒక్కటి కాదు ఇద్దరూ వేరు. అలాగే పరమాత్మ- ప్రకృతి కూడా ఒక్కటి కాదు వేరువేరు. వీటిలో ఏకత్వం లేదు కనుక వీరి సిద్ధాంతాన్ని ద్వైతమత సిద్ధాంతం అంటారు.

పరమాత్మ అనేది స్వతంత్రమైన 'సత్' పదార్థం. ప్రకృతి, జీవాత్మలు అనేవి ఈ పరమాత్మ మీదే ఆధారపడ్డాయి. మధ్వాచార్యులవారు తమ సిద్ధాంతంలో 1. పరమాత్మ-జీవాత్మ, 2. పరమాత్మ-జడపదార్థాలు, 3. జీవాత్మ-జీవాత్మ, 4. జీవాత్మ-జడపదార్థాలు, 5. జడపదార్థం-జడపదార్థం. ఇలా ఈ అయిదిటి మధ్యా భేదాలున్నాయని చెబుతారు. వీటినే పంచభేదాలు అంటారు. వీరు స్థాపించిన సిద్ధాంతాన్ని సద్వైష్ణవం అనికూడా అంటారు. మధ్వాచార్యుల అభిప్రాయంలో కూడా పరమాత్మ అన్నా పరబ్రహ్మ అన్నా శ్రీమన్నారాయణుడే.

ద్వైత సిద్ధాంతం ప్రకారం ఈ ప్రపంచం సత్యమైనది. ఇది మిథ్య కానేకాదు. ఈ సమస్త సృష్టికీ ప్రకృతి ఉపాదాన కారణమైతే, శ్రీమన్నారాయణుడు నిమిత్తమాత్రుడుగా ఉన్నాడు. సృష్టిలో అన్ని పదార్థాలు, శరీరాలు, అవయవాలు అన్నీ ప్రకృతి నుంచే ఆవిర్భవిస్తున్నాయి. ఈ విశ్వమంతా ఎన్నో జీవాత్మలున్నాయి. అవన్నీ ఒకే లక్షణంతో ఉండవు. జీవాత్మ పరమాత్మ మధ్య భేదం వున్నది. మోక్షం పొందాక కూడా జీవాత్మ పరమాత్మతో సమానం కాలేదు. అది కేవలం పరమాత్మకి (శ్రీమన్నారాయణుడి) సేవకుడిగా మాత్రమే ఉండగలుగుతుంది.

మధ్వాచార్యులు కూడా మోక్షానికి భక్తినే మార్గంగా చూపించారు. "భక్తి తీవ్రంగా ఉంటేనే పరమాత్మ దయ లభిస్తుంది. పరమాత్మ దయవల్ల మోక్షం ప్రాప్తిస్తుంది. భజన, కీర్తన, కథాశ్రవణాల ద్వారా మానవుల్లో భక్తి వృద్ధి చెందుతుంది. వైరాగ్యం, ఇంద్రియ నిగ్రహం, శరణాగతి అనేవి మోక్షసాధనకి నియమాలు. ప్రతి ఒక్కరూ భాగవతంలో చెప్పిన విధంగా కృష్ణపరమాత్మని పూజించాలి" అని ప్రబోధించారు.

✦ ✦ ✦

# పితృదేవతలు

శ్లో॥ మనోర్హైరణ్య గర్భస్య యే మరీచ్యాదయః సుతాః,
తేషామృషీణాం సర్వేషాం పుత్రాః పితృగణాః స్మృతాః.

(మనుస్మృతి 3-194)

ఈ విధంగా పితృగణాలతో నిండిన లోకాన్నే పితృలోకం అంటారు. ఈ లోకంలో ఉన్నవాళ్ళని పితృదేవతలుగా భావించి పూజించాలి. మరీచి మొదలైన ఋషుల సంతానమే ఈ పితృదేవతలు.

ఋషుల నుంచి పితృదేవతలు జన్మించగా, ఆ పితృదేవతల నుంచి దేవతలు- మానవులు ఆవిర్భవించారు. వీరిలో దేవతల ద్వారా ఈ చరాచర సృష్టి మొత్తం ఆవిర్భవించింది. కనుక దేవతలతో సమానంగా పితృదేవతల్ని పూజించాలి. వాళ్ళకి శ్రద్ధాపూర్వకంగా శ్రాద్ధవిధిని ఆచరించాలి. లేకపోతే అశుభఫలితాలు కలుగుతాయి. వారికి ఎంతో శ్రద్ధగా శ్రాద్ధాదులు నిర్వహించాలి.

## శ్రాద్ధ భేదాలు

1. నిత్యశ్రాద్ధం 2. నైమిత్తికశ్రాద్ధం 3.కామ్యశ్రాద్ధం 4. వృద్ధిశ్రాద్ధం 5.సుండనశ్రాద్ధం 6. పార్వణ శ్రాద్ధం 7. గోష్ఠశ్రాద్ధం 8. శుద్ధి శ్రాద్ధం 9. కర్మాంగశ్రాద్ధం 10.దైవిక శ్రాద్ధం 11.ఔపచారిక శ్రాద్ధం 12.సాంవత్సరిక శ్రాద్ధం. ఈ విధంగా శ్రాద్ధభేదాలు పన్నెండురకాలుగా ఉంటాయని భవిష్యపురాణం చెబుతుంది.

నువ్వులు, ధాన్యం, పాలు, నీళ్ళు, ఫలాలు, కూరలతో, పితృదేవతల్ని సంతోషపరచటానికి నిత్యంచేసే దాన్ని 'నిత్యశ్రాద్ధం' అంటారు. ఏదైనా నిమిత్తంగా చేసేదాన్ని 'నైమిత్తిక శ్రాద్ధం' అంటారు. ఈ శ్రాద్ధాన్ని ఎవరో ఒకర్ని మాత్రమే ఉద్దేశించి ప్రత్యేకంగా చేస్తారు. ఈ శ్రాద్ధంలో భోక్తలుగా బేసి సంఖ్యలో (అనగా 3, 5, 7) విప్రుల్ని పిలిచి భోజనం పెట్టాలి. ఏదో ఒక ప్రత్యేకమైన కోరికతో చేసేదాన్ని ఈ కామ్యశ్రాద్ధం అంటారు. అలాగే వృద్ధి శ్రాద్ధాన్ని తనకి సంపదవంటివి వృద్ధిచెందటం కోసం చేస్తారు. పిండాలతో ప్రధానంగా చేసేది సపిండ శ్రాద్ధం. ఇందులో నాలుగు

పాత్రల్ని ఉంచి వీటిలో గంధాన్ని, ఆ నీటిని, నువ్వుల్ని వదలాలి. నాలుగోపాత్ర పితృపాత్ర. అందులో ప్రేతపాత్ర జలాల్ని వదలాలి. ఈ సందర్భంలో "యే సమానాః" అనే యజుర్వేదమంత్రాన్ని పఠించాలి.

అమావాస్యగానీ మరే తిథిలోనైనాగానీ చేసే శ్రాద్ధకర్మని 'పార్వణశ్రాద్ధం' అంటారు. అలాగే ఆవులనుద్దేశించి చేసే కర్మని 'గోష్ఠశ్రాద్ధం' అంటారు. ఇక పితృదేవతల సంతృప్తి కోసం, సుఖాలు ప్రాప్తించటం కోసం, పండితుల సంతృప్తి కోసం విప్రులకి భోజనాలు పెట్టి సత్కరించి చేసే శ్రాద్ధకర్మనే 'శుద్ధి శ్రాద్ధం' అంటారు. 'కర్మాంగ శ్రాద్ధం' అంటే! గర్భాదానం, సీమంతం, పుంసవనం వంటి సంస్కారాల్లో చేసే కర్మ. యాత్రల్లో దేవతల ప్రీతి కోసం నేయిని ఉపయోగించి చేసే హవనాది కార్యక్రమాల్ని 'దైవిక శ్రాద్ధం' అంటారు.

'ఔపచారిక శ్రాద్ధం అంటే, తన శరీరపుష్టికోసం, అభివృద్ధికోసం చేసేది అని. ఈ శ్రాద్ధాలన్నిటికన్నా గొప్పది 'సాంవత్సరిక శ్రాద్ధం', మరణించిన వ్యక్తి అతనికి సంబంధించినవారు ప్రతి సంవత్సరం అతడు మరణించిన తిథినాడు తప్పకుండా చేసే శ్రాద్ధం. ఈ విధంగా మరణించిన వ్యక్తి వారసులు సాంవత్సరిక శ్రాద్ధాన్ని నిర్వహించకపోతే వారుచేసే పూజల్ని ఏ దేవతలు స్వీకరించరు. అంతేకాదు వారు భయంకరమైన 'ఘోర తమిస్రం' అనే నరకంలో యమబాధలు అనుభవించి తిరిగి పందిగా జన్మిస్తారు.

ఎవరైనా చనిపోయినవారి తిథి, నక్షత్రం కనీసం మాసం కూడా తెలియకపోతే వారికి మరోవిధానం ఉంది. ఏదోఒక నెలలో వచ్చే అమావాస్య తిథిని నిర్ణయించుకుని, ప్రతి సంవత్సరం అదే అమావాస్యనాడు వారికి శ్రాద్ధాన్ని పెట్టవచ్చు. మృగశిర, మఘ నక్షత్రాలున్న రోజు పితృదేవతలకి శ్రాద్ధం పెట్టి, విప్రుల్ని భోజనాలతో సంతృప్తి పరిస్తే శుభం జరుగుతుంది.

✦ ✦ ✦

# పాపాలు ఫలితాలు

పుణ్యం చేయడం ఎంత అవసరమో పాపం చేయకుండా ఉండడమూ అంతే అవసరం. స్మృతిగ్రంథాలు ఏ పాపం చేస్తే ఏ ఫలితం వస్తుందో వివరించాయి. అవి తెలుసుకొని ఆ పనులు చేయకుండా ఉండాలి.

ఈ జన్మలో చేసిన పాపాలతో కొందరు, పూర్వజన్మలో చేసిన పాపాలతో కొందరు కుష్ఠవ్యాధి పాలవుతున్నారు.

బంగారాన్ని దొంగతనం చేస్తే గోళ్ళు చెడిపోతాయి.

మద్యపానం చేస్తే పళ్ళు నల్లగా మారిపోతాయి.

బ్రాహ్మణుణ్ణి చంపితే క్షయరోగం వస్తుంది.

గురువు భార్యతో వ్యభిచారం చేస్తే చర్మం చెడిపోతుంది.

లోభగుణంతో వున్నవాడి ముక్కు దుర్వాసనతో నిండి వుంటుంది.

చేయని నేరాల్ని మోపేవాడి ముఖం దుర్వాసనతో వుంటుంది.

ధాన్యాన్ని దొంగతనం చేస్తే అంగహీనుడవుతాడు.

ఇతరుల వస్త్రాలని దొంగతనం చేసినవాడు, తెల్ల కుష్టువ్యాధితో పీడించబడతాడు.

గుర్రాన్ని దొంగిలించినవాడు కుంటివాడవుతాడు.

ఈ జన్మలో చేసిన పాపాలకి ప్రాయశ్చిత్తాలు చేసుకోకపోతే మరుజన్మలో కురూపులుగా, అంగవైకల్యంతో పుడతారు.

1.బ్రహ్మ (బ్రాహ్మణ) హత్య, 2.సురాపానం, 3.దొంగతనం, 4.గురువు భార్యతో సంగమిచటం, 5. ఈ పాపాలు చేసినవాళ్ళతో సావాసం చేయటం. ఈ అయిదు కార్యాలనీ పంచమహా పాతకాలు అంటారు.

నిజంగా గొప్పవాడి ముందు (తాను కాకపోయినప్పటికీ), తానుకూడా గొప్పవాణ్ణని అబద్ధం చెప్పటం, ఇతరుల మీద చాడీలు చెప్పటం, గురువుమీద నిందలు వేయటం ఈ మూడు పాపాలూ బ్రహ్మహత్యతో సమానమైనవి.

వేదాల్ని నిందించటం, అబద్ధపు సాక్ష్యాలు చెప్పటం, స్నేహితుల్ని చంపటం, తినకూడని పదార్థాలు తినటం అనేవి సురాపానం చేయటంతో సమానమైన పాపాలు.

జీతం తీసుకుని వేదం చెప్పటం, భార్య సంపాదనతో బ్రతకటం, వంటకోసం పచ్చని చెట్లు నరకటం, ధాన్యం, పశువులు, లోహాలని దొంగిలించటం, నాస్తిక భావాలతో వుండటం, వడ్డీ ధనంతో బ్రతకటం, దేవతలకి నివేదన చేయకుండా ఆహారం తీసుకోవటం మొదలైనవన్నీ ఉపపాతకాలు.

పంచమహా పాతకాలు లేదా ఉపపాతకాలు వీటిలో ఏవైనా చేసి ఆ పాపాల్ని పోగొట్టుకోవాలనుకునే బ్రాహ్మణుడు **"యత్కించేదం వరుణదేవ్యై వ్రతం"** అనే ఋక్కుగానీ, **"ఇతివా ఇతిమే మనః"** అనే ఋక్కునుగానీ, రోజుకి ఒకసారి చొప్పున ఒక సంవత్సరం జపించాలి.

ఎన్నో పాపాలు చేసిన విప్రుడు "ఇంద్రం మిత్రం వరుణమగ్నిం" అనే ఏడు ఋక్కుల్ని ఆరునెలలు పారాయణ చేయాలి.

మూడు రాత్రులు ఉపవాసం చేసి ప్రతిరోజూ మూడుసంధ్యల్లో "అఘమర్షణ" మంత్రాలు చదువుతూ స్నానం చేస్తూ వుంటే సమస్తపాపాలు నశిస్తాయి.

పతితులతో స్నేహం చేసేవాళ్ళు, పరస్త్రీ వ్యామోహంతో వున్నవాళ్ళు, బ్రాహ్మణుల ధనాన్ని అపహరించేవాళ్ళు బ్రహ్మరాక్షసులుగా పుడతారు.

ఇతరుల ధాన్యాన్ని దొంగిలించినవాడు ఎలుకగా పుడతాడు.

కంచుని దొంగతనం చేసినవాడు హంసగా, నీళ్ళని దొంగిలించినవాడు బెగ్గురు పక్షిగా, తేనె అపహరించినవాడు ఈగగా, పాలని దొంగిలించినవాడు కాకిగా, నెయ్యి అపహరించినవాడు ముంగిసగా జన్మిస్తారు.

మాంసాన్ని దొంగిలించినవాడు గద్దగా, నూనెని అపహరించినవాడు గబ్బిలంగా, పెరుగును అపహరించినవాడు కొంగగా, పట్టువస్త్రాల్ని అపహరించినవాడు తిత్తిరిపక్షిగా, దూది, వస్త్రాల్ని ఎత్తుకుపోయినవాడు క్రౌంచపక్షిగా, ఆవుని దొంగిలించినవాడు ఉడుముగా జన్మిస్తారు.

సుగంధద్రవ్యాల్ని అపహరించినవాడు చుంచెలుకగా, ఆకుకూరల్ని దొంగిలించిన వాడు నెమలిగా, అన్నాన్ని అపహరించినవాడు ముళ్ళపందిగా, అగ్నిని అపహరించినవాడు కొంగగా, రోలు. రోకలి లాంటి గృహోపకరణ వస్తువుల్ని దొంగతనం చేసినవాడు పేడపురుగుగా జన్మిస్తారు.

పళ్ళు, కాయలు అపహరించేవాడు కోతిగా, స్త్రీలని దొంగలించేవాడు ఎలుగుబంటిగా, ఇతర పశువులి, అపహరించినవాడు మేకగా పుడతాడు.

బ్రాహ్మణుడు కర్మభ్రష్టుడైతే వాంతి చేసుకున్న అన్నాన్ని తింటూ, 'జ్వాలాముఖుడు' అనే ప్రేతగా జన్మిస్తాడు.

క్షత్రియుడు స్వధర్మాన్ని ఆచరించకపోతే పురీష, శవాల్ని తినే 'కటపూతనుడు' అనే ప్రేతగా జన్మిస్తాడు.

వైశ్యుడు కర్మానుష్ఠానం నుంచి భ్రష్టుడైతే చీమని తినే 'మైత్రాక్షజ్యోతి' అనే ప్రేతగా జన్మిస్తాడు.

శూద్రుడు స్వకర్మానుష్ఠానం నుంచి భ్రష్టుడైతే పేలను తినే 'చైలాశకం' అనే ప్రేతగా పుడతాడు.

ఎలాంటి భావాలతో మనిషి కర్మల్ని చేస్తాడో ఆ కర్మల ఫలితంగా అతడికి మరుజన్మలో అలాంటి శరీరమే లభిస్తుంది.

మను ధర్మశాస్త్రంలో చెప్పని ధర్మాలేవైనా వుంటే వాటిని శాస్త్రపండితుల ద్వారా గ్రహించాలి.

వేదాల్ని–శిక్షావ్యాకరణం లాంటి ఆరు అంగాలతో, ధర్మశాస్త్ర పురాణాలతో కలిపి అధ్యయనం చేసినవాళ్ళే పండితులు.

ఎక్కువమంది పండితులు కలిసినప్పటికీ ధర్మనిర్ణయం చెయ్యలేకపోతే, బాగా శాస్త్రం తెలిసిన పదిమంది లేక ముగ్గురున్న పండితసభ, ఏది ధర్మం అని నిర్ణయిస్తే దాన్నే సందేహించకుండా ఆచరించాలి.

పురుడు వచ్చినప్పుడు బ్రాహ్మణులకి పదిరోజుల్లో, క్షత్రియులకి పన్నెండు రోజుల్లో, వైశ్యులకి పదిహేను రోజుల్లో, శూద్రులకి నెలరోజుల్లో శుద్ధి అవుతుంది.

గర్భస్రావం జరిగి బిడ్డ మరణిస్తే ఆ తల్లికి గర్భం ఎన్ని నెలలు నిలబడిందో అన్ని రోజులు పురిటి మైల వుంటుంది.

శిల్పులు, వంట చేసేవాళ్ళు, వైద్యులు, సేవకులు, మంగలివాళ్ళు, రాజులు, వేదవిద్యార్థులు వీళ్ళకి తక్షణమే శుద్ధి అవుతుంది (అనగా వీళ్ళకి మైల ఒక్కరోజు లేక ఒక్క స్నానంతో పూర్తవుతుంది).

పిల్లవాణ్ణి కన్న స్త్రీకి పదిరోజులు జాతాశౌచం ఉంటుంది.

తండ్రికి స్నానంతో శుద్ధి అవుతుంది.

పెళ్ళి, దేవతల ఉత్సవాలు, యజ్ఞాలు జరుగుతున్నప్పుడు పురుడు మైలగానీ, మృతి మైలగానీ వచ్చినప్పుడు వినియోగించాల్సిన పదార్థాలని దేవతలకి, బ్రాహ్మణులకి ఇస్తే ఎలాంటి దోషం వుండదు.

యోగాభ్యాసం ద్వారా ఈశ్వరోపాసన చేసిన యతి, యుద్ధరంగంలో శత్రువు చేతిలో మృతి చెందిన వీరుడు వీళ్ళిద్దరూ సూర్యమండలాన్ని ఛేదించుకుని బ్రహ్మలోకానికి చేరుకుంటారు.

బ్రాహ్మణులు అనాథ బ్రాహ్మణుడి శవాన్ని మోస్తూ నడిస్తే అడుగడుగునా యజ్ఞం చేసిన పుణ్యఫలం వస్తుంది.

అనాథ సంస్కారం చేసినవాళ్ళకి మైల వుండదు స్నానంతో శుద్ధి అవుతారు.

ఆత్మహత్య చేసుకుంటే, దుర్గంధంతో కూడిన అంధతమం అనే నరకంలో మునిగి, ఇరవైవేల సంవత్సరాలు బాధలు పడతారు.

తోడేలు, కుక్క, నక్క లాంటి జంతువులు కరిస్తే బ్రాహ్మణుడు స్నానం చేసి, గాయత్రీ మంత్రాన్ని జపించాలి.

కుక్క కరిచినా, నాకినా, గోళ్ళతో గీరినా ఆ ప్రదేశంలో మట్టి నీళ్ళు వేసి బాగా కడిగి, ఆ తరువాత నిప్పుతో కాస్తే శుద్ధి అవుతుంది.

పాదరక్షలు వేసుకుని, మంచం మీద కూర్చుని, నేలమీద నుంచుని భోజనం చేయకూడదు.

వండిన అన్నాన్ని పురుగు, ఈగ, వెంట్రుక తాకితే వాటిని తీసేసి, ఆ అన్నం మధ్యలో కొంచెం నీళ్ళు, కొంచెం విభూతి వేస్తే అది శుద్ధి అవుతుంది.

కఱ్ఱ వస్తువులు చెక్కటం వల్ల శుద్ధమవుతాయి.

రాగి పులుసుచేత శుద్ధమవుతుంది.

బావులు, చెఱువుల్లో నీళ్ళు ఏ కారణంతోనైనా అపవిత్రమైతే, వాటిలోంచి వంద కడవల నీళ్ళని బయటకి పారపోసి, వాటిలో పంచగవ్యాల్ని (ఆవుపాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, పేడ) చల్లితే పవిత్రమవుతాయి.

సంధ్యా సమయంలో భోజనం చేయటం, భార్యతో సంగమించటం, నిద్రపోవటం అనే పనులు చేయకూడదు. అలాచేస్తే శరీరం దుర్బలమైపోతుంది (శంఖస్మృతి).

కన్యని బలాత్కారంగా చెఱచినవాడు మరోజన్మలో నపుంసకుడుగా జన్మిస్తాడు (గౌతమ ధర్మసూత్రం).

జీవితంలో సుఖసంతోషాలు కావాలని కోరుకునేవాడు శాస్త్రంలో తనకు చెప్పిన ధర్మాల్ని త్రికరణ శుద్ధిగా ఆచరించాలి (యాజ్ఞవల్క్యస్మృతి).

మంచి ఆయుర్ధాయం కావాలనుకునేవాడు పరస్త్రీతో సంగమించకూడదు (చరకసంహిత).

ఒకరికి దానంగా ఇచ్చిన దాన్ని తిరిగి తీసుకోకూడదు. అలాగే చేసిన దానాన్ని పదిమందికీ చెప్పకూడదు, దీనివల్ల దాతకి దానఫలం దక్కదు (ఆపస్తంభ ధర్మసూత్రం).

రాత్రిపూట పెరుగుతో భుజించరాదు (చరక సంహిత).

పెద్దల దగ్గర మాట్లాడేడప్పుడు తమ మాటలు ప్రియంగా వుండేలా చూసుకోవాలి (మనుస్మృతి).

బ్రాహ్మీముహూర్తంలో నిద్రపోయినవాడికి పుణ్యం క్షయమైపోతుంది. (యాజ్ఞవల్క్యస్మృతి).

భర్త అంగీకారం లేకుండా భార్య చేసే వ్రతాలు, నోములూ ఎలాంటి పుణ్యాన్ని ఇవ్వవు. ఆ వ్రతఫలం ఆమెకి దక్కదు (పరాశరస్మృతి).

కన్యాదానం లాంటి వేదోక్త ధర్మాన్ని ఆచరించేటప్పుడు భార్య భర్తకి కుడివైపున వుండాలి (వసిష్ఠస్మృతి).

వరుడు తనకన్నా ఎక్కువ వయస్సు వున్న స్త్రీని, తనకన్నా ఎక్కువ పొడవున్న స్త్రీని వివాహం చేసుకోకూడదు. అలా చేసుకుంటే త్వరగా వార్ధక్యం, అల్పాయువు కలుగుతాయి (ధర్మసూత్రం).

ఆవుని కానీ, దూడని కానీ కట్టేసిన తాడును దాటి ఎవ్వరూ వెళ్ళకూడదు. అలాచేస్తే గోమాతని అవమానించిన పాపం కలుగుతుంది (మనుస్మృతి).

దిగంబరంగా నదీస్నానం చేయకూడదు. ఎందుకంటే నీటిలో రహస్యంగా పవిత్రమైన అగ్ని వుంటుంది (ఉపనిషత్తులు).

తనకి తెలియని విషయాన్ని తెలిసినట్టు, చూడని విషయాన్ని చూసినట్టు చెప్పి ప్రజల్ని మోసగించిన వాళ్ళకి నరకబాధ తప్పదు (ఆపస్తంభ ధర్మసూత్రం).

రావిచెట్టుకి, అగ్నికి, సూర్యుడికి వెన్నుచూపుతూ జపం చేయకూడదు (ఆపస్తంభ ధర్మసూత్రం).

గురువుగారి, మాటతీరుని, ఆహార్యాన్ని, నడకని, శిష్యుడు ఎప్పుడూ అనుసరించ కూడదు (మనుస్మృతి).

ఆయుర్దాయం కోరుకునేవాడు దక్షిణదిక్కుకి ముఖం వుంచి భుజించాలి (చరకసంహిత).

ఒకే పంక్తిలో భోజనం చేస్తుంటే ఆ పంక్తి నుంచి ఒక్కడు ముందుగా లేచి వెళ్ళిపోతే ఆ పంక్తిలో ఉన్నవాళ్ళు భోజనం చేయకూడదు. ఎందుకంటే అది ఎంగిలి అన్నంతో సమానమవుతుంది కనుక (ఆపస్తంభ ధర్మసూత్రం).

వాసనలేని పూలమాలని ధరించటం, అశుచిగా ఉన్న వస్తువులతో గోక్కోవటం భార్యతో కలిసి భుజించటం, అభ్యంగన స్నానం చేస్తున్న భార్యని చూడటం, దొడ్డిగుమ్మం నుంచి ఇంట్లోకి ప్రవేశించటం. కాలితో కాలిని తోమటం, ఎత్తు బల్లమీద కంచంలో భోజనం చేయటం, చేతులతో నదిని దాటటం, చేయకూడదు (గౌతమ ధర్మసూత్రాలు).

పాదరక్షలు ధరించి భోజనం చేయటం, కూర్చోవటం, నమస్కరించటం చేయకూడదు (గౌతమ ధర్మసూత్రాలు). హఠాత్తుగా దేన్నైనా కోయటం, బ్రద్ధలు కొట్టటం, కొట్టటం, చిటికలు వేయటం చేయకూడదు (గౌతమ ధర్మసూత్రాలు).

ఒకసారి వండిన ఆహార పదార్థాన్ని రెండోసారి వండి (వేడిచేసి) తినకూడదు (గౌతమ ధర్మసూత్రాలు).

బజారులో అమ్మే అన్నాన్ని తినకూడదు, గతరాత్రి వండిన అన్నాన్ని తినకూడదు, పుల్లబడ్డ ఆహార పదార్థాల్ని తినకూడదు, అన్నిరకాల మద్యాలనీ త్రాగకూడదు. (ఆపస్తంభ ధర్మసూత్రాలు).

రుచి కలిగిన పదార్థాలని ఒక్కడే తినకూడదు.

ఏ విషయాలనైనా ఒక్కడే నిశ్చయించకూడదు.

ఒంటరిగా రాజమార్గంలో వెళ్ళకూడదు.

అందరూ నిద్రపోతూ వుంటే తానొక్కడే మేల్కొనకూడదు.

న్యాయంగా సంపాదించిన ధనానికి రెండు రకాలుగా అనర్ధం జరుగుతుంది. ఒకటి అనర్హుడికి ఇవ్వడం, రెండు అర్హుడికి ఇవ్వకపోవటం.

మానవుల్లో ఉత్తములు, మధ్యములు, అధములు అని మూడురకాలుగా వుంటారు. వారివారి అర్హతల్ని అనుసరించి పనుల్లో నియమించుకోవాలి.

ఇతరుల సొమ్ముని దొంగతనం చేయటం, ఇతరుల భార్యతో సంపర్కం ఏర్పర్చుకోవటం, మంచి మనసున్న స్నేహితుల్ని దూరం చేసుకోవటం. ఈ మూడు దోషాలూ మనిషిని క్షీణింపచేస్తాయి.

తన మీద భక్తితో ఉన్నవాడిని, తనకి సేవలు చేస్తున్నవాణ్ణి, శరణు వేడుకున్నవాణ్ణి, తాను కష్టంలో ఉన్నప్పుడు కూడా విడిచిపెట్టకూడదు.

తెలివి లేనివాడితో, చేసే పనిని బాగా ఆలస్యంగా చేసేవాడితో, అలాగే అతి తొందరగా చేసేవాడితో, బాగా పొగిడేవాడితో రహస్య సమాలోచనలు చేయకూడదు.

అగ్నిని ఉపాసించటం, మౌనవ్రతాన్ని అవలంబించటం, శ్రద్ధగా శాస్త్రాధ్యయనం చేయటం, యజ్ఞయాగాలు ఆచరించటం. ఈ నాలుగుపనుల్నీ ఆదరంతో చేస్తే భయాన్ని తొలగిస్తాయి. ఆదరంగా చేయకపోతే భయాన్ని కలుగచేస్తాయి.

తల్లి, తండ్రి, అగ్ని, ఆత్మ, గురువు. ఈ అయిదూ అగ్నిలాంటివారు వీళ్ళని మానవుడు ప్రయత్నపూర్వకంగా సేవించాలి.

దేవతల్ని, పితృదేవతల్ని, సాటిమానవుల్ని, అతిథుల్ని, సన్న్యాసుల్ని పూజించినవాడు లోకంలో గొప్ప కీర్తిని పొందుతాడు.

పగిలిన నావని సముద్రంలో వదిలేసినట్టు బోధచెయ్యని గురువుని, మంత్రాలు చదవని ఋత్విక్కుని, ప్రజల్ని కాపాడని రాజుని విడిచిపెట్టాలి.

పశువుల కోసం అసత్యం చెప్పేవాడు ఐదుతరాలని, ఆవులకోసం అసత్యం చెప్పేవాడు పదితరాలని, గుఱ్ఱాలకోసం అసత్యం చెప్పేవాడు వందతరాలని, మనుషుల కోసం అసత్యం చెప్పేవాడు వెయ్యి తరాలని నరకంలో పడేస్తాడు.

బంగారం కోసం అబద్ధం చెప్పేవాడు పూర్వతరాలనీ, భవిష్యత్ తరాలనీ నరకంలో పడేస్తాడు.

భూమికోసం అసత్యం చెప్పినవాడు సర్వాన్ని నాశనం చేసుకుంటాడు.

ఇంటికి నిప్పు పెట్టేవాడు, ఇతరులకి విషంపెట్టేవాడు, ఆయుధాలు తయారుచేసేవాడు, చాడీలు చెప్పేవాడు, మిత్రుడికి ద్రోహం చేసినవాడు, పరుల భార్యతో కూడినవాడు, గర్భంలో వున్న పిల్లల్ని చంపేవాడు, గురుభార్యతో గడిపేవాడు, బ్రాహ్మణుడిగా వుండి మద్యపానం చేసినవాడు, పరలోకం (స్వర్గం) లేదని వాదించేవాడు,

వేదాల్ని నిందించేవాడు, సకాలంలో ఉపనయనం జరగనివాడు, శరణన్నవాణ్ణి రక్షించనివాడు, పాపపు సంపాదనతో జీవించేవాడు, ఇలాంటివాళ్ళంతా బ్రహ్మహత్య చేసిన వాళ్ళతో సమానులు.

రాత్రిపూట సుఖం కోసం ఉదయమే ప్రయత్నం చెయ్యాలి, వర్షాకాలంలో సుఖం పొందటం కోసం మిగిలిన నెలలన్నీ కష్టపడాలి, వార్ధక్యంలో సుఖపడటం కోసం యవ్వనంలో కష్టపడాలి. చనిపోయాక సుఖపడటం కోసం జీవితమంతా మంచిపనులు చేస్తూ శ్రమించాలి.

మిత్రుల నుంచి ఉపకారాలు పొంది, తమ పనులు పూర్తయిన తరువాత ఆ మిత్రుల క్షేమాన్ని కోరనివాడు కృతఘ్నుడు అనిపించుకుంటాడు. అలాంటివాడి శవాన్ని క్రూరమృగాలు కూడా తినవు.

దురభిమానంతో వుండటం, అతిగా మాట్లాడటం, మిత్రద్రోహం చెయ్యటం, దానధర్మాలు చెయ్యకపోవటం, కోపిష్టి స్వభావంతో వుండటం, తన పొట్టసుఖం మాత్రమే చూసుకోవటం ఈ ఆరు దుర్గుణాలు పదునైన కత్తిలాంటివి. ఇవి మనిషి ఆయుర్దాయాన్ని కోసేస్తాయి.

కులం కోసం ఒక్కణ్ణి విడిచిపెట్టవచ్చు, గ్రామం కోసం కులాన్ని మొత్తం విడిచిపెట్టవచ్చు, దేశం కోసం గ్రామాన్ని విడిచిపెట్టవచ్చు, తన క్షేమం కోసం భూమి మొత్తాన్ని వదిలిపెట్టవచ్చు.

పూర్వం ఎంతోమంది రాజులకి జూదం అనే వ్యసనం వైరాన్ని కలిగించింది కనుక జూదాన్ని విడిచి పెట్టాలి.

నాలుగుదారుల కూడలిలో అర్ధరాత్రి పూట సంచరించకూడదు.

ఆరోగ్యం, ఆయుర్దాయం, బలం, సుఖం, రోగాలు లేని సంతానం అనేవి మితంగా తినేవాడికి కలుగుతాయి.

పిసినారిని, జులాయిగా తిరిగేవాణ్ణి, శాస్త్రం తెలియని మూర్ఖుణ్ణి, అడవిలో జీవించే ఆటవికుణ్ణి, జూదరిని, దుష్టుల్ని గౌరవించేవాణ్ణి, క్రూరమైన మనస్తత్వం కలిగినవాణ్ణి, చేసిన మేలు మర్చిపోయేవాణ్ణి ఎలాంటి స్థితిలోనూ యాచించకూడదు.

ఇలా శ్రుతిస్మృతి పురాణేతిహాస గ్రంథాలు అందరూ పాటించవలసిన సామాన్య ధర్మాలను నిర్దేశిస్తున్నాయి.

✦ ✦ ✦

# పాలకుల ధర్మానుకూల ప్రవర్తన

**నిత్యోద్యుక్తేన వై రాజ్ఞా భవితవ్యం యుధిష్ఠిర,**
**ప్రశస్యతే న రాజా హి నారీవోద్యమవర్జితః.**

రాజు ఎల్లపుడూ ప్రయత్నపరుడై ఉండాలి. ఉద్యమించని రాజు స్త్రీతో సమానుడు.

పుట్టలోని చీమలను పాము తిన్నట్లు విరోధం లేని రాజునూ, ఇల్లు విడవని బ్రాహ్మణుణ్ణీ భూమి మ్రింగివేస్తుంది. అందువల్ల రాజు సంధి చేసుకోవలసిన వారితో సంధి చేసుకోవాలి. విరోధించవలసిన వారితో విరోధించాలి.

గర్వంతో చెడు మార్గం పట్టినవాడు గురువయినా అతణ్ణి శాశ్వతంగా దండించవలసినదే.

అసమంజసుడు సరయూనదిలో బాలకులను ముంచివేసేవాడు. అందుచేత తండ్రి సగరుడు కొడుకును తిట్టి, దేశబహిష్కారం చేశాడు. ఉద్దాలక మహర్షి కూడా తన ప్రియసుతుడయిన శ్వేతకేతువును బ్రాహ్మణులను కపటంగా సేవిస్తున్నాడనే కారణంతో విడిచిపెట్టాడు. అందుచేత లోకులను రంజింపజేయటమే రాజధర్మం.

ఇతరుల సంపదలను పాడు చేయరాదు. ఇవ్వవలసిన దాన్ని ఇవ్వాలి. సత్యవాక్కు, క్షమ కల్గి పరాక్రమించే రాజు ఎన్నడూ శుభమార్గం నుండి తొలగడు.

రాజు ఆత్మవంతుడు కావాలి. క్రోధాన్ని జయించాలి. రాజుకు, శాస్త్ర విషయాల్లో చక్కని నిశ్చయబుద్ధి ఉండాలి. ధర్మార్థకామ మోక్షాల్లో ఆసక్తి ఉండాలి. వేదం మీద కూడా ఆసక్తి ఉండాలి. ఆలోచనలను రహస్యంగా ఉంచాలి. రాజకార్యాల్లో రహస్యం దాచలేకపోవటాన్ని మించిన కష్టం రాజుకు మరొకటి ఉండదు.

**చాతుర్వర్ణ్యస్య ధర్మాశ్చ రక్షితవ్యా మహీక్షితా ।**
**ధర్మసంకరరక్షా చ రాజ్ఞాం ధర్మః సనాతనః ॥**

నాలుగు వర్ణాల వారి ధర్మాలనూ రాజు రక్షించాలి. ధర్మం సంకరమయి పోకుండా ప్రజలను రక్షించడం కూడా రాజుల సనాతన ధర్మం. రాజు ఎవరినీ నమ్మరాదు. ఒకవేళ నమ్మినా ఎక్కువగా నమ్మకూడదు.

శత్రువుల లోపాలను కనిపెట్టగల రాజు ధర్మార్థకామాల విషయంలో నిశ్చితజ్ఞానం కలిగి, గూఢచారుల రహస్యాన్ని కనిపెట్టే వాడై ఉండాలి.

తన ధనాగారం పెంపొందించుకొనే విషయంలో యమునిలా, కుబేరునిలా ప్రవర్తించాలి. పోషణలేనివారికి రాజు పోషణ ఇవ్వాలి. పోషణ కలవారిని పరీక్షిస్తూ ఉండాలి. రాజు చిరునవ్వు నవ్వుతూ సుముఖంగా మాట్లాడుతూ ఉండాలి. వృద్ధులను సేవించాలి. అలసత్వం లేకుండా ప్రవర్తించాలి. లేకితనం ఉండకూడదు. సత్ప్రవర్తన మీద స్థిరబుద్ధి ఉండాలి. సంతోషం పొందాలి. చూడముచ్చటగా ఉండాలి. సజ్జనులచేతి నుండి ఎన్నడూ ధనం గ్రహించరాదు. దుర్జనుల నుండి తీసుకొని అది సజ్జనులకు ఇవ్వాలి.

రాజు స్వయంగా ప్రవర్తించాలి. దాత కావాలి. మనసు వశంలో ఉండాలి. రమ్యమయిన సాధనాలు ఉండాలి. సకాలంలో దానం చెయ్యాలి. భుజించాలి. పరిశుద్ధమైన ఆచారాలు కలిగి ఉండాలి.

శూరులు, భక్తులు, ఇతరుల ప్రలోభాలకు లొంగనివారు, సత్కులంలో పుట్టినవారు, రోగాలు లేనివారు, శిష్టులు, శిష్టులతో సంబంధాలు కలవారు, ఆత్మగౌరవం కలవారు, అవమానం పొందనివారు. విద్యావేత్తలు, లోకవ్యవహారాలు తెలిసినవారు, పరలోకం గురించి తెలుసుకొనేవారు, ధర్మనిరతులు, పర్వతంలా చలించని సాధు స్వభావం కలవారు – వీరిని రాజు సహాయులుగా చేసుకోవాలి. భోగాల విషయంలో వారితో సమానంగా అనుభవించాలి. ఒక్క ఛత్రమూ, ఆజ్ఞ ఈ రెండూ మాత్రమే వారికంటే రాజుకు అధికం అనేటట్లు ఉండాలి.

**ప్రత్యక్షే చ పరోక్షే చ వృత్తిశ్చాస్య భవేత్సమా,**
**ఏవం కుర్వన్నరేంద్రోఽపిన భేదమిహా విందతి.**

అందరి ఎదుటా, చాటుగానూ కూడా ఒకేవిధమయిన నడవడి ఉండాలి. ఇలా చేసే రాజు దుఃఖం పొందడు.

అందరినీ అనుమానించేవాడు, అన్నీ హరించేవాడు. సూటిగా ఉండనివాడు, లోభీ అయిన రాజు కొద్దికాలంలోనే సొంతవారి చేతిలోనే బందీ అవుతాడు.

శుచియై, లోకుల మనసులను ఆకర్షింపగల రాజు శత్రువులకు చిక్కినా పతనం చెందడు. ఒకవేళ పడినా మళ్లీ నిలదొక్కుకొంటాడు. క్రోధం లేనివాడు, వ్యసనాలు

లేనివాడు, మృదువైన దండం ప్రయోగించేవాడు, జితేంద్రియుడూ అయిన రాజు ప్రాణులకు విశ్వసింపదగిన వాడవుతాడు.

ప్రజ్ఞ కలవాడు, త్యాగగుణంతో కూడినవాడు, శత్రువుల దోషాలు తెలుసుకోగలవాడు, అన్ని వర్ణాల వారికి చూడదగినవాడు, నీతి – అవినీతి తెలిసినవాడు, చురుకుగా పనులు చేసేవాడు, క్రోధాన్ని జయించినవాడు, ప్రసన్నుడు, మహాబుద్ధి కలవాడు, రోషస్వభావం లేనివాడు, యోగ్యుడు, క్రియాపరుడు, తన్ను తాను పొగుడుకోని వాడు, మొదలుపెట్టిన పనులు చక్కగా పూర్తిచేసే రాజు రాజులలో ఉత్తముడనబడతాడు.

నిర్భయంగా తండ్రి ఇంట్లో పుత్రుడు ప్రవర్తించినట్లు ఎవరి దేశంలో ప్రజలు సంచరిస్తారో, ఎవరి రాజ్యంలో పౌరులు తమ సంపదలను రహస్యంగా ఉంచుకోరో, నీతి – అవినీతులను తెలిసి ప్రవర్తిస్తారో, ఎవరి దేశంలో ప్రజలు తమతమ విధుల్లో శ్రద్ధ కలిగి ఉంటారో, దేహంమీద కాకుండా ధర్మం మీద ఆసక్తి కలిగి, యథావిధిగా రక్షింపబడతారో, రాజుకు వశులై, ఆతని అధీనంలో నడుస్తారో, సంఘర్షణ లేకుండా విధేయులై ఉంటారో, దానగుణం కలిగిఉంటారో ఆ దేశపు రాజే ఉత్తముడు.

**న యస్య కూటం కపటం న మాయా న చ మత్సరః,**
**విషయే భూమిపాలస్య తస్య ధర్మః సనాతనః.**

ఏ రాజు దేశంలో కల్ల, కపటం, మాయ, మత్సరం ఉండవో ఆ రాజు ధర్మమే సనాతన ధర్మం.

జ్ఞానులను సత్కరించేవాడు, పరహితంలో ప్రీతి కలవాడు, సజ్జనుల మార్గంలో నడిచేవాడు, త్యాగి అయిన రాజు రాజ్యానికి అర్హుడు.

మొదట రాజును పొందాలి. తరువాత భార్యను, తరువాత ధనాన్ని పొందాలి. రాజే లేకపోతే లోకులకు భార్య ఎందుకు? ధనమెందుకు? రాజు లేకపోతే రక్షణ లేదని అర్థం.

రాజ్యం కాంక్షించేవారికి ప్రజారక్షణ కాక సనాతన ధర్మం మరొకటి లేదు.

సముద్రంలో పగిలిపోయిన పడవను విడిచివేసినట్లు ఈ ఆరుగురినీ వెంటనే విడిచిపెట్టాలి. (1) ప్రవచనం చెయ్యని ఆచార్యుడు (2) వేదం చదవని ఋత్విజుడు (3) రక్షించని రాజు (4) అప్రియంగా మాట్లాడే భార్య (5) గ్రామంలో ఉండాలనుకొనే గోవుల కాపరి (6) అడవిలో ఉండాలనుకొనే మంగలి – వీరంతా ఎందుకూ పనికిరానివారు. ఇలాంటి వారిని రాజు వెంటనే విడిచిపెట్టాలి.

✦ ✦ ✦

# రాజ్యరక్షా సాధనాలు

గూఢచారి, ప్రణిధి, తగిన సమయంలో మాత్సర్యం లేకుండా దానం చేయడం, యుక్తితో గ్రహించడం, సజ్జనులను ఆదరించటం, శౌర్యం, సమర్థత, సత్యం, ప్రజాహితం, కపటంగా కాని సూటిగా కాని శత్రుపక్షాన్ని ఛేదించటం, పాతబడి పాడైపోయే ఇళ్లను పరిశీలించడం, సజ్జనులను విడవకుండటం, సత్కులీనులను ఆదరించడం, కూడబెట్టదగిన ధాన్యాదులను కూర్చుకోవడం, బుద్ధిమంతులను సేవించడం, సైన్యాన్ని సంతోషపరచడం, నిత్యమూ ప్రజలను పరిశీలించడం, పనులలో దుఃఖపడకపోవడం, ధనాగారం పెంచుకోవడం, నగర రక్షణం, పురజనుల (రూపంలో ఉన్న శత్రు) సంఘాలను చీల్చడం, శత్రువులు, మిత్రులు, మధ్యస్థులు వీరిని యథోచితంగా పరికిస్తూ ఉండటం, తమ సేవకులు శత్రువులలో కలియకుండా చూడటం, తన నగరాన్ని పరిశీలించడం, సేవకులపై పూర్తి నమ్మకం ఉంచకపోవడం, స్వయంగా పరులను ఓదార్చడం, నీతిని, ధర్మాన్ని అనుసరించటం, సదా ప్రయత్నశీలియై ఉండటం, శత్రువును చులకనగా భావించకపోవటం, సదా దుష్టులను దూరంగా ఉంచడం - ఇవన్నీ ప్రజారక్షణ విషయంలో సాధనాలు, మెళకువలు.

నిత్యప్రయత్నం లేని రాజు ఎంత తెలివికలవాడయినా విషంలేని పాములాగా శత్రువులకు చులకనై చావుదెబ్బలు తింటాడు.

**న చ శత్రురవజ్ఞేయః దుర్బలోఽపి బలీయసా,**
**అల్పోఽపి హి దహత్యగ్నిః విషమల్పం హినస్తి చ.**

తానెంత బలవంతుడయినా, శత్రువు ఎంత దుర్బలుడయినా వానిని కించపరచరాదు. కొంచెమున్నా అగ్ని దహించివేస్తుంది. కొద్దిపాటి దయినా విషం చంపుతుంది.

నాలుగు అంగాలలో ఒక అంగంలోనే వృద్ధిపొందినా దుర్గంలో ఉన్న శత్రురాజు, సర్వాంగాలు సమృద్ధిగా కల దేశమంతటినీ, రాజునూ తపింపజేస్తాడు. (దుర్గంలో ఉండటం వల్ల) (చతురంగాలు = నాల్గు అంగాలు. 1. రథ 2. గజ 3. తురగ 4. పదాతులు).

**రాజ్యం హి సుమహత్తంత్రం ధార్యతే నాకృతాత్మభిః,**
**న శక్యం మృదునా వోఢుమ్ ఆయాసస్థానముత్తమమ్.**

రాజ్యమనేది చాలా గొప్ప తంత్రం. దాన్ని సంస్కారం లేనివాళ్లు (క్రూరులు) మోయలేరు. మృదుహృదయం కలవాళ్లు కూడా మోయలేరు.

రాజ్యం అందరికీ భోగ్యవస్తువే. (అందరూ పొందాలని చూస్తారు) దాన్ని ఆర్జవం కలవాడే ధరింపగలడు. కాబట్టి ఎల్లపుడూ మిశ్రమమార్గంలో వెళ్లాలి. (క్రూరత-మృదుత్వం రెండూ కలిసిన మార్గం).

ప్రజలను రక్షించేటప్పుడు రాజుకు ఏదైనా ఆపద కలిగినా అది కూడా అతడి విస్తృత ధర్మంలో ఒక భాగమే అనుకోవాలి. రాజులకు ఇటువంటి ప్రవర్తన ఉండాలి. రాజ్యరక్షణ రాజు పాటించే దండనీతి మీదే ఆధారపడి ఉంటుంది. అది ఎలా ఉండాలో మహాభారతం, మనుధర్మశాస్త్రం ఎంతో వివరంగా బోధిస్తుంది.

## దండనీతి

**తం దేశ కాలౌ శక్తిం చ విద్యాంచావేక్ష్య తత్త్వతః,**
**యథార్హతః సంప్రణయేన్నరేష్వన్యాయ వర్తిషు.** (మనుస్మృతి 6-11-16)

రాజుల పరిపాలన సక్రమంగా జరగటం కోసం, సృష్టికర్త ఆ బ్రహ్మదేవుడు ధర్మాన్ని దండం రూపంలో సృష్టించాడు. దీన్నే రాజదండం అంటారు. ధర్మం దండం చేతిలో ఉన్నపుడే రాజుకి ప్రజల్ని పాలించే శక్తి లభిస్తుంది. ఈ రాజదండ భయంతోనే సృష్టిలో ఉన్న జీవులన్నీ తమతమ నీతిమార్గాల్ని వదిలిపెట్టకుండా ప్రవర్తిస్తూ, ఆనందాన్ని అనుభవిస్తున్నాయి.

రాజుకి, రాజదండానికీ భేదంలేదు. ఈ రాజదండమే అనగా రాజే తన ప్రజలందర్నీ సన్మార్గంలో నడిపించాలి. అందర్నీ శాసించాలి. నాలుగు ఆశ్రమాల వారి ధర్మాల్నీ రక్షించాలి. బలహీనంగా ఉంటే అక్కడ అధర్మం రాజ్యమేలుతూ ఉంటుంది. పాలకుడు దండించాల్సిన వాళ్ళని తగిన విధంగా దండించకపోతే, చేపల్ని కొక్కేలకి తగిలించి కాల్చి తిన్నట్టుగా, బలవంతులు బలహీనుల్ని కాల్చుకు తింటారు. (మనుస్మృతి 4-20)

రాజదండాన్ని ఉపయోగించే రాజు సత్యవ్రతుడై ఉండాలి. రాబోయే పరిణామాల్ని, మంచిచెడ్డల్ని ఆలోచించి తగిన నిర్ణయాలు తీసుకోవాలి. ధర్మార్థ కామాల్ని తెలుసుకున్న ప్రాజ్ఞుడై ఉండాలి. (మనుస్మృతి 7-26)

న్యాయబద్ధంగా రాజదండాన్ని ఉపయోగించే రాజు. ప్రజల ధర్మార్థకామాల్ని సక్రమంగా వృద్ధి చేయగలుగుతాడు. అలా కాక ఆ రాజు కామాతురుడు, చెడ్డవాడు అయితే, ఆ రాజదండమే అతణ్ణి శిక్షిస్తుంది. నిగ్రహంలేని రాజు రాజదండాన్ని పట్టుకోకూడదు. అనగా పదవిని స్వీకరించకూడదు.

## రాజ గుణాలు

ప్రజల్ని పాలించే పాలకుడు (రాజు) కామక్రోధ లోభాలనే మూడు దుర్గుణాల్ని విడిచిపెట్టాలి. లేకపోతే అవి రాజుకి చాలా చేటుని తెస్తాయి. కామక్రోధాలకి మూలం లోభం. ముందు రాజు దాన్ని వదిలిపెట్టాలి. కామం వల్ల ఏర్పడే ఉపద్రవాలు 1.మద్యపానం, 2. జూదం, 3. స్త్రీ లోలత్వం, 4.వేట అనేవి. ఇక క్రోధం వల్ల పుట్టే ఉపద్రవాలు 1.కఠినంగా శిక్షించటం, 2. పరుషంగా మాట్లాడటం, 3. అక్రమంగా ధనాన్ని సంపాదించటం.

పాలకుడు (రాజు) స్వయంగా తప్పులు చేసి, తద్వారా దేశ ప్రజలందర్నీ కష్టనష్టాల్లోకి నెట్టేసి వాళ్ళని రక్షించకపోతే, ఆ రాజు తన పాలనాధికారాన్ని కోల్పోయి సమూలంగా నశిస్తాడు. (మను. 7-111).

రాజ్యంలో ఉన్న దొంగల్ని (ఆర్థిక నేరగాళ్ళని) శిక్షించటానికి అసమర్థుడై, ప్రజల నుంచి పన్నుల్ని బాగా వసూలు చేసే ప్రభువు (పాలకుడు) నరకానికి వెళతాడు. అతడు పరిపాలించే దేశం (రాష్ట్రం) అధ్వానస్థితిలోకి వెళ్తుంది.

**అనిత్యో విజయో యస్మాద్దృశ్యతే యుధ్య మానయోః,**

**పరాజయశ్చ సంగ్రామే తస్మాద్యుద్ధం వివర్జయేత్.** (మనుస్మృతి 7-199)

పాలకుడు సాధ్యమైనంత వరకూ పొరుగుదేశాలతో యుద్ధం జరగకుండా జాగ్రత్త వహించాలి. ఉపాయాలతో, పరస్పర సంధి సంప్రదింపులతో ఇరువైపులా ప్రాణనష్టం జరగకుండా ప్రయత్నం చేయాలి. ఇదే ఉత్తమపాలకుడి కర్తవ్యం. ఈరోజుల్లో ఈ యుద్ధనీతి తప్పనిసరిగా అన్ని దేశాలవాళ్ళూ పాటించాలి. ఎందుకంటే ప్రపంచంలో చాలా అగ్రరాజ్యాలు అణుసంపత్తిని కలిగి ఉన్నాయి. వీటి మధ్య యుద్ధం అంటూ వస్తే పూర్తి వినాశనం తప్పదు.

భూమాత ఈ చరాచర ప్రాణులందర్నీ సహనంతో భరిస్తున్నట్లుగా పాలకులు కూడా తమ ప్రాంతపు ప్రజల్ని భరించి, వారి కష్టనష్టాల్ని తమవిగా భావించి భూమిలాగా కీర్తిని పొందాలి.

**శ్లో॥ సులభాః పురుషా రాజన్ । సతతం ప్రియవాదినః,**
**అప్రియస్యతు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః.**

ఎప్పుడూ ప్రియంగా మాట్లాడేవాళ్ళు చాలా సులభంగా దొరుకుతారు. అయితే అప్రియంగా మాట్లాడినా ఎప్పుడూ హితాన్నే (మంచినే) చెప్పేవాడూ, దాన్ని శ్రద్ధగా వినేవాడు దొరకటం కష్టం. (ప్రజల్ని పాలించే పాలకుల దగ్గర మెప్పు పొందటం కోసం అతడిచుట్టూ వంది మాగధుల్లా చేరి ఆయన ఏదిచెప్తే అదే గొప్పదని సమర్థిస్తూ, బాకాలు ఊదే అధికారులు చాలామంది ఉంటారు. అయితే పాలకుడు అలా బాకా ఊదే వాళ్ళని కాకుండా, నిజంగా తనకి ఎవరు సరైన సలహాలు ఇస్తున్నారు. ఎవరు తన క్షేమం కోరుతున్నారు అన్న వివేకాన్ని కలిగి ఉండి, అలాంటి ఉత్తమ అధికారుల సలహాల్ని స్వీకరిస్తే తాను తనతోపాటు తన ప్రజలు సుఖసంతోషాల్ని పొందుతారు.) ప్రియమా, అప్రియమా అనే విషయాన్ని వదిలేసి, ఏది ధర్మమో దాన్ని మాత్రమే రాజుకి (పాలకుడికి) చెప్పేవాడే, అతడికి నిజమైన సహాయకుడు.

పాలకులైనవారు పరీక్షించకుండా తనకు సహాయకులుగా మంత్రుల్ని నియమించుకోకూడదు. ధనాన్ని ఎలా సంపాదించాలి? (ప్రజల నుంచి పన్నుల రూపంలో), రాజ రహస్యాల్ని ఎలా రక్షించాలి? అనే రెండు ముఖ్యలక్షణాలు మంత్రిలో ఉండాలి. అలాంటి వారినే మంత్రులుగా నియమించుకోవాలి.

ఆత్మవిమర్శ చేసుకుంటూ, తన రాజ్యాన్ని కోశాగారాన్ని రక్షించుకునే రాజుకి, ఈ భూమి సకలసంపదల్ని ఇస్తుంది. కనుక ప్రతి పాలకుడూ తనని తానే ఆత్మవిమర్శ చేసుకుంటూ పరిపాలన కొనసాగించాలి. హితుల సలహాలు పెడచెవినపెట్టి, అహంకారంతో మూర్ఖత్వంతో ప్రజాకంటక పాలన చేస్తే ప్రజలు హర్షించరు (మనుస్మృతి).

పాలకుడు తన ప్రజల్ని, అధికారుల్ని అందర్నీ సమానంగా ప్రేమగా చూస్తుంటే, ఆ రాజు ఊరికే కూర్చున్నా ప్రజలు అతణ్ణి ప్రేమిస్తారు. తన చూపుతో, మనస్సుతో, మాటతో, పనితో ప్రజల్ని ఆకట్టుకునే రాజుని లోకం హర్షిస్తుంది. వేటాడే బోయవాణ్ణి చూసి మృగాలన్నీ భయపడినట్టు ప్రజలు రాజుని చూసి భయపడితే, అలాంటి రాజు భూమినంతా జయించినా చివరికి నామరూపాలు లేకుండా పోతాడు.

వంశపారంపర్యంగా రాజ్యాధికారాన్ని (పదవిని) పొందినప్పటికీ, దుష్టప్రవర్తనకల పాలకుడు తన అధికారాన్ని అచిరకాలంలోనే పోగొట్టుకుంటాడు. సనాతనులైన ఋషులు, ప్రభువులు చిరకాలంగా ఆచరిస్తున్న ధరాన్ని అనుసరించి పాలించే ప్రభువు రాజ్యం సిరిసంపదలతో తులతూగుతుంది.

ధర్మాన్ని విడిచిపెట్టి, పాలించే రాజ్యంలోని భూమి, నిప్పులో వేసిన తోలులాగా ముడుచుకుపోతుంది. అంటే అతడి రాజ్యంలో కరువుకాటకాలు సంభవించి భూమి నిస్సారంగా మారిపోతుందని భావం. ధర్మంతోనే ఏరాజైనా రాజ్యాన్ని పొందాలి. ధర్మంతో పాలించాలి. ఇలా ధర్మాన్ని ఆధారంగా చేసుకుని శ్రద్ధగా పాలించే పాలకుడి సంపద, అతణ్ణి విడిచిపెట్టదు. తరిగిపోదు.

రాజు ప్రజలకి ఆత్మ, ప్రజలు రాజుకి శరీరం కాబట్టి రాజు ప్రజల్ని రక్షించాలి. అలాగే ప్రజలు కూడా రాజుని గౌరవించాలి.

వర్ణాశ్రమ ధర్మాలని రక్షించటం, దానాలు, వేదాధ్యయనాలు చేయటం, యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించటం, ప్రజలందర్నీ రక్షించటం అనేవి రాజులకి బ్రహ్మదేవుడు కల్పించిన విధులు. వీటిని ఆచరించిన రాజుకి ఎలాంటి కష్టాలు కలగవు.

పాలకుడు తన అధికారుల్ని మంత్రుల్ని పూర్తిగా నమ్మకూడదు. అలాగని నమ్మకుండానూ ఉండకూడదు. నమ్మీ నమ్మనట్టుగా ఉండాలి. అలా ఉంటేనే ఆ రాజుపట్ల వారికి భయం, వినయం రెండూ ఉంటాయి.

ఆకలితో ఉన్న పులి తన పిల్లల్ని తానే తినేస్తుంది. అలా చేయటంవల్ల ఆరోజుకి దాని ఆకలి తీరుతుంది. మరి మర్నాటి ఆకలి మాటేమిటి? రాజన్నవాడు కూడా పులిలాగా తాత్కాలిక అవసరాల కోసం ప్రజల్ని బాధించి పన్నులు వసూలు చేయకూడదు. అలా ప్రజల్ని ఒకేసారి పీడించి కోశాగారాన్ని నింపుకుంటే తరువాత వాళ్ళ దగ్గర ఇవ్వటానికి ఏముంటుంది? కాబట్టి జలగ ఏవిధంగా నొప్పి తెలియకుండా మనిషి రక్తాన్ని పీల్చి కడుపు నింపుకుంటుందో, అలాగే రాజు కూడా ప్రజలకి ఏమాత్రం బాధ కలిగించకుండా పన్నుల్ని వసూలు చేసుకోవాలి అని మహాభారతంలోని విదురనీతి బోధిస్తోంది.

**భ్రమస్సంపూజ్యతే రాజా భ్రమ స్సంపూజ్యతే ద్విజః,**
**భ్రమ స్సంపూజ్యతే యోగీ స్త్రీ భ్రమతీ వినశ్యతి.**

(చాణక్య నీతిసూత్రాలు 6-4)

"తిరగడం వల్ల బ్రాహ్మణుడు, యోగి (సన్యాసి) కూడా పూజించబడతారు. కానీ స్త్రీ మాత్రం తిరగకూడదు. అలాచేస్తే నిందించబడుతుంది".

పాలకుడు వీలైనప్పుడల్లా ప్రజల్లోకి వెళ్ళాలి. ప్రతి ఊరూ, నగరం పర్యటించి అక్కడ నివసించే ప్రజల సాధకబాధల్ని స్వయంగా తెలుసుకోవాలి. అప్పుడే రాజుకు గౌరవం లభిస్తుంది.

కాలం లేక సమయం అనేది చాలా బలవత్తరమైంది. ఇది సకల ప్రాణుల్ని సంహరిస్తుంది. సకల భూతాల్ని (పంచభూతాలు) హరిస్తుంది. నిద్రావస్థలో జీవులన్నీ ఉన్నప్పటికీ, కాలం నడుస్తూనే ఉంటుంది. దీని ప్రభావం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు. కనుక పాలకులు కాలాన్ని చాలా విలువైనదిగా గుర్తించాలి. తాము ప్రజాక్షేమం కోసం సంకల్పించిన ఏ పనులైనా ఆలస్యం లేకుండా చేయ్యాలి. అలా చేయకపోతే ఒక్కోసారి తాము చేయాల్సిన మంచిపనుల్ని చేసే అవకాశం తిరిగి రాకపోవచ్చు.

తన దేశంలో జరిగే పాపాలకి ఆ దేశపురాజు (పాలకుడు) శిక్ష అనుభవిస్తాడు. రాజు చేసిన పాపాలకి అతనికి సలహాలు ఇచ్చే పురోహితుడు, భార్య చేసిన పాపాలకి ఆమెని భరించే భర్త, అలాగే శిష్యుడు చేసే పాపాలకి అతడికి విద్య నేర్పిన గురువు పాపఫలితాల్ని అనుభవిస్తారు. ప్రజలు తాము నివసించే రాజ్యంలో విచ్చలవిడిగా పాపాలు (మానభంగాలు, హత్యలు, దోపిడీలు, దౌర్జన్యాలు) చేస్తున్నారు అంటే, అలా ప్రజల్ని గాలికి వదిలేసిన రాజుదే తప్పు. అందుకే వీళ్ళు చేసే పాపాలన్నీ ఆ రాజుకి అంటుకుంటాయి.

**కురాజ రాజ్యేన కుతః ప్రజాసుఖం,**

**కుమిత్ర మిత్రేణ కుతోఽభి నివృత్తిః.** (చాణక్య నీతిసూత్రాలు 6-13)

దుష్టుడైన రాజు పాలనలో ప్రజలు ఎలా సుఖంగా ఉంటారు? అలాగే దుష్టుడైన మిత్రుడు ఉంటే, వాడివల్ల ఆనందం ఎలా కలుగుతుంది? అని ప్రశ్నిస్తున్నాడు చాణుక్యుడు. దేశాన్ని లేదా రాష్ట్రాన్ని పాలించే పాలకుడు దుష్టుడుగా, మొండివాడుగా ఉండకూడదు. అలా ఉంటే అతడి పాలనలో ఉన్న ప్రజలు నానాబాధలు పడతారు. అతణ్ణి శపిస్తారు. కనుక రాజన్నవాడు ఎప్పుడూ మంచివాడుగా, ప్రజలందరి క్షేమం కోరేవాడుగా ఉండాలి.

✦ ✦ ✦

# రాజధర్మం - ఆశ్రమధర్మాలు

రాజు అందరిపట్ల సమదృష్టి కలిగి ఉంటే సన్యాసాశ్రమ ఫలం (బ్రహ్మలోకప్రాప్తి) కూడా లభిస్తుంది. జ్ఞానం, త్యాగం, ఇంద్రియ నిగ్రహం, సర్వప్రాణులపట్ల దయ కలిగి, శాస్త్రం చెప్పినట్లు నడచుకొనే ధీరునకు (రాజునకు) గృహస్థాశ్రమ ఫలితం కూడా లభిస్తుంది. యోగ్యులను పూజిస్తూ, అన్నిటా నిత్యమూ సంవిభాగంతో ప్రవర్తించే రాజుకు బ్రహ్మచర్యాశ్రమ ఫలం కూడా లభిస్తుంది. జ్ఞాతులను, బంధువులను, మిత్రులను ఆపత్సమయాల్లో ఆదుకొని ఉద్ధరించే రాజుకు దీక్షాశ్రమ గృహస్థాశ్రమ ఫలం దక్కుతుంది. లోకంలో ఉత్తములనూ, ఆయా ఆశ్రమాల్లో శ్రేష్ఠులనూ తరచుగా, సత్కరించే రాజుకు వానప్రస్థాశ్రమ ఫలం దక్కుతుంది.

రోజూ చేయవలసిన సంధ్యావందనాదులూ, పితృయజ్ఞాలూ, భూతయజ్ఞాలూ, మనుష్యయజ్ఞాలూ తరచుగా చేసే వానికి వానప్రస్థాశ్రమ ఫలం లభిస్తుంది.

భూతాల సంవిభాగం తెలిసి వైశ్వదేవాది యజ్ఞాలనూ, అతిథి సత్కారాలనూ, దేవయజ్ఞాలనూ (తపస్సుతో) చేసే రాజుకు వానప్రస్థాశ్రమ ఫలం లభిస్తుంది.

శిష్టుల రక్షణ కోసం పరరాష్ట్రాలను మర్దించే రాజుకు వానప్రస్థాశ్రమ ఫలం లభిస్తుంది. సర్వప్రాణులనూ రక్షిస్తూ, తన రాష్ట్రాన్ని పరిపాలిస్తూ, బహువిధాలయిన దీక్షలు పాటిస్తూ ఉండే వానికి సన్యాసాశ్రమ ఫలం లభిస్తుంది.

నిత్యమూ వేదాధ్యయనం చేయడం, సహనంతో మెలగడం, ఆచార్యులను పూజించడం, గురుశుశ్రూష – చేసే వానికి సన్యాసాశ్రమ ఫలం లభిస్తుంది. విధిగా నిత్యమూ చేయవలసిన జపాదులు చేస్తూ, సదా దేవపూజ చేస్తూ, ధర్మాచరణం చేసేవానికి గృహస్థాశ్రమ ఫలం లభిస్తుంది.

'మరణమో రక్షణమో' ఏదయినా సరే అనే నిశ్చయంతో ప్రాణద్యూతం/యుద్ధం చేసే వానికి బ్రహ్మాశ్రమ ఫలితం లభిస్తుంది. సదా అన్ని ప్రాణుల పట్ల కపటం లేని, క్రూరత లేని పద్ధతిలో నడచుకొనే వానికి బ్రహ్మాశ్రమపదం లభిస్తుంది.

వానప్రస్థులు, వేదాధ్యయన సంపన్నులయిన విప్రులు – వీరికి ఎక్కువగా ధనాలిచ్చే వానికి వానప్రస్థాశ్రమ పదం దక్కుతుంది.

సర్వప్రాణుల మీద దయ చూపిస్తూ, అక్రూరంగా ప్రవర్తించే వానికి అన్ని ఆశ్రమాలవారు పొందే ఫలితం కలుగుతుంది.

ఇతరుల బలాత్కారానికి లోనైన ప్రాణులనూ, శరణుకోరి వచ్చిన వారిని సంరక్షించే వారు గృహస్థాశ్రమ ఫలం పొందుతారు.

బ్రహ్మసృష్టించిన ధర్మంలో త్రికరణ శుద్ధిగా వర్తించేవాడు అన్ని ఆశ్రమాల సత్ఫలితాలను పొందుతాడు.

దశధర్మాలు: 1 ధైర్యం, 2. ఓర్పు, 3. ఇంద్రియ నిగ్రహం, 4. పర ద్రవ్యహరణం చేయకుండుట, 5. ఆచారం, 6. మనోనిగ్రహం, 7. జ్ఞానం, 8. విద్యార్జనం, 9. సత్య వచనం, 10. క్రోధత్యాగం అనే దశధర్మాలను రాజు పాటించాలి.

ధర్మ నిపుణతతో లోకంలో ధర్మాచరణ చేసేవారు తన రాజ్యంలో ఉన్నారంటే ఆ రాజు ఆ ధర్మఫలంలో భాగం పొందుతాడు. ధర్మం మీద శ్రద్ధగల ధర్మనిలయులను రక్షింపని రాజుకు ఆ పాపం సంక్రమిస్తుంది. ధర్మరక్షణం చేసే రాజులకు సహాయకులుగా ఉండేవారు కూడా ఇతరులు చేసిన ధర్మంయొక్క ఫలంలో భాగస్వాములవుతారు.

రాజధర్మం అనేది ఒక నావ. అది ధర్మం అనే సముద్రం మీద ఉంది. సత్త్వ గుణం దాన్ని నడిపించే బలం. ధర్మశాస్త్రం దాని లంగరు/కట్టుత్రాడు. అది త్యాగం అనే గాలి ప్రేరణతో వేగంగా వెడుతుంది. ఆ నౌక రాజును తరింపజేస్తుంది.

తన హృదయంలో ఉన్న కోరికలన్నీ నివృత్తి అయితే అపుడు మానవుడు సత్త్వంలో నిష్ఠ కలిగి పరబ్రహ్మమును పొందుతాడు.

భావం చేతనూ, యోగం చేతనూ ప్రసన్నత కలరాజు ప్రజారక్షణం మీద ఆసక్తితో ధర్మఫలాన్ని పొందుతాడు. మానవులు వనాల్లోనూ, ఆశ్రమాల్లోనూ ఉండి ఆచరించే దానివల్ల సాధించే ఫలితం కంటె నూరురెట్ల ఫలితాన్ని రాజు ప్రజారక్షణ ధర్మం పాటించి పొందుతాడు.

అని భీష్ముడు ధర్మరాజుకు బోధించాడు.

✦ ✦ ✦

# రాష్ట్ర ప్రజల కర్తవ్యం

రాష్ట్రం ముఖ్య కర్తవ్యం రాజును అభిషేకించటమే. పాలకుడు లేకపోతే దుర్బలమైన రాజ్యాన్ని దొంగలు కొల్లగొడతారు. రాజులేని రాష్ట్రాల్లో ధర్మం నిలవదు. ప్రజలు పరస్పరం తినేస్తారు. రాజులేని రాష్ట్రం పరమనీచం. 'ఇంద్రుడినే రాజుగా వరించు' అంటుంది వేదం. అందుచేత శుభం కోరేవాడు, ఇంద్రునిగా భావించి రాజును పూజించాలి.

రాజులేని రాష్ట్రాల్లో నివసించరాదు. అరాజకాలైన రాష్ట్రాలను రాజ్యకాంక్షతో బలీయుడెవడైనా ఆక్రమించాలని వస్తే ఆ రాజును రాష్ట్ర ప్రజలు ఎదురేగి సత్కరించాలి. ఆ సమయంలో ఇదే మంచి ఆలోచన. ఎందుచేతనంటే అరాజకం కంటే మించిన పాపం మరొకటి ఏదీ లేదు.

ఆ బలీయుడు చక్కగా పాలిస్తే రాజ్యమంతా కుశలంగా / క్షేమంగా ఉంటుంది. కోపిస్తే రాజ్యం అంతా నిశ్శేషమయిపోతుంది. ఏమి మిగలదు.

పాలు పితికే వాడిని కష్టపెట్టే ఆవు చాలా బాధలు పడాలి. సుఖంగా పితకనిస్తే దాన్ని గోటితో కూడా గిల్లరు. కాల్చకుండానే మెత్తబడి వంగే దాన్ని ఎవరూ కాల్చరు. స్వయంగా వంగే కర్రను లోకులు వంచరు. ఈ పోలిక ననుసరించి బలవంతుని దగ్గర వంగి ఉండాలి. బలవంతుడికి వంగి నమస్కరిస్తే ఇంద్రునికి నమస్కరించినట్లే. అందుచేత అభ్యుదయం కోరేవాడు రాజుగా బలవంతుణ్ణే చేయాలి. రాజు లేకపోతే ధనం వల్లగాని భార్యవల్ల గాని ఏ ప్రయోజనమూ ఉండదు / రెండూ దక్కవు.

అరాజకమయిన దేశంలో పాపాత్ముడు పరులధనాన్ని హరించి ప్రీతి పొందుతాడు. ఇతరులు వాడి సొమ్మునంతా హరించివేస్తే అపుడు వాడు 'రాజు తప్పక ఉండాలి' అంటాడు. అరాజకమయిన దేశంలో పాపాత్ములు కూడ ఎప్పుడూ క్షేమంగా ఉండరు. ఒకనిని ఇద్దరు దోచుకొంటే, ఆ ఇద్దరినీ చాలామంది కలిసి దోచుకొంటారు. దాసుడు కాని వానిని దాసునిగా చేసుకొంటారు. బలవంతంగా స్త్రీలను ఎత్తుకొనిపోతారు. ఈ కారణం చేతనే దేవతలు ప్రజాపాలకులను సృజించారు.

ఈ లోకంలో దండం ధరించిన రాజు లేకపోతే, నీటిలో చిన్నచేపలను పెద్ద చేపలు మ్రింగేసినట్లు దుర్బలులను బలవంతులు మ్రింగివేస్తారు.

అందువల్ల శుభాలూ, సంపదలూ కోరే మానవులంతా ప్రజానుగ్రహం కలగటం కోసం ముందుగా రాజును ఏర్పరచుకోవాలి.

శిష్యులు గురువుకూ, దేవతలు దేవేంద్రునకు నమస్కరించినట్లు ప్రజలందరూ రాజుకు భక్తితో నమస్కరించాలి. తనవారు గౌరవిస్తే వానిని ఇతరులు కూడా గొప్పగా భావిస్తారు. తనవారు పరాభవిస్తే ఇతరులు కూడా వానిని పరాభవిస్తారు.

ఇతరులు రాజును పరాభవిస్తే అది అందరికీ దుఃఖం కలిగిస్తుంది. అందుచేత ఛత్రం, వాహనం, వస్త్రాలు, ఆభరణాలు, భోజనాలు, పానీయాలు, గృహాలు, ఆసనాలు, శయ్యలు – ఇలా అన్నిరకాల ఉపకరణాలు – రాజుకు ఇవ్వాలి. అందుచేత రక్షకుడు ఎవరికీ ఎదిరింపరాని వాడు అవుతాడు. చిరునవ్వుతో ముందుగా రాజు పలుకరించాలి. ప్రతి సంభాషణం మధురంగా చెయ్యాలి.

రాజు కృతజ్ఞుడై, దృఢమయిన భక్తి కలిగి, ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండాలి. శుభంగా, చక్కగా ప్రజలచేత చూడబడాలి. అలాగే ప్రజలపట్ల రాజు కూడా ప్రవర్తించాలి.

✦ ✦ ✦

# రాజు - విశేష కర్తవ్యాలు

రాజు ఎల్లపుడూ తన చిత్తాన్ని గెలవాలి. తరువాత శత్రువులను జయించాలి. చిత్తాన్నే జయించనివాడు శత్రువులను ఎలా జయిస్తాడు ?

దుర్గాలలోను, రాష్ట్రం సరిహద్దులలోను, నగర సమీపాల్లోను, పురాల ఉద్యానాల్లోను రక్షకులను నియమించాలి. సంస్థానాల్లోనూ, అన్ని పురాల్లోను, నగరాల్లోను, అంతఃపురంలోను, రాజభవనంలోను రక్షకులను నియమించాలి.

తరువాత జడులు, అంధులు, చెవిటి వారి ఆకారాలు కలవారినీ, ప్రజ్ఞావంతులను, ఆకలి దప్పులను శ్రమను భరించగలవారినీ, పరీక్షించి గూఢచారులుగా నియమించాలి.

మంత్రులు, మిత్రులు, కుమారులు మొదలగు వారి మీద కూడ గూఢచారులను మెలకువతో నియమించాలి.

పురంలో, రాష్ట్రంలో, సామంతరాజులలో, ఒకరికొకరు తెలియకుండా గూఢచారులను నియమించాలి. వ్యాపార ప్రదేశాల్లో, క్రీడా ప్రదేశాల్లో, సమాజాల్లో, భిక్షుకులలో, తోటల్లో, ఉద్యానవనాల్లో, పండిత సభలలో, వివిధ ప్రదేశాల్లో, నాలుగు రోడ్ల కూడళ్లలో, ధనవంతుల గృహాల దగ్గర శత్రువులు పంపిన గూఢచారులను గుర్తించాలి.

శత్రువుల గూఢచారులను విచక్షణతో వెదకి పట్టుకోవాలి. ముందుగా గూఢచారులు తెలిస్తే తరువాత మేలు కలుగుతుంది.

తాను బలహీనుడని రాజు భావిస్తే మంత్రులతో ఆలోచించి, బలవంతుడైన శత్రువుతో సంధి చేసుకోవాలి.

విద్వాంసులైన క్షత్రియులు, వైశ్యులు, చాలా శాస్త్రాలు చదివిన బ్రాహ్మణులు, దండనీతి తెలిసినవారు మంత్రులుగా ఉండాలి. ముందుగా నీతిశాస్త్రం యొక్క తత్త్వం తెలిసిన బ్రాహ్మణుని అడగాలి. తరువాత నీతికోవిదుడయిన రాజును అడగాలి. ఆ తరువాత శాస్త్రమెరిగి హితంచేసే వైశ్య శూద్రులను అడగాలి.

తన బలహీనత బయటపడకముందే శత్రువుతో సంధి చేసుకోవాలి. ఏదైనా ప్రయోజనం కోరినపుడు కూడా విచక్షణుడైన రాజు త్వరపడి సంధి చేసుకోవాలి.

రాష్ట్రాన్ని ధర్మపూర్వకంగా పరిపాలిస్తూ గుణవంతులూ, ఉత్సాహవంతులూ, ధర్మజ్ఞులూ, సాధువులైన వారి ద్వారా రాజు శత్రువులతో సంధి చేసుకోవాలి.

తెలివైన రాజు తన్నుగెంటివేయాలనుకొనే శత్రువులను తెలిసికొని వారినీ, పూర్వం అపకారం చేసిన వారినీ, లోకం చేత ద్వేషింపబడే వారిని చంపివేయాలి. ఉపకారం కానీ అపకారం కాని చేయలేని వారినీ, పెకలించి వేయటానికి శక్యంకాని శత్రువునూ ఉపేక్షించాలి.

వీరుడు, యుద్ధకళానిపుణుడు, బలవంతుడు, కష్టాలు లేనివాడు అయిన రాజు ముందు నగర రక్షణం చేసుకోవాలి. తరువాత యాత్రావిధానానికి సంబంధించి రక్షణ చేసుకోవాలి. అపుడు యాత్రకు ఆజ్ఞాపించాలి. యుద్ధయాత్రకు ఎవని మీదకు వెడుతున్నాడో ఆ శత్రురాజు స్వభావం ముందు తెలుసుకోవాలి. తర్వాతనే యుద్ధయాత్రకు బయలుదేరాలి.

పరాక్రమం కలరాజు హీనునికి ఎన్నడూ వశమైపోరాదు. గూఢంగా శత్రువు బల పౌరుషాలను తగ్గింపజేసే ప్రయత్నం చేస్తూ ఉండాలి.

శస్త్రాలతో, అగ్నితో, విషంతో, అతని శత్రువు యొక్క మంత్రులకూ, ప్రియవ్యక్తులకూ పరస్పరం వివాదాలు సృష్టించాలి.

రాజ్యం కోరే తెలివైన రాజు యుద్ధాన్ని విడిచిపెట్టాలి. మొదట సామోపాయం తోనూ, తరువాత కొంతదానం చేసి, ఆ తరువాత వాని మిత్రులలో భేదం పెట్టి – ఇలా ఉపాయాలతోనే రాజ్యం పొంది, తృప్తిపడాలి. అతడే పండితుడు.

ప్రాజ్ఞుడైన రాజు ప్రజల నుండి ఆరవభాగం మాత్రమే పన్ను గ్రహించాలి. అది కూడా ప్రజల రక్షణకోసమే గ్రహించాలి.

పది విధాలుగా దండింపదగిన మత్తులు మొదలైనవారి నుండి కూడ పౌరుల రక్షణ కోసమే చాలా తక్కువ పన్ను గ్రహించాలి. (1. మత్తులు, 2. ఉన్మత్తులు 3. దస్యులు,4. తస్కరులు 5. ప్రతారకులు 6. శఠులు 7. లంపటులు 8. జూదరులు 9. కృత్రిమలేఖకులు 10.లంచగొండులు.)

పుత్రులను, మనుమలను చూసినట్లు ప్రజలను చూడాలి. కాని ధర్మనిర్ణయాది వ్యవహారంలో మాత్రం పక్షపాతం చూపరాదు.

టంకశాల, ఉప్పుపొలాలు, ధాన్యవిక్రయకేంద్రాలు, రేవులు, గజసైన్యం దగ్గర రాజు తనకు ఆప్తులను, హితులను మంత్రులుగా చేయాలి. సరైన దండనీతిని

ప్రవర్తింపజేసే రాజు ధర్మం పొందుతాడు. రాజు యొక్క సతత దండమే చక్కని ధర్మమని ప్రశంసింపబడింది.

రాజు వేదాలు, వేదాంగాలు తెలిసిన ప్రాజ్ఞుడు, తపస్వి, దానశీలుడు, యజ్ఞశీలుడు అయి ఉండాలి. ఈ గుణాలన్నీ రాజులో సతతమూ స్థిరంగా ఉండాలి. ఈ వ్యవహారం లోపిస్తే రాజుకు స్వర్గంలేదు, కీర్తిలేదు.

బలీయుడైన రాజు చేత పీడింపబడితే తెలివైన రాజు దుర్గాన్ని ఆశ్రయించాలి.

సమయం చూసి మిత్రుల సహాయం పొంది రక్షణ విధానం ఏర్పరచుకోవాలి. సామ భేదోపాయాలు కానీ, యుద్ధం కానీ విధాననిశ్చయం చేసుకోవాలి.

మార్గాల్లో గోశాలలు నిర్మించాలి. గ్రామాలను తీర్చిదిద్దాలి. వాటిల్లోనూ, శాఖానగరాల్లోనూ మిత్రులను ప్రవేశపెట్టాలి. ధనవంతులూ, బలవంతులూ అయిన వారిని రహస్యంగా దుర్గాలలోను, దేశాల్లోను బ్రతిమాలి అయినా ప్రవేశపెట్టాలి.

అవసరమైతే రాజు స్వయంగానే తన పొలాలను కోయించాలి. అది సాధ్యపడకపోతే అగ్నితో కాల్చివేయాలి. (శత్రువుకు ఆహారం దొరకకుండా చేయాలి.) శత్రువు యొక్క పొలాల్లో ఉండే పంటలను కాపాడే ప్రజలను భేదించాలి. లేదా తనబలగంతో ఆ పంటలన్నీ నాశనం చెయ్యాలి.

నదుల మీద, రోడ్ల మీద ఉన్న వంతెనలను కూల్చివేయాలి. చెరువులలోని నీటిని వదిలెయ్యాలి. అది కుదరకపోతే ఆ జలాన్ని విషంతో కలుషితం చెయ్యాలి. అప్పుడు కాని, తర్వాత కాని మిత్రకార్యం చేయవలసి ఉన్నాసరే వదలిపెట్టి, యుద్ధంలో తన శత్రువును చంపగల పొరుగు దేశపురాజును ఆశ్రయించి ఉండాలి.

రాజు తన చిన్నదుర్గాలను మొదలంట నాశనం చెయ్యాలి. చిన్న చిన్న చెట్ల నన్నిటినీ నరికివేయాలి. అందులో రచ్చబండ చెట్లను వదలివేయాలి. పెద్ద పెద్ద చెట్ల కొమ్మలను మాత్రమే నరకాలి. రచ్చబండల మీద చెట్ల ఆకులను కూడ కోయరాదు.

ప్రగండులను ఆకాశ జననులను నిర్మించాలి. మేకులు, మొసళ్లు, పెద్ద చేపలతో పరిఘను నింపాలి.

(ప్రగండి కోట = బయటి ప్రాకారం మీద శత్రువుల సంచారం దూరం నుంచే కనిపెట్టడానికి కట్టే బురుజులను ప్రగండులు అంటారు).

ఆకాశ జననీ: బురుజుల మీద నుంచి సన్నని రంధ్రాలద్వారా శత్రువులను కనిపెట్టేవారిని ఆకాశ రక్షకులు అంటారు. ఆ రంధ్రాల నుండి కాలిన ఇనుప గుండులను ప్రయోగిస్తారు. వాటిని ఆకాశ జననులు అంటారు.

ప్రమాద సందర్భాలలో పురజనులు పారిపోవటానికి దొడ్డిదారులను ఏర్పరచాలి. వాటికి రాజద్వారానికి వలె అన్ని విధాల రక్షణ ఏర్పరచాలి.

ద్వారాలలో పెద్ద పెద్ద యంత్రాలు నిర్మించాలి. శతఘ్నులను నిలపాలి. అవి అన్నీ తనకు వశమై యుండాలి.

వంటకట్టెలను సరిపడ తెచ్చుకోవాలి. అలాగే నూతులను త్రవ్వించాలి. పూర్వమే త్రవ్విన నూతులను పరీక్షించి వాడుకోవాలి. గడ్డికప్పిన ఇండ్ల మీద బురదపూత పెట్టాలి. చైత్రమాసంలో అగ్ని భయం వల్ల గడ్డిని తీసివెయ్యాలి. రాత్రులయందే రాజు అన్నం వండిచాలి. పగటిపూట అగ్ని జ్వలింపరాదు. ఒక్క అగ్ని కార్యంలో తప్ప.

కమ్మరి శాలల్లోనూ, పురిటిళ్లలోను మంచి రక్షణతో అగ్నిని ఏర్పాటు చెయ్యాలి. గృహాల్లోని అగ్నులను కప్పి ఉంచాలి. పగటిపూట అగ్ని ప్రజ్వరిల్లితే ఆ యింటి వానికి వధయే శిక్ష అని చాటించాలి. నగర రక్షణకోసం ఇలా చెయ్యాలి.

భిక్షుకులను, బండ్లవాళ్లను, పేడివాళ్లను, పిచ్చివాళ్లను. నటులను నగరాలకు వెలుపలనే నిలపాలి. లేకపోతే వారి వల్ల చాలా దోషాలు కలుగుతాయి.

రాజమార్గాలన్నీ విశాలంగా నిర్మించాలి. ఆయా ప్రదేశాల్లో చలివేంద్రాలు, దుకాణాలను ఏర్పాటు చెయ్యాలి. అలాగే కోశాగారాలను, ఆయుధశాలలను, యోధశాలలను, అశ్వశాలలను, ఏనుగులశాలలను, సైన్యశిబిరాలను తగినచోట్ల నిలపాలి. పరిఖలను, మార్గాలను, ఉద్యానవనాలను నిర్మించాలి. వీనిని శత్రువులు గమనింపలేనట్లు రహస్యంగా ఉంచాలి.

శత్రుబలం వల్ల భయాన్ని ఊహించి, ధనాన్ని కూడబెట్టాలి. నూనె, వస, తేనె, నేయి, ఔషధాలు, ఎక్కువగా సేకరించాలి. బొగ్గులు, దర్భలు, ముంజ గడ్డి, మోదుగకర్రలు, లేఖకులు, రెల్లు గడ్డి, గడ్డి, కట్టెలు, విషబాణాలు ఎక్కువగా నిలువచెయ్యాలి.

శక్తి, ఈటె, కవచం – మొ॥ అన్ని ఆయుధాలను పెద్ద సంఖ్యలో సేకరించాలి. అన్ని రకాల మందులను, మూలికలను, పండ్లను, నాలుగు రకాల వైద్యులను, విశేషంగా సేకరించాలి.

నటులు, నర్తకులు, మల్లులు, ఇంద్రజాల విద్యల వారిని ఆహ్వానించి, వారి విద్యలతో అందరినీ సంతోషపెట్టాలి. సేవకుడు, మంత్రి, పౌరులు మొ॥ వారి విషయంలో రాజుకు అనుమానం కలిగితే వెంటనే వారిని అదుపులోకి తీసుకోవాలి.

సేవకాదులు చక్కగా పని నిర్వహించినపుడు రాజు ధనాలతో సత్కరించాలి. తగిన ధనంతో, మంచిగా ప్రసన్నంగా మాట్లాడటంతో, ఇలా ఎన్నో రకాలుగా సత్కరించాలి. ఒకవేళ పొరపాటున రాజు సేవకుని దుఃఖపెట్టినా, చంపినా శాస్త్రోక్తంగా వాని ఋణం తీర్చుకోవాలి.

రాజు ఏడింటిని తప్పక రక్షించుకోవాలి. 1. తాను 2. మంత్రులు 3. కోశాగారాలు, 4. దండం 5. మిత్రులు 6. జానపదులు 7. పురం. ఈ ఏడింటి సమూహమైన రాజ్యాన్ని ప్రయత్నించి కాపాడుకోవాలి. 1. షాడ్గుణ్యం 2. త్రివర్గం 3. త్రివర్గపరమం – ఈ మూడింటిని చక్కగా తెలిసిన రాజు ఈ భూమిని అనుభవిస్తాడు.

షాడ్గుణ్యం: 1. సంధానాసనం = సంధిచేసుకొని నెమ్మదిగా ఉండటం, 2. యాత్రా సంధానం = దండయాత్ర, 3. విగృహ్య – ఆసనం = వైరంతో ఉండటం, 4. యాత్రాం సంపరి గృహ్య ఆసనం = యాత్రను ప్రకటించి ఉండటం, 5. ద్వైధీభావం = శత్రువులను విడదీయటం

1. క్షయం 2.స్థానం 3. వృద్ధి – వీటిని త్రివర్గం అంటారు. అలాగే 1. ధర్మం 2.అర్థం 3. కామం.

షడ్వర్గాన్ని, పంచవర్గాన్ని, దశదోషాలను లేదా అష్ట దోషాలను జయించి, త్రివర్గంతో కూడి, దశవర్గ జ్ఞానం కల రాజును దేవతలు కూడ జయించలేరు.

(1. షడ్వర్గం = కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు 2.పంచవర్గం = పంచేంద్రియాలు, 3. దశదోషాలు = ఇవి కామ జనితాలు. 1. వేట 2. జూదం, 3. పగటి నిద్ర 4. ఇతరులను నిందించడం 5. స్త్రీల పై ఆసక్తి 6. మద్యం 7. నాట్యం 8. గానం 9. వాదిత్రం 10. వ్యర్థంగా తిరగడం.)

స్త్రీలు, మూర్ఖులు, దైవోపహతులు, వేదజ్ఞాన రహితులు – వీరి సలహాలు ఎన్నడూ రాజు స్వీకరింపరాదు. వారి బుద్ధి నీతికి పెడమొగమై ఉంటుంది. స్త్రీ మాట మీద నడిచే రాజ్యాలు, విద్వాంసులు లేనివి, మూర్ఖులైన మంత్రులతో పరితపించే రాజ్యాలు నీటి బిందువులవలె ఆవిరైపోతాయి.

## దండనీతి

చతుర్వర్ణాల వారూ తమతమ కర్మలలో నిలిచి, హద్దులు సంకరమైపోకుండా దండనీతివల్ల క్షేమం కలుగుతుంది.

దండనీతితో రాజు చక్కగా, సమగ్రంగా ప్రవర్తిస్తే అపుడు కృతయుగం అనే కాలం సృష్టింపబడుతుంది. కృతయుగంలో ధర్మమే ఉంటుంది. అధర్మం ఎక్కడా ఉండదు. అన్ని వర్ణాలవారి మనసులూ అధర్మం మీద ఆసక్తి చూపవు.

ప్రజలకు యోగక్షేమాలు చక్కగా ప్రవర్తిస్తాయి. సందేహం లేదు.

కృతయుగంలో రోగాలు రావు. తక్కువ ఆయుర్దాయం కల మానవుడు కనపడడు. విధవ స్త్రీలు ఉండరు. కృపణుడు/దీనుడు/దుఃఖితుడూ పుట్టనే పుట్టడు.

భూమి దున్నకుండానే పండుతుంది. ఓషధులు తమంత తామే ఏర్పడతాయి. చెట్ల బెరడులు, ఆకులు, ఫలాలు, వేళ్లు ఎంతో శక్తిమంతాలై ఉంటాయి.

నాలుగవ వంతు భాగం వదలి మూడు భాగాలు మాత్రమే దండనీతితో ఆచరించినపుడు త్రేతాయుగం వచ్చినట్లు. అధర్మం యొక్క నాలుగవ భాగం మిగిలిన మూడు భాగాలతో కలుస్తుంది. భూమి దున్నితేనే పండుతుంది. ఓషధులు కూడ అలాగే పురుష ప్రయత్నంతోనే ఫలిస్తాయి.

సగం భాగం వదలి, సగం నీతిని రాజు అనుసరిస్తే అపుడు ద్వాపరయుగం అనే కాలం వస్తుంది.

అధర్మం యొక్క సగభాగం మిగిలిన ధర్మం యొక్క సగభాగంతో కలుస్తుంది. దానితో దున్నిన భూమి కూడా సగం ఫలమే ఇస్తుంది.

రాజు దండనీతిని పూర్తిగా వదలిపెట్టి, అయోగ్యమయిన ఉపాయాలతో ప్రజలను బాధించినపుడు కలి ప్రవర్తిస్తుంది. కలియుగంలో అధర్మం ఎక్కువ. ధర్మం ఎక్కడా కనపడదు. అన్ని వర్ణాల వారి మనసూ స్వధర్మం నుండి జారిపోతుంది. శూద్రులు సంన్యాసం తీసుకొని జీవిస్తారు. బ్రాహ్మణులు ఇతరులకు సేవచేసి బ్రతుకుతారు. యోగ క్షేమాలు నశించిపోతాయి. వర్ణ సంకరం ఏర్పడుతుంది. వైదిక కర్మలన్నీ విరుద్ధగుణాలుగా కనిపిస్తాయి. ఋతువులన్నీ సుఖకరంగా ఉండవు. రోగ సహితాలు అవుతాయి.

మనుష్యుల స్వరాలు, వర్ణాలు, మనస్సులూ ముడుచుకుపోతాయి. రోగాలు వస్తాయి. మానవులు త్వరగా కాలంతీరి చచ్చిపోతారు. విధవలు ఏర్పడుతారు. ప్రజలు క్రూరులవుతారు. ఒక చోట మేఘం వర్షం కురుస్తుంది. ఒక చోట పంటలు పండుతాయి.

దండనీతితో ప్రజలను చక్కగా రక్షించాలని రాజు భావించకపోతే అపుడే సర్వరసాలూ క్షీణించిపోతాయి. కృతయుగానికీ, త్రేతాయుగానికీ, ద్వాపరయుగానికీ, కలియుగానికి కూడా రాజే కారణమవుతాడు.

కృతయుగాన్ని సృష్టించడంచేత రాజు సంపూర్ణంగా స్వర్గఫలం పొందుతాడు. త్రేతాయుగ సృష్టితో స్వర్గం పూర్తిగా అనుభవించడు. ద్వాపరయుగం ప్రవర్తిస్తే యథాభాగంగా (సగం) పొందుతాడు. కలియుగ ప్రవర్తనతో రాజు ఎంతో పాపం పొందుతాడు. ఆ దుష్కర్ముడు నరకంలో శాశ్వతంగా నివసిస్తాడు. ప్రజల పాపాల్లో మునిగిపోయి అపకీర్తినీ, పాపాన్ని పొందుతాడు. అందుచేత క్షత్రియుడు దండనీతిని పురస్కరించుకొని చక్కగా తెలిసి, లభించని దాన్ని పొందాలి. పొందిన దాన్ని రక్షించుకోవాలి.

✦ ✦ ✦

# రాజ్యపాలన

ధర్మనిష్ఠకల శాస్త్ర పారంగతులను, గుణవంతులైన ద్విజులను ఎదురేగి తీసికొని వచ్చి, పాదాభివందనం చేసి  పురోహితుడితో కలిసి, కార్యాలన్నీ నిర్వహించాలి.

ముందు సంధ్యాది ధర్మ కృత్యాలు నిర్వర్తించి, మంగళప్రదమైన వస్తువులు దర్శించి, అర్థసిద్ధిని, జయాన్ని కలిగించే విప్రాశీర్వాదాలు పొందాలి. త్రికరణ శుద్ధి కలిగి, ధృతితో, బుద్ధితో యథార్థం గ్రహించాలి. కామక్రోధాలు విడిచిపెట్టాలి.

రాజు కామక్రోధాలతో ఏపని చేసినా అతడు ధర్మం కాని, అర్థం కాని గ్రహించ లేడు. అర్థకామాల విషయంలో లోభులను కాని, మూర్ఖులను కాని నియోగింపకూడదు. లోభం లేని వారినీ, బుద్ధిమంతులను అన్ని పనులలోను నియోగించాలి

కార్యజ్ఞానం లేని మూర్ఖుని ఏవిషయంలో నియోగించినా అతడు కామక్రోధవశుడై కార్యదీక్ష లేకుండా ప్రజలను బాధిస్తాడు.

ధర్మయుక్తమైన పన్ను గ్రహించి రాజు నీతితో, శ్రద్ధతో, ప్రజలకు యోగక్షేమాలు కల్పించాలి. రక్షణ ఇస్తూ, దాతయై, ధర్మం తప్పకుండా, అలసట లేకుండా, రాగద్వేషాలకు లోబడకుండా ఉండే రాజుపట్ల ప్రజలు అనురాగం కలిగి ఉంటారు.

లోభంతో కాని, అధర్మంగా కాని ధనం రావాలని భావించకూడదు. శాస్త్రం మీద శ్రద్ధలేని వానికి ధర్మం, అర్థం స్థిరంగా ఉండవు.

పాలు కావలసినవాడు ఆవుపొదుగు కోస్తే పాలు రావు. అలాగే తప్పుడు పద్ధతితో రాజు ప్రజలను పీడిస్తే ఆ రాష్ట్రం వృద్ధిచెందదు. పాలిచ్చే ఆవును నిత్యమూ సేవించేవాడు పాలు పొందుతాడు. ఉపాయంతో రాష్ట్రాన్ని అనుభవిస్తూ చక్కగా రక్షించే రాజు ధనాగారం నిత్యం వృద్ధి చేసుకొంటాడు. తృప్తి చెందిన తల్లి పిల్లలకు సమృద్ధిగా పాలు ఇస్తుంది. అలాగే రాజు రక్షించి భూమిని తృప్తిపరిస్తే తాను కూడా ధన ధాన్యాలను ఇస్తుంది.

రాజుకు ప్రజలను రక్షించడమే పరమధర్మం. ప్రాణులపట్ల దయ చూపటమే రక్షణం.

భయం నుండి ప్రజలను ఒక్కదినం రక్షించకపోయినా రాజు ఆ పాపఫలం వెయ్యేళ్లు అనుభవిస్తాడు. ప్రజలను ధర్మంతో రక్షిస్తూ ఒక్కరోజు పుణ్యం చేసినా ఆరోజు ఫలం పదివేల యేళ్లు స్వర్గంలో అనుభవిస్తాడు.

యజ్ఞాలు చేసినవాడు, చక్కగా వేదాధ్యయనం చేసినవాడు, చక్కగా తపస్సు చేసినవాడు ఎంతకాలమో చేస్తేనే పుణ్యలోకాలు పొందుతారు. కాని ప్రజలను ధర్మంతో రక్షించే రాజు ఆ పుణ్యలోకాలు క్షణంలో పొందుతాడు.

✦ ✦ ✦

# సచివుల లక్షణాలు

రాజులకు నాలుగురకాల మిత్రులుంటారు. 1.సహార్థుడు, 2. భజమానుడు, 3. సహజుడు, 4. కృత్రిముడు. ధర్మాత్ముడనే అయిదవ మిత్రుడు కూడ ఉంటాడు. కాని అతడు ఏ ఒకరికో, ఇద్దరికో సంబంధించి ఉండడు. ధర్మం ఉన్నవైపున ఉంటాడు. అతనికి ఇష్టంకాని విషయాన్ని అతనికి చెప్పరాదు. జయం కోసం రాజులు ధర్మంతోనూ, అధర్మంతోనూ కూడా ప్రవర్తిస్తారు.

పైన చెప్పిన నలుగురిలోనూ మధ్యములు ఇద్దరూ (భజమానుడు, సహజుడు) శ్రేష్ఠులు. మిగిలినవారు నిత్యమూ శంకింపదగినవారు.

దుర్జనుడు సజ్జనుడు కావచ్చు. సజ్జనుడు దుర్జనుడు కావచ్చు. శత్రువు మిత్రుడవుతాడు. మిత్రుడు కూడ శత్రువు కావచ్చు. మానవుని మనస్సు నిత్యమూ ఒకేవిధంగా ఉండదు. అటువంటి వానిని ఎవడు నమ్ముతాడు ? అందుచేత ప్రధానమైన పనిని రాజు ప్రత్యక్షంగా చేసుకోవాలి. (స్వీయరక్షణం కోశరక్షణం మొ॥)

కొందరిని నమ్మాలి. కొందరిని అనుమానించాలి. (ఒకప్పుడు నమ్మాలి మరొకప్పుడు శంకించాలి). ఇది నీతి మార్గం.

'నేను లేకపోతే ఈ సంపద అంతా వీడికి చెందుతుంది' అని ఎవనిని గురించి అనుకొంటామో వానిని నిత్యమూ శంకించాలి. వాడు శత్రు వని పండితులంటారు.

(రాజు యొక్క) తన వృద్ధిచేత తృప్తిపడనివాడూ, క్షీణత చేత మిక్కిలి దుఃఖపడే వాడూ ఉత్తమ మిత్రుడని చెపుతారు.

'నేను లేకపోతే వీడు లేడు' అని ఎవనిని గురించి భావిస్తామో అతడి మీద తండ్రి మీద ఉంచినట్లు విశ్వాసం ఉంచవచ్చు.

చక్కని రూపం, రంగు, కంఠస్వరం, ఓర్పు, కలిగినవాడు అసూయలేనివాడు, సద్వంశంలో పుట్టినవాడు, శీలసంపన్నుడు అయిన మిత్రుడు తన తరువాత నిలువదగినవాడు.

బుద్ధికుశలత, జ్ఞాపకశక్తి, దయా స్వభావం కలవాడై; గౌరవించినా గౌరవించకపోయినా ఎన్నడూ దుష్టభావంలేని ఋత్విజుడు కాని, ఆచార్యుడు కాని,

ప్రశంసలు పొందినవాడు కానీ మంత్రిగా ఉండవచ్చు. అతడు ఉత్తమ పూజితుడు కావచ్చును. అతడు నీ ఆలోచనలను, రహస్యాలను, అర్థ ధర్మాలను, పౌర స్వభావాలను చక్కగా తెలిసి ఉండాలి. అపుడు అతని మీద నీకు తండ్రి మీద ఉన్నట్లుగా విశ్వాసం కలుగుతుంది.

ఒకే పనిలో ఇద్దరినీ, ముగ్గురినీ, ఒకరినొకరు సహింపలేని వారిని నియమించకూడదు. ప్రాణులకు ఒకే పనిలో ప్రవర్తిస్తున్నపుడే భేదం ఎప్పుడూ కలుగుతుంది.

కీర్తియే ముఖ్యం అనుకొనేవాడు, మాట మీద నీతిమీద నిలిచేవాడు, సమర్థులను ద్వేషించనివాడు, అనర్థాలయిన పనులు చెయ్యని వాడు, భయంవలన కాని, కామంవలన కాని, లోభం వలనకాని ధర్మం వదలని వాడు, సమర్థుడు, సముచితంగా మాట్లాడే వాడు మంత్రిగాదగినవాడు.

సత్కులంలో పుట్టినవాడు, చక్కని ప్రవర్తనతో కష్టాలు సహింపగలవాడు, తన్నుతాను పొగడుకొననివాడు, శూరుడు, ఆర్యుడు, విద్వాంసుడు, కార్యాకార్యాలు తెలిసినవాడు – వీరిని మంత్రులుగా చేసుకోవాలి. వారు అన్ని పనులలో నేర్పుకలిగి, పూజితులై, ప్రత్యేకతలు కలిగి సహాయపడుతూ కార్య నిర్వహణం చేయగలుగుతారు.

వీరిని పూర్తిగా తగిన పనుల్లో నియమిస్తే, ఆ మహాకార్యాలు చక్కగా నిర్వహించి శ్రేయస్సులను కలిగిస్తారు. వీరు ఒకరితో ఒకరు పోటీపడి ఆ కార్యప్రయోజనాన్ని గురించి కూడబలుకుకొంటూ రాచకార్యాలను రాజుకు అనుకూలంగా చేస్తూ ఉంటారు.

జ్ఞాతులను నిత్యమూ మంచి మాటలతోను, మంచి పనులతోను మన్నిస్తూ ఉండాలి. ప్రియం చేస్తూ ఉండాలి. ఏమాత్రమూ అప్రియం చేయరాదు.

నమ్మకం లేకపోయినా, ఉన్నట్లుగా జ్ఞాతులతో వ్యవహరించాలి. ఇది దోషం, ఇది గుణం అని నిరూపించి చెప్పతగింది వారిలో కనపడదు.

ఇలా పొరబడకుండా ప్రవర్తించే వానికి శత్రువులు తగ్గిపోతారు. అలాగే మిత్రులు కూడా అవుతారు. జ్ఞాతులతో, చుట్టాలతో ఇలా నిత్యమూ ప్రవర్తించేవాడు మిత్రులలోను, శత్రువులలోను, మధ్యస్థులలోను చిరకీర్తి పొందుతాడు.

✦ ✦ ✦

# అమాత్య విభాగం

విద్యావంతులు, ప్రజ్ఞావంతులు, వేద విద్యను పూర్తి చేసిన శుద్ధమనస్కులు అయిన నలుగురు బ్రాహ్మణులను; బలవంతులై, ఆయుధ విద్యలలో ఆరితేరిన ఎనమండుగురు క్షత్రియులను; ధనవంతులైన ఇరవై ఒక్క వైశ్యులను, వినయం, పవిత్రత, శ్రద్ధ కల ముగ్గురు శూద్రులను, మంత్రులుగా నియమించుకోవాలి.

శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ; విజ్ఞానం, తత్త్వజ్ఞానం అనే ఎనిమిది గుణాలు కల సూతుని పౌరాణికుడిగా నియమించుకోవాలి. అతడి లక్షణాలు ఇలా ఉండాలి. ఏబది ఏళ్ల వయసు ఉండాలి. చురుకుదనం, అసూయలేకపోవడం, వేదాలు, ధర్మశాస్త్రాలు చదివి గుర్తులో ఉన్నవాడు; వినయం, సమదృష్టి కలవాడు; వివాదాలను పరిష్కరింపగలవాడు; సప్తవ్యసనాలు లేనివాడై ఉండాలి పౌరాణికుడు. (సప్తవ్యసనాలు 1. వేట 2. జూదం 3. స్త్రీ 4. మద్యపానం (ఈ నాలుగూ కామసంబంధాలు) 5. క్రూరమైన దండనం. 6. పరుషమైన మాట. 7. సొమ్మును వ్యర్థపరచటం. (ఈ మూడూ క్రోధంతో వచ్చినవి).

రాజు మంత్రాలోచనను ఎనమండుగురు మంత్రుల మధ్య మాత్రమే ఉంచాలి.

తరువాత రాష్ట్రంలోని రాష్ట్రసంబంధి ఉద్యోగికి ఆ వ్యవహారం చూపాలి. రాజు ఇటువంటి వ్యవహారంతో సదా ప్రజలను చూస్తూ ఉండాలి.

రాజు ఎవరినుండి రహస్యంగా ద్రవ్యం గ్రహించకూడదు. అది కార్యాన్ని నశింపజేస్తుంది. కార్యం నశించాక ఆ అధర్మం రాజునూ, వారిని కూడా బాధిస్తుంది.

డేగ వలన పక్షుల గుంపులు దూరంగా పారిపోయినట్లు రాష్ట్రం నుండి ప్రజలు పారిపోతారు. పగిలిపోయిన నావలోంచి దూకినట్లు ప్రజలు పారిపోతారు.

అధర్మంతో ప్రజలను పరిపాలించే రాజుకు గుండె భయం పట్టుకొంటుంది.

అపరాధానికి తగిన శిక్ష పాపులకు విధించాలి. ధనవంతులయితే ధనం లాక్కోవాలి. ధనహీనులను బంధించాలి. దుష్ప్రవర్తన కలవారిని కొరడా దెబ్బలు కొట్టాలి. మంచి వారిని మంచిమాటలు చెప్పి సొమ్ము ఇప్పించాలి.

రాజును వధించాలనుకొన్న వానికి, ఇళ్లకు నిప్పుపెట్టేవానికి దొంగకు, స్త్రీలను చెరచి వర్ణసంకరం చేసేవానికి చిత్రవధయే శిక్ష. శాస్త్రానుసారంగా సరైన దండం విధించే రాజుకు అధర్మం అంటదు. శాశ్వతంగా ధర్మమే నిలుస్తుంది.

తన ఇష్టం వచ్చినట్లు విచక్షణ లేకుండా దండం విధించే రాజు ఈ లోకంలో అపకీర్తి పాలవుతాడు. మరణించాక నరకం పాలవుతాడు.

ఒకని తప్పుకు మరొకరిని దండించరాదు. శాస్త్రాన్ని పరిశీలించి బంధించవచ్చు. విడిచి పెట్టవచ్చు. ఎంత ఆపదలోనయినా రాజు దూతను చంపరాదు. దూతను చంపిన రాజు మంత్రులతో సహా నరకం పాలవుతాడు.

తనరాజు చెప్పమన్నట్లు చెప్పే దూతను రాజధర్మాసక్తి కల రాజు చంపితే అతని తండ్రి తాతలు భ్రూణహత్యా పాపం పొందుతారు. సత్కులం, శీల సంపద, చక్కగా మాట్లాడటం, సమర్థత, ప్రియంగా మాట్లాడటం, చెప్పినదే మాట్లాడటం, జ్ఞాపకశక్తి – ఈ ఏడూ దూతలక్షణాలు.

ప్రతీహారి, శిరోరక్షకుడు కూడ ఇటువంటి గుణాలే కలిగి ఉండాలి. ధర్మశాస్త్రార్థాల తత్త్వం తెలిసినవాడు, సంధి విగ్రహాలు నడపగలవాడు, బుద్ధి, ధైర్యం, సిగ్గు కలవాడు, రహస్యం దాచగలవాడు, కులీనుడు, బలిష్ఠుడు, పరిశుద్ధుడు అయిన అమాత్యుడు ప్రశంసింపబడతాడు. ఇవే గుణాలు కలవాడు సేనాపతి కావాలి.

వ్యూహాలు, యంత్రాలు, ఆయుధాలు విని తత్త్వం తెలిసినవాడు, పరాక్రమశాలి, వాన – చలి – ఎండ – గాలి వీటిని తట్టుకోగలవాడు, శత్రువుల దోషాలను తెలిసినవాడు సేనాపతి కావాలి.

రాజు ఇతరులకు నమ్మకం కలిగేటట్లు ప్రవర్తించాలి. తాను ఎవరినీ నమ్మరాదు. కన్నకొడుకుల మీద కూడ నమ్మకం ప్రశంసనీయం కాదు. నీకు శాస్త్రార్థతత్త్వం చెప్పాను. రాజులకు అవిశ్వాసమే పరమ మంత్రం ఆ మంత్రాన్ని అమాత్యుల, సచివుల సహాయంతో సమర్థవంతంగా రాజు నిర్వహించాలి.

✦ ✦ ✦

# సైనిక నీతి

బుద్ధి రెండు రకాలుగా ఉంటుంది. ఋజుబుద్ధి, వక్రబుద్ధి అని. ఈ రెండింటి గురించి రాజుకు తెలిసి ఉండాలి. సాధ్యమైనంతవరకు తెలిసీ వక్రబుద్ధికి లోను కాకూడదు. ఒకవేళ స్వభావసిద్ధంగా వచ్చినా, దానిని దూరం చేసుకొనే ప్రయత్నం చేయాలి.

రాజుకు శత్రువైనవాడు, అతనిని సేవిస్తూనే ఆంతరంగికులలో భేదాలు సృష్టిస్తూ ఉంటాడు. ఆ మోసాన్ని రాజు గుర్తించి నాశనం చేయాలి.

ఏనుగులను రక్షించడానికి ఆవుల, ఎద్దుల, కొండచిలువల చర్మాలతో కవచాలు తయారు చేయించాలి. ఇనుప ముళ్లు లోహాలతో తయారైన కవచాలు, చామరాలు, తెల్లగా మెరుస్తూ పదునుగా ఉన్న ఆయుధాలు, ఎఱ్ఱని, పసుపు పచ్చని రంగుకల కవచాలు, అనేక రంగులతో శోభిల్లే ధ్వజాలు, పతాకాలు, తోమరాలు, ఖడ్గాలు, వాడియైన పరశువులు, పలకలు, డాళ్లు వీనినన్నింటినీ అధిక సంఖ్యలో ఉంచుకోవాలి.

ఆయుధాలు సిద్ధంగా ఉండి, వీరులందరూ కృతనిశ్చయులై ఉంటే చైత్రంలో గాని, మార్గశీర్షమాసంలో గాని పూర్ణిమ తిథినాడు సైన్యాన్ని యుద్ధానికి బయలుదేర తీయడం ప్రశస్తమైనదిగా భావిస్తారు. ఆ సమయంలో భూమి పంటలు పండి, జల సమృద్ధమై ఉంటుంది. కాలం అతిశీతలంగానూ ఉండదు, అతివేడిగానూ ఉండదు. కాబట్టి అప్పుడే దండయాత్రకు సిద్ధం కావాలి. లేదా శత్రువు క్లిష్టస్థితిలో ఉండగా దాడి చేయాలి.

సైన్యం వెళ్లే మార్గంలో నీరూ, గడ్డీ సమృద్ధిగా ఉండాలి. వెళ్లే మార్గం సమప్రదేశం అయితే మంచిది. గూఢచారులు బాగా ఎరిగి అలవాటు పడినదీ కావాలి.

సేన ముందు భాగంలో కులీనులు, సమర్థులూ ఉండాలి. మధ్యలో నిలిచే చోటు నీళ్లు ఉన్నది, ఇతరులు ప్రవేశింపశక్యం కానిదీ బయలు ప్రదేశమూ అయి ఉండాలి. అలా ఉంటే శత్రువులు చొరబడటానికి వీలుండదు. సేనలు నిలవటానికి బయలు ప్రదేశం కంటే అరణ్య ప్రదేశం మంచిదంటారు. సేనలకు దగ్గరలో యుద్ధనిపుణులు, గుణవంతుల రక్షణలో ధనాగారం ఉండాలి.

రాజు ఆ ధనాగారానికి దగ్గరలో ఉండటం, కాల్బలాల రక్షణం, శత్రువుల చర్యలకు ఎదురు దెబ్బతీయటం – ఇవి ఆపద సమయాల్లో బాగా ఉపయోగిస్తాయి.

వాయువు వీచే దిక్కునుండి, సూర్యుడున్న దిక్కు నుండి, శుక్రుడున్న దిక్కు నుండి జయం లభిస్తుంది. అన్నీ ఒకే కాలంలో ఉంటే శుక్రుని కంటే సూర్యుడు, సూర్యుని కంటె వాయువు బలీయాలు.

గుర్రాలుండే చోటు బురదలేనిది, నీరు తడిలేనిది, గట్టులు లేనిది, రాళ్లు లేనిది కావాలని యుద్ధనిపుణులు చెపుతారు. రథాలుండే భూమి బురద లేకుండా గుంటలు లేకుండా ఉండాలి. ఏనుగులు, వానియోధులు ఉండే చోటు చిన్న చిన్న చెట్లు, పెద్ద పొదలు, నీరు కల ప్రదేశం అయి ఉండాలి.

చాలా దుర్గాలు, పెద్ద పెద్ద పొదలు, వెదురు పొదలు కల భూమి పదాతిదళాలకు తగినది. పర్వతాలు, ఉపవనాలు కూడ మంచివి.

కాల్బంటులు ఎక్కువగా ఉన్న సేన దృఢంగా ఉంటుంది. వానలేని రోజుల్లో రథాలు, గుర్రాలు కల సేన బాగా ఉపయోగిస్తుంది. కాల్బలం, ఏనుగులు కల సేన వర్షాకాలంలో బాగుంటుంది. ఈ గుణాలను, దేశ కాలాలను తెలిసికొని సేనను నడపాలి.

ఇలా చక్కగా ఆలోచించి, తిథి, నక్షత్రాలు బాగున్నపుడు రాజు సేనను దండయాత్రకు ప్రయోగిస్తే తప్పక విజయం లభిస్తుంది. ఇందులో నిద్రించే వారిని, దప్పికతో ఉన్నవారిని, అలసిపోయిన వారిని, చెల్లాచెదరైన వారిని బాధించకూడదు.

నగరాన్ని విడిచేటప్పుడూ, ప్రయాణించేటప్పుడు, భయసమయంలోను, అన్నపానాల వేళలలోనూ, బాగా నలిగిన వారిని, దెబ్బతిన్న వారిని, బక్క చిక్కినవారిని, దృఢత్వంలేని వారిని, పనిలో ఉన్నవారిని, రహస్య కృత్యాల్లో పాల్గొనే వారిని, బయట తిరిగే అల్ప సేవకులను, భవన సేవకులను పీడించరాదు.

అట్లే వంశపారంపర్యంగా రాజద్వారాదులలో పనిచేసే వారిని, ఇంకా ఇతర సేవలు చేసే కొన్ని వర్గాలవారిని (యుద్ధం కోసం) పీడించ కూడదు.

శత్రుసేనను చీల్చి చెండాడే వారికి, చెల్లాచెదురైన తమసేనను కూడగట్టగలవారికి, రాజు తనతో సమంగా అన్నపానాలు పెట్టాలి. రెట్టింపు వేతనం ఇవ్వాలి. పదేసి మందికి ఒకరిని, నూరుగురికి ఒకరిని, దళపతులను చేయాలి. తరువాత శూరుడై, అలసట ఎరుగని వానిని వెయ్యి మందికి అధిపతిగా నియమించాలి.

యుద్ధ ముఖ్యులందరినీ ఒక చోట చేర్చి రాజు ఇలా చెప్పాలి. “యుద్ధంలో విజయం కోసం మనం ఒకరినొకరు విడువం అని ప్రతిజ్ఞ చేస్తున్నాం. ఎవరైనా

పిరికివాళ్లుంటే ఇక్కడి నుండే వెనుకకు మరలిపొండి. లేకపోతే వారు సంకుల సమరంలో నాయకుని చంపుకొంటారు. పారిపోతే ధననాశం, మరణం, అపకీర్తి, ఉన్న పేరు పోవడమూ కలుగుతుంది. మన శత్రువు సదా చీలిన పెదవులతో, దంతాలతో, వదలిన ఆయుధాలతో పగవారికి చిక్కునుగాక. యుద్ధం నుండి పారిపోయి వచ్చిన వారు నరాధములు. రాశిని పెంచడానికి మాత్రం పనికి వస్తారు. వారికి ఇహమూ ఉండదు, పరమూ ఉండదు. పారిపోయే వానిని శత్రువులు సంతోషిస్తూ తరుముతారు. గెలిచిన వారిని సుగంధాలతో, అలంకారాలతో స్వాగతిస్తారు.

"విజయమో! వీర స్వర్గమో! రెండింటికీ సిద్ధపడాలి" అని ఉత్సాహం ఉరకలు వేసేలా ప్రోత్సహించాలి.

ముందుభాగంలో కత్తి, డాలు పట్టిన యోధుల సేన; వెనుకభాగాన రథసేన; మధ్యలో రాజూ, అంతఃపురమూ నిలవాలి.

రాజుకు ఇష్టులై బలమూ, అభిమానమూ కలవారు వెనుకభాగాన ఉంటే వారు ముందు భాగాన ఉండాలి. ఇతరులు రాజును అనుసరించాలి.

పిరికి వారిని ప్రయత్నించి అయినా పురికొల్పాలి. కనీసం సముదాయాన్ని చూపటానికయినా దగ్గరగా నిలపాలి. గుమిగూడిన తన వారిని సేనాపతి శత్రువులతో పోరాడేటట్లు చెయ్యాలి. అందుచేత సైన్యాన్ని విస్తరించాలి. అల్పుల సేనను చాలా మందితో బలోపేతం చేసి, సేనను సూది మొనవలె చెయ్యాలి.

తాను ఉత్కృష్ట స్థితిలో ఉన్నా, నీచస్థితిలో ఉన్నా, అది నిజమైనా అసత్యమైనా సరే ! చేతులు పైకెత్తి "శత్రులు ఓడిపోయారు. నా మిత్రబలం వచ్చింది. నిర్భయంగా బాదండి" అని అరవాలి. బలం పుంజుకొని పెద్దగా అరుస్తూ తరిమికొట్టాలి.

సింహనాదాలు, కిలకిలా రావాలు, రంపపుకోత ధ్వనులూ కొమ్ముబూరాల చప్పుళ్లు భేరులు, మద్దెలలు, పణవాలను మ్రోగించాలి. అప్పుడే రాజుకు విజయం లభిస్తుంది.

✦ ✦ ✦

# గణతంత్రరాజనీతి

గుణాలలోగాని, కులాలలో గాని, రాజులలో గాని వైరాన్ని ఉద్దీపింపచేసేవి లోభం, అమర్షం – అనే రెండు గుణాలే.

ముందు ఒకడు లోభాన్ని వరిస్తాడు (ఇతరుని ధనం తనకు కావాలనుకొంటాడు). అనంతరం ఎదుటి వానిలో అమర్షం కలుగుతుంది. (లోభిపట్ల కోపం ఏర్పడుతుంది). తరువాత ఆ లోభామర్షాలకు గురియైన వ్యక్తులు సముదాయానికి హాని కలిగిస్తూ పరస్పరం వినాశకులు అవుతారు.

పరస్పరం విడిపోవడంవల్లనే గణరాజ్యాలు నశించిపోతాయి. విడిపోతే శత్రువులు సులభంగా జయిస్తారు. కాబట్టి గణరాజ్యాలు ఎప్పుడూ సంఘటితంగా ఉంటూ విజయం కోసం ప్రయత్నించాలి.

సంఘటితమైన బలపౌరుషాలు కలవారికి ప్రయోజనాలన్నీ సిద్ధిస్తాయి. సంఘటితంగా జీవనం గడుపుకొనే వారితో ఇతరులు కూడా మైత్రిని పాటిస్తారు.

వారు పరస్పరం సేవించుకొంటూ, మనసులలో పొరపొచ్చాలు లేకుండా ఉంటారు. జ్ఞానవృద్ధులు వారిని ప్రశంసిస్తూ ఉంటారు. అన్ని విధాలా వారు సుఖంగా వృద్ధి చెందుతారు.

గణరాజ్యాలలోని ఉత్తమ నాగరికులు శాస్త్రానుసారంగా ధర్మబద్ధమైన వ్యవహారాలను పాదుకొల్పుతారు. వారు యథోచిత దృష్టితో అందరినీ కనిపెట్టి ఉంటూ అభివృద్ధిని సాధిస్తారు. గణాలలోని ఉత్తమ నాగరికులు పుత్రులను, సోదరులను కూడా తప్పు చేస్తే దండిస్తూ ఉంటారు. వారికి ఎప్పుడూ ఉత్తమ శిక్షణను ఇస్తారు. అలా శిక్షణ పొందిన వారిని చేరదీస్తారు. అందువల్ల వారు విశేషంగా అభివృద్ధి పొందుతారు.

వారు గూఢచర్యంలోను, మంత్రాంగంలోను, కోశాగారాన్ని నింపడంలోను, ఎప్పుడూ తత్పరులై ఉంటారు. కాబట్టే అన్ని విధాలా గణరాజ్యాలువృద్ధి పొందుతూ ఉంటాయి.

ప్రాజ్ఞులను, పరాక్రమవంతులను, మహోత్సాహంతో పనులుచేసే వారిని, స్థిరమైన పౌరుషం ప్రకటించేవారిని, గౌరవిస్తూ గణరాజ్య సదస్యులు ఎప్పుడూ ప్రయత్నశీలురై ఉంటారు. కాబట్టే గణరాజ్యాలు వృద్ధి పొందుతున్నాయి.

గణరాజ్యంలోని నాగరికులందరూ ధనవంతులు, పరాక్రమవంతులు, శస్త్ర ప్రయోగం తెలిసినవారు, శాస్త్రపారంగతులు. ఆపదలలో చిక్కుకొని దిక్కు తోచని స్థితిలో ఉన్నవారిని వారు ఒడ్డుకు చేరుస్తారు.

క్రోధం, భేదం, భయం, దండన, బలహీన పరచడం, బంధించడం, వధించడం వంటి గుణాలు పుడితే – గణరాజ్యాలు వెంటనే శత్రువుకు లోబడి పోతాయి.

కాబట్టి ప్రధానంగా గణముఖ్యులు సన్మానింపదగినవారు.

గణ రాజ్యాల వారు అందరూ రహస్యాన్ని వినడానికి తగినవారు కారు. వారిలో ప్రధానులు మాత్రమే మంత్రాంగాన్ని రహస్యంగా ఉంచడానికి, చారులుగా నియమించడానికి తగినవారు.

గణముఖ్యులందరూ తమలో తాము కలుసుకొని గణాలకు హితమైన దానిని చేయాలి. అలాకాక గణాలు వేరుపడితే విడివిడిగా అనేక దళాలు పుట్టుకొని వస్తాయి. అప్పుడు సమస్త ప్రయోజనాలు దెబ్బతింటాయి. అనర్థాలు కూడా సంభవిస్తాయి.

పరస్పరం వేరుపడి, తమ తమ శత్రువులను ప్రయోగిస్తూ ఉండే వారిలో ముఖ్యులను గణాలలోని పండితులు వెంటనే శిక్షించాలి.

కులాలలో కలహాలు బయలుదేరినపుడు కులవృద్ధులు ఉపేక్షిస్తే, గణాలలో భేదాలు పుట్టడానికి కారణమై వంశనాశనం జరుగుతుంది.

ఆంతరంగికమైన భయమే జాగ్రత్తగా గమనించవలసినది. బాహ్యంనుండి కలిగే భయం నిస్సారమైనదే. ఆభ్యంతర భయం వెంటనే మూలాలను నరికి వేస్తుంది.

అకస్మాత్తుగా పుట్టిన క్రోధమోహాల వల్ల గాని, స్వాభావికమైన లోభంవల్లగాని పరస్పరం మాట్లాడుకోకపోతే, అది వారి పరాజయానికి సూచన.

జాతి చేతను, కులం చేతను అందరూ సమానులే, కాని ప్రయత్నం చేతను, బుద్ధి చేతను, రూపధనాదుల చేతను అలా సమానులుగా ఉండరు. శత్రువులు గణాలను భేదోపాయంచేతను, ధనం ఇవ్వడం చేతను చీల్చి వేస్తారు. కాబట్టి సంఘటితంగా ఉండడమే గణాలకు ఎంతో రక్షణ కలిగిస్తుంది.

✦ ✦ ✦

# రాజసహాయకుల గుణాలు

ఒంటరిగా రాజ్యాన్ని పాలించడం సాధ్యం కాదు. పైగా సహాయం లేనివానికి ఏ ప్రయోజనాలూ చేకూరవు. రాజ్యం లభించినా, లభించినదానిని రక్షించడం సాధ్యం కాదు. సేవకులు అందరూ కులీనులై, జ్ఞానవిజ్ఞాన కోవిదులై, హితైషులై, స్నేహశీలురై ఉంటే ఆ రాజు రాజ్యఫలం అనుభవించగలడు.

మంత్రులు ఉత్తమ కులసంజాతులు, ధనానికి అమ్ముడుపోనివారు, రాజుతో కలిసి నివసించేవారు, రాజుకు మంచిబుద్ధిని ఇచ్చేవారు, సత్పురుషులు, సంబంధ జ్ఞానకోవిదులు, భవిష్యత్తును గూర్చి ప్రణాళికలు వేయగలిగినవారు, కాలజ్ఞానవిశారదులు, గడిచిపోయినదానికి శోకించనివారు అయితే రాజు రాజ్యఫలాన్ని అనుభవించగలడు.

సహాయకులు సుఖదుఃఖాలపట్ల సములై ఉండేవారు, ప్రియాన్ని చేకూర్చేవారు, ఆదాయం గురించిన ఆలోచనపట్ల ఆసక్తి కలవారు, సత్యవాదులు అయినపుడు రాజు రాజ్యఫలం పొందుతాడు.

విశ్వాసపాత్రులు, సంతుష్టులు, కోశాన్ని వృద్ధి చేసేవారు – వీరి చేత కోశాగారం నిరంతరం వృద్ధి చెందుతూ ఉంటే ఆ రాజు రాజులలో శ్రేష్ఠుడు అవుతాడు.

ధనానికి అమ్ముడుపోనివారు, విశ్వాసపాత్రులు, కూడబెట్టడంలో ఆసక్తికలవారు, అర్హులైనవారు, లోభరహితులు పాలనచేస్తే కోశాగారం విశేషవృద్ధి చెందుతుంది.

కర్మలను అనుసరించి ఫలాలు ప్రాప్తించే శంఖలిఖిత న్యాయవ్యవహారం ఏ నగరంలో ఉంటుందో ఆ రాజు ధర్మఫలాన్ని అనుభవించగలడు.

రాజధర్మాలను తెలుసుకొని; మంచివారిని చేరదీసి; సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైధీభావ, సమాశ్రయాలు అనే షడ్గుణాలను ఉపయోగిస్తూ ఉండే రాజు ధర్మఫలాన్ని అనుభవించగలడు.

✦ ✦ ✦

# ఆపదలో రాజకర్తవ్యం

ఎదుటివాడు గెలవగలిగి, ధర్మం తెలిసినవాడు, అర్థాన్ని సాధించగలవాడు, పరిశుద్ధుడు అయితే రాజు వెంటనే అతనితో సంధి చేసుకొని అతని ఆక్రమణలో ఉన్నవానిని విడిపించుకోవాలి. అవతలివాడు అధర్మ మార్గంలో గెలిచేవాడు, బలవంతుడు, పాపపుపనులు చేసేవాడు. అయితే వాడికోసం కొంత వదులుకొని అయినా సంధి చేసుకోవాలి.

రాజధానినో, ద్రవ్యాన్నో వదులుకొని ఆపదనుండి తప్పించుకోవాలి. ప్రాణాలతో ఉంటే రాజోచితమైన గుణాలతో ద్రవ్యాన్ని మళ్ళీ సంపాదించుకోవచ్చు.

కోశాన్నీ, సైన్యాన్ని వదులుకొంటే తొలగిపోయే ఆపదల కోసం అర్థధర్మాలు తెలిసినవాడు తన ప్రాణాలు ఎలా వదులుకొంటాడు?

శత్రువుల ఆక్రమణలో అంతఃపుర రక్షణకు గట్టిగా ప్రయత్నించాలి. తనచేయిదాటి అది శత్రువు సొమ్ము అయితే దానిపై కూడా దయలేకుండా సాధ్యమైనంతవరకు తనను తాను పరులపాలు కాకుండా కాపాడుకోవాలి.

రాజ్యం, కోట శత్రువులుకు స్వాధీనమై, ఆంతరంగికులైన మంత్రులు మొదలైనవారు కోపించినప్పుడు, కోశాగారం క్షీణించి, రహస్యాలు బయటకు పొక్కుతున్నప్పుడు, రాజు వెంటనే సంధి అయినా చేసుకోవాలి. పరాక్రమమైనా చూపించాలి. దానితో శత్రువును వెళ్లగొట్టటమో, తానే పరలోకానికి వెళ్లటమో వెంటనే తేలిపోతుంది.

తనను ప్రేమిస్తూ, ఇష్టపడుతూ, సంతోషంగా ఉన్న సైన్యం కొంచెం ఉన్నా రాజు విజయాన్ని సాధిస్తాడు. చనిపోతే స్వర్గానికి పోతాడు. శత్రువును చంపితే భూమిని గెలుస్తాడు. యుద్ధంలో ప్రాణాలు వదిలితే ఇంద్రునితో కలిసి స్వర్గలోకంలో ఉంటాడు.

ఉపాయంగా లోకాన్ని అంతటినీ మెత్తదనంతో ఆకట్టుకోవాలి. విశ్వాసంతో శత్రువు తలవంచి, యుద్ధాన్ని మానుకునేటట్లు చేయాలి. లేదా తానే అతడిని విశ్వసించినట్లుండాలి.

మంచితనంతో, తియ్యని మాటలతో శత్రుపక్షాన్ని అనుకూలం చేసుకొని రాజ్యం నుంచి బయటకుపోయి, తనవారిని కూడదీసుకుని, మళ్లీ తన రాజ్యాన్ని ఆక్రమించే ప్రయత్నానికి ఉపక్రమించాలి.

✦ ✦ ✦

# సత్యమహిమ

**సత్యం ధర్మం ప్రశంసంతి విప్రర్షిపితృదేవతాః ।**
**సత్యమిచ్ఛామ్యహం శ్రోతుం తన్మే బ్రూహి పితామహ ॥**

సత్పురుషులు ఎల్లప్పుడు సత్యం అనే ధర్మాన్ని అనుష్ఠించారు. సత్యమే సనాతనమైన ధర్మం. సత్యానికే ఎప్పుడూ నమస్కరించాలి. సత్యమే ఉత్తమమైన గతి.

సత్యమే ధర్మం, తపస్సు, యోగం. సత్యమే సనాతనమైన బ్రహ్మ. సత్యమే గొప్పయజ్ఞం అని చెప్పారు. సమస్తమూ సత్యంలోనే ప్రతిష్ఠిత మయి ఉన్నది.

సర్వలోకాలలోను సత్యం పదమూడు విధాలు. సత్యం, సమత, దమం, మాత్సర్యం లేకుండటం, క్షమ, లజ్జ, సహనం, అసూయ లేకపోవటం, త్యాగం, ధ్యానం, శ్రేష్ఠమైన ఆచరణం, నిరంతరం స్థిరంగా ఉండే ధైర్యం, అహింస అనే ఈ పదమూడు సత్యస్వరూపాలే. ఇందులో సందేహం లేదు.

విడివిడిగా చెప్పిన ఈ పదమూడు ధర్మాలు సత్యాన్ని ఒక్కదానిని ఉద్దేశించి చెప్పినవే. ఇవి సత్యాన్నే ఆశ్రయించి, దాన్ని పరిపుష్టం చేస్తాయి.

సత్యగుణాలు ఇన్ని అని చెప్పటానికి లేదు. అందువల్లనే పితృదేవతలతో కూడా విప్రులు సత్యాన్ని ప్రశంసిస్తారు.

సత్యం చెప్పడం కంటే ఉత్తమ ధర్మం లేదు. అబద్ధం చెప్పటానికంటే మించిన పాపం లేదు. ధర్మము యొక్క ఉనికిని కాపాడేది సత్యమే. కాబట్టి సత్యాన్ని విడిచిపెట్ట కూడదు.

దానం, దక్షిణతో గూడిన యజ్ఞం, త్రివిధాగ్నులలో (దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్ని) హోమం చేయటం, వేదాధ్యయనం చేయటం, ఇతరమైన ధర్మాలను నిర్ణయం చేయటం గల శాస్త్రాలను అధ్యయనం చేస్తే కలిగే ఫలం మానవుడు సత్యం చెప్పటం వల్ల పొందుతాడు.

వేయి అశ్వమేధ యజ్ఞాల (ఫలాల)ను, త్రాసులో ఒకవైపు, సత్యవచన ఫలాన్ని ఇంకొక వైపు ఉంచి తూచితే వేయి అశ్వమేధ యజ్ఞాల ఫలానికంటే ఒక్క సత్య వచనఫలమే ఎక్కువగా తూగుతుంది.

✦ ✦ ✦

# ఆచారకాండం

ఆచారం భారతీయ సంస్కృతికి మూలాధారం. స్వీయ శాఖను విడిచిపెట్టి, తాను పరశాఖను అనుసరించినట్లయితే అలా చేసినవాడు ఎంతటి ఉత్తమబ్రాహ్మణుడైనా సరే వాడు ఏ శాఖకైనా బాహ్యుడే. ఆచారపరుడే ఉత్తముడు. ఆచారము లేనివాడే అధముడు. స్వీయ కుల దేశ ఆచారాలను పూనికతో చేయాలి. ఇది వేదం ఆదేశించిన ధర్మం అని ఆచార్యులు అన్నారు.

## జాతకర్మలు

గర్భాదానం మొదలైన పదహారు కర్మలు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యజాతులు క్రమంగా ఆచరించాలి.

శ్రోత్రియుడికి కుమారుడు పుట్టినపుడు ఆ శిశువు బొడ్డు కోయక ముందే ఆ శ్రోత్రియుడు చెయ్యవలసిన విధులు ఇవి.

స్వచ్ఛమైన చన్నీళ్లు తీసుకొని శిరస్సు మొదలుకొని పాదాలవరకూ సకలాంగాల మీదా పుష్కలంగా జల్లుకోవాలి. వెంటనే భక్తితో పితృదేవతలను ఉద్దేశించి వారికి ప్రీతిపాత్రంగా సద్బ్రాహ్మణులకు ఆమవస్తువులు – అంటే ఉడికించని వస్తువులు – బియ్యం, పప్పులూ ఉప్పులూ పచ్చి కూరలూ వగైరాలు భోజన ప్రత్యామ్నాయంగా దానం చెయ్యాలి. స్వయంపాకమనీ, పొత్తర అనీ, ఉభయం అనీ చాలా పేర్లు ఉన్నాయి దీనికి. జాతాశౌచం వచ్చింది కనుక భోజనాదికం ఉండదు. అందుకని అన్నం మినహాగా తర్పణాదికమైన మిగతా శ్రాద్ధక్రియలు అన్నీ సమృద్ధిగా చెయ్యాలి. చాలా వేడుకగా చెయ్యాలి. సుతోదయమనేది పితృదేవతల కరుణ. కాబట్టి వెంటనే వారికి ఇలా ప్రీతి కలిగించాలని.

జాతాశౌచమనీ, మృతాశౌచమనీ రెండు విధాలైన అశుచినే సూతకం అంటారు. ఈ సూతకం బొడ్డు కోయగానే కలుగుతుంది. అంతేకానీ అంతకుముందు పుట్టిన కొడుకువల్ల సూతకం లేదు. రాదు. ద్రవ్య శుద్ధీ కలుగుతుంది.

బ్రాహ్మణోత్తముడికి ఎనిమిదినుంచి పదహారు సంవత్సరాల వయస్సులోపల, క్షత్రియుడికి పదకొండు నుంచి ఇరవైరెండు ఏళ్లలోపల, వైశ్యుడికి పన్నెండునుంచి ఇరవైనాల్గు సంవత్సరాల వయస్సులోపలా ఉపనయనం జరపాలి.

ఈ వయస్సులోపల వడుగు చెయ్యకపోతే బ్రాహ్మణుడు ధర్మభ్రష్టుడు అవుతాడు. నిజానికి బ్రాహ్మణుడికి ఎనిమిదవ ఏట, క్షత్రియుడికి పదకొండవయేట, వైశ్యుడికి పన్నెండవయేట వడుగు చెయ్యడం ఉత్తమం. ఒకవేళ అలా ఆ నిర్దిష్ట సంవత్సరాలలో చెయ్యలేకపోతే ఒక్కొక్కరికీ చెప్పిన తుదిగడువులలోపలనైనా చెయ్యాలి. అంటే బ్రాహ్మణుడికి పదహారేళ్ళలోపల, క్షత్రియుడికి ఇరవైరెండేళ్ళ లోపల, వైశ్యుడికి ఇరవైనాలుగేళ్ళలోపల జరిపి తీరాలి. ఇది కొంతలో కొంత మధ్యమం. ఈ తుది గడువులు దాటిపోయాక చెయ్యడం అధమం. అసలే మానెయ్యడం అధమాధమం అని.

## వటువు లక్షణాలు

'భవతి భిక్షాందేహి' అని బ్రాహ్మణుడు, 'భిక్షాం భవతి దేహి' అని క్షత్రియుడు, 'భిక్షాం దేహి భవతి' అని వైశ్యజనుడు అడగాలి. ఈ పద్ధతిలో భిక్షను ఉత్తమ ద్విజుల మందిరాలనుండి అంటే వారి వారి కులోత్తముల గృహాల నుండి భిక్షించి తెచ్చి, మంచి గురువుగారి అంగీకారంతో వర్తిల్లుతూ ఆపోశనం పట్టి, అలా ఆపోశన పూర్వకంగా అన్నానికి నమస్కరించి, అది ఎటువంటి అన్నమైనా సరే ఇది నాకు రుచించదు అనకుండా ఇష్టంగా తిని, ధర్మనియతితో నిత్యమూ గురుల వద్దనే బ్రహ్మచారి నివసించి వేదం చదువుకోవాలి.

ఎక్కడైనా సరే దండం, జింకచర్మం, గోచీ , కమండలువు, జంధ్యం, ముంజదర్భ మొలత్రాడు, దోవతి వీటిని ధరించి వేదం చదువుకోవడమే సద్బ్రహ్మచారికి తగినది. వటువు ధరించే దండం విషయంలోనూ వర్ణాలవారీగా నియమాలు ఉన్నాయి. ఏ ఏ వర్ణాల వాళ్ళు ఏ ఏ వృక్షాలకు సంబంధించిన కర్రలతో చేసిన దండాలను వాడాలో చెబుతున్నాడు.

విప్రవటువు – మారేడు దండం గానీ, మోదుగు దండం గానీ ధరించాలి. క్షత్రియ కుమారుడు మఱ్ఱి దండం గానీ, చంద్రకర్ర గానీ ధరించాలి. వైశ్య బ్రహ్మచారి పెంపుగా రావి కర్రను గానీ, మేడి కర్రను గానీ వహించాలి.

ఆ దండం చక్కగా, చిక్కగా, నున్నగా ఉండాలి. పుచ్చూ చచ్చులతో కూడి వంకరటింకరగా ఉండకూడదు. కర్రకున్న బెరడు చెక్కుచెదరకూడదు. తోలు ఒలిచెయ్యకూడదు. పొయ్యిలో నిప్పు సెగలు తాకి నొక్కులు పడిన దండం కాకూడదు. ఇలాంటి దండాలనే వటువులు ధరించాలి.

విప్రవటువు ధరించవలసిన దండం పొడుగు అతడి తలనుంచి పాదాలదాకా ఉండాలి. రాజకుమారుడు ధరించవలసిన దండం నుదురునుంచి కాళ్ళదాకా ఉండాలి. వైశ్యవటువు ధరించే దండం ముక్కు నుంచి కాళ్లదాకా ఉండాలి అని గోభిల స్మృతి చెబుతుంది.

యజ్ఞోపవీతమూ శిఖ – ఇవి లేకుండా విప్రుడు ఎన్నెన్ని అనుష్ఠానాలూ సత్కర్మలూ చేసినా సద్గతిని పొందడు. పొందలేడు.

జన్నిదాలు వడికేందుకు పవిత్ర స్థలం ఎంచుకోవాలి. గోవుల పాకలోనో నదీ తీరంలోనో గుడిలోనో శుచిగా కూర్చోవాలి. గాయత్రీ మహామంత్రాన్ని జపిస్తూనే ఉండాలి. పత్తినీ విభూతినీ కదిరినీ దగ్గర పెట్టుకోవాలి. విభూతి జల్లుతూ దారం తియ్యాలి. దాన్ని కుడిమోచేతికి పదహారు సార్లు చుట్టాలి. గాయత్రి చదువుతూనే ఉండాలి. దాన్ని ముప్పేటలుగా పురి ఎక్కించి అయిదునుంచి ఆరు మూరలు చేసి కదిరికి తగిలించి పురి పెట్టాలి. మూడు సార్లు పైకీ మూడుసార్లు కిందికీ కదిరిని గిర్రున తిప్పుతూ బాగా పురెక్కించాలి. చిక్కులూ ముడులూ ముడతలూ పత్తిగింజల అవశేషాలూ లేకుండా శుభ్రంచేసి మూడు మూరల పొడుగుకి సరిజేసుకోవాలి. అలా ముడిచి దాన్ని చూపుడువేలంతకు మడవాలి. ఈ జన్నిదాన్ని మంత్రపూర్వకంగా ధరించాలి. బ్రహ్మచారికీ సన్యాసికీ ఒంటిపోగు జన్నిదాలే. వివాహితుడికి రెండు పోగులు. అవసరార్థులకివ్వడం కోసం మరో పోగు. ఇది కనిష్ఠ సంఖ్య. ఎన్ని పోగులు దాల్చినా వివాహితులకు తప్పులేదు.

కృష్ణాజినం, దండం, జన్నిదం – చివికిపోతే వాటిని వెంటనే మార్చుకోవాలి. శీఘ్రంగా కొత్తవి సిద్ధంచేసి ధరించాలి. చివికిపోయిన పాత వాటిని, నుయ్యిలోనో చెరువులోనో నదిలోనో ఇలా ఏదో ఒక జలాశయంలోకి విసిరివెయ్యాలి. జన్నిదాలనైతే ఇంటి కప్పులమీదనో చెట్ల కొమ్మలమీదనో వేస్తారు. ఇదొక ప్రాంతీయాచారం.

పితృకర్మ చేసేవాడే స్వయంగా కోరితే బ్రహ్మచారి శ్రాద్ధభోక్తగా ఉండవచ్చు. యద్యద్రోచతే తత్తద్భోక్తవ్యమ్ అనే వెసులుబాటు ఎలాగూ ఉంది కనుక బ్రహ్మచారి తనకు నిషిద్ధపదార్థాలు విడిచి మిగతా పదార్థాలే భుజించాలి.

ఉపనయనంలో వడక పెళ్ళికొడుకు, పెళ్ళిప్రక్రియలో కన్యాదాత, పలుమార్లు భుజించినా పర్వాలేదు. ఒక్కడే కూర్చుని భుజించినా చెల్లుతుంది. దీన్ని ఎవ్వరూ తప్పు పట్టరు.

వడక పెళ్ళి కొడుక్కి ముహూర్తానికి ముందు హడావిడిగా రెండు ముద్దలు

కతకనిచ్చి అరకొర ఆకలితోఉండగానే అతడిని లేవదీసి ఉపనయనం తంతు నడిపిస్తారు పురోహితులవారు. ఆ ఉపనయనం పూర్తి అయ్యాక అతడు మళ్ళీ సుష్టుగా భోజనం చెయ్యవచ్చు. చెయ్యాలి. కాబట్టి ఒకే పూట రెండు పర్యాయాలు భుజించడాన్ని ఎవ్వరూ తప్పు పట్టరు.

అలాగే కన్యాదాతకు కన్యాదానం అయ్యాకనే అతడు భుజించాలి. అప్పటిదాకా ఉపవాసమే. అది అయ్యేసరికి అందరి భోజనాలూ అయిపోవచ్చు. సహ పంక్తికి అవకాశమే లేకపోనూ వచ్చు. అటువంటప్పుడు సహపంక్తిని లేకుండా ఒంటరిగా భుజించకూడదని సాధారణ నియమం ఒక్కడే తిన్నా ఎవరూ ఎగ్గుకింద భావించరు.

సూత్రానికి అధిదైవాలైన ఓంకారం, అగ్ని, చంద్రుడు, పితృదేవతలు, బ్రహ్మ, వాయుదేవుడు, సూర్యుడు, దేవతలు ఉపవీతుడి దగ్గరే కూడి ఉంటారు.

ఎంత ఆచారవంతుడైనా బ్రాహ్మణుడైనా యజ్ఞోపవీత గురుదేవతకు నమస్కరించి ధరియించడం ఉచితం. దేశాంతరం వెళ్ళినా తన దేశాచారమే పాటించాలిగానీ పిరికివాడిలాగా భయపడి వేరే దేశంలో జీవించడానికి ఆశపడడం తగదు. అలా ఐతే అతడు నిందింపదగినవాడు అవుతాడు.

## శౌచప్రక్రియ

మలమూత్ర విసర్జన చేసేటప్పుడు నైష్ఠికుడైన బ్రాహ్మణుడు విధిగా తన యజ్ఞోపవీతాన్ని కుడి చెవికి చుట్టుకోవాలి, తగిలించుకోవాలి. పగటిపూటా సందెవేళా ఉత్తరంవైపు, రాత్రివేళల్లో దక్షిణాభిముఖంగా కూర్చుని విసర్జన చెయ్యాలి. తూర్పు పడమరలవైపు తిరిగిగానీ, నిలబడిగానీ నిషిద్ధం.

పండిన చేలలో వాటి చేరువలో, రాజమార్గాలలో, నలుగురూ కూడే రచ్చబండల సమీపంలో మల, మూత్రవిసర్జన చేయకూడదు.

గనులలోపల, చెరువుల్లోనూ, చెరువు గట్లమీద, కోటకు చుట్టుపక్కలా, చల్లారిన కొలిమి గూట్లోనూ మల, మూత్ర విసర్జన చెయ్యకూడదు. అది చాలా అనుచితం.

అలాగే అగడ్తలలో, చలివేంద్రాల్లో, ధాన్యాదులు నిల్వ చేసే పాతర్లలోనూ, గాదెల చేరువల్లోనూ చేయకూడదు.

సత్రాల్లో, చాకిరేవుల్లో, సరోవరసమీపాన, దిగుడు బావుల తటాల్లోనూ, నూతుల దగ్గరా, పూల, పండ్లతోటల్లో, మామిడి–తాడి లాంటి చెట్ల తోపుల్లో, మఠాల చెంత, ఆవుపేడ కుప్పల దగ్గరా, రకరకాల పనులు చేస్తూ జనసంచారం మసిలే ప్రదేశాలలోనూ,

ఏనుగులు, గుర్రాల గుంపులు ఎక్కి ఎంతో వేడుకగా రాకుమారులు వినోదవిహారాలు జరిపే ప్రాంగణాలలోనూ మలమూత్ర విసర్జన చెయ్యడం అనుచితం.

మల విసర్జన అయ్యాక మట్టితో నీటితో గంధలేపనాలతో శుభ్రం చేసుకోవాలి.

శౌచానికి పనికిరాని మన్నులు. చౌడుపడ్డ నేలలోని మట్టి, ఎవడో వాడేసి పడవేసిన మిగిల్చిన మట్టి; పాముల పుట్టమీద మట్టి, ఎలుకల కన్నాల చెంతనుండే మట్టి – ఇవి శౌచానికి వాడకూడదు. ఇవి తప్ప మరొకచోటునుంచి మన్ను తీసుకుని శౌచక్రియ నిర్వహించుకోవాలని పండితులు చెబుతున్నారు.

1) ఎముక లోపల ఉండే మూలుగు, 2) మెదడు, 3) మలం, 4) నెత్తురు, 5)వీర్యం, 6) మూత్రం, 7) చెవి గులుగు, 8) చెమట, 9) కంటి పుసులు, 10) కత్తిరించిన గోళ్లు, 11) కఫం , 12) కన్నీరు ఇవి మొత్తం (12) శరీర మలములు. అంటే శారీరక మలినాలు.

పైన చెప్పిన మొత్తం 12 శారీరక మలినాలలో మొదటి ఆరింటిలో ఏది సోకినా తాకినా వెంటనే మట్టి రుద్దుకుని నీటితో కడుక్కోవాలి. అది శుద్ధి. తక్కిన ఆరింటిలో ఏది స్పృశించినా కేవలం నీళ్లతో కడుక్కొంటే చాలు,.

దంతధావనం చేయడానికి ఉపయోగించే పుల్ల నుంచి కొంచెంగా పాలు ఓడుతూ ఉండాలి. అంటే పాలుకారే చెట్టుకు సంబంధించినదై ఉండాలి. మధ్యలో అక్కడక్కడా ముళ్ళు లేదా కణుపుల్లాంటివి చాలా అవసరం. పైన తొక్క, తోలు కలిగిన పుల్లను తీసుకొని ప్రాతఃకాలంలో దంతకాష్ఠం దంతధావనం చెయ్యాలి.

**కంటకం క్షీరవృక్షోత్థం ద్వాదశాంగుళ సమ్మితం,**

**కనిష్ఠికాగ్రవత్ స్థూలం పర్వార్థకృతకూర్చకమ్.**

పన్నెండంగుళాల పొడవుండాలనీ చిటికెనవేలంత లావుండాలనీ దాని అగ్రభాగాన్ని నమిలి కుంచెలాగా చేసుకోవాలనీ సూచించింది.

ఐదు పర్వదినాలలోనూ (పంచపర్వాలు: అష్టమి, చతుర్దశి, పౌర్ణమి, అమావాస్య, సూర్యసంక్రాంతి), పాడ్యమి తిథులలోనూ, జన్మదినాలలోనూ, ఉపద్రవంకానీ గ్రహయోగం కానీ ఉల్కాపాతం కానీ జరిగినప్పుడు, షష్ఠి నవమి తిథులు వచ్చిన రోజులలోనూ, శ్రాద్ధం పెట్టే రోజునా, అలాగే విశేష వ్రతాలను ఆచరించే సందర్భాలలోనూ నిషిద్ధం.

ఈ భూలోకంలో బ్రాహ్మణుడు ఎంత గొప్పవాడైనా, దర్భలు కోసి తెచ్చుకోవడానికి బద్దకించి సోమరియై దర్భలు లేకుండా సంధ్యాదేవిని ఉపాసించినా, జపాలు, హెూమాలు, అగ్ని కార్యాలూ మొదలైనవి ఎన్ని ఎంతగా చేసినా అవన్నీ నిష్ఫలాలే. కాసింతైనా పుణ్య ఫలం ఆతడికి సిద్ధించదు.

దేవేంద్రుడికి వజ్రాయుధం, శ్రీమన్నారాయణుడికి సుదర్శనచక్రం, పరమేశ్వరుడికి త్రిశూలంలాగే బ్రాహ్మణులకు దర్భ. అదే వారికి సకల పుణ్యాలనూ పుణ్యకార్యాలనూ ప్రయోజనాలనూ సిద్ధింపజేసే ఏకైక సాధనం. కాబట్టి దర్భను విడిచిపెట్టడం, అది లేకుండా అనుష్ఠానాలు చెయ్యడం బ్రాహ్మణుడన్నవాడికి భావ్యం కాదు, ధర్మం కాదు.

స్నానం చేయడానికి ఎత్తరి ప్రదేశాలలో తొట్టెలుకట్టి నీరు నిల్వచేసి గొట్టాలతో స్నానాల గదిలోకి ఒంపే పోతనీరుకంటే నేలమీద బానల్లో పట్టి ఉంచిన నీళ్లు స్నానానికి మంచివి. దీనికంటే బావినీరు, కొలనునీరు, ఏటినీరు, పుణ్యతీర్థాలలో ఉండే జలమూ, గంగాజలం వరుసగా ఒకదానికంటే మరొకటి శ్రేష్ఠమైనవి. వీటన్నింటిలో గంగాజలం ఇంకా శ్రేష్ఠం. నదులలో ప్రవహించే తొలివాననీళ్ళు ఎర్రగా బురదవారి ఉంటాయి కనుక అవి ముట్టునీళ్ళతో సమానం. వాటిని ముట్టజనదు. తాకకూడదు. ఎంతగా కలకబారినప్పటికీ ప్రాచి పట్టినకుండలో పట్టుకొని ఉంచినప్పటికీ ఇతర నదీజలాలకంటే కూడా గంగాజలం శ్రేష్ఠమైనదనీ స్నానయోగ్యమైనదనీ ధర్మకార్యాలు తెలిసిన పెద్దలు చెప్తుంటారు.

## సంధ్యావందనం

వేలికొనలలోనూ మొదళ్ళలోనూ పుణ్యతీర్థాలుంటాయంటోంది శాస్త్రం. చిటికెన వ్రేలి మొదట ప్రజాపతితీర్థం, ఉంగరపువేలు పాదు పితృతీర్థం, నడిమివ్రేలు మొదట బ్రహ్మతీర్థం ఉంటాయని ప్రతీతి. ఇక అన్ని వేళ్ళకూ చివరిభాగం దేవతాతీర్థమని వర్తిల్లుతుంటుంది. ఆయా దేవతలకు ఆయా తీర్థాలు అందించే జలాలలోనే తృప్తి కలుగుతుంది. బ్రాహ్మణుడు బ్రహ్మతీర్థజలాలను సమంత్రకంగా ఉజ్జ్వలంగా తన శరీరాన మూడుచోట్ల చల్లుకోవడం విధివిధానం. పద్మాసనంలో కూర్చొని తొడలూ చేతులూ మోకాళ్ళ మధ్యలో ఉండే విధంగా చక్కగా కూర్చొని సంధ్యవార్చడం ఉత్తమం. కొందరు మోకాళ్ళమీద కూర్చుని సంధ్యోపాసనలో భాగంగా అర్ఘ్యాలివ్వా లన్నారు.

తూర్పునకుగానీ, ఉత్తరానికి గానీ అభిముఖంగా కూర్చోవాలి. పవిత్రజలాలను కుడిచేతి పుడిసిలిలో పోసుకొని వరుసగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు - హృదయం, కంఠం, తాలు స్థానాలలో అదేక్రమంలో ఒక్కక్షణం నిలిపి ఆ తరువాత వాటిని మూడుసార్లు కేశవాయ స్వాహా, నారాయణాయ స్వాహా, మాధవాయ స్వాహా అంటూ నోటిలోనికి పుచ్చుకోవాలి. అటుపైని మూతిని అడ్డంగా ఒకసారి నిలువుగా మూడుసార్లు తుడుచుకోవాలి. ముక్కురంధ్రాలు, కళ్ళు, చెవులు, బొడ్డు, వక్షస్థలం, భుజాలను తడుపుకోవాలి. అది కూడా ముందు కుడివైపు దక్షిణభాగం, ఆ తర్వాత వామభాగం ఎడమవైపు. అలా పవిత్రజలాలు ఆయా శరీరభాగాలను తాకేలా తడి చేతితో స్పృశించుకొని ముదముతో సంధ్యవార్చాలి. ఆ తరువాతనే లౌకికకార్యాలన్నీ చేయటం తగిన పద్ధతి అని పెద్దలంటారు.

మంచంమీద, పీటమీద కూర్చొనిగానీ, కాళ్ళకు చెప్పులు వేసుకొని గానీ, తలపాగా ధరించిగానీ, నవ్వుతూ, మాట్లాడుతూ, నడుస్తూ, వంగొని, పడుకొని, నిలబడి సంధ్యవార్చకూడదు.

శ్రాద్ధం పెట్టేటప్పుడు, యాగాలు చేసేటప్పుడు, గ్రహణ సమయంలోను, సూర్యుడు మేషాది రాశులలోనికి ప్రవేశించే పుణ్యకాలమైన సంక్రాంతులలోనూ, సగోత్రికులు మరణించినపుడుగానీ పుట్టినపుడు గానీ వచ్చే సూతకకాలంలోనూ, అంత్యజాతివారిని తాకినప్పుడు, స్నానం పుణ్యనదులలోనే తప్ప వేడినీళ్ళస్నానం చేయటం తగదు. పుణ్యనదీజలాల చన్నీటిస్నానమే చేయాలి.

కుక్క, నక్క, పంది, కోడి, గాడిద, కాకి వీటిని తాకితే అశౌచదోషం అంటుకుంటుంది. అలాగే శౌచానికి నీరులేనిచోట్ల మలమూత్ర విసర్జన చేసినా అశౌచమే. ఈ సందర్భాలలో శౌచం కోసం బ్రాహ్మణుడు నీటిలో మునగవలసినదే. అంటే ఇంటికి వచ్చి నిండా స్నానం చెయ్యాల్సిందేనని.

చాకలి, బోయ, జలగరి, గొడగరి, కుక్క కటికవాడు, కోడి, పంది - అలాగే వీటితో పాటు బొడ్డు కింది అవయవాలైన కాళ్ళూ, పాదాలూ మొదలైనవీ గనక బ్రాహ్మణుడికి తగిలితే ఆ బ్రాహ్మణుడు అవి తగిలిన తన శరీరభాగాన్ని నీటితో కడిగితే దోషం పోతుందని బుధులు సెలవిస్తున్నారు.

శవాన్నీ, దళితుణ్ణీ, సూతకంలో ఉన్న వాడినీ, కటికవాడినీ, బ్రహ్మహత్యాపాతకం చేసినవాడినీ తాకినట్లయితే బ్రాహ్మణుడు వెంటనే కట్టుబట్టలతోనే స్నానం చెయ్యాలి.

పిదప అగ్ని కార్యం హోమం మౌనంగా చేసి, నెయ్యిని నాలుకకు తగిలించుకొని దోషం పోగొట్టుకొవాలి. ఇదీ దీనికి ప్రాయశ్చిత్త విధి అంటోంది అలనాటి ఈ ధర్మశాస్త్రం.

సూతకంలో ఉన్న వాడిని గానీ, శవాన్ని గానీ, మాలను గానీ విరివిగా తాకినవాణ్ణి తాకినవాడు కేవలం స్నానం చేస్తే చాలు పవిత్రుడు ఔతాడు. అందువల్ల ఇటువంటి దోషాలు పోవాలంటే అటువంటి సుస్నాతుణ్ణి మూడుసార్లు స్పృశించినా చాలు – శుద్ధి అవుతుంది.

బ్రాహ్మణుడు రెట్టింపు గాయత్రి జపించాల్సిన సందర్భాలూ, రెండుసార్లు సంధ్యవార్చవలసిన సందర్భాలూ చెబుతున్నాడు. శౌచస్నాన శ్రాద్ధ భోజన సమయాలలోనూ, దానాలు పుచ్చుకొనేటప్పుడూ, దేవపూజా – పితృపూజాకార్యక్రమాది నియమాలలోనూ తప్పనిసరిగా ఇనుమడి సంధ్యవార్చాలి.

## వ్యాహృతులు

సంధ్యావందనంలో సప్తవ్యాహృతులను పలకాలి. అవి: భూః, భువః, స్వః/ సువః, మహః, జనః, తపః, సత్యం. భూమితో మొదలయ్యే ఈ వ్యాహృతులలో సత్యలోకం చివరిది. సత్యాంతంగా సావిత్రీ మంత్రాన్ని ముమ్మార్లు చదవాలి. అధ్యాత్మవేత్తలకు అదే ప్రాణాయామం. అది ఓంకారం ఆదిగా ఉండాలి. ఇలా ప్రాణాయామం అన్ని పనులకూ మొదట చేయడం ముఖ్యం. కాబట్టి ఓం కేశవాయ స్వాహ, ఓం నారాయణాయ స్వాహ, ఓం మాధవాయ స్వాహ అనీ మూడుసార్లు ఆచమనం చేసి ముమ్మార్లు నీళ్లు శిరస్సున జల్లుకోవాలి, తాను ముక్కును వేళ్ళతో పట్టుకొని ప్రాణాయామం ఆచరించాలి. అలా ఆచరించి, శ్రేష్ఠమయిన నదులచెంతగానీ, తటాకాలకు చేరువలో నివసించడం సంభవించినట్లయితే శుచిస్నానాదివిధులను అక్కడే పూర్తిచేసుకొని, అక్కడ మంత్ర మార్జనం చేసి, సూర్యుడికి మ్రొక్కి విప్రుడు శుద్ధిపొందుతాడు.

భూః, భువః, స్వః అనే మూడు శబ్దాలు వ్యాహృతి త్రయం. హోమాదులలో పూర్ణాహుతికి ముందు ఈ మూడు శబ్దాలతో హవిస్సులను వ్రేల్చడం విధాయకం. భూర్భువస్సువర్లోక పాలకులు అగ్ని, వాయు, సూర్యులు. ఈ ముగ్గరే వసు, రుద్ర, ఆదిత్య రూపులు. శ్రాద్ధకర్మలలో ఈ ముగ్గురు పితరులని శాస్త్రం. వ్యాహృతి అంటే సామాన్యార్థం ఉచ్చారణం.

**2.** **సప్త-వ్యాహృతులు:** 1) భూః, 2) భువః, 3) సువః, 4) మహః, 5) జనః, 6)తపః, 7) సత్యమ్. ఈ యేడును బ్రాహ్మణులు ప్రాణాయామంతో పఠించదగినవి.

తూర్పున అరుణకాంతి ఉన్న సమయంలోనే శౌచాది విధులన్నింటినీ తీర్చుకొని, చక్కగా ప్రాతఃకాల సంధ్యావందన విధిని నిర్వర్తించి సంధ్యవార్చాలి.

సూర్యుడు సగం అస్తమించే సమయంలో సాయం సంధ్యావందనం చేయాలి. ఉదయంపూట సూర్యుడూ రాత్రిపూట సందెవేళ చుక్కలూ తోచేంత వరకూ జపం ఆచరించాలి. ఆపైన గృహస్థు ధర్మానికి తగినవిధంగా అగ్నికార్యం హోమం చెయ్యాలి. వ్రేల్చి గురులకు మ్రొక్కి వేదం చెప్పించుకొని వేదంలో చెప్పినట్లు చదివి వినయంగా సేవచేసి విప్రగృహాలనుంచి భిక్ష వేడ్కతో తెచ్చి బ్రహ్మచారి గురువుగారి అనుమతితో స్వీకరించాలి.

దేవపితృకార్యాలలో నలుగురు సవర్ణులకు ప్రాంత వంశాచారాదుల ప్రకారం భోజనం ఏర్పాటుచేసే ప్రదేశాలను పసుపుతోనో గోమయంతోనో చతురస్రాకారం త్రికోణాకృతి వృత్తాకారంలో కేవల సంప్రోక్షితం చేసి శుద్ధిచేయాలి. ఈ విధి భోజనం పెట్టడానికి ముందే చెయ్యాలి.

గృహస్థుడనేవాడు కాళ్లూ, చేతులూ కడుక్కొని ముమ్మారు శిరస్సున నీళ్లు చల్లుకోవాలి. పీటపై కూర్చోవాలి. ఆ పీటపైనుండి కాళ్ళు నేలపై ఉండేలా మోపి మరీ కూర్చోవాలి. శ్రద్ధతో ఆపోశనం పట్టాలి. ప్రాణాహుతులు చేయాలి. ఇవన్నీ చేసి మౌనంగా ఆహారాన్ని స్వీకరించాలి.

**ప్రాణాహుతులు:** భోజనం చేసేటప్పుడు పుడిసిట పట్టుకొని జలాన్ని మంత్రపూర్వకంగా పుచ్చుకోవడం పరిషేచించడం. భోజనం ప్రారంభించేటప్పుడు పరిషేచించిన అన్నం మెతుకుల్ని 'ప్రాణాయ స్వాహా' మొదలైన మంత్రాలతో పంచప్రాణాలకూ అంటే, శరీరంలోని అయిదు వాయువులకూ ఆహుతులుగా పుచ్చుకోవడం.

భోజనానికి కూర్చున్నప్పుడు కంచంలోనో ఆకులోనో వడ్డించిన అన్నంలో పై భాగాన ఉన్న కొంత అన్నాన్ని కొన్ని మెతుకుల్ని చేతుల్లోనికి తీసుకొని 'ధర్మరాజాయ, చిత్రగుప్తాయ' అంటూ తీసి పక్కనే నేలపై పెట్టాలి. అలా భూమిపై నిల్పి ఆ తర్వాత ఆపోశనం పట్టాలి. నీటినే అశనంగా ఆహారంగా స్వీకరించటం ఆపోశనం. భోజనం చేసేటప్పుడు బ్రాహ్మణుడు ఈ విధంగా చేయటం ధర్మం.

భోజనానికి ముందు పంచప్రాణాల రూపంలో ఉన్న అగ్నికి చేసే ఆహుతిని ప్రాణాహుతి అంటారు. ఇలా ప్రాణాహుతులు చేసే సమయం నుంచీ భోజనం

పూర్తయ్యేదాకా మౌనంగా ఉండాలి. అలా చేయకపోయినా, మధ్యమధ్య హుంకారాదులైన సంజ్ఞాధ్వనులు చేసినా మౌననియమం చెడిపోతుంది. అందువల్ల బుద్ధిమంతులైనవారు ఏ రకంగానూ మౌనవ్రతాన్ని విడిచిపెట్టనే కూడదు.

అతిథులకూ, కోరి వచ్చినవారికీ, పితృదేవతలకీ, ఇంద్రాదిదేవతలకూ పెట్టిన నైవేద్యంగా సమర్పించిన దాంట్లో మిగిలినది చాలా చాలా శుద్ధమైనది. అటువంటి అన్నాన్ని నిత్యమూ తినడమే గృహస్థు పాటించవలసిన ఉత్తమోత్తమ ధర్మం.

విప్రుడు భోజనం చేసే సందర్భంలో కూర్చొనేందుకు ఉపయోగించకూడని పీటలు. ఇనుముతో చేసినది పనికిరాదు. అలాగే ఇనుమును చుట్టుకమ్ములుగాగానీ తొడుగుగాగానీ అమర్చినదీ పనికిరాదు. ఆ కొసనో ఈ కొసనో మునుపెప్పుడో కాస్తమేర కాలిన పీటనూ, మోదుగుచెక్కతో చేసిన పీటనూ, పనికిమాలినట్టు పగిలిపోయిన విరిగిన పీటనూ భోజనవేళ ఏరికోరి కూర్చోడానికి ఉపయోగించకూడదు. ఈ పీటలపై విప్రుడు భోజనానికి కూర్చోడు.

ఇనుప పాత్రలోనూ మట్టి పాత్రలోనూ ఆకు వెనుకభాగంలోనూ పీటపైనా ఇలా రకరకాలుగా, రకరకాల చేష్టలతోభోజనం చేయకూడదు అని ఆదిమునీశ్వరులు చెప్తున్నారు.

ఆశగా అనేకులు చూస్తూ ఉండగా ఒక్కడే ఎవడికీ పెట్టకుండా ఆబగా తినటం తగని పని. కుడువగన్ చనదు. అలాగే ఒకే ఒక్కడు చూస్తూ ఉంటే వాడికి పెట్టకుండా తక్కిన వారందరూ తినడమూ పద్ధతికాదు. అని ధర్మతత్త్వజ్ఞులైనవారు విడిచిపెట్టకుండా చెప్తుంటారట.

దీనికి మూలం పరాశర స్మృతిలోని ఈ శ్లోకం.

**నాదత్వా మిష్ట మశ్నీయా ద్బహూనాం చైవ పశ్యతామ్,**

**అశ్నీయు ర్బహవ శ్చైవ తథా నైకస్య పశ్యతః.**

నెలరోజులపాటు మోదుగ ఆకుల విస్తట్లో నిష్ఠగా ప్రీతిపూర్వకంగా భోజనం చేసిన విప్రుడికి చాంద్రాయణవ్రతం చేసిన ఫలం దక్కుతుంది.

**భోజన నియమాలు:** చంద్రుడి వృద్ధిక్షయాలను అనుసరించి తాను తినే ఆహారపరిమితిని పెంచుతూ తగ్గిస్తూ చేసే వ్రతం – చాంద్రాయణ వ్రతం.

ఎవరైనా ఒకడు నీళ్ళు తాగుతున్నప్పుడు గానీ లేదా మరొకడు కంచంలో అన్నం తింటున్నప్పుడు గానీ వాళ్ళు తాగే తినే పాత్రలనుంచి ఎంగిలిని చిందించే ఒక్క నీటి బొట్టైనా ఒక్క అన్నం మెతుకైనా అక్కడే ఉన్న అన్నం పాత్రపై చిందితే ఆ పాత్రలో ఉన్న అన్నం ఇక ఎవరూ తినరానిదని బ్రాహ్మణోత్తములు చెప్తూ ఉంటారు.

భోజనం చేసే సమయంలో చేయవలసిన ప్రాణాహుతి కార్యక్రమాలను పూర్తిచేసిన తర్వాత ఆచనమన పాత్రను లేదా, అన్నం వండిన పాత్రను ఎంగిలి చిందులు పడకుండా ఎత్తయిన ప్రదేశంలో ఉంచి, తన పాత్రలోని అన్నాన్ని తాను తినడమే అన్నింటికన్నా మేలైన పద్ధతిగా  ధర్మజ్ఞులు చెప్తుంటారు.

బ్రాహ్మణోత్తముడు తన కుడిచేతి బొటనవేలు తప్ప మిగిలిన నాలుగువేళ్ళలోనూ కనీసం మూడింటికి ఉంగరాలు పెట్టుకోవాలి.  చూపుడి వేలుకి  వెండి ఉంగరం, దీనికి పొరుగున ఉండే నడిమి వేలుకి మేలిమి పసిడి ఉంగరం, తక్కిన రెండు వేళ్లలోనూ ఏదో ఒకదానికి జలపోత ఉంగరం అంటే, రాగి ఉంగరానికి వెండిగానీ, బంగారంగానీ పూతవెట్టిన ఉంగరం ధరించాలి.  సాధారణంగా ఇలాంటిదాన్ని  చిటికెనవేలుకి ధరిస్తారు. మొత్తం మీద అతడి ఈ వేళ్లకు ఈ ఉంగరాలు ఉండాలి.

## వడ్డన నియమాలు

వడ్డన సమయంలో పాటించవలసిన మడి నియమాలు.  వడ్డన చేస్తున్నప్పుడు భోజనం చేస్తున్న వారిదెవరిదైనా ఎంగిలి తుళ్ళి అన్నంకుండలోగానీ లేదా వడ్డించే ఆహారపదార్థాలున్న పాత్రలోగానీ పడితే ఆ ఎంగిలివంటపాత్రలోని వంటకాన్ని విడిచి పెట్టేయాలి. దానిని మళ్ళీ ఇతరులకు వడ్డించకూడదు. ఇదొక నియమం. మరో నియమం ఏమిటంటే  ఒకవేళ తింటున్నవారి ఎంగిలి తుళ్ళిపడి వడ్డించేవారిని  సోకితే వారు వడ్డన ఆపివేయాలి.  చేతిలో ఉన్న పాత్రను కింద పెట్టెయ్యాలి.  అలా వడ్డింపక డించి, వెంటనే పెరటి బావిచెంతకు వెళ్ళి హస్తపాదాది ప్రక్షాళనం చేసుకుని, అపవిత్రః పవిత్రో వా  ఇత్యాది శ్లోకంతో ముమ్మారు శిరస్సున నీళ్ళు జల్లుకొని కేశవనామాలతో ఆచమించి తిరిగివచ్చి వడ్డన కొనసాగించవచ్చు.

ప్రయాణంలో ఉన్నప్పుడు వెంట తీసుకువెళ్ళే అన్నం మూటను కూటిముడి అంటారు.  దానిని వెంట తీసుకువెళ్ళేవాడు నియమాలు పాటించకుండా ప్రయాణం చేస్తే ఆ కూటిముడిని కిందికి దించకుండా అతడిమీదా మూటమీదా ఉత్తమధర్మ పద్ధతిలో అంటే, సమంత్రకంగా మూడుసార్లు  శుద్ధోదకాలు చల్లాలి.

## భోజనానంతర విధులు

భోజనం చేసిన తర్వాత చివరిలో నీళ్ళు తాగే పాత్ర తీసుకొని అందులోంచి పుడిసెట్లో సగం నీళ్ళు చేతిలోనికి తీసుకొని భూమిపై విడిచిపెట్టాలి. భోజనానికి ముందూ, భోజనం ముగించగానే ఆపోశనం పట్టి పరిషేచనం చెయ్యడం అనే నియమం ఉంది. ఇది భోజనానంతర పరిషేచన ప్రక్రియ. ఇది చేసేటప్పుడు పుడిసెలి నిండా నీళ్ళు తీసుకొని సగం ఆపోశనం పట్టి మిగిలిన సగం విస్తరిచుట్టూ నేలపై విడిచిపెడతారు. అలా విడిచిపెట్టడం వల్ల అది పాతాళంలో ఉన్న నరకలోకవాసులకు చేరుతుంది. దానివల్ల వారికి వేడుక కలుగుతుంది.

భోజనం చేసిన తర్వాత చేస్తున్నప్పుడు కూడా ఎంగిలిచేత్తోనే అంటే, కుడిచేత్తోనే జాగుసెయ్యకుండా తీర్థపాత్ర తీసుకోవటం తగినది. ఎంగిలి పోయేలా చెయ్యి కడిగిన తర్వాత తీసుకుంటే సమస్తదేవతా బృందమూ పితృదేవతలూ విపరీతంగా కోపగించుకుంటారు జాగ్రత్త!

ఇది ఇవ్వేళ విడ్డూరంగా కన్పిస్తుందిగానీ నిన్న మొన్నటివరకూ నైష్ఠికులు ఇలాగే మంచినీళ్లు పుచ్చుకునేవారు. ఎడమచేతితో పుచ్చుకునేవారుకాదు. గ్లాసును ఎడమ చేతితో పుచ్చుకున్నా, కుడిచేతి అరచేతిమీద ఆన్చి మంచినీళ్లు పుచ్చుకోవడమనే ఆచారం, అనంతరకాలంలో వచ్చిన మధ్యేమార్గం. ఇప్పుడైతే మనకు గ్లాసులుకూడా అవసరం లేదు సీసాలే!!

చిన్నపిల్లలకు బొజ్జనిండా అన్నం తినిపించిన తరువాత, కన్నతల్లి తన కుడిచేతితో వారి బొజ్జ నిమరాలి. బడబాగ్ని జఠరాగ్ని అగస్త్యులు మా బిడ్డ తిన్న ఆహారాన్ని జీర్ణమయ్యేట్టు చేసి మాకూ, మా పిల్లలకూ ఆరోగ్యాన్ని ఇచ్చుగాక అంటూ బొజ్జ నిమరాలి. జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం అంటూ నేటికీ తల్లులు చదువుతారు, బొజ్జ నిమురుతారు. అలా నిమురుతూ అలా చదివినట్టయితే పిల్లలు తిన్న గట్టిముద్దలుసైతం హుతమైపోతాయి, అరిగిపోతాయి. గట్టి గట్టి ముక్కలూ, మొక్కజొన్న వగైరా గట్టికండెలూ అరిగిపోతాయనీ. సులువుగా జీర్ణం కానివిసైతం జీర్ణమవుతాయనడం.

బడబాగ్ని సముద్రంలో ఉండే అగ్ని, గుర్రం ఆకారంలో దీని జ్వాలలు విస్తరిస్తూ ఉంటాయి కాబట్టి దీనికాపేరు వచ్చింది. వాతాపి అనే రాక్షసుణ్ణి అతడి సోదరుడైన ఇల్వలుడు వండి వడ్డించగా అగస్త్యుడు జీర్ణం చేసుకున్నాడని కథ. జీర్ణశక్తి ప్రదాతలుగా ముగ్గురినీ చెప్పడం అందుకే.

## యాగవిధులు

బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులలో ఎవరైనా ఒకరు ఒక యజ్ఞం తలపెట్టి, దాని వ్యయభారం మొయ్యలేక శూద్రజాతివారినుంచి ధనధాన్యాదులు అభ్యర్థించి తీసుకుని వాటిని వినియోగించి యజ్ఞం నిర్వహిస్తే, ఆ యజ్ఞ ఫలం యావత్తూ ఆ శూద్రుడికే దక్కుతుంది. కాగా అలా యజ్ఞం చేసినవాడు చచ్చి చండాలుడవుతాడు. అంటే యజ్ఞం చేస్తే సొంత డబ్బుతో చెయ్యాలి. అంతగా అవసరమైతే కులంవారినుంచో కుటుంబ సభ్యులనుంచో సహాయం అందుకోవచ్చు. అంతేకానీ యజ్ఞం పేరుచెప్పి అందరినుంచీ, చందాలు దండుకో కూడదనడం సారాంశం. భయపెట్టడానికి అప్పటి కాలాన ఇదొక మార్గం!!

వస్తురూపంగా గానీ, ధనరూపంలోగానీ యాగంకోసమని ఎవరినుంచైనా సొమ్మును యాచించి తీసుకున్నట్టయితే ఆ సొమ్మును ఆ యాగంకోసమే వినియోగించెయ్యాలి, ఖర్చు పెట్టాలి. అలా కాక పరమలుబ్ధుడై ఆ సొమ్మును తన భోగం కోసమని దాచిపెట్టుకున్నవాడు ఆగమ బాహ్యుడు. స్మార్త ధర్మ శాస్త్రాలన్నీ అతణ్ని వెలివేస్తాయి. మరుజన్మలో అతడు కాకిగా పుడతాడు.

ధనం కలిగి యాగానికి ఉపక్రమించడం ఎప్పుడు చేయాలంటే తన కుటుంబానికి మూడు సంవత్సరాల కాలం పోషణకు సరిపోయేలా ధనం ఉంటే ఏ అనుమానమూ లేకుండా సాంగంగా చేయాలి.

అందరిచేతా గౌరవింపదగిన విద్య గానీ తపస్సు గానీ లేని వారికి జనులకు ఇచ్చే దానం వల్ల ఫలం లేదు. నెయ్యినిగానీ తేనెను కానీ పచ్చికడవలలో ఎవడైనా ఎన్నడైనా పోసే బుద్ధిహీనులు ఉంటారా?

గురువుగారికి పూజచేసి ఆయననుంచి సెలవు తీసుకొని వచ్చి సమావర్తనానికి అర్హుడై క్రమంగా స్నానం చేసి సంధ్యావార్చి అగ్నిహోత్రం చేసినట్లయితే ఆ పురుషుడు తాను స్నాతకుడు అనే పేరుతో వ్యవహరింపబడతాడు.

## సమావర్తనం

వేదాధ్యయనం ముగిసిన తరువాత, గృహస్థాశ్రమం స్వీకారం కోసం తిరిగి వెళ్లేటప్పుడు గురువు సమక్షంలో జరిపే వేడుక/ క్రతువు. వేదపాఠం చెప్పిన తర్వాత ఆచార్యుడు శిష్యులను ఈ విధంగా ఆదేశిస్తాడు.

సత్యాన్నే పలుకు. ధర్మం ఆచరించు. నీ విద్యాభ్యాసం విషయంలో ఏమరుపాటు వహించకు. అంటే నిరంతరం చదువుతూ ఉండు అని. ఆచార్యుడు కోరిన ధనం

ఇచ్చి, తరువాత వివాహవిధిని ఆచరించు. దానిని విచ్ఛిన్నం చేయకు. సత్యం విషయంలో ఏమరుపాటు వహించకు. ధర్మం విషయంలో ఏమరుపాటు వహించకు. నైపుణ్యాలను సాధించే విషయంలో ఏమరుపాటు వహించకు. సంపదనూ కీర్తినీ సంపాదించటంలో ఏమరుపాటు వహించకు. చదవడంలోనూ బోధించడంలోనూ ఏమరుపాటు వహించకు. దేవపితృకార్యాలలో ఏమరుపాటు వహించకు. తల్లి దేవతగా కలవాడివి కమ్ము. అంటే తల్లిని దేవతగా భావించు. తండ్రి దేవతగా కలవాడివి కమ్ము. అంటే తండ్రిని దేవతగా భావించు. ఆచార్యుడు దేవతగా కలవాడివి కమ్ము. అంటే ఆచార్యుడిని దేవతగా భావించు. అతిథి దేవతగా కలవాడివి కమ్ము. అంటే అతిథిని దేవతగా భావించు.

నిందింప తగని పనులనే చెయ్యి. ఇతరమైన పనులు చేయవద్దు. మాలో ఉన్న మంచి గుణాలనే స్వీకరించు. ఇతరమైనవి అంటే ఒకవేళ చెడ్డగుణాలేమైనా గురువులలో ఉంటే వాటిని స్వీకరించవద్దు. అని. దీని మంత్రం తైత్తిరీయ సంహిత శిక్షావల్లి 11వ అనువాకంలో ఉంది.

## వివాహరీతులు

కులంచేత అధికుడు గానీ అలాగే కులంచేత సరిసమానుడుగానీ గుణవతులైన కన్యలను పెండ్లి ఆడటం తగిన పని. ఎందుకంటే కులహీనుడు కులవంతురాలిని పెండ్లి చేసుకోవడానికి ఎక్కడా సిద్ధపడడు కదా!

విప్రులు ఎటువంటి కన్యలను వివాహమాడాలో చెప్తున్నాడు. కులం ఒక్కటే అయి ఉండాలట. గోత్రాలు మాత్రం కలవకూడదట. వీటితోపాటు మంచి లక్షణాలు కలిగి చూడగానే ఇష్టపడేలా ప్రియంగా ఉండే కన్యలను మంత్రపూర్వకంగా పెళ్ళిచేసుకోవాలట.

ప్రాచీనకాలంలో ఉన్న ఒక సంప్రదాయాన్ని కేతన ఇక్కడ చెప్తున్నాడు. దానిలో ఒక క్రమపద్ధతి ఉంది. ఇది బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే చాతుర్వర్ణ్య క్రమంలో కిందినుంచి పైకి ఏర్పాటయిన ఒక ఆచారం. ముందుగా శూద్రజాతి. ఆ జాతిలో–

శూద్రుడికి భార్య ఒక్క శూద్రి మాత్రమే. ఆ తరువాత వైశ్య జాతి. వైశ్యుడికి భార్యలుగా శూద్రి – వైశ్య చెల్లుతారు. ఆ పైన ఉన్నది క్షత్రియ జాతి. ఆ జాతిలో పుట్టినవాడికి భార్యలుగా శూద్రి, వైశ్య, రాజకుమార్తె ఉండవచ్చు. శుభకరమైన గుణాలకు

ప్రసిద్ధుడైన బ్రాహ్మణుడికి నలుగురు భార్యలుండవచ్చునట. వాళ్ళు శూద్రి, వైశ్య, రాజకుమార్తె, సుప్రసిద్ధమైన బ్రాహ్మణ కన్య.

ఉత్తమ బ్రాహ్మణుడు శూద్ర స్త్రీని వివాహమాడి భార్యగా చేసుకోవడం న్యాయబద్దంకాదు. ఎందుకంటే భార్య కడుపున భర్తయే కొడుకుగా పుడతాడు అంటారు. ఆత్మా వై పుత్రనామాసి. శూద్రి కడుపున విప్రుడు పుట్టడం న్యాయ్యం కాదు కనుక విప్రశూద్రీవివాహం అన్యాయ్యం.

## అష్టవిధ వివాహాలు

ఉత్తముడూ యోగ్యుడూ అయిన వరుణ్ణి వెదికి, దొరికినట్లయితే అతడిని ఆహ్వానించి, కన్యనూ కన్యతోపాటుగా తగిన అలంకారాలనూ, ఆభరణాలనూ, నగలూ నట్రా ఇచ్చి నీటిని విడిచిపెడుతూ – ధారాపూర్వకంగా కన్యాదానం చేసి సంతోషంగా పెండ్లి చేయడమేదైతే ఉందో అది బ్రాహ్మ్యం అనే పేరుగల వివాహం అవుతుంది.

యజ్ఞంలో ఋత్విక్కుగా ఉంటూ అది ముగిసేదాకా ఎల్లప్పుడు హోమవిధికి సంబంధించిన మంత్రాలు పఠిస్తూ ఆయా విధులను నిర్వర్తించే వ్యక్తికి యజమానుడు తన కుమార్తెను ఇచ్చి వివాహం చేయడాన్నే దైవవివాహం అంటారు. ఆ విధంగా లోకంలో దైవవివాహం ప్రసిద్ధి పొందింది.

ఆర్షవివాహం అని దేన్నంటారో చెప్తున్నాడు కేతన. కన్యాశుల్కంగా, కట్నంగా ఆడపిల్లవాళ్ళకి రెండు ఆవుల్ని ఇష్టపూర్వకంగా – ముదమారగా ఇచ్చి సద్గుణాలతో కూడిన ఔత్సుక్యం కలవాడైన వరుడు చక్కగా అమ్మాయిని పెండ్లి చేసుకొన్నట్లయితే అది ఈ ధరిత్రిన్ ఆర్షము అనెడు వివాహము అయ్యెన్.

1. ప్రాజాపత్యం 2. ఆసురం. వివాహానికి సంబంధించి కట్నంగానో మరో రూపంగానో ఏ రకమైన ధనమూ తీసుకోకుండా వరుడికి కన్యను ప్రార్థనాపూర్వకంగా ఇచ్చి పెండ్లి జరిపిస్తే అది ప్రాజాపత్యవివాహం. అలా కాక అర్థించిన వరుడి దగ్గరనుండి కన్యాశుల్కాన్ని స్వీకరించి అతడికి కుమార్తెనిచ్చి వివాహం చేస్తే అది ఆసురం.

ప్రేయసీప్రియులు తమ తమ తల్లిదండ్రుల అభిప్రాయాలకు భిన్నంగా లేదా వారిని దూరం పెట్టి తమలో తామే పరస్పరం ఇష్టపడి భార్యాభర్తలమనుకొనే ఒప్పందాన్ని చేసుకొన్నట్లయితే ఆ పెండ్లి పేరే గాంధర్వ వివాహం.

ఇదీ రాక్షస వివాహ పద్ధతి. స్నేహపూర్వకంగా అడిగితీసుకోవడానికి అంగీకరించే సమస్యే ఉండదు. కన్య తరఫువారికి కన్యాశుల్కంగా ధనమివ్వడం అంటే అదీ లేదు. పైగా ఈర్ష్యతో కూడినవాడై ఆడపిల్లవైపు వారిమీద కయ్యానికి కాలుదువ్వి, యుద్ధం చేసి వాళ్ళందరినీ గెలిచి కన్యను బలవంతంగా పెండ్లి చేసుకొంటే అది రాక్షస వివాహం.

వాడు వరింపదగిన పురుషుడే. కాకపోతే – పెద్దలకు తెలియకుండా మూర్ఖంగా వెళ్ళి, చనువుతీసుకొని మరీ తాళిబొట్టు కడతాడు. అలా పరిణయమైతే దానిని పైశాచ వివాహం అంటారు.

## వివాహ నియమాలు

వివాహ సందర్భంలో కన్యాదానానికి మొదటి అధికారి – తండ్రి. తండ్రి లేని పక్షంలో తాత. అతడూ లేకపోతే సోదరుడు. వీళ్ళు ముగ్గురూ లేకపోతే తనకులంలో పుట్టినవాడు. ఆ తర్వాత తల్లి. వీళ్ళు యథాక్రమంలో కన్యకు దగ్గరివాళ్ళు అవుతారు. ఎప్పుడు అంటే జీవించి ఉండాలి, మనసులో ఏ కపటమూ లేనివాళ్ళై ఉండాలి. అందుకే వీరికే ఆ కన్యను యోగ్యుడైన వరుడికి దానం చేసే హక్కూ, అధికారమూ ఉన్నాయి.

ఆడపిల్ల పుష్పవతి కాకముందే తగిన వరుణ్ణి చూసి పెళ్ళిచేయాలట. అలా చేయకపోతే ఆ కన్య ఎన్ని సార్లు ఋతుస్నాత అవుతుందో అన్ని భ్రూణహత్యలు ప్రాప్తింపజేసే పాపం కన్నవారికి లభిస్తుంది.

తగిన వరుణ్ణి చూసి కన్యను ఇచ్చి పెళ్ళి జరిపించడానికి తండ్రి మొదలైన ఐదుగురూ తగినవారు. వీరిలో ఎవరూ లేకపోయినా, ఉన్నా పూనుకొని వివాహం జరిపించకపోయినా కన్య తనకు తానుగా తగిన వరుణ్ణి ఎంచుకొని పెళ్ళి చేసుకోవడం తగిన పని.

ఒకసారి నిశ్చితార్థం జరిగిందంటే, తాంబూలాలు పుచ్చేసుకుంటే కన్యాదానం జరిగినట్టే. అలా కన్యకను ఇచ్చి తర్వాత తిరిగి ఆ కన్యను తీసుకోవటం పెద్ద దోషం. అలా చేసిన పురుషుడు దొంగ కిందే లెక్క. దొంగకు ఏ రకమైన శిక్షలను విధిస్తారో అవే శిక్షలు ఇతడికీ వెయ్యాలట. అటువంటివాడు అలా దండించదగినవాడు అవుతాడని మునిశ్రేష్ఠులు అంటుంటారట.

వివాహ సందర్భాలలో ఒప్పందాల కన్నా కన్యక జీవితం ముఖ్యం అని తెలియజేసే ధర్మమిది. ముందుగా ఒక వరుడికి కుమార్తెను నిశ్చయపరిచి, అందుకు ప్రతిగా కన్యాశుల్కం తీసుకొని, వాళ్ళిద్దరికీ పెండ్లిచేసే ఔత్సుక్యంతో ఉన్న సందర్భంలో తీరా ఆ వరుడిలో స్పష్టమైన దోషాలు కన్పిస్తే ఇంకెవరైనా గుణాలతో శోభిల్లే వరుడు ఆ అమ్మాయిని చేసుకుంటానని ముందుకు వస్తే కన్యకను ఈ గుణవంతుడికి ఇచ్చి చేయటమే ధర్మం. ఆ గుణవంతుడైన పతికే శాశ్వతంగా అచ్చంగా ఇవ్వటం ధర్మం.

వివాహం చేసుకునే వరుడుగానీ వరుడు తరఫువాళ్ళుగానీ – కన్యాదాతకు పిల్ల తండ్రికి ఇచ్చే శుల్కం కన్యాశుల్కం. దీనిని ఉంకువ అంటారు. ఒకసారి ఉంకువ పుచ్చుకొని వివాహం జరిపించలేని సందర్భం వస్తే తగువుల్లేకుండా చేసే సర్దుబాట్లూ ఉన్నాయి.

ఒకడు ఒక కన్యకోసం ఉంకువ సమర్పించాడు. తీరా అలా ఇచ్చాక ఆ మూడు ముళ్ళు పడకముందే వీడు కాస్తా గుటుక్కుమన్నాడు. యమపురికి వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఉంకువ సొమ్ము పరిస్థితి ఏమిటి? అంటే అదే ఉంకువ మీద, అలా చనిపోయినవాడి తమ్ముడికైనా ఆ కన్యనిచ్చి పెండ్లి చేయవచ్చు. వాడికి తగిన వయసు లేకపోతే అదే వరుడికి అదే వధువు చెల్లెలు ఉంటే ఆమెనిచ్చి అదే ఉంకువకింద పెళ్ళి జరిపించవచ్చు. చనిపోయినవాడి తమ్ముడికి ఆ చెల్లెల్ని చేసుకోవడానికి ఇష్టం లేకపోతే ఇక చేసేదేముంది? పెద్దల సమక్షంలో – అంతకు ముందు ఇచ్చిన ఉంకువ సొమ్మును యథావిధిగా తిరిగి ఇవ్వటం న్యాయం. అని ఉత్తములైన మహర్షులు అంటారు. అంతేకాదు పరిశీలిస్తే యాజ్ఞవల్క్య మహర్షి కూడా తన స్మృతిగ్రంథంలో చెప్పింది ఇదే.

కన్యకు ఏమైనా శారీరక లోపాలు ఉంటే అలాగే ఏవైనా తగని దోషాలు ఉంటే వాటిని చెప్పకుండా చూపకుండా దాచిపుచ్చి కన్యనిచ్చి పెండ్లి చేయటం పిల్లతండ్రికి తగదు. అది దోషం. అంతే కాదు పెద్ద సాహసమే. దాని వల్ల ఎంతో అనర్థం కలుగుతుంది. పెద్దమొత్తం దండుగుగా చెల్లించవలసి ఉంటుంది.

## వివాహదండన

ఏ దోషమూ లేని కన్యకపై ఆ దోషం ఈ దోషం అంటగట్టి ఉత్తినే వృథాగా ఆమెను దూషిస్తే అలా దూషించినవాడి దూషణ దోషానికి తగిన విధంగా రాజులు నూఱు రెట్లు సొమ్ము వాడినుంచి జరిమానాగా వసూలు చేయాలి.

రెండో వివాహం చేసుకొన్న స్త్రీలను పరపూర్వలు అంటారు. వీరిని ఎట్టి పరిస్థితుల్లోనూ మరొకడు పెళ్ళి చేసుకోకూడదు. దానివల్ల పాపం చుట్టుకుంటుంది. ఈ పరపూర్వలు రెండు రకాలు 1) పునర్భువు, 2) స్వైరిణి జారిణి.

భర్త మరణించగా మళ్ళీ పెళ్ళి చేసుకున్న స్త్రీ పునర్భువు. భర్త బతికి ఉండగానే విడిచిపెట్టి వేరొక మగవాణ్ణి తగులుకొని సిగ్గులేకుండా జీవించే స్త్రీ స్వైరిణి.

స్వైరిణి గురించి చెబుతున్నాడు. కులాచారాలను భ్రష్టుపట్టించి శీలం విడిచిపెట్టి చెడ్డనడవడికతో పాతివ్రత్యానికి భంగం కలిగించిన స్త్రీలకు ఎటువంటి శిక్ష విధించాలో కొంచెం కఠినంగానే చెప్తున్నాడు కేతన. వారిని వంటింటికే పరిమితం చేయ్యాలట లేదా ఒకమూల ఉంచాలట. రకరకాలుగా అవమానానికి గురిచెయ్యాలిట. చిరిగిపోయిన వస్త్రాలనే కట్టుకోడానికి ఇవ్వాలట. సొంత సొమ్ములను ధరించడం గానీ, అనుభవించటం కానీ చెయ్యనివ్వకూడదు. ఆమెదే అయినా ఆ సంపదలవైపూ సుఖాలవైపూ వెళ్ళనివ్వకూడదు. ఇలా చేస్తూ నిత్యమూ ఒక్కముద్ద మాత్రమే ఆహారం పెట్టి దుఃఖించేలా చేయాలి. నేలనే ఆమెకు శయనస్థానంగా నియమించాలి. ఇదీ శిక్ష.

ఉత్తమురాలైన ఇల్లాలికి శూద్రుల మీద – అంటే పరపురుషుల మీద మనసైతే, మన్మథ సుఖక్రీడ జరపాలి అనే కోరిక కలిగితే అది కేవలం కోరికగానే మానసిక దశలోనే ఆగిపోతే పశ్చాత్తాపంతో సరి. శారీరకం కూడా అయితే కలయిక జరిగితే ఋతుస్నానంతో శుద్ధి. అదే ప్రాయశ్చిత్తంగా ఆమె శుద్ధి పొందుతుంది. నెల తప్పి, శుద్ధి పొందే అవకాశమే లేక గర్భం ధరిస్తే ఆ దుష్టురాలు ఆ గత్తరి ఇల్లాలు తన భర్తకు దూరం అవుతుంది. అంటే మగడు ఆమెను విడిచిపెట్టవచ్చునని.

ఈ దుర్గుణాలు గల స్త్రీని విడిచిపెట్టి పురుషుడు వేరే పెళ్ళి చేసుకోవచ్చు.

మద్యపానం, వాక్పారుష్యం నోటి దురుసుదనంతో అప్రియోక్తులు పలకడం సంపదనంతా దుబారాగా ఖర్చుపెట్టడం, పురుషద్వేషిణి – భర్తంటే పడకపోవడం, గొడ్రాలితనం – వంధ్యాత్వం, ఎప్పుడూ – ఎన్ని కాన్పులైనా ఆడపిల్లలనే ప్రసవించటం, దీర్ఘరోగాలు కలిగి ఉండటం, దుర్మార్గురాలు కావటం. ఇవీ అవలక్షణాలు. ఈ లక్షణాలు కనక భార్యలో ఉంటే ఆ భార్యను విడిచిపెట్టి పురుషుడు మళ్ళీ పెండ్లి చేసుకొన్నా ఒప్పేకానీ తప్పు ఎంతమాత్రం కాదు.

**సురాపీ వ్యాధితా ధూర్తా వంధ్యార్థ ఘ్న్య ప్రియంవదా,**

**స్త్రీ ప్రసూశ్చాధివేత్తవ్యా పురుషద్వేషిణీ తథా.** (యా. ఆ. 3)

సద్గుణవతి అయిన భార్యను విడిచిపెట్టి మారుపెళ్ళి చేసుకోవడం తప్పు. అయితే ఆ ఉత్తమసతికి ఉండవలసిన లక్షణాలివి. 1) చెప్పిన పనిని లేదా అప్పగించిన పనిని ఉపాయంతో చక్కగా చేయడం -పూర్తిచేయటం 2) మంచి కుమారుడికి జన్మనివ్వటం 3) ఎప్పుడూ వినయ పూర్వకంగా ఒద్దికగా మాట్లాడటం. ఈ మూడూ కలిగిన సతిని విడిచిపెట్టి భర్త తర్వాతి పెండ్లి చేసుకోవడం తగనిపని.

ఈలువు అంటే శీలం, కులాచారం, అభిమానం, గౌరవం ఇలా చాలా అర్థాలున్నాయి. వాటిని కాపాడుతూ పతియందే వ్రతం కలది పతివ్రత పతి – బతికి ఉన్నా , మరణించినా సరే ఇతరులతో సంగమించని పతివ్రతాశిరోమణి ఈ భూమిపై గొప్ప కీర్తిని పొందుతుంది. ఇది ఇహలోకలాభం అయితే పరలోకంలో ఈమెకు మరో లాభం ఉంది. అదేమిటంటే సాక్షాత్తు పార్వతీదేవితో సఖీత్వం–నేస్తురాలు కావటం. ఈ భాగ్యమూ కచ్చితంగా కలుగుతుంది. దీనినే యాజ్ఞవల్క్య స్మృతి ఈ విధంగా చెప్పింది.

**మృతే జీవతి వా పత్యౌ యా నాన్య ముపగచ్ఛతి,**

**సహ కీర్తి మవాప్నోతి మోదతే చ మయా సహ.** (యా. ఆ. 75)

ఈ పద్యమూ భార్యాధర్మాలకు సంబంధించిందే. భర్త చెప్పింది చేయటం. ఏదైనా ఒక పనిని చేయమని పురమాయిస్తే దానిని చెప్పినంతవరకే చేయటం. సొంత పెత్తనాలు, చూసిరమ్మంటే కాల్చివచ్చేరకాలు చేయకూడదని. ఇది ఒక ధర్మం. ఇక రెండోది. భర్త పతితుడై – అన్యస్త్రీ సమాగమంవల్ల గానీ కులాచార భ్రష్టత్వంవల్ల గానీ చెడిపోయినప్పుడు భార్య అతడిని విడిచిపెడితే –అలా విడిచిపెట్టినప్పుడు ఆ భర్త ప్రాయశ్చిత్తం గనక చేసుకొంటే – మళ్ళీ అతగాడిని తిరిగి భర్తగా అంగీకరించి, అతడితో కాపురం చేయటం కూడా భార్యకు ధర్మమే.

చాలామంది కొడుకులు కలిగిన భార్య ఉండగానే భర్త మరో పెళ్ళి – మీది పెళ్ళి చేసుకొనేటప్పుడు ఆ భర్త – అంతకుముందు తనకు ఉన్న పెద్ద భార్యకు తన సొమ్ములో – ఆస్తిలో మూడోవంతు ఇవ్వడం ధర్మం అని పెద్దలు చెప్తున్నారు.

ముందు పెళ్ళిచేసుకోని కన్య – అవివాహిత – పురుషుడితో సమాగమిస్తే ఆ కన్యను క్షత అంటారు. అసలు జీవితంలో మగడి పొందుకు ఎంతమాత్రమూ

నోచుకోకుండానే విధవరాలై పోయిన కన్య 'అక్షత'. ఇలా వీళ్ళిద్దరూ ఈ ఈ పేర్లతో వర్తిల్లుతూ ఉంటారు.

మంచి ప్రసిద్ధి కలిగిన తన వంశంలో పుట్టినవాడికిచ్చి పెద్దలు కులగోత్రాది యోగ్యతలు వీక్షించి మరీ వివాహం చేస్తే ఆ సతికీ ఆ పతికీ ఇంపుగా పుట్టిన పుత్రుడిని ఔరసుడు అంటారు. ఇతడే అన్నింటా గొప్పవాడు.

నాకు కొడుకులు లేరు. ఉన్నది కూతురే. ఇదుగో ఆ కూతురిని చక్కగా అలంకరించి నీకు భార్యకాగా ఇస్తాను. ఓ పుణ్యమనస్కుడా! నా కూతురికీ నీకూ ఒక పుత్రుడు కలిగితే అతడే నాకు పుత్రుడు అని చెప్పిమరీ స్వీకరించిన పుత్రుణ్ణి పుత్రికాపుత్రుడు అంటారు. అన్నిరకాలైన పుత్రులలోనూ ఔరసుడూ, ఈ పుత్రికాపుత్రుడు వీళ్ళిద్దరే అధికులు.

## పుత్ర భేదాలు

తన గోత్రం వాడినో లేదా తన వంశం వాడినో ఒకడిని మగడే స్వయంగా నియోగించి – వాడితో తన ఇల్లాలు పుత్రుణ్ణి కనేలా చేస్తే – అలా పుట్టిన కుమారుడు **క్షేత్రజుడు** అని ఈ భూమిపై వ్యవహరింపబడతాడు.

ధనవంతుడైన వ్యక్తి – నా దగ్గర చాలా ధనం ఉంది కానీ పుత్రులులేరు అని చెప్పి ధనాన్ని ఆశగా చూపి, ఇతరుడి కుమారుణ్ణి తాను నేర్పుతో వంచించి స్వీకరిస్తే అలా స్వీకరింపబడిన పుత్రుడు స్వీకరించినవాడికి **కృత్రిముడు** అనే పేరుకల పుత్రుడౌతాడు.

వివాహం కాని కన్యకు పుట్టిన పుత్రుణ్ణి **కానీనుడు** అని వ్యవహరిస్తారు. ఈ కానీనుడు ఆ కన్య తండ్రికి సుతుడు ఔతాడని అంటారు. ఆ కానీనుడి తల్లి తరవాతెప్పుడో వేరొకడిని పెళ్ళి చేసుకొని అతడికి ఇల్లాలై వెళ్ళిపోయినా – ఈ కానీనుడు నిక్కచ్చిగా ఆ తాతగారి పుత్రుడే అవుతాడు. కానీనుడి ఆలనాపాలనా కన్యాజనకుడి బాధ్యత అని.

భర్తను తానే విడిచిపెట్టిన స్త్రీ గానీ, భర్త మరణించగా విధవ అయిన ఒక స్త్రీ గానీ, వేరేవాడికి భార్యయై రెండో భర్తద్వారా ఒక కుమారుణ్ణి కంటే – ఆ సుతుడు రెండవ భర్తకు **పౌనర్భవుడు**.

పుత్రులు లేని వాడు తమకు పుత్రులు కావాలని కోరితే – పుత్రులు కలవాడు తన పుత్రులలో ఒక పుత్రుణ్ణి ఇస్తే – ఆ పుత్రుడు స్వీకరించినవాడికి **దత్తపుత్రుడు**.

తల్లీ, తండ్రీ తనను ఇవ్వడానికని అంగీకరించి అందుకు ప్రతిగా కొంత ధనం పుచ్చుకొని ఎవరికైనా తనను అమ్మితే – ఆ పుత్త్రుడు అలా కొనుక్కొన్నవాడికి **కృతకృత్యుడు** అనే పేరుగల కుమారుడు.

ఎవడైనా ఒకడు తనకు ఎవరూ లేరని చెప్పి– నేను నీ కొడుకుగా ఉంటాను. నిజం. నన్ను స్వీకరించు – అని వస్తే ఆ కొడుకు అలా స్వీకరించిన వాడికి **స్వయందత్తుడు.**

గూఢజుడంటే ఎవరో చెప్తోందీ పద్యం. దంపతులకు కొడుకు పుట్టాడు. అయితే వాణ్ణితాను పుట్టించలేదు అనే సంగతి మగడికి తెలుసు. కానీ, పుట్టించిన తండ్రి ఎవడో తెలీదు. రహస్యంగా ఎవడితోనో జరిపిన కలయిక కారణంగా తన ధర్మపత్నికి జన్మించిన పుత్త్రుడు వీడు. ఇతడే **గూఢజుడు.**

స్త్రీ గర్భవతిగా ఉన్నప్పుడు వేరొక పురుషుడు ఆమెను పెళ్ళాడి భార్యగా స్వీకరిస్తే ఆ గర్భం ద్వారా ఆ స్త్రీకి పుట్టిన పుత్రుణ్ణి **సహోఢుడు** అంటారట. (సహోఢజస్తు గర్భే స్థితో గర్భిణ్యాం పరిణీతాయాం యః పరిణీతః సహోఢజః పుత్రః.)

తల్లిదండ్రులిద్దరూ కన్నకొడుకును భరించలేక తన్ని తగిలేస్తే –పంపివేస్తే వాడు తగిన రీతిలో వేరొకరికి ప్రేమపాత్రుడై – వాళ్ళ మనసులు అలరించేటట్లుగా వారింట ప్రవేశిస్తే – ఆ పుత్రుడే **అపవిద్ధసుతుడు.**

భర్త అనుమతితో పరపురుషుడిద్వారా స్త్రీ పొందిన పుత్రుడు **క్షేత్రజుడు.** అదీ అలా నియోగించిన పరపురుషుడు తన గోత్రం వాడు కానీ తన వంశానికి చెందినవాడు కానీ అయి ఉండాలి. ఒకే కులానికి చెందిన స్త్రీ పురుషులు వివాహమాడగా వారికి కలిగిన పుత్రుడు **ఔరసుడు.**

క్షేత్రజుడు మొదలైన పుత్రులు గ్రహాలలాగా కాంతిహీనులై పోతారట. ఔరసుడనే పుత్రుడు స్వీయక్షేత్రంలో సూర్యుడిలాగా పొడచూపటం వల్ల తక్కిన క్షేత్రజుడు మొదలైన పుత్రులు మిగిలిన గ్రహాలలాగా కన్పిస్తారు.

పూర్వం బ్రాహ్మణుడికీ, క్షత్రియస్త్రీకీ పుట్టినవాడి పేరు **వైశ్యుడు.** వైశ్య స్త్రీకీ విప్రోత్తముడికీ కుదిరిన ఆనుకూల్యం వల్ల పుట్టినవాడు **అంబష్ఠుడు.**

బ్రాహ్మణుడు శూద్రస్త్రీని ఆదరంతో పెండ్లిచేసుకొని ఆమెద్వారా పుట్టించిన పుత్రుడు **నిషాదుడు.**

క్షత్రియుడివల్ల వైశ్యస్త్రీకి పుట్టిన వాడిని **'మాహిష్యుడు'** అంటారు. అలాగే క్షత్రియుడికీ శూద్రస్త్రీకీ పుట్టినవాడిని **'ఉగ్రుడు'** అంటారు.

కోమటికీ కామినియైన శూద్రస్త్రీకి పుట్టినవాడిని **కరణుడు** అంటారు.

ప్రకాశమానయైన బ్రాహ్మణస్త్రీకి క్షత్రియజాతివాడికీ పుట్టినవాడు **రథ సూతుడు**.

ప్రకాశించే సౌందర్యం కల బ్రాహ్మణస్త్రీకీ వైశ్యజాతివాడికీ పుట్టినవాడు **వ్యవహారి**.

బ్రాహ్మణ స్త్రీకీ, శూద్రుడికీ పుట్టినవాడు **చండాలుడు** అనీ; వైశ్యునికీ క్షత్రియ కన్యకూ అలాగే శూద్రుడికీ క్షత్రియకన్యకూ పుట్టినవారిని వరుసగా **మాగధుడు**, **క్షత్త** అంటారు. ఈ క్షత్తయే మొట్టమొదట గ్రామాధ్యక్షుడట.

# ప్రాయశ్చిత్తకాండం

ప్రాయశ్చిత్తం అంటే చేసిన దోషాలకు తగిన శిక్షలూ, పరిహారాలూ, జరిమానాలూ. ఇవి ఆయా సంప్రదాయాల్నిబట్టి తెలుసుకోవాలి. స్త్రీలూ, గోవులూ, విప్రులూ, బాలురూ తప్పించి మిగిలిన వారిలో పాపం చేసినవాళ్ళు పాపం చేసినందువల్ల వధించడానికి అర్హులైనప్పటికీ ఆలోచించి చేయాలి అంటోంది ప్రాయశ్చిత్తకాండ. పశ్చాత్తాపాన్ని మించి ప్రాయశ్చిత్తం లేదంటారు. అయినా భారతీయ న్యాయశాస్త్రాన్ని అనుసరించి, ప్రతి తప్పుకూ ఒక ప్రాయశ్చిత్తం ఉంటుంది. వాటిని విజ్ఞానేశ్వరం యాజ్ఞవల్క్య స్మృతి లాంటి గ్రంథాలు ఎంతో విపులంగా అందిస్తున్నాయి.

## వ్యావసాయికాలు

పశువులు వెళ్ళి ఇతరుల చేలలో పడి మేస్తే ఆ పొలం యజమాని వాటిని బంధించవచ్చు. దీనిని బందె అంటారు. పశువులను బందుల దొడ్డిలో పెట్టడం అంటే ఇదే. అలా బందుల దొడ్డిలో పెట్టబడిన పశువులను విడిపించాలంటే ఆ పొలం యజమానికి ఆ పశువుల యజమాని కొంత దండుగ శిస్తు చెల్లించాలి. దానినీ బందె అంటారు.

గేదెకి పాతిక. ఆవుకు పరక. గొర్రెకు వీసం. పశువుల యజమాని ఎరిగెరిగి కావాలని తన పశువుల్ని విడిచిపెట్టి ఇతరుల చేనును మేపినట్లయితే ఈ దండుగ రెట్టింపు వసూలు చేయాలి. పరక – రెండు వీసములు. వీసము = రూకలో పదహారో భాగం లేదా ఒకదానిలో పదహారో భాగం.

ఊళ్ళకు చుట్టూ ఒంటె ఏనుగు అంత పరిమాణంలో దట్టంగా పొడవుగా కంచె పెట్టడం మంచిది. పొలాలకైతే చుట్టు ఉండేలాగా కంచె పెట్టాలి. అటువంటి పొలం పశువులు మేసినట్లయితే బందె తీసుకోవాలి.

ఊరికి వెలుపల అంటే ముందూ, పశువులకోష్ఠానికి దగ్గరలోనూ, దారికి ఇరువైపులా చేరువలో ఉంటూ కంచెలేని చేలకు పశువులు ఆశపడి ఆ చేలలో పడి విజృంభించినట్లయితే రాజులు బందెలు స్వీకరించరు. పశువులకు బుద్ధులు ఉండవు కాబట్టి. తనకు తానుగా కావాలని ఎవడైనా తన పశువుల్ని ఇతరుల చేనును చెడ మేపినట్లయితే అలా చేసినవాడిచేత బలవంతంగా చేనుకి కలిగిన నష్టాన్ని ఆ చేను యజమాని వసూలు చేయాలి. అలాగే అటువంటివాడికి రాజు తగిన శిక్ష విధించాలి.

(వెండిమాడలో ఎనిమిదో భాగానికి పణము అని లోకవ్యవహారం. ఆ పణములోఎనిమిదో భాగాన్ని మాషము అని అంటారు.

భూమిపై అయిదు గురిగింజల ఎత్తు ఒక మాషం. పదహారు మాషాల ఎత్తు ఒక కర్షము. నాలుగు కర్షాలు కలిపితే ఒక పల. నూరు పలల ఎత్తు ఒక తులం అంటారు.)

కాపరి ఉదయం పూట లెక్కపెట్టుకొని పశువులను తీసుకుపోయి, వాటిని మేపి తాను మళ్ళీ సాయంత్రానికి లెక్కపెట్టినట్లుగా ఎన్ని తీసుకువెళ్ళాడో అన్నీ ఇవ్వాలి. ఒకవేళ వాటిలో ఏ ఒక్కటైనా మరణిస్తే ఆ గోపాలకుడు అలా మరణించిన పశువు తాలూకూ చెవినిగానీ కొమ్మును గానీ సాక్ష్యంగా చూపాలి. అలా చూపితే అతడు నిర్దోషి అవుతాడు. ఏదైనా పశువు చిక్కుకుపోయి, దానిని ఏ దొంగైనా అపహరించుకు పోయినప్పుడు వెంటనే ఆ విషయం చెప్పకపోతే అది దోషం అవుతుంది.

కాపరి గోవులను కాయడం కోసం తీసుకుపోయి తాను పరధ్యానంగా ఉండటం మూలంగా వాటిని పోగొట్టినట్లయితే అలా పోగొట్టిన వాడు ఆ పశువుల యజమానికి గోవుల వెల ఇచ్చి తీర్చుకోవాలి. అలాగే రాజుగారికీ కొంత శిస్తు చెల్లించుకోవాలి. తాను ఏమాటి, ఒక చేను పూర్తిగా నాశనం అయ్యేలా పశువులతో చెడ మేపినట్లయితే ఆ చేనుకి సంబంధించిన నష్టాన్ని అంతా పరిహారంగా వాడు కట్టేలా ఒప్పించడం రాజుకు ఒప్పు.

ఆలోచిస్తే గోవులను కాచేవాడికి ఇవ్వవలసిన జీతభత్యాలు ఎలావుండాలంటే ఆ గోపాలుడు కాచే ఆవుల ద్వారా వచ్చే పాలలో ఎనిమిదవవంతు క్షీరాన్నిగానీ, లేదా చక్కగానూరు ఆవులకు ఒక్క ఆవును గానీ ఇవ్వాలి. ఇలా గోపాలుడికి జీతంగా ఇవ్వడం పశువులు గల యజమానికి ధర్మం.

దున్నకుండా పశువుల మేతకై విడిచిపెట్టిన నేలను కొఱను అంటారు. అలా కొఱనుగా విడిచిపెట్టిన పొలమూ పూర్తిగా సేద్యం గల నేలా రెండూ ఒకటే. అందువల్ల అలా కొఱనుగా విడిచిపెట్టిన నేలలోనికి చొరబడేలా పశువులను తోలి మేపటం ఎటువంటిదంటే ఆలోచిస్తే నిర్భయంగా సేద్యపునేలను మేపినటువంటిదే.

బరువు మోస్తున్న బండివాడికి, వేదం చదివే బ్రాహ్మణుడికీ, రాజుగారికీ, వివాదికీ, మోపు బరువు ఎత్తుకున్నవాడికి, వృద్ధుడికీ, బాగా పసికందుకూ, గర్భిణికీ,

పిచ్చివాడికీ, వ్యాధిపీడితుడికీ వాళ్ళు స్పష్టంగా ఎదురుగా వచ్చినట్లయితే వివేకంతో తొలగిపోవాలి.

కంచెలోని కొన్ని కట్టెల్నీ, పొలంలోని గడ్డినీ, దేవపూజకు పుష్పాల్నీ విప్రుడు తీసుకున్నట్లయితే తీసుకోవద్దనకూడదు.

ఊరికీ చేలకూ మధ్య ఎడం నూరుధనువులంత ఉండాలి. ఈ దూరం అదే ఖర్వటం విషయంలో అయితే దానికి రెట్టింపు. అంటే రెండునూర్లధనువుల ఎడం ఉండాలి. అదే పట్టణానికి వస్తే దానికి రెండు రెట్లు. అంటే నాలుగునూర్లధనువుల దూరం అన్నమాట. దీనికి మూలం

## ఆర్థికాలు

తన సొత్తుకానిదానిని తన సొత్తేనని చెప్పి అమ్మినవాడి నుంచి నష్టపరిహారం వసూలు చేసి దానిని  సొంతయజమానికి ఇప్పించడం రాజులకు ధర్మం.

ఇది వీడి సొత్తు కాదని తనకు తెలిసీ ధనలోభంతో చక్కగా వెలయిచ్చి ఇతరుడి సొత్తును కొనుక్కోవడం తప్పే అవుతుంది. అలా చేసిన వాడిపైన దొంగతనం చేసిన నేరం తప్పక పడుతుంది.

తన సొత్తుకానిదానిని తనసొత్తేనని చెప్పి అమ్మినవాడు మరణిస్తే ఆ సొత్తును కొనుక్కున్నవాడు ఎంతకైతే కొనుక్కున్నాడో అలా కొన్న ధనంలో సగం పెట్టి అసలు యజమాని మళ్ళీ దానిని కొనుక్కోవాలి.

తన ధనం ఇతరుడి చేతిలో పడితే దానిని తెలుసుకొని వాణ్ణి పూనికతో పట్టుకోవాలి. వాడు ఆ సొత్తును తనకు ఎవడైతే అమ్మాడో ఆ అమ్మినవాణ్ణి చూపిస్తే వాడు శుద్ధుడైపోతాడు. వాడి తప్పేమీ లేదని. అలా గనక చూపకపోతే వాడు తానే దండ్యుడు అవుతాడు.

దొంగసొమ్ము దొంగలు దోచుకున్న  సొమ్ముగానీ ఉంటే దానిని చూసిన యజమాని ఇది నా ధనం అంటే అప్పుడు ఆ యజమాని నిజంగా ఎవరిదగ్గర కొన్నాడో దానిని అమ్మినవాడు గనక ఉంటే దాచకుండా సంశయించకుండా చెప్పాలి. అలా చెప్పినట్లయితే ఆ యజమాని శుద్ధుడవుతాడు. నిర్దోషి అన్నమాట.  అలా చెప్పకుండా

దాచిపెడితే దానివల్ల అలా దాచిన యజమానికి రాజదండన విధించాలి. దానితోపాటు ఆ యజమాని సొమ్మునూ స్వాధీనం చేసుకోవాలి. నిజంగా ఆలోచిస్తే అదే ఉత్తమధర్మం.

దొంగసొమ్ము తనధనమని పొందడం, దాన్ని అనుభవించడం పెద్ద నేరం. అలా పొందినవాడు అలా పొందిన సొమ్ములో అయిదవభాగం రాజుగారికి కచ్చితంగా చెల్లించాలి.

వేరొకడి సొమ్మును దొంగిలించి దూరంగా వెళ్ళడాన్ని చూసిన తర్వాత వేరొకడు తాను ఆ సొత్తును అపహరిస్తే దానికి మొదట దొంగిలించినవాడు తాను పది పణాలు రాజుకి పరిహారం చెల్లించాలి.

పరధనాన్ని స్వీకరించి భార్యకూ పుత్రులకు వరసబెట్టి ఇవ్వ తగదు. తగినరీతిలో కుటుంబరక్షణకు సరిపడా ధనం మాత్రమే భార్యాపుత్రులకు ఇచ్చి తక్కిన ధనాన్ని దానం చేయడం మేలు. అదే ఇలలో ఉత్తమధర్మం.

కొన్న వస్తువుకు వెలగా ఇచ్చిన ధనం, కవి పండిత గాయకులను మెచ్చుకొని ఇచ్చిన ధనం, స్నేహం కోసం ఇచ్చిన ధనం, వివాహ కట్నంగా ఇచ్చిన ధనం, దానం, ధర్మం ఇత్యాదిరూపంగా ఇచ్చిన ధనం, ఉపకారం చేసినవాడికి తనకు తానుగా కావాలని ఇచ్చిన ధనం తిరిగి తీసుకోవడం తగదు (శారదస్మృతి).

అని నారదస్మృతిలో ఉంది. దీని ప్రకారం ధనం రెండు రకాలు. 1) దత్తం 2) ఆదత్తం. దత్తం అంటే తిరిగి తీసుకోకూడనిది. ఆదత్తం అంటే తిరిగి తీసుకోవలసినది.

భయపడిన వాడి నుండి భయపెట్టే వాడి నుండి, మత్తులో ఉన్న వాడినుండి, మదోన్మత్తుడైన వాడి నుండి, బాలుడినుండి, శోకించే వాడినుండి, రోగం వల్ల విహ్వలుడైన వాడినుండి, క్రోధంచేత వివశుడైనవాడినుండి స్వీకరించిన ధనమూ; కుటిలధర్మం, కుటిలవిద్యల ద్వారా స్వీకరించిన ధనమూ; మఱపువల్ల స్వీకరించిన సొమ్మూ; మోసపూరితంగా కొన్న లంచమూ; తగనివాడు ఇచ్చిన పరిహాసపు దానమూ; మాత్సర్యంతో అన్యుడు ఇచ్చే ధనమూ; చేయడానికి తలపెట్టిన కార్యం చేయక ఇతరుడి దగ్గర తీసుకున్న ధనమూ ప్రీతితో తిరిగి ఇవ్వకపోవడం న్యాయం కాదు.

మంచిచెడ్డలు పరిశీలించకుండా కొన్న సరుకు తరువాత నచ్చకపోతే కొన్నరోజునే అమ్మినవాడికి తిరిగి ఇచ్చెయ్యాలి. అతడు దాన్ని స్వీకరించాలి. దానికి వెలగా చెల్లించిన సొమ్ము మొత్తం అమ్మినవాడు తిరిగి ఇచ్చెయ్యాలి. ఇది న్యాయపద్ధతి.

కొన్న మర్నాడు పట్టుకువెళ్ళి తిరిగి ఇస్తే అప్పుడు – ఆ సరుకుకు నిన్న చెల్లించిన వెలలో ముప్పయ్యవ వంతును అందంగా కిమ్మనకుండా కొన్నవాడు వదులుకోవాలి. అదే మూడవనాడు తిరిగి ఇవ్వదలిస్తే చెల్లించిన ధరలో పదిహేడవవంతు కొన్నవాడు వదులుకోవాలి.

గింజలూ ధాన్యాలూ వగైరాలకు పదిరోజులు; వస్త్రాలకు – పదిహేను రోజులు, బానిసకు – నెలనాళ్లు, ఎద్దుకు – అయిదునాళ్లు, గుర్రానికి – మూడు రోజులు, ఆవుగానీ గేదెగానీ అయితే వారం రోజులు, రత్నంగానీ ఇనుముగానీ అయితే ఒక్కరోజు ఇవీ సరుకు తిరిగి ఇవ్వడానికి తుదిగడువులు. ఇది ధర్మమార్గమని పెద్దలు చెబుతున్నారు.

కంచూ, తగరం, వెండి, ఇనుమూ మొదలైన లోహాలతో వస్తువులు చేయించుకొనేటప్పుడు తరుగు ఎలా ఉండాలో చెబుతున్నాడు. పని చేసేశాక తూకం వేసేటప్పుడు కంచుకి నూటికి ఐదుశాతం, తగరానికి నూటికి ఎనిమిది శాతం, వెండికి రెండుశాతం, ఇనుముకు ఏడుశాతం తరుగు అవుతుంది.

పోతున్న తన ప్రాణాలను ఓర్పుతో ఒక సేవకుడు రాజుగారిని కాపాడినట్లయితే ఆ రాజు లేదా యజమాని ఆ దాసుడి దాస్యాన్ని – సేవను విడిచిపెట్టకుండా అతణ్ణి పుత్రుడితో సమానంగా చూసుకొంటూ రక్షించాలి.

పూర్వం వరించిన భ్రష్టజుణ్ణి తన తనయుడితో సమానంగా ఉన్న వాడిని రాజు బలిమితో స్వీకరించి వాడి ప్రాణం ఉన్నంతవరకూ తన దాసుడిగా నియమించుకొని వాడి సేవను స్వీకరించాలి.

తనదగ్గర పనిచేసిన సేవకుడుచెప్పిన సమయం అంటే ఒప్పందం కుదుర్చుకున్న సమయం కంటే ముందుగానే వెళ్ళిపోయేట్టయితే ఆ భటుడే తాను స్వీకరించిన ధనం తిరిగి ఇచ్చేయాలి. రాజు తానే అతడిని అనుకున్న సమయం కంటే ముందుగా పంపించేట్టయితే పనిచేసిన రోజులకు జీతం ఇచ్చి పనిలోంచి తీసెయ్యాలి.

గురువుకు శిష్యుడు నిత్యమూ సేవచేసి భక్తిపరుడై విద్యలు నేర్చుకోవాలి. అలా నేర్చుకొని చివరికి విద్యాభ్యాసం పూర్తి అవ్వగానే దండిగా గురుదక్షిణ ఇచ్చి గురువునుండి వీడ్కోలు తీసుకోవాలి.

దాసుడూ, భృత్యుడూ ఇద్దరూ పనివాళ్లే. అయితే వారిలో దాసుడు – ధనమో పణమో ఇచ్చి కొనుక్కున్న సేవకుడు. ఉద్భాసితుడైన భృత్యుడు అలాకాదు కూలిపనివాడే ఎక్కడైనా.

దండిగా జీతం ఇవ్వకుండానే ఒక యజమాని తక్కువ జీతానికి నేర్పుగా ఒక సేవకుణ్ణి ఉద్యోగంలో నియోగిస్తే – అలా నియోగించిన యజమాని సేవకుణ్ణి విసిగించకుండా తగిన లాభం పొందినట్లయితే అతడికి – ఆ సేవకుడికి ఆ లాభంలో పదో భాగం ఇచ్చి యజమాని పంపివేయాలి.

నిత్యమూ దొంగలు మోసగాళ్ళలో కలిసిపోయి – ప్రవేశించి జూదపుసభలను అలరింపజేస్తారు. అక్కడ వారిని కనిపెట్టెయ్యవచ్చు. ఇది రాజుకు లాభం కాదా!

## సామాజికాలు

అంగవిహీనుణ్ణి, వికలాంగుణ్ణి, కుష్ఠాది ప్రసిద్ధరోగాలతో దుష్టమైన శరీరంగలవాడినీ చూసి అసహ్యించుకోవడం, ఎగతాళి చెయ్యడమూ తప్పే. ఈ తప్పులకు ప్రాయశ్చిత్తం – మూడురూకలపైన అర్ధరూపాయి. అంటే మూడున్నరరూపాయలు అపరాధ శుల్కం. ఇది అలా తూలనాడినవాడిమీదా, గేలి చేసినవాడిమీదా పడుతుంది. అంత దండుగు వారు చెల్లించాలని.

గురువును గానీ, కన్న తల్లిని గానీ, తండ్రిని గానీ సోదరుణ్ణి గానీ – అకారణంగా నిందించినా అపవాదులు వేసినా తూలనాడినా ఆ దుర్మార్గుడి నుంచి అపరాధ శుల్కం పేరున నూరు రూపాయలు వసూలు చెయ్యడం రాజుగారికి – పరిపాలకుడికి నీతి, విధి.

వాడి తల్లి, వాడి సోదరి, వాడి పెళ్ళాం, వాడి ఉంపుడుగత్తెలు – అందరికీ నేనే మొగుణ్ణి అంటూ ఈ రకంగా అమ్మా అక్కా ఆలీ బూతులాడి ఎవరినో తిట్టేవాడికి పాతిక రూపాయలు దండువు వేసి పాలకుడు వసూలు చెయ్యవచ్చు.

తనకన్నా అధికుణ్ని గానీ, పరకాంతనుగానీ లెక్కలేనంతగా తిడితే వాడికి ఏభైరూపాయలు దండుగు వేసి వసూలు చెయ్యాలి. తనకన్నా హీనుణ్ణి ఎవడైనా తిడితే అతడికి – పన్నెండున్నర రూపాయలు దండుగు వేసి రాబట్టాలి. ఇవన్నీ పాలకుల విధులు.

పద్ధతి విడిచిపెట్టి, ఒక శూద్రుడు తాను గర్వితుడై, ఏ తప్పూ చెయ్యనివాడూ అలాగే తనకు ఏ అపకారమూ చెయ్యనివాడూ అయిన ఒక విప్రోత్తముడిమీద – ఉమ్మి వేసినట్టయితే, ఆ శూద్రుడి పెదవులు కత్తిరించడమో, అంతే కొలత ఉమ్మిని అతడితో తినపించడమో, పాలకులు శిక్షగా విధించడం సముచితం.

శూద్రుడు తన కరచరణాద్యవయవాలలో ఏ అంగంతో ఒక విప్రుణ్ణి హింసించాడో బాధపెట్టాడో ఆ అవయవాన్ని పరిపాలకుడు ఖండించాలి. అలా కోతపడకుండా తనకు తాను తప్పించుకుంటాననీ తప్పించుకోగలననీ ఎవడైనా భావించే పరిస్థితీ, అనే పరిస్థితీ దేశంలో ఉండకూడదు.

ఒక ఉత్తముడిమీద లేనిపోని అపనిందలు మోపి, బ్రహ్మహత్యాది మహా పాపాలు అంటగట్టి నిందించినవాడు అపరాధ రుసుం చెల్లించాలి.

భూమికి భర్త అయిన మహారాజునుగానీ వేదపండితుణ్ణి గానీ, దేవుణ్ణి గానీ నిందించినవాడు – రుసుముగా ఎనిమిది వేల పణాలు వేవేగంగా, విధిగా చెల్లించాలి, ప్రభుత్వానికి కట్టాలి. దండువు రూపంగా ఆ సొమ్ముకు అతడు బాకీ ఉన్నట్లు.

ఎవ్వరూ లేని చోట ఒక్కడు నొప్పి కలిగేలా కొట్టినట్లయితే ఆ నొప్పి కొద్దీ జరిగిన పోట్లాటను – దాని కారణాన్ని తెలుసుకోవాలి.

ఎవరినైనా కొడతాను అని బెదిరించడం కొట్టడానికి సిద్ధ పడటం, కొట్టడం, శరీరం తట్టుగట్టేలాగా కొట్టడం, నెత్తురు కారేలాగా కొట్టడం, కాలో చెయ్యో విరిగేలాగా తన్నడం – ఇవన్నీ ఒకదానికన్నా ఒకటి పెద్ద తప్పులు.

తప్పుకు తగ్గట్టుగా దండువు ఉండాలి. తప్పు పెరిగితే దండువూ రెట్టింపు అవ్వాలి.

భయంకరంగా చిన్న పశువులనూ అలాగే తగుపాటి పెద్ద పశువులనూ కొడితే అలా కొట్టిన వాడికి వరుసగా చిన్న పశువులకైతే రెండు పణాలూ, పెద్దపశువులకైతే నాలుగు పణాలు దండువు పడుతుంది. ఆ నొప్పి ఆధిక్యాన్ని బట్టీ ఆ దండువు ఎక్కువవుతుంది.

కులం పేరెత్తి తిట్టడం, శాఖలపేర్లు పెట్టి తిట్టడం – నాడూ నేడూ రెండూ నేరాలే. బ్రాహ్మణులలో మురికినాట్లు మూర్ఖులనీ, ద్రావిడులు నేర్పరులనీ, అసలు మొత్తంగా బ్రాహ్మణులకు అత్యాశ – ఇలా దేశభాషలలో ఎవరైనా ఎవరినైనా తిడితే అతగాడు వంద రూకలు దండువు కట్టాలి.

గోవును చంపిన పాపాత్ముణ్ణి పట్టి తెచ్చి కర్రబద్దలతో కొట్టి అతణ్ణి కపాలం నరికి చంపడం ధర్మం.

అచ్చులు, త్రాసులు, తూములు, తక్కువగా అంటే ఉండవలసిన పరిమాణాలూ బరువులూ లేకుండా మోసపుచ్చేలా చేసి కపటంగా అమ్మే ఆ దొంగ వ్యాపారులు ఒక్కొక్కచోట అచ్చంగా పన్నెండు మాడలు అంటే ఆరు వరహాలు చెల్లించాలి.

సతీ, పతీ అంటే భార్యాభర్తలూ, అలాగే తండ్రీ కొడుకులూ ఒకరితో ఒకరు గొడవపడుతున్నట్లయితే సాక్ష్యం తీసుకొని కూడా అంటే తాను సాక్షిగా ఉండి కూడా ఆ గొడవ మాన్పని అతడు మూడు పణాలు దండువుగా చెల్లించాలి.

తెలియని వైద్యం నాకు తెలుసునని రాజపురుషుడికిగానీ అన్యులకుగానీ తెలిసీ తెలియని మందుల్ని, చూర్ణాల్నీ ఇచ్చినట్లయితే ఆ దుర్జనుణ్ణి రాజుగారు ఉత్తమ అధమవిధులకు యథేష్టంగా వినియోగించుకోవచ్చు.

కొలుచుధాన్యం మొదలైన వస్తువులను కొలిచేటప్పుడుగానీ తూచేటప్పుడుగానీ మోసపూరితంగా తక్కువయ్యేటట్టు కొలిచినా తూచినా ఆ వస్తువు అంత ఎక్కువ పరిమాణంలో ఆ వ్యాపారిపై జరిమానా పడుతుంది.

మందులలో కొలుచుధాన్యాలలో రసాలలో గంధాలలో ఇతరపదార్థాలను కలిపి కల్తీ చేసి అమ్మిన అతడు పెద్దమొత్తంగా పదహారుపణాలు దండువు కట్టాలి.

చందనం, అగురు, రత్నాలు, వస్త్రాల పేరుతో జాతి కాని ద్రవ్యాన్ని జాతి అని చెప్తూ అమ్మినట్లయితే ఆ వెలకు ఎనిమిదిరెట్లు అతడు రాజుకు దండువు కట్టాలి.

అనేకులు నియమపూర్వకంగా తాము ఒక్కటైపోయి, తమకు లాభం రావడంకోసం వేరొక ధరను కల్పించినట్లయితే వదిలిపెట్టకుండా అందులో ఉత్తమ విధమైన దండువు పడుతుంది.

పరులను కొననివ్వకుండా దాచిపెట్టి వ్యాపారస్థులు సరకును అమ్మకుండా కాలం గడిపి ఆపై కొంత కాలం తర్వాత ఎక్కువ ధరకు తెగించి అమ్మినట్లయితే రాజు వారినందరినీ దండించడం ఉచితం నెలనెలా రాజు ఒక వెల స్థిరీకరించినట్లయితే ఆ వెలలోనే నిత్యం అమ్మాలి కానీ దానిని అతిక్రమించి తాము మరో వెల నిర్ణయించుకొని పెట్టుకొని అమ్ముకోవడం వణిజులకు నిజం చెప్పాలంటే తప్పు.

నెలప్రతి కల్పించే సందర్భంలో కొన్న అతడి వ్యయం విడిచి, వెయ్యికి నూఱు అలవడేలా లాభం అతడికి ఉండేలా వెల కల్పించడం తగినది. ప్రతినెలా రాజు – వర్తకులు అమ్మే సరకులకు నిర్ణయించే ధరల పట్టీని నెలప్రతి అంటారు.

కట్ట తగని వృషభము మొదలైన పశువులను కట్టివేసినా ఇంతకుముందు కట్టివేయబడిన ఏనుగులూ గుర్రాలు మొదలైన జంతువులనూ అనివార్యంగా (నెట్టనన్) విడిచినా వాడు పెద్దమొత్తంలో ఎనిమిదిపణాలు జరిమానా చెల్లించాలి.

ఒక వస్తువుకు ఇంతధర అని చెప్పి కొన్నవారినుంచి దానికి తగిన వెల స్వీకరించి అమ్మిన వస్తువును కావాలని మరో వ్యక్తికి అమ్మకూడదు. అమ్మితే అలా అమ్మినవాడు తాను రెట్టింపు వెల మొదటి యజమానికి అలాగే రెట్టింపు వెల రాజుకూ విధిగా చెల్లించాలి.

వెల తీసుకొని అమ్మిన వస్తువు కొన్నవాడికి ఇవ్వనివాడు వేగమే దానికి కల లాభాన్ని తాను ఇవ్వాలి. అలాగే అందులోని నష్టాన్నీ ఎఱిగి – తరువాత చెల్లించాలి.

విదేశీ వస్తువులవల్ల పదింటికి ఒకటీ, స్వదేశీ వస్తువులవల్ల ఇరవైయ్యైదింటికి ఒక్కటీ స్పష్టమైన లాభం కలిగేలా వెల నిర్ణయించాలి.

అమ్మిన సరుకును యజమాని తీసుకోమంటే కొన్నవాడు తీసుకోకపోతే దైవవశాత్తూ అది చెడిపోతే – ఆ అమ్మిన సరుకు మొత్తం కొన్నవాడికే చెడుతుంది. అంటే ఆ నష్టం కొన్నవాడే – తీసుకోమంటే తీసుకోలేదు కాబట్టి భరించాలి.

అనేకులు కలిసి తాము ఒకే వ్యాపారం చేస్తుంటే – ఆ వ్యాపారంలో నష్టం గలిగితే దానిని అందరూ కలిసి ఒక్కటిగా అనుభవించడం ఎక్కడైనా సరే ఉచితంబు.

పొత్తులలో ఉన్నవారు విడిపోయినప్పుడూ లేదా పొత్తులో ఉన్నవారు ఒప్పుకోకపోయినా పొత్తునుంచి విడిపోయి ఆ పొత్తులో ఉన్న వ్యక్తి తాను స్వతంత్రంగా విత్తం పాడుచేసినట్లయితే అలా పాడుచేసిన ఉమ్మడి విత్తం అపుడే పొత్తునుంచి విడిపోయినవాడికి తగులుతుంది.

రాజుచేతా, దొంగలచేతా సొత్తునకు చేటు కలిగే సమయంలో ఎవడైతే నేర్పుతో ఆ సొత్తును కాపాడి తెస్తాడో అతడికి ఆ సొత్తులో పదోవంతు వ్యాపారస్థులు ఇవ్వడం ఉచితం. సరకు అమ్మే వ్యాపారులు రాజు నియోగించిన పన్నువసూలు చేసే ఉద్యోగులపట్ల మిక్కిలి నమ్మకంతో ఉంటూ సరకును అమ్మిన సొమ్ములో తాము ఇరవయ్యోవంతు సుంకం ప్రీతితో ఇవ్వాలి.

రాజుగారే అనుభవించదగిన సరుకునుగానీ, రాజు ధరించడానికి యోగ్యమయిన రత్నాదులుగానీ రాజుకు తెలియకుండా అమ్మితే ఆ సరకు – వెల ఏమీ లేకుండా రాజుకే మిగులుతుంది.

సుంకపుటిళ్ళలో ఆగిన సుంకపుసరుకును మొదట ఉన్నంత మొత్తంగా చూపకుండా ఉన్నా లేక అబద్ధం ఆడినా ఎనిమిది మడుగుల సుంకాన్ని రాజు వణిజులనుంచి వసూలు చేయాలి.

**న భిన్న కార్షాపణ మస్తిశుల్కం న శిల్పవృత్తౌ న శిశౌ న దూతే,**
**న భైక్షలబ్ధే న హుతావశేషే న శ్రోత్రియే ప్రవ్రజితేన యజ్ఞః.** (వి.వ్య. 260)

పోయిన సొమ్ము ఎవ్వడి చేతిలో ఉంటుందో వాణ్ణీ, ఆ అడిగే పద్ధతిలో పోలిక ఐనవాణ్ణీ, ముందు అంతా చూడగా దొంగైన వాణ్ణీ, ఇచ్ఛతో దాక్కొనే వాణ్ణీ, ఊరూ కులమూ పేరూ అబద్ధం చెప్పేవాణ్ణీ, స్త్రీలపైనా, జూదంపైనా ఆసక్తితో తిరిగేవాణ్ణీ, పెద్దగా అధికంగా ప్రియం చెప్పేవాడినీ అన్నిచోట్లా పరధనం కోసమే చూసేవాణ్ణీ, ఇతరులు ఎవరూ చూడకుండా ఉండే వాణ్ణీ, చూసినప్పుడుభయపడే వాణ్ణీ, రక్షకభటులు దొంగలుగా భావించి పట్టుకొని పరిశీలించాలి. ఈ విధంగా చూడకపోతే గానీ తెలియదు.

దొంగను పట్టిన మాత్రాన వెంటనే దండింపక అతనిచే ప్రమాణం చేయించి వాడు నిర్దోషి, స్వచ్ఛమైనవాడు అయితే విడిచిపెట్టాలి. నిజమైన దొంగైతే దగిన దండన వేయాలి.

సొమ్ముతో బట్టుకొని దొంగల్ని చిత్రవధచేసి దండించాలి. బ్రాహ్మణుడు తాను దొంగైతే అతడి నుదుట కుక్కచ్చు వేసి సర్వస్వమూ స్వాధీనం చేసుకొని ఊర్లోంచి పంపించివేయాలి. దొంగ దొంగిలించిన ధనాన్ని దాచిపెట్టిన ఊరికి పెద్దయైన వ్యక్తి ఆ ధనాన్నిగానీ దొంగనిగానీ చూపాలి. దొంగ ఊరిలోనికి ప్రవేశిస్తే ఆ ఊరిపెద్దలు దొంగ ఆచూకీగానీ ధన్నాన్నిగానీ చూపాలి. ఎక్కువగా పెక్కుటూళ్ళ మధ్య దొంగతనం జరిగితే అన్ని ఊళ్ళవారూ కలిసి దొంగను దండించాలి.

దొంగతనం చేసినవారిని శీఘ్రమే దండించి ఎవరి ధనం వారికి రాజు ఇవ్వాలి. అది తగినది. అలా ఇవ్వకపోతే – దొంగ తాలూకూ పాపం మొత్తం రాజుకు వస్తుంది.

నడిచి బాగా అలసిపోయి దప్పిపడిన నరుడు ఒక్కొక్క అంగడికి వెళ్ళి పిడికెడు పిడికెడు ధాన్యం చొప్పున పుచ్చుకోవచ్చు. యజమాని వలదనకుండా దానికి ఒప్పుకోవాలి.

ఒకడు మరొకణ్ణి చంపడంకోసంగానీ చెఱచడం కోసంగానీ బాహాటంగా వెళ్తుంటే అలా వెళ్ళడం తెలిసీ బలవంతుడైనవాడు వాడికి అడ్డుపడకుండా ఉంటే ఆ బలవంతుడి దగ్గరనుంచి మొహమోటం లేకుండా వెయ్యిపణాలు వసూలు చేయాలి.

ఒకణ్ణి ఎవ్వరూ ఎఱుంగకుండా జంపి అలా చంపినవాడు తాను దాక్కొన్నట్లయితే చచ్చినవాడి మిత్రుల్నీ భృత్యుణ్ణీ, అన్నదమ్ముణ్ణీ భార్యలనూ పట్టుకొని గట్టిగా గద్దించియైనా వారిని వేర్వేరుగా ప్రశ్నించి చచ్చినవాడి దగ్గరకు వచ్చేవారినందరినీ పరిశీలించి, ఏ ఏ ధనాలకోసం ఎవరితో ఏ జగడం కలిగిందో అనీ ఆరాతీసి ఆ చచ్చినవాణ్ణి చంపడానికి తగిన ఆ అనుమానం ఇతరుల మీద తగిలినట్లయితే అలా అనుమానాస్పదులైనవారిని అదుపులోనికి తీసుకొని విచారించి తెలివితో వారిలో నిర్దోషిత్వం లేకపోతే తగినదండనతో దండించడం రాజుకు తగినది.

పరకాంతల పట్ల అనుచితంగా అసభ్యంగా ప్రవర్తించిన దుర్జనుడికి పరదారగామితో సరిసమానంగా దండువు వేసి శిక్షించాలి. అతడిలాగానే ఇతడూ దండ్యుడు.

తల్లి తోబుట్టువుల్ని, తండ్రి తోబుట్టువుల్ని, తల్లి సహోదరీమణుల కూతుళ్లను, అలాగే తండ్రిగారి అన్నదమ్ముల కూతుళ్లను, సొంత అక్కచెల్లెళ్లను, తన సోదరసోదరీమణుల కూతుళ్లను; రాజుగారి కూతుళ్లను; రాజుగారి కోడలిని, తన కన్న కూతుర్ని, తన కోడల్ని, పిల్లనిచ్చిన అత్తను, తన గోత్రంవాళ్ళే అయిన వనితలను; పతివ్రతామతల్లియైన బ్రాహ్మణిని; స్నేహితుడి ఇల్లాలిని, శిష్యుడి పెళ్ళాన్ని, గురువుగారి ధర్మపత్నిని, పెంపుడు తల్లిని - ఇలా ఒప్పారే ఈ స్త్రీలను సంగమించకూడదు. సంగమించిన దుష్టుడు గురుతల్పగామి = గురుపత్నిని సంగమించినవాడితో సమానం.

మానవుల ఎదుట, తగాదాలైన సందర్భాలలో కఠినంగా మాట్లాడేటప్పుడూ తాను ఇతరులచేత నిందింపబడికూడా ఇంపుగా భరించేవాడు ఎక్కడైనా గౌరవింపదగినవాడు.

ఇద్దరు తిట్టుకున్నారు. వారిలో ఎవడో ఒకడు ముందుగా తిట్టి ఉంటాడు. అతడు దండ్యుడే. అతడికి సమాధానంగా రెండోవాడూ తిట్టాడు. ఇతడూ దండ్యుడే. అయితే వీళ్ళకు విధించే అపరాధశుల్కంలో కొంత తేడా ఉంటుందిట. మొదట తిట్టినవాడు మారు తిట్టినవాడికన్నా రెట్టింపు ధనాన్ని దండువుగా రాజుగారికి చెల్లించాలి, వదిలించుకోవాలి.

ఇద్దరు సమ ఉజ్జీలైనవాళ్ళు - వస్తాదులు - కలియబడ్డారు. తగువులాడుకుంటున్నారో తన్నులాడుకుంటున్నారో. అందులో ఇద్దరూ సరిసమానంగా

ఉన్న సందర్భంలో ఎవడైనా ఒకడు, రెండో యోధుడిమీదకు గద్దిస్తూ మీదమీదకు వెళ్ళినట్టయితే, అలా వెళ్ళినవాడు అధిక దండ్యుడు. వాడికి పెద్ద శిక్ష, ఎక్కువ దండువు వెయ్యాలి. ఎందుకంటే వాడికి అహమూ, ఎలాగైనా తానే గెలవాలనే పట్టుదల అధికం అని తెలుస్తోంది కాబట్టి తనకు తాను నిలువరించుకోలేని దుడుకు మనిషి కనుక ప్రమాదకారి అని కాబోలు.

కోడిపుంజుల్లాగా ఇద్దరు సరిసమానంగా కలబడి తన్నుకున్నారు. పరుషంగా జగడమాడుకున్నారు. ఇద్దరూ గాయాలతో రాజుగారి సభకు న్యాయంకోసం వచ్చారు. అప్పుడు ఇద్దరికీ సరి సమానంగా దండువు వేసి వసూలు చెయ్యాలి ధరణీశ్వరుడు. ఇలా దండించి దండువు పుచ్చుకోవడమే సద్ధర్మం అనిపించుకుంటుంది.

మనసుకు నొప్పి కలిగించడం, అలాగే శరీరానికి బాధకలిగించడం అనే ఈ రెండూ దండించదగినవే. పారుష్యమనేది తిట్టడం ఏడ్వడం అనే రెండింటితోనూ జనులకు పుడుతుంది.

న్యాయాధిపతియైన వాడు తానే హింసించినా, శిక్షను అమలుపరచినా తగినదండనతో రాజు వాణ్ణి దండించాలి. మొహమాటపడి విడిచిపెడితే నగుబాటు కలుగుతుంది. దానివల్ల పాపమూ రాజుకి చుట్టుకుంటుంది.

ఎక్కువకులంలో పుట్టినవాడు తక్కువకులంలో పుట్టినవాణ్ణి కొట్టినట్లయితే తక్కువ దండన. తక్కువకులంలో పుట్టినవాడు ఎక్కువకులంలో పుట్టినవాణ్ణి కొట్టినట్లయితే ఎక్కువ దండన. ఇది వరుసగా అన్ని కులాలకూ వర్తిస్తుంది.

మొండివాడు, పాపకర్ముడు, చండాలుడూ మొదలైన నీచజనులు ఉత్తమ వంశం కలవాడిని కొట్టినట్లయితే శిస్తువేయడం విడిచిపెట్టి చంపడమే రాజుకి ఉచితధర్మం.

పరకాంతతో రమించినవాణ్ణీ, చోరుణ్ణీ పట్టుకొని విడిచిన వాడూ, దుర్జనుడూ, రాజుగారి ఆజ్ఞను దప్పేలా రాసిన కరణమూ – ఐదు మడుగులు రాజుకు శిస్తుగా చెల్లించాలి.

భక్ష్య, భోజ్య, లేహ్య పానీయాలను కల్తీచేసి దూషించినవాడు వరుసగా రాజుకి భక్ష్యదూషణకి ఐదువందలు, భోజ్యదూషణకి మూడువందలు, లేహ్యదూషణకి ఎనభై, పానీయదూషణకి నూట యిరవయ్యైదు పణాలు దండువుగా చెల్లించాలి.

కల్తీ వ్యాపారస్థులకు శిక్షలు. వెండి కానిదాన్ని వెండిలాగా నిగనిగలాడించి, రత్నం కాని దాన్ని రత్నంలాగా మిలమిలలాడించి, బంగారం కానిదాన్ని బంగారంలాగా మిసమిసలాడించి – ఇలా మోసగించి కపటవస్తువుల్ని అమ్మినా, కల్తీ – కపట మాంసాన్ని అంటే తినకూడని జంతువుల మాంసాన్ని అమ్మినా సదరు పాపాత్ముణ్ని పట్టి బంధించి, వెయ్యి పణాలు దండువు వేసి వసూలు చెయ్యాలి. ఇంకా అదనంగా ముక్కు చెవులూ చేతులూ తీసెయ్యాలి.

దారిలో వెళ్తున్నప్పుడు అడ్డుగా వస్తున్న ప్రజలను ఉద్దేశించి తొలగండి తొలగండి అంటూ చెప్పినప్పటికీ తప్పుకోనివారిని ఆయా జంతువులు తొక్కిగానీ పొడిచిగానీ హింసించినట్లయితే అలా పసువుల, గుర్రాల, ఏనుగులవలన వాళ్ళు బాధనొందినట్లయితే తొలగుమని చెప్పిన రాజు తలపై దోషం ఉందా?

కోఱలూ కొమ్ములూ ఉన్న క్రూరజంతువులు ఎవడినైనా ఒకడిపై కలబడి బొడవాలని వాడిపై విజృంభించినట్లయితే అలా ఆ జంతువులు సదరు వ్యక్తిపై కవిసినచోట దాని యజమాని దానిని ఆపగలిగికూడా ఆపకుండా ఉన్నట్లయితే మూడుమాడలు దండుగు చెల్లించడం న్యాయం.

నెఱిని పొడిచే చండాలుఁడు కరిచే కుక్కలను విడవగా, యజమాని తాను ఎఱిగీ మాన్పకపోయినట్లయితే అతడు సత్వరమే రాజుకు ఆరుమాడలు చెల్లించాలి.

రాజుగారిని నిందించినవాణ్ణీ, రాజుగారు చేసే రహస్యమంత్రాంగం నిర్ణయాలనూ వ్యూహాలనూ బహిరంగపరిచినవాణ్నీ వెంటనే అదుపులోకి తీసుకుని ఏమీ వెనుకాడకుండా లేదా – చాల్లే అని చిన్న దండనతో తృప్తిపడకుండా వాడి నాలుకను రాజు కత్తిరించెయ్యాలి, ఆపై దేశంనుంచి వెళ్లగొట్టాలి.

ఆయుధాలు కల సైనికుల ఆయుధాలను, వాద్యాలవాళ్ళ వాద్య ఆతోద్యాలూ, పనిచేసేవాళ్ళ పనిముట్లూ రాజులు ధనం మొత్తం తీసుకోనే సందర్భంవచ్చినా వాటిని మాత్రం తీసుకోరు. ఎందుకంటే అవి వారికి జీవనాధారాలు కాబట్టీ.

## చతుర్విధ ఆతోద్యములు

**శ్లో॥ "తతం చైవావనద్ధం చ ఘనం సుషిరమేవ చ,**
**చతుర్విధం చ విజ్ఞేయమాతోద్యం లక్షణాన్వితమ్".**

1) తతము (వీణ మొ॥), 2) అవనద్ధము (మద్దెల మొ॥), 3) సుషిరము (వేణువు మొ॥), 4) ఘనము (కంచుతాళములు మొ॥)

రాజుగారు కూర్చొనే సింహాసనాన్ని, ఆయన ఎక్కి ఊరేగే పట్టపుటేనుగును, గుఱ్ఱాన్ని ఇతరులెవరూ అధిరోహించకూడదు – ఆయనగారే ఆహ్వానిస్తే తప్ప. అప్పుడు కాదనకూడదు. ఎవడైనా ఈ నియమం తెలియక అజ్ఞానంతో అధిరోహిస్తే, ఎక్కుము అని రాజుగారు ఆహ్వానించకుండానే ఎక్కితే, వాడు వెయ్యి పణాలు దండువుగా రాజుగారికి చెల్లించాలి. అజ్ఞానంతో చేసిన తప్పు కాబట్టి ఈ మాత్రం అల్పదండన.

జాతకరీత్యా రాజుగారికి ఇది గడ్డు కాలం, గ్రహాలు ప్రతికూలంగా ఉన్నాయి, కీడు జరుగుతుంది మన రాజ్యంకూడా అంతరిస్తుంది – అన్యాక్రాంతమవుతుంది– అంటూ తెలిసీతెలియని సోది చెప్పే జ్యోతిషాధముల్ని వెయ్యిపణాల దండువుతో శిక్షించడం రాజుగారికి ధర్మం.

ఆకలితో అర్థించిన అభ్యాగతుణ్ణి వృధాగా పంపకుండా ఒక పద్ధతిలో చేతనైనంతలో ప్రీతితో సంతృప్తిపరిచి, వంశపారంపర్యంగా వస్తున్న గురువులకు ఇష్టమైన రీతిలో మాట్లాడుతూ, బంధువర్గాన్ని ఇంపుగా ఆదుకొంటూ, వీళ్ళూ వాళ్ళూ అనకుండా అందరూ తనవారేననే భావనతో చూస్తూ, ఎల్లవారినీ చక్కగా ఆదరిస్తూ, బ్రాహ్మణభక్తుడై, పరుల హితంకోసం పాటుపడుతూ, శుభమైన గుణాలతో ప్రభుతనుకలిగి ఉంటూ అంటే మంచిగుణాలు కలవాడై – సత్యమూ, శౌచమూ, ధనసంగ్రహంగా మహిలో చెలగే గృహస్థధర్మం కలిగి ఉన్న పురుషులు ఉత్తమగతులు పొందుతారు.

✦ ✦ ✦

# వ్యవహారకాండ

రాజు క్రోధమూ లోభమూ మొదలైనవాటి జోలికి పోకుండా ఉత్తమమైన ధర్మంపట్ల తత్పరభావంతో విప్ర వంశానికి చెందిన పండితోత్తములతో కలిసి తాను శాశ్వతమైన ధర్మ వ్యాజ్యాలలో నిర్ణయాలు తీర్పులు చక్కగా చేయాలి.

## న్యాయ వ్యవస్థ

సుప్రసిద్ధులనూ లేదా శాస్త్రాది శ్రవణం వేదజ్ఞానం కలవారినీ, సత్యనిష్ఠకలవారినీ ధర్మశాస్త్రాలు తెలిసినవారినీ, ద్వేషమూ అనురాగమూ లేని రాగద్వేషాలకు అతీతులైన విప్రులనూ, హితులనూ రాజు – తన న్యాయసభలో సభ్యులుగా చేయాలి.

ముగ్గురు ముఖ్యులు తప్పనిసరిగా సభకు కావాలి.

ప్రియాన్నో ధనలోభాన్నో భయాన్నో ధర్మం తప్పేలా పలికినట్లయితే వెంటనే ఒక్కోసభ్యుణ్ణీ వారిమీద కనికారం చూపించకుండా సభ్యులుగా తప్పించి దండించాలి.

దండింపరానివారిని దండిస్తూ ఉంటే దండించదగిన వారినందరినీ దండించకుండా ఉన్నట్లయితే అటువంటి రాజు నిందింపబడుతూ దుర్గతులపాలౌతాడు.

న్యాయంకోరిన వాడిని – వాదిని పిలిచి నీకు ఎవడు అనర్థం కలిగించాడో చెప్పమని అడిగి, వాడినుండి పూర్తిగా విషయం తెలుసుకొని, ఇక ప్రత్యర్థిని ప్రతివాదిని రాజు సభకు పిలిపించాలి.

బుద్ధిహీనులైన బాల, వృద్ధ, కన్యాదుల పక్షాన వాదిని పెట్టుకొని న్యాయం చెప్పాలి. బుద్ధిహీన బాలుడి పక్షాన అతడి అన్నదమ్ములుగానీ, బుద్ధిహీనయైన వృద్ధురాలి పక్షాన ఆమె పుత్రుడుగానీ, బుద్ధిహీనయైన కన్య పక్షాన ఆమె తండ్రి గానీ, తక్కినవారి పక్షాన ప్రతినిధిగా వారిచేత పంపబడిన వ్యక్తిగానీ న్యాయం కోరాలి.

తండ్రి, తోబుట్టువు, పుత్రుడు, శిష్యుడు తప్పించి తక్కినవాళ్ళు రాజసభలో తమంతట తాముగా ఒకరిపక్షాన న్యాయం కోరితే వారిని దండించవచ్చు.

రాజాజ్ఞచేత నిలువరిస్తే నిలువనివాడూ, నిలువరించదగనివాడిని, వాడిని బలిమితో నిలువరించేవాడూ, నిలువరింతకు నిషేధంలో పడి ఉండని వాడూ, నిషేధం విధించినవాడూ రాజుకు దండనార్హులు.

వాదికూడా వ్యాజ్యపత్రాన్ని సభలో ప్రతివాది ఎదుట రాయడమూ, దానిని అందరూ విని, సభ్యులు అవును ఉచితం అన్న తర్వాత ప్రతివాది వాదికి సమాధానాన్ని లిఖించాలి.

ఒడంబడికను బొంకుచేయడం, ఒప్పందం కుదుర్చుకోవడానికి కారణం చెప్పి తప్పుకోవడం, ముందు ఒకచోట వ్యాజ్యాన్ని తాను గెలవడం, ఇలాంటివాటిని విడిచి పెట్టకుండా ప్రత్యర్థి తనకందిన ఉత్తరానికి సమాధానంగా చెప్తాడు.

**మనుష్యమారణం చౌర్యం పరదారాభిమర్షణమ్,**
**పారుష్యముభయం చేతి సాహసం స్యాచ్చతుర్విధమ్.**

1) మనుష్యమారణము, 2) చౌర్యము, 3) పరదారాభిమర్షణము, 4) వాక్ పారుష్యము - దండపారుష్యము - అని సాహసం నాలుగు విధాలు.

నడవ జాలని వాళ్ళని ఆలస్యం చేయకుండా మోసుకువచ్చేలా చేసి వారిని రప్పించి, అలాగే సమయం ఆట్టేలేని పనులకు ఆలస్యం చేయకుండా రాజు తాను వ్యాజ్యం తీర్చాలి.

ఈ సంవత్సరం ఈ నెలలో ఈ తిథినాడు ఈ ఊరిలో ఇతగాడికి ఇంత ఇచ్చాను అంటూ న్యాయం ముట్టచెప్పినట్టయితే అది రాజులకు తెలిసేలా రాయించుకోవాలి.

వ్యాజ్యంపై ఆసక్తి కలవాడి పక్షాన మరొకడు వ్యాజ్యంలోనికి వెళ్ళినప్పుడు అలా వెళ్ళినవాడు ఆ వ్యాజ్యంలో గెలిచినా ఓడినా పంపినవాడికే జయాపజయాలు కానీ వెళ్ళినవాడు దానికి బాధ్యుడు కాడు.

వ్యాజ్యంలో ఓడిన వాడికి ధనం చెల్లించడానికి ఇతడు చెల్లిస్తాడు నాదీ పూచీ అని హామీ ఉండడానికి ఒక వ్యక్తిని జామీనుగా తాను తెచ్చుకోవాలి. అలా ఎవడూ దొరకకపోతే రాజు తన సేవకుణ్ణైనా ఏర్పాటుచేయాలి. పెట్టాలి.

ఇతడు ఇంత తీసుకున్నాడని అన్న తర్వాత అతడికి దావాపత్రం ఇచ్చి అది ఆ దావా తీరకముందే ఇతడు ఇంత తీసుకున్నాడని మళ్ళీ తన ప్రతిపక్షంవాడితో రాజసభలలో కలహించడం తగదు.

ఒకడు ఒకడితో వ్యాజ్యానికి బాహాటంగా కలహిస్తుంటే వాడిమీదే మరొకడు కలహించడం అకృతం, అన్యాయం.

ఇది నా ప్రతిజ్ఞ అని ముందు స్పష్టంగా చెప్పి, దానికి వ్యతిరేకంగా తర్వాత చెప్పడం తప్పు. అది దావాలో ఓడినట్లే. అన్యాయమే అవుతుంది.

ఇతడు తిట్టాడు, ఇతడు కొట్టాడు అనే ఆలోచనలతో ఆలస్యం చేయకుండా, నన్ను ఇతడు తిట్టాడు, నన్ను ఇతడు కొట్టాడు అని తప్పనిసరిగా నేర్పుగా న్యాయసభల్లో చెప్పడమే చాలు.

న్యాయసభా వ్యాజ్యంలో ఓడిన వాడు ఇంత సొమ్ము ఇవ్వాలి అని నిర్ణయించినట్లయితే అలా చెప్పిన సొమ్మును గెలిచినవాడికి, అలాగే న్యాయంచెప్పిన రాజుకి తగవుతీర్చినందుకు ఇచ్చే సొమ్మును తాను ముందు ఓడిన వాడు తగినట్లుగా చెల్లించాలి.

మాటలాడడం తెలియక మాట్లాడితే దాన్ని ఓటమిగా తీసుకోకుండా నిజంగా అందులో కార్యము ఉన్నట్లయితే ఆ నిజాన్ని రాజు తానే ప్రకటించి ధర్మం ప్రాధాన్యంగా న్యాయం నిర్ణయించి తీర్పు వెలువరించాలి.

ఉన్న న్యాయం - విషయం అంతా న్యాయ సభలలో అందరి ముందరా చెప్పడం మరిచిపోయి ఆ తరువాత కార్యాలు నిర్ణయింపబడిన తరువాత చెప్తే దానివల్ల బుద్ధిమంతులకు లాభం లేదు.

అనేక న్యాయాలు ప్రయోజనాలు లిఖించినా నేనేమీ ముట్టనన్నా ఏకమైనా వాడిపై కలిగేలా తెలిపిన వాడికి వాడు రాసినమేరకు చెల్లించాలి.

ఆస్తి పత్రం, సాక్షీ, భోగం ఈ మూడూ మానుష ప్రమాణాలు. ఇవి ఏవీ పొసగకపోతే ఉద్యోగించి దైవమైనక్రియను అంటే దైవప్రమాణాలను విధివంతంగా వేగమే చేయించాలి.

మొదట తీర్పు చెప్పి, తరువాత పొరపాటుపడ్డామని, న్యాయసభసభ్యులు ఆ చెప్పిన తీర్పును మళ్ళీ తిప్పి చెప్పాలనుకున్నట్లయితే, మొదటచెప్పిన తీర్పులో గెలిచినవాడూ, ఆ తీర్పు చెప్పిన సభ్యులూ వేర్వేరుగా జరిగిన తప్పునుబట్టీ జరిమానా చెల్లించాలి.

ఇంత ధనం తీసుకున్నాడని అప్పుఇచ్చినవ్యక్తి చెప్పినతర్వాత అలా తీసుకోలేదని తీసుకున్నవాడు తోసిపుచ్చినట్లయితే, తీసుకోవడం నిజమే అయితే, అప్పు ఇచ్చినవాడు తెలిపిన అప్పుపుచ్చుకున్నవాడు ఆ ధనాన్ని ధనకుడికి చెల్లించాలి. అలాగే అంతే మొత్తం రాజుకు దండువుగా చెల్లించాలి.

ఇతడు ఇంత తీసుకున్నాడని పంతంతో చెప్పి వాడిమీద వెఋవక తాను రచ్చ రచ్చ చేసే తగాదాకోరు అంతకు రెండురెట్లు చెల్లించాలి.

తాతల తండ్రుల తరంనుంచీ సంక్రమించిన క్షేత్రంకాకుండా ఇతరక్షేత్రం సంక్రమించిన విధానాన్ని చెప్పకుండా ప్రీతితో అనుభవించినట్లయితే అతడు ఎన్నిసంవత్సరాలయినా దొంగే.

మొదట్నుంచీ బంధుజనులు, ఒకపనిమీద వర్తించేవారు, ఒక ఊరివారు, రాజపురుషులు వరుసగా న్యాయానికి కర్తలు. వీరిలో ఉత్తరోత్తరం– అంతకంతకూ అధికులు.

బలంతో భయపెట్టి పగవాణ్ణీ చుట్టాన్నీ వృద్ధుణ్ణీ, బాలకుణ్ణీ, బుద్ధిహీనుణ్ణీ, కొట్టి అన్యాయంగా తీర్చే పాడి ధర్మమైనా అది న్యాయం కాదు.

పోయిన ధనం రాజువద్దకు చేరితే రాజు ఆ ధనం తాలూకూ యజమాని తన దగ్గరకు వస్తే ఇవ్వడం ఉచితం. ఆ యజమాని ఆ ధనం వివరాలను చెప్పకుండా అడిగినట్లయితే ఆ యజమాని అంత జరిమానా చెల్లించాలి.

దొంగిలింపబడిన ధనం తనవద్దకు చేరితే యథాతథంగా కోల్పోయినవాడికి దానిని రాజు ఇచ్చివేయాలి. అలాకాకుండా తానే తీసుకోవాలని తలిస్తే ఇక అ ధనం తాలూకూ యజమాని పాపం మొత్తం రాజుకే వస్తుంది. అనేక విధాలుగా న్యాయంకోసం అనేకులతో ఒకడు తగువులాడితే ఒక కార్యం సిద్ధించేటట్లయితే తాను ఒక్కడే అనేకులతోనైనా తగువులాడవచ్చు.

ఇల్లునడిపే దక్షత కలిగినప్పటికీ స్త్రీ మగవారితో న్యాయంకోసం వెళ్ళడం తగదు. ఎందుకంటే గొడవలు పడడంలో అనుభవం ఆమెకు ఉండదు కాబట్టి. ఒకవేళ మగడే ఇంతిని పంపితే వెళ్ళవచ్చు.

అనుచరుడు పరాధీనుడు. ఆ అనుచరుడితో పాడి పొసగదు. ఐనా వాడు రాజు లేదా తన యజమాని అనుమతితో డబ్బువ్యవహారంకోసం న్యాయం అడగడం తగినది.

సొమ్ము కలవాడు అనేక సంవత్సరాలు రాకపోతే ఆ సొమ్ము పట్టి తెచ్చిన వాడికి నాలుగో వంతు ఇప్పించి తక్కినదాన్ని రాజు తీసుకోవచ్చు. మూడేళ్ళకు పైగా సొమ్ము కలవాడు రాకపోతే రాజు ఆ ద్రవ్యాన్ని ఖర్చుచేయవచ్చు. ఖర్చుచేసిన తరువాత వస్తే రాజు తన భాగం కాకుండా తక్కిన ద్రవ్యాన్ని తన ఖజానానుండి ఇప్పించాలి.

మూలంలో చెప్పిన కాలపరిమితిగానీ రాజు తన ఖజానానుంచి ఇవ్వాలనిగానీ కేతన అనువాదంలో లేదు.

## వడ్డీ విధానం

వడ్డీ నాలుగు రకాలుగా ఉంటుందట.

1) రోజువారీ వడ్డి. దీనికే కాయికా వడ్డీ అని పేరు.

2) నెలనెలా వడ్డీ. కాలికా అని దీనికి వ్యవహారం.

3) ఒడబాటు వడ్డి. దీనికే కారితా అని సంస్కృతం, Agreed Interest అని ఆంగ్లం.

4) వడ్డి పైన వడ్డి. ఇది చక్రవడ్డీ. చక్రవృద్ధి.

అప్పుచేబదులు తీసుకొని తిరిగి ఇవ్వకుండా దీనుడై వెళ్ళిపోయినవాడూ, అలాగే ఇతరదేశానికి వెళ్ళినవాడూ మూడునెలలు పోయిన తర్వాత వడ్డీతో సహా చెల్లించాలి. ఒప్పందంతో లేదా ఒప్పందపత్రం – ప్రామిసరీనోటు రాసిమరీ అప్పు తీసుకొని ధనం అడిగితే ఇవ్వని వాడికి అదిమొదలు ఆ అసలూ వడ్డీ రెండూ ఇవ్వమని వెనుకాడకుండా ఇప్పించడం రాజుకు తగినది.

తీసుకొన్న సొమ్ము చెల్లించమని నిలువరించిగానీ న్యాయంకోసం పంచాయితీ పెట్టిగానీ ప్రమాణం చేసిగానీ వంచించిగానీ బలవంతంగా వెంటపడి గానీ ఋణగ్రస్తులనుండి ధనం వసూలు చేయడం న్యాయమే. కాబట్టి తప్పు లేదు.

జూదంసొమ్మూ, సరకువెల, జీతం, ఇతరుల సొమ్మూ దండనగా విధించిన సొమ్ములో కొంతచెల్లించగా మిగిలినదీ ఇలాంటి వాటిపై ఏ రకంగా చూసినా వడ్డీ పడదు. ఎందుకంటే ఇవి అసళ్ళు కావు కాబట్టి.

అప్పుతీసుకొని చెల్లించకుండా తిప్పి తిప్పి అకారణంగా రాజసభకు ఫిర్యాదు చేసిన తగాదాకోరును అప్పడే దండించి వాడినుండి ధనం వసూలు చేయాలి.

మద్యపానం, స్త్రీ వ్యసనం, జూదం ఇత్యాదుల కోసం చేసిన అప్పుకు – అలా ఆ అప్పు చేసినవాడి తల్లిదండ్రులు అప్పుపడరు.

ఉమ్మడిగా ఉన్నప్పుడు కుటుంబరక్షణకోసం పొత్తులవారందరూ అప్పుచేస్తే ఆ అప్పును పొత్తులవారందరూ విధిగా చెల్లించాలి.

భార్య తను తీసుకొన్న అప్పూ, భర్త తనను ఇమ్మని నిశ్చితంగా ఆజ్ఞాపించిన అప్పూ, పతి – తనను ఇమ్మని అంగీకరింపజేసిన అప్పూ మాత్రమే భార్య ఇస్తుంది. అంతే కానీ ఈ భూమిపై తదితరాలైన మగడి బాకీలను ఆమె తీర్చనవసరం లేదు.

తండ్రి పరదేశానికి వెళ్ళిపోయినా, పైలోకాలకే వెళ్ళిపోయినా లేదా రోగంతో పడి ఉన్నా అతడు చేసిన అప్పును అతడి కొడుకులు తీర్చాలి. అతడి కొడుకులూ బతికిలేకపోతే మనుమలు తీర్చాలి.

తండ్రిచేసిన అప్పును బాలుడు తిరిగి చెల్లించవలసిన అవసరం లేదు. అలా చెల్లించమనడం తగదు. ఆపై అంటే పదహారు సంవత్సరాలు దాటిన తర్వాత అతడికి ఊహ వస్తుంది కాబట్టి అప్పుడు తండ్రి చేసిన అప్పులనైతే మాత్రం తీర్చవలసిన బాధ్యత ఈ బాలుడిపై ఉంది.

ధర్మాన్ని పరిశీలిస్తే – చెల్లిస్తానని హామీ ఉన్న వ్యక్తి చెల్లించకుండా తను మరణిస్తే – అలా మరణించిన వ్యక్తి తాలూకు పుత్రుడు ఆ బాకీ సొమ్ములో అసలు చెల్లించాలి. మరణించిన వాడి కొడుకు కొడుకు – అంటే మనుమడు ఆ బాకీ చెల్లించవలసిన అవసరం లేదు.

ఒకడిదగ్గర సొమ్ము తీసుకొని అనుభవించినవాడు, తిన్నవాడు చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతూ ఉంటే అందుకు హామీగా అడ్డుపడ్డ వాడు చెల్లిస్తే, ఆ విషయం తెలుసుకొన్న రాజుకు ఆ తిన్నవాడు కనిపిస్తే, అలా కనిపించినప్పుడే హామీగా అడ్డుపడి చెల్లించినవాడికి రెట్టింపుగా అనుభవించినవాడిచేత ఇప్పించాలి.

తాను తాకట్టుపెట్టిన వస్తువును విడిపించుకోలేక, అది తాకట్టు పెట్టుకున్నవాడికి కూడా అనుభవయోగ్యం కానప్పుడు, ఋణం తీసుకున్నవాడు అతడికి వేరే తాకట్టు ఇవ్వడం తగినది. లేదా సరిపడా ధనమైనా ఇచ్చి ఋణవిముక్తుడవ్వాలి.

## సాక్షులు

కోరి వెంటతెచ్చిన లేఖకుడు = ఆకులపై వివరం ఏర్పడేలా రాయించుకోదగిన వాడు లిఖితసాక్షి. మరువకుండా ఈ ప్రయోజనం నువ్వు తెలుసుకో అని అప్పుడు తలపింపబడే వాడు తలపుసాక్షి. ఎక్కడికో వెళ్ళడానికి వచ్చి అన్నికార్యాలూ నెరవేరేలా

విన్నవాడు యదృచ్ఛా సాక్షి. అర్థి తానుగా రహస్యంగా సాక్షిగా తీసుకువచ్చినవాడు గూఢసాక్షి. ఈ గూఢసాక్షీ ఇతడికి సాక్ష్యంగా వచ్చిన సాక్షీ ఈ ఇద్దరికీ సాక్షియైనవాడు ఉత్తర సాక్షి. వీళ్ళు అయిదుగురూ కృతసాక్షులు. అకృతసాక్షులు ఆరుగురు ఈ అవనిపై ఉన్నారు.

తపస్సూ దానమూ కులమూ ధర్మమూ సత్యమూ ఋజువర్తనమూ నిక్కమైన – ధనమూ – తెల్లధనమూ మంచి సంతానమూ కల్గి, శ్రుతిస్మృతిమార్గాలలో వర్తించేవారై, చపలబుద్ధులు కానివారిని సాక్షులుగా తీసుకోవడం తగినది. వారు లేకపోతే దోషాలు లేని జనులు ఆయా జాతులవారందరూ అర్హులే.

శుభగుణాలూ ఆచారమూ ప్రభుతనములు లేనివారూ – అంటే అనధికారులు – అనేకులు అక్కర్లేదు. వ్యాజ్యానికి వచ్చిన ఆ ఉభయుల అనుమతము కల్గిన సభలో ఉత్తముడు ఒక్కడైనా సాక్షిగా చాలు.

దూషణం, అంకు, దొంగతనం ఇటువంటి వివాదాలలో ఎవరినైనా శీఘ్రంగా సాక్షిగా తీసుకోవచ్చు. అటువంటిచోట సాక్షి గుణాలను పెద్దలు చూడరు.

బాలకుడు, వృద్ధుడు, పగవాడు, చుట్టం, కుచ్చితపుతిట్లు తిట్టువాడు, కటికవాడు లేదా హంతకుడు, పాపాత్ముడు, అసత్యవాది, దొంగ, ముండాకోరు, చాడీలు చెప్పేవాడు, కల్లుతాగేవాడు సాక్షి కాడు. వీళ్ళు సాక్షిగా ఉండడానికి అర్హులు కారు.

తనంతతానుగా సాక్ష్యం చెప్పడానికి వచ్చిన వాడు, తీర్పు ఇచ్చినందుకు ఇచ్చే ధనంలో భాగం కలవాడు, పాలివాడు, కోపిష్ఠి, మోహితుడు, పాపపుణ్యాలు తెలియని వాడు, జూదగాడు సాక్షి కాడు. వీళ్ళు సాక్షిగా ఉండడానికి అర్హులు కారు.

సాక్షులు దుష్టబుద్ధితో పక్షమూ అపక్షమూ ఏమీ చూడకుండా తప్ప పలికినట్లయితే వారిని శిక్షించి జరిమానాలు స్వీకరించి ఆ నీచుల్ని వేరువేరుగా ప్రశ్నించాలి.

సభలో శీఘ్రంగా సాక్షులు చెప్పేటప్పుడు పొసగకపోవడంతో రెండువర్గాలుగా విడిపోయి యుద్ధం చేసినట్లయితే అధికులు చెప్పిన మాటలనే నిజంగా స్వీకరించాలి. వారి అభిప్రాయంతో పొసగేలా ఆ భిన్నాభిప్రాయం కలవారు సరిసమానంగా ఉంటే వారిలో గుణవంతులైన వారి పల్కులనే నమ్ముకోవాలి. అందరూ గుణవంతులే అయితే

అందులో అధికగుణాఢ్యుల్ని చూసి వారి మాటలనే నిజంగా స్వీకరించాలి. సుగుణసమగ్రులు కొందరే ఉండి గుణహీనులు ఎక్కువమంది సాక్ష్యాలు ఆడేచోట గుణసమగ్రుల మాటలనే లెక్కలోనికి తీసుకోవడం ధర్మం అని ధర్మజ్ఞులయిన మహాత్ములందరూ అంటున్నారు.

ధనం అప్పుతీసుకున్న వాడు తగినవిధంగా తన చేత్తో రాసి ఇచ్చిన పత్రికను తానే ఇచ్చినట్లయితే అది నిజమైన పత్రమే. తీర్పు చెప్పే చోట అనుమానము లేదు.

చిరిగినా ముక్కలైనా పత్రంలో ఉన్న అక్షరాలు సందేహాస్పదంగా ఉన్నా పత్రం బాగాదూరంగా పరదేశంలో ఉన్నా వరుసగా వేరొకపత్రం రాయించుకోవాలి.

సాక్షుల ముందు అప్పుతీసుకున్నవాడు తనకు రాబడి ఉంటే తప్పకుండా అదే సాక్షులముందు తెలిసేలా అప్పు చెల్లించమన్నారు ఆదిమునీంద్రులు.

సాక్షీ పత్రమూ చూపించడానికి లేకపోతే తీర్పుచెప్పేచోట, తుల, అగ్ని, విషం, జలం, కోశం అనే సత్యప్రమాణాలన్నీ కావాలి.

## ప్రమాణాలు

మొదటిరోజు నిందితుణ్ణి తులలో తూచి వాడి ఎత్తు ఇటుకలు దాచిపెట్టి, సత్యప్రమాణం చేసే రోజు సరిత్రాసును పూజించి అందులో దిక్పాలుల్ని ఆవహింపజేసి, తూర్పుముఖంగా తులలో నిందితుణ్ణి ఎక్కించి ఎప్పటిలాగే నిన్నటి ఇటుకల్ని పెట్టి, దేవతలారా! ఇతడు శుద్ధుడైతే ఎత్తండి. హీనుడైతే దింపండి అంటూ న్యాయాధిపతి చెప్పే సమయంలో నిందితుడు కూర్చున్న త్రాసు పళ్ళెం మీదకి వస్తే అతడు నిర్దోషి. ఒకేలా సమానంగా ఉన్నా కిందికి తూగినా ఓడినట్లే. నిందితుడి కింద లెక్క అని అంటారు సత్యనిర్ణయం తెలిసిన సాధుజనులు.

పదహారు వేళ్ళ వైశాల్యం, అంతే వెడల్పు ఉన్న దాన్ని భక్తితో అర్చించి తూర్పుముఖంగా బడమట నిందితుణ్ణి నిలిపి అతడి దోసిట అశ్వత్థవృక్షపు ఆకులు ఎదురుగా ఏడు మండలాలు చుట్టి, అక్షతలు పైన చల్లి, కాగిన మడ్డు – పట్టుకాఱులో దాన్ని ఇఱికించి పూనికతో తెచ్చి, న్యాయమూర్తి మంత్రపూర్వకంగా పెట్టటమూ ఏడు మండలాలు దాటి వెళ్ళేలా వేసినట్లయితే చేతులు పొక్కకుండా ఉంటే నిందితుడు అందరికీ తెలిసేలా అనిందితుడు – నిర్దోషి అవుతాడు.

ఆలోచిస్తే బొడ్డుబంటినీళ్ళలో ఒకమాను చేతికి ఊతంగా ఇచ్చి మూడవనీటిశబ్దంలో నిందితుడైనవాడు మునిగి ఉండగా ఒడ్డున ఉన్న వ్యక్తి నడినెత్తి మధ్యభాగంలో అమ్ము వేసినంత దూరం అతివేగంతో వెళ్తే అక్కడనుండి వేరొకడు అతివేగంతో వెళ్ళి ఒడ్డున ముందు పాతిన తోరణ స్తంభం తాకడానికి ముందే మునిగినవాడి ఫాలమూ కింది అంగాలు కనబడకుండా ఉంటే నిందితుడు గెలిచినట్లు. అలాకాక ఫాలమూ కింది అంగాలు కనిపిస్తే వాడికి ఒటమి తప్పదు అని ధర్మతత్త్వవిదులు అంటారు. అప్పుడు వాడు ఓడినట్లు లెక్క.

క్రొత్తకుండలో క్రూరసర్పాన్ని ఉంచి పూజించి అందులో నిమ్మపండు వేసి క్షేమంగా తీసినట్లయితే శుద్ధుడు – నిర్దోషి అవుతాడు.

## పంపకాలు – వారసత్వం

తండ్రి తాను సంపాదించిన సొమ్మునయితే తనకు కావలసినట్లుగా కొడుకులకు పంచుకోవచ్చు, తన తండ్రినుంచి సంక్రమించిన ఆస్తి నయితే గనక ఆ తండ్రి – కొడుకులందరికీ సమపాళ్ళలో పంచాలి.

నా అంతట నేనే బతుకుతాను. ఇంట్లోంచి వెళ్ళిపోతాను అనే కొడుకుని ఉట్టి చేతులతో పంపకుండా – అతడికి కనీసం వెయ్యిలో పది వంతయినా దాయంగా ఇచ్చి మరీ పంపడం తండ్రికి న్యాయం.

ఉమ్మడిగా ఉన్న వస్తువులుగానీ ధనంగానీ పెద్ద అన్నయ్యకి ఇరవయ్యో వంతు ఇచ్చి మిగిలిన ఆస్తిని అతనితో సహా సోదరులు అందరూ కలిసి సమానంగా పంచుకోవడం సర్వత్రా తగినది. మంచిది. ఉమ్మడి ఆస్తిలో అగ్రజుడికి ఇరవయ్యవవంతు అదనంగా దక్కుతుంది.

కూతుళ్లకు పెళ్ళి చేస్తే – వాళ్ళు ఇల్లు చెడి – దురదృష్టం కొద్దీ పేదరాళ్ళయితే ఆ కూతుళ్లకు తండ్రి ధనం సంగతి అటుంచి కనీసం తల్లి ధనమైనా రావడం ఉచితం. ఆ కూతుళ్లందరూ ఒకేలాంటి వాళ్ళు – అంటే, ఇల్లుచెడ్డ పేదరాళ్లే అయినట్లయితే వాళ్ళు ఒకే తీరుగా వాటాలు వేసుకొని తల్లి ఆస్తిని పంచుకోవడం ఎక్కడైనా ధర్మమే.

తండ్రి తనను చదివించనప్పుడుగానీ – తండ్రిధనాన్ని ఒక్కపైసా కూడా తిని చదువుకోకుండా తనంత తానుగా సంపాదించుకొని ఆ డబ్బుతోనే తిని, చదువుకొంటే అలా చదువుకొన్నవారు తర్వాత ధనం సంపాదిస్తే అలా పొందిన ధనంలో దాయాదులకు భాగం ఉండదు.

తండ్రి సంపాదించిన ధనం ఇతరులచేత అపహరింపబడి అది చెడిపోయి ఉండి ఉంటే ఆ తరువాత ఆ సొత్తు ఎవడిచేతనైతే మళ్ళీ సాధించబడి సుస్థితం అవుతుందో అలా సాధించిన ధనం సాధించినవాడిదే. తన సోదరులకు అతడు ఇస్తేనే కలుగుతుంది. లేకపోతే లేదు. దానిపై మిగిలిన సోదరులకు ఏ హక్కులూ ఉండవని.

నాలుగు వర్ణాలలో – అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతి స్త్రీలతో బ్రాహ్మణుడికి పుట్టిన కుమారులు వరుసగా ఆస్తిలో నాలుగూ మూడూ రెండూ ఒకటీ అయిన భాగాలను పంచుకొని స్వీకరించాలి.

**చతుస్త్రిద్వ్యేక భాగాస్స్యు ర్వర్ణశో బ్రాహ్మణాత్మజాః,**
**క్షత్రజాస్త్రి ద్వ్యేక భాగా విడ్జాస్తు ద్వ్యేక భాగినః.** (యా.వ్య.123, స.121)

బ్రాహ్మణుడిద్వారా బ్రాహ్మణస్త్రీకి పుట్టినవాడు నాలుగూ, క్షత్రియస్త్రీకి పుట్టినవాడు మూడూ, వైశ్యస్త్రీకి పుట్టినవాడు రెండు, శూద్రస్త్రీకి పుట్టినవాడు ఒక భాగం చొప్పున ఆస్తిని పంచుకోవాలి అని యాజ్ఞవల్క్య స్మతిలోని శ్లోకం చెబుతున్నది.

తండ్రీ కొడుకులూ కలిసి ఉమ్మడికుటుంబంలో ఉన్నప్పుడు తమలో ఎవరెవరు ఏఏ వస్తువులు వాడుకున్నారో – అంటే కట్టుకున్న చీరలు, పెట్టుకున్న ఆభరణాలూ, అధిరోహించిన వాహనాలూ, ఇంటిలో ఎల్లప్పుడూ విడిచిపెట్టకుండా ఉండే ధాన్యాలూ, బానిసలూ అలాగే ఇంట బందీలై సేవచేసే స్త్రీలు, మంచమూ, పీఠమూ, కంచమూ, చాప, చెప్పులు, గొడుగు, చేట, తెడ్డు ఇంకా నిత్యమూ ఇంటిలో ఉండే సంపదలూ వగైరాలన్నీ విడిపోయేనాటికి ఎవరెవరు ఏవి వాడుకుంటూ ఉంటే అవి వారివే. వాటిని అలాగే ఇంతకు ముందులాగే ఉంచి ఇవి కాక తక్కిన ధనాన్ని తమలోతాము వేరువేరుగా ఒకేలా = సమానంగా పంచుకోవటం మంచిది.

తండ్రి బతికి ఉన్నప్పుడు అతడు కట్టుకున్న బట్టలు వాడుకున్న వాహనాలు, మంచాలు, ఆభరణాలు మొదలైనవాటిని – ఆ తండ్రి మరణించిన తర్వాత ఆ తండ్రికి చేసే శ్రాద్ధకర్మలలో బ్రాహ్మణార్థంగా కూర్చొని భోజనం చేసినవాడు – భోక్త తీసుకోవడం తగినది. అతడికి దానం చేసెయ్యాలి. అంతేకానీ వాటిని కొడుకులు పుచ్చుకోవడం తగదు.

మనుమలు తాతగారి ధనాన్ని – ఆస్తిని పంచుకోవడానికి అర్హతకలవారైతే అలా పంచుకొనేటప్పుడు ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. అదేమిటంటే –

తమకు తండ్రులు వేరువేరుగా ఉంటే – ఆయా తండ్రులకు ఏఏ వాటాలు వస్తాయో ఆయా వాటాలను స్వీకరించడమే ఇలలో మంచి ధర్మం.

తండ్రినుంచి కొడుకులు ఆస్తిని పంచుకొని వేరుపడిన తర్వాత ఆ తండ్రికి మళ్ళీ ఇంకొక కొడుకు పుట్టినట్లయితే, ముందు ఆస్తిని పంచుకున్నప్పుడు తండ్రికి వచ్చిన వాటా ఏదైతే ఉందో అది తర్వాత పుట్టిన కొడుకుకే చెందుతుంది. అది ఆ కొడుకు ధనం. అంతకు ముందు తండ్రిని విడిచివెళ్ళిన కొడుకులకు ఈ తండ్రి వాటా ఎక్కడైనాసరే ఎట్టి పరిస్థితుల్లోనూ రాదు. ఆ వాటాలో మళ్ళీ వాటాలు కోరకూడదని.

స్త్రీ భర్త ద్వారా పొందిన ధనాన్ని తాను స్వయంగా తగినవారికి ఇవ్వవచ్చు. కానీ భూమిని మాత్రం తాను అనుభవించాలి. అలా అనుభవించక ఇతరులకు తన చనువు కొద్దీ ఇవ్వడం తగదంటారు పండితులు.

స్త్రీధనం పేరుతో చెలామణిలో ఉన్న ధనమంతా ఆమె కూతురికే సంక్రమిస్తుంది. ఆ తర్వాత కూతురికూతురికి – అంటే మనుమరాలికి చెందుతుంది. కూతురికి కూతురు పుట్టకపోతే – ఆ కూతురికి పుట్టిన కొడుకుకి సంక్రమిస్తుందే కానీ ఈ స్త్రీధనానికి వారసులయ్యే వాటాదారులు ఇతరులు ఎక్కడ వెదికినా లేరు. అంటే స్త్రీ ధనం అన్యాక్రాంతం కారాదని.

పుత్రుడు లేనివాడి సొమ్ము క్రమంగా భార్య, భార్యలేకపోతే అతడి తండ్రి, తర్వాత అతడి కూతురి సంతతిగా మనుమళ్ళుగానీ మనుమరాళ్ళుగానీ ఆ తర్వాత సోదరులూ ఇంకా వీళ్ళెవరూ లేకపోతే ఇంట్లో ఉండేవాళ్లు ఆ తరువాత తన గురువూ, తనను గురువుగా భావించిన శిష్యుడూ క్రమంగా స్వీకరించవచ్చు. అతడి ఆస్తికి వారసులని. వీళ్ళకు తప్ప ఇంకొకడికి ఇవ్వవలసిన పని లేదు. వీళ్ళెవరూ లేకపోతే ఎవరూలేని వాడి సొమ్మును – ఏలినవాడు కాబట్టి చక్కగా రాజుగారే స్వాధీనపరుచుకొంటారు.

పెద్ద తుఫాను వచ్చినప్పుడో, రోగం వచ్చినప్పుడో, ఆపద వచ్చిన సమయంలోనో, ఏదో పెద్ద రాచకార్యంకోసమో అయితే భర్త ఇల్లాలి ధనాన్ని తీసుకోవచ్చు. అంతకు మించి మిగిలిన ఇతర సందర్భాలలో స్త్రీ ధనం తీసుకోకూడదు.

గుడ్డివాడు, కుంటివాడు, మూగవాడు, నపుంసకుడు, నిజంగా తమతమ వాటాలను స్వీకరించలేరు. వాళ్ళు వైకల్యం వల్ల ధనాన్ని కాపాడుకోలేరు కాబట్టి. వారి వాటాను స్వీకరించినవాళ్ళే ఆ వికలాంగుల బాధ్యతనుకూడా స్వీకరించాలి.

కొడుకులు లేనివాడు చనిపోతే అతడి దాయాదులు అతడి ధనాన్ని తీసుకొని అతడికి ఉన్న అప్పుల్ని తీర్చివేయాలి. ధనంగానీ పుత్రుడుగానీ లేనివాడు చనిపోతే – చనిపోయిన తర్వాత అతడి భార్య మొదలైనవారికి అతడి అప్పుల్ని తీర్చవలసిన పని లేదు.

వేరుపడికూడా వేరుపడలేదని తరువాత ఒకడు చెప్పినట్లయితే అప్పుడు విడివడ్డనాటి విడిపోయినప్పుడు రాసుకున్న పత్రాలూ విడిపోవడం తెలిసిన జ్ఞాతిసమూహాలూ దగ్గరచుట్టాలూ మిత్రులూ ఒప్పందంతో ఇచ్చిన పుచ్చుకొన్న అప్పులూ విడిచిన ఇల్లూ ఊరుకి తెలిసేలా వాడికి వేరుగా మళ్ళీ తెలపడం తగినది.

గ్రామంగానీ పొలిమేరగానీ కళ్ళంగానీ, చేనుగానీ, ఇంటిస్థలంగానీ కాలాంతరంలో కొంతకాలానికి హద్దులు చెరిగిపోయి కలిసిపోతే అప్పుడు వృద్ధుల్నీ, గొల్లల్నీ, వేటగాళ్ళను సమీపంలోని చేలలో ఎప్పుడూ సేద్యం చేసేవారినీ పంపి సీమకు ముందు పాతినబొగ్గులనూ ఇటుకరాళ్ళనూ ఎముకలనూ కట్టినకట్టలనూ పెట్టినచెట్లనూ తవ్విన బావులనూ దిగుడు బావులనూ బట్టీ సీమను నిర్ణయించి తెలపాలి. అవేమీ లేకపోతే క్రమంగా చక్కగా చుట్టుపక్కల ఊళ్ళలో ఉన్న ప్రజలను సాక్షుల్నిచేసి ప్రతిపక్షుడిని పట్టిన నరుడు సీమతెలుసుకొనేలా ప్రయత్నం సాగించాలి.

అంతకుముందు లేని సరిహద్దులకు సంబంధించి అవి కలిసే చోట ఆ సంధిస్థలంకోసం వివాదమై ఉంటే అలా ఉన్నచోట ఆ తగాదాలో ఉన్న పొలాన్ని తెలుసుకొని ఊరిధనంతో పెంపారగా రాజు పంచిపెట్టాలి.

ధర్మకార్యార్థంగా ఒకడు ఇంకొకడి పొలంలో చెరువుగానీ, బావిగానీ నుయ్యిగానీ తవ్వించాలనుకుంటే దానికి ముందుగా ఆ పొలం యజమానిని అడిగి అతడు ఒప్పుకుంటేనే ఆ పని చెయ్యాలి. ఆ పని చేయడం వల్ల చేనుకి హాని కలుగుతున్నట్లయితే దాని యజమానుడు ఆ పని ఆపించేయవచ్చు.

ఒకడు చెఱువు తవ్విస్తే దానివల్ల విశేషలాభం లేకపోతే వేరే ఇంకొకడు దానిని విస్తరించేలా తననేర్పుతో కట్టాలనుకొంటే, ఆ చెఱువును ముందు నిర్మించినవాడికి

చెప్పి ఒప్పందం కుదుర్చుకొని నిర్మించడం ఒప్పు. అలాకాక తొందరపడి కడితే ఆ ఫలమంతా ముందు చెరువు తవ్వించిన వాడి పాలవుతుంది.

పొలం యజమాని రైతుకు పొలాన్ని కౌలుకు ఇస్తే - దున్నడానికి - దున్నుకోవడానికి అంగీకరించిన రైతు – కృషికుడు తాను దున్నకుండా పొలాన్ని అలాగే ఉంచితే ఆ యజమాని ఆ పొలాన్ని వేరొకడితో దున్నించుకోవచ్చు. అయితే మొదట కౌలుకు పుచ్చుకున్న రైతు వేరేవాడిని రానివ్వకుండా – పొలాన్ని తాను దున్నక ఇతరుడిని దున్ననివ్వకుండా ఉంటే తద్వారా పొలం దున్నడం ఆగినట్లయితే – ఫలసాయంలో భాగంగా ఇవ్వవలసిన కౌలునూ ఆ పొలానికి సంబంధించిన శిస్తునూ అతడినుంచే – అడ్డుకున్నవాడినుంచే వసూలు చేయాలి.

ధర్మశాస్త్ర గ్రంథాలు ఇలా వివరంగా చెప్తున్నా న్యాయకోవిదులైన పెద్దలు పాటించే స్థానిక సంప్రదాయాలను గుర్తించి ధర్మమార్గంలో అందరూ నడుచుకోవడం ఉత్తమం.

✦ ✦ ✦

# ఆరోగ్య నియమాలు

## దంతధావన పద్ధతి

- ప్రాతఃకాలంలోనే నిద్రనుండి మేల్కోవాలి.
- దంతధావన పద్ధతి తెలుసుకొని శ్రేష్ఠమైన ఒక పుల్లను తీసుకొని పండ్లు తోముకోవాలి.
- పొద్దెక్కేదాకా నిద్రపోవడం, నిద్రలేచినా వెంటనే పండ్లుతోముకోకుండా ఉండటం – ఇవి పాపకారకాలు.
- నిశ్శబ్దంగా ఎవరితోనూ మాట్లాడకుండా దంతధావనంచెయ్యాలి.
- దంతధావనానికి పుణ్యకాష్ఠం ఉపయోగించాలి. చంద్ర, వటం, కానుగ, జిల్లేడు, వేప, మద్ది జువ్వి దంతధావనానికి ఉపయోగపడే వృక్షజాతులు.
- ఒగరుగా, చేదుగా, కారంకారంగా ఉన్న ఆ పుల్లలను నీళ్ళలో తడిపి దంతాలకేసి బాగా తోమి తోమి పండ్లు శుభ్రపరుచుకోవాలి.
- మద్ది చెట్టుపుల్లవల్ల ఆయురారోగ్యాలు.
- మామిడిపుల్ల వల్ల అపారమైన ఐశ్వర్యం .
- మాదీఫలం పీడలన్నింటినీ నాశనం చేస్తే – కానుగచెట్టు యుద్ధంలో విజయా న్నందిస్తుంది.
- మారేడు వల్ల ధనలాభం, ఉత్తరేణి వల్ల ఉత్తమసంతానం.
- చంద్రచెట్టువల్ల ఆహారం రుచించకపోవడం, మందబుద్ధి అనే రుగ్మతలు నశించిపోతాయి.
- జువ్విచెట్టు వల్ల సాటిలేని వాక్ సిద్ధి .
- జాజి, దాడిమ, దరిసం, గొడిసె, మొదల, అంకోలం మొదలైన చెట్లవల్ల మోక్ష సంపద.
- సింధువారం వాడితే చెడ్డకలలు దరిచేరవు.
- దంతధావనం వల్ల కఫమూ, పైత్యమూ హరించుకుపోతాయి. మనసు ప్రసన్నంగా ఉంటుంది. కర్ణపుటాలనూ, నాడీమండలాన్ని కూడా ఇది శుద్ధిచేస్తుంది. నేత్రాలకూ మేలుచేస్తుంది.

- నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, దంతధావనం చేసి, స్నానం చేసి, సంధ్యావందనాది కృత్యాలను నిర్వర్తించి, నిత్యాగ్నిహోత్రం చేసి భక్తితో నిష్ఠగా దేవతారాధన చేయాలి. ఆ తరువాతే ఇంటిపనులు.

## స్నాన పద్ధతి

- తలంటు స్నానం – మనిషి శరీరానికి సుఖం కలిగిస్తుంది. మాలిన్యాలు దురదలూ అనారోగ్యాలూ ఇత్యాది దుర్గుణాలు ఏవీ దరిజేరనివ్వని మంచి మందు. శరీరానికి కాంతి. పోషణ.
- ఈ అభ్యంగ స్నానానికి వేడినీళ్లే మంచివి.
- పుణ్యప్రదాలైన నదీతీర్థాలలోని నిర్మలమైన నీళ్ళలో గానీ వేడినీళ్లతో గానీ ప్రయత్న పూర్వకంగా స్నానం చెయ్యాలి.
- నవరంధ్రాలద్వారా స్రవించే అసహ్యకరమైన మాలిన్యాలు ప్రాతఃకాలస్నానంతో తొలగిపోతాయి.
- ప్రాతఃస్నానం చాలా తృప్తికరం, శుచిప్రదం. బలవర్ధకం. దుస్స్వప్నాల దుష్ఫలితాలు నశిస్తాయి.
- తేజస్సూ రూపమూ కాంతీ పుణ్యమూ ఆయుష్షు అన్నీ వృద్ధి చెందుతాయి.
- ప్రాతఃస్నానం చేసిన మీదట – సంధ్యావందనం. సూర్యారాధన, అగ్నిదేవారాధన చేసి ప్రాతఃకాలంలో చెయ్యాల్సిన హోమాలు విధిగా చెయ్యాలి.
- నిజకులాచారాలను ఆచరించిన పిమ్మట తూర్పుదిక్కు వైపు తిరిగి కేశపాశాన్ని ముడుచుకోవాలి.

## పుష్పధారణ పద్ధతి

- మంచి సువాసనగల పువ్వులు తలలో ధరిస్తే దానివల్ల తలకు చుండ్రు పట్టదు.
- చెమట వాసన ఉంటే సత్వరమే అదీ పోతుంది.
- పుష్పధారణ వల్ల బుద్ధి వికసిస్తుంది. కళ్ళకు ఎంతో మంచింది.
- మేలుజాతి జవ్వాదిని పూసిన గేదగిపూలు సుఖకారకాలు.
- పొగడ, కలిగొట్టు, సంపెంగ, తామర పువ్వులకు కస్తూరిని కలిపి ధరిస్తే మంచిది.
- తెలిసీ తెలియకుండా పడనివాటిని కలిపితే మంచి కలుగకపోగా కీడు.
- గోరింటపువ్వుకు మరువాన్ని చేర్చి ధరించాలి. సుగంధం ఇబ్బడి అవుతుంది.

- విరజాజి పువ్వులనూ, చెంగలువలనూ కర్పూరంతో జతచేసి ధరించాలి.
- మొల్ల, జాజి, గన్నేరు పువ్వులూ, తెల్లందనం ఉట్టిపడే కురువేరుపువ్వులూ వాత పిత్తశ్లేష్మాది త్రిదోషాలనూ హరించివేస్తాయి. చలవచేస్తాయి. సహజమైన గొజ్జగి నీరు కొంత పైపైని జల్లి వేసవిరాత్రులలో ధరిస్తే మంచిది.
- పువ్వుల స్వభావాలను బట్టీ ఆయా కాలాలలో వాటిని ధరించాలి.
- గురువిందపూలు, గన్నేరు పూలు, అప్పుడే వికసించిన విరజాజులూ, కలిగొట్టు పువ్వులూ అంతగా వేడిచెయ్యవు అలాగే చలవా చెయ్యవు. కాబట్టి వాటిని వర్షకాలంలో ధరిస్తే మంచిది.
- పొన్నలు, చేమంతులు, సురపొన్నలు, సంపెంగలు, మొగలిపువ్వులు, పొగడపువ్వులు.  ఇవన్నీ వేడిచేసే స్వభావం కలిగి ఉంటాయి. కాబట్టి వీటిని శీతకాలంలో ధరించాలి.
- జాజిపూల సువాసన రెండు ఘటికలదాకా ఉంటుంది.  అదే విరజాజుల, మొల్లల వాసన  నాలుగు ఘటికలు. (ఘటిక = 24 నిమిషాలు)
- పొన్నల సువాసన ఒక జాము కాలం దాకా ఉంటే  మల్లె, కరవీర, గురువింద, పొగడ పువ్వుల సువాసన రెండు జాముల దాకా ఉంటుంది.
- సంపెంగల సువాసన ఒక పగలూ రాత్రీ .  చేమంతి వాసన  రెండు రోజులు.
- నాలుగురోజుల దాకా చెంగల్వ పువ్వు సువాసన నిలిచి ఉంటుంది.
- గేదగిపూవాసన అయిదురాత్రుల వరకూ ఉంటే – కలుగొట్టు, సురపొన్న పువ్వుల సువాసన ఎప్పటికీ ఉంటుంది.
- వెంట్రుకలు బిరుసెక్కిపోయి బాగా గరగరలాడుతూ ఉంటే నవమాలికపూలు, మొల్లలు, కొత్తగా విరిసిన జాజిపూలు ముడుచుకోవటం మేలు.
- చెంగలువ పువ్వులు ఎటువంటి కేశాలకైనా మంచివే.
- మల్లెపువ్వులు వేడి.  దీనివల్ల కళ్ళకు విపరీతమైన బాధ.  బుద్ధి మందగిస్తుంది.
- గోరింటపువ్వు, మల్లెపువ్వుల కంటే కీడు చేసే పువ్వులు వేరే లేనే లేవు.
- మొగలిపువ్వు, చెంగలువ పువ్వు చాలా శ్రేష్ఠమైనవి.
- తల మాసినప్పుడు మల్లెపూలు, జుట్టుకు నూనె పెట్టుకొన్నప్పుడు  కేతకపుష్పాలను ధరించాలి.

## లేపన పద్ధతి

- చందనాన్ని శీతాకాలంలో అగరును, కుంకుమ పువ్వునూ కలిపి ఒంటికి పూసుకొని, నలుగు పెట్టుకున్నట్లుగా అలందుకోవాలి.
- వేసంగిలో గొజ్జగినీటిలో కర్పూరాన్ని బాగా కలిపి దానిలో మళ్ళీ చందనాన్ని కలిపి ఒంటికి పట్టించాలి. వర్షాకాలంలో కస్తూరి, కుంకుమపువ్వుల మేళనంతో చందనాన్ని పులుముకోవటం మంచిది.
- స్నానం చేసెయ్యగానే వెంటనే తడి లేకుండా ఒత్తుకోవాలి తుడుచుకోవాలి.

## వస్త్రధారణ పద్ధతి

- శీతాకాలంలో పట్టుచీరలు, తామ్రవర్ణంలో ఉన్న వస్త్రాలు, ఎరుపురంగు వస్త్రాలు ధరించాలి. ఇవి శరీరంలోని వాతాన్నీ, శ్లేష్మాన్నీ హరించివేస్తాయి
- వేసవిలో లేత ఎఱుపు చాయకల చెంగావి వస్త్రాలు ,వర్షాకాలంలో తెల్లని వస్త్రాలను ధరించాలి.
- మలినమై పోయినవీ, స్త్రీలు ధరించినవీ, ఇతరులు ధరించినవీ, ఎలుకలు కొరికినవీ – చిరిగినవీ, కాలిపోయినవీ అయిన వస్త్రాలు ధరించకూడదు.
- మాసినవస్త్రాన్ని ధరిస్తే దురద పుడుతుంది. అశుభం కూడా.
- స్త్రీ ధరించిన వస్త్రాన్ని ధరిస్తే – కలిగే భాగ్యమూ, అడ్డులేని శౌర్యమూ తప్పిపోతాయి.
- ఇతరులు ధరించి విడిచిన వస్త్రాన్ని ధరిస్తే – చేసిన పుణ్యం కాస్తా కోల్పోయే పరిస్థితి వస్తుంది.
- ఎలుకలు కొట్టిన వస్త్రాలను ధరిస్తే చూపరులు దడుసుకుంటారు. భయం కలుగుతుంది.
- చిరిగిన వస్త్రాన్ని ధరించకూడదు. అది దరిద్రదేవతకు ఆటపట్టు.
- కొద్దిగా కాలి, కన్నాలు పడిన వస్త్రాన్ని ధరిస్తే ఉన్న మంచి పోవడమే కాదు. ఇంకా ఎక్కువ కీడు జరుగుతుంది. జీవితం యమధర్మరాజుకు వశం అవుతుంది.

## ఆభరణధారణ పద్ధతి

- ఒక్కొక్క రత్నానికి ఒక్కొక్క అధిదేవత. ఆయా దేవతల అనుగ్రహాన్ని పొందడానికి ఆయా వారాలలో ఆయా రత్నఖచిత ఆభరణాల సమూహాన్ని ధరించాలి.
- ఒకవేళ ఏ వారానికి ఆ ఆభరణం ధరించలేకపోతే - అవయవాలను శుద్ధి చేయడానికి కారణభూతాలైనవీ ప్రకాశవంతాలైనవీ అయిన ఆభరణాలను ధరించాలి.
- లక్కతో రాగితో - చేసిన ఆభరణాలు ధరించకూడదు.

## అర్చాపద్ధతి

- దశదానాలు చేసి,అటుపైని భక్తి శ్రద్ధలతో దేవ-పితృ యజ్ఞాలు నిర్వహించాలి. ఇవి చేసిన తరవాతనే భోజనానికి కూర్చోవాలి.
- గోవు, బంగారం,బ్రాహ్మణుడు, అగ్ని, నెయ్యి, నీరు, సూర్యుడు, రాజు అనే మంగళాష్టకాన్ని నియమంతో దర్శించాలి. భక్తితో నమస్కరించాలి. ఏకాగ్రచిత్తంతో అర్చించాలి. ప్రదక్షిణ చేయాలి.

## భోజనపద్ధతి

- అలంకరించిన భోజనశాలలో గృహస్థు తన బంధుమిత్రులతో కలిసి, సహపంక్తి భోజనం చెయ్యాలి.
- కనీసం ఒకరిద్దరితోనైనా కలిసి భుజించేవాడికి ఇష్టఫలాలు సిద్ధిస్తాయి. తుష్టి కలుగుతుంది. సంపద - కీర్తి అభివృద్ధి చెందుతాయి. గొప్పవాడు అవుతాడు.
- ముందుగా తియ్యటి శాకపాకాలు, మధ్యలో వగరూ, చేదూ పదార్థాలు, చివరికి పులుసులూ చారులూ లాంటివి ఆస్వాదించడం ఉత్తమం.
- తీపి అతిగా తింటే ఆకలి చచ్చిపోతుంది. ఎక్కువగా ఉప్పు తింటే చూపు మందగిస్తుంది. కటిక చేదూ ఎక్కువ పులుపూ ముసలితనాన్ని శీఘ్రంగా తెచ్చిపెడతాయి.
- దప్పిక వేస్తే నీళ్ళు తాగాలి గానీ దానికి మారుగా ఆహారం తినకూడదు. ఆకలి వేస్తే ఆహారం తినాలి గానీ బదులుగా నీరు త్రాగ కూడదు.

- అన్నం తినే ముందు నీళ్ళు తాగడం అధమం. అన్నం తింటూ మధ్యే మధ్యే పానీయం అన్నట్టు మధ్యలో మంచినీళ్ళు తాగడం మధ్యమం. భోజనం ముగించిన తరవాత నీళ్ళు తాగడం ఉత్తమం.
- ముప్పొద్దులా చెక్కపూటుగా అన్నం తినకూడదు.
- కడుపుకి సగమే అన్నం తినాలి. ఒక భాగం నీటితో నింపాలి. మరొక భాగం ఖాళీగా వదిలిపెట్టాలి.
- భోజనం తర్వాత నిద్రపోకూడదు. కొంచెంసేపు కాసింత దూరం మెల్లమెల్లగానైనా నడిస్తే – ఆయుష్షు. కాస్త ఎక్కువ దూరమే నడవగలిగితే మరీ మంచిది.
- అతిగా తినడమూ, అస్సలు తినకపోవడమూ రెండూ మంచివి కావు. కాబట్టి సమంగా భుజించాలి. అదే ఆరోగ్యం.
- కానీ భోజనసమయంలో కోపావేశానికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలి
- భోజనానంతరం చేతులు కడుక్కొని, ముమ్మారు ఆచమించాలి – పుక్కిలించాలి. ఆ తడిచేతుల్ని ఒకదానితో ఒకటి గట్టిగా రుద్దాలి. అలా మధించిన నీటిని కన్నులకు పులుముకోవాలి.
- ఎక్కువగా ఒకేసారి నీళ్ళు తాగకూడదు. కొంచెం కొంచెంగా పలు పర్యాయాలు తాగాలి.

## తాంబూల పద్ధతి

- తాంబూలంలో ఉపయోగించే పోక ముదిరినదై, నున్నగా ఉండాలి. ఒగరు ఏమాత్రం ఉండకూడదు. బాగా తీపిగా ఉండాలి.
- తమలపాకు కారంగా ఉండాలి. పరిమళిస్తూ దళసరిగా ఉండాలి. వేసుకోగానే పండాలి.
- బట్టీలో బాగా కాల్చిన సున్నపురాళ్ళను మెత్తగా నూరిన చూర్ణాన్ని మాత్రమే ఉపయోగించాలి.
- తాంబూలం భోజనానికి ముందు నాలుగు సార్లు, భోజనానంతరం రెండు సార్లు వేసుకోవాలి.

- ప్రాతఃకాలంలో ఒక పోకకు మూడు ఆకులు చొప్పున కూర్చిన తాంబూలం, మధ్యాహ్న - రాత్రి సమయాలలో నాలుగు లేదా ఐదు లేదా కోరుకున్నన్ని ఆకులతో వేసుకోవచ్చు.
- ప్రాతఃకాల తాంబూలంలో కాచు వాడటం ఆరోగ్యానికి మంచిది.
- తమలపాకుకు శుద్ధి చేయాలి. తొడిమెనూ, తోకనూ తుంపి, నడిమి ఈనె తొలగించి, తడి పోయేలాగా పొడిగుడ్డతో ఒత్తాలి. ఆపై దాన్ని సున్నితంగా మడిచి-చిలకలు చుట్టి వేసుకోవాలి.
- పొద్దుటి తాంబూలంలో పోకలూ, మధ్యాహ్నతాంబూలంలో సున్నమూ రాత్రివేసే తాంబూలంలో ఆకులూ - ఎక్కువ ఉండాలి.
- తాంబూలం వేసుకున్నాక వెంటనే నోటిలో ఊరే ప్రథమ రసాన్నీ రెండవ రసాన్నీ మింగకుండా ఉమ్మివేయాలి.
- తమలపాకు వల్ల సుఖవిరేచనం అవుతుంది. శ్లేష్మం, పైత్యం, నోటి దుర్వాసన తొలగిపోతాయి.
- పోకల వల్ల పైత్యం కలుగదు. ఆకలి వేస్తుంది. వేగంగా దప్పిక తీరిపోతుంది.
- తాంబూలం నోటిలోనూ కడుపులోనూ కలిగే క్రిమిదోషాలను పోగొట్టి, జఠరాగ్నికి దోషం తొలగించి దీప్తిని కలిగిస్తుంది.
- రాతిసున్నపు పొడి. పైత్యాన్ని, వాతాన్ని పోగొడుతుంది.
- శంఖపు పొడి పైత్యశైత్యాలను హరిస్తుంది.
- చిప్పల సున్నము శ్లేష్మాన్ని హరిస్తుంది.
- గుల్లసున్నం వాతాన్ని పోగొడుతుంది.
- ముత్యాల సున్నంవల్ల తెలివితేటలు పెరుగుతాయి.
- వడిలిపోయిన లేదా నలిగి, చిరిగిపోయిన తమలపాకు ఆయువును హరిస్తుంది.
- తలా తోకా తుంపి, ఈనె తీసేసిన ఆకునే తాంబూలంలో వాడాలి.
- తాంబూలము ముఖవికాసాన్నీ, సౌరభాన్నీ ఇనుమడింపజేస్తుంది. పెరిగిన కొవ్వును హరిస్తుంది.

- పాలు తాగిన వెంటనే తాంబూలం సేవించినట్లయితే కుష్ఠవ్యాధి సోకుతుంది. పాలుతాగి గడియ కాలం గడిచాక తాంబులం సేవించినట్లయితే మధుమేహం సోకుతుంది. ఆపై మరో గడియ గడిచాక తాంబూలం వేసుకుంటే అతిమూత్రరోగం వస్తుంది.
- కర్పూరతాంబూలం ఆరోగ్యానికి ఎంతో మంచిది.
- క్షయ, వెట్టి, పాండురోగం, నేత్రరోగం, రొమ్మునొప్పి, కడుపునొప్పి మొదలైన రోగాలు ఉన్నవారు తాంబూలం సేవించరాదు.

## స్త్రీసంగమవిధి

- పగళ్ళూ సంధ్యాసమయాలూ, పర్వదినాల రాత్రిళ్ళూ విడిచిపెట్టగా మిగిలిన అర్హమైనరాత్రులలో మాత్రమే స్త్రీలతో సమాగమించాలి.
- మన్మథకేళి తర్వాత పురుషుడు స్త్రీలకు దూరంగా పడుకోవాలి.

## వ్యవహార పద్ధతి

- ఆవులింతను నోటిలోనే ఆపి ఆ గాలిని ముక్కుద్వారా బయటకు పంపాలి. తుమ్మును కూడా అలాగే చేయాలి. ఇలా చెయ్యడంవల్ల చరమధాతురక్ష, ఆయుష్షు కూడా.
- సత్యమే శ్రేష్ఠమైన ధర్మం. పాపాత్ముల విషయంలో అసత్యం దోషం కాదు.
- ఓర్పుతో ప్రశాంతంగా, ధైర్యంగా, ఉంటూ పరోపకారగుణంతో స్థిరచిత్తంతో ఉండేవాడి ఇల్లు లక్ష్మీనివాసమే.
- దైవంపైనే భారం వేసి అసలు పనిని ప్రారంభించకపోవడం తప్పు.
- కార్యసాధనకు ప్రయత్నించనివాడినీ, ఆరంభించినా కడదాకా కొనసాగించే సాహసమూ ధైర్యమూ లేనివాడినీ, ఆరంభించిన కార్యాన్ని సాధించేందుకు తగిన ప్రయత్నం చేయనివాడినీ, సోమరిపోతునూ లక్ష్మీదేవి చేరదు.
- తగిన ప్రయత్నమూ శక్తీ కల సాహసి ఉత్తముడు. బలహీన సాధనాలు కలవాడు మధ్యముడు.
- గొప్ప సంపదలు ఉత్సాహవంతులకు తమంత తామే కలుగుతాయి.
- గొప్పవారికే ఆపదలు ఎక్కువ.

- కార్యాన్ని మంచిమాటలతోనే చక్కపెట్టుకోవాలి.
- దీనంగా కాకుండా ప్రియంగా మాట్లాడడం నేర్పు.
- దానం కలిగి ఉండీ ఎక్కువగా సహించకపోవడం చాలా మేలు.
- మంచి వక్త అయి ఉండీ నిష్ఠురంగా మాట్లాడకపోవడం లెస్స.
- సత్తా ఉండి కూడా ఓర్పుగా ఉండడం ఒప్పు.
- అకారణంగా మిత్రత్వమూ శత్రుత్వమూ కలుగదు.
- ఎవ్వరూ ఎవ్వరివారూ కారు. అందరూ సంపదలకు దాసులే.
- పగలు నిద్రపోకూడదు. పరకాంతపై వ్యామోహం కూడదు. పరదూషణ, పరులకు కీడు తలపెట్టాలనే అలోచన, కోపం, కపటం లేకుండా చూసుకోవాలి. ఆహార నియంత్రణ ఉండాలి. అతిగానూ, కఠినంగానూ మాట్లాడకూడదు. అబద్ధం ఆడకూడదు. ఆత్మస్తుతి పనికి రాదు.
- పరుల మేలు కోరే వాడికే ఉత్తరోత్తరాభివృద్ధి.

✦ ✦ ✦

# ఉపసంహారం

ప్రపంచంలో ఏ దేశానికీ ఇంత పటిష్టమైన ధార్మిక వాఙ్మయం లేదు. వేద–పురాణ–ఇతిహాసాలు–స్మృతి గ్రంథాలూ సర్వజనులూ అనుసరించవలసిన ధార్మికాంశాలను నిర్వంద్వంగా, నిర్దుష్టంగా అందిస్తున్నాయి. సామాన్య ధర్మాల పేరుతో అందరికీ ఆచరణయోగ్యమైన ధర్మాలను చెప్తూనే – దేశ, ప్రాంత, వర్గ భేదాల ఆధారంగా విశేషమైన ధర్మాలనూ ధర్మశాస్త్ర గ్రంథాలు చెప్తున్నాయి. ఇవన్నీ ఎప్పటికప్పుడు మారే కాలానికి అనుగుణంగా మానవజీవనం సుఖవంతమూ, శాంతియుతమూ అయ్యేలా రూపుదాల్చినవే. దార్శనికులైన మహర్షులు లోకరీతుల్నీ, సాధ్యాసాధ్యాల్నీ పరిశీలించి, తమ అనుభవం ద్వారా భవిష్యత్కాలాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని మహత్తరమైన సనాతన ధర్మ మార్గాన్ని మనకు చూపించారు. మనం చేయవలసినదల్లా – త్రికరణశుద్ధిగా, భారతీయ ఆర్ష సంప్రదాయంపట్ల అచంచలమైన విశ్వాసాన్ని కలిగి, ధర్మం పట్ల అనురక్తులమై ఆచరించడమే. ఆచారమైనా, ధర్మమైనా ఆచరించినప్పుడే దాన్ని ఫలితాన్ని మానవాళికి అందిస్తుంది. ఆచారశూన్యుడైన వాడు ఎంత గొప్పవాడైనా అతణ్ణి భగవంతుడు కూడా రక్షించలేడు. అన్నింటికంటే అనుష్ఠానం ప్రధానం. అది స్వీయ కల్పితం కాక సనాతమూ, వేదప్రోక్తమూ అయినప్పుడే ఉత్తమోత్తమమై అలరారుతుంది. మొక్కవోని దీక్షతో ఆచరించేవారికి అనేక శ్రేయస్సులను అందిస్తుంది. అందుకే మనమంతా కూడా ఈ విజ్ఞానాన్ని పొంది, సనాతన ధర్మం పట్ల విశ్వాసాన్ని ఉంచి, నిష్ఠగా ఆచరించి, మన జీవనాన్ని ఆనందమయం చేసుకుందాం!

✦ ✦ ✦